# Śrīnāthuni Kavitā Prasthānaṁ - Śamagra Pariśīlana

*A thesis submitted to the University of Hyderabad*
*in partial fulfillment of the requirement for the award of*

DOCTOR OF PHILOSOPHY
IN
TELUGU

By


**VEMULA SHARANYA**
Reg. No. 14HTPH02

Supervisor
**Prof. Pillalamarri Ramulu**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad-500046 (INDIA)**

**February 2024**

# శ్రీనాథుని కవితా ప్రస్థానం – సమగ్ర పరిశీలన

(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


పరిశోధకురాలు

**వేముల శరణ్య**

Reg. No. 14HTPH02

పర్యవేక్షకులు

**ఆచార్య పిల్లలమర్రి రాములు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు, తెలంగాణ – 500 046


ఫిబ్రవరి 2024

**మా అమ్మా- నాన్నలకు**

**అంకితం...**

**University of Hyderabad**
**Hyderabad-500046, India**

---

## DECLARATION

I, Mrs. **Vemula Sharanya**, hereby declare that this thesis entitled "**Śrīnāthuni Kavitā Prasthānaṁ - Śamagra Pariśīlana**" submitted by me under the guidance and supervision of Prof. Pillalamarri Ramulu, Department of Telugu, School of Humanities, University of Hyderabad, is a *bonafide* research work. I also declare that it has not been submitted previously in part or full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/INFLIBNET.

Signature of the Scholar

Name: Vemula Sharanya
Registration No: 14HTPH02

Date: February, 2024
Place: University of Hyderabad

**University of Hyderabad**

## CERTIFICATE

This is to certify that the thesis entitled **"Śrīnāthuni Kavitā Prasthānaṁ - Śamagra Pariśīlana"** submitted by **Mrs. Vemula Sharanya** bearing registration number 14HTPH02 in partial fulfillment of the requirements for award of Doctor of Philosophy in the Department of Telugu, School of Humanities is a bonafide work carried out by her under my supervision and guidance. This thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or Institution for award of any degree or diploma. The candidate has satisfied the UGC Regulations of publications and conference presentations before the submission of this thesis. Details are given below:

A. Publications in journals:

1. Sharanya, Vemula. (2023). "Śrīnāthuni Kavitā Mārgaṁ: Varṇa Vin'yāsa Vakrata". AUCHITHYAM, vol. 4, no. 08 (July), pp. 117–127. (ISSN: 2583-4797: UGC-Care Listed).
2. Sharanya, Vemula. (2024). "Śrīnāthuni Kr̥tulu: Pada Purvārdha Vakrata". AUCHITHYAM, vol. 5, no. 02 (Feb.), pp. 66–76. (ISSN: 2583-4797: UGC-Care Listed).

B. Presentations in conferences/seminars:

1. Presented a paper on "Śrīnāthuni Kavitā Lakṣaṇālu", in National Seminar on Documentation and Dissemination of Linguistic, Literary and Cultural Heritage – The role of Cinema, at SRR Govt. Arts & Science College, Karimnagar, Telangana, 17-18 February 2017.
2. Presented a paper on "Śrīnāthuḍu", in the International Conference on Telugetthi Jaikottu, at Sundarayya Vignana Kendram, Hyderabad, Telangana, 14-16 December 2019.

Further, the student has passed the following courses towards fulfillment of the coursework requirements for Ph.D. degree in Telugu:

| Course Code | Course Title | Credits | Pass/Fail |
|---|---|---|---|
| HT 801 | Research Methodology | 4 | Passed |
| HT 802 | History of Telugu Research | 4 | Passed |
| HT 803 | Studies in Literature | 4 | Passed |
| HT 804 | Studies in Specialized Area | 4 | Passed |

Prof. Pillalamarri Ramulu
**Research Supervisor**

Prof. Darla Venkateswara Rao
**Head, Dept. of Telugu**

Prof. V. Krishna
**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

చిన్నప్పటి నుండి మమ్మల్ని కంటికి పాపలా చూసుకుంటూ ప్రేమానురాగాలను పంచుతూ, మా కూతురు ఉన్నత చదువులు చదవాలని ఆశించే మా అమ్మా నాన్నలు డా॥ వేముల శ్రీనివాస్, సాయిసుధలకు, ముఖ్యంగా తెలుగు సాహిత్యం చదివించాలనే కోరికతో నన్ను ఈ స్థానంలో నిలబెట్టిన మా నాన్న ఆశయానికి,

నిత్యం నా శ్రేయస్సునే కోరుతూ, నాలోని ప్రతిభను వెలికి తీయాలని ప్రయత్నిస్తూ, పి.జి. తెలుగు చదువుతున్నప్పటి నుండి పిహెచ్.డి. వరకు నాకు తగు సలహాలు, సూచనలిస్తూ, గురువు అనే పదానికి నిదర్శనమైనట్టి నా పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి,

ఎప్పుడు చిరునవ్వుతో పలకరించి, నా పరిశోధనకు ప్రోత్సాహం కల్పించిన పూర్వ పర్యవేక్షకులు ఆచార్య రేమిళ్ళ వెంకటరామకృష్ణశాస్త్రి గారికి,

పరిశోధన పూర్తి చేయడానికి సహకరించిన తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, మరియు ప్రోత్సహించిన గురువులు ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మీ గారికి, డా॥ భుజంగ రెడ్డి గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, డా॥ డి. విజయ కుమారి గారికి, ప్రస్తుతం తెలుగు శాఖలో ఉన్నటువంటి ఆచార్య గోనా నాయక్ గారికి, డా॥ బి. తిరుపతి గారికి,

నా పరిశోధన ముందు కెళ్ళడానికి సహకరించిన JRF ఫెలోషిప్ ఇచ్చిన U.G.C. వారికి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడ్డ తెలుగు శాఖకు, సిబ్బందికీ, లైబ్రరీ స్టాఫ్‌కి,

పుస్తక సేకరణ సమయంలో సహకరించిన డా॥ ప్రేమ్ కుమార్ అన్నయ్యకి, పరిశోధనలో భాగమయ్యి సమయానికి తోడ్పడ్డ జూనియర్ మిత్రులు శ్రీలేఖకి, పూజకి, మారుతిలకు నన్ను ఎప్పుడు ప్రోత్సహించే ఆత్మీయ మిత్రురాలు సుమలత అక్కకు, తక్కిన మిత్రులందరికి,

నేను బాగా చదువుకోవాలని ఆశించే నానమ్మ, తాతయ్యలు వేముల సుశీల, చంద్రయ్య గార్లకు, బావ మారుతి రాజాకి, అత్తమ్మ, మామయ్యలు గుంటుక లక్ష్మి, రాయమల్లు గార్లకు,

నేను ప్రాణంగా బ్రతికే తోబుట్టువు, నా గుండె చప్పుడు, నిత్యం నా అభివృద్ధిని కాక్షించే నవ్వుల తల్లి, చిట్టి చెల్లెలు హర్షితకు,

నా పిహెచ్.డి. కోసం నా కంటే ఎక్కువగా అహర్నిశలు తపించి, నన్ను ముందుకు నడిపిన నా మేని సగభాగం, వెన్ను బలం, హృదయ సీమను ఏలుతున్న నా 'రాజు' డా॥ రాజు గారికి,

జీవితాంతం నిలిచిపోయే ఆత్మస్థైర్యాన్నిచ్చిన నేల హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయానికి శిరస్సు వంచి…

కృతజ్ఞతలు,

**వేముల శరణ్య**

## సంకేత పదసూచి

| | | |
|---|---|---|
| భీమే | – | భీమేశ్వరపురాణం |
| ప్రథ | – | ప్రథమ |
| ద్వితీ | – | ద్వితీయ |
| ఆశ్వా | – | ఆశ్వాసం |
| తృతీ | – | తృతీయ |
| చతు | – | చతుర్థ |
| పంచ | – | పంచమ |
| సప్త | – | సప్తమ |
| అష్ట | – | అష్టమ |
| నవ | – | నవమ |
| కాశీ | – | కాశీఖండం |
| హర | – | హర |
| చాటు. మణి | – | చాటు పద్య మణి మంజరి |
| ప్రథ. భా | – | ప్రథమ భాగం |
| పీ | – | పీఠిక |
| చాటు. రత్న | – | చాటు పద్య రత్నావళి |
| శివ | – | శివరాత్రి మహాత్మ్యం |
| శ్రీ.ఆ.మ.భా | – | శ్రీమదాంధ్ర మహాభారతం |
| రాధా | – | రాధామాధవం |
| వ.జీ | – | వక్రోక్తి జీవితం |
| కా | – | కారిక |
| శ్లో | – | శ్లోకం |
| నర | – | నరస భూపాలీయం |
| కావ్యా | – | కావ్యాలంకారం |
| కావ్య. ప్రకా | – | కావ్య ప్రకాశం |

| | | |
|---|---|---|
| నర | – | నరసభూపాలీయం |
| కావ్యా | – | కావ్యాలంకారం |
| కావ్య. ప్రకా | – | కావ్య ప్రకాశం |
| ఉన్మే | – | ఉన్మేషం |
| నాట్య | – | నాట్యశాస్త్రం |
| అధ్యా | – | అధ్యాయం |
| భామ. కావ్యా | – | భామహుని కావ్యాలంకారం |
| పరి | – | పరిచ్ఛేదం |
| భోజ. సరస్వతీ | – | భోజుని సరస్వతీ కంఠాభరణం |
| ఉల్లా | – | ఉల్లాసం |
| హర్ష. నైష | – | హర్ష నైషధం |
| కిరా | – | కిరాతార్జునీయం |
| ఆది. పర్వ | – | ఆదిపర్వం |
| విరా. పర్వ | – | విరాటపర్వం |
| సభా. పర్వ | – | సభాపర్వం |

# ప్రవేశిక

## 1) పరిశోధనాంశ పరిచయం (Introduction)

ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక కాల సాహిత్యం వరకు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు కన్పిస్తున్నాయి. ప్రాచీన సాహిత్యంలో పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు మొదలైన ప్రక్రియల సాహిత్యం అంతా పద్యరచనలోనే సాగింది. నన్నయ మొదలగు కవుల పేర్ల మీదుగా యుగవిభజన చేసారు. అదే విధంగా 15వ శతాబ్ది కాలాన్ని శ్రీనాథయుగమన్నారు. అనేక కావ్యాలు వెలువడిన కాలం కనుక కావ్యయుగమని కూడా పిలిచారు. ఆ యుగానికి ప్రాతినిధ్యం వహించిన కవి శ్రీనాథుడు. ఎందుకంటే ఆ కాలంలోని ఇతర కవుల కంటే కూడా ఉత్తమ సాహిత్యాన్ని ఆయన అందించాడు. అటువంటి మహాకవి రచనలపై పరిశోధన చేయవలసిందేనని అనుకున్నాను. మా పర్యవేక్షకులు ఆచార్య పిల్లలమర్రి రాములుగారి సలహాతో ప్రాచీన సాహిత్యం పట్ల అభిమానంతో శ్రీనాథ మహాకవి మీద పరిశోధనకు పూనుకున్నాను. శ్రీనాథుని కవితా గుణాలను పరిశీలించే విధంగా 'శ్రీనాథుని కవితాప్రస్థానం – సమగ్ర పరిశీలన' అనే అంశం మీద ప్రస్తుతం లభ్యమవుతున్న శ్రీనాథుని కావ్యాలను తీసుకొని పరిశోధించాలని నిశ్చయించుకున్నాను. శ్రీనాథుడు అనుసరించిన కవితా మార్గం నిర్ధారణ చేసే విధంగా నా పిహెచ్.డి. పరిశోధనను చేయాలని నిర్ణయించుకున్నాను.

## 2) పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research)

తెలుగు సాహిత్యంలో అజరామరమైన కవి శ్రీనాథుడు. అతనికి సాహిత్య చరిత్రలోనే ఎప్పటికి కదిలించలేని సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్న శాస్త్రపారంగతుడు. అటువంటి కవి రచనల మీద, కవితా మార్గం మీద ఎన్నో చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. విభిన్న కోణాల్లో పరిశోధనలు జరిగాయి. ఒక్కొక్క కావ్యం మీద విడివిడిగా పరిశోధనలు జరిగాయి. కానీ అన్ని కృతుల మీద చాలా తక్కువగా జరిగాయి. శ్రీనాథుని కవితా మార్గం మీద పండిత లోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అతడు రీతిని పోషించాడు అని రసాన్నే ఎక్కువగా వాడిన రసవాది అని, వక్రోక్తిని అతను అనుసరించాడని ఇలా రకరకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయి. అసలు శ్రీనాథుడు అనుసరించిన కవితా మార్గం ఏమిటో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భావించాను. ఈ భిన్నాభిప్రాయాల నుండే ఈ

పరిశోధన ఆవశ్యకత ఏర్పడ్డది. శ్రీనాథుడు భీమఖండంలో ఒకానొక పద్యంలో తానే స్వయంగా కవితా లక్షణాలను చెప్తూ ఇలా అంటాడు.

**మ. హరచూడా హరిణాంక వక్రతయుఁగాలాంతస్ఫురచ్చండికా**
**పరుషోద్గాడ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యముస్**
**సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యముల్దిక్కులం**
**జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీ గేహరంగంబులస్**

**(భీమేశ్వరపురాణం.ప్రథమ.ఆశ్వా. 11 పద్యం)**

వక్రోక్తి, ప్రౌఢోక్తి, సరసోక్తి కావ్య గుణాలుగా ఉంటే కావ్యం చిరకాలం నిలిచి ఉంటుందని తెలిపాడు. కవే స్వయంగా తాను వక్రతను పాటించానని తెలిపాడు కనుక సంస్కృత భాషా పాండిత్యం కలిగిన కవి కాబట్టి కుంతకుని వక్రోక్తిని పాటించాడనే దిశగా కొనసాగాల్సిందిగా భావించాను.

**3) పరిశోధన పరిధి (Scope of Research)**

'శ్రీనాథుని కవితా మార్గం – సమగ్ర పరిశీలన' అనే నా పరిశోధన అంశానికి గాను శ్రీనాథుని రచనలైన ప్రస్తుత లభ్య కావ్యాలైన 1) శృంగార నైషధం, 2) కాశీఖండం, 3) భీమఖండం, 4) హరవిలాసం, 5) శివరాత్రి మహాత్మ్యం మరియు చాటువులను స్వీకరిస్తున్నాను. కావ్యాల వాదోపవాద చర్చల వల్ల శ్రీనాథుని కావ్యాలుగా చెప్పబడుతున్నప్పటికి క్రీడాభిరామం, పల్నాటి వీరచరిత్రను నా పరిశోధనకు స్వీకరించటం లేదు. శ్రీనాథుని కవితా మార్గం కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని అనుసరించిందని చెప్పడానికి, పద్య సమన్వయం, వక్రోక్తి సిద్ధాంత లక్షణాలకు అనుగుణంగా చేయడానికి కూడా ఈ ఐదు కావ్యాలు మరియు చాటువులు అనువైనవిగా నేను భావించాను.

**4) పూర్వ పరిశోధనలు (Review of Literature)**

శ్రీనాథుని రచనల మీద అనేక పరిశోధనలు విభిన్న కోణాల్లో జరిగాయి వాటిలో కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1) హరి, కూచిబొట్ల. 1964. శ్రీనాథుని కవితాదృక్పథం. కె. సుబ్బరామయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. మైసూరు విశ్వవిద్యాలయం.

2) రామ్మూర్తి, కె. 1965. శ్రీనాథుని ఆంధ్రీకరణ విధానం – చారిత్రక విశేషాలు. కె.వి.ఆర్. నరసింహగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఆంధ్ర విశ్వవిద్యాలయం.

3) జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1973. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం. ఎస్.వి. జోగారావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఆంధ్ర విశ్వవిద్యాలయం.

4) అనంతరామశాస్త్రి, ఎన్. 1978. శ్రీనాథుని భాష వర్ణనాత్మక విశ్లేషణ. టి. దోణప్పగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. నాగార్జున విశ్వవిద్యాలయం.

5) శాస్త్రి, కె.డి.యన్. 1986. శ్రీనాథునిపై సంస్కృత కవుల ప్రభావం. బి. రామబ్రహ్మంగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. నాగార్జున విశ్వవిద్యాలయం.

6) విశ్వనాథ, ఎ. 1979. శృంగార నైషధం – శ్రీనాథుని దార్శనిక దృష్టి. బి. రామయ్యగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. మైసూరు విశ్వవిద్యాలయం.

7) కృష్ణయ్య, ఎమ్. 2005. హరవిలాసం – శివరాత్రి మహాత్మ్యం పౌరాణిక మూలకాంశాల పరిశీలన. పిల్లలమర్రి రాములుగారి పర్యవేక్షణలో సమర్పించిన ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

8) శరణ్య, వేములు. 2014. హరవిలాసం – వక్రోక్తి సంప్రదాయ పరిశీలన. రేమిళ్ళ వెంకటరామకృష్ణశాస్త్రి గారి పర్యవేక్షణలో సమర్పించిన ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

**5) గ్రంథ సేకరణ (Books Collection)**

శ్రీనాథుని రచనలను సేకరించే క్రమంలో ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ (హైదరాబాద్ విశ్వవిద్యాలయం)ఆంధ్రసారస్వతపరిషత్ లైబ్రరీ (హైదరాబాద్) సందర్శించాను. ప్రాచ్యలిఖిత భాండాగారం (హైదరాబాద్), ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని పెద్దాపురం లైబ్రరీ (పెద్దాపురం) నుండి సమాచారాన్ని సేకరించాను. పెద్దాపురం లైబ్రరీ నుండి కొన్ని శ్రీనాథుని

పుస్తకాలను తెప్పించుకున్నాను. అలాగే హైదరాబాద్‌లో యువభారతి, సంస్కృత సాహిత్య అకాడమీల నుండి సమాచారాన్ని కొంత సేకరించాను. నా పరిశోధనకు సరిపడ పుస్తకాలు హైదరాబాద్‌లోనే లభించాయి కనుక ఇత ప్రాంతాలకు వెళ్ళలేదు. గుంటూరులో శ్రీనాథ పీఠాన్ని దర్శించాలని అనుకున్నాను. కానీ అది ఇప్పుడు లేదని దానిని నడిపించిన ప్రసాదరాయకులపతి యోగి అయ్యారని తెలిసింది. నా ప్రయత్నాన్ని విరమించుకున్నాను. శ్రీనాథుని మీద పరిశోధనలు చేసిన వారిలో జంధ్యాల జయకృష్ణ బాపూజీ గారిని కలవాలని నిశ్చయించుకున్నాను. కానీ వారు అమెరికాలో ఉన్నారని తెలిసింది. చరవాణి ద్వారా నా సందేహాలను అడిగి తెలుసుకున్నాను. కవి కవితామార్గ సంబంధ విషయాలను వారితో చర్చించాను.

**6) పరిశోధన ఆకరాలు (Research Source)**

నా పరిశోధన పూర్తి చేయడానికి అనేక గ్రంథాలు, వ్యాసాలు ఉపయోగపడ్డాయి. వాటిని నా సిద్ధాంత గ్రంథం చివరన ఉపయుక్త గ్రంథసూచిలో పేర్కొన్నాను. ప్రస్తుతం పరిశోధన ముఖ్య ఆకరాలను, ఇక్కడ పేర్కొంటున్నాను.

1) ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2013. చాటుపద్యమణిమంజరి (మొదటి భాగం మరియు రెండవ భాగం). తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

2) బాలగంగాధరరావు, యార్లగడ్డ. 2015. శ్రీనాథకవి సార్వభౌముని హరవిలాసం (హైమవతీ వ్యాఖ్యాసహితము). విజయవాడ: నిర్మలా పబ్లికేషన్స్.

3) లక్ష్మీనారాయణ, గుండవరపు. 1997. శ్రీనాథ మహాకవి విరచిత భీమేశ్వర పురాణము (దక్షిణ కాశికా వ్యాఖ్యానం). గుంటూరు: ఫాలాక్ష ప్రచురణ.

4) మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. 1995. శ్రీ శివరాత్రి మహాత్మ్యం (చంద్రికా వ్యాఖ్యానసహితం). హైదరాబాద్. తెలుగు విశ్వవిద్యాలయం.

5) వెంకటరాయ శాస్త్రి, వేదము. 2012. శ్రీనాథకృత శృంగార నైషధము (సర్వంకష వ్యాఖ్యతో). హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

6) శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. 2012. శ్రీనాథ విరచిత కాశీఖండం (మణికర్ణికా వ్యాఖ్యాన సహితము). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

7) శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2007. కుంతకుని వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యతో). న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

8) సుందరాచార్యులు, కె.వి. 2012. భారవి కిరాతార్జునీయం (తెలుగు వ్యాఖ్య). హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

9) సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. 2003. శ్రీ కాళిదాస విరచితమ్. కుమార సమ్భవమ్ (తెలుగుసేత). హైదరాబాద్: శ్రీ గోపాల్ పబ్లికేషన్స్.

10) సుబ్బారావు, ఉడాలి. 1984. శ్రీహర్షనైషధం (ఆంధ్ర వ్యాఖ్యతో ఏడు సంపుటాలు). హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ.

**7) పరిశోధన గ్రంథరచనా పద్ధతి (Method of Research)**

ఈ పరిశోధన ఆలంకారిక విమర్శనాత్మక దృష్టితో కొనసాగింది. రిసర్చ్ మెథడాలజీ విషయానికి వస్తే గుణాత్మక పరిశోధన పద్ధతి (Qualitative Research Methodology) విభాగంలో చేరుతుంది. ప్రస్తుతం పరిశోధన గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించి విశ్లేషించాను. అవి ఈ కింది విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| **అధ్యాయం – 1** | : | **శ్రీనాథ కవి పరిచయం – రచనలు.** |
| **అధ్యాయం – 2** | : | **శ్రీనాథుని కవితామార్గం – సైద్ధాంతిక నేపథ్యం.** |
| **అధ్యాయం – 3** | : | **శ్రీనాథుని కవిత్వం – వర్ణవిన్యాస వక్రత.** |
| **అధ్యాయం – 4** | : | **శ్రీనాథుని కవిత్వం – పదవక్రత.** |
| **అధ్యాయం – 5** | : | **శ్రీనాథుని కవిత్వం – వాక్యవక్రత.** |
| **అధ్యాయం – 6** | : | **శ్రీనాథుని కవిత్వం – ప్రకరణ, ప్రబంధవక్రతలు.** |

ఈ పరిశోధనలో ఉపయుక్త గ్రంథాలను కూర్చడంలో APA (American Psychological Association) వారి పద్ధతిని అనుసరించాను.

**మొదటి అధ్యాయం**

శ్రీనాథ కవి పరిచయం – రచనలు అనే మొదటి అధ్యాయంలో శ్రీనాథుని పరిచయం, పాండిత్య ప్రశంస. ఆతని రచనలు వాటిపై గల వాదాలు సంగ్రహంగా వివరించాను.

**రెండవ అధ్యాయం**

శ్రీనాథుని కవితామార్గం – సైద్ధాంతిక నేపథ్యం అనే ఈ అధ్యాయంలో శ్రీనాథుని కవితామార్గ చర్చ, పూర్వకవుల అనుసరణ తెలిపాను. భీమేశ్వర పురాణంలో తన కవితారీతులను తానే చెప్పుకున్న పద్యం ఆధారం చేసుకొని వక్రత, కాఠిన్యం, సరసత్వం వివరించి, పూర్వకవులైన వేములవాడ భీమన, నన్నయ, తిక్కన, ఎర్రన రచనా మార్గాలను అనుసరించాడని అది కూడా వక్రతలో భాగమని తెలియజేసాను. సంస్కృత భాష పట్ల గల పట్టు, అలంకార గ్రంథాలను చదివిన కవి గనుక తానే స్వయంగా చెప్పుకున్న కవితాగుణం అయిన వక్రత కుంతకుడి సిద్ధాంతం అని తెలిపాను. కుంతకుని సిద్ధాంతాన్ని, షడ్విధ వక్రతలను వివరించాను.

**మూడవ అధ్యాయం**

శ్రీనాథుని కవిత్వం – వర్ణవిన్యాస వక్రత అనే అధ్యాయంలో కుంతకుని ప్రథమ వక్రత భేదంగా వర్ణవిన్యాస వక్రతను వివరిస్తూ అందులో అంతర్విభజనలను తెలిపాను. కుంతకుని వక్రోక్తి జీవితం నుండి కారికలను తీసుకొని లక్షణాలను వివరించి, శ్రీనాథుని పద్యాల్లో వాటిని సమన్వయం చేసాను. శ్రీనాథుని రచనల్లో వర్ణవిన్యాస వక్రత ఉందని సహేతుకంగా వివరించాను. ఏకవర్ణ, ద్వివర్ణ, బహువర్ణ పునరావృత్తులకు వేరు వేరుగా ఉదాహరణలను ఇచ్చాను.

**నాల్గవ అధ్యాయం**

శ్రీనాథుని కవిత్వం – పదవక్రత అనే అధ్యాయంలో కుంతకుని పదవక్రతలు రెండని చెప్తూ పద పూర్వార్ధ వక్రత, పదపరార్ధ వక్రతలను తెలియజేసాను. పదపూర్వార్ధ వక్రతలో భాగమైన 1) రూఢివైచిత్ర్య వక్రత, 2) పర్యాయవక్రత, 3) ఉపచారవక్రత, 4) విశేషణ వక్రత, 5) సంవృతి వక్రత, 6) పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత, 7) వృత్తివైచిత్ర్యవక్రత, 8) భావవైచిత్ర్యవక్రత, 9) లింగవైచిత్ర్య వక్రత, 10) క్రియావైచిత్ర్య వక్రతలను సోదాహరణంగా వివరించి శ్రీనాథుని కృతుల్లో ఆ వక్రతలను సమన్వయం చేసాను. అలాగే పదపరార్ధ వక్రతలో భాగమైన 1) కాలవైచిత్ర్య వక్రత, 2) కారక వక్రత, 3) సంఖ్యా వక్రత, 4) పురుష వక్రత, 5) ఉపగ్రహ వక్రత, 6) ప్రత్యయ వక్రతలను క్రమంగా ఉదాహరణలను ఇస్తూ నిరూపించాను.

**ఐదవ అధ్యాయం**

శ్రీనాథుని కవిత్వం – వాక్య వక్రత అనే ఈ అధ్యాయంలో కుంతకుడు చెప్పిన వస్తువక్రత, స్వభావోక్తి చర్చ, కవి కవికౌశలోజ్జీవిత రసం మొదలైన అంశాలను వివరించాను. ఇతర పరిశోధకులు చర్చించని వస్తువక్రతను పరిచయం చేశాను. అలాగే కుంతకుడు ఇరవై అలంకారాలను వాక్య వక్రతలో భాగం చేశాడని తెలిపాను. అందులో రసవత్తు, దీపకం, సహోక్తి అలంకారాలను తిరస్కరించిన విషయాన్ని తెలుపుతూ శ్రీనాథుని పద్యాల్లో వాక్య వక్రతను చూపాను.

**ఆరవ అధ్యాయం**

శ్రీనాథుని కవిత్వం – ప్రకరణ, ప్రబంధ వక్రతలు అనే అధ్యాయంలో ప్రకరణ వక్రతకు కుంతకుడు చెప్పిన తొమ్మిది భేదాల లక్షణాలను వివరించి వాటికి సాధ్యమైనవన్ని ఉదాహరణలు అన్నింటికి ఇచ్చాను. శ్రీనాథుని రచనలకు కారణమైన మూల గ్రంథాల్లోనీ శ్లోకాలను పోలుస్తూ ప్రకరణ భేదాలను హేతుబద్ధంగా నిరూపించాను. అలాగే ప్రబంధ వక్రతలోని ఏడు భేదాలను వివరించి ఆ వక్రతా భేదాలు శ్రీనాథుని రచనల్లో తెలియజేసాను.

**8) అనుబంధాలు (Annexures)**

ఈ పరిశోధనలో రెండు అనుబంధాలను జతపర్చాను. మొదటి అనుబంధంలో పరిశోధన నిమిత్తం జంధ్యాల జయకృష్ణ బాపూజీతో మాట్లాడి, శ్రీనాథుని కవితామార్గం పట్ల వారికున్న అభిప్రాయాలను తెలుసుకోవడానికి ప్రశ్నావళిని పంపాను. వారు దానికి సూటిగా సంక్షిప్త సమాధానాలను, వారి అభిప్రాయాలను వెల్లడి చేసారు. ఆ ప్రశ్నావళి సమాధానాలను ఇందులో పొందుపర్చాను.

రెండవ అనుబంధంలో పరిశోధన కాలంలో వివిధ జాతీయ సదస్సుల్లో సమర్పించిన పత్రాల వివరాలు జత చేసాను. అలాగే నేను రాసిన పరిశోధన పత్రాలు ముద్రితం అయినట్టి వాటిని కూడా చేర్చాను.

**అంతర్జాతీయ, జాతీయ సదస్సు పత్రాల వివరాలు**

1) 'భాషా సాహిత్య, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ పరివ్యాప్తి – సినిమా పాత్ర' అనే అంశంపై తెలుగు శాఖ. ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల (కరీంనగర్) 17, 18 ఫిబ్రవరి 2017న నిర్వహించిన జాతీయ సదస్సులో 'శ్రీనాథుని కవితాలక్షణాలు' పేరిట పత్రం సమర్పించాను.

2) తెలుగెత్తి జైకొట్టు (శతాధిక సాహితీవేత్తల జీవితం సాహిత్యం) అనే అంశంపై తెలంగాణ సాహితీ (హైదరాబాద్) డిసెంబర్ 14, 15, 16, 2019న నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో 'శ్రీనాథుడు' మీద పత్రం సమర్పించాను.

**ప్రచురిత వ్యాసాల వివరాలు**

1) ఔచిత్యం (అంతర్జాల తెలుగు మాసపత్రిక. UGC–CARE Listed Journal. Volume–4) జూలై 8న 2023 (ISSN–2583–4797)లో 'శ్రీనాథుని కవితామార్గం – వర్ణవిన్యాస వక్రత' పుటలు:117–127.

2) ఔచిత్యం (అంతర్జాల తెలుగు మాస పత్రిక. UGC–CARE Listed Journal. Volume–5) ఫిబ్రవరి 2న 2024 (ISSN–2583–4797)లో 'శ్రీనాథుని కృతులు: పదపూర్వార్ధ వక్రత. పుటలు:66-76.

**9) పరిశోధన లక్ష్యం – ప్రయోజనాలు (Research Objects/Results)**

**లక్ష్యం**

శ్రీనాథ మహాకవి రచనాశైలి ఉత్కృష్టమైంది. చిరస్మరణీయమైంది. తర్వాతి కవులకు అనుసరణమైంది. అటువంటి కవి కవితా ప్రస్థానాన్ని స్పష్టం చేయడం ఈ పరిశోధన లక్ష్యం. కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని శ్రీనాథుడు పాటించాడని చెప్పడానికి 'హరచూడా హరిణాంక వక్రత' పద్యంలోని భావం కుంతకుని వక్రోక్తి జీవితంలోని ద్వితీయోన్మేషంలో ఉన్న 'వాగ్వల్ల్యాః పదపల్లవాస్పదతయా యా వక్రతోద్భాసినీ విచ్ఛిత్తిః సరసత్వ సమ్పదుచితా' అనే కారికను పోలి ఉంది. వక్రత చేత భాసించేది, సరసత్వ సంపదకు ఉచితమై, ఉజ్జ్వలమైనదిగా ఉండే వాక్కు ప్రశస్తిని చెప్పాడు. ఈ కారిక భావం, ఆ పద్యం ఒకే విధంగా ఉండటం గమనార్హం. కారిన్యం శబ్ద వక్రతలో, సరసత్వం వాక్య వక్రతలో అంతర్భవిస్తాయని నిరూపిస్తూ, నన్నయ, వేములవాడ భీమన, తిక్కన, ఎర్రన కవితా గుణాలు కూడా వక్రతలోనే అంతర్భవిస్తున్నాయని చెప్పటంతోపాటు శ్రీనాథుని కవితామార్గం వక్రోక్తే అని నిరూపించటమే నా పరిశోధన లక్ష్యంగా భావిస్తున్నాను.

**ప్రయోజనాలు**

శ్రీనాథుని రచనా మార్గం పై స్పష్టత ఏర్పడుతుంది. భావి పరిశోధకులకు ఈ పరిశోధన ఉపయోగపడుతుంది.

1) శ్రీనాథుని కవితా మార్గంపై వాదోపవాదాలు చర్చితమయ్యాయి.

2) శ్రీనాథుని అసలైన మార్గం ఏమిటని స్పష్టమవుతుంది.

3) శ్రీనాథుని రచనల్లోని ఇతర కవుల మార్గ అనుసరణ అవగతమవుతుంది.

4) శ్రీనాథుని రచనల్లోని శబ్దమాధుర్యం వెల్లడి అవుతుంది.

5) వక్రతా వ్యాపారం ఎలా అనుసరించబడిందో తెలుస్తుంది.

6) శ్రీనాథుని కవిత్వంలోని చమత్కృతి తెలుస్తుంది.

7) శ్రీనాథుని బహుముఖీనమైన పాండిత్య ప్రకర్ష, కవిత్వ రచనానైపుణ్యం వెల్లడి అవుతుంది.

8) కుంతకుని వక్రోక్తి మార్గంలోని రకరకాల వక్రతలు, వాటి అంతర్భేదాలు చెప్పబడ్డాయి. వాటిని వివరణాత్మకంగా తెలుసుకోవచ్చు.

9) వక్రోక్తి సిద్ధాంత నేపథ్యం తెలుస్తుంది.

10) వక్రతల అంతర్భేదాలు వాటి లక్షణాలు తెలుసుకోబడుతాయి.

11) శ్రీనాథుని పద్యాల్లోని వక్రత భేదాలు సమన్వయంతో నిరూపించబడ్డాయి.

12) వర్ణ విన్యాస వక్రత సమన్వయం చేయబపడింది.

13) పద పూర్వార్ధ, పరార్ధ వక్రత సమన్వయం చేయబడింది.

14) వాక్యంలో అలంకార వైశిష్ట్యం తెలుపబడటంతోపాటు, వస్తు వక్రత, రస సంబంధ విషయాలు చర్చించబడ్డాయి.

15) ప్రకరణ, ప్రబంధ వక్రతా భేదాలను తెలుపుతూ, సోదాహరణంగా వివరణలు ఇవ్వటం జరిగింది. శ్రీనాథుని కవిత్వంలో కుంతకుని 68 రకాల వక్రతా అంతర్భేదాల సమన్వయం చేసి, కుంతకుని మార్గాన్ని శ్రీనాథుడు అనుసరించాడని నిరూపించబడింది.

ఒక కావ్యం చిరకాలం నిలిచి ఉండాలంటే దానికి శైలి (కవితాగుణాలే) ముఖ్యమనే విషయం ఈ పరిశోధన ద్వారా తెలుస్తుంది. వక్రతా వ్యాపారం, వాక్కులోని వైచిత్ర్యం, శబ్దార్ధ సౌష్ఠవం, అలంకార ప్రయోజనం, రసపోషణ తదితర అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ఒక కవి కావ్యానికి అతని కావ్యశైలి, కవితామార్గం ప్రాణమనే విషయం బోధపడుతుంది. ఇప్పటికి శ్రీనాథుని సాహిత్యం సజీవంగా ఉందంటే ఆ మహాకవి అనుసరించిన మార్గమే అతన్ని అజరామరున్ని చేసిందని నిశ్చయంగా ఈ పరిశోధన తెలుపుతుంది.

విషయ సూచిక


| | |
|---|---|
| **అంకితం** | **iii** |
| **డిక్లరేషన్** | **iv** |
| **సర్టిఫికెట్** | **v** |
| **కృతజ్ఞతలు** | **vi** |
| **సంకేత పదసూచి** | **vii – viii** |
| **ప్రవేశిక** | **ix – xvii** |
| **విషయసూచిక** | **xviii – xxv** |
| **అధ్యాయం – 1: శ్రీనాథకవి పరిచయం – రచనలు** | **1 – 41** |

1.1. పరిచయం

1.2. మహాకవి యుగము

1.3. శ్రీనాథ యుగము

1.3.1. శ్రీనాథుని జననం

1.3.2. కాలనిర్ణయం

1.3.3. ప్రాంతం

1.3.4. పాండిత్య ప్రకర్ష

1.3.4.1. శాస్త్ర పరిజ్ఞానం

1.3.4.2. బిరుదులు

1.3.4.3. కనకాభిషేకం

1.3.5. రాజకీయ విషయాలు

1.3.5.1. పెదకోమటి వేమారెడ్డి

1.3.6. అవసాన దశ

1.3.7. శ్రీనాథుని రచనలు

1.3.7.1. మరుత్తరాట్చరిత్ర

1.3.7.2. శాలివాహన సప్తశతి

1.3.7.3. పండేతారాధ్య చరిత్ర

1.3.7.4. శృంగారనైషధము

1.3.7.4.1. శృంగారనైషధము–కావ్యసారం

1.3.7.5. హరవిలాసం

1.3.7.5.1. హరవిలాసం–కావ్యసారం

1.3.7.6. ధనంజయ విజయం

1.3.7.7. నందనందన చరిత్ర

1.3.7.8. వల్లభాభ్యుదయం
1.3.7.9. భీమేశ్వర పురాణం
1.3.7.9.1. భీమేశ్వర పురాణం–కావ్యసారం
1.3.7.10. కాశీఖండం
1.3.7.10.1. కాశీఖండం–కావ్యసారం
1.3.7.11. శివరాత్రి మహాత్మ్యం
1.3.7.11.1. శివరాత్రి మహాత్మ్యం–కావ్యసారం
1.3.7.12. పల్నాటి వీరచరిత్ర
1.3.7.12.1. పల్నాటి వీరచరిత్ర–కథాసారం
1.3.7.13. క్రీడాభిరామం
1.3.7.13.1. క్రీడాభిరామం–కథాసారం
1.3.7.13.2. కర్తృత్వ చర్చ
1.3.7.14. చాటువులు
1.3.7.15. ఇతర రచనలు
1.3.8. శ్రీనాథుని కవితామార్గ చర్చ
1.4. పరిశోధన స్వీకృత గ్రంథాలు

**అధ్యాయం – 2: శ్రీనాథుని కవితా మార్గం – సైద్ధాంతిక నేపథ్యం** 42 – 85
2.1. కవి
2.2. శైలి
2.3. పూర్వకవుల స్మరణ
2.3.1. తెలుగు కవులు
2.3.2. సంస్కృత కవులు
2.4. శ్రీనాథుని కవితా గుణాలు
2.4.1. వక్రత
2.4.2. కాఠిన్యం
2.4.3. సరసత్వం
2.4.4. కుంతక శ్లోకం–అనుకరణ
2.4.5. వేములవాడ భీమన
2.4.5.1. ఉద్దండలీల
2.4.6. నన్నయ
2.4.5.6.1. నన్నయ కవితా గుణాలు

2.4.6.1.1. ఉభయ వాక్ప్రౌఢి
2.4.7. తిక్కన
2.4.7.1. తిక్కన రసాభ్యుచిత బంధం
2.4.8. ఎఱ్ఱన
2.4.8.1. ఎఱ్ఱన సూక్తివైచిత్రి
2.4.8.1.1. సూక్తివైచిత్రి రకాలు
2.5. తదనంతర కవులు–శ్రీనాథుని ప్రభావం
2.6. సైద్ధాంతిక నేపథ్యం
2.6.1. రసం
2.6.2. అలంకారం
2.6.3. గుణం
2.6.4. రీతి
2.6.5. ధ్వని
2.6.6. వక్రోక్తి
2.6.7. అనుమితి
2.6.8. ఔచిత్యం
2.6.9. వక్రోక్తి ప్రస్తావన–భామహుడు
2.6.10. కుంతకుడు–వక్రోక్తి జీవితం
2.6.11. వక్రోక్తి–ఆలంకారికుల నిర్వచనాలు
2.6.11.1. దండి
2.6.11.2. వామనుడు
2.6.11.3. జయదేవుడు
2.6.11.4. రుద్రటుడు
2.6.11.5. మమ్మటుడు
2.6.12. కుంతకుడు–వక్రోక్తి సిద్ధాంత భేదాలు
2.6.13. ధ్వని–వక్రత
2.6.13.1. ధ్వని
2.6.13.2. వక్రోక్తి
2.7. పరిశోధకుల అభిప్రాయాలు
2.7.1. జి.వి. సుబ్రమణ్యం
2.7.2. బండారు తమ్మయ్య
2.7.3. కుందూరి ఈశ్వరదత్త

2.7.4. కొర్లపాటి శ్రీరామమూర్తి

2.7.5. జంధ్యాల జయకృష్ణ బాపూజీ

2.7.6. వెల్చేరు నారాయణరావు

2.8. వివరణ

**అధ్యాయం – 3: శ్రీనాథుని కవిత్వం – వర్ణవిన్యాస వక్రత** **86 – 128**

3.1. వర్ణం

3.2. ఏకవర్ణ పునరావృత్తి

3.2.1. ఏకవర్ణ పునరావృత్తి – సమన్వయం

3.3. ద్వివర్ణ పునరావృత్తి

3.3.1. ద్వివర్ణ పునరావృత్తి – సమన్వయం

3.4. బహువర్ణ పునరావృత్తి

3.4.1. బహువర్ణ పునరావృత్తి – సమన్వయం

3.5. స్పర్శవర్ణయుక్త వక్రత

3.5.1. స్పర్శవర్ణయుక్త వక్రత – సమన్వయం

3.6. త, ల, నాదుల ద్విరుక్తగత వక్రత

3.6.1. త, ల, నాదుల ద్విరుక్తగత వక్రత – సమన్వయం

3.7. రేఫాది సంయుక్తగత వర్ణగత వక్రత

3.7.1. రేఫాది సంయుక్తగత వర్ణగత – సమన్వయం

3.8. వర్ణ విన్యాసం – ఉపసంహారం

**అధ్యాయం – 4: శ్రీనాథుని కవిత్వం – పదవక్రత** **129 – 186**

4.1. పదపూర్వార్ధ వక్రత

4.1.1. రూఢి వైచిత్ర్య వక్రత

4.1.1.1. రూఢి వైచిత్ర్య వక్రత – సమన్వయం

4.1.2. పర్యాయవక్రత

4.1.2.1. పర్యాయ వక్రత – సమన్వయం

4.1.3. ఉపచార వక్రత

4.1.3.1. ఉపచార వక్రత – సమన్వయం

4.1.4. విశేషణ వక్రత

.4.1.4.1. విశేషణ వక్రత – సమన్వయం

4.1.5. సంవృతి వక్రత

4.1.5.1. సంవృతి వక్రత – సమన్వయం
4.1.6. పదమధ్యాతంర్భూత ప్రత్యయ వక్రత
.4.1.6.1. పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత – సమన్వయం
4.1.7. వృత్తివైచిత్ర్య వక్రత
4.1.7.1. వృత్తివైచిత్ర్య వక్రత – సమన్వయం
4.1.8. భావవైచిత్ర్య వక్రత
4.1.8.1. భావవైచిత్ర్య వక్రత – సమన్వయం
4.1.9. లింగవైచిత్ర్య వక్రత
4.1.9.1. లింగ వైచిత్ర్య వక్రత – సమన్వయం
4.1.10. క్రియావైచిత్ర్య వక్రత
4.1.10.1. కర్తృరత్యంతరంగత్వము
4.1.10.1.1. కర్తృరత్యంతరంగత్వము – సమన్వయం
4.1.10.2. కర్త్రంతర విచిత్రత
.4.1.10.2.1. కర్త్రంతర విచిత్రత – సమన్వయం
4.1.10.3. సవిశేషణ వైచిత్ర్యం
4.1.10.3.1. సవిశేషణ వైచిత్ర్యం – సమన్వయం
4.1.10.4. ఉపచార మనోజ్ఞత
4.1.10.4.1. ఉపచార మనోజ్ఞత – సమన్వయం
4.1.10.5. కర్మాది సంవృతి
4.1.10.5.1. కర్మాది సంవృతి – సమన్వయం
4.2. పదపరార్ధ వక్రత
4.2.1. కాలవైచిత్ర్య వక్రత
4.2.1.1. కాలవైచిత్ర్య – సమన్వయం
4.2.2. కారవక్రత
4.2.2.1. కారవక్రత – సమన్వయం
4.2.3. సంఖ్యా వక్రత
4.2.3.1. సంఖ్యా వక్రత – సమన్వయం
4.2.4. పురుష వక్రత
4.2.4.1. పురుష వక్రత – సమన్వయం
4.2.5. ఉపగ్రహ వక్రత
4.2.5.1. ఉపగ్రహ వక్రత సమన్వయం
4.2.6. ప్రత్యయ వక్రత

4.2.6.1. ప్రత్యయ వక్రత – సమన్వయం
4.2.6.2. ఉపసర్గ వక్రత
4.2.6.2.1. ఉపసర్గ వక్రత – సమన్వయం
4.2.6.3. నిపాత వక్రత
4.2.6.3.1. నిపాత వక్రత – సమన్వయం

**అధ్యాయం – 5: శ్రీనాథుని కవిత్వం – వాక్యవక్రత** **187 – 289**
5.1. స్వభావోక్తి – చర్చ
5.2. వస్తువక్రత
5.3. కవికౌశలోజ్జీవిత స్వభావం
5.3.1. కవికౌశలోజ్జీవిత స్వభావం – సమన్వయం
5.4. కవి కౌశలోజ్జీవిత రసం
5.4.1. కవికౌశలోజ్జీవిత రసం – సమన్వయం
5.5. అలంకార నిర్వచనం
5.6. అలంకార తత్త్వము
5.7. అలంకార స్వరూపం
5.7.1. భరతుడు
5.7.2. భామహుడు
5.7.3. భోజదేవుడు
5.7.4. మమ్మటుడు
5.8. అలంకార సంఖ్య –వర్గీకరణ
5.8.1. భరతుని అర్థాలంకారాలు
5.8.2. భామహుని అర్థాలంకారాలు
5.8.3. దండి అర్థాలంకారాలు
5.9. కుంతకుని అలంకార వక్రత – భేదాలు
5.9.1. రసవత్తు
5.9.1.1. రసవత్తు – సమన్వయం
5.9.2. దీపకం
5.9.2.1. దీపకం – సమన్వయం
5.9.3. రూపకం
5.9.3.1. రూపకం – సమన్వయం
5.9.4. అప్రస్తుత ప్రశంస

5.9.4.1. అప్రస్తుత ప్రశంస – సమన్వయం

5.9.5. పర్యాయోక్తి

5.9.5.1. పర్యాయోక్తి – సమన్వయం

5.9.6. వ్యాజస్తుతి

5.9.6.1. వ్యాజస్తుతి – సమన్వయం

5.9.7. ఉత్ప్రేక్ష

5.9.7.1. ఉత్ప్రేక్ష – సమన్వయం

5.9.8. అతిశయోక్తి

5.9.8.1. అతిశయోక్తి – సమన్వయం

5.9.9. ఉపమ

5.9.9.1. ఉపమ – సమన్వయం

5.9.10. శ్లేష

5.9.10.1. శ్లేష – సమన్వయం

5.9.11. వ్యతిరేకం

5.9.11.1. వ్యతిరేకం – సమన్వయం

5.9.12. సహోక్తి

5.9.12.1. సహోక్తి – సమన్వయం

5.9.13. దృష్టాంతం

5.9.13.1. దృష్టాంతం – సమన్వయం

5.9.14. అర్థాంతర న్యాసం

5.9.14.1. అర్థాంతరన్యాసం – సమన్వయం

5.9.15. ఆక్షేపం

5.9.15.1. ఆక్షేపం – సమన్వయం

5.9.16. విభావనం

5.9.16.1. విభావనం – సమన్వయం

5.9.17. ససందేహం

5.9.17.1. ససందేహం – సమన్వయం

5.9.18. అపహ్నుతి

5.9.18.1. అపహ్నుతి – సమన్వయం

5.9.19. సంసృష్టి

5.9.19.1. సంసృష్టి – సమన్వయం

5.9.20. సంకరం

5.9.20.1. సంకరం – సమన్వయం

అధ్యాయం – 6: శ్రీనాథుని కవిత్వం–ప్రకరణ, ప్రబంధ వక్రతలు 290 – 356
6.1. ప్రకరణ వక్రత
6.1.1. ప్రకరణ వక్రత మొదటి భేదం
6.1.2. ప్రకరణ వక్రత రెండవ భేదం
6.1.3. ప్రకరణ వక్రత మూడవ భేదం
6.1.4. ప్రకరణ వక్రత నాల్గవ భేదం
6.1.5. ప్రకరణ వక్రత ఐదవ భేదం
6.1.6. ప్రకరణ వక్రత ఆరవ భేదం
6.1.7. ప్రకరణ వక్రత ఏడవ భేదం
6.1.8. ప్రకరణ వక్రత ఎనిమిదవ భేదం
6.1.9. ప్రకరణ వక్రత తొమ్మిదవ భేదం
6.2. ప్రబంధ వక్రత
6.2.1. ప్రబంధ వక్రత మొదటి భేదం
6.2.2. ప్రబంధ వక్రత రెండవ భేదం
6.2.3. ప్రబంధ వక్రత మూడవ భేదం
6.2.4. ప్రబంధ వక్రత నాల్గవ భేదం
6.2.5. ప్రబంధ వక్రత ఐదవ భేదం
6.2.6. ప్రబంధ వక్రత ఆరవ భేదం
6.2.7. ప్రబంధ వక్రత ఏడవ భేదం

**ఉపసంహారం** 357 – 360
**ఉపయుక్త గ్రంథసూచి** 361 – 371
**అనుబంధం – 1 (ఇంటర్వ్యూ)** 372
**అనుబంధం – 2 (సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు)** 373 – 396

# అధ్యాయం–1

# శ్రీనాథకవి పరిచయం – రచనలు

## 1.1. పరిచయం:

తెలుగు సాహిత్యానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఎంతోమంది కవులు సాహిత్యంలో తమదైన ముద్రను వేసుకొని సుస్థిర స్థానాలను ఏర్పర్చుకున్నారు. మహోన్నతమైన చరిత్ర గల తెలుగు సాహిత్యాన్ని కొన్ని యుగాలుగా విభజించడం జరిగింది. ఒక్కొక్కరు ఒక్కోరకంగా యుగవిభజన చేసారు.

తెలుగులో మొదటిసారిగా వచ్చిన గురజాడ శ్రీరామమూర్తి 'కవిజీవితములు' వీరేశలింగం పంతులు 'కవుల చరిత్ర' అనేటువంటివి కవుల జీవిత చరిత్రలను, దేశకాలాదులను మాత్రమే నిర్ణయించటంలో ప్రాధాన్యత వహించినవి. గురజాడ శ్రీరామమూర్తి , వంగూరి సుబ్బారావు, కవులు రచించిన గ్రంథాలని బట్టి భారత కవులు, రామాయణ కవులు, ప్రబంధ కవులు అని విభజించారు. 'ఆంధ్రకవుల చరిత్ర' రాసినటువంటి వీరేశలింగం పంతులు ప్రాచీన కవులు, మధ్యయుగపు కవులు, ఆధునిక కవులు అని విభజించారు. తర్వాత కాలంలో ఆరుద్ర రాసినటువంటి 'సమగ్రాంధ్ర సాహిత్యంలో' కవులను పోషించిన రాజవంశాల మీదుగా ఆదిమ చాళుక్య యుగం, కాకతీయ యుగం, పద్మనాయక యుగం అని విభజన చేసాడు. పింగళి లక్ష్మీకాంతం క్రీ.పూ. 200 – క్రీ.శ.1000 వరకు గల కాలాన్ని ప్రాఙ్నన్నయ యుగంగా, క్రీ. శ 11వ శతాబ్దిని నన్నయ యుగం, 12వ శతాబ్దిని శివకవి యుగం, 13 వ శతాబ్దిని తిక్కన యుగం, 14 వ శతాబ్దిని ఎర్రన యుగం, 15వ శతాబ్దిని శ్రీనాథుని యుగంగా, తర్వాత కాలాలను కృష్ణరాయలయుగం, దక్షిణాంధ్రయుగం, క్షీణయుగం, ఆధునికయుగాలుగా విభజించాడు. ఈ విధమైన విభజన వలన సాహిత్యచరిత్రను సులువుగా అర్థం చేసుకోవచ్చు. యుగకర్తల పేరు మీద సాహిత్య చరిత్రను వింగడించటం సరైనటువంటి పద్ధతిగా సాహిత్యకారులు భావించారు.

## 1.2. మహాకవి యుగము

"ఎవరు తమ రచనల ద్వారా వర్తమానకాలమునకే కాక భవిష్యత్తరముల వారికి అభినవోత్తేజము కల్గింతురో, ఎవరు గతానుగతికమై ఘనీభవించిన భావ ప్రపంచములో ఉద్దామమైన ఉద్దీపనము కలిగింతురో, ఎవరు తమ తరువాత అనేక కవులకు అనుకరణీయములౌదురో వారిని సాహిత్య రంగమున యుగకర్తలనవచ్చును" (నాగయ్య, జి.2021.పుట.26.)అంతే కాకుండా ఆయాకాలాల్లో జరిగినటువంటి మార్పులు యుగకర్త

సాహిత్యంలో ప్రతిబింబిస్తాయని, అతని కాలానికి అతడే పట్టభద్రుడౌతాడని "ఆంధ్ర సాహిత్యమున నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు మొదలైన వారు యుగపురుషులు, ఈ యుగకర్తలను ఇతర కవులు అనుసరింతురు. ఒక కాలంలో యుగ పురుషులకు భిన్నులగు వారెందరున్నను వారందరికి సమాన ధర్మములు కొన్నియుండి తీరును. వారిలో ముఖ్యమైనవాడు యుగకర్తగా పరిగణింపబడి తక్కిన సమకాలికులందరికి ప్రతినిధిగా ఉండును. అతనిలో స్వతంత్ర వ్యక్తిత్వం కనిపించును"(నాగయ్య, జి.2021.పుట.27). అని చెప్పవచ్చు.

ఈ విధంగా కవుల రచనలను బట్టి వారి ఉత్కృష్టమైన శైలీ విధానాన్ని బట్టి యుగ విభజన చేయబడి ఆ యుగానికి మార్గదర్శకమైనటువంటి కవిని యుగప్రతినిధిగా చెప్పుతూ ఆ కవి పేరు మీదుగానే యుగము నిర్ణయించబడుతుంది. ఆ ప్రకారంగా నన్నయాదుల తర్వాత క్రీ.శ1400-1500ల మధ్య కాలాన్ని శ్రీనాథ మహాకవి యుగంగా చెప్పారు. ఆ కాలంలో సర్వోన్నతుడై అనేక రచనలు వెలువరించి యుగ ప్రాతినిధ్యాన్ని వహించాడు. కనుక 15వ శతాబ్దాన్ని శ్రీనాథ యుగమని పిలిచారు.

## 1.3. శ్రీనాథ యుగము

తెలుగు సాహిత్య చరిత్రలోని యుగాలలో శ్రీనాథ యుగం కూడా ఒకటి. ఆ యుగానికి సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. క్రీ.శ.15వ శతాబ్దాన్ని శ్రీనాథ యుగం అని కావ్యయుగమని పిలిచారు. ఆ యుగంలోని కవులలో శ్రీనాథునికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఇతర కవుల కంటే ఉత్తమ సాహిత్యాన్ని ఆ కాలంలో వెలువరించాడు కాబట్టి.

ఈ యుగంలో శ్రీనాథుడితో పాటు సమకాలీనులు పేరం రాజు (1380–1440), అనంతామాత్యుడు (1356), గౌరన (1380–1450), మడికి సింగన (1420), పోతన (1420–1480), దుగ్గన (1465), పిల్లలమర్రి పిన వీరభద్రుడు (1480) మొదలైనవారు, ఉన్నప్పటికి వారి రచనలకంటే ఉత్తమ సాహిత్యాన్ని వెలువరించి యుగ నాయకత్వాన్ని ఈ కవి వహించాడు.

శ్రీనాథయుగాన్ని సంధి యుగమని కూడా కొందరు అన్నారు. "ఉత్తమ లక్షణములతో ఒక మహా యుగం కొంతకాలం నడిచి ఆగిపోయిన పిమ్మట మరి కొంతకాలమునకు మరికొన్ని ఉత్తమ భిన్న లక్షణములతో ఇంకొక మహాయుగం ఆవిర్భవింపనుండగా ఆ రెండింటి నడుమ చెప్పదగిన స్వతంత్ర లక్షణములేవియు లేక అవ్యవస్థితముగ, అప్రధానముగ ఉండెడి కాల వ్యవధికి age of transition అని పేరు. తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీనాథయుగము అవ్యవస్థితమును,

అప్రధానము కాదు. కనుక శ్రీనాథయుగము ఆ అర్థమున సంధి యుగమనరాదు" (నాగయ్య, జి. 2021.పుట.532) అని చెప్పాడు. కానీ శ్రీనాథునికి ముందే నన్నయాదుల పురాణకవితామార్గం, తర్వాత కాలంలో ప్రబంధ మార్గం వచ్చింది. కనుక పురాణానికి, ప్రబంధానికి మధ్య గల యుగంగా సంధి యుగమంటారు. కానీ అప్రధానమైనటువంటిది మాత్రం కాదు. ఇతని కాలంలోని కవులైన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు, నంది మల్లయ, ఘంట సింగన మొదలైన కవులందరు ఈ కవి అడుగుజాడల్లో నడిచారు. కాబట్టే శ్రీనాథయుగం అనవచ్చు.

### 1.3.1. శ్రీనాథుని జననం

శ్రీనాథుడు శైవుడైన నియోగి బ్రాహ్మణుడు. భారద్వాజ గోత్రుడు, ఆపస్తంభ సూత్రుడు. "శ్రీనాథుని తండ్రి మారయ, తల్లి భీమాంబిక, కమలానాభామాత్యుడు ఇతని తాతగా చెప్తారు. మారయభీమాంబిక దంపతులకు కీ.శ 1370కి అయుదారేళ్ళు అటో ఇటో ఒక కుమారుడు జన్మించాడు.  అతనికి శ్రీనాథుడు అని పేరు పెట్టారు" (1990. పుట.281). తన సమగ్రాంధ్ర సాహిత్యంలో చెప్పిన మాట ఇది. శ్రీనాథుని జననకాలం గురించి, అతడు పుట్టిన ప్రాంతం గురించి చర్చోపచర్చలు జరిగినవి.

శ్రీనాథుడు బ్రాహ్మణ వంశానికి చెందినవాడు. ఇతని తల్లిందండ్రులు తాతముత్తాతలు నియోగి శాఖకు చెందిన వారని అతడు ఉపయోగించిన "అమాత్య శబ్దము ప్రబల దర్శనముగా ఉన్నది" (తమ్మయ్య, బండారు. 1986.పుట.3) అని అభిప్రాయపడ్డారు.

### 1.3.2. కాలనిర్ణయం

శ్రీనాథుని "కాలం 1365 అయి ఉండునని శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు మొదలగు వారును 1385 అని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు నిర్ధారించిరి" (లక్ష్మీకాంతం, పింగళి.2005.పుట.253).

"చిలుకూరి వీరభద్రరావు గారు – కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి వలె హరవిలాసకాలం బట్టియే శ్రీనాథుని జనన కాలము నిర్ణయించిరి. కానీ వీరు క్రీ.శ.1385 ప్రాంతమనిరి. శివ శ్రీ బండారు తమ్మయ్య గారు, బెండపూడి అన్నయామాత్యుని పితామహుడగు అన్నమంత్రి కాలమును ఆధారము చేసుకొని శ్రీనాథుని జనన కాలము క్రీ.శ 1365–70 మధ్య కాలముగా నిర్ణయించుట చాలా సంగతముగా నుండుననిరి" (లక్ష్మీనారాయణ, గండవరపు.1997.పుట.) అని భీమఖండ వ్యాఖ్యాన గ్రంథంలో పెద్దలు చెప్పిన అభిప్రాయాలను వివరించారు.

ఇలా శ్రీనాథుని జన్మకాలానికి సంబంధించి అనేకులు అనేక రకాలుగా అభిప్రాయాలను తెలుపగా కొర్లపాటి శ్రీరామమూర్తి "శ్రీనాథుడు" అనే గ్రంథంలో ప్రతి ఒక్కరి అభిప్రాయాలను గౌరవిస్తూనే ప్రతికూలతలను, అనుకూలతలను తెలుపుతూ శ్రీనాథుని కాలాన్ని, అతని తాత అయిన కమలనాభామాత్యుని ఆధారంగా నిర్ణయించారు. శ్రీనాథుడు తనకు తాత ఉన్నాడని, అతని పేరు కమలనాభామాత్యుడని భీమేశ్వరపురాణంలో ఇలా చెప్పుకున్నాడు.

**మ॥ కనకక్ష్మాధర ధీరు వారిధి తటీ కాల్పట్టణాధీశ్వరున్**
**ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళా కావ్య ప్రబంధాధిపున్**
**వినమత్కాకతి సార్వభౌము గవితా విద్యాధరున్ గొల్తుమా**
**యనుగుందాతఁ బ్రదాత శ్రీ కమలనాభామాత్య చూడామణిన్**

**(భీమే.ప్రథ.ఆశ్వా.10.పద్యం)**

ఇక్కడ తన తాత కమలనాభామాత్యుడని, అతను కాకతీయ ప్రభువైన వారికి నమస్కరించువాడు, కాల్పట్టణాధీశుడు పద్మ పురాణ సంగ్రహమను కావ్యాన్ని రచించినట్లు తెలుపుతూ తన పైన అనురాగము కలిగినట్టివాడని చెప్పాడు. వీటిని ఆధారం చేసుకొని కాకతీసార్వభౌముడు ప్రతాపరుద్రుడు, ఎంతో మంది గొప్ప విద్వాంసులను చేరదీసిన సార్వభౌముడు. అతని ఆస్థానంలో ఉండి నమస్కరించే స్థాయికి రావడానికి కనీసం నలభై సంవత్సరాల వయసు పడుతుంది.

పైన చెప్పిన ప్రకారంగా "1320 సంవత్సరం నుండి కమలనాభామాత్యుడు వినమత్కాకతి సార్వభౌముఁడైన యాతని జనన కాలం 1320–40–1280 ప్రాంతమగును. అయిన కమలనాభామాత్యుడు బహుకాలము బ్రదికిన 1370వ సంవత్సరం నాటికి తొంబది సంవత్సరములవాడగుట సహజము. అంతకంటే ఎక్కువ కాలం కమలనాభామాత్యుడు జీవించియుండుట సంభవమే కానీ మనమనికి అనుగుందాతయగుట సంభవము కాదు కాబట్టి 1370 సంవత్సరము నాటికి శ్రీనాథునికి కమలనాభామాత్యుఁడు అనుఁగుఁదాత కాక తప్పదు. అనఁగా నప్పటికి శ్రీనాథునికి, పది సంవత్సరముల ప్రాయముండక తప్పదు. కాబట్టి శ్రీనాథుని జనన కాలం 1360 ప్రాంతమగును. అయిన1404 వ సంవత్సరం నాటికి శ్రీనాథుని వయసు 1404– 1360–44 సంవత్సరములు. ముప్పది నాలుగు సంవత్సరముల కంటే నలుబది నాలుగు సంవత్సరాల వయసునందే శ్రీనాథుడు విద్యాధికారి యగుట సుసంగతము. కాబట్టి శ్రీనాథుని జనన కాలం క్రీ.శ 1360 వ ప్రాంతమగుటయే సంభవము. అయిదు సంవత్సరాలు అటూనిటు

నవకాశమే కాని స్థూలముగా శ్రీనాథుని జనన కాలం క్రీ.శ.1360వ సంవత్సరమని గ్రహింపవచ్చును” (శ్రీరామమూర్తి, కొర్లపాటి.1971.పుట.66) అని క్రీ.శ.1360 కాలాన్ని శ్రీనాథుని జనన కాలంగా నిర్ణయించారు.

కానీ శృంగార నైషధ రచనను బట్టి వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 1385 ప్రాంతం అవుతుందని చెప్పారు. ఆ కాలాన్ని కూడా చాలా మంది శ్రీనాథుని కాలంగా చెప్పుకు వచ్చారు.

కొర్లపాటి శ్రీరామమూర్తి క్రీ.శ.1360గా నిర్ధారించి, చరమ కాలాన్ని క్రీ.శ. 1450గా చెప్పారు. వేటూరి ప్రభాకర శాస్త్రి ప్రకారం చరమ కాలం క్రీ.శ 1475 అవుతుంది. మొత్తానికి శ్రీనాథుని కాలాన్ని క్రీ.శ.1360 నుండి 1450గా, తెలుగు రాయల చరమకాలం 1444ను లెక్కలోకి తీసుకొని నిర్ధారించారు. శ్రీనాథుని అవసాన కాలంలోని పద్యంలో ‘రంభగూడెఁదెనుంగురాయ రాహుత్తుండు కస్తూరికేరాజుఁబ్రస్తుతించు’ అని ఉండటం వలన తెలుగు రాయల కాలాన్ని అనుసరించి లెక్కించడమైంది. ఇవి శ్రీనాథుని జనన కాలానికి సంబంధించిన విషయాలు.

### 1.3.3. ప్రాంతం:

శ్రీనాథుని జన్మస్థలం గురించి కూడా పలువురు పలురకాలుగా చర్చించారు. భీమఖండంలో “వారిధీతటీ కాల్పట్టణాధీశుడు” అని తన తాత కమలనాభామాత్యుని గురించి చెప్పడం వలన కాల్పట్టణం వారి ప్రాంతమని అందరు అనుకున్నారు. భీమఖండాన్ని అంకితం తీసుకున్న బెండపూడి అన్నయామాత్యుడు తనకు కావ్యాన్ని అంకితమివ్వమని కోరుతూ ఒక పద్యంలో “పాకనాటి వాడవు” అంటాడు. ఆ పద్యాన్ని చూద్దాం.

**తే॥ పాకనాఁటింటి వాఁడవు బాంధవుఁడవు**
**కమనాభుని పౌత్రుఁడ విమల మతివి**
**నాకుఁ గృపసేయుమొక ప్రబంధంబునీవు**
**కలిత గుణగణ్య! శ్రీనాథ కవివరేణ్య!**

**(భీమే.ప్రథ.ఆశ్వా.23.పద్యం)**

అని పలికినట్లుగా భీమేశ్వరపురాణంలో చెప్పుకోవడం కనిపిస్తుంది. పాకనాడు అనేది శ్రీనాథుని ఇంటిపేరు అయ్యి ఉండవచ్చని శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావు ఊహించారు. కానీ ఆ అభిప్రాయాన్ని ఎక్కువమంది పండితులు ఆమోదించలేదు. కమలనాభామాత్యుడు అధీశ్వరుడుగా చెప్పుకున్న సముద్రతీరంలో ఉన్న కాల్పట్టణం గురించి పరిశోధనలు చేసారు. వీరేశలింగం

పంతులు "క్రాల్పట్టణం" అని ఊహించి 'క్రాలు' పదానికి 'ప్రకాశించు' అనే అర్థాన్ని సూచిస్తూ "క్రాల్పట్టణము ప్రకాశించు పట్టణం. క్రొత్తది ప్రకాశించును కనుక క్రొత్త పట్టణమనవచ్చును" (వీరేశలింగం, కందుకూరి.2013.పుట.288) అని చెప్తూ ఒంగోలుకు దగ్గర ఉన్నట్టుగా భావించారు.

"శ్రీనాథుని నివాసం నెల్లూరని నెలటూరి వెంకటరమణయ్య రేపల్లే తాలూకాలోని 'నల్లూ'రని చాగంటి శేషయ్య అభిప్రాయపడుతున్నారని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయం" (వీరేశలింగం, కందుకూరి.2013.పుట.287) అని వీరేశలింగం తన ఆంధ్ర కవుల చరిత్రలో చెప్పుకువచ్చారు.

శ్రీనాథుని జన్మస్థలం గురించి వేటూరి ప్రభాకరశాస్త్రి వివరిస్తూ మచిలీ పట్టణమునకు దగ్గర ఉన్న కాలీపట్టణం ఉందని అదే కాల్పట్టణం అని చెప్పారు.

ఇలా ప్రముఖులైన పండితులు వారి అభిప్రాయాలను తోచిన విధంగా చెప్పారు. ప్రస్తుతం మాత్రం శ్రీనాథుని జన్మస్థలంగా కాల్పట్టణాన్ని చెపుతున్నారు. అది కృష్ణా జిల్లా మచిలీ పట్టణానికి దగ్గర దగ్గర ఉందని ఆ కాల్పట్టణమే శ్రీనాథుని జన్మస్థలంగా భావిస్తున్నారు. అది ఎంతవరకు వాస్తవమన్న విషయాన్ని ఎవరూ తేల్చలేకపోయారు.

### 1.3.4. పాండిత్య ప్రకర్ష

శ్రీనాథుడు పాండిత్య ప్రకర్ష కలిగినవాడు. అతని బాల్యం విద్యాభ్యాసం ఎక్కడ జరిగిందో ఎవరికీ తెలియదు. కుశాగ్రబుద్ధి కలిగినవాడు. శాస్త్రాలను చదివిన జ్ఞాన సంపన్నుడని అతని రచనల ద్వారా చెప్పవచ్చు.

శ్రీనాథుని బావమరిదిగా చెప్పబడే దగ్గుపల్లి దుగ్గన తన నాసికేతోపాఖ్యానంలో ఇలా శ్రీనాథుని పాండిత్యాన్ని పొగుడుతూ...

**సీ॥ "సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్యభాషా పరిజ్ఞాన పాటవంబుఁ**
**బన్నగపతి సార్వభౌమ భాషితమహాభాష్యవిద్యా సమభ్యాసబలము**
**నక్షపాద కణాద పక్షిలోదీరిత న్యాయ కళా కౌశలాతిశయము**
**శ్రుతిపురాణాగమ స్మృతిసాంఖ్య సిద్ధాంత కబళన వ్యుత్పత్తి గౌరవంబు**

**గీ॥ పూర్వకవి ముఖ్య విరచితాపూర్వకావ్య**
**భావరస సుధా చర్వణ ప్రౌఢతయు**
**గందళింపంగఁ గాశికాఖండ నైష**

ధ ప్రముఖ వివిధ ప్రబంధములొనర్చి"

**(నాసికేతోపాఖ్యానం.ప్రథ.ఆశ్వా.17. పద్యం)**

సంస్కృత ప్రాకృత భాషలలో ఆరితేరినవాడు. వేదపురాణాల జ్ఞానాన్ని కలిగినవాడు, పూర్వకవుల కావ్య రసాలను ఎరిగిన ప్రౌఢత కలిగినవాడని శ్రీనాథున్ని శాస్త్ర పారంగతునిగా చెప్పాడు.

శ్రీనాథ కవిసార్వభౌముని వంటి కవి ఈ భూమి మీద లేడని వేమారెడ్డి అన్నట్టుగా కాశీఖండంలో ఒక పద్యం ఉంది.

**శా॥ ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులు లేరీనేటి కాలంబునన్?**
**దక్షారామ చాళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ**
**వక్షోజద్వయ గంధసార ఘుసృణ ద్వైరాజ్య భారంబున**
**ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీయ ప్రౌఢ సాహిత్యముల్**

**(కాశీ.ప్రథ.ఆశ్వా.14 పద్యం)**

ఈ విశాలమైన క్షోణీతలంలో నీ అంత గొప్ప కవి లేడు ఓ కవి సార్వభౌమ శ్రీనాథ! గంధం మలయపర్వతాలలో లభిస్తుంది. ఘుసృణం అంటే కుంకుమ కాశ్మీర దేశంలో లభిస్తుంది. ఆ రెండింటిని ధరించేటువంటి గంధర్వ స్త్రీ వక్షోద్వయంలాగా ఇతని సంస్కృతాంధ్ర సాహిత్యాలు పరిఢవిల్లుతున్నవని, శ్రీనాథున్ని మించిన కవి లేడని వేమారెడ్డి కీర్తిస్తూనే అతని సాహిత్యం ప్రౌఢతతో కూడుకుందని ఇక్కడ తెలపబడింది. శ్రీనాథుని కావ్యాల్లో ప్రౌఢత ఉంటుందని 'ప్రౌఢ సాహిత్యముల్' అను పదాల ద్వారా అవగతమౌతుంది.

శ్రీనాథుడు ఎంత గొప్ప వాడంటే కవిసార్వభౌముడు అని చెప్తూ దక్షిణాపథం నుండి ఉత్తరార్థం వరకు అంతటి కవిలేడని కాశ్మీర దేశంలోని కుంకుమతో, దక్షిణదేశంలోని మలయపర్వతంలోని గంధ పరిమళముతో పోల్చడం జరిగింది. గంధపరిమళము ఎంతదూరమైనా వెళుతుంది. గనుక ధ్వనిలాంటిదని, కుంకుమకు మెరిసే స్వభావం ఉంటుంది కనుక అది 'దీప్తి' అవుతుందని పెద్దలు ఊహించారు. మొదటిదాన్ని ఆత్మతో, రెండవదాన్ని శరీరంతో పోల్చారు.

"గంధసారము మలయజము, మలయపర్వతము దక్షిణా పథములోనిది. దక్షిణాపథ భాషలలో సుప్రసిద్ధమైనది తెనుగు. కనుక ఇచ్చటి గంధసార శబ్ధమును తెనుఁగు భాషకు సంకేతముగా గ్రహింపవలయును. ఘుసృణము కాశ్మీరజము – కాశ్మీరము హిమాలయము దగ్గరది. దేవ భాషకు పుట్టినిల్లు కనుక ఇచ్చటి ఘుసృణ శబ్దమును సంస్కృత భాషకు సంకేతముగా

గ్రహింపవలయును. సర్వభూమి యందు తెలియబడినవాడు సార్వభౌముడు. ధ్వని, దీప్తి అను రెండును కావ్యమునకు ఆత్మ, శరీరము" (శరభేశ్వర శర్మ.2012.పుట.22) అని వివరణ ఇచ్చారు.

ఉభయ కవిత్వ ప్రయోగ పాండిత్యాన్ని సంపాదించానని చెప్తూ "ఉభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలు" అని శ్రీనాథుడే హరవిలాసంలో తన పాండిత్యాన్ని గురించి తెలిపాడు. శ్రీనాథుడిలాంటి పాండిత్యం కలిగినట్టి కవి వేరొకరు లేరని ఏ కాలంలో కూడా ఉండరని వేమారెడ్డి ఈ విధంగా పొగిడాడు.

### 1.3.4.1. శాస్త్ర పరిజ్ఞానం

శ్రీనాథుని రచనల బట్టి అతని పదప్రయోగాలను బట్టి వివిధ శాస్త్రాల్లో నైపుణ్యం కలిగినవాడుగా చెప్పవచ్చు.

శివరాత్రి మాహాత్మ్యంలోని ఒక పద్యమందు "సుధాంశువై కమలజాతాకల్పమై యెప్పుడున్ జ్యోతిశ్చక్రముఁబోలెఁగ్రాలవలదా సొంపారి కావ్యంబులన్" అని అంటాడు. ఈ పద్యపాదాలు ఆయన జ్యోతిష్యశాస్త్ర ప్రవీణతను చెపుతాయి. శ్రీనాథుని పాండిత్యాన్ని, బహుభాషా నైపుణ్యాన్ని గూర్చి తనకు తానే హరవిలాసంలో మొదటి ఆశ్వాసంలో చెప్పుకొన్న పద్యాన్ని పరిశీలిద్దాం.

**సీ॥ కమలనాభుని పౌత్రుఁగవితా మహారాజ్యభద్రాసనారూఢుఁబరమపుణ్యుఁ**
**బాత్రునాపస్తంబ సూత్రు భారద్వాజగోత్రు సజ్జన మిత్రుఁగలపవిత్రు**
**భీమాంబికా మారనామాత్యనందను నఖిల పురాణవిద్యా ప్రవీణ**
**నథర్వ వేద శాఖాధీతి నిష్ణాతు నంధ్ర భాషా నైషధాబ్జ భవుని**

**తే॥ నుభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలు**
**బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప**
**నవచిదేవయ త్రిపురారి యక్షరాజు**
**హితమితోక్తులు వెలయఁగ నిట్టులనియె**

**(హర.ప్రథ.ఆశ్వా.8.పద్యం)**

నేను కమలనాభామాత్యుని పౌత్రుడిని, కవిరాజును, ఆపస్తంబసూత్రుడను, భరద్వాజ గోత్రం కలిగినవాడిని, సుజన మిత్రుడిని, పవిత్ర కులోద్భవుడిని, భీమాంబ మారయ కుమారుడిని, అఖిల పురాణ విద్యలందు నిష్ణాతుడిని, యజుర్వేద తంత్రాలను తెలిసినట్టివాడిని. ఆంధ్ర నైషధాన్ని రాసినట్టి వాడిని, సంస్కృత, ఆంధ్ర భాషలలో కవిత్వం చెప్పగల సమర్థుడినని నా బాల్యమిత్రుడు

అవచితిప్పయసెట్టి అన్నాడని తెలిపాడు. దీనిని బట్టి శ్రీనాథునికి అఖిల పురాణ విద్యలలో ఆరితేరిన వాడని చెప్పవచ్చు.

అలాగే శ్రీనాథుని శాస్త్ర పరిజ్ఞానాన్ని గురించే పొగుడుతూ హర విలాస కావ్యంలోనే మరొక పద్యంలో ఇలా దర్శనమిస్తుంది.

**తే॥ ఆగమ జ్ఞాననిధివి తత్త్వార్థఖనివి**
**బహు పురాణజ్ఞుఁడుడవు శుభ భవ్యమతివి**
**బాల సఖుఁడవు శైవ ప్రబంధ మొకటి**
**యవధరింపుము నా పేరనంకితముగ**

**(హర.ప్రథ.ఆశ్వా.12.పద్యం)**

ఆగమజ్ఞాననిధివి, పరమార్థతత్త్వం తెలిసినవాడివి, బహుపురాణాలు ఎరిగినట్టి వాడివని అవచితిప్పయ్య పొగిడినట్టుగా మనం గమనించవచ్చు. వీటన్నింటి దృష్ట్యా పరిశీలించితే శ్రీనాథునికి చాలా శాస్త్రపరిజ్ఞానం ఉన్నట్టుగా చెప్పవచ్చు. అతని రచనలు కూడా పాండిత్య ప్రకర్షకు ప్రతిబింబంలా ఉంటాయి. ఈ విధంగా శ్రీనాథునికి గల శాస్త్ర పరిజ్ఞానము చాలా గొప్పనైనదని బహుశాస్త్ర పారాయణము కలవాడని చెప్పవచ్చు.

### 1.3.4.2. బిరుదులు

శ్రీనాథుని పూర్తి పేరు 'శ్రీనాథ భట్ట సుకవి' గా పిలుస్తారు. ఇతని బిరుదు 'కవిసార్వభౌమ' అని అందరికి తెలిసినటువంటిదే. కవిసార్వభౌమ బిరుదును ప్రౌఢదేవరాయల ఆస్థానంలో ఉన్న కవి డిండిమభట్టు అనే పేరు గల 'అరుణగిరినాథుడిని' ఓడించి అతని కంచుఢక్కని పగులగొట్టించి పొందినట్లుగా శ్రీనాథుడే చెప్పుకున్నాడు. చంద్రభూషక్రియాశక్తి ఈ వాగ్వివాదానికి మధ్యవర్తిగా ఉన్నట్లు చెప్తూ దక్షిణాధీశుడుగా పిలువబడే రాజు ముత్యాలశాలలో "దీనారటంకాల" (నాణెములకు సంబంధించిన పేరు)తో స్వర్ణ స్నానం చేసినట్లుగా చెప్పాడు. ఒక చాటు పద్యంలో ఈ విషయాన్ని కవి ప్రస్తావిస్తూ ఇలా చెప్పుకొచ్చాడు.

**సీ॥ దీనారటంకాలఁ దీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల**
**పగులఁ గొట్టించి తుద్భటవివాద ప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క**
**చంద్రభూషక్రియాశక్తి రాయల యొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు**
**పలుకుఁ దోడై తాంధ్ర భాషా మహాకావ్య నైషధగ్రంథ సందర్భమునకు**
**గీ॥ నెటుల మెప్పించెదో నన్ను నింక మీఁద**

**రావుసింగమహీపాలు ధీవిశాలు**

**నిండు కొలువున నెలకొనియుండి నీవు**

**సరస సద్గుణ నికురంబ! శారదాంబ”**

**(చాటు.మణి.మొ.భా.297.పద్యం)**

ఇక్కడ “సార్వభౌమ” అనే పదాన్ని కవి వాడుతూ ఆ బిరుదును పొందినట్టుగా చెప్పడంతో పాటు శ్రీనాథుని రచనలను అంకితం తీసుకున్నవాళ్ళు వివిధమైన విశేషణాలతో బిరుదులతో పొగుడుతూ ఉండేవారని కవి స్వయంగా చెప్పుకున్నాడు.

**శా॥ బ్రాహ్మీదత్త వరప్రసాదుఁడ వురుప్రజ్ఞావిశేషోదయా**

**జిహ్మ స్వాంతుఁడ వీశ్వరార్చన కళాశీలుండ వభ్యర్థిత**

**బ్రహ్మాండాది మహాపురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత**

**బ్రహ్మ జ్ఞాన కళా నిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే!**

**(శృ. నై. ప్రథ.ఆశ్వా.13. పద్యం)**

మామిడి సింగన అన్నట్లుగా చెప్పబడింది. బ్రాహ్మీదత్త వరప్రసాదుడు, ఈశ్వరార్చన కళాశీలుడు అని బిరుదులు ఉన్నాయి. అలాగే హరవిలాసంలో అవచితిప్పయసెట్టి తన గురించి అన్నట్లుగా ఇలా చెప్పాడు.

**తే॥ ఆగమ జ్ఞాన నిధివి తత్త్వార్థఖనివి**

**బహుపురాణజ్ఞుడవు శుభభవ్యమతివి**

..... ..... ..... ..... ...... ..... .... .....

**(హర.ప్రథ.ఆశ్వా.12. పద్యం)**

ఆగమాలను ఎరిగినవాడు కనుక ‘ఆగమజ్ఞాననిధి’ అని తత్త్వాలను తెలిసినందున తత్త్వార్థఖని’ అని ప్రశంసించినట్లుగా హరవిలాసంలోని ఒక పద్యంలో కనిపిస్తుంది. ఇలా శ్రీనాథుడి పాండితీ ప్రకర్షకు ఇతరులు ఇచ్చిన బిరుదులుగా వీటిని చెప్పవచ్చు. అలాగే అఖిలపురాణ విద్యాప్రవీణుడిగా, అధర్వవేదశాఖాధీతి నిష్ణాతుడిగా, ఉభయభాషా కవిత్వ ప్రయోగ కుశలుడిగా పిలుస్తారు.

“ఉభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలుడు అన్నంతమాత్రాన ఆయన రెండు భాషల్లోను (తెనుగు, సంస్కృతము) కవిత్వం చెప్పాడనే అనుకోనక్కరలేదు. తనపూర్వంగల తెనుగు, సంస్కృత భాషలకు సంబంధించిన కవులందరి రచనలను తాను క్షోదక్షమంగా పరిశీలించినట్లు, వారివారి

ప్రయోగ విన్యాసాన్ని మనసుకు ఎక్కించుకున్నట్లు అవసర వేళల వారి రచనలలోని విలక్షణ ప్రయోగాలను తాను తన కావ్యాలలో ఉపయోగించుకున్నట్లు, అలా వారిపై భక్తి విశ్వాసాలను వ్యక్తం చేసినట్లుగా కూడా గ్రహింపవచ్చు. దీనికి ఆయన అన్ని కావ్యాలూ (లభ్యపడినవి) ఉదాహరణలే. వాటిని ఆయా కావ్యాలను ప్రత్యేకంగా పరిశీలించినపుడు గమనించవచ్చును. ఇక ఆయన ఆగమ జ్ఞాననిధి, తత్త్వార్థఖని, బహుపురాణజ్ఞుడని చెప్పడానికి ఇంతకు పూర్వం చెప్పినట్లు ఆయన అన్ని రచనలూ సాక్షమే" (ప్రభాకర శాస్త్రి, వేటూరి.2016.పుట.19) అని యార్లగడ్డ బాలగంగాధరరావు తమ అభిప్రాయాన్ని తెలిపారు. ఇవి శ్రీనాథునికి గల బిరుదులు, ప్రశంసలు.

### 1.3.4.3. కనకాభిషేకం

శ్రీనాథుడు కనకాభిషేకాన్ని పొందిన కవిగా చెప్తారు. అతనే స్వయంగా కాశీఖండంలో సప్తమాశ్వాసంలోని ఆశ్వాసాంత పద్యంలో ఇలా చెప్పాడు.

**శా॥ "కర్ణాట క్షితిపాల మౌక్తిక సభాగారాంతరా కల్పిత**
**స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధ కవిరాట్సంస్తుత్య చారిత్ర! దు**
**గ్ధార్ణోరాశి గభీర! ప్రాహ్ణముఖ మధ్యాహ్న పరాహ్ణార్చితా**
**పర్ణావల్లభ! రాజశేఖరమణీ! పంటాన్వయ గ్రామణీ!"**

**(కాశీ.సప్త.ఆశ్వాసాంతం)**

కర్ణాట సింహాసనాధీశ్వరుడైన రాజు ముత్యాలశాలలో సమకూర్చబడిన స్వర్ణాభిషేకమహోత్సవము చేత సకలలోక ప్రసిద్ధుఁడైన కవిసార్వభౌమునిచేత కొనియాడటానికి అర్హమైన చరిత్ర కలిగినట్టి వాడా! ఓ పంట నాయకుడా! అంటూ రాయవేశ్యాభుజంగుడుని పొగడుతున్న పద్యం ఇది.

ఇందులో శ్రీనాథుడు 'కర్ణాట క్షితిపాలుని' మౌక్తిక సభలో స్వర్ణస్నానం చేసినట్లుగా, తనకు కవిసార్వభౌమ బిరుదు ఉన్నట్లుగా తెలియజేశాడు. శ్రీనాథుడు బావమరిది అయిన దగ్గుపల్లి దుగ్గన కూడా నాసికేతోపాఖ్యానంలో

**"కవి సార్వభౌముడై కర్ణాట విభుచేతఁ**
**గనక రత్నాభిషేకములు గనిన**
**శ్రీనాథసుకవి............"**

**(నాసికేతోపాఖ్యానం.ప్రథ.ఆశ్వా.19 పద్యం)**

అని అంటాడు. దుగ్గన కూడా కనకాభిషేకం గురించి చర్చించాడు కనుక ఇది నిజమని నమ్మవలసిందే. అంతేకాకుండా శ్రీనాథుడు ఒక చాటుపద్యములో కూడా ఇలా చెప్పాడు.

**"దీనారటంకాలఁ దీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల**

**పగులఁగొట్టించి తుద్భట వివాద ప్రౌఢి, గౌడ డిండిమభట్టు కంచుఢక్క"**

**(చాటు.మణి.మొ.భా.297 పద్యం)**

ఈ పద్యములో శ్రీనాథుడు కనకాభిషేకాన్ని పొందిన విషయం ప్రస్తావించడం జరిగింది. ప్రౌఢదేవరాయల ఆస్థానంలో ఉన్న పండితుడైన అరుణగిరినాథున్ని తన పాండిత్యంతో ఓడించి సార్వభౌమ బిరుదుని పొంది, అతని కంచుఢక్కను పగులగొట్టించాడు. ఇంతకి ఆ కర్ణాటక్షితిపాలుడెవరు? అనే సందేహం ఏర్పడింది. అతను ఎవరో కాదు ప్రౌఢ దేవరాయలని ఒకచాటు పద్యములో శ్రీనాథుడే చెప్పాడు. ఆ సందేహాన్ని ఈ పద్యం ద్వారా తీర్చినట్లయ్యింది.

**సీ॥ పంపావిరూపాక్ష బహుజటాజూటికా రగ్వధ ప్రసవ సౌరభ్యములకు**

**తుంగభద్రాసముత్తుంగ వీచీఘటా గంభీర ఘుమ ఘుమారంభములకు**

**కలసాపుర ప్రాంత కదళీవనాంతర ద్రాక్షాలతాఫల స్తబకములకు**

**కర్ణాట కామినీ కర్ణహాటక రత్న తాటంకయుగ ధాళధళ్యములకు**

**నిర్నిబంధ నిబంధమై నెగడుకవిత**

**తెలుఁగునను సంస్కృతంబునఁబలుకనేర్తు**

**ప్రౌఢ దేవేంద్ర రాయ భూపాల వరుని**

**సమ్ముఖంబున దయఁజూడు ముమ్మసుకవి"**

**(చాటు.మణి.మొ.భా.371.పద్యం)**

ఈ పద్యంలో కర్ణాట ప్రభువును, ఆ ప్రాంతాన్ని, కదళీ, ద్రాక్షా వనాలను పొగుడుతూ ప్రౌఢదేవరాయల పేరును ఉచ్చరించాడు. ప్రౌఢదేవరాయలే కర్ణాట రాజు అని అర్థమయ్యింది.

కర్ణాట రాజ్యాన్ని పరిపాలించిన సింగమరాజులు నలుగురు ఉన్నారు. ఈ నలుగురిలో ఎవరనే సందేహం కలిగింది. పలువురు పండితులు పలురకాల చర్చలు చేసారు. వీరేశలింగం పంతులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, రెండవ దేవరాయలని చెప్పారు. నేలటూరి వేంకటరమణయ్య, చంద్రభూషక్రియాశక్తి, పేరు శాసనాలని ఆధారం చేసుకొని మొదటి దేవరాయలని చెప్పారు. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి మాత్రం వీరందరి అభిప్రాయాలను పరిశీలించి, అరుణగిరినాథున్ని బట్టి, కాశీఖండ భీమఖండ రచనలను బట్టి శ్రీనాథుడు రెండవ దేవరాయల

ఆస్థానంలో ఉన్న డిండిమభట్టు అనే పేరుగల అరుణగిరినాథున్ని ఓడించి కనకాభిషేకాన్ని పొందాడని చెప్పారు.

"శ్రీనాథుని భీమఖండ రచనా కాలము 1430వ సంవత్సరమని, కాశీఖండ రచనాకాలము 1433వ సంవత్సరమని పూర్వోక్తము. కాబట్టి శ్రీనాథుని కనకాభిషేక సత్కార కాలము, తన్మధ్యకాలమగుట తథ్యము. అనఁగా శ్రీనాథుని కనకాభిషేక సత్కారకాలము స్థూలముగా 1431వ సంవత్సరమగుట సంభవము. అప్పటికి 1360వ సంవత్సరము జననకాలమైన శ్రీనాథుని వయస్సు 71 సంవత్సరములు, 1380వ సంవత్సరము జనన కాలమగు అరుణగిరినాథుని వయస్సు 51 సంవత్సరములు నగుట స్పష్టము. శ్రీనాథుని వంటి పూర్ణపురుషాయషజీవి డెబ్బది సంవత్సరములు నిండిన వయస్సున నుద్భట ప్రౌఢ వివాదమునఁబాల్గొనుట విపరీతము కాదు. అంతేకాదు భీమఖండ రచనా కాలమునకుఁ దరువాత కాశీఖండ రచనాకాలమునకు ముందు శ్రీనాథుడు ఉద్భట వివాదప్రౌఢిని గౌడడిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టించుట చంద్రభూషక్రియా శక్తి రాయలయొద్ద కవిసార్వభౌమ బిరుదము పాదుకొల్పుట సంగతమే" (శ్రీరామమూర్తి, కొర్లపాటి.1971.పుట.260).

కొర్లపాటి శ్రీరామమూర్తి శ్రీనాథుని కనకాభిషేక కాలాన్ని 1431వ సంవత్సరంగా నిర్ధారించి 1406-1412లోని మొదటి దేవరాయల ఆస్థానం కాదని, క్రీ.శ.1422–1442 కాలానికి చెందిన రెండవ దేవరాయల కాలమని నిర్ధారించారు.

### 1.3.5. రాజకీయ విషయాలు

ఆంధ్రదేశాన్ని రెడ్డిరాజులు పరిపాలిస్తున్న సమయంలో క్రీ.శ. 1324–53 మధ్య కాలాన్ని ప్రోలయవేమారెడ్డి పాలించాడు. ప్రోలయ, అన్నమ అను దంపతులకు ఐదుగురు కుమారులు పుట్టారు. వారు 1) మాచారెడ్డి, 2) వేమారెడ్డి, 3) దొడ్డారెడ్డి 4) అన్నారెడ్డి, 5) మల్లారెడ్డి. ప్రోలయరెడ్డి కొడుకైన వేమారెడ్డినే ప్రోలయ వేమారెడ్డిగా పిలుస్తారు. ఈయన 1324 ప్రాంతంలో తన రాజ్యాన్ని స్థాపించుకున్నాడు.

"ప్రోలయ వేమారెడ్డి స్వరాజ్యమును స్థాపించుటలో నతని గురువు ఘోడెరాయ గంగయ కృపావిశేషము సహాయపడినది. శ్రీపర్వత పూర్వ పాదమునుండి పూర్వ సముద్రము వఱకు గుండి తరంగిణికి (గుండ్లకమ్మ నదికి) ఉభయ పార్శ్వములందు రెడ్డిరాజ్యము నెలకొన్నది. అది పూంగి విషయమని వ్యవహరింపఁబడినది. దానికి రాజధాని అద్దంకి. స్వరాజ్యమును స్థాపించుటలో వేమారెడ్డి ధ్యేయము వేదమతోద్ధరణము. కనుకనే పెక్కు యజ్ఞములు చేసి అనవరత పురోహిత

కృతసోమపాన నిర్మాణములు కావించెను. ఈ సోపాన నిర్మాణములకు శాసనములు, కావ్యములు, శాశ్వత కర్పూర నీరాజనములొఁసగినవి” (శ్రీరామ మూర్తి,కొర్లపాటి .1971.పుట.7).

ప్రోలయ వేమారెడ్డి అద్దంకిని రాజధానిగా చేసుకొని రాజ్యాన్ని పాలిస్తున్న సమయంలో చౌసీతి దుర్గాలను నిర్మించి, వాటికి అన్నదమ్ములను అధిపతులుగా చేసాడు. వేమారెడ్డి కన్న పెద్దవాడైన మాచారెడ్డి చందవోలు నగరాన్ని పరిపాలించాడు. వేమారెడ్డి కన్న చిన్నవాడైన మల్లారెడ్డి కందుకూరు దుర్గాన్ని పాలించాడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో దుర్గాన్ని పాలించారు. అయితే ప్రోలయవేమారెడ్డికి సంతానం మగపిల్లలు లేరు. అనుజుడైన అన్నారెడ్డి కొడుకులైన అనపోతారెడ్డి, అనవేమారెడ్డిని తన పుత్రులుగా చేసుకున్నాడు. అనపోతారెడ్డి క్రీ.శ.1353 నుండి 1364 వరకు పరిపాలించాడు. ప్రోలయవేమారెడ్డి తర్వాత రెడ్డిరాజ్యాన్ని కొండవీడును రాజధానిగా చేసుకొని కొండవీటి సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. ప్రోలయవేమారెడ్డి కొడుకుగా అనపోతారెడ్డి ఏ విధంగా కొండవీడును పరిపాలిస్తున్నాడో అదేవిధంగా మాచారెడ్డి కొడుకైన పెదకోమటీంద్రుడు ధనదపురిని పాలించాడు. అనపోతారెడ్డి తర్వాత అనవేమారెడ్డి 1364–1386 వరకు కొండవీటిని పాలించాడు. ఈ అనవేమారెడ్డికే వేమన్న అని పేరు ఉంది. ఇతనికి వసంతరాయలని బిరుదు కూడా ఉంది. అనవేమారెడ్డి తర్వాత 1386 నుండి 1442 వరకు కుమారగిరిరెడ్డి కొండవీటి సామ్రాజ్యాన్ని ఏలాడు. ఇతన్ని కర్పూర వసంతరాయలని అంటారు. అనవేమారెడ్డి వసంతోత్సవమనే సంప్రదాయాన్ని మొదటినుండి ఉన్నదాన్ని మళ్ళీ ప్రారంభిస్తే దానిని ప్రసిద్ధి చేసింది కుమారగిరిరెడ్డి. అనవేమారెడ్డి కాలంలోనే శ్రీనాథుడు ఉన్నట్లుగా చెప్తారు. కుమారగిరిరెడ్డి తర్వాత కొండవీటి సామ్రాజ్యాధిపతి పెదకోమటి వేమారెడ్డి అయ్యాడు.

### 1.3.5.1. పెదకోమటి వేమారెడ్డి

క్రీ.శ.1402 నుండి 1420 వరకు కొండవీటి రాజ్యాన్ని పెదకోమటి వేమారెడ్డి పరిపాలించాడని చెప్తారు. వంశానుక్రమంగా కొండవీటి ప్రాంతం ఇతనికి వచ్చింది కాదు. అతని భుజబల పరాక్రమంతో సంపాదించుకున్నది. కుమారగిరిరెడ్డి బావ అయినటువంటి కాటయవేమునితో కొండవీటి సింహాసనం కోసం యుద్ధం జరిగింది.

పెదకోమటి వేమారెడ్డి గొప్ప పండితుడు. ‘సాహిత్య చింతామణి’ అనే అలంకారశాస్త్ర గ్రంథాన్ని రాసాడు. అలాగే హాలుని గాథాసప్తశతిని క్లుప్తంగా ‘సప్తశతీసారము’ అనే కావ్యాన్ని రాసాడు. అలాగే సంగీత చింతామణి, వీరనారాయణ చరిత, పద్యకావ్యము కూడా ఇతని కృతులే. ఇతని ఆస్థానంలో మహాకవి పండితులు ఉండేవారు. “ఆంధ్రకవి సార్వభౌముడైన శ్రీనాథుడు,

సంస్కృతకవి సార్వభౌముడైన వామన భట్టబాణుఁడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానమున సూర్యచంద్రులు" (శ్రీరామమూర్తి, కొర్లపాటి. 1971. పుట.18).

పెదకోమటి వేమారెడ్డి కాలములోనే విద్యాధికారి అనే పదవి మొదలు పెట్టబడింది. శ్రీనాథుడు ఇతని ఆస్థానంలోనే విద్యాధికారిగా ఉన్నాడు. క్రీ.శ.1404 నుండి క్రీ.శ.1419 వరకు శ్రీనాథుడు ఇతని ఆస్థానంలోనే విద్యాధికారిగా ఉన్నాడని చరిత్ర ఆధారాల ద్వారా చెప్తారు.

పెదకోమటి వేమారెడ్డి తర్వాత కొండవీటి రాజ్యాన్ని క్రీ.శ.1420 నుండి క్రీ.శ.1424 వరకు రాచవేమారెడ్డి పాలించాడు. కొండవీటి రాజ్యాన్ని పెదకోమటి వేమారెడ్డి ఆక్రమించిన సమయములో కుమారగిరిరెడ్డి కొండవీటి సామ్రాజ్యాధిపతిగా ఉన్నప్పుడే అతని బావ అయిన కాటయ వేమారెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని సంపాదించిపెట్టాడు. కుమారగిరిరెడ్డి తన బావ అయిన కాటయ వేమారెడ్డికి రాజ్యాన్ని ప్రధానం చేయగా కాటయ వేమారెడ్డి సంతానం దానిని పాలిస్తుండగా, వారిలో కాటయరెడ్డి మొదలైన వారు మరణించారు. కూతురైన అనితల్లి వంశాంకురంగా ఉంది. అని తల్లి భర్త అయిన అల్లాడ వీరభద్రారెడ్డి, మామ అయిన అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని కాపాడారు.

"అల్లాడరెడ్డి మంత్రి అరియేటి లింగన. ఇతడు శ్రీనాథుని భీమఖండమునకు గృతిభర్తయైన బెండపూడి అన్నయమంత్రికి అగ్రజుడు. అల్లారెడ్డి విజయములీతని విజయములుగ భీమఖండమున వివరముగ గలవు" (శ్రీరామమూర్తి, కొర్లపాటి.1971.పుట.36) అని శ్రీనాథుడనే గ్రంథంలో చారిత్రక విషయాలను చెప్పారు.

అల్లాడరెడ్డికి కుమారులు నలుగురు. అందులో వీరభద్రారెడ్డికే కాశీఖండాన్ని అంకితం చేసాడు. శాసన ఆధారాల ద్వారా వీరికాలంలో శ్రీనాథుడున్నాడని, రెడ్డి రాజుల రాజ్యపాలనలో తన రచనలను వారికి అంకితం ఇచ్చినట్లు తెలుస్తుంది. వీరభద్రారెడ్డి ద్వారా ఆంధ్ర రాజ్యం వేరే రాజుల హస్తగతం అయ్యింది. అప్పటినుండి శ్రీనాథునికి కష్టాలు మొదలయ్యాయి.

ఆంధ్రదేశంలో కళలకు, సంస్కృతికి, సాహిత్యానికి విలువనిచ్చి వాటిని పోషించిన కాకతీయుల సామ్రాజ్యం అస్తమించిన తర్వాత తురుష్కుల విధ్వంస చర్యలను ఆపడానికి, ఆంధ్రదేశంలోని నాయకులందరూ కాపయ ప్రోలయ నాయకత్వంలో ఒక్కటిగా నిలబడి వారి దుశ్చర్యలను అడ్డగించారు. అలా రాజ్యాలను వారి బారినుండి కాపాడి రెడ్డిరాజ్య స్థాపన చేసారు. వారే రెడ్డిరాజులు. విజయనగర రాజులకన్నా ముందే హిందూధర్మాన్ని పరిరక్షించడానికి

పూనుకున్నటువంటి వాళ్ళు రెడ్డిరాజులు. అలాంటి రాజులను ఆశ్రయించిన గొప్ప పండితుడు శ్రీనాథుడు.

రెడ్డి రాజులలో వీరభద్రారెడ్డి తర్వాత ఇతనికి ఆశ్రయం ఇచ్చినవారు లేకపోగా దీనస్థితికి గురయ్యాడు. వివిధ రాజాస్థానాలకు వెళ్ళి సత్కారాలను పొందాడని అతని పద్యాలద్వారా మనకు విదితమే. ప్రౌఢరాయలను సర్వజ్ఞ సింగభూపాలుని వద్దకు వెళ్ళి సత్కరించబడ్డాడు. రాచకొండ, దేవరకొండ ప్రభువుల వద్దకు కూడా వెళ్ళి వచ్చాడు. పెదకోమటి వేమారెడ్డికి, దేవరకొండ ప్రభువులు శత్రువులుకాగా వేమారెడ్డి ఖడ్గాన్ని వాళ్ళు తీసుకొని వెళ్ళిపోతే, ఆ ఖడ్గాన్ని తీసుకురావడానికి శ్రీనాథుడు వెళ్ళాడని చెప్తారు. శ్రీనాథుడు తెచ్చిన ఖడ్గం పేరు నందికంటపోతరాజు, రాచకొండ ప్రభువైన వేదగిరినేని తమ్ముడు లింగమనేని మీద పద్యం చెప్పి దానిని తీసుకువచ్చినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తుంది. వారు ఇచ్చిన ఖడ్గాన్ని తీసుకొని పోగా దానికై రెండుసార్లు సింగభూపాలుని వద్దకు వెళ్ళినట్లు కథనం ఉంది.

రెండవ సర్వజ్ఞ సింగభూపాలుడు సింహాసనాన్ని క్రీ.శ.1425 ప్రాంతంలో అధిష్టించాడు. 1431లో శ్రీనాథునికి కనకాభిషేక సత్కారం కలిగినందున ఇతన్ని దర్శించే అవకాశం ఉందని భావించవచ్చు. “కాబట్టి శ్రీనాథుని వయస్సును బట్టి సింగమనాయకుని సందర్శనము సంశయార్హము కాదు. సమిష్టిపై శ్రీనాథుడు సర్వజ్ఞ సింగమనాయకుని సందర్శించిన కాలము 1435వ సంవత్సరము” (శ్రీరామమూర్తి, కొర్లపాటి.1971.పుట.274).

### 1.3.6. అవసాన దశ

వీరభద్రారెడ్డి తర్వాత రెడ్ల రాజ్యం అంతరించిపోయింది. రాజమహేంద్రవరం రెడ్ల చేతుల్లో లేదు. పెదకోమటి వేమారెడ్డి ఉన్నప్పుడు చాలా సుభిక్షంగా ఉన్న శ్రీనాథుడు కొండవీటి రాజ్యం అంతరించగానే కొంత కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నాడు. రాజమహేంద్రవరాన్ని పాలించిన వీరభద్రారెడ్డి ఆశ్రయమిచ్చిన సంతోషం తీరకముందే మళ్ళీ కొన్ని రోజులకు ఆ రాజ్యము కూడా కూలిపోయింది. వీరభద్రారెడ్డి చనిపోయాక కనీసం ఇరవై సంవత్సరాలైన శ్రీనాథుడు బ్రతికి ఉన్నాడని పండితులు అంచనా వేశారు. కుటుంబ భారము ఎక్కువైనందున, పొట్టకూటికై సంచరించాల్సి వచ్చింది. తర్వాత పంటమైలారురెడ్డి ఆశ్రయమిచ్చాడు. ఆయనకు ఏ కృతులు అంకితమిచ్చాడో లేదో తెలియదు. వాటికి సంబంధించిన ఆధారాలు లేవు. కానీ తన దీన స్థితిని తెలుపే ఒక ఒక చాటువులో మైలారు రెడ్డిని కూడా ప్రస్తావిస్తూ ఇలా అంటాడు.

సీ॥ "కాశికా విశ్వేశుఁగలిసె వీరారెడ్డి రత్నాంబరంబులేరాయడిచ్చుఁ

గైలాసగిరిఁ బంట మైలారు విభుఁడుండె, దినవెచ్చమేరాజు తీర్పగలఁడు

రంభఁగూడె దెనుంగు రాయరాహుత్తుండు, కస్తూరికేరాజుఁ బ్రస్తుతింతు

స్వర్గస్థుడయ్యె విస్సనమంత్రి మఱి హేమ పాత్రాన్నమెవ్వని పంక్తిఁగలదు

గీ. భాస్కరుఁడు మున్నెకదేవుని పాలికరిగె

కలియుగంబున నిఁకనుండఁ గష్టమనుచు

దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ

నరుగుచున్నాఁడు శ్రీనాథుడమరపురికి"

(చాటు.మణి.మొ.భా.370.పద్యం)

వీరభద్రారెడ్డి వెళ్ళిపోయాడు. వస్త్రాలు ఏరాజు ఇస్తాడు? రోజూవారి జీవితానికి ఎవరు సాయపడతారు? బంగారు పల్లెంలో ఎక్కడ భుజించాలి? గంధానికి ఏ రాజునడగాలి అంటూ వైభోగమైన జీవితాన్ని గూర్చి ఇందులో చర్చించాడు. ఇక్కడ పంటమైలారు విభుని ప్రస్తావన వచ్చింది. ఇక ఇక్కడ ఈ కలియుగంలో జీవించలేనంటూ గుండెలు అవిసేలా 'అరుగుతున్నాడు శ్రీనాథుడమరపురికి' అని హృదయ విదారకంగా చెప్పాడు. ఇది అతని చరమాంకం.

శ్రీనాథుడు తన జీవనం కొనసాగించడానికి కోసం కృష్ణాతీరంలో ఉన్న బొడ్డుపల్లి అనే గ్రామంలో గుత్తకు తీసుకొని వ్యవసాయం చేసాడని, ఆ పంట వరదకు కొట్టుకపోయిందని వ్యవసాయానికి పొలం ఇచ్చిన ప్రభువులకు ధనం ఇవ్వలేకపోతే వాళ్ళు చాలా బాధలకు గురి చేసారంటూ ఒక పద్యం దీనంగా వివరిస్తున్నట్లు కనిపిస్తుంది.

సీ॥ "కవిరాజు కంఠంబు కౌఁగిలించెను గదా పురవీధి నెదురెండబొగడదండ

సార్వభౌముని భుజస్తంభమెక్కెను గదా నగరివాకిట నుండు నల్లగుండు

వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత వియ్యమందెను గదా వెదురు గడియ

ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ దగిలియుండెను గదా నిగళయుగము

గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము

బిలబిలాక్షులు తినిపోయె దిలలుపెసలు

బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి

నెట్లు చెల్లింతు టంకంబు లేదునూర్లు"

(చాటు.మణి.మొ.భా.369.పద్యం)

నేను కవిరాజుని నామీద వీధిలోనున్న ఎండ కాస్తుంది, సార్వభౌమున్ని నేను ఈ రోజు నా భుజాలపైన పెద్దరాయిని పెట్టారు. ఆంధ్రనైషధ కావ్యాన్ని రాసిన ఈ చేతులకు బంధనాలు బిగింపబడినవంటూ కృష్ణానదీ వరదల్లో పొలము కొట్టుకపోయింది. బొడ్డుపల్లెను నమ్మి మోసపోయాను. ఎలా చెల్లించాలి? నేను ఏడునూర్ల టంకాలను అంటూ కవితాత్మకంగా హృదయంలో బాధని వ్యంగ్యపూరితంగా చెప్పాడు. అందుకేనేమో ఈ పైకాన్ని కట్టలేకే ఎవరిని నేను సాయం అడగాలంటూ 'కాశికా విశ్వేశు కలిసె వీరారెడ్డి' అను చాటువును చెప్పాడు.

చివరిదశలో దినవెచ్చం కోసం శ్రీనాథుడు వివిధ ప్రాంతాలను తిరిగాడు. పలనాటి సీమను చూసి అక్కడ నీళ్ళులేకపోతే దానిమీద ఒకపద్యం రాస్తూ, 'చిన్నచిన్నరాళ్ళు చిల్లర దేవుళ్ళు నాగులేటి నీళ్ళు నాఁపరాళ్ళు' అని అంటాడు. మొరస రాజ్యానికి కూడా వెళ్ళాడు. అది కర్నూలు మండలం. రెడ్డిరాజుల కాలంలో బహమనీరాజుల సహాయంతో అన్నదేవచోడుడు రెడ్లను జయించిన తర్వాత ఎక్కువకాలం రాజ్యం చేయలేదు. తర్వాత కృష్ణాతీర ప్రాంతం బహమనీ రాజులకాలంలో ఉన్నది. వీరి తర్వాత కపిలేంద్రగజపతి ఆధీనం అయ్యింది.

"చారిత్రక సమన్వయములను బట్టి కొండవీటి రాజ్యము 1450వ సంవత్సరము నాఁటికే కపిలేంద్ర గజపతి యధీనమైనట్లు స్పష్టము. అంతే కాదు1448వ సంవత్సరము నందు గోదావరీ మండలమును జయించిన కపిలేంద్ర గజపతి యాజైత్రయాత్రలోనే కృష్ణా గుంటూరు మండలమును సహితము జయించుట సహజము. కాబట్టి 1446వ సంవత్సరము నాటికే కపిలేంద్రగజపతి యేలుబడిలోనిదయి, కపిలేంద్రగజపతి ప్రతినిధి గణదేఁవుడో మఱొకఁడో శీనాథుని యవసానపద్యమునకు సంబంధించిన వ్యక్తి యగుట సంభవము, ఇందుకు 1454వ సంవత్సరము వఱకు శ్రీనాథుని కాలము పొడిగింపనక్కఱలేదు. కాబట్టి శ్రీనాథుని చరమ కాలమునకు 1450 సంవత్సరమే పూర్వావధి యగుట నిర్బాధకము"(1971.పుట.281) అంటూ కొర్లపాటి శ్రీరామమూర్తి 'శ్రీనాథుడు' అనే గ్రంథంలో శ్రీనాథుని జననకాలం క్రీ.శ.1360గా అవసాన కాలం 1450గా నిర్ధారించారు.

ఈ విధంగా శ్రీనాథుడుసర్వోన్నత స్థానాన్ని సాహితీ దిగ్గజాలలో ఆక్రమించి, వైభవోపేతమైన జీవితాన్ని గడిపి రాజుల రాజ్య ఆక్రమణలో భాగంగా సౌభాగ్యాన్ని కోల్పోయి కష్టాలను పడుతూ కూడా కవితాధారను విడువలేదు. అతని రచన ఉత్కృష్టమై చిరకాలంగా నిలిచి ఉండేటువంటిది.

### 1.3.7. శ్రీనాథుని రచనలు

శ్రీనాథుడు తెలుగులో తనదైన ప్రత్యేక ముద్రను వేసుకొన్న ప్రతిభాభాస్వంతుడు. ఉత్తమ సాహిత్యాన్ని వెలయించిన వాడు. అతడు రాసిన కావ్యాలు ఉత్కృష్టమైనవి, చిరస్మరణీయమైనవి కూడా. తను రాసిన రచనలను గురించి కాశీఖండంలో ఒక పద్యములో ఇలా చెప్తూ

**సీ॥ చిన్నారిపొన్నారిచిఱుతకూకటినాడు,రచియించితి మరుత్తరాట్చరిత్ర**
**నూనూగు మీసాల నూత్నయౌవనమున, శాలివాహన సప్తశతినొడితివి**
**సంతరించితి నిండు జవ్వనమునంబునయందు, హర్షనైషధకావ్యమాంధ్రభాష**
**బ్రౌఢ నిర్భరవయః పరిపాకమునఁగొనియాడితి భీమనాయకుని మహిమ**

**గీ॥ బ్రాయమింతకు మిగులఁగైవ్రాలకుండఁ**
**గాశికాఖండ మను మహాగ్రంథమేను**
**దెనుఁగుఁ జేసెదఁ గర్ణాటదేశ కటక**
**పద్మవనహేళి శ్రీనాథభట్టు సుకవి"**

**(కాశీ. పీ.7.పద్యం)**

శ్రీనాథుడు "చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు" మరుత్తరాట్చరిత్ర రాశాడని చెప్పాడు. చిరుతకూకటినాడు అంటే చిన్నపిల్లలకు చిగురు (లేత) వెంట్రుకలు ఉన్న సమయంలో అని అర్థం. అంత చిన్న వయస్సులో కావ్యాన్ని రాస్తాడా? అనే సందేహాన్ని వ్యక్తం చేసి పండితులంతా ఆ మాటకు తగు అర్థాన్ని చెప్పి వటువు దశ 11, 12 ఏళ్ళ ప్రాయం అని నిర్ణయించారు. శ్రీనాథుడు 12 ఏళ్ళ ప్రాయంలో రాసాడు. అప్పుడే మీసాలు వస్తున్న సమయంలో 'శాలివాహన సప్తశతిని రాసానని, యుక్తవయస్సులో భీమఖండాన్ని, వయస్సు వాలిపోయే దశలో కాశీఖండాన్ని రాసానని చెప్పాడు. శ్రీనాథుడు కాశీఖండం రాసేనాటికి ఈ ఐదు గ్రంథాలను రాసినట్లుగా చెప్పాడు. కానీ ఇవికాకుండా శ్రీనాథుని రచనలుగా చెప్పబడుతున్నవి ఉన్నవి. అందులో కొన్ని లభ్యాలు. మరికొన్ని అలభ్యాలు. శ్రీనాథుని కావ్యాలుగా 16 కావ్యాలు చెప్పబడుతున్నాయి. దానిలో కొన్ని లభ్యాలు కొన్ని అలభ్యాలు.

**లభ్య కావ్యాలు**

1) శృంగార నైషధం 2) భీమఖండం
3) కాశీఖండం 4) హరవిలాసం
5) పల్నాటి వీరచరిత్ర 6) శివరాత్రి మహాత్మ్యం 7) క్రీడాభిరామం.

**అలభ్య కావ్యాలు**

1) మరుత్తరాట్చరిత్ర 2) శాలివాహనసప్తశతి

3) పండితారాధ్య చరిత్ర 4) ధనుంజయ విజయం

5) నందనందన చరిత్ర 6) వల్లభాభ్యుదయం

7) మానసోల్లాసం 8) కాటమరాజు కథ 9) కామశాస్త్రం.

### 1.3.7.1. మరుత్తరాట్చరిత్ర

శ్రీనాథుని మొదటి రచన ఇది. "చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు" రచించానని శ్రీనాథుడే చెప్పడం వలన మొదటి రచనగా భావించడమైంది. కనీసం 12 ఏళ్ళ వయస్సు ఉంటుందని పండితులు చర్చోపచర్చలు చేసి 'చిఱుత కూకటి' అనే అర్థాన్ని బట్టి చిగురు వెంట్రుకలు గల సమయమని, ఎర్రన హరివంశంలో ఒకాకొక సందర్భంలో ఈ పద ప్రయోగం చేసాడని దానిని బట్టి వటుదశ అని పెద్దలు నిర్ణయించారు.

వివిధ అభిప్రాయాల తర్వాత చారిత్రక ఆధారాలను బట్టి మరుత్తరాట్చరిత్ర కాలం క్రీ.శ.1372వ సంవత్సరంగా కొర్లపాటి శ్రీరామమూర్తి శ్రీనాథుడు అనే గ్రంథంలో చెప్పారు. ఈ మరుత్తరాట్చరిత్ర అలభ్య కావ్యమని చెప్తారు.

మరుత్తరాట్చరిత్ర ఐతరేయ బ్రాహ్మణంలో ఉందని "బ్రహ్మ, బ్రహ్మాండ భాగవత, మత్స్య, మార్కండేయ పురాణములో కూడా ఉందని అన్నింట్లో ఒకే విధంగా, అన్నిట ఒకటి కాదని చెప్తారు. మార్కండేయ పురాణములోని మరుత్తరాట్చరిత్ర చిన్నారిపొన్నారి చిఱుత కూకటినాడు ఆకర్షించేది. భీమేశ్వర పురాణమునంలో నవమరుత్తు చరిత్రం అని ఉంది. కాని నవమరుత్తులు కనబడరు. మార్కండేయ పురాణాంతర్గతమైన ఉపాఖ్యానము నిమిత్తమాత్రముగ గైకొని, ప్రపంచీకరించిన స్వతంత్ర కావ్యమిది.

### 1.3.7.2. శాలివాహన సప్తశతి

శ్రీనాథుని రెండవ రచనగా దీనిని చెప్తారు. ఇది అలభ్యం. ఇందులో మూడు పద్యాలు మాత్రం లభిస్తున్నాయి. "ఆ గ్రంథము మనకు లభించు భాగ్యము రాలే. రానున్నదని పేరాసపడుదము గాక. శ్రీనాథుని తెలిగింపులుగా మనకిప్పటికి మూడు పద్యాలు దొరకినవి" (అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి, 1986.పీఠిక) అందులో ఒక పద్యం చూద్దాం.

**ఉ॥ వారణసేయఁదానిగొనవా, నవవారిజమందుఁ దేఁటి క్రొ**

**వ్వారుచునుంట నీవెఱుఁగవా, ప్రియ వాగంటిఁగంటికె**

వ్వారికిఁగెంపురాదె తగవామగవారల దూఱ నీ విభుం
డారసి నీ నిజం బెఱుఁగు నంతకు నంతకు నోర్వునెచ్చెలీ

(రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గాథాసప్తశతిసారం, పీఠిక)

దంతక్షతం అయిన పెదవిని చూసి భర్త ప్రశ్నిస్తుంటే, బెదురుపడే నాయిక గురించి చెప్పినటువంటి సందర్భంలోనిది ఈ పద్యం. ఈ కావ్యాన్ని శ్రీనాథుడు "నూనుగు మీసాల" వయస్సులో రాసాడని చెప్పాడు. అంటే పదహారు సంవత్సరాల ప్రాయంగా పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ఈ రచనా కాలం చరిత్ర ఆధారాలపరంగా శ్రీనాథుని జనన కాలం క్రీ.శ.1360 అనుకున్నాం కాబట్టి క్రీ.శ.1376గా చెప్పారు. సంస్కృతంలో హాలుడు రాసినటువంటి గాథాసప్తశతిని శ్రీనాథుడు తెలుగులో అనువాదం చేసాడు. దీనిని మామిడి వేమనకు అంకితమిచ్చినట్లుగా చెప్తారు.

"గాథాసప్తశతిలోని ప్రతిగాథ ధ్వని ప్రధానము. ఇంతరసవంతమైన, అంత ధ్వనివంతమైన శ్రీనాథుని శాలివాహనసప్తశతి తాళపత్రగ్రంథము తటిల్లతవలె తారాడి. అంతలోనే అంతర్ధానమైపోవు ఆంధ్ర సరస్వతి దురదృష్టము" (అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి, 1986.పీఠిక.) కొర్లపాటి వారు చెప్పుతూ హనుమకొండలో జరిగిన చారిత్రక వస్తు ప్రదర్శనలో శాలివాహనసప్తశతి తాళపత్ర గ్రంథం కనిపించింది. కానీ తర్వాత అంతర్ధానమయ్యిందని అన్నారు.

### 1.3.7.3. పండితారాధ్య చరిత్ర

శృంగార నైషధంలో పండితారాధ్య చరిత్ర ప్రస్తావన ఉంది. కాబట్టి నైషధానికి ముందు రాసినట్టుగా నిరూపించబడింది. దీని కాలం క్రీ.శ.1382గా నిర్ధారించారు. మామిడి ప్రెగడయ్యకు శ్రీనాథుడు ఈ కావ్యాన్ని అంకితం చేసాడు. ప్రస్తుతం అలభ్య కావ్యం. ప్రెగడయ్యకు కృతిని అంకితమిచ్చానని ఒక పద్యంలో ఇలా చెప్పాడు.

క॥ జగమునుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నాయనుంగుఁ బెద్దనకుఁగృతుల్
నిగమార్థసార సంగ్రహ
మగునాయారాధ్యచరిత మాదిగఁబెక్కుల్

(శృ.నై. ప్రథ.ఆశ్వా.14.పద్యం)

శైవమతంలో ఉన్న గొప్పనైన వారిని, పూజ్యులను ఆరాధ్యులని పిలుస్తారు. ఆ ఆరాధ్యుల చరిత్రలను చెప్పేదాన్ని అంటే పండితారాధ్య చరిత్రను ప్రెగడయ్యకు ఇచ్చానని చెప్పాడు.

### 1.3.7.4. శృంగారనైషధము

శ్రీనాథుడు 'నిండు జవ్వనంబున' రాసిన కావ్యం ఇది. మామిడి సింగనకు దీనిని అంకితం ఇచ్చాడు. సంస్కృతంలో హర్షుడు రచించినటువంటి నైషధాన్ని తెలుగులో శృంగార నైషధమనే కావ్యంగా రాసాడు. సంస్కృతంలోని నైషధానికి స్వతంత్రమైన ఆంధ్రీకరణ. శ్రీనాథుని ప్రతిభకు, పాండిత్యానికి, రసదృష్టికి సరిపోయే రచన. సంస్కృతంలో 22 సర్గలు, 2800 శ్లోకాలు ఉంటే 8 ఆశ్వాసాల్లో, 1300 గద్య పద్యాల్లో తెలుగు కావ్యాన్ని మలిచాడు.

అనువాదం ఎలా ఉంటే ఔచిత్యంగా ఉంటుందనే దాని గురించి శృంగార నైషధానువాద పద్ధతిని గురించి గ్రంథాంతములో అష్టమాశ్వాసంలో చెప్తూ... "అశేష మనీషి హృదయంగమంబుగా, శబ్దంబనుసరించియు నభిప్రాయంబు గుర్తించియు, భావంబుపలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యబాదరించియు, ననౌచిత్యంబు పరిహరించియు, మాతృకాసారంబునఁజెప్పబడిన" (అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి, 1986.పీఠిక.) అని అంటాడు. అనువాదం ఈ విధంగా ఉండాలని చెప్పాడు. శ్రీనాథుడు నిండుజవ్వనంబున అనటం వలన యౌవనం నిండుగా ఉన్నప్పుడు అంటే సుమారు 35 సంవత్సరాలకు ఎక్కువ అయ్యి ఉంటుందని, చారిత్రక ఆధారాల వలన నైషధ కాలాన్ని నిర్ణయించి క్రీ.శ.1395వ సంవత్సరాన్ని శృంగార నైషధ కావ్యరచన కాలంగా గుర్తించారు. ప్రబంధ లక్షణాలు గల ఉత్కృష్ట గ్రంథం కనుక నైషధాన్ని తెలుగులో పంచమహాకావ్యాల్లో ఒకటిగా చెప్తారు.

ఈ నైషధ కావ్యాన్ని యధావిధిగా మూల గ్రంథంలో ఉన్నది ఉన్నట్లుగా రాసి సంస్కృత పదాలకు తెలుగు ప్రత్యయాలైన డు,ము,వులు మాత్రమే చేర్చాడని శ్రీనాథున్ని డు,ము,వుల కవి అంటారు. సంస్కృత పండితులు నువ్వు యధావిధిగా కావ్యాన్ని రాసావు. మా నైషధాన్ని మాకు ఇచ్చేయ్ అన్నారనే కథ కూడా ప్రచారంలో ఉంది.

ఒక సందర్భంలో నలుడు నానాదేశాలను తిరుగుతూ ఉన్నాడని చెప్పుతూ మూల గ్రంథంలో ఒక శ్లోకం ఉంది. దానిని శ్రీనాథుడు ఏ విధంగా రాసాడో చూద్దాం.

**మూలం: "సరసీః పరిశీలితుం మయా గమికర్మీ కృతనైకనీవృతా**

**అతిథిత్వమనాయి సాదృశో స్సదసత్సంశయగోచరోదరీ"**

**(శృంగారనైషధం, పుట.13)**

అనేక సరస్సులను పరిశీలిస్తూ ఉండగా అసలు ఉందో లేదో అనిపించే నడుముగల దాన్ని చూశానని చెప్పడం ఈ శ్లోకభావం.

దానిని శ్రీనాథుడు ఇలా అనువదించాడు.

**మ॥ మృదురీతిం బ్రతివాసరంబు గమికర్మీభూత నానా నదీ**
**నద కాంతార పురీ శిలోచ్చయుఁడ నైనై కాద్భుత శ్రీజిత**
**త్రిదివంబైన విదర్భ దేశమున నారీరత్నముం గాంచితిన్**
**సదసత్సంశయ గోచరోదరి శరత్సంపూర్ణ చంద్రాననన్**

**(శృ.నై. ద్వితీ.ఆశ్వా.20.పద్యం)**

ఏ పని కోసం అయితే వెళ్ళానో అక్కడ విదర్భదేశం ఉంది. ఆ దేశంలో నడుము ఉన్నదా లేదా అనే అనుమానం కలిగే ఒక అందమైన స్త్రీ కనిపించింది. అని చెప్తూ యథామూలంగా ఉన్న 'గమికర్మీభూత' పదాన్ని, 'సదసత్సంశయ గోచరోదరి' అనే సమాసాలను వాడాడు. ఇలా మూలంలోని పదాలని వాడాడు కనుకే కేవల ప్రత్యయాలను చేర్చే డు,ము,వుల కవి అన్నారు. నారికేళపాకంలో ఉన్న ఈ రచన ఎనిమిది ఆశ్వాసాల గ్రంథం. దీనిలో నలదమయంతుల ప్రేమ, వివాహాది విషయాలు వర్ణితం.

### 1.3.7.4.1. శృంగారనైషధము–కావ్యసారం

దేవుని స్తుతితో ప్రారంభమవుతుంది. విష్ణువు, శివుడు, బ్రహ్మ, గణపతి దేవుళ్ళ స్తుతి ఉంటుంది. తర్వాత ఆదికవులైన వ్యాస, వాల్మీకి, భట్టబాణ, మయూర, భాస, సౌమిల్లక కవులను, కాళిదాసు, రాజశేఖరుడు, నన్నయ, తిక్కన, ఎర్రనలను స్తుతించాడు. కృతిపతియైన మామిడి సింగన ప్రశంస, షష్ఠ్యంతములు ఉంటాయి. **ప్రథమాశ్వాసంలో** కథా ప్రారంభంలో నలమహారాజు వర్ణనతో బహుపరాక్రమమంతుడని, అష్టాదశ ద్వీపములను జయించినవాడని తెలుపుతాడు. దమయంతి తండ్రి ఉన్న స్థలానికి వెళ్ళడం అక్కడ నానా రాజుల గురించి ఒక స్త్రీ పాడటం, అందులో దమయంతికి నలుని ప్రస్తావన విన్నప్పుడు మేను పులకరించడం, అపుడు నలునియందు ఆమె అనురక్త కావడం, నలుడు కూడా దమయంతి యందు అనురక్తుడు కావడం తర్వాట వనవిహారానికి వెళ్ళినపుడు హంసను చూసి పట్టుకోబోవడం, హంస ప్రార్థించగా దానిని విడిచిపెట్టడం అనే ఘట్టాలు ఉన్నాయి.

**ద్వితీయాశ్వాసం**లో నలునిచేత విడిచిపెట్టబడిన హంస కృతజ్ఞత చూపించడం, హంసను దమయంతి దగ్గరకు నలుడు దూతలాగా పంపించగా అది అక్కడికి వెళ్ళటం, దౌత్యం నిర్వర్తించటం, స్వయం వరాన్ని చాటటం అనే విషయాలు ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

**తృతీయాశ్వాసంలో** నారదుడు, పర్వతుడు ఇంద్రుడి దగ్గరకు వెళ్ళి దమయంతి స్వయంవరం గురించి చెప్పగా, ఇంద్రాదులు స్వయం వరానికి వెళ్ళడానికి పూనుకొని, నలున్ని కలిసి వారిస్వయం వరానికి నలున్ని దూతగా పంపడం కనిపిస్తుంది.

**చతుర్థాశ్వాసంలో** నలుడు ఇంద్రాదుల కోసం దూతము చేయడానికి వస్తాడు. దమయంతిని చూసి మరచిపోయి తన పేరు నలుడని చెప్తాడు. ఎంతో మందికి వరాలిచ్చే రాజువి నన్ను పెళ్ళి చేసుకోవచ్చు గదా! ఆ వరాన్ని నాకివ్వచ్చు కదా అని చెలికత్తె మాటల ద్వారా చెప్పిస్తుంది. తర్వాత నలుని మాటలకు దమయంతి చింతించడం నలుని మనశుద్ధికి దేవతలు ఆనందపడటం, దమయంతి తండ్రి భీముడు సరస్వతిని ప్రార్థించడం ఆమె ప్రత్యక్ష్యం కావడం అనే ఘట్టాలు ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

**పంచమాశ్వాసంలో** దమయంతి స్వయంవరం జరిగే చోటుకి వస్తుంది. రాజులందరూ కూడా దమయంతి సౌందర్యాన్ని చూసి అతిశయాన్ని పొందుతారు. సరస్వతీదేవి వరసగా ఉన్న రాజులను గూర్చి వర్ణించి చెప్తుంది. కానీ దమయంతి అంత మందిలో కూడా నలున్ని అతని పాదాలను మెడలో ఉన్న హారాన్ని, కన్నులను చూసి నలుడని గుర్తిస్తుంది. ఈ ఘట్టాలు ఐదవ ఆశ్వాసంలో ఉన్నాయి.

**షష్ఠ్యాశ్వాసంలో** దమయంతి నలున్ని గుర్తించి అతన్ని వరిస్తుంది. దేవతలంతా నూతన దంపతులకు వరాలిస్తారు. సరస్వతీదేవి నలునికి చింతామణి అను ఉత్తమమైన మంత్రాన్ని చెప్తుంది. నలుని వివాహము, పువ్వపుబంతి జరగడం ఇవన్నీ కూడా ఆరవ ఆశ్వాసంలో ఉన్న ఘట్టాలు.

**సప్తమాశ్వాసంలో** నలుడు దమయంతిని తన రాజధానికి తీసుకెళ్ళడం, నగర ప్రవేశం చేయడం, నలదమయంతుల గృహ ప్రవేశం విహార విషయాలు సప్తమాశ్వాసంలో ఉన్నాయి.

**అష్టమాశ్వాసంలో** ఇందులో వైతాళిక గీతాలను గురించి, నలదమయంతుల గోష్ఠిని గురించి, దేవతల పూజల గురించి, దశావతార వర్ణన గురించి చెప్పి కావ్యాన్ని ముగించడం జరుగుతుంది. ఇలా కవి పాండిత్యాన్ని, రసదృష్టిని శబ్దార్థ కల్పనా చాతుర్యాన్ని చూపించిన కావ్యం కనుక "నైషధం విద్వదౌషధం" అన్నారు. శ్రీనాథుని రచనల్లో ప్రసిద్ధి చెందినట్టి కావ్యాల్లో శృంగార నైషధం కూడా ఒకటి.

### 1.3.7.5. హరవిలాసం

శ్రీనాథుని కావ్యాల్లో హరవిలాసం ఒకటి. "ఆంధ్రభాషా నైషధాబ్జభవుడని" శ్రీనాథుడు దీని పీఠికలో పేర్కొనడంచేత యిది నైషధం తర్వాతి రచన అని చెప్పవచ్చును. కొండవీడు సామ్రాజ్య

పతనానంతరం శ్రీనాథుడు క్రీ.శ.1427 ప్రాంతంలో కంచిలో ఉన్న తిప్పయ సెట్టి దగ్గరకు పోయి హరవిలాసం చెప్పాడని విమర్శకుల అభిప్రాయం. "హరవిలాసం పీఠికను బట్టి తిప్పయ్యసెట్టి కుమారగిరిరెడ్డి రాజ్య కాలంలోనేగాక తత్పూర్వం కూడా వాణిజ్య వ్యాపారాలను చేసినట్లుగా తెలుస్తుంది. హరవిలాసం నాటికి అతడు "మంటిబహు వత్సరంబులనడంచేత అప్పటికి 80-85 సంవత్సరముల వాడని చెప్పవచ్చును" (సుజాతారెడ్డి, ముదిగంటి.1980.పుట.15).

శ్రీనాథుడు అవచితిప్పయ్యసెట్టికి హరవిలాసాన్ని అంకితమిచ్చాడు. "అవచితిప్పయ్యసెట్టికి శ్రీనాథుడు బాలసఖుడని హరవిలాసంలో ఉంది. ఇక్కడ బాలసఖుడు బాల్యసఖుడని అర్థము కాదు. బాలుడైన సఖుడని అర్థమని చెప్తారు.

### 1.3.7.5.1. హరవిలాసం–కావ్యసారం

**ప్రథమాశ్వాసంలో** మొదట ఇష్టదేవతా స్తుతి, కృతిభర్త ప్రశస్తి ఉంటుంది. అవచి తిప్పయ్య బాల్య మిత్రుడైన తనకు ఒక శైవ ప్రబంధాన్ని అంకితముగా ఇవ్వమని కోరుతాడు. దుర్వాసముని తుంబురున్ని శపించటం, చిరుతొండనంబి శైవ భక్తి, నంబి ఇంటికి మిండ జంగముని రాక ఇవన్నీ ప్రథమాశ్వాసంలో ఉన్నాయి.

**ద్వితీయాశ్వాసంలో** చిరుతొండనంబి జంగమారాధనను శివుడు పార్వతికి తెలియజేయుట, వర్షాకాలంలో నంబి అన్నదానం చేయుట, ఒకగుడిలో వృద్ధుని భోజనానికి పిలువగా అతడు కపటంతో నంబి పుత్రున్ని చంపి వండిన మాంసంతో భోజనం కోరుట, సిరియాలుని మాంసాన్ని శివయోగికి వడ్డించుట, శివుడు ప్రత్యక్షమై నంబి దంపతులకు కైలాసాన్ని ప్రసాదించుట అనే ఘట్టాలు ఇందులో కలవు.

**తృతీయాశ్వాసంలో** తారకాసురుని ఆగడాలు పెరిగిపోయి దేవతలను పీడించుట, బ్రహ్మ దేవతలకు అభయమిచ్చుట, పార్వతి జననం, శివునికై పార్వతీ తపస్సు చేయడం, మన్మథుడు శివునిపైసమ్మోహనాస్త్రం వేయటం, శివుడు మన్మథున్ని భస్మం చేయటం అనే ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**చతుర్థాశ్వాసం**లో శివుని కోసం పార్వతి తపస్సు చేయటం, వటువు రూపంలో శివుడు పార్వతి వద్దకు రావటం, కపట వటువు శివున్ని నిందించుట, శివనిందకు పార్వతి కోపించుట, కపట వటువు శివుడై సాక్షాత్కరించుట, హిమవంతుడు గిరిజా కళ్యాణం శివునితో ఓషధిప్రస్థ పురంలో చేయడం అనే ఘట్టాలు ఇందులో కలవు.

**పంచమాశ్వాసంలో** శివగణాల ధూర్తవర్తన, దేవదారు వనవిహారం, శివుడు మిండజంగముని రూపంలో భిక్షాటనం చేయడం, లింగోద్భవం అనే ఘట్టాలు ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

**షష్ఠ్యాశ్వాసం**లో నీలకంఠేశ్వరుని కంఠనీలిమకు కారణం, క్షీరసాగర మథనం, హాలాహల ఉద్భవనం, ధన్వంతరి పూర్ణ కుంభముతోనావిర్భవించటం, విష్ణువు మోహినీ రూపాన్ని ధరించటం అనే ఘట్టాలు ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

**సప్తాశ్వాసంలో** అర్జునుడు ఇంద్ర కీల పర్వతం పై తపస్సు చేయటం, అర్జునుని పాశుపత దీక్ష, శివ పార్వతులు చెంచు చెంచెతలై వచ్చుట, కిరాతుడు, అర్జునుడు బాణ ప్రయోగాల చేత వరాహాన్ని హతమార్చుట, శివార్జునుల పోరాటం శివ సాక్షాత్కారం, శివుడర్జునకు పాశుపతాస్త్రం ఇచ్చుట అను అను ఘట్టాలు ఈ ఆశ్వాసంలో ఉన్నాయి.

గౌరీ కళ్యాణ ఘట్టాన్ని కాళిదాసు కుమార సంభవం నుండి గ్రహించాడు. దారువనవిహారం బ్రహ్మండ పురాణప్రోక్తమైనటువంటిది. సముద్ర మథనకథ భారతం, భాగవతాది పురాణ ప్రసిద్ధము. కిరాతార్జునీయ కథ భారతం నుండి గ్రహించినటువంటిదని అంటారు. అలాగే సంస్కృత కిరాతార్జునీయం అనుసరణ అని అంటారు.

### 1.3.7.6. ధనంజయ విజయం

ఈ కావ్యంపేరు కూడా తన రచనల గూర్చి చెప్పిన పద్యంలో చెప్పలేదు. ఇది అలభ్య కావ్యం.శ్రీనాథుడు ఈ కావ్యాన్ని గన్నభూపాలునికి అంకితమిచ్చాడు. కావ్యం పేరునుబట్టి యిది అర్జునుడు, శివుని మెప్పించి పాశుపతాస్త్రం పొందే కథ అని తెలుస్తున్నది. కిరాతార్జునీయ కథను హరవిలాసంలో సంగ్రహంగా రచించడంతో తృప్తిపడక శ్రీనాథుడు ప్రత్యేకంగా ఒక కావ్యంగా రచించి ఉంటాడని, హరవిలాసంలోని యితివృత్తం ఎక్కువగా భారతారణ్య పర్వంలోని ఇతివృత్తాన్ననుసరించి వున్నదని, ఒకవేళ దీన్ని శ్రీనాథుడు భారవీకృత కిరాతార్జునీయానికి అనువాద రూపంగా రాసాడని చర్చలు ఉన్నాయి.

### 1.3.7.7. నందనందన చరిత్ర

ఇది కూడా శ్రీనాథుని రచనగా చెప్తారు. కానీ ఇప్పుడిది లభించడం లేదు. శైవ రచనలు చేసే శ్రీనాథుడు విష్ణుసంబంధమైన రచనలు చేస్తాడా? అసలది శ్రీనాథుని రచనా? కాదా? అనే సందేహాలున్నాయి. ఇది శ్రీనాథుని రచననే అటూ భీమఖండంలో రాధామాధవ స్తవము ఉండటం వలన శ్రీనాథుని రచనగా గుర్తించారు. ఆ పద్యం చూద్దాం.

"వాలికమోము మత్తవనబర్హి కిశోరక లాస్యలోలఁబై
వాలిచి పచ్చకప్పురపు వాసనతోడి ముఖారవిందతాం
బూలపుమోవి మోవిపయి మోపుచు రాధకు నిచ్చు ధూర్తగో
పాలుఁడు ప్రోచు గావుత మపారకృపామతి మంత్రియన్ననిన్"

(భీమే.ప్రథ.ఆశ్వా.3.పద్యం)

నెమలి పిల్ల లాంటి లాస్యవిన్యాసం కలిగి ముఖం కలిగిన రాధకు, పచ్చకప్పురంతో గుభాలించే పెదవి ముద్దుకై ఇచ్చే శ్రీకృష్ణుడు. అన్నయ మంత్రిని రక్షించాలని దీని భావం. "తెలుగు సాహిత్యమునందు రాధాకృష్ణుల శృంగారము మొదటగా ఈ పద్యమునందే కన్పించుచున్నది రాధాకృష్ణుల శృంగారమును తెలుగు సాహిత్యమున ప్రవేశపెట్టిన ఘనత శ్రీనాథ మహాకవిది" (లక్ష్మీనారాయణ, గుండవరపు.1997.పుట.4).

"గణపవరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగ రత్నాకరంలోను, కస్తూరిరంగకవి ఆనందరంగరాట్ఛందంలోను దీని ప్రసక్తి ఉన్నది. వీరేశలింగంగారు పేరునుబట్టి (వైష్ణవం కావటంచేత) ఇది శ్రీనాథుని రచన కాకపోవచ్చుననిరి. చా. శేషయ్యగారు–శ్రీనాథుడు దీన్ని వ్రాసి పంట మైలారురెడ్డికి అంకితమిచ్చి ఉంటాడనిరి. శ్రీనాథుని చాటువును బట్టి, పంటమైలారురెడ్డి అతనికి దినవెచ్చమిచ్చినాడని తెలుస్తున్నది. మైలారురెడ్డి వైష్ణవప్రీతి కలవాడు కావడంచేత శ్రీనాథుడు దీన్ని వ్రాసి అతనికి అంకితమిచ్చినాడేమో. శీనాథుని నాడు శైవ, వైష్ణవాలకు అంతవైరం ఉన్నట్లు కానరాదు" (సుజాతారెడ్డి, ముదిగంటి.1980.పుట.17).

నందనందన చరిత్ర శ్రీనాథుడే రాసాడని పెద్దలు నిర్ణయించారు. భీమఖండంలోని పద్యాన్ని నిదర్శనంగా చూపెట్టారు. "ఇందు రాధామాధవుల శృంగారము గలదు. అది నందనందన చరిత్రమే. ఆంధ్ర సాహిత్యము సామస్త్యము మీద ప్రథమతః రాధామాధవ స్తవము ప్రత్యక్షమగునది శ్రీనాథుని భీమఖండమునందే" (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల.1982. పుట.77) ఇలా నందనందన చరిత్రను శీనాథుని కృతి అని అంత విశ్వసించారు. దీనికాలం క్రీ.శ.1426గా కొర్లపాటి శ్రీరామమూర్తి అభిప్రాయపడ్డారు.

### 1.3.7.8. వల్లభాభ్యుదయం

"శ్రీనాథుడు రచించిన కృతులలో 'వల్లభాభ్యుదయము మొకటి. అది నేడు అనుపలబ్దము, పేరునుబట్టి వల్లభాభ్యుదయము విష్ణుపరమైన కావ్యమని ఊహింపవచ్చును. శ్రీకాకుళమునందలి

ఆంధ్ర వల్లభుని మహిమను కొనియాడునది కావచ్చును. ఆంధ్రవల్లభుడు విష్ణువే" (1982.పుట.76) అని జంధ్యాల జయకృష్ణ బాపూజీ వివరించారు.

ఇలా వల్లభాభ్యుదయం శ్రీనాథుడు రాశాడా? లేదా? ఎవరికి అంకితమిచ్చాడనే విషయాలు చర్చకు వచ్చాయి.పెదపాటి జగన్నాథకవి తన సంకలన గ్రంథం ప్రబంధరత్నాకరంలో దీనిలోని పద్యాన్నొక్కదాన్ని ఉదహరించాడు. అది శ్రీనాథుని సీస పద్యమని, నడకను బట్టి గుర్తించడింది. 'అక్షయ్యంబున సాంపరాయని తెలుంగాధీశ! అని తన చాటు ధారలో పేర్కొన్న తెలుగు రాయల కోరికమీద ఈ కావ్యాన్ని శ్రీనాథుడు వ్రాసినాడేమోనని కొర్లపాటి శ్రీరామమూర్తిగ అభిప్రాయం. క్రీ.శ.1428 దీని రచన కాలమని వారి నిర్ణయం.

ఇలా వల్లభాభ్యుదయ కాలాన్ని పెద్దలు వారివారి అభిప్రాయాల ద్వారా తెలుపుతూ శ్రీనాథుని రచనగా గుర్తించారు. ప్రస్తుతం అది అలభ్య కావ్యం.

### 1.3.7.9. భీమేశ్వర పురాణం

శ్రీనాథుడు తన రచనల గురించి చెప్తూ "ప్రౌఢ నిర్భరవయఃపరిపాకమునఁ గొనియాడితి భీమనాయకుని మహిమ" అని తెలిపాడు. "పూర్ణ పురుషాయుష జీవితమునందు తొలి పాతిక సంవత్సరములు (1–25) బాల్యదశ. మలి పాతిక సంవత్సరము (26–50) యౌవనదశ. తదుపరి పాతిక సంవత్సరములు (51–75) ప్రౌఢదశ. తుది పాతిక సంవత్సరములు (76–100) వార్ధిక దశ. ప్రౌఢ దశలో (51–75) పరిపాక వయస్సు 70 సంవత్సరముల ప్రాంతము. శ్రీనాథుని జనన కాలము 1360 ప్రాంతము కావబట్టి భీమేశ్వర పురాణ రచనా కాలము 1360 + 70 = 1430 ప్రాంతము కావచ్చని కొర్లపాటి శ్రీరామమూర్తి అంచనా వేసారు.

భీమేశ్వర పురాణాన్ని భీమఖండం అని కూడా పిలుస్తారు. ఈ గ్రంథంలో 159 సీస పద్యాలను రాసాడు. వాటికింద తేటగీతినే వాడాడు. కానీ ప్రత్యేకంగా 16 ఆటవెలదులను వాడాడు.ఈ భీమేశ్వర పురాణం స్కాంధ పురాణంలోని గోదావరి ఖండంలోని భీమఖండం నుండి తీసుకోబడినట్టి కథ. దానిని గూర్చి చెప్తూ మొదటి ఆశ్వాసంలోని వచనంలో ఇలా కవి వివరిస్తాడు.

"శ్రీ మహాస్కాందంబును నాది పురాణంబునందు గోదావరీ ఖండంబు శ్రీమద్దాక్షరామ భీమేశ్వర మహత్మ్య సంయుతంబగుటఁ జేసి భీమేశ్వర పురాణంబనంబరఁగు నది యాంధ్ర భాషా ప్రబంధంబుగఁ జెప్పఁదొడంగితి" (భీమే.ప్రథ.ఆశ్వా.వ.30) ది పురాణం అని చెప్పబడే స్కాంద పురాణంలో గోదావరి ఖండం ఉంటుంది. అందులో శ్రీదాక్షారామ భీమేశ్వరుని మహాత్మ్యముతో కూడి ఉన్న భీమేశ్వర పురాణం ఉంటుందని దానిని తెలుగులో ప్రబంధ కావ్యంగా రచిస్తానని

శ్రీనాథుడు పై వచనంలో పేర్కొన్నాడు.ఈ గ్రంథాన్ని 'వీరభద్రారెడ్డి మంత్రియైన బెండపూడి అన్నయ'కు అంకితం ఇచ్చాడు.

భీమేశ్వర పురాణము ఆరు ఆశ్వాసాల కావ్యము. ఈ కావ్యంలో దాక్షారామంలోని భీమేశ్వరుని గూర్చి చెప్పబడింది. వ్యాసుడు భిక్ష దొరకక కాశీని శపించాలనుకోగా, కాశీ విశ్వేశ్వరుడు కోపంతో కాశి నుండి వెళ్ళిపొమ్మంటాడు. అప్పుడు వ్యాసుడు వెళ్ళబోతుండగా పార్వతీదేవి దాక్షారామానికి వెళ్ళమని చెపుతుంది. అక్కడికి వెళ్ళే మార్గంలో అగస్త్యుడు కలుస్తాడు. వాళ్ళిద్దరు కూడా దాక్షారామ భీమేశ్వరుని వద్దకు వెళ్ళి దర్శించుకుంటారు. ఇది ఈ కావ్యంలోని కథాసార సంగ్రహం.భీమేశ్వర పురాణం ఆంధ్రీకరణ కాదు. ఇది ఒక స్వతంత్ర కావ్యమని, అందులోని వర్ణనల వల్ల అలా అనిపించి ఉండవచ్చనని చెప్తారు.

"శ్రీనిడదవోలు వెంకటరావుగారు శ్రీ బండారు తమ్మయ్యగారి – 'శ్రీనాథమహాకవి' అను గ్రంథమునకు వ్రాసిన 'మున్నుడి'లో శ్రీనాథుని కృతులలో సంపూర్ణముగా స్వతంత్రాముద్రగల రచన భీమఖండము. దాక్షారామ భీమేశ్వర మహాత్మ్యము తొలిసారిగా, కడపటిసారిగా దానిని తెలుగు వారికందించిన కవి శ్రీనాథుడు" (లక్ష్మీనారాయణ, గండవరపు.1997.అనుశ్రుతి) అని బండారు తమ్మయ్యగారి మాటలని నిడదవోలు వెంకటరావుగారు తెలియజేసినట్లుగా భీమఖండం పీఠికలో లక్ష్మీనారాయణ తెలియజేసారు.

### 1.3.7.9.1. భీమేశ్వర పురాణం–కావ్యసారం

**ప్రథమాశ్వాసంలో** దక్షారామ భీమేశ్వరుని స్మరించడం, తరువాత ఇష్టదేవతలైన, వినాయక, సరస్వతి మొదలగు దేవతల ప్రార్థన ఉంటుంది. పూర్వకవులైన కాళిదాసు మొదలగు సంస్కృత కవులను నన్నయ, తిక్కనను స్మరించడం, కవితా లక్షణాలను చెప్పుతూ "హరచూడా హరిణాంక వక్రత..." అంటూ వక్రత, కాఠిన్యం, సరసత్వం అను కవితాగుణాలను చెప్పడం కనిపిస్తుంది. బెండపూడి అన్నయ గూర్చి, వేమభూపాలుని వంశ వర్ణనను, అన్నయ వంశ వర్ణనను చెప్పుతూ, షష్ఠ్యంతాలు చెప్పటం తర్వాత కథ ప్రారంభం చేస్తూ దక్షారామ పుర వర్ణనలు, అక్కడ పూలను గురించి చెప్పడం జరుగుతుంది. తర్వాత కథ మొదలవుతుంది. సూతుని దగ్గరకు శౌనకాది మునులు వచ్చి గోదావరి స్కాందంలోని భీమఖండం గురించి చెప్పమనగా, అందులో ఎన్నో కథలు ఉన్నాయంటూ, దక్షరామ భీమేశ్వరుని గురించి చెపుతాడు. ఆ క్షేత్ర మహాత్మ్యం గురించి వ్యాసుడు కాశీని విడిచిపెట్టి వెళ్ళడం గురించి చెప్పడం మొదలుపెడతాడు. ఇది ప్రథమాశ్వాసం.

**ద్వితీయాశ్వాసంలో** వ్యాసుడు ఎందుకు శివుని కోపానికి గురయ్యాడో తెల్పుతూ కాశీ మోక్ష క్షేత్రమని అక్కడ భోగాలకు తావులేదని, దాక్షారామం మోక్షభోగాలకు నిలయమని వ్యాసుడు కాశీని వదిలి దాక్షారామానికి వచ్చాడని, దాక్షారామానికే దక్షిణ కాశీ అని పేరుందని తెలపడం ఉంటుంది. తర్వాత కాశీలోని సూర్యాస్తమయము, చంద్రోదయము వర్ణనలు ఉంటాయి. వ్యాసుడు కాశీని విడిచి వెళ్ళడం, పీఠికాపురం, కుమారరామం, నర్సాపురం దాటుతూ వెళ్ళడం, ఆ నగర వర్ణనలు చాలా అద్భుతంగా శ్రీనాథుడు వర్ణించడం కనిపిస్తుంది. అగస్త్యుడు, వ్యాసున్ని కలువడం, కాశీని విడవడానికి కారణాలు అడగడం, వాటిని వ్యాసుడు వివరించడం అనే ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**తృతీయాశ్వాసంలో** అగస్త్యుడు వ్యాసునికి దాక్షారామం మహిమను చెప్తాడు. తర్వాత దాక్షారామ భీమేశ్వరున్ని దేవతలు స్తుతించడం అగస్త్యుడు వ్యాసునికి పంచతీర్థాలైన వాటిని చెప్పుతూ అగస్త్యేశ్వరుడు, రామేశ్వరుడు, నకులేశ్వరుడు, గణేశ్వరుడు, పాతాళభైరవేశ్వరుడు అనే ఐదురుగు దేవతలను, పంచతీర్థాలను దర్శించిన మానవునికి పన్నెండు పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం లభిస్తుందని చెప్పడం కనిపిస్తుంది. అగస్త్యుడు, వ్యాసుడు దేవున్ని దర్శించుకోవడం, వ్యాసుడు శివున్ని స్తుతించడం అనే ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**చతుర్థాశ్వాసంలో** అగస్త్యుడు తీర్థ మహాత్మ్యాన్ని చెప్పుతూ, క్షీరసాగర మథనం గురించి శివుడు, కాలకూట విషాన్ని మింగటం, దేవతలంతా శివున్ని స్తుతించడం, రాక్షసులు లోకాలన్నింటిని బాధిస్తే దేవతలంతా శివుణ్ణి వేడుకోవడం, త్రిపురాసురసంహారం చేసి, తనంతట తానే వచ్చి సమయానికి ప్రతిష్ఠితుడు కావడం అనే ఘట్టాలు ఇందులో వర్ణించబడ్డాయి.

**పంచమాశ్వాసంలో** దాక్షారామానికి శివుడు రావడం, సూర్యుడు మొదలైనవారు శివున్ని దాక్షారామానికి తీసుకొని రావడం, లక్ష్మీ, సరస్వతి, ఇంద్రుని భార్య, అప్సరసలు మొదలగువారు శివున్ని స్తుతించడం, దేవతల గురువును ఇంద్రుడు దానాల గురించి అడుగగా భూదానం గొప్పదని చెప్పడం కలికాలంలో భక్తి నశిస్తుందని తెలుపుతూ, ఎవరెవరు దైవదర్శనానికి యోగ్యులవుతారో వారిని వివరించే ఘట్టం ఇందులో వర్ణితం.

**షష్ఠ్యాశ్వాసంలో** దాక్షారామ వర్ణన, మహాత్మ్యం చెప్పబడుతుంది. పార్వతీదేవి శివున్ని అడుగగా భోగ, మోక్షాలకు నిలయమై దాక్షారామం ఉంటుందని, నాలోని మాయ ఈ క్షేత్రంలో ఉంటుందని, ఇక్కడ నివసించే ఏ జీవియైన మోక్షాన్ని పొందుతుందని, ఈ క్షేత్రంలో కైవల్యం పొందేవారికి శివుడు తారక మంత్రాన్ని ఉపదేశిస్తాడని దక్షవాటి వైశిష్ట్యాన్ని మహిమను తెలపడం జరుగుతుంది. సూతుడు కథ పూర్తిచేయగానే మునులంతా దాక్షారామ భీమేశ్వరున్ని

దర్శించుకోవడానికి వెళతారు. ఇంతటితో ఈ ఆశ్వాసం ముగుస్తుంది.ఇలా భీమఖండాన్ని శ్రీనాథుడు భక్తిరస కావ్యంగా, దాక్షారామ భీమేశ్వరుని మహిమను కొనియాడుతూ, అద్భుత వర్ణనలతో రచించడం జరిగింది.

### 1.3.7.10. కాశీఖండం

"ప్రాయమింతకు మిగులఁగ్రైవాలకుండఁ" కాశీఖండాన్ని తెనుగు చేస్తానని చెప్పాడు శ్రీనాథుడు. దీనిని అల్లాడ వీరభద్రారెడ్డికి అంకితం ఇచ్చాడు. ఈయన 73 ఏళ్ళ వయస్సులో గ్రంథాన్ని రాసి ఉంటాడని, 1433 ప్రాంతంలో రచన జరిగి ఉంటుందని పెద్దలు నిర్ధారించారు. దీనికి మూలం స్కాందపురాణాంతర్గత కాశీఖండం. ద్వాదశ సహస్రగ్రంథ పరిమితిగల సంస్కృత కాశీఖండాన్ని శ్రీనాథుడు ఏడు ఆశ్వాసాలు గల కావ్యంగా మలిచాడు. ఇందులో 1777 గద్యపద్యాలున్నాయి.

వింధ్యాపర్వత విజృంభణము, అగస్త్యుడు కాశీని విడిచిపెట్టి దక్షిణాపథానికి వెళ్ళుట, వ్యాసుడు కూడా కాశీని విడిచిపెట్టి వెళ్ళడం ప్రధానమైన విషయాలు. ఇందులో ఉన్న ముఖ్యమైన కథలలో కుబేర వృత్తాంతం, గుణనిధి కథ ప్రసిద్ధమైనవి. 'నైషధం విద్వదౌషధం' అని ఎలా అన్నారో 'కాశీఖండం అయఃపిండం'అనే మాట కూడా ఉంది. కాశీఖండం ఉక్కుముద్దవంటిదని ఆ వాక్యానికి అర్థం. అది సంస్కృత కాశీఖండము గురించా? తెలుగు కాశీఖండం గురించా? అనే చర్చ కూడా ఉంది.

"సంస్కృత కాశీఖండము పురాణైకదేశము. సులభ గ్రాహ్యమైనది. శ్రీనాథుడు ప్రౌఢతరమగు కావ్యశైలిలో జాతి వార్తా చమత్కార విలసితముగ, శైవతత్త్వ ప్రతిపాదకముగ, సాముద్రిక, పాతంజలయోగశాస్త్ర, మంత్ర శాస్త్రములను పొందుపరచుచు, ఆంధ్రతాముద్రను అచ్చొత్తించి కాశీఖండమును రచించినాడు. 'కాశీఖండమయః పిండమ్' అను అభాణకము తెలుగు కాశీఖండమును బట్టి మేర్పడినదని నిడదవోలు వెంకటరావుగారి అభిప్రాయము" (నాగయ్య, జి.2021.పుట.455).

కాశీఖండం ఏడు ఆశ్వాసాల కావ్యం. ఈ కావ్య పీఠికలోనే 'చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాటి' అంటూ రచనలను గూర్చి తెలిపాడు. ఇందులోనే 'వచియింతు వేములవాడ భీమన భంగి' అంటూ ఇతర కవుల కవితా మార్గాన్ని అనుసరించానని తెలిపాడు. ఇలా ఎన్నో విషయాలను తెలిపిన కావ్యం ఇది. దీని గురించి కథాసార సంగ్రహాన్ని తెలుసుకుందాం.

### 1.3.7.10.1. కాశీఖండం–కావ్యసారం

**ప్రథమాశ్వాసంలో** మొదట ఇష్టదేవతా ప్రార్థనతో మొదలవుతుంది. 'శ్రీ కాశీనగరాధి రాజ్య పదవీ' అను పద్యంలో కాశీని ఏలే విశ్వేశ్వరుడు, కాశీ విశ్వనాథుడైన ఈశ్వరుడు వీరభద్రారెడ్డిని చల్లగా చూడాలని చెప్తూ దైవ ప్రార్థన ఉంటుంది. తర్వాత దుంఠి విఘ్నేశ్వరుణ్ణి, కాశీవిశాలక్షిని, బ్రహ్మదేవుణ్ణి మొదలైన దేవతాస్తుతి తర్వాత కృతిపతి వంశావతరణం, షష్ఠ్యంతాలు ఉంటాయి. తర్వాత స్కాంద పురాణ ప్రశంస, పద్దెనిమిది పురాణాలలో, ఎనిమిది పురాణాలలో తప్ప, తక్కిన పది పురాణాల్లో శివుని గురించి కలదని తెలియజేస్తూ, కాశీఖండ ప్రశంస ఉంటుంది. నారదుడు వింధ్యాపర్వతానికి వెళ్ళడం అక్కడి వర్ణనలతో ఈ ఆశ్వాసం ముగుస్తుంది.

**ద్వితీయాశ్వాసంలో** దేవతలంతా బ్రహ్మ దగ్గరికి వెళ్ళి, గోబ్రాహ్మణ ప్రభావాన్ని తెలుసుకొని, అగస్త్యునికి దగ్గరికి రావడం, బృహస్పతి లోపాముద్రతో పతివ్రత ధర్మాలను చెప్పటం, వచ్చిన దేవతలంతా వింధ్యాపర్వతం యొక్క చేష్టలను చెప్తూ వారికి కలిగే కష్టాలను అగస్త్యునితో వెల్లడిచేయడం, అగస్త్యుడు కాశీని విడిచి వెళ్ళడానికి చింతించడం వంటి ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**తృతీయాశ్వాసం**లో అగస్త్యుడు దక్షిణ కాశీకి వెళ్ళడం, కొల్లాపురం చేరడం, లక్ష్మీదేవిని స్తుతించడం, శ్రీశైలానికి వెళ్ళడం, శివశర్మ అనే బ్రహ్మచారి కథను చెప్పడం, వైశ్వానరుని గురించి తెలియజేయడం అనే ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**చతుర్థాశ్వాసం**లో వైశ్వానరుని జననం గూర్చి, వరుణలోక వృత్తాంతం గూర్చి, కుబేర వృత్తాంతాలను గూర్చి, శుక్ర, అంగారక, బుధ, బృహస్పతి, శని, సప్తర్షి లోకాల వృత్తాంతాల గుర్చి చెప్పబడింది.

**పంచమాశ్వాసం**లో అగస్త్యుడు కుమారస్వామిని దర్శించుకోవడం, వారిద్దరికి సంవాదం కలగడం, కాశీ మహాత్మ్యం వర్ణన, కాలజ్ఞాన కథనం, దివోదాసుడు అను పేరుగల రిపుంజయ భూపాలుని వర్ణనము, ఈశ్వరుడు దేవతలతో మందర పర్వతానికి వెళ్ళడం అనే ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

**షష్ఠ్యాశ్వాసంలో** సాంబాదిత్య, గరుడాదిత్య, మయూఖాదిత్య, వరుణాదిత్య మహాత్మ్యం, దుర్గ, ఓంకారేశ్వర, కేదారేశ్వర మహాత్మ్యాలు ఇందులో చెప్పబడ్డవి.

**సప్తమాశ్వాసం**లో విశ్వేశ్వరుని కథనం, దూర్వాసోలింగ మహాత్మ్యాన్ని, దక్షేశ్వరలింగం ఉద్భవించడాన్ని, కాశీతీర్థం యొక్క మహిమలు తెలుపబడ్డవి. చివరకు అగస్త్యుడు, కుమారస్వామికి

ప్రణమిల్లి, కాశీలో ఒక క్రమాన్ని అనుసరించి ఏయే దేవతలను దర్శించాలని అడుగగా కుమారస్వామి ద్వాదశ ఆదిత్యులకు మొదలుకొని లింగరూపాల్లో ఉన్న ఈశ్వరున్ని దర్శించాలని చెప్పడంతో ఆశ్వాసం ముగుస్తుంది.

### 1.3.7.11. శివరాత్రి మహాత్మ్యం

శ్రీనాథుడు చెప్పిన కావ్యాల్లో ఈ రచన గురించి కూడా చెప్పలేదు. శివరాత్రి మహాత్మ్యమును "శ్రీశైలభిక్షావృత్తి మఠాధిపతి ముక్తి శాంత భిక్షావృత్తి ముఖ్యోద్యోగి మummడి శాంతయ్యకు అంకితము. చేసినట్లుగా తెలుస్తుంది. దీనికి 'సుకుమార చరిత్ర' అనే నామాంతరం కూడా ఉంది. సుకుమారుని కథ ఇందులో ముఖ్య గట్టం కనుక అందుకా పేరు వచ్చింది.

శివరాత్రి మహాత్మ్యముకు మూలం స్కాంద పురాణాంతర్గతమైన ఈశాన సంహిత శివరాత్రి వ్రత విధానం ఆ సంహితలో వివరించబడింది. ఈశాన సంహిత మూలంలో 336 అనుష్టుప్పులలో ఉన్న కథను ఐదు ఆశ్వాసాలుగా శ్రీనాథుడు రచించాడు. ఇందులో బ్రాహ్మణ యువకుడైన సుకుమారుని కథ ప్రధాన ఇతివృత్తం.

#### 1.3.7.11.1. శివరాత్రి మహాత్మ్యం–కావ్యసారం

**ప్రథమాశ్వాసంలో** బ్రహ్మవిష్ణుల మధ్య తగువు ఏర్పడటం, జగత్కర్త నేనంటే నేనని గర్వపడటం, ఆ గర్వాన్ని అణచడానికి శివుడు శివరాత్రి రోజు లింగంగా ఆవిర్భవించడం, శివరాత్రి వ్రతం గొప్పతనాన్ని సూతుడు శౌనకాది మునులకు చెప్పడంతో ఈ ఆశ్వాసం ముగుస్తుంది.

**ద్వితీయాశ్వాసం**లో వింధ్యా పర్వతానికి సమీపంలో ఉన్న దండకారణ్యంలో  రత్నపురం అనే ఊరిలో హేమంగాదుడనే రాజున్నాడు. అతని మంత్రి  యజ్ఞదత్తుడు. ఇతనికి సుకుమారుడనే కొడుకు జన్మిస్తాడు. అతను పెరిగి పెద్దవాడై విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటే తల్లిదండ్రులు నీతి బోధ చేస్తారు.

**తృతీయాశ్వాసం**లో సుకుమారుని చెడు ప్రవర్తన మితిమీరిపోగా, రాజు రాజ్య బహిష్కరణ చేస్తాడు. అతడు హూణ దేశానికి వెళ్ళడం, అక్కడ ఒక చండాలకన్యతో రహస్యంగా కాపురం చేయడం సాగించగా కొన్ని రోజులకు అక్కడి ప్రజలకు తెలుస్తుంది. వాళ్ళిద్దరు వేరొక చోటికి వెళ్ళిపోవాలని అనుకుంటారు. ఇవి ఇందులోని ఘట్టాలు.

**చతుర్థాశ్వాసం**లో సుకుమారుడు ఆ చండాలితో వణిక్పథ పురానికి చేరుతాడు. అక్కడ కూడా ఘోరమైన కృత్యాలను చేస్తాడు. లింగాన్ని చూసి   లయంలోకొంతకాలానికి నాగేశ్వరా

శివరాత్రి రోజు జాగరము చేస్తాడు. వ్యాధిపీడితుడై చనిపోగా యమభటులు తీసుకెళ్లగా ప్రమథులు అడ్డు పడి కైలాసానికి తీసుకెళ్తారు.

**పంచమాశ్వాసంలో** యముడు తమ భటులని అడ్డుకున్న ప్రమథుల గూర్చి శివుణ్ణి అడుగగా, శివ భక్తుల లక్షణాలను, శివరాత్రి మహాత్మ్యాన్ని చెప్పాడు. అప్పటి నుండి శివభక్తులని అడ్డుకోవద్దని యముడు తన భటులకి చెప్తాడు. ఇది శివరాత్రి మహాత్మ్యం కథా సారం.

## 1.3.7.12. పల్నాటి వీరచరిత్ర

శ్రీనాథుడు రచించిన మరొక గ్రంథం పల్నాటి వీరచరిత్ర. ఇది శ్రీనాథుడు పూర్తిగా రాసాడని కొందరు,సంస్కృత వృత్త పద్యాలతో రచన చేసే శ్రీనాథుడు ఒక ద్విపద కావ్యాన్ని రాస్తాడా? అనే సందేహాలను పలువురు పలురకాలుగా వ్యక్తం చేసారు. అందరి సమిష్టి నిర్ణయంపైన శ్రీనాథుడే పల్నాటి వీరచరిత్రను రాశాడని క్రీ.శ.1446వ సంవత్సరం రచనాకాలంగా నిర్ణయించారు.

ఈ కావ్యాన్ని శ్రీనాథుడు, కొండయ్య, మల్లయ్య అనే ముగ్గురు రాసినట్లుగా చెబుతారు. దీనిలో శ్రీనాథుడు కల్లు ప్రతిష్ఠ, బాలచంద్రుని యుద్ధం అనే రెండు ప్రకరణాలను మిగిలిన 9 ప్రకరణాలలో కోళ్ళపోరు, గోపన్నవిరుగు మల్లయ్య రాయగా, కొమరాజు యుద్ధాన్ని కొండయ్య రాసినట్లు చెప్తారు.

శ్రీనాథుడు రచించిన పలనాటి వీరచరిత్రలోని బాలచంద్రుని యుద్ధభాగం 1911లో ముద్రితమైంది. తర్వాత 1938లో అదే పునర్ముద్రితమైంది. అదీ కొండయ్య మల్లయ్యల పూర్వోత్తర భాగాలూ కలిసి మొత్తం పలనాటి వీరచరిత్ర 12 వ  శతాబ్ది ఉత్తరార్ధంలో జరిగింది. శ్రీనాథుని పలనాటి  వీరచరిత్ర ద్విపద ప్రబంధం పదిహేనవ శతాబ్ది పూర్వంలో పుట్టింది. ఇది వల్లభామాత్యుని క్రీడాభిరామంలో గ్రంథస్తమైంది. శ్రీనాథుని తర్వాత కొండయ్య, మల్లయ్య, మాత్రమేగాక మరెందరో పలనాటి వీరచరిత్ర ద్విపద కావ్యాలు రాసారు.

## 1.3.7.12.1. పల్నాటి వీరచరిత్ర–కథాసారం

ఉత్తర దేశం నుండి హైహయ వంశానికి చెందిన అనుగురాజు ఆంధ్రదేశానికి వస్తాడు. చందవోలు చోళరాజు తన కూతురైన మైలమాదేవిని ఈ అనుగురాజుకు ఇచ్చి పెళ్ళి చేస్తాడు. మైలమాదేవితోపాటు అనుగురాజుకి  విద్యలదేవి,  భూరమాదేవి అనే భార్యలుంటారు. మైలమాదేవికి నలగాముడు, విద్యలదేవికి  మలిదేవాదులు ముగ్గురు, భూరమాదేవికి కామరాజు, నరసింగరాజు మొదలైన వారు పుడతారు.ఈ సంతానంలో నలగామరాజు అందరికన్నా పెద్దవాడు.

ఒకరోజు అనుగురాజు వేటకు వెళ్ళి వస్తుంటే 'జిట్టగామాంపాడు'కు చెందిన నాగమ్మ అనే ఆవిడ రాజుకు విందు చేసి రాజస్థానంలో స్థానాన్ని సంపాదించింది. అప్పటికే అనుగురాజుకు మంత్రిగా ఉన్న దొడ్డనాయుని కుమారుడు బ్రహ్మన్న నాగమ్మ కపట స్వభావాన్ని తెలుసుకొని ఆమెను లెక్కచేయకపోయేవాడు. అనుగురాజు మరణిస్తూ తన కొడుకులను బ్రహ్మనాయకునికి అప్పజెప్పాడు. నలగామున్ని రాజుని చేసి బ్రహ్మన్న మంత్రిగా ఉన్న సమయంలో ఓర్వలేని నాగమ్మ బ్రహ్మన్నపై నలగామునికి మనసు విరిగేలా చేసింది. అన్నదమ్ములకీ వైరం పెట్టించగా మలిదేవాదులను నలగాముడు చెరసాలలో పెట్టించాడు. ఇదంతా చూసిన బ్రహ్మన్న రాజ్యాన్ని చెరి సగం పాలించాలని చెప్పి నలగాముని భాగానికి గురజాల, మలిదేవుని భాగానికి మాచర్ల రాజధానికి నగరాలుగా చేశాడు.

నలగాముని దగ్గర ఉన్న నాగమ్మ బ్రహ్మనను మళ్ళీ ఓర్వలేక మాచర్లకు గురజాలకు మధ్య కోళ్ళ పోరును పెట్టేలా చేసి మోసంతో మలిదేవాదులను ఓడించింది. వాళ్ళు ఓడిపోయాక రాజ్యం విడిచి వెళ్ళిపోయారు. నలగాముని అల్లుడైన అలరాజును రాయభారానికి పంపుతారు. ఆ సమయంలో విష ప్రయోగం చేత నాగమ్మ ఆ అలరాజును చంపిస్తుంది. రెండు వర్గాల వారికి యుద్ధం కారెమపూడిలో నిర్ణయిస్తారు. ఇదే 'కల్లు ప్రతిష్ఠ' ఘట్టం.

బ్రహ్మనాయకుని కుమారుడు బాలచంద్రుడు. అతను నలగామున్ని సంహరిస్తానని వెళ్తాడు. శత్రువులపై యుద్ధము చేసి మరణిస్తాడు. ఇదే 'బాలచంద్రుని యుద్ధము'. ఈ సమయంలో బ్రహ్మన నాగమ్మని, నలగామున్ని జయించబోగా నాగమ్మ శరణువేడుతుంది. అప్పుడు క్షమించి వదలివేస్తాడు. ఇది పల్నాటి వీరచరిత్ర కథాసారం. క్రీ.శ.1182వ సంవత్సరంలో పల్నాటిసీమలో జరిగిన కథ ఇది.

పల్నాటి వీరచరిత్ర శ్రీనాథుని రచనకాదేమో అనడానికి పలువురు పలు కారణాలను వెతికారు. శ్రీనాథుని ఇతర గ్రంథలలో సంస్కృత సమాసాలను విశ్లేషించి అతని పదగుంభనము,దుందుభిధ్వానము లాగా అనిపించే శైలి ఇందులో కనబడవు. పాడుకోవడానికి వీలుగా, సామాన్య ప్రజలకు ప్రీతికరంగా సులభ శైలిలో ఉంటుంది. చాలా చర్చల తర్వాత శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్ర రచించాడని అందులో బాలచంద్రుని యుద్ధం, కల్లు ప్రతిష్ఠ తనే రాశాడని పెద్దలు అంగీకరించారు.

కల్లు ప్రతిష్ఠఅవతారికలో శ్రీనాథుడు తాను 'చెన్నకేశవ పాదసేవరతుడ'నని చెప్పుకున్నట్లు ఉంది. శ్రీనాథుడు శివభక్తి పరాయణుడు. అతడే దీనిని రచిస్తే ఇలా చెప్పుకుంటాడా ? అంటూ

చర్చలు జరిగాక శ్రీనాథుడు హరిహరాభేదాన్ని పాటించాడని కేవలం చెన్నకేశవుని పేరు తలవడం వలన శ్రీనాథుడు అసలు రచనయే చేయలేదనడం సమంజసం కాదంటూ శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రను రాసినట్టుగా చెప్తారు.అక్కిరాజు ఉమాకాంతం బాలచంద్రుని యుద్ధాన్ని పరిష్కరించి పెద్ద పీఠికతో గ్రంథాన్ని ముద్రించడం జరిగింది. తర్వాత దానిపైన కూడా కొన్ని చర్చలు సాగాయి. మొత్తానికి పల్నాటి వీరచరిత్ర రచనలో శ్రీనాథునికి భాగం ఉందని పండితులు నిర్ణయించారు.

### 1.3.7.13. క్రీడాభిరామం

శ్రీనాథుని రచన చెప్పబడే మరోకావ్యం క్రీడాభిరామం. ఇది వీధి నాటకము. సంస్కృతములోని రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామానికి అనుసరణగా క్రీడాభిరామం శ్రీనాథుడు రాశాడని చెప్తారు. కొందరు విమర్శకులు వ్యతిరేకించారు. కొందరు అంగీకరించారు. శ్రీనాథుని వీధి నాటకం ఏది? అంటే క్రీడాభిరామం అనే జనప్రచారంలో ఉంది.ఈ కావ్య కర్తృత్వం మీద చాలా చర్చలు జరిగాయి కవి రచనల్లో భాగంగా క్రింద కొన్ని అభిప్రాయాలను పొందు పర్చాను.

### 1.3.7.13.1. క్రీడాభిరామం–కథాసారం

గోవింద మంచన శర్మ క్రీడాభిరామంలో, టిట్టిభశెట్టి పొద్దున్నే బయలుదేరి ఓరుగల్లు కోటకు వెలుపల ఉన్న గూడెం అయిన వెలిపాలెంలోకి ప్రవేశిస్తారు. అక్కడ మేదరి వాడను చూస్తారు. దాని వర్ణన ఉంటుంది. తర్వాత అంగడికి వెళ్తారు. అమ్మబడే వస్తువుల వర్ణన ఉంటుంది. అలాగే తిరునాళ్ళ వర్ణన, మోహరి వాడ, ఏకవీరాదేవి ఆలయం, జక్కుల స్త్రీ మొదలైన వర్ణనలు కన్పిస్తాయి. ఆనాటి సాంఘిక పరిస్థితులను తెలియజేసే కావ్యంగా చెప్పవచ్చు. ఈ కావ్యంలో ఓరుగల్లు నగర వర్ణన కనిపిస్తుంది.

### 1.3.7.13.2. కర్తృత్వ చర్చ

శ్రీనాథుడు క్రీడాభిరామాన్ని రాయలేదని వినుకొండవల్లభరాయడే రాసాడని, ఆయన హరిహరరాయల వద్ద రత్నభాండాగారాధ్యక్షుడైన తిప్పన కుమారునిగా ప్రచారం ఉంది. శ్రీనాథుని కృతమే అని బలంగా వాదించిన వారిలో వేటూరి ప్రభాకరశాస్త్రి ఉన్నారు. ఇది శ్రీనాథుని రచననే అని చెప్తూ "వల్లభరాయని కృతిగా గ్రంథమున నున్నను, శ్రీనాథుడే దీనిని రచించెనని పెక్కు కారణములచే నేను నిశ్చయించుచున్నాడను" (ప్రభాకరశాస్త్రి, వేటూరి.2015) అని తమ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తపరిచారు.

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు క్రీడాభిరామమును శ్రీనాథుడే రచించాడని భావించి క్రీ.శ.1435 ప్రాంతమున భీమఖండరచనానంతరము ఈ గ్రంథమును రాసాడని అన్నారు. క్రీ.శ.1420 ప్రాంతమున వల్లభరాయడీ గ్రంథమును రచించి ఉండవచ్చని శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు అభిప్రాయపడ్డారు. శ్రీచాగంటి శేషయ్య గారు శ్రీ కందుకూరి వీరేశలింగంగారి అభిప్రాయంతో ఏకీభవించారు.

ఇలా పలురకాల చర్చలు జరిగినవి. శ్రీనాథుడి మీద పరిశోధన చేసి 1971లో తన గ్రంథాన్ని ప్రచురించిన కొర్లపాటి శ్రీరామమూర్తి కూడా క్రీడాభిరామం అనేది వీధినాటకం కాదు, వీధినాటకం పేరుతో శ్రీనాథుని చాటువులని సంకలితం చేసారని చెప్పారు. వేటూరి ప్రభాకరశాస్త్రి పద్య రచనను బట్టి కొన్ని క్రియావాక్యాలను చూపెట్టి శ్రీనాథుని రచననే అని చెప్పారు. కాకతి పబ్లికేషన్స్ వారు 1977లో 'వినుకొండ వల్లభరాయ క్రీడాభిరామం' అని ముద్రణ వేసారు.

1964లో 'శ్రీనాథుని కవితాతత్త్వం' గ్రంథం రాసిన కుందూరి ఈశ్వరదత్తుగారు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ "క్రీడాభిరామము వల్లభరాయని కృతమే యని భావించు వారిలో నేనొకడను. శ్రీనాథుని కృతమని నిష్కర్షగా వాదించువారును గలరు" (1964. పీఠిక) అన్నారు.

ఇలా ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయాన్ని తెలుపుతున్నారు. జంధ్యాల జయకృష్ణ బాపూజీ 'శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం' అనే పేరున శ్రీనాథుని కృతులపైన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. 1977లో దానిని ముద్రించారు. అందులోని పద్యాలను ఉదహరించారు. అంటే శ్రీనాథుని కృతిగానే భావించారని నేను నమ్ముతున్నాను. చరిత్ర ఆధారాల గురించి, వాదనల గురించి నేను ఇక్కడ చర్చ చేయదలుచుకోలేదు. క్రీడాభిరామం శ్రీనాథుని రచనగానే భావించిన వారు ఉన్నారు, కాదని ఖండించిన వారు ఉన్నారు. ఇప్పటివరకు కూడా అది ఎవరి రచన అని ఎవరూ పూర్తిగా నిర్ధారించ లేకపోతున్నారు. దీనిపైన కొంత చరిత్ర, శాసన ఆధారాల ద్వారా పరిశోధన జరిగి స్పష్టత ఇవ్వవలసిన ఆవశ్యకత ఉన్నది కాబట్టి నా పరిశోధనకు ఈ గ్రంథాన్ని స్వీకరించటం లేదు.

### 1.3.7.14. చాటువులు

శ్రీనాథుని రచనలలో చాటువులు కూడా ఉన్నాయి. ఇప్పటికీ అందరి నోళ్లలో నిలిచిపోయాయి. ముందు చాటు అంటే అర్థమేమిటో వివరించుకుందాం. చాటువు అనే పదం చాటుః అనే సంస్కృత పదం నుండి వచ్చిందని చెప్పారు. చాటుః అంటే ప్రియమైన మాట అని

అర్థం ఉంది. "చాటువులనే ప్రాస్తావికాలు, ప్రసంగ పద్యాలు, సుభాషితాలు అని అంటారు" (రంగాచార్య. చాటుపద్య రత్నావళి.2005. ప్రస్తావన).

"చాటుః అన్న పదానికి మనస్సుకు మోదాన్ని కలిగించే వాక్యం, మిధ్యాప్రియ వాక్యం, ముఖస్తుతి, ప్రియమైన మాట, మధురోక్తి అన్న అర్థ విశేషాలున్నట్లు పై సంస్కృత నైఘంటికుల, ఆలంకారికుల, వ్యాకర్తల, కవుల అభిప్రాయంగా సువ్యక్తమవుతుంది" (లలిత, జి.1981.పుట.22).

ఆదికవి నన్నయ్య భారతావతారికలో 'మృదుమధుర చిత్ర విస్తర' నవరస భావభాసుర కవితా రచనా విశారదులైన మహాకవులు రాజరాజ నరేంద్రుని ఆస్థానమున ఉన్నట్లు ఆది పర్వంలో చెప్పాడని నన్నయ సమాసాన్ని శ్రీనాథుడు యథాతథంగా గ్రహించాడంటూ, మృదు మధుర చిత్ర విస్తర కవితా విలాస వాగీశ్వరులగు కవీశ్వరులను అని శ్రీనాథుడు శృంగార నైషధంలో పేర్కొన్నట్లు, జి.లలిత గారు తమ తెలుగులో చాటు కవిత్వం అను సిద్ధాంత గ్రంథంలో చెప్తూ, "ఈ ఇద్దరు కవులు 'మృదు కవిత'ను పేర్కొన్న వాళ్ళ తరువాతి కవులు ఆశు, మధుర, చిత్ర, విస్తర కవితల గూర్చి చెప్పారు" (లలిత, జి.1981.పుట.17).

శ్రీనాథుడు ఆశు కవిత అనడానికి బదులు 'మృదుకవిత' అని వాడినట్లుగా తమ అభిప్రాయాన్ని తెలిపారు. చతుర్విధ కవితల్లో ఆశు కవిత ఒకటిగా చెప్తారు. "వీటిల్లో 'ఆశువు' చాటు కవితా శాఖగా ప్రచారంలో ఉన్నా ప్రతి ఆశువు 'చాటువు' అనటానికి ఆస్కారం లేదు. ముక్త లక్షణ లక్షితాలై వినేవారి మనస్సులకు చమత్కారాన్ని కలిగించి ఉల్లాసవంతులుగా చేయునట్టి మాటలు చాటువులని ప్రఖ్యాతి" (రంగాచార్య.2005. ప్రస్తావన).

శ్రీనాథుడు చాటువులలో ప్రసిద్ధుడు. అందుకే శృంగార నైషధంలో 'చాటు' శబ్దాన్ని ఉపయోగించాడు. ఇవి మౌఖికమైనట్టివి. లిఖితం అయినవి కూడా తక్కువగా ఉన్నాయి. వేటూరి ప్రభాకరశాస్త్రి శ్రీనాథుని 81 చాటువులను 'చాటు పద్య మణిమంజరి' అనే గ్రంథంలో ముద్రించారు. శ్రీనాథుని చాటువుల వలన కొన్ని రాజకీయ పరిస్థితులు, అతని జీవితం కూడా తెలిసి వచ్చింది. శ్రీనాథుని కఠిన పరిస్థితులు, వైభోగాలు, రాజుల చరిత్ర మనకు అవగతమైంది. అతని చాటువుల వల్లే అని చెప్పడం అతిశయోక్తి కాదు. చాలా రకాల చాటువులను ఆయన రాసాడు. రసపూరితమైనవి, వర్ణనాత్మకమైనవి, సాంఘికమైనవి ఇలా రకరకాల వస్తువులతో శ్రీనాథుని చాటువులు కన్పిస్తాయి. ఈ చాటువులే 'వీధి నాటకం' అనే పేరుతో సంకలనం చేయబడ్డాయని కొర్లపాటి వారు అన్నారు.

దీపాల పిచ్చయ్యశాస్త్రి చాటు పద్యరత్నాకరంలో కొన్ని రసవత్తరములైన చాటువులను శ్రీనాథునివిగా చెప్పారు. శ్రీనాథుని గూర్చి చెప్పుతూ "ఈ కవి పల్నాటి సీమలోఁ బ్రయాణము సేయుతతినొక నాఁటి పయనమున, మార్గమధ్యమున దగఁజెంది, దప్పిదీర్చు కొనుటకై చెంతనున్న యొక చెఱువునకుఁ బోఁగా, నందు నీరు లేకపోయెను. అప్పుడీ క్రింది పద్యము నాశువుగాఁ జెప్పెను" (పిచ్చయశాస్త్రి, దీపాల.1995.పుట.9).

**క॥ "సిరిగలవానికిఁ జెల్లును**
**తరుణులఁ బదియాఱు వేలఁదగఁ బెండ్లాడన్**
**తిరిపమున కిద్దరాండ్రా?**
**పరమేశా గంగ విడువు పార్వతి చాలున్"**

**(చాటు. రత్న.32 పద్యం)**

ఇలా శ్రీనాథుని చాటువులు కొన్ని జన వ్యవహారంలో నిలిచిపోయినవి.

### 1.3.7.15. ఇతర రచనలు

శ్రీనాథుని రచనలుగా ఇవేకాకుండా కాటమరాజు కథ, మానసోల్లాసం, కామశాస్త్రం అనే కావ్యాలు రాసినట్టుగా చెప్తారు, కానీ వాటి గురించి స్పష్టత లేదు. ఇతర కవులు తమ కావ్యాల్లో వీటి గురించి తెలిపారని పూర్వ పరిశోధకులు తెలిపారు. కానీ ప్రస్తుతం అవి అలభ్యాలు.

### 1.3.8. శ్రీనాథుని కవితామార్గ చర్చ

శ్రీనాథ కవిసార్వభౌముని కవితా మార్గం అనితర సాధ్యం. చిరస్మరణీయం. మధురమధుసంభరితం. అతని కవితా శైలి గొప్పదనాన్ని కలిగి ఉంది. ఎంతో మంది కవులు, విమర్శకులు శ్రీనాథుని కవితా మార్గ చర్చ చేసారు. తమవైన అభిప్రాయాలను వెల్లడించారు. శబ్దార్థ సౌష్టవంతో కూడిన అతని రచన తర్వాత కవులకు అనుసరణీయమైంది. అది శ్రీనాథుని రచనా మార్గ వైశిష్ట్యంగా చెప్పవచ్చు.

"శబ్దరీతి కవులు కేవల కవులనీ, ఉక్తి వైచిత్ర్యం గల కవులు సుకవులనీ ఈ రెండింటితో పాటు రసశిల్ప,కవితాశిల్పాల్ని కూడా పాటించిన కవులే మహాకవులని విశ్వనాథ అభిప్రాయం" (వెంకట్రామిరెడ్డి, అట్లా.2014.పుట.11). ఈ లక్షణాలను కలిగిన వాడవడంచేత శ్రీనాథుడు మహాకవి అయ్యాడు. ఇంతటి మహాకవి కవితామార్గం గూర్చి తెలుగు సాహితీ లోకంలో చర్చోపచర్చలు జరిగాయి. ఒక్కొక్కరు ఒక్కోరకమైన అవగాహనతో వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు.

"శ్రీనాథ కవితా మార్గాన్ని గురించి ముఖ్యంగా మూడు వాదాలు పండితలోకంలో ప్రచారంలో ఉన్నాయి. 1) అతడు రీతిని ఆదరించినంతగా రసమును పోషించలేదని, 2) అతని కవిత వక్రోక్తిజీవితం సాగించినదని, 3) అతడు రసానికి ఉచితమైన రీతిని ప్రవర్తింప జేయడంలో అందె వైచిన చేయి అని" (జి.వి.ఎస్.2012.పుట.107).

ఈ విధంగా శ్రీనాథుని కవితా ప్రస్థాన నిరూపణ ప్రయత్నం కూడా చేసారు. శ్రీనాథుని రచన అయిన భీమఖండంలో తన కవితా మార్గం గూర్చి శ్రీనాథుడే స్వయంగా 'హరచుడా హరిణాంక వక్రత కాలంతరస్ఫురచ్చండికా పరిషోద్గాఢపయోధర స్ఫుటతటీపర్యంత కాఠిన్యమునన్' అంటూ వక్రోక్తిని, కాఠిన్యాన్ని, సరసత్వాన్ని సూచించాడు. అలాగే సుకవిస్తుతి సందర్భంలో శ్రీనాథుడు తన పూర్వ కవులైన నన్నయ,తిక్కన,ఎఱ్ఱన కవులమార్గాన్ని, సంస్కృత కవులను అనుసరిస్తానని చెప్పాడు. పూర్వ పరిశోధకుల అభిప్రాయాలని అనుసరిస్తూ, శ్రీనాథుని కృతులను ఆధారం చేసుకొని కవి అసలైన కవితా మార్గం ఏమిటో నిర్ధారణ చేయవలసిన అవసరం ఉంది. కాబట్టి నేను ప్రస్తుతం '**శ్రీనాథుని కవితా మార్గం – సమగ్ర పరిశీలన**' అనే అంశం మీద పరిశోధన చేయాలని అనుకున్నాను. పూర్వ పరిశోధనలు కొంత వరకు వక్రోక్తిని చర్చించాయి, కానీ పూర్తిగా ఈ వక్రోక్తి కోణంలోనే సిద్ధాంత సమన్వయం చేయలేదు. ఇదివరకు వచ్చిన పరిశోధనలను, వ్యాసాలను పరిశీలిస్తూ నా పరిశోధనను కొనసాగించాలని నిశ్చయించుకున్నాను. సంస్కృత ఆలంకారికుడైన కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని శ్రీనాథుడు అనుసరించాడని, తను చెప్పిన కవితా గుణాలు అన్ని కుంతకుని వక్రోక్తిలో అంతర్భావిస్తాయని నేను భావిస్తున్నాను. శ్రీనాథుని కవితా మార్గం వక్రోక్తి అని సహేతుకంగా నిరూపిస్తూ, కవి పద్యాలను కుంతకుని సిద్ధాంతానికి అన్వయం చేయటం నా పరిశోధన లక్ష్యం. శ్రీనాథుని కవితా మార్గ సంబధిత వాదాలను, చర్చలను, పూర్వ కవుల రచనా గుణాలను, పూర్వ కవుల రచనా గుణాలకు సరిపోయే పద్యాలను ఉదాహరిస్తూ, కుంతకుని సైద్ధాంతిక నేపథ్యాన్ని రెండవ అధ్యాయములో కూలంకషంగా వివరిస్తాను.

### 1.4. పరిశోధన స్వీకృత గ్రంథాలు

ప్రస్తుతం నేను '**శ్రీనాథుని కవితా ప్రస్థానం – సమగ్ర పరిశీలన**' అనే అంశానికి గాను శ్రీనాథుని రచనలుగా చెప్పబడుతున్న లభ్య కావ్యాలైన ఐదింటిని నేను నా పరిశోధనకు స్వీకరిస్తున్నాను. అవి 1) శృంగార నైషధము, 2) భీమఖండము, 3) కాశీఖండము, 4) హరవిలాసము, 5) శివరాత్రి మాహాత్మ్యము అనే ఐదు కావ్యాలను మరియు శ్రీనాథుని చాటువులని కూడా నా పరిశోధనలో భాగంగా స్వీకరిస్తున్నాను. కావ్యాల వాదోపవాద చర్చల వల్ల శ్రీనాథుని

కావ్యాలుగా చెప్పబడుతున్నా, ప్రచారంలో ఉన్న ప్రస్తుతం లభ్యమవుతునప్పటికీ క్రీడాభిరామాన్ని, పల్నాటి వీరచరిత్రను నా పరిశోధనకు స్వీకరించటం లేదు.

పూర్వకవులు కవిత గుణాలను ఆకళింపు చేసుకున్నానని చెప్పిన శ్రీనాథుని 'పూర్వ కవితా భావసుధాచర్వణప్రౌఢి' ఏదైతే ఉందో దానిని కూడా నా పరిశోధనలో చూపిస్తాను. శ్రీనాథుని అసలైన మార్గం ఏదో నిర్ధారణ చేసి చెప్పటమే నా పరిశోధన లక్ష్యంగా భావిస్తున్నాను.

★★★

## అధ్యాయం–2

## శ్రీనాథుని కవితా మార్గం – సైద్ధాంతిక నేపథ్యం

### 2.1. కవి

శ్రీనాథుని కవితామార్గం చర్చ చేసే ముందు కవి అంటే ఎవరు? కవిత్వమంటే ఏమిటనే విషయాన్ని తెలుసుకోవాల్సి ఉంది. 'కవయతే చాతుర్యేణ కవిః' చాతుర్యం చేత వర్ణించేవాడు కవి అని గురుబాల ప్రబోధికలో చెప్పబడ్డది. "అమరకోసమున 'కవి' శబ్దము పండితాది శబ్దములకు పర్యాయముగ తెలుపబడినది".

> **"విద్వాన్ విపశ్చిద్దోషజ్ఞః స్సన్సుధీః కోవిదోబుధః**
> **ధీరో మనీ షీజ్ఞః ప్రాజ్ఞః సంఖ్యావాన్ పండితః కవిః"**

**– అమరముః బ్రహ్మవర్గము**

"ధీశక్తి, వ్యుత్పన్నత మొదలగు గుణములు గలిగి భాషారూపమున వర్ణనాత్మక రచన చేయువాడు 'కవి'యని గ్రహింపవచ్చును".

(నరసింహం, అంతటి.1979.పుట.1)

'నానృషిః కురుతే కావ్యం' అన్న సూక్తిని బట్టి కూడా కవి ఋషితుల్యుడు. ఋషికి ఏకాగ్రత అనేది ముఖ్యం. ఋషికి ఉన్నట్టి తపశ్శక్తికి సదృశమైన శక్తి గలవాడే కవి అని అర్థం. కవి ఒక సృష్టికర్త. బ్రహ్మ జగత్తును సృష్టిస్తే, కవి కావ్య జగత్తును సృష్టించే సృష్టికర్త అని కూడా ప్రాచీన గ్రంథాల్లో కవి నిర్వచించారు. కవి అసామాన్యుడు కాదు. ప్రతిభావంతుడు. ఆనందమయమైన, రసవంతమైన కావ్యసృష్టి చేసే కవి ప్రకాశిస్తాడనేది సత్యం. అలాంటి కోవకు చెందినవాడే శ్రీనాథ మహాకవి అని చెప్పటం అతిశయోక్తి కాదు. తన కవిత్వంతో విశ్వదర్శనం చేసాడు. శ్రీనాథుడు చెప్పిన కవిత్వ గుణాలకు సరిగ్గా సరిపోయే కారిక కుంతకుని వక్రోక్తి జీవితంలో కన్పిస్తుంది. కుంతకుని కారికకు ఈ పద్యం అనుసరణం అని చెప్పవచ్చు.

### 2.2. శైలి

ప్రతి కవికి ఒక శైలి ఉంటుంది. కావ్య రచనలో వైవిధ్యం ఉంటుంది. ప్రత్యేకమైన ముద్ర ఉంటుంది. అయితే విలక్షణమైన ముద్రతో సహృదయులను గెల్చుకొని, తమ కావ్యాలు చిరకాలం ఉండేలా ఉత్కృష్టమైన రచనలు చేసే కవులు కొందరే ఉంటారు. అటువంటి ఉత్కృష్టమైన కవులలో 'కవి సార్వభౌముడైన' శ్రీనాథుడు ఒకడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

“భావ వ్యక్తీకరణ విధానంలో మెరుగులు దిద్దే ఒకానొక రచనారీతిని ‘శైలి’ అనవచ్చు. శైలీ పరిశీలనం కేవలం భాషాశాస్త్రానికి సాహిత్య విమర్శకి చెందింది కాక కళాభినివేశ పాండిత్యాలలో కూడిన శాస్త్రీయ కృషి విశేషంగా భావించవచ్చు” (చేరెడ్డి, మస్తాన్ రెడ్డి.1989.పుట.1). శ్రీనాథుడు శైలిని గూర్చి చెప్తూ తన కవిత్వం ఎలా ఉంటుందో? అసలు కవిత్వం అనేది ఎలా ఉండాలో కవితా మార్గాలను పూర్వ కవులనుండి అన్వేషించి, వాటిలో లోతుపాతులు తెలుసుకొని, తనదైన పాండితీ పటిమతో రచనలు చేసాడో తెల్పాడు. పద్యం ఎలా ఉండాలో వివరిస్తూ ఒకానొక సందర్భంలో పద్య లక్షణాలను చెప్పుతూ ఇలా అంటాడు.

**ఉ॥ పద్యగణాక్షర ప్రకరభావ రసార్థగుణ ప్రపూర్ణమై**
**హృద్య విలాస శబ్దపదహేతు కళారస సత్క్రియాద్యమై**
**యాద్యులు చన్న మార్గమున నావళి ప్రాస విడంబ బంధమై**
**చోద్యముగాఁగఁ జెప్పుకృతి శ్రోతృసుఖావహ మెల్ల చోటులన్**

**(శివ. ప్రథ.ఆశ్వా.16 పద్యం)**

గణాలతో కూడుకొని, అక్షర నిబద్ధతతో, ప్రకరణానుకూలంగా, భావాన్ని కలిగిస్తూనే, రసార్థాలతో గుణముతో మనసును రంజింపజేస్తూ, రసవంతాలై ఉంటూ, పూర్వ కవులు ఆచరించిన మార్గాన్నే అనుసరిస్తూ, యతి (వళి) ప్రాసలను కలిగి ఉండి వినేవారికి హాయిని కొల్పాలి. అలా ఉంటేనే అది పద్యమని, నా కవిత్వం అటువంటిదేనని పద్యానికి ఉండవలసిన వాటిని వివరించాడు శ్రీనాథుడు. అంతేకాకుండా ఏయే కవుల ప్రభావం తనపై ఉందో ఆ కవులను గూర్చి చర్చిస్తూ సంస్కృత, తెలుగు కవుల స్మరణ చేసాడు.

## 2.3. పూర్వకవుల స్మరణ

కవిత్వ రచన చేసేటప్పుడు మనకన్న ముందున్న వారిని అనుసరించి వెళ్ళవలసి ఉంటుందని చెప్పాడు శ్రీనాథుడు. అతని రచనా మార్గం అలాగే కొనసాగింది కూడా. తెలుగు, సంస్కృత భాషల్లో పండితుడైన శ్రీనాథుడు, ఉభయ భాషాకవులను అంటే తెలుగులో ఉన్న పూర్వకవులను, సంస్కృతంలో గల పూర్వకవులను తన కావ్యాల్లో స్మరించాడు. వారి ప్రతిభను పుణికి పుచ్చుకున్నాడు. రచనా విధానాన్ని అనుసరిస్తూనే కవిత్వంలో గొప్ప వర్ణనా కౌశలాన్ని చూపెట్టాడు. శ్రీనాథుడు 15వ శతాబ్దివాడు కావడంచేత, అంతకు ముందున్న 11వ శతాబ్దంనాటి కవి అయిన నన్నయ మొదలుకొని తనకాలం వరకు గల ప్రముఖ తెలుగు కవులను, తన కావ్యాల్లో స్తుతించాడు.

### 2.3.1. తెలుగు కవులు

తెలుగు కవులైన వేములవాడ భీమనను,నన్నయ, తిక్కన, ఎఱ్ఱనను, ప్రస్తుతించి వారి కవితామార్గాలు తనకు అనుసరణీయమైనవని చెప్పాడు. అంతేకాకుండా వారు పూర్వకవులని తన కావ్యాల్లో స్మరించడం జరిగింది. భీమేశ్వర పురాణంలో 'నన్నయ'ను స్మరిస్తూ...

**కం॥ నెట్టుకొని కొలుతు నన్నయ**
**భట్టోపాధ్యాయ సార్వభౌముని౯గవితా**
**పట్టాభిషిక్తు భారత**
**ఘట్టోల్లంఘన పటిష్ఠగాఢ ప్రతిభున్**

**(భీమే.ప్రథ.ఆశ్వా.8 పద్యం)**

ఇక్కడ నన్నయను ప్రస్తావిస్తూ 'భట్టోపాధ్యాయసార్వభౌముడని' కీర్తిస్తూ గౌరవించాడు. ఇతన్ని స్మరించడంవల్ల శ్రీనాథుని గౌరవభావం, అతని వ్యక్తిత్వం అర్థమవుతుంది. అలాగే తిక్కనను కూడా ప్రస్తావిస్తూ భీమఖండ ప్రథమాశ్వాసంలో పంచమ వేదంగా ప్రసిద్ధి పొందిన భారతాన్ని రచించిన తిక్కనను కవిబ్రహ్మగా చెప్పుతూ...

**ఉ॥ పంచమ వేదమై పర౯గు భారత సంహితనాంధ్ర భాష౯గా**
**వించె౯బదేను పర్వములు విశ్వజగద్ధిత బుద్ధి నెవ్వ౯డ**
**క్కాంచన గర్భతుల్యునక ఖండిత భక్తి నమస్కరింతు ని**
**ర్వంచిత కీర్తి వైభవ విరాజికి౯దిక్కన సోమయాజికిన్**

**(భీమ. ప్రథమ.ఆశ్వా. 11 పద్యం)**

సమస్త లోక క్షేమాన్ని, లాభాన్ని కలిగించే ఆలోచనతో పదిహేను పర్వాలను తెలుగు చేసిన కవిబ్రహ్మ బిరుదును కలిగిన తిక్కనను నమస్కరిస్తానని పలుకుతూ తిక్కనను గౌరవిస్తాడు.

కాశీఖండంలో మరొక పద్యంలో నన్నయ, తిక్కన, ఎఱ్ఱన ముగ్గురి గురించి తెలుపుతాడు. అలాగే శివరాత్రి మహాత్మ్యంలో కూడా ఇలా చెప్తాడు.

**ఉ॥ ఉన్నతమైన యంధ్రకవితోక్తుల నెంతయు౯ బ్రోడలైనయా**
**నన్నయభట్టు౯ దిక్కనవినాయకు౯ దత్సము శంభుదాసుని**
**న్నన్నగు౯బోలు నా కమలనాభుని౯జేరి భజింతునెంతయున్**
**సన్నుత శబ్ద శాస్త్రముల సంఘటనంబు ఘటించువేడుకన్**

**(శివ. ప్రథ.ఆశ్వా.13 పద్యం)**

చెప్పిన కవులను గూర్చి రెండు మూడు మార్లు స్మరించడం వలన వారి కవితా ప్రభావం ఇతనిపై ఉన్నదని కచ్చితంగా చెప్పవచ్చు. అలాగే "భావమునఁదలతు మద్గురు" అంటూ "శైవమతాగర్వ నిర్వహణావిష్కృత కీర్తిఁబండితారాధ్యవరున్" అని శివరాత్రి మహాత్మ్యంలో మల్లికార్జునా పండితారాధ్యున్ని తలవటం వలన శైవమతం పట్ల ఉన్న ఇష్టం తెలుస్తుంది. ఇలా తెలుగు కవుల స్మరణ చేసాడు.

### 2.3.2. సంస్కృత కవులు

శ్రీనాథునిపై సంస్కృత కవుల ప్రభావం కూడా ఉన్నదని చెప్పవచ్చు. ఎందుకంటే అతడు సంస్కృతపద భూయిష్ఠమైన సమాసాలను విరివిగా వాడాడు. సంస్కృతంలోని నైషధాన్ని తెనిగించినప్పుడు కేవలం ప్రత్యయాలను మాత్రమే వాడాడని శ్రీనాథున్ని దు,ము,వుల కవి అనే పేరును పెట్టి పిలిచారు. సంస్కృత కవులను తలచుకుంటూ ఒక సీసపద్యాన్ని రచించాడు.

**సీ॥ బాణునద్భుత శాస్త్ర బహుకలా పారీణుఁ బ్రకటవరకవితాఁ భ్యాసువ్యాసు**
**బంధుర గాంభీర్య బంధు సుబంధు విస్ఫురిత మహోన్నతిస్తోముసోముఁ**
**జిరతర మతిభద్రుఁజెన్నారు శివభద్రు, నతుల గుణస్ఫారు నమ్మయూరు**
**వరనీతి చాతురీ వాగ్భూతి భవభూతి, ముఖ్య సజ్జన దయామోఘమాఘు**

**గీ॥ ఘను వినూత్న వికాసు శ్రీ కాళిదాసు**
**దండి కావ్యానులాప వాగ్దండి దండిఁ**
**జిత్ర వాగ్జృంభణ ప్రఖ్యుఁజిత్త పాఖ్యుఁ**
**దగిలి మలహణు బిలహణుఁదలఁతునిపుడు**

**(శివ.ప్రథ.ఆశ్వా.12 పద్యం)**

బాణున్ని సుబంధున్ని, సోమున్ని, మయూరున్ని, భవభూతి, మాఘుడు, కాళిదాసు, దండి, మలహణుడిని, బిలహణుడిని ఇలా ప్రాచీన సంస్కృత కవులను స్మరిస్తూ వారి కవితా గుణాలను చెప్పి ఎప్పుడూ తలుస్తానని శ్రీనాథుడే స్వయంగా చెప్పాడు. అలాగే భీమఖండంలో కూడా మరొక పద్యంలో సంస్కృత కవుల గూర్చి స్తుతించడం కనిపిస్తుంది. ఆ పద్యాన్ని కూడా పరిశీలిద్దాం.

**సీ॥ ప్రణుతింతు రసభావ భావనామహనీయ కవితా సముల్లాసుఁగాళిదాసు**
**గణుతింతు నిరవద్య గద్యపద్య నిబంధ, పరితోషిత స్థాణుభట్టబాణు**
**భజియింతు సాహిత్య పదవీ మహారాజ్య, భద్రాసనాసీనుఁబ్రవర సేను**
**వర్ణింతు నంబోధి వార్వీచి గంభీర, తాసార వాక్సముత్కర్షు హర్షు**

తే॥ భాసశివభద్ర సౌమిల్ల భల్లులకును
మాఘ భారవి బిల్హాణ మల్హణులకు
భట్టి చిత్తపకవి దండి పండితులకుఁ
గీలు కొలుపుదు నొసలిపైఁగేలు దోయి

(భీమ.ప్రథమ.ఆశ్వా.7 పద్యం)

రస భావాలను పోషించడంలో గొప్ప కవితా లక్షణాలను కలిగిన కాళిదాసుని నిర్దుష్టమైన గద్యపద్యరచన చేసేటువంటి భాణభట్టుని పొగుడుతాను. సాహిత్య మహాసామ్రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించినటువంటి ప్రవరసేనున్ని కొలుస్తారు. అలాగే హర్షున్ని, భాసున్ని, శివభద్రున్ని, సౌమిల్లున్ని దండి మొదలైన కవులకు నమస్కరిస్తానని తెలిపాడు. ఇలా సంస్కృత కవులను స్మరించడం బట్టి ఆ భాషలో కూడా పట్టు ఉందని, ఆ భాషా సాహిత్యాన్ని చదివి ఆ కవుల ప్రభావాన్ని కలిగి ఉన్నాడని చెప్పవచ్చు. కాళిదాసు రసభావాలు ఈయన కవిత్వంలో ఉన్నాయని చెప్పవచ్చు.

పలనాటి వీరచరిత్ర కృత్యాదిలో కూడా వినాయకాది దేవతాస్మృతి తరువాత కాళిదాసును, నన్నయను స్మరిస్తూ 'కాళిదాసుకు మ్రొక్కి గౌరవంబొప్ప, నళినవంశజు నన్నయకు మ్రొక్కి'అని పలుకుతాడు. ఇటు తెలుగు కవులైన నన్నయ, తిక్కన, ఎఱ్రనలను స్మరించడంతోపాటు, అటు కాళిదాసు, భాస, మాఘ కవులను పేర్కొనడమే కాకుండా ఏయే కవుల ప్రభావం తనమీద ఉందో ఎవరి రచనా మార్గాన్ని తను అనుసరించాడో కూడా చెప్పాడు ఈ కవి.

## 2.4. శ్రీనాథుని కవితా గుణాలు

ప్రతి కవికీ ప్రత్యేకమైన ముద్ర ఉంటుంది. ఏదో ఒక కవితామార్గాన్ని అనుసరించి ఉంటారు. శ్రీనాథుని రచనలను గూర్చి కవితామార్గం గురించి పలువురు పండితులు పలురకాల చర్చ చేసారు. కొందరు రీతి మార్గం అని, కొందరు ధ్వని మార్గం, కొందరు వక్రోక్తి అని వివిధ రకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. కానీ శ్రీనాథుడే స్వయంగా కవిత్వం అంటే దానికికొన్ని లక్షణాలు ఉండాలి. అలా ఉంటే ఆ కవిత్వం చిరకాలం నిలిచి ఉంటుందని తన కవితా లక్షణాలను భీమఖండంలో చెప్పాడు.

మ॥ హరచూడ హరిణాంక వక్రతయుగాలంత స్ఫురచ్చండికా
పరిషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించెననఁగా సత్కావ్యముల్దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీ గేహరంగంబులన్

(భీమ.ప్రథమ.ఆశ్వా. 12 పద్యం)

ఈ పద్యంలో వక్రత, కాఠిన్యం (ప్రౌఢత), సరసత్వం అనే కవితా గుణాలను చెప్పడం జరిగింది. శివుని శిరస్సుపైన ఉన్న చంద్రుని పదహారవ కళ ఎంత అందంగా లోకోత్తరంగా, కళంకరహితంగా ఉంటుందో అలాంటి రమణీయమైన వక్రత కవిత్వంలో ఉండాలని చెప్పాడు. ఈ వక్రోక్తి మాత్రమే కాదు కాఠిన్యం అంటే పదప్రౌఢి కూడా ఉండాలని, ఆ కాఠిన్యం పయోధర కాఠిన్యంలా మృదువుగా ఉంటూనే, కఠినత్వాన్ని కలిగి ఉండాలని చెప్తుతూ, సరసత్వం కంటే రసపూరితమైన కవిత్వం ఉంటే గనుక ఆ కావ్యం చిరకాలం మనస్సులో నిలిచి ఉంటుందని చెప్పాడు.

ఇలా వక్రోక్తి, కాఠిన్యం ప్రౌఢోక్తి, సరసోక్తి అనే లక్షణాలను చెప్పాడు. కనుక ఈ కవితా గుణాలు తన కవిత్వంలో ఉన్నాయని చెప్పవచ్చు. వాటి గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### 2.4.1. వక్రత

వక్రత అంటే 'వంకర' అనే అర్థం అందరికి తెలిసినటువంటిదే. ఇక్కడ వాడే వక్రత అలంకార సంబంధి. అయితే వక్రతలో చాలా భేదాలున్నాయి. కుంతకుని 'వక్రోక్తి: కావ్యజీవితం'లో ముఖ్యంగా ఆరు రకాల వక్రతలను చెప్పి వాటిలో అంతర్ విభజనలు చేసాడు. ఈ వక్రత కుంతకుని వక్రోక్తి సిద్ధాంతానికి సంబంధించినటువంటిది. ఇందులో శబ్ద, అర్థ ప్రధానమైనవి, వస్తు రసప్రధానమైనవి, కారక, ప్రత్యయ ప్రాధాన్యమైనవి. వివిధ రకాల వక్రతలను చూపాడు. దాని గురించి విపులంగా తరువాత వివరిస్తాను.

### 2.4.2. కాఠిన్యం

శ్రీనాథుడు ఇక్కడ కాఠిన్యం అనే పదాన్ని వాడుతూ రెండవ లక్షణంగా చెప్పాడు. కఠినత అనే పదానికి అర్థం కటువైనది, పరుషమైనదనే అర్థాలున్నాయి. దీన్నే ప్రౌఢత అనే అర్థంతో కూడా వాడటం జరుగుతుంది. ఇక్కడ శబ్ద,అర్థ ప్రౌఢి అని రెండు రకాలుగా ఆలోచించాల్సి ఉంటుంది. ప్రౌఢమైన పదరచన, కొంత పరుషత కలిగిన కవిత్వం అని అర్థం చేసుకోవాలి. ఈ కవితా లక్షణం, ఓజఃగుణం ఉన్నటువంటి పరుషత్వంతో, ప్రౌఢమైన అర్థ సందర్భంగల భారతీ వృత్తితో కూడిన రచన అని భావించాలి.ఈ లక్షణం కూడా కుంతకుని వక్రోక్తిలో అంతర్భవిస్తుంది. రాబోయే పద్య సమన్వయంలో బోధపడుతుంది.

### 2.4.3. సరసత్వం

అన్ని సందర్భాలకు అనుగుణంగా ఔచిత్యవంతమైన రసపోషణ చేయడమే సరసతను కలిగి ఉండటం. ఈ రెండు లక్షణాలు కూడా కుంతకుని వక్రోక్తిలోనే అంతర్భవిస్తాయి. అంతర్ విభజనలో మనకు అర్థమవుతుంది. ఇలా శ్రీనాథుడు మూడు కవితా లక్షణాలను చెప్పుకు వచ్చాడు. నిజానికి కవిత్వం ఏ మార్గాన్ని అనుసరించి ఉంటే అది కవిత్వం అవుతుంది? మామూలు వచనానికి, కావ్యానికి తారతమ్యం ఏముంది? అనే ప్రశ్నకు సమాధానం15వ శతాబ్దిలోనే శ్రీనాథుడు చెప్పాడు. ఈ మూడు గుణాలు మాత్రమే కాదు నా కవిత్వంలో పూర్వకవుల ప్రభావం ఉంటుంది. వారి మార్గాన్ని కూడా నేను అనుసరించే కవిత్వం రాస్తానని చెప్పుతూ కాశీఖండ పీఠికలో ఒక పద్యంలో ఇలా చెప్తాడు

### 2.4.4. కుంతక శ్లోకం–అనుకరణ

శ్రీనాథుడు చెప్పిన కవిత్వ గుణాలకు సరిగ్గా సరిపోయే కారిక కుంతకుని వక్రోక్తి జీవితంలో కన్పిస్తుంది .కుంతకుని కారికకు ఈ పద్యం అనుసరణం అని చెప్పవచ్చు .

**కా॥ వాగ్వల్ల్యాః పదపల్లవాస్పదతయా యావక్రతోద్భాసినీ**
**విచ్ఛిత్తిః సరసత్వ సమ్పదుచితా కాప్యుజ్జ్వలా జృమ్భతే**
**తామాలోచ్య విదగ్ధ షట్పద గణైర్వాక్య ప్రసూనాశ్రయం**
**స్ఫారామోదమనోహరం మధు నవోత్కణ్ఠాకులం పీయతామ్**

**(35.కా.ఉన్మే.ద్వితీ.వజీ)**

వక్రతతో మిక్కిలి ప్రకాశించేదిసముజ్జ్వలమైంది .సరసత్వ సంపదకు సముచితమైంది , అయ్యే వాక్కు అనే వల్లీ పద పల్లవాలను ఆశ్రయించిన విచ్ఛిత్తిని వివేచించివిదగ్ధులనే తుమ్మెద , ష్పంలోని మకరందాన్ని నూతన వాక్యమనే పు .గణాలు వాక్య పుష్పాన్ని ఆశ్రయించుకొని ఉంది .ఉత్కంఠతతో ఆస్వాదించుగాక అని భావం

వక్రత అంటే ఇక్కడ చంద్రుని వక్రత అనే భావించాలిశ్రీనాథుడు పద్యంలో చెప్పిన . ఈ ఒక ఉదాహరణ చాలు శ్రీనాథుని మార్గం .సరసత్వం చెప్పబడ్డాయి ,విషయాలు వక్రత తదనంతర కవుల ,వుల కవితా లక్షణాలుఇతర క .కుంతకుని వక్రోక్తి మార్గం అని చెప్పడానికి విమర్శకుల చర్చలు పరిశీలించిన మీదట కుంతకుని వక్రోక్తి మార్గాన్నే శ్రీనాథుడు .అభిప్రాయాలు .అనుసరించాడని అవగతమవుతుంది

**సీ॥ వచియింతు వేములవాడ భీమన భంగి, ఉద్దండలీలనొక్కొక్కమాటు**
**భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు**

వాక్రంతు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరునిఠేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు

తే॥ నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ
యిప్పుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేర

(కాశీ.పీ.18 పద్యం)

వేములవాడ భీమనలో ఉన్న ఉద్దండత, నన్నయలో గల తెలుగు, సంస్కృత భాషల్లోని ఉభయ వాక్ప్రౌఢి, సందర్భానుసారంగా ఉపయోగించే తిక్కన రసాభ్యుచితబంధం, ఎర్రన సూక్తివైచిత్రి నీలోపల ఉన్నాయి. ఎంతో మంచి కావ్యాలను రాసిన నీవు వీరభద్రారెడ్డికి ఈ కాశీఖండం అనే ప్రబంధాన్ని అంకితం ఇవ్వు అని వేమారెడ్డి అడిగినట్లుగా తన కవితా మార్గం గురించి తానే చెప్పుకున్నాడు. ఈ నాలుగు కవితా లక్షణాలను కొంత సునిశితంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. శ్రీనాథుని కవితా మార్గ నిర్ధారణకి వీటన్నింటిని పరిశీలించడం తప్పనిసరి కాబట్టి, వేములవాడ భీమన ఉద్దండలీల, నన్నయ ఉభయ వాక్ప్రౌఢి, తిక్కన రసాభ్యుచితబంధం, ఎర్రన సూక్తి వైచిత్రి అంటే అర్థవివరణ చేసి వాటిని పరిశీలన చేయవలసి ఉంది. అప్పుడే శ్రీనాథుని రచనలలో విశిష్టత తెలుస్తుంది.

"ఇతడు 'పూర్వకవి ముఖ్య విరచితాపూర్వ కావ్య భావరస సుధా చర్వణ ప్రౌఢత'తో నాంధ్ర సాహిత్యమునకు గీర్వాణ సాహితి సరసను సింహాసనము ప్రతిష్ఠించుటకు పథకములు పన్నినాడు. కల్పనములు చేసినాడు. చేతికి దొరికిన కావ్యములపై తెనుగు జీవము క్రుమ్మరించినాడు. ఈ యుద్యమములోనే సంస్కృత పండితులు శిరసావహించు కాశీఖండ, నైషధములను చేపట్టి ప్రతిభా ముద్రతో నిర్వహించినాడు. కాసట బీసటగానున్న యచ్చపు తెనుగు జోదుల కతలకు కావ్యగౌరవము ప్రతిపాదించినాడు. పద్యరచనములో నన్నయకోవవాడు శ్రీనాథుడు ఆతని మార్గముల నీతడు విశాలపరచి ఘంటాపథములు చేసినాడు. క్రొత్త నడకల సాధించి వానికొకవింత దర్జా నెలకొల్పినాడు" (హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి.1988.పుట.73) కనుక శ్రీనాథుని పూర్వకవుల కవితా మార్గాలను పరిశీలించడం ఆవశ్యమైంది.

"గడచిన వెయ్యేండ్ల ఆంధ్ర సాహిత్య చరిత్రను సమీక్షించినచో కవిత్రయము ఒక్కటేగాక రెండు మూడు అట్టి కవిత్రయములున్నట్లుగా కనిపించును. మొదటి కవిత్రయము అందరెరిగినదే

రెండవ కవిత్రయము జక్కన, శ్రీనాథుడు, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. మూడవ కవిత్రయం అల్లసాని పెద్దన, తెనాలిరామకృష్ణుడు, రామరాజభూషణుడు. మొదటి కవిత్రయము వారి మధ్య ఉన్న పరస్పర సంబంధమెట్టిదో తదనంతర కవుల మీద వారి ప్రభావమెట్టిదో రెండవ కవిత్రయము వారిది కూడా అట్టిదే" (1976.పుట.60) అని గుంటూరు శేషేంద్రశర్మ శ్రీనాథున్ని రెండవ కవిత్రయానికి ఆద్యునిగా చెప్పారు.

శ్రీనాథుడికన్నా ముందున్న కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన ముగ్గురిది ఒక్కొక్కరిది ఒక్కో లక్షణం. కానీ శ్రీనాథునిది రెండవత్రయం అలాకాదని శేషేంద్రగారు చెప్తూ "శ్రీనాథ జక్కన పినవీరనలటువంటి రెండవ కవిత్రయమువారు వచ్చిన దగ్గరనుండియే తెలుగున కవిత్వము రక్తిగట్టినది.వారినే తర్వాత కవులనుసరించి ప్రబంధయుగము నావిష్కరించిరి. వారిని, ప్రబంధ కవులెట్లనుసరించిరను విషయమును పరిశీలించుటకు ముందు రెండవ కవిత్రయము వారిలో పరస్పర సంబంధమెట్టిదో తెలుసుకొన్నచో చాలా చిత్రంగా ఉండును" (శేషేంద్రశర్మ, గుంటూరు.1976.పుట.60) ఇలా శ్రీనాథుడు పూర్వకవుల మార్గాన్ని అనుసరిస్తూనే తనదైన కవితా మార్గాన్ని కొనసాగించాడు. తర్వాత తరాలకు ఆదర్శమైనాడు.

### 2.4.5. వేములవాడ భీమన

శ్రీనాథుడు ప్రస్తావించిన కవులలో మొదటివాడు వేములవాడ భీమన ఏ కాలానికి చెందినవాడనే విషయంమీద చర్చలు జరిగాయి. నన్నయ సమకాలీకుడని కొందరు, కాదని కొందరు వాదనలు చేసారు.

"ప్రాచీన కవులలో శ్రీనాథునికి ముందు బహుదేశములు తిరిగి రాజులను దర్శించి, శాపానుగ్రహ సమర్థులైన కవులలో వేములవాడ భీమకవియొకఁడు. ఈతని తొలుత స్తుతించిన వాడు శ్రీనాథుడు. ఈతడు క్రీ.శ. 1100-80 ప్రాంతముల విలసిల్లెనని, పూసపాటి రాచిరాజు విరచిత మాలికను బట్టి నిర్ణయించితిని" (1956.పుట.288) అని నిడదవోలు వెంకటరావు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

సాహిత్యములో ఇప్పటికి ఇతని కాలం చర్చగానే మిగిలిపోయింది. శ్రీనాథుడు నన్నయ పేరు కన్నా ముందు ప్రస్తావించడం వలన నన్నయకన్నా పూర్వంవాడని అంటారు. వేములవాడ భీమకవి చెప్పిన చాటువులు ప్రచారంలో ఉన్నందున వాటిని బట్టికూడా కాలం నిర్ణయం చేయడానికి పండితులు ప్రయత్నం చేసారు. "ఇతడు నన్నయగారి సమకాలికుడు కాకపోయినా నన్నయగారి తరువాత, తిక్కనగారికి ముందూ జీవించి ఉంటాడని కొందరి ఊహ. ఇతర భాషాసాహిత్యాల

సాక్ష్యాలను బట్టి ఇతణ్ణి పద్నాలుగో శతాబ్దానికి తీసుకువెళ్ళిన వాళ్ళూ ఉన్నారు. కందుకూరి వీరేశలింగంగారు ఇతణ్ణి 1340–50ల మధ్యవాడని చెప్పారు. భీమకవి వ్రాసిన పుస్తకాల పేర్లు వినడమేగాని చూడలేదని చెప్పిన పింగళి సూరన కాలం క్రీ.శ.1550. భీమకవి 1350 ప్రాంతాలవాడయితే క్రీ.శ.1550 నాటికే అంటే రెండువందల ఏండ్లలోనే పుస్తకాలు దొరకడం మానేస్తాయా? భీమకవిని నుతించిన మొట్టమొదటివాడు శ్రీనాథుడు. 1380–1450 ప్రాంతాలవాడు. తనకు యాభై సంవత్సరాల పూర్వపువాడిని శ్రీనాథుడు నన్నయగారికన్నా ముందుగా పేర్కొంటాడా?" (ఆరుద్ర.1990.పుట.203) అని ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో కొంత చర్చించడం జరిగింది.

ఈ వేములవాడ భీమకవి శతకంధర రామాయణం, రాఘవపాండవీయం, నృసింహపురాణం, బసవపురాణం, సుమతి శతకం, హరవిలాసం రచనలుగా చెప్తారు. అలాగే మల్లియరేచన రాసినట్టుగా చెప్పబడే కవిజనాశ్రయం భీమనరచించి రేచనకిచ్చినట్లుగా ఒకమాట ప్రచారంలో ఉంది. ఇది ఇలా ఉంటే భీమన రాసిన కావ్యాలు ప్రస్తుతం అలభ్యాలు. ఇతడు రాసిన 'రాఘవపాండవీయము' ముందు తన మహాభారతము నిలువదనే భయంతో నన్నయ దానిని నాశనం చేశాడని, దానికి ప్రతీకారం తీర్చుకుంటూ. నన్నయ రాసిన, ఆంధ్రశబ్ద చింతామణిని తీసుకెళ్ళి భీమన గోదావరిలో కలిపాడని అప్పకవి తన అప్పకవీయంలో రెండు పద్యాల్లో చెప్పడం. కొందరు నిజమని, మరికొందరు అబద్ధమని అదొక కట్టుకథ అని కొట్టిపారేసారు.

వేములవాడ భీమకవి కావ్యాలు ఏవీ లభించకపోయినప్పటికీ అతని చాటువులు మాత్రం ప్రసిద్ధి చెంది ఇప్పటికీ నిలిచి ఉన్నాయి.

**మ॥ ఘనుడన్ వేములవాడ వంశజుఁడ దాక్షారామ భీమేశనం**
**దనుఁడన్ దివ్యవిషామృత ప్రకటనాకావ్య ధుర్యుండ భీ**
**మన నా పేరు వినంగఁజెప్పితిఁ దెలుం (గళిం) గాధీశ! కస్తూరికా**
**ఘనసారాదిసుగంధ వస్తువులు వేగం దెచ్చి లాలింపురా?**

**(చాటు. మణి.మొ.భా.285 పద్యం)**

ఈ పద్యం ద్వారా భీమకవి తెలంగాణా ప్రాంతంలో సిరిసిల్ల తాలూకాలో ఉన్న వేములవాడ ప్రాంతం వాడని చెప్తారు. ఎందుకంటే అక్కడ ద్రాక్షారామ భీమేశ నందనుడన్ అనటం వల్ల భీమేశ్వరాలయం, శివాలయాలు వేములవాడలో ఉండటం చేత ఆ ప్రాంతానికి చెందినవాడని చెప్పడానికి అవకాశం ఏర్పడింది.

శ్రీనాథుడు "వచియింతు వేములవాడ భీమనభంగి" అని చెప్పుకున్న మాటకు నిదర్శనంగా కాశీఖండంలోని పద్యం కనిపిస్తుంది. అంతేకాకుండా ఇప్పుడు భీమన చాటు పద్యాన్ని చూసాము కదా. అలాంటి చాటు పద్యాన్ని సమానమైన పదాలను మూడింటిని వాడుతూ శ్రీనాథుడు రాసిన పద్యాన్ని చూద్దాం.

**శా॥ అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా**
**భిక్షదానము చేయురా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్**
**దాక్షారామ పురీవిహారవర గంధర్వాప్సరో భామినీ**
**వక్షోద్వయ కుంభికుంభములపై వాసించు దద్వాసనల్**

**(చాటు.మణి.మొ.భా.296 పద్యం)**

ఇక్కడ కస్తూరికా, తెలుంగాధీశ, దాక్షారామ పదాలు సమానంగా ఇద్దరు ఒకే కాలానికి చెందిన వ్యక్తులు మాత్రం కాదు. అయినప్పటికి సమ పదాలను వాడారు. వేరువేరు వ్యక్తులు అయినప్పటికి బిరుదు అదే అయి ఉంటుంది. అందుకని వాడాడేమోనని పెద్దలు భావించారు. దీనిని బట్టి కూడా శ్రీనాథునిపై భీమన ప్రభావం ఉందని చెప్పడం ఇక్కడ ఉద్దేశ్యం.భీమకవి కాలం గురించి ఎవరు నిర్ధారించి చెప్పలేదు.

"భీమకవి రాజకళింగ గంగును సందర్శించినట్లు అతడు చెప్పిన పద్యమును బట్టి తెలియుచున్నది. ఈ రాజకళింగ గంగు అనంతవర్మ చోడ గంగదేవుడని, అతని కాలం క్రీ.శ.1076–1147 అని శ్రీపాద గోపాలకృష్ణమూర్తి సూచించియున్నాడు. భీమకవి చెప్పిన చాటుపద్యములలోని చారిత్రక పురుషుల కాలముబట్టి అతడు క్రీ.శ.11వ శతాబ్ది చివరి పాదముననో 12వ ప్రథమ పాదముననో జీవించియుండెనని చెప్పవచ్చును" (నాగయ్య, జి. 2003.పుట.113).

### 2.4.5.1. ఉద్దండలీల

శ్రీనాథుడు భీమన రచనల్లోని ఉద్దండలీల తన కవిత్వంలో కనిపిస్తుందని చెప్పాడు. అసలు ఉద్దండలీల అంటే ఏమిటి? దాన్ని ఏ అర్థంలో శ్రీనాథుడు స్వీకరించాడనే విషయాన్ని ముందు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. 'ఉద్దండ' అనే పదానికి జనవ్యవహారంలో విజృంభించు అనే అర్థం ఉంది. ఇవి కాకుండా "ఎత్తబడిన కర్రగలది, పైకి లేచినకాడగలది, ప్రచండమైనది, భయంకరమైనది, ఉత్కటము, ఎక్కువైనది, పొడువైనది, ఉన్నతమగుదండము, అతిశయించు,

విజృంభించు" (1979.పుట.586) అనే అర్థాలున్నట్లు శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువుల్లో అర్థాలు పేర్కొన్నారు.

'భీమన ఉద్దండలీల' అనేది శబ్దానికి సంబంధించినట్టిది. శబ్దప్రయోగంలో ఉద్దండత అనేది ఉచ్చారణలో కనిపిస్తుంది. దీని శబ్ద వక్రత, వర్ణవిన్యాస వక్రతగా కూడా చెప్పవచ్చు. నన్నయ భాషలో అక్షరరమ్యతగా, శ్రీనాథుని భావనలో ఉద్దండతగా కాఠిన్యంగా, శబ్ద ప్రౌఢిమగా చెప్పవచ్చు. ఇక్కడ అతిశయించడం, శబ్ద విజృంభణ చేయడం, ఎడతెరిపిలేని సమాస భూయిష్ఠ పదాలను వాడటం అని గ్రహించాలి. శ్రీనాథుడి పద్యాన్ని ఒకటి ఉద్దండలీలకు ఉదాహరణగా చూద్దాం. అతని ప్రౌఢికి తార్కాణంగా చెప్పవచ్చు.

**ఆడెందాండవ మార్భటీ పటహలీలాటోప విస్ఫూర్జిత**
**క్రీడాడంబర ముల్లసిల్ల గరళ గ్రీవుడు జాటాటవీ**
**క్రోడాఘాట కరోటి కోటర కుటీలురచ్చింధు నీ**
**చీ డోలాపటలీ పరిస్ఫుటతర స్ఫీత ధ్వని ప్రౌఢిమన్**

**(భీమే.చతు.ఆశ్వా. 14 పద్యం)**

శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో శివుని తాండవాన్ని చెప్పిన పద్యం ఇది. శివుని తాండవాన్ని ఎంత చక్కగా దీర్ఘ సమాస పదాలను వాడి చూపించాడో అవగతమవుతుంది. శబ్దాలు ఉచ్చరిస్తుంటే నిజంగా శివుడి తాండవ దర్శనం కన్పించే విధంగా పదప్రయోగం ఉంది. దీనిని భీమన ఉద్దండలీలకు. శబ్ద ప్రౌఢికి ఉదాహరణగా చెప్పవచ్చు.

### 2.4.6. నన్నయ

నన్నయ పదకొండవ శతాబ్దానికి చెందినకవి. మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో మొదటివ్యక్తి. ఈయన సంస్కృతంలో ఉన్న భారతాన్ని రెండున్నర పర్వాలను తెలుగులోకి అనువాదం చేసాడు. రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించిన రాజరాజనరేంద్రుని ఆస్థానకవిగా నన్నయ ఉండేవాడు. ఆ రాజు కోరిక మేరకు భారతాన్ని తెనిగించి ఆ రాజుకే అంకితమిచ్చినట్లు ప్రతీతి. నన్నయ భారతంతోపాటు చాముండికా విలాసం, ఇంద్ర విజయం అనే కావ్యాలను, ఆంధ్రశబ్ద చింతామణి అనే తెలుగు వ్యాకరణాన్ని సంస్కృతంలో రాసాడని చెప్తారు. కానీ అవి అలభ్యాలు.

నన్నయకు ఆదికవి, శబ్దశాసనుడు అన్న బిరుదులున్నాయి. అయితే నన్నయకు ఆదికవి అన్న బిరుదు ముందుకాలంలో ఉన్నది కాదు తర్వాత కవులు అలా పిలిచారని చెప్తారు. తిక్కన,

ఎర్రన, శ్రీనాథుడు, నన్నయను ప్రస్తావించారు కానీ ఆదికవి చెప్పలేదు. మారన మార్కండేయ పురాణంలో 'ఆంధ్రకవితాగురుడన్నాడు' కొలని గణపతిదేవుడు శివయోగ సారంలో 'ఆంధ్రకవితాపథము తీర్చినవాడని' రామరాజభూషణుడు వసుచరిత్రలో 'మహిమున్ వాగనుశాసనుడని' కీర్తించారు. దానిని బట్టి నన్నయను ఆదికవిగా పిలుస్తున్నారని, నన్నయ భారతంలో తను ఆది కవి ఎక్కడా చెప్పుకోలేదు. పూర్వ కవులను స్తుతించే సంప్రదాయం ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తుంది. శ్రీనాథుడు కూడా తన పూర్వులైన కవులను ప్రస్తావిస్తూ 'నన్నయ పేరు ఉచ్చరించడం అతని కవితా లక్షణమైన ఉభయ వాక్ప్రౌఢి నాలోపల ఉన్నదని తెలియజెప్పడం జరిగింది. నన్నయ పేరుకు ముందే వేములవాడ భీమన ఉద్దండలీల గూర్చి చెప్పడం కనిపిస్తుంది.

### 2.4.5.6.1. నన్నయ కవితాగుణాలు

నన్నయ మహాభారతావతారికలో తన కవితా లక్షణాలను చెప్పుతూ ఒక పద్యాన్ని రాసాడు.

**ఉ॥ సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో**
**నారసి మేలునానితరులక్షర రమ్యత నాదరింప నా**
**నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా**
**భారత సహింతా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్**

**(శ్రీ.మ.ఆ.భా.ఆది.పర్వ.ప్రథ.ఆశ్వా.26 పద్యం)**

నన్నయ కవితాగుణాలలో మొదటిది ప్రసన్న కథాకలితార్థయుక్తి. అక్షర రమ్యత రెండవది. మూడవది నానారుచిరార్థ సూక్తినిధిత్వం. అని చెప్పడం జరిగింది. ఇందులో అక్షర రమ్యత అనేది శబ్ద సౌందర్యానికి, నాద సౌష్ఠవానికి సంబంధించినది. ఇందులోనే భాషాపటిమ అనేది గుర్తించవచ్చు.

### 2.4.6.1.1. ఉభయ వాక్ప్రౌఢి

శ్రీనాథుడు నన్నయ కవితా గుణంగా చెప్పిన ఉభయ వాక్ప్రౌఢి అక్షరరమ్యతలో భాగమని చెప్పాలి. ప్రౌఢి అనే పదానికి చాలా అర్థాలున్నాయి. సందర్భానుసారంగా దానికిగల అర్థాన్ని గ్రహించాల్సి ఉంటుంది. నన్నయది కర్ణపేయమైన శైలి అని చెప్తారు. పద్యం వినగానే చెవులకు ఇంపుగా అనిపిస్తుంది. శబ్దగాంభీర్యాన్ని, అలాగే శబ్ద రమణీయతను కలిగి ఉంటుంది. 'ఉభయ' అనే పదం సంస్కృతం, తెలుగు భాషల గురించి చెప్తుంది. నన్నయ 'మార్గ' కవితను వాడాడని, తర్వాత వచ్చిన శైవ కవులు జానుతెనుగు, దేశీమార్గం అనే పదాలను వాడుతూ దేశీ కవిత్వం చెప్పారనే ఉద్దేశ్యంతో కూడా నన్నయది ఉభయకవిత్వం అన్నారు. ఇక్కడ మార్గ కవిత్వం సంస్కృత

పదభూయిష్ఠమైనదిగా చెప్పుకోవాలి. అటు సంస్కృత పదాలను, ఇటు తెలుగు పదాలను వాడిన ఉభయ 'వాక్ప్రౌఢి'గల కవిగా శ్రీనాథుడు ఇక్కడ చెప్పడం జరిగింది, ఉభయ పదానికి అర్థం ఇక్కడ ఇదే. సంస్కృత పద భూయిష్ఠాలైన సమాసాలను, తెలుగు పదాలను వాడుతూ ఉభయ వాక్ప్రౌఢి చూపిన నన్నయ పద్యాన్ని చూద్దాం.

**మ॥ కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్ సూచుచుండన్ మదో**
**ద్ధురుఁడై ద్రౌపదినిటు సేసినఖలున్ దుశ్శాసనున్ లోక భీ**
**కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘని**
**ర్ఝర ముర్వీపతి సూచుచుండనని నాస్వాదింతునుగ్రాకృతిన్**

**(శ్రీ.మ.ఆ.భా.ఆది.పర్వ.ద్వితీ.ఆశ్వా.233 పద్యం)**

ఇక్కడ భీమునికి, దుశ్శాసనునికి మధ్యగల భీకరమైన యుద్ధ వాతావరణాన్ని సూచిస్తూ చెప్పిన పద్యం. సంస్కృత పదాలను, తెలుగు పదాలను జోడించి వాడటం జరిగింది. ఆ యుద్ధ పరిస్థితిని ఈ పదాలు వెల్లడి చేస్తున్నాయా? అన్నట్లుగా పద్యం ఉంది. ఇక్కడ నన్నయ ఉభయ వాక్ప్రౌఢి కనిపిస్తుంది.

ఈ విధంగానే శ్రీనాథుని రచనల్లో ఉభయ భాషా పాండిత్యం, వాక్ప్రౌఢిమ కనిపిస్తాయి. నన్నయ కవితా గుణాలు తనని ప్రభావితం చేశాయని చెప్పకనే చెప్పుతూ ఆ కవితా గుణం తనలో ఉందని "భాషింతు నన్నయభట్టు మార్గంబున 'ఉభయ వాక్ప్రౌఢి' అన్నాడు. ఆ మార్గాన్ని అనుసరించాడు కూడా. ఆ లక్షణం ముందు పద్యాల ఉదాహరణలలో తెలుస్తుంది.

"నన్నయగారిలోనొక విలక్షణమైన రచన యున్నది. ఆ రచనాపద్ధతిఁదీసుకొని తిక్కనగారు దానిని బెంచుకొని యొక ప్రత్యేక శైలిగా వృద్ధి పొందించుకున్నారు. తిక్కన గారి శైలి నన్నయగారి నుండి గ్రహించినదే" (విశ్వనాథ సత్యనారాయణ.2007.పుట.18) అని పెద్దలు వారి అభిప్రాయాలను తెలుపుతూ నన్నయ కవితా మార్గాన్ని తర్వాతి కవులు అనుసరించారని తెలియబరిచారు.

## 2.4.7. తిక్కన

తెలుగు సాహిత్యంలో ఎంతోమంది కవులున్నారు అందులో ముఖ్యంగా ప్రాచీన సాహిత్యాన్ని వెలయించిన కవుల్లో తిక్కన సోమయాజిది ఉత్కృష్ట స్థానం అని చెప్పవచ్చు. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన కవిత్రయంలో తిక్కన రెండవవాడు. నన్నయ

రెండున్నర పర్వాలను ఆంధ్రీకరించగా, తిక్కన పదిహేను పర్వాలను ఆంధ్రీకరించాడు. మిగిలిన అరభాగాన్ని ఎర్రన తెనుగు చేసాడు. ఈ ముగ్గురికి సాహిత్య చరిత్రలో వెలకట్టలేని స్థానం ఉంది.

తిక్కన 13వ శతాబ్దానికి చెందిన కవి. ఈయన పూర్తిపేరు తిక్కన సోమయాజిగా చెప్తారు. తిక్కన ఇంటిపేరు కొట్టరువువారు. తిక్కన తరువాత ఆ వంశీయుల వారి పేరు పాలూరివారు అయ్యింది. తిక్కన తండ్రి పేరు కొమ్మన, తల్లిపేరు అన్నమ. ఇతని తాతగారి పేరు భాస్కరుడు. 'గుంటూరువిభుడు, సారకవితాభిరాముడు అనే బిరుదులు ఇతనికి ఉన్నాయి.

తిక్కనకు కవి బ్రహ్మ, ఉభయ కవి మిత్రుడు అనే బిరుదులున్నాయి. ఈతని కవిత్వంలో నాటకీయత, రసాభ్యుచితబంధం అనేవి తప్పనిసరి ఉంటాయి. తిక్కన తొలిరచన నిర్వచనోత్తర రామాయణం, మలిరచన మహాభారతంలోని విరాటపర్వం మొదలుకొని చివరిపర్వం వరకు రచించడమే. ఈ రచనల ఆధారంగా ఆతని కవితాశైలిని గుర్తించవచ్చు. "తిక్కన ప్రౌఢోక్తి, రసాసక్తి, వర్ణనానురక్తి గల మహాకవి. ఉభయ కావ్యప్రౌఢి శిల్పమును నిర్వచనోత్తర రామాయణమునందు అతడు తీర్చినాడు. అది భారత రచనాకాలమును పరిపక్వమై పారము ముట్టినది. భారతమునందు తిక్కన కావ్యరసమును కొనియాడినాడు. తిక్కన చరమ లక్ష్యము బ్రహ్మానందము. ఆ లక్ష్యసిద్ధికి రసానందము ఒక మధుర సాధనము. నిర్వచనోత్తర రామాయణంను 'రసోల్లాస మధురమని విరాట పర్వమును 'నానాసరభ్యుచితయోల్లాసి' అని పేర్కొని యున్నాడు. అది తిక్కన రసప్రవణతను చాటుచున్నది" (2021.పుట. ) అని జి. నాగయ్యగారు తెలిపారు.

### 2.4.7.1. తిక్కన రసాభ్యుచిత బంధం

శ్రీనాథ మహాకవి పూర్వకవులను స్తుతిస్తూ వారి కవిత్వంలో ఉన్న లక్షణాలను కూడా పాటిస్తున్నానని, నా కవిత్వంలో వారి లక్షణాలున్నాయని చెప్పిన సందర్భంలో తిక్కన 'రసాభ్యుచితబంధాన్ని' పేర్కొన్నాడు. అసలు తిక్కన రసాభ్యుచిత బంధం అంటే ఏమిటి? దానిని శ్రీనాథుడు ఏ విధమైన అర్థంలో వాడాడో తెలుసుకోవాలి.

తిక్కన రచించినటువంటి భారతంలో ముఖ్య రసం శాంతం. కానీ సందర్భానుసారంగా నవరసాలను తన పద్యాల్లో చూపడం జరిగింది. అందుకే విరాటపర్వాన్ని 'నానారసాభ్యుదయోల్లాసి'గా చెప్పడం కనిపిస్తుంది. రాజనీతి, యుద్ధతంత్రాలను ఎరిగిన కవి కాబట్టి అలాంటి ఘట్టాలలో కూడా ఉచితమైన రౌద్ర, వీర, భయానక రసాలను అత్యద్భుతంగా వాడాడు.

"హృదయాహ్లాది చతుర్థమూర్జిత కథోపేతంబు నానా రసాభ్యుదయోల్లాసి" అని విరాటపర్వంలో చెప్పినంత మాత్రాన కేవలం విరాట పర్వానికే ఈ వాక్యం అనుకోవడంకాకుండా ఈ విశేషణం మిగిలిన పర్వాలకు కూడా వర్తిసుంది. ఉత్తరాభిమన్యుల వివాహ సమయంలో శృంగారాన్ని ద్రౌపదిపై కీచకునికి కలిగిన మోహంలో ఆభాస శృంగారాన్ని, యుద్ధ పర్వంలో రౌద్రాన్ని, భీభత్సాన్ని, ఉద్యోగపర్వంలో వీర రసాన్ని స్త్రీ పర్వంలో కరుణ రసాన్ని, శాంతి, అనుశాసనిక పర్వాలలో శాంత రసాన్ని ఇలా అన్ని రసాలను ఔచిత్యవంతంగా తిక్కన పోషించాడని పరిశోధకవిమర్శకులు అభిప్రాయపడ్డారు.

విరాటపర్వంలో ఒకచోట రౌద్ర రసాన్ని ఏ విధంగా చూపెట్టాడో ఈ క్రింది పద్యంలో చూద్దాం.

**శా॥ దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర**
**ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్**
**గీర్వాణాకృతు లేవు రిప్డు నినుఁదోర్లీలన్ వెసంగిట్టి గం**
**ధర్వుల్ మానముఁబ్రాణముంగొనుట తథ్యం బెమ్మెయిన్ కీచకా**

**(నాగయ్య, జి.2021.పుట.278)**

ద్రౌపదిని కీచకుడు మోహించి వెంటపడినప్పుడు అతని వారిస్తూ కోపంతో చెప్పిన పద్యం ఇది. నా భర్తలు ఐదుగురు భుజపరాక్రమాలతో ఉన్నారు. శత్రువీరులను నిర్మూలించడంలో ఆరితేరినారు. వాళ్ళని ఎదురించడం ఎవరి సాధ్యం కాదు. నీ ప్రాణాన్ని తీస్తారు అని ద్రౌపది పలుకుతుంది. ఇక్కడ ఉద్రేకంతో కూడిన మాటలను సంయుక్తాక్షర ప్రాసతో, రౌద్ర రసాన్ని చక్కగా పోషించాడు. 'రసాస్తోక' అనే పద ప్రయోగాన్ని కూడా మనకు కనిపిస్తుంది. ఈ విధంగా తిక్కన రసాలను ఔచిత్యంగా పోషించడంవల్లనే రసాభ్యుచిత బంధం అతని కవితా లక్షణమైంది.

శ్రీనాథుడు కూడా 'రసాభ్యుచితబంధం' నా రచనల్లో కనిపిస్తుందని పేర్కొనటంలో ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే తన కావ్యాల్లో కూడా నవరసాలు ఓలలాడించగలనని చెప్పడం. అలాగే తిక్కన 'ఉభయకవి మిత్రుడి'గా ప్రసిద్ధి చెందాడు. నెల్లూరి రాజు మనుమసిద్ధి ఆస్థానంలో పలువురు కవులు ఉండేవారు. అందులో తెలుగు కవులు, సంస్కృత కవులు ఉండేవారు. తిక్కన తెలుగులో కవిత్వం చెప్పటంతోపాటుగా, సంస్కృతంలో కూడా కవిత చెప్పి 'ఉభయ కవి మిత్రుడు' అనే సార్థకనామాన్ని పొందాడు. శ్రీనాథుడు కూడా సంస్కృతాంధ్ర భాషల్లో కవిత్వం చెప్పగల దిట్ట కనుకే నా కవిత్వంలో నన్నయ ఉభయ వాక్ప్రౌఢి ఉంటుందని చెప్పాడు. నన్నయ కవిత్వంలోనే కాదు తిక్కన కవిత్వంలో

కూడా ఉభయ భాషల ప్రౌఢి ఉంది. రసాభ్యుచిత బంధంతోపాటు, తిక్కనలోని ఈ కవితా గుణాన్ని కూడా శ్రీనాథుడు చెప్పకపోయిన స్వీకరించాడనే చెప్పవచ్చు.

**శా॥ ధాటీఘోటక రత్న ఘట్టనమిళద్ద్రాఘిష్ఠ కళ్యాణ ఘం**
**టాటంకార విలుంఠలుంఠిమహోన్మత్తాహిత క్షోమిభృ**
**త్కోటీరాంకితకుంభినీ ధర సముత్కూటాటవీఝాటక**
**ర్ణాటాంధ్రాధిప నీకు బ్రహ్మయువౌ! సాంపరాయని తెలుంగా!**

**(చాటు.మణి.ప్రథ.భా.295 పద్యం)**

శ్రీనాథుని రచనల్లో కూడా రసవంతమైన పద్యాలను అద్భుత వర్ణనలతో మనకందించాడు. కనుక తిక్కన కవి 'రసాభ్యుచిత బంధం' అను కవితా లక్షణం శ్రీనాథునిలో ఉందని చెప్పవచ్చు. ఆ కవితా లక్షణం సరసత్వం అనే లక్షణంలోకూడా అంతర్భవిస్తుంది.

### 2.4.8. ఎర్రన

ఎర్రన క్రీ.శ.1280 నుండి 1360 ప్రాంతంలోని కవి. ఈయన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి. ఎర్రన తల్లిదండ్రులు పోతమాంబికా, సూర్యనార్యులు. పేరమాంబ, ఎరపోతసూరి అనేవారు ఇతనికి పితామహులు. ఇతని గ్రామం గూడ్లూరుగా చెప్తారు. ఎర్రన వంశీయులు ఆపస్తంబ సూత్రులు, శ్రీవత్స గోత్రులు అని అరణ్యపర్వశేషంలో చెప్పాడు. ఎర్రనకు గురువైన శంకరస్వామి వలన శివభక్తుడై, 'శంభుదాసుడు' అనే బిరుదును పొందినట్లుగా ప్రచారంలో ఉంది. ప్రబంధ పరమేశ్వరుడు' అనే బిరుదును పొందినట్లుగా ప్రచారంలో ఉంది. 'ప్రబంధ పరమేశ్వరుడు' అనే బిరుదు కూడా ఉంది. ఇతను రామాయణం, హరివంశం, నృసింహపురాణం అను కావ్యాలను రచించాడు. అంతేగాక నన్నయ రచించిన మహాభారతంలోని అరణ్యపర్వం సగభాగాన్ని రాసి పూర్తి చేసాడు.

ఎర్రన తెలుగు సాహిత్యంలో ఉన్న గొప్పవారిలో ఒకరు. భారత కవిత్రయంలో మూడవవ్యక్తి. నన్నయ తిక్కన వేసినటువంటి బాటలోనే వారిని అనుసరిస్తూ వారితో సమానంగా భారత రచన చేసాడు. నన్నయను తెలుగులో ఆదికవిగా చెప్పుకోగా, తిక్కన నుడికారాలను కాపాడి తన రసాభ్యుచిత బంధంతో సాహిత్యాన్ని పరిమళింపజేయగా, ఎర్రన తన సూక్తి వైచిత్రితో సమున్నతమైన సాహితీ కృషి చేసాడు. భారతంలో నన్నయ అరణ్య పర్వంలో నాల్గవ ఆశ్వాసంలో

142వ పద్యం వరకు రచించి ఆపేశాడు. ఇది నన్నయ చివరి పద్యం. 143వ పద్యంతో ఎర్రన మొదలుపెట్టి పర్వాన్ని పూర్తి చేశాడు. అలా భారతాన్ని నన్నయ రచనగానే కొనసాగించాడు.

ప్రతీ కవికి ప్రత్యేకమైన కవితాశైలి ఉంటుంది. నిర్దిష్టమైన కవితా లక్షణాలను కలిగి కావ్య రచన చేస్తుంటారు. అది వారి అభిరుచికి అనువైనదిగా ఉండటం పరిపాటి. 'తత్కవితారీతియు గొంత దోప దద్రచనయకా' అని అరణ్య పర్వశేషంలో చెప్పటం జరిగింది. ఇక్కడ తద్రచనయకా అంటే నన్నయకు లాగా రచిస్తానని అర్థం. అంటే అతని కవిత్వంలో నన్నయ అక్షరరమ్యత, సూక్తినిధిత్వం, ఉభయ వాక్ప్రౌఢి వంటి లక్షణాలున్నాయని చెప్పకనే చెప్పటం. ఎర్రన తన రచనల్లో ఎక్కడా మధ్యాక్కరలు, వాడలేదు. కానీ నన్నయ మొదలుపెట్టిన శరత్కాల వర్ణనను యథావిధిగా కొనసాగించడానికేమో అరణ్యపర్వంలో మధ్యాక్కరలు వాడాడు. అలాగే శబ్దప్రౌఢిమను అలాగే కొనసాగించాడు. నన్నయ రచించిన 'రయవిచలత్ తురంగమ తరంగముల్' అనే పద్యంలాగా 'అనుపమ తేజుడున్నత భుజాగ్రుడు దగ్రుడువైరి నిగ్రహుం' అనే పద్యాన్ని రాసాడు. ఇలాంటి ఉదాహరణలు చూసినప్పుడు నన్నయ మార్గాన్ని అనుసరించాడనే చెప్పవలసి ఉంటుంది.

### 2.4.8.1. ఎర్రన సూక్తివైచిత్రి

ఎర్రన రచనల్లో ఎక్కువగా 'సూక్తివైచిత్రి' కనిపిస్తూ ఉంటుంది. దానినే నేను పాటిస్తానని "పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని ఠేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు" అని శ్రీనాథుడు పలికాడు.

మొదటగా 'సూక్తి వైచిత్రి' అనే మాటకు అర్థం తెలుసుకోవలసిన అవసరం ఉంది. 'సూక్తి అంటే 'సు' ఉక్తి సూక్తి అని విడదీసి అర్థం చెప్పుతూ 'సు' అంటే మంచి ఉక్తి అంటే మాట మంచిమాట, సుభాషితము అనే అర్థాలను చెబుతారు. ఇది జనవ్యవహారంలో అందరికి తెలిసినటువంటిది. సూక్తి అనే పదాన్ని ఎన్ని అర్థాలలో వాడవచ్చు? మరి శ్రీనాథుడు ఏ అర్థంలో ఈ పదప్రయోగాన్ని చేసాడో చర్చించాల్సిన అవసరం ఇక్కడ ఉంది.

" 'సుష్ఠు ఉక్తం సూక్తం' – మనోహరార్థముతో మనోజ్ఞముగా చెప్పబడిన మంచిమాట సూక్తి. ఏదైనా ఒక నీతినో, ధర్మమునో, న్యాయమునో సూటిగా సూత్రప్రాయముగా చెప్పినప్పుడు వాటిని సూక్తులని వ్యవహరించుట పరిపాటి. 'సూక్తి' అను పదము సామాన్యముగా 'సుభాషితము' అనునర్థములో వాడబడుచున్నది. ఇది రూఢార్థము. 'సూక్తియనగా హితోక్తి లేక హితోపదేశము సుభాషితము, తెలివైనమాట, జాతీయోక్తి అని అర్థములు చెప్పవచ్చును అని ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారి అభిప్రాయము. దీనిని బట్టి అర్థాంతరన్యాసాలంకారములు, నీతిబోధకములు, లోకానుభవసూచకములగుపదములు, పదబంధములు, లోకోక్తులు, జాతీయములు అన్నియు

సూక్తులనబరగుచున్నవి" (1984.పుట.22) అని జి. నాగయ్యగారు సూక్తివైచిత్రి గురించి తమ అభిప్రాయాలను ఇతర కవుల అభిప్రాయాలను 'ఎర్రన శ్రీనాథుల సూక్తి వైచిత్రి' అనే గ్రంథంలో తెలిపారు.

ఎర్రనకు వాడినటువంటి 'సూక్తి అనే పదాన్ని జనవ్యవహారంలో ఉన్న మంచిమాట అనేటువంటి రూఢ్యార్థాన్ని కాకుండా, హితోక్తి, తెలివైనటువంటి ఉక్తి లాలిత్యం, చతురోక్తి అనే అర్థాలను గ్రహించాల్సి ఉంటుంది. ఇక్కడ 'ఉక్తి వైచిత్రి' అంటే వినసొంపైన పద్యాలతో పాఠకుల మనస్సును గెల్చుకోవడం అని అర్థం. మృదుమధురమైన లోకోత్తరమైన చమత్కారాన్ని కల్గించడం.

"శ్రీనాథుడి సమకాలికుడైన వాత్స్యవరదాచార్యుడు తన వసంత తిలక భాణములోని ప్రస్తావనలో 'అలంకారవతీసూక్తి' పదమును యౌగికార్థమున ప్రయోగించినాడు. దీనిని బట్టి అలంకారములు సూక్తులలో అంతర్భవించును. సమాసోక్తి, విశేషోక్తి, వ్యాజోక్తి, స్వభావోక్తి, అతిశయోక్తి ఇత్యాదిగ ఉక్తి విశేషములైన అలంకారములు గుర్తింపబడియే యున్నవి. అలంకారములు సాధారణముగా వాక్యగతమై యుండును. అలంకారాశ్రయములగు సూక్తులు కూడా కొన్ని కలవు. వాటిలో అర్థాంతరన్యాసాదులు వచ్చును. సూక్తులు పదము, పదబంధము, సమాసము, కారకము, వాక్యము అను భాషాంగములన్నింటిని ఆశ్లేషించును" (నాగయ్య,జి.1984.పుట.288) సూక్తి వైచిత్రి అను మాటను నానా రకాలుగా పెద్దలు వివరించి చెప్పటం జరిగింది. అలంకారికులు దానిని అలంకార అర్థంలో కూడా వాడారు.

సంస్కృత ఆలంకారికుల్లో ఒకరైన కుంతకుడు 'వక్రోక్తి' సిద్ధాంతంలో ఉక్తివైచిత్రిని ఒక రకమైన వక్రతగా చూపెట్టాడు. శ్రీనాథుడు కూడా తన రచనల్లోవక్రత, ప్రౌఢత, సరసత ఉంటాయని చెప్పాడు కనుక ఈ సూక్తి వైచిత్రి అనేది వక్రతావ్యాపారంలో అంతర్భవిస్తుందని చెప్పవచ్చు. ఆ ఎర్రన మార్గమే తర్వాతి కాలంలో శ్రీనాథునికి మార్గదర్శకమైందని గ్రహించాలి. ఎర్రన సూక్తివైచిత్రికి ఒక ఉదాహరణ ఇక్కడ చూద్దాం.

**కం॥ కామంబును గ్రోధంబును**
**నేమఱక జయింపవలయు నెల్లవిధములన్**
**ధీమహిత యిదియ సతత**
**క్షేమంకరమైన పథము గృతబుద్ధులకున్**

**(శ్రీ.మ.ఆం.భా.అరణ్య పర్వం.పంచ.ఆశ్వా. 109 పద్యం)**

కామక్రోధాలను జయించాలని, అది ఎంతైనా మంచిదని, అన్ని విధాలుగా క్షేమకరమని తెలపటం జరిగింది. ఇక్కడ హితమైన మాటలను చెప్పటం కనిపిస్తుంది. ఇలా మంచిమాటను సందర్భానుసారంగా కావ్యంలో చొప్పించి వివరించడం కవి ప్రతిభను తెలియజేస్తుంది. ఇది సూక్తివైచిత్రికి, ఎఱ్ఱన సూక్తినిధిత్వమనే కవితా లక్షణానికి ఉదాహరణ.

ఎఱ్ఱన మార్గాన్ని అనుసరించిన శ్రీనాథుడు తన కావ్యాల్లో వివిధ సందర్భాల్లో సూక్తులను ఉపదేశించాడు. కాశీఖండంలోని ఒక ఉదాహరణను ఇప్పుడు చూద్దాం.

**సరస్వతీర్థాంబువుల కంటె సమధికంబు**
**పావనంబైన జనయిత్రి పాదజలము**
**వరతనూజున కఖిల దేవతల కంటె**
**జనని యెక్కుడు సన్నుతాచార నిరత్వ**

**(కాశీఖండం.చతు.ఆశ్వా.20 పద్యం)**

ఇక్కడ తల్లిని గురించిన హితోక్తిని తెల్పుతూ సర్వదేవతల కన్నా కూడా తల్లి ఎక్కువని సుభాషితాన్ని చెప్పటం జనహిత వాక్యాన్ని చెప్పడం. మాతృభక్తి గొప్పదిగా చాటడం కనిపిస్తుంది. ఎఱ్ఱన 'సూక్తివైచిత్రి' లాగే శ్రీనాథుని సూక్తివైచిత్రి కూడా సమంగా ఉందని అతని కవితా లక్షణాలను ఈ కవి పునికి పుచ్చుకున్నాడని తెలియజేసే పద్యం ఇది.

**2.4.8.1.1. సూక్తివైచిత్రి రకాలు**

"సూక్తి వైచిత్రి కావ్యములోని వివిధ విషయముల నాశ్రయించి యుండును ఒక్కొక్కప్పుడది శబ్దగతమై ఉండును. ఒక్కొక్కప్పుడు అర్థగతమై యుండును. అలాగుననే అలంకారము, రసము మున్నగువాని నాశ్రయించి యుండవచ్చును. ఒకే సందర్భమునందు సూక్తివైచిత్రి వివిధ విషయముల నాశ్రయించి యుండవచ్చును. అనగా ఒకే పద్యమునందు గాని పదము, వాక్యము, అలంకారము, రసము మొదలైన వాని నాశ్రయించి సూక్తివైచిత్రి సమృద్ధిగ నుండగలదు. అందు ప్రాధాన్యము వహించు దానిని గైకొని, అట్టి సూక్తివైచిత్రి కది లక్ష్యమని చెప్పుట సముచితము" (2013. పుట.20) అని ఎన్.ఎస్.రాజు ఇలా వివరించారు. అట్లే సూక్తి వైచిత్రిలోని రకాలను వివరించారు.

ప్రధానంగా సూక్తివైచిత్రి నాలుగు రకాలని అవి 1) సాధారణ సూక్తి వైచిత్రులు, 2) విశిష్ట సూక్తి వైచిత్రులు, 3) నిగూఢ సూక్తి వైచిత్రులు, 4) శాస్త్రగత సూక్తివైచిత్రులు.

**1) సాధారణ సూక్తివైచిత్రి**

మొదటి రకమైన **'సాధారణ సూక్తి వైచిత్రి'** లో మళ్ళీ అంతర్భేదాలు ఉన్నాయి.

1) శబ్దగతము (శబ్దాన్ని ఆశ్రయించి ఉంటుంది).
2) అర్థగతము (అర్థాన్ని ఆశ్రయించి ఉంటుంది).
3) పదగతం (విశేషంగల పదాన్ని ఆశ్రయించి ఉంటుంది).
4) వాక్యగతం (వాక్యంచేత వైచిత్ర్యాన్ని కలుగజేస్తుంది).
5) ప్రకరణగతం (ఒక సన్నివేశాన్ని ఆశ్రయించుకొని వైచిత్రి ఉంటుంది).

**2) విశిష్ట సూక్తి వైచిత్రి**

ఇందులో ఏడు రకాలున్నాయి.

1) అలంకారగరము (అలంకారముచేత చమత్కారం కలగటం).
2) వ్యంగ్యగతము (వచనంచేత కాకుండా వ్యంగ్యంచేత చమత్కారం).
3) జాతీయ పదగతము (జాతీయ పద ప్రయోగం వలన కలిగే వైచిత్ర్యం).
4) లోకోక్తిగతము (లోకోక్తిగల ఉపమానాలతో కలిగే చమత్కారం).
5) అర్థాంతరన్యాసగతము (అర్థాంతరన్యాసం చేత చమత్కారం).
6) సుభాషితగతము (ఆప్తవాక్యం లేదా సుభాషితగతమైన చమత్కారం).
7) సుకవి సమయగతము (కవి సమయాలను ఆశ్రయించి ఉండే చమత్కారం).

**3) నిగూఢ సూక్తి వైచిత్రి**

ఇందులో ఆరు భేదాలున్నాయి. వీటినే అంతర్గత సూక్తి వైచిత్రులంటారు.

1) రసగతము (రసాన్ని ఆశ్రయించి ఉండే చమత్కారము).
2) గుణగతము (శ్లేష, ప్రసాద, మాధుర్య, సౌకుమార్యాది గుణాలను ఆశ్రయించేది).
3) వృత్తిగతము (కైశికి, అరభటి, సాత్త్వతి లాంటి వృత్తులను ఆశ్రయించేది).
4) రీతిగతము (వైదర్భి, గౌఢి, పాంచాలి మొదలగు రీతులను ఆశ్రయించేది).
5) పాకగతము (ద్రాక్ష, కదళీ మొదలగు పాకాలను ఆశ్రయించేది).
6) శయ్యాగతము (పదాల కూర్పు వలన వైచిత్ర్యం కలిగి ఉండేది).

**4) శాస్త్రగత సూక్తి వైచిత్రి**

1) ఛందోగతము (యతి, ప్రాసాది ఛందోబద్ధ వృత్తాలచేత కలిగే వైచిత్ర్యం).
2) వ్యాకరణగతము (వ్యాకరణాంశాల చేత వైచిత్ర్యం కలగడం).

ఇలా నాలుగు విధాలుగా ప్రాథమికంగా వైచిత్రులు ఉండగా దాంట్లో అంతర్భాగాలున్నాయి. మొత్తం 20 రకాల వైచిత్రులు ఉన్నట్లు ఎన్.ఎస్. రాజుగారు 'సూక్తి వైచిత్రి' అనే గ్రంథంలో తెలిపారు.

ఈ సూక్తి వైచిత్రిలో ఉన్న అంతర్భేదాలన్నీ కూడా కుంతకుడు చెప్పిన వక్రోక్తి అంతర్భేదాలతో సరిపోతాయి. పదపూర్వార్ధ, పదపరార్ధ, వాక్య వక్రతలో భాగాలుగా కనిపిస్తాయి.

## 2.5. తదనంతర కవులు – శ్రీనాథుని ప్రభావం

శ్రీనాథుడు తన పూర్వ కవులను ఏ విధంగా అయితే స్మరించాడో వాళ్ళ కవిత గుణాలు తనకు ఆదర్శమని చెప్పాడో శ్రీనాథుని గూర్చి అతని కవిత గుణాల గూర్చి ప్రస్తావించిన కవులున్నారు. వారి స్మరణలో కూడా శ్రీనాథుని కవితా మార్గం ఎటువంటిదని అవగతమవుతుంది.

గడియారము వేంకట శేషశాస్త్రిగారు శ్రీనాథుని కవితా శైలి గురించి ప్రస్తావిస్తూ తర్వాతి కవులు శ్రీనాథుని కవితా శైలిని ఎలాంటి లక్షణాలతో పోల్చారో చెప్పారు. 'శ్రీనాథ కవి సార్వభౌముడు' అనే గ్రంథంలో శ్రీనాథుని శైలిని గురించి పలు కావ్యాలను నిశిత పరిశీలన చేసి ఏ ఏ కవులు శ్రీనాథుని కవిత్వాన్ని ఎలా వర్ణించారో తెలుపుతూ

**రాధామాధవ కవి**

> **'సూనాస్త్ర ప్రమదా మదస్ఫురిత వక్షోజాత గారిన్యమునన్**
>
> **బూనన్ జాలు వచోవిలాసములు...**

**పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు**

> **శ్రీనాథ భట్ట భాషా నిగుంభంబుల పరిమళంబు**

**సోమనాథ సోమయాజి**

> **రుచిర పద సిద్ధధారా నిరూఢ మహిమఁదగిన శ్రీనాథునచ్యుతత్వము**

**చెన్నమరాజు**

> **బహుముఖ ప్రఖ్యాత మహిత శయ్యా విశేష సనాథు శ్రీనాథు**
>
> **సవరము చిననారాయణ కవి**
>
> **... జాతి వార్తా రస**
>
> **ర్ధి పదోజృంభణ శబ్ద జృంభణ కళా శ్రీనాథు'**

**బేతపూడి కృష్ణయ్య**

> **'నానా గీర్వాణ వచస్తుతిన్ మెలఁగు శ్రీనాథు'**

**కుమారదూర్జటి**

> **'తనదు శ్రీనాథ తత్వ మనుపమ నృప సభాం**
>
> **తర చిత్ర రచన బందురత మెరయ"**

(గడియారం, వెంకట శేషశాస్త్రి.శ్రీనాథ కవిసార్వభౌముడు.1975.పుట.25, 26) ఇలా కవులు తమ కావ్యాల్లో శ్రీనాథుని రచనలను గూర్చి చెప్పారు.

అలాగే శ్రీనాథుని "కావ్యకళ" అనే పరిశోధన గ్రంథంలో కూచిబొట్ల హరిగారు కూడా వివిధ కావ్యాల్లో కవులు చేసిన ప్రశంసను చెప్తూ

**చెన్నమరాజు**

**(చారుచంద్రోదయము)... బహుముఖ ప్రఖ్యాత**

**మహిత శయ్యా విశేష సనాథు శ్రీనాథు సన్నుతించి**

**సవరము చిన నారాయణ కవి**

**(బహుళాశ్వ చరిత్ర)...**

**జాతి వార్తా రసర్ధిపదోజ్జృంభణ శబ్దజృంభణ కళాశ్రీనాథు..."**

**(హరి, కూచిబొట్ల.1976.పుట.245)**

అలాగే రామరాజభూషణుడు కూడా పూర్వ కవులను స్తుతిస్తూ వసుచరిత్రలో ఒక పద్యంలో శ్రీనాథుణ్ణి స్మరిస్తూ పద్యం చెప్పాడు.

**మ॥ మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్ గుండలీంద్రుడుత**

**న్మహనీయ స్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా**

**మహిమహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపు వాటించు నీ**

**బహుళాంధ్రోక్తిమయ ప్రపంచముఁదత్ప్రాగల్భ్య మూహించెదన్**

**(వసు.దశ.ఆశ్వా.1 పద్యం)**

ఇక్కడ శ్రీనాథున్ని కూడా పూర్వ కవులలో ముఖ్యునిగా భావించినట్లుగా తెలుస్తుంది.

పైన గడియారం వేంకట శేషశాస్త్రిగారు చెప్పినట్లు 'రాధామాధవము' రచించిన చింతలపూడి ఎల్లనార్యుడు శ్రీనాథున్ని పొగుడుతూ ఇలా అన్నాడు.

**శా॥ వక్షోజాత కాఠిన్యమున్ సూనాస్త్ర ప్రమదామద స్ఫురిత**

**బూనంజాలువచోవిలాసముల నేర్పుల్ చూపి కర్ణాటక**

**క్ష్మానాథేంద్రు సభన్ గవిత్వవిజయోత్సాహంబుఁ గైకొన్నమా**

**శ్రీనాథుం గవిసార్వభౌముఁ గొలుతున్ సేవాంజలుల్ గీల్కొనన్**

**(రాధ.ఆశ్వా.11.1 పద్యం)**

శ్రీనాథుని కవితా నేర్పుని, వాక్చాతుర్యాన్ని ఇందులో కవి పొగిడాడు. అలాగే భట్టుమూర్తి నరసభూపాలీయంలోని కృత్యవతరణికలో బాణుడు, భవభూతి, మాఘుడు మొదలైన వారిని పొగుడుతూ శ్రీనాథుణ్ణి గూర్చి చెప్పుతూ

"శ్రీనాథుని పదప్రసిద్ధ ధారాశుద్ధి"

(నర.ఆశ్వా.11.1 పద్యం)

అని పద ప్రసిద్ధమైన కవిత్వ ధారాశుద్ధి కలవాడిగా చెప్తాడు. ఇలా కవులు శ్రీనాథున్ని స్మరిస్తూ అతని కవిత్వం సంస్కృత పదాలతో కూడుకుందని పదప్రసిద్ధమై కాఠిన్యమను లక్షణాన్ని కలిగి ఉందని, సమ్మితమై ఉందని తమ అభిప్రాయాలను తెలియదేశారు. విశ్వనాథ సత్యనారాయణగారు కవులను గూర్చి చెప్తూ "శ్రీనాథుడు రసప్రసిద్ధ ధారాధుని" అని అంటాడు. రసవత్తర కావ్యాలకు నిలయమైనవాడిగా చెప్పాడు. జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యంగారు 'సాహిత్యంలో చర్చనీయాంశాలు' అనే గ్రంథంలో శ్రీనాథుని ప్రస్తావన రాగా అతనిది 'రీతిమార్గం' కవితామార్గం అని చెప్పారు.

ఇలా పలువురు పలురకాల అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అసలైన శ్రీనాథుని కవితా మార్గం ఏమిటని ప్రశ్న ఉదయిస్తుంది. విమర్శకుల అభిప్రాయాలు, పండితుల పరిశోధనలు, చర్చలు కవి తనకై తానూ చెప్పిన 'హర చూడా హరిణాంక వక్రత' అనే పద్యంలో మూడు కవితా గుణాలు, పూర్వ కవుల మార్గాలైన ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధం, సూక్తి వైచిత్రి అన్ని కూడా చిన్న చిన్న నామాంతరాలతో కుంతకుడు చెప్పిన వక్రతా వ్యాపారంలోని భేదాల్లోనే ఇమిడిపోతున్నట్లుగా తోస్తుంది. కాబట్టి శ్రీనాథుని కవితా మార్గం వక్రోక్తి మార్గంగా సహేతుకంగా సోదాహరణంగా నిరూపించాలని అనుకుంటున్నాను. కనుక ముందుగా వక్రోక్తిని గురించి ఆ సైద్ధాంతిక నేపథ్యం గూర్చి తెలుసుకోవాలి.

## 2.6. సైద్ధాంతిక నేపథ్యం

అలంకార శాస్త్ర గ్రంథాలను పరిశీలించినట్లైతే సంప్రదాయ భేదాలు కనిపిస్తాయి. శబ్దం కావ్యమని కొందరు, అర్థవంతమైనదే కావ్యమని కొందరు, శబ్దార్థాల కలయికే కావ్యమని కొందరు ప్రతిపాదించారు. ఇలా కావ్యం గూర్చి, కావ్య స్వరూపం గూర్చి చర్చ చేశారు. శబ్దమో, అర్థమో, శబ్దార్థమో కావ్యమైతే శరీరం సంగతి సరే కాని ఆత్మ ఏదవుతుందనే చర్చ మొదలైంది. "ఏది ఉన్నంత మాత్రాన కావ్యమునకు కావ్యత్వం సిద్ధించునో ఏది లేనంత మాత్రాన కావ్యానికి కావ్యత్వం సిద్ధింపదో అది కావ్యాత్మ అనబడును" (నరసింహం, కె.వి.ఆర్.1985.పుట.75) అని కావ్యాత్మ గురించి చెప్పారు. అనేక సంప్రదాయాలు బయల్దేరాయి. సహేతుక చర్చలతో సిద్ధాంత స్థాపనలు చేసారు అలంకారికులు.

### 2.6.1. రసం

ఇక ఆత్మ స్థానంలో ఏది ఉంటే అది కావ్యాత్మ అవుతుంది? అనే చర్చకు బయలుదేరారు మన భారతీయ ఆలంకారికులు. వివిధ కాలాల్లో వచ్చినవారు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వారి అభిప్రాయాలే సంప్రదాయాలుగా, ఆలంకారిక ప్రస్థానాలుగా పయనించాయి. ఇలా కావ్య శరీరం గురించి, ఆత్మ గురించి చర్చలు చేశారు. మొదటగా భరతుడు 'నాట్యశాస్త్రం' అనే గ్రంథంలో "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం కావ్య శరీరమితివృత్తము. దీని సౌందర్య హేతువు రసము" అని (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 2008. పుట.114) రస సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

### 2.6.2. అలంకారం

భరతుని తర్వాత భామహుడు "శబ్దార్థౌ సహితౌ కావ్యం కావ్యమునకు శబ్దార్థములు శరీరమనిము, స్త్రీ పురుషాదులు శరీర సౌందర్యమును నలంకారముకు (నగలు) పెంపొందించుననియు గావునఁగావ్యమునకు నలంకారములు ప్రధానమనియు నిర్వచించెను" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.2008.పుట.114) అలంకారాల ప్రస్తావన తెచ్చింది భామహుడే. అందులో వక్రోక్తి అలంకారాన్ని చెప్పింది కూడా ఇతడే.

### 2.6.3. గుణం

ఆరవ శతాబ్దానికి చెందిన కవి దండి. ఈయన కావ్యాదర్శం అనే గ్రంథాన్ని రాశాడు. "శరీరం తావదిష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ (రమణీయార్థ భూషితమగు పద సంఘాతము కావ్య శరీరము)" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.2008.పుట.114) అని కావ్య శరీరం గూర్చి తెలిపాడు. కావ్య శరీరానికి గుణములు ప్రధానమని చెప్తూ గుణ సంప్రదాయాన్ని తెలిపాడు.

### 2.6.4. రీతి

వామనుడు తొమ్మిదవ శతాబ్దపు ఆలంకారికుడు. ఈయన కావ్యాత్మ గురించి చర్చ చేశాడు. "రీతిరాత్మా కావ్యస్య' అను సిద్ధాంతాన్ని వచించెను. శరీరమునకు ఆత్మవలెనే కావ్య శరీరమునకు నాత్మయుండుననియు నదిరీతియనియు నాతని సిద్ధాంతము" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.2008.పుట.114).

### 2.6.5. ధ్వని

వామనుని తర్వాత ఆనందవర్ధనుడు సాహిత్య రంగానికి వచ్చాడు. "ఆయన ధ్వన్యాలోకమను గ్రంథమును రచించెను ఆయనయొక క్రొత్త సిద్ధాంతము లేవఁదీసెను. ఆయన

సిద్ధాంతమిది. 'కావ్య శరీరమున కాత్మ ధ్వని'. అది వస్త్వలంకార రసరూపము. అనఁగా వస్తు ధ్వని; అలంకార ధ్వని; రసధ్వని అని ముప్విధములు. ఈ మూటిలో వస్త్వలంకార ధ్వనులకన్న రసధ్వని సర్వశ్రేష్ఠము" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.2008.పుట.119) అని తెలిపాడు. రసధ్వని ప్రధానంగా తెలిపాడు ఆనందవర్ధనుడు.

### 2.6.6. వక్రోక్తి

తర్వాత తొమ్మిదో శతాబ్దంలో కుంతకుడనే ఆలంకారికుడు 'వక్రోక్తిః కావ్య జీవితం' అని తెలిపాడు. ఇది ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతానికి ప్రతికూలంగా ప్రతిపాదించాడు. భామహుడు చెప్పిన వక్రోక్తి అలంకారాన్ని పెంచిపోషించాడు. ఇతనిది వక్రోక్తి సిద్ధాంతం. భామహుడు వక్రోక్తిని సర్వాలంకార బీజంగా చెప్పితే కుంతకుడు ప్రత్యేకమైన సిద్ధాంతాన్ని చెప్పి దానిలో అంతర్విభజనలు చేసాడు.

### 2.6.7. అనుమితి

మహిమభట్టు అనే ఆలంకారికుడు ధ్వని సిద్ధాంతాన్ని ఖండిస్తూ అనుమాన సంప్రదాయాన్ని ప్రతిపాదించాడు.

> **"అనుమానేంతర్భావం సర్వస్యాపి ధ్వనేఃప్రకాశయితుం**
> **వ్యక్తి వివేకం కురుతే ప్రణమ్య మహిమా పరాం వాచం"**

ఎల్ల విధములగు ధ్వనులను ననుమానమునందే యంతర్భవింపఁజేయుటకై మహిమభట్టు వాగ్దేవికి నమస్కరించి, వ్యక్తి వివేక గ్రంథమును రచించుచున్నాడు" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 2008.పుట.119) అంటూ అనుమానమునందే అన్ని అంతర్భవిస్తాయని తెలిపాడు.

### 2.6.8. ఔచిత్యం

కుంతకుని తర్వాత క్షేమేంద్రుడనే ఆలంకారికుడు కొత్త సిద్ధాంతాన్ని తీసుకువచ్చాడు. అదే ఔచిత్యం. ఉచిత స్థానంలో ఉన్నప్పుడు అలంకారాలు, అలంకారాలవుతాయి. ఔచిత్యంతో కూడుకున్న గుణాలు గుణాలౌవుతాయి. అన్ని కూడా ఉచిత స్థానంలో ఉంటేనే ఔచిత్యవంతంగా ఉంటుందని "ఔచిత్య విచార చర్చ" అనే గ్రంథాన్ని రాసి చెప్పాడు.

ఇలా కొన్ని అలంకార ప్రస్థానాలు రావడం కనిపిస్తుంది.

1) భరతుడు – రస సంప్రదాయం
2) భామహుడు – అలంకార సంప్రదాయం
3) దండి – గుణ సంప్రదాయం

4) వామనుడు – రీతి సంప్రదాయం

5) ఆనందవర్ధనుడు – ధ్వని సంప్రదాయం

6) కుంతకుడు – వక్రోక్తి సంప్రదాయం

7) మహిమభట్టు – అనుమాన సంప్రదాయం

8) క్షేమేంద్రుడు – ఔచిత్య సంప్రదాయం

ఈ ఎనిమిది ప్రస్థానాల్లో కుంతకుని వక్రోక్తి ప్రస్థానం శ్రీనాథుని కావ్యాల్లో చూడడం జరుగుతుంది. ఈ ప్రస్థానం గురించి కుంతకుని గురించి వివరంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే వక్రోక్తిని గురించి మొదట ప్రస్తావించిన భామహుడు చెప్పిన అభిప్రాయాన్ని కూడా కొంత పరిశీలించాల్సి ఉంది.

## 2.6.9. వక్రోక్తి ప్రస్తావన–భామహుడు

ఆలంకారికులు ఒక్కో రకమైన సిద్ధాంతాలను తెలియజేశారు. వక్రోక్తి అనే ప్రస్తావన మాత్రం భామహుని కాలంలోనే వచ్చింది. కావ్యానికి అలంకారాలు అవసరమని చెప్పి స్వభావోక్తికి వ్యతిరేకంగా వక్రోక్తిని చెప్పాడు. భరతుని తర్వాత 5వ శతాబ్దంలోని ఈ భామహుడు శ్రవ్యకావ్య చర్చను చేసి, కావ్యానికి అలంకారాలు ప్రధానమని, వాటివల్లనే కావ్య సౌందర్యం చేకూరుతుందని చెప్పాడు.

"భామహుడు వక్రోక్తికి గొప్పహోదా కల్పించాడు. తర్వాతి కాలంలో కుంతకుడు ఆ సంప్రదాయాన్ని గట్టిగా సమర్థించాడు. నాయకాదులు సౌందర్య భావోద్దీపకమైన విభావములుగా పరిణామం చెందడం పూర్తిగా వక్రోక్తి యొక్క శక్తి వల్లనే అంటాడు భామహుడు" (ఆలంకారికులు.2002.పుట.4).

"ఇతరాలంకారికులెల్లరును సమ్మతించిన స్వభావోక్తి నీతఁడంగీకరింపలేదు. 'స్వభావ విరుద్ధముగాననఁగా వికటముగాఁబలికినపుడే యానందము గలుగుననియు, నా వికటోక్తియే వక్రోక్తియనియు, నలంకారములెల్ల వక్రోక్తులే యనియు నాతని సిద్ధాంతము" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.నరసభూపాలీయం.2008.పుట.114).

"కుంతకుని వక్రోక్తికి చాలా ముందుగానే, భామహుడు తన కావ్యాలంకారంలో వివరణ లేకుండా కావ్యశోభాకరమైందంటూ వక్రోక్తిని ప్రతిపాదించాడు. ఆయన నాలుగుచోట్ల వక్రోక్తి అని అన్నారు.

**1) "యుక్తం వక్రస్వభావోక్త్యా సర్వమేవైతదిష్యతే (1-30)**

2) నా నితాంతాది మాత్రేణ జాయతే చారుతాం గిరాం
వక్రాభిదేయ శబ్దోక్తిరిష్టా వాచామలంకృతిః (1-36)

3) వాచాం వక్రార్థ శబ్దోక్తిరలంకారాయ కల్పతే (5-56)

4) వక్రవాచాం కవీనాం యే ప్రయోగం ప్రతిసాధనః
ప్రయోక్తుం యేన యుక్తాశ్చ తద్వివేకోయ ముచ్యతే”

(వీరభద్రయ్య, ముదిగొండ.2012.పుట.129, 130)

“ఇది కాకుండా భామహుడు అతిశయోక్తే వక్రోక్తి అని (11, 84, 85) చెప్పాడు. సర్వాలంకారాలకు ఉపమయే మూలం అన్న సిద్ధాంతం ఎలాంటిదో, సరిగ్గా అలాగే సర్వాలంకారాలకూ, వక్రోక్తికి అతిశయోక్తి అలాంటివని భామహుడన్నాడు. కాని ఇంతకు మించి వక్రోక్తి వివరణ ఇవ్వలేదు. దాని స్వరూప స్వభావాలను తెలపలేదు” (వీరభద్రయ్య, ముదిగొండ.2012.పుట.129, 130).

కానీ వక్రోక్తియే సర్వాలంకార భీజమని తెలిపాడు.

“సైషా సర్వత్ర వక్రోక్తిరసయార్థో విభావ్యతే
యత్నోస్యాం కవినా కార్యః కోలంకారో నయావినా” (వ.జీ.పుట.14)

కావ్యం అలంకారయుక్తమైనప్పుడే కావ్యం అనిపించుకుంటుందని భామహుని అభిప్రాయం.

“మొట్టమొదట సౌందర్యం రెండు రకాలుగా ఉంటుందని ఆయన గుర్తించాడు. ఒకటి స్వాభావికం. రెండవది కవి తన కళద్వారా సృష్టించేది. ఒక స్త్రీ యొక్క సుందరమైన వదనం ఆభరణాల వల్ల మరింత సుందరంగా ఎలా భాసిస్తుందో అలాగే ఔచిత్యంతో కూడిన రమణీయ శబ్దాల వలన సౌందర్యాభివ్యక్తి జరుగుతుంది. కాని అలంకారాల వలన కావ్యసౌందర్యం ఇనుమడిస్తుందని చెబుతూ కావ్యవిశిష్టతకు రెండూ అవసరమే అని ఆయన వక్కాణించాడు. ఖండ కావ్యమైనా, మహాకావ్యమైనా కావ్య సౌందర్యానికి వక్రోక్తి ప్రాణమని, వక్రోక్తి లేకుండా ఉత్తమ కావ్య రచన సాధ్యపడదని ఆయన తెగవేసి చెప్పాడు” (ఆలంకారికులు.2002.పుట.130).

తనకన్నా ముందే “భామహుడు అందించిన సూత్రాన్ని పట్టుకొని ఆనందవర్ధనాచార్యుల ధ్వన్యాలోక నేపథ్యంలో కుంతకుడు వక్రోక్తిని పెంచిపోషించినాడు” అని ముదిగొండ వీరభద్రయ్య పేర్కొన్నారు (2012.పుట.130).

ఇలా వక్రోక్తిని కేవల అలంకారంగా కాకుండా సర్వాలంకారాలలో అంతర్భవిస్తుందని భామహుడు చెప్పాడు. దానిని ప్రత్యేక సిద్ధాంతంగా, అంతర్విభజనలతో కుంతకుడు పెంచిపోషించాడు.

## 2.6.10. కుంతకుడు–వక్రోక్తి జీవితం

ప్రాచీన భారతీయ ఆలంకారికుల్లో కుంతకుడు ఒకరు. ఆయన 'వక్రోక్తి జీవితము' రాసి వక్రోక్తిని నిర్వచించి, దాని విశిష్టతను తెలిపి సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించాడు. కుంతకుని పూర్తిపేరు రాజానక కుంతకుడు. కుంతలకుడు కుంతకుడు అనే నామాంతరం కూడా ఉంది. ప్రథమ ఉన్మేషాంతంలో, "ఇతి రాజానక కుంతల(క) విరచితే వక్రోక్తి జీవితే కావ్యాలంకారే ప్రథమోన్మేషః" అని ద్వితీయ ఉన్మేషాంతంలో "ఇతి శ్రీకున్తల విరచితే వక్రోక్తి జీవితే ద్వితీయ ఉన్మేషః" అని కనిపిస్తుంది. దీనిని బట్టి ఇతనికి రాజానక బిరుదు ఉన్నదని, కుంతలకుడనే నామాంతరం ఉందని చెప్పవచ్చు.

కుంతకుడు క్రీ.శ.950–1000 మధ్య కాలానికి చెందినవాడిగా చెప్తారు. "ప్రాచీన భారతంలోని ఇతర ప్రముఖ రచయితలకు వలనే కుంతకుని విషయంలో కూడా ఆయన జీవిత విశేషాలు సరిగ్గా తెలియవు. ఆయన రచనలను బట్టి ఆయన పాండిత్యాన్ని తీసుకోవడం తప్ప మనం చేయగలిగిందేమీలేదు. నాటక కర్త అయిన రాజశేఖరుని రచనలలోని విషయాలను కుంతకుడు ఉటంకించాడు. ఈ రెండు విషయాలను ఆధారంగా చేసుకొని కుంతకుడు ఇంచుమించుగా క్రీ.శ. 950–1050 మధ్య వున్నట్లు నిర్ణయించవచ్చు"(ఆలంకారికులు.2002.పుట.83).

కుంతకుడు రచించిన గ్రంథం 'వక్రోక్తి జీవితమ్'. వక్రోక్తియే కావ్యానికి జీవితం వంటిదని పేర్కొన్నాడు. నాలుగు ఉన్మేషాల కావ్యం ఇది. ఈ కావ్యాన్ని కుంతకుడు రచించినట్టుగా రాజశేఖరుడు, మహిమభట్టుల ఉటంకింపుల వలన తెలిసింది. చాలా కాలం వరకు ఈ గ్రంథం లభ్యంకాలేదు. తర్వాత ఎస్.కె.డే. అనే ఆయన మొదటి ఉన్మేషాలను ప్రకటించాడు.

"1922 ప్రాంతములో మద్రాసు ప్రాచ్య పుస్తక భాండాగారమున లభించిన అపపాఠ, పాఠలోపాది భూయిష్ఠమగు ఒక లిఖిత ప్రతిని ఆధారముగ గొని శ్రీ ఎస్.కె.డే వక్రోక్తి జీవితము మొదటి రెండు ఉన్మేషములు మాత్రము ప్రకటించిరి. పిమ్మట 1926 ప్రాంతమున జైసల్మేర్ జైన భాండాగారమున మరియొక ప్రతిగూడ లభించినది. ఇది గూడ లోపభూయిష్ఠమేయైనను దాని సాయముతో ప్రథమ ద్వితీయోన్మేషములలోని కొన్ని స్థలములను పరిశోధించుటకు వీలుకల్గుటచే శ్రీడే మరల ఒక గ్రంథమును సంపాదించినారు. ఇందులో తృతీయోన్మేషము మధ్య భాగము వరకు

పాఠములు కొంతవరకు బాగుగనున్నవి. తృతీయోన్మేషము మిగిలిన భాగము, చతుర్థోన్మేషము గూడ, ఈ ప్రతిలోగూడ త్రుటితములై యుండుటచే శ్రీడే మద్రాసు ప్రతినుండియే లభ్యమగు కూర్చి Resume (iii UNMEASA), RESUME (IV UNMESA) అను పేర్లతో సంపాదించి రెండవ ముద్రణలో చేర్చినారు" (2007. ప్రస్తావన) అంటూ పుల్లెల రామచంద్రుడుగారు వివరించారు

"కుంతకుడు చెప్పదలిచిన విషయములన్నియు చతుర్థోన్మేషముతో పూర్తియైనవిగాన ఈ గ్రంథములో మొత్తము నాలుగు ఉన్మేషములే ఉండియుండవలెననియు, కొందరు భావించినట్లు ఇదు ఉన్మేషములుండెడివని తలంప పని లేదనియు, చతుర్థోన్మేషములోని చివరి రెండు మూడు పత్రములు మాత్రమే నష్టములైయుండునని శ్రీడేగారి అభిప్రాయము. ఇది యుక్తమే అని తోచుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.4) ఇలా కుంతకుని 'వక్రోక్తి జీవితం' అను కావ్యం నాలుగు ఉన్మేషాలతో, కారిక, వృత్తులతో రచించబడ్డది.

### 2.6.11. వక్రోక్తి – ఆలంకారికుల నిర్వచనాలు

వక్రోక్తి శబ్దం అతి ప్రాచీన కాలం నుండి బహ్వర్థాలలో ప్రయుక్తమగుతూ వచ్చింది. బాణుని కాదంబరియందొకచో 'విలాసి జనులు వక్రోక్తి నిపుణులు' అని వాక్రుచ్చియుండెను. మరియొకచో క్రీడాలాపము లేక పరిహాసజల్పితము అనునర్థమున వక్రోక్తి శబ్దము ప్రయోగించియుండెను" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.35).

"వక్రత అంటే వైచిత్ర్యం. ఉక్తి వైచిత్ర్యమే వక్రోక్తి. నిత్య వ్యవహారంలోని మాటల వలెగాక వక్రోక్తి ఉచ్చస్థాయిగలిగి అలంకార శోభితమై హృదయాల్ని రంజింపజేస్తుంది. అసాధార-అసాధారణమైన భావప్రకటన. కావ్య లోకంలో మాత్రమే అది కన్పిస్తుంది. భారతీయ అలంకార శాస్త్రరంగంలో వక్రోక్తిని వివిధ సిద్ధాంతకర్తలు వేర్వేరుగా నిర్వచించారు. కొంతమంది దాన్ని అలంకారములలో ఒకటిగా భావించారు. అలంకారములన్నీటికి వక్రోక్తియే ఆధారమని మరికొందరు తలపసాగారు. కుంతకుని విశిష్టత ఏమిటంటే వక్రోక్తిని కావ్యానికి ప్రాణం అని చెప్పడం. వక్రోక్తి కవిత్వానికి జీవం పోస్తుంది. కావ్యానికి జీవితమే అది. అందుకే తన గ్రంథానికి 'వక్రోక్తి జీవితమ'నే పేరు పెట్టాడు" (ఆలంకారికులు.2002.పుట.84) కుంతకుడు వక్రోక్తిని గురించి ప్రస్తావిస్తూ ఒక కారికలో ఇలా అంటాడు.

**కా॥ శబ్దార్థౌ సహితౌ వక్రకవి వ్యాపార శాలిని**
**బన్ధే వ్యవస్థితౌ కావ్యం తద్విదాహ్లాద కారిణి**

(వ.జీ.ప్రథ.ఉన్మే.కా.7)

కావ్య తత్వజ్ఞులకు ఆనందాన్ని కల్గించేది. కవి వ్యాపారంచే ప్రకాశించేది, వక్రమైనట్టిది. వైచిత్రితో కూడి హృదహ్లాదము కలిగించే శబ్దార్థాలు కావ్యం అవుతుందని తెలిపాడు. కావ్యానికి శబ్దార్థాలు ముఖ్యమని తెలిపి, ఆ రెండింటిని అలంకరించేది. 'వైదగ్ధ్యభంగీభణితి' అని చెప్తాడు.

**కా॥ "ఉభావేతావలంకార్యౌ తయోః పునరలంకృతిః**

**వక్రోక్తిరేవ వైదగ్ధ్య భంగీ భణితిరుచ్యతే"**

(వ.జీ.ప్రథ.ఉన్మే.కా.10)

భోదించే విధానం కంటే భిన్నమైనదిగా, విచిత్రంగా ఉండే అభిద వైదగ్ధ్యభంగీభణితి అవుతుంది. విదగ్ధత్వము = (కవి కర్మయందు) నేర్పు, భంగీ = సౌందర్య విశేషము, భణితి = చెప్పుటలో విచిత్రంగా ఉండే అభిదయే వక్రోక్తి అని 'వైదగ్ధ్యభంగీభణితి వక్రోక్తి' అని చెప్పాడు.

"కవితా సామ్రాజ్యమంతా వక్రోక్తిమయమే అన్న భామహుని నుంచి ప్రేరణ పొంది కుంతకుడు వక్రోక్తియే కావ్యమునకు జీవితమనే సిద్ధాంతాన్ని రూపొందించాడు. వక్రోక్తి వైచిత్ర్యంగల భావవ్యక్తీకరణం. దానిలోని వైచిత్ర్యమే దాన్ని సామాన్య భావప్రకటన కంటే ఉచ్చస్థాయికి తీసుకొనిపోతుంది. మరొక విధంగా చెప్పాలంటే వక్రోక్తి–పదములకు భావములకు మరొక అభిప్రాయం కలిగించేది (వైదగ్ధ్యభంగీ – భణితి)" (ఆలంకారికులు.2002.పుట.85) ఇలా వక్రోక్తినే కావ్య జీవితంగా, కావ్యాత్మగా కుంతకుడు భావించాడు. వివిధ ఆలంకారికులు వక్రోక్తి గురించి తమ అభిప్రాయాలను తెలిపారు.

### 2.6.11.1. దండి

దండి అతడు రచించిన కావ్యాదర్శం అనే గ్రంథంలో ద్వితీయ పరిచ్ఛేదంలో వక్రోక్తిని ప్రస్తావిస్తూ ఇలా చెప్పాడు.

**"శ్లేషః సర్వాసు పుష్ణాతిప్రాయో వక్రోక్తిషుశ్రియమ్**

**భిన్నం ద్విధా స్వభావోక్తిర్వక్రోక్తి శ్చేతి వాఙ్మయం"**

(కావ్యాదర్శం.ద్వితీ.పరి.శ్లో.363)

వక్రోక్తిని ప్రత్యేకమైనదిగా చెప్తూ, వక్రోక్తి స్వభావోక్తి కన్నా భిన్నమైనదని, చెప్పి, వక్రోక్తి కూడా శ్లేషతో కూడుకున్నదై ఉండాలని చెప్పాడు. శ్లేషతో సంశ్లేషమై సౌందర్య హేతువైతే దానిని వక్రోక్తిగా చెప్పాడు. దండి స్వభావోక్తి వక్రోక్తికి తుల్య ప్రాధాన్యతనిచ్చాడు. "దండి అటు అలంకారాలకీ, ఇటు

గౌఢి, వైదర్భీ మార్గాలకీ, వాటికి సంబంధించిన గుణాలకీ కూడా తన గ్రంథంలో సమ ప్రాధాన్యం ఇచ్చినాడు" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.1981.పుట.36).

### 2.6.11.2. వామనుడు

"వక్రోక్తిని ప్రత్యేకించి, అలంకారంగా పరిగణించిన వారిలో వామనుడే మొదటివాడుగా కనబడుతున్నాడు. అతడు దీనిని అర్థాలంకారముగా పరిగణించి 'సాదృశ్యాలక్షణా వక్రోక్తిః' అని నిర్వచించెను" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.352).

### 2.6.11.3. జయదేవుడు

"జయదేవుడు దీనిని అర్థాలంకారముగా కూర్చి "వక్రోక్తిః శ్లేష కాకుభ్యాం వాక్యార్థాంతర కల్పనమ్" అని లక్షణము చెప్పెను. కాకుస్వరము చేతగాని, శ్లేషచేతగాని అర్థాంతరము కల్పించినది. వక్రోక్తియగునని సారము" (నరసింహారావు, ఎస్.ఎల్.1981.పుట.408).

ఇలా ఆలంకారికులు తమ అభిప్రాయాలను వెల్లడి చేసారు. "కానీ చంద్రాలోక కువలయానందకారులు 'వక్రోక్తి శ్లేషకాకుభ్యాం అపరార్థ ప్రకల్పనమ్' అని రుద్రటుని వలెనే దానిని ద్వివిధముగ పరిగణించుననే అర్థాలంకారముగా భావించిరి" (నరసింహారావు, ఎస్.ఎల్.1981.పుట.408).

"అభినవగుప్తుడు తన లోచనమున భామహుని 'వక్రాభిధేయ శబ్దోక్తరిష్టావాచామలంకృతిః' అని పంక్తినుదాహరించుచు తానును 'శబ్దస్య హి వక్రతా అభిధేయస్య చ వక్రతా లోకోత్తీర్ణేణ రూపేణ అవస్థానమ్' అని స్పష్టీకరించెను. అనగా ఈ వక్రత శబ్దరూపముగను అర్థరూపముగను నుండుననియు లోకాతిక్రాంత గోచరత్వమే వక్రతయనియు నతడు భావించినాడు" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.352).

కావ్యాలంకార సంగ్రహములో భట్టుమూర్తి 'వక్రోక్తి అలంకారం' గూర్చి చెప్పుతూ

**కం॥ "వేరొక వివక్షఁబలికిన**
**చారూక్తికి శ్లేష కాకు సంబంధముచే**
**వేరొక యోజన దెచ్చిన**
**నారయ వక్రోక్తియయ్యెనది యెట్లన్నన్"**

**(నర.పంచ.ఆశ్వా.110 పద్యం)**

### 2.6.11.4. రుద్రటుడు

"రుద్రటుడు దీని నలంకారముగా గ్రహించి శబ్దాలంకారములలో పేర్కొని లక్షణము నిర్దేశించెను. దానినొక అలంకార పరిధిలోకి కుదించి అనంతర కాలమున దానికొక క్రొత్త స్థానము కలుగుటకు కారకుడయ్యెను. అతడు శ్లేష వక్రోక్తినిట్లు నిర్వచించెను".

**"వక్త్రా తదన్యథోక్తం వ్యాచష్టే చాన్యథా తదుత్తరదః**
**వచనం యత్పద భంగైర్జ్ఞేయా సాశ్లేష వక్రోక్తిః"**

**(కావ్యాలంకారం, 2-14)**

రుద్రటుడు తన కావ్యాలంకారంలో వక్రోక్తిని శబ్దాలంకారంగా పరిగణిస్తూ శ్లేష వక్రోక్తి, కాకు వక్రోక్తి అని రెండు విధాలుగా విభజించాడు.ఇక్కడ రుద్రటుడు వక్ర శ్లేషను చెప్పాడు.

### 2.6.11.5. మమ్మటుడు

మమ్మటుడు కూడా తన 'కావ్యప్రకాశం'లో నవయోల్లాసంలో వక్రోక్తిని ప్రస్తావిస్తూ 79వ కారికలో ఇలా చెప్తాడు.

**కా॥ యదుక్తమన్యథా వాక్యమన్యథాన్యేన యోజ్యతే,**
**శ్లేషేణ కాక్వా వాజ్ఞేయా సా వక్రోక్తిస్తథా ద్విధా" (కావ్యప్రకాశం.ఉ.9.కా.79)**

"ద్వివిధ వక్రోక్తులనొకే లక్షణముచే నిర్దేశించెను. శ్లేష లేక కాకువుచే అర్థాంతర ప్రకటనము వక్రోక్తియనెను. ఇందు శ్లేష వక్రోక్తి, కాకు వక్రోక్తియను రెండు విధములు చేరెను. దీనినితడు రుద్రటుని వలెనే శబ్దాలంకారముగ చెప్పెను" (నరసింహారావు, ఎస్.ఎల్.1981.పుట.408).

ఒక అభిప్రాయంతో పలికిన వాక్యానికి శ్లేష సంబంధం చేతగాని, కాకుస్వర సంబంధంచేత గాని మరొక అభిప్రాయాన్ని కలిగించడమే వక్రోక్త్యాలంకారం. ఇలా కొందరు శబ్దాలంకారంగా, అర్థాలంకారంగా భావించారు.

రుద్రటుడు శబ్దాలంకారంగా, వామనుడు అర్థాలంకారంగా, చంద్రాలోక కువలయానందకారులు కూడా అర్థాలంకారంగా, అభినవగుప్తుడు శబ్దాలంకారంగా భావించారు. కానీ కుంతకుడు మాత్రం కేవల అలంకారంగా కాకుండా, శబ్దార్థాలను తెలుపుతూ, లోకోత్తర వైచిత్ర్యాన్ని కలిగించేదాన్నే వక్రోక్తిగా చెప్పి వక్రోక్తి సిద్ధాంతాన్ని స్థాపించాడు.

### 2.6.12. కుంతకుడు–వక్రోక్తి సిద్ధాంత భేదాలు

కుంతకుడు 'వక్రోక్తి జీవితం' అనే గ్రంథంలో ప్రధానంగా ఆరు రకాల వక్రతలను తెలిపాడు. మొదటి ఉన్మేషంలో కావ్యం అంటే ఏంటో తెలిపి, ఎలా ఉండాలని వివరిస్తూ ఆరు రకాల వక్రతల

పేర్లు తెలిపాడు. రెండవ ఉన్మేషంలో వర్ణవిన్యాస వక్రత ప్రతిపాదనతో ప్రారంభమయి పద పూర్వార్ధ, పద పరార్ధ వక్రతలని తెలిపి వాటికి అనేక భేదాలను తెలిపాడు. మూడవ ఉన్మేషంలో వాక్య వక్రత, నాల్గవ ఉన్మేషంలో ప్రకరణ వక్రత, ప్రబంధ వక్రతలను తెలిపాడు.

ప్రధానంగా ఆరు రకాల వక్రతలు

1) వర్ణ విన్యాస వక్రత
2) పదపూర్వార్ధ వక్రత
3) పద పరార్ధ వక్రత
4) వాక్య వక్రత
5) ప్రకరణ వక్రత
6) ప్రబంధ వక్రత

ఒక్కో వక్రతలో మళ్ళీ భేదాలు కన్పిస్తాయి. అంతర్భేదాలన్ని కలిసి 68 రకాల వక్రతలున్నాయి.

**2.6.13. ధ్వని–వక్రత**

**2.6.13.1. ధ్వని:**

ధ్వని సిద్ధాంత ప్రతిపాదకుడు ఆనందవర్ధనుడు. ఇతని కావ్యం ధ్వన్యాలోకం. "ధ్వన్యాలోకం నాలుగు ఉద్యోతాలుగా విభజింపబడింది. మొదటి ఉద్యోతంలో ధ్వనిని గూర్చి ప్రాచీనాలంకారికుల అభిప్రాయాలు, తత్ ఖండన, ధ్వని స్వరూపం, ధ్వని భేదాలు, గుణీభూత వ్యంగ్యం తర్కబద్ధంగా విస్తరించి నిరూపింపబడినవి. నాల్గవ ఉద్యోతంలో ధ్వని నిరూపణ ప్రయోజనాన్ని గూర్చి చర్చించబడింది" (గోపాల్‌రెడ్డి, ముదిగంటి.2007.పుట.768).

ఈ నాలుగు ఉద్యోతాల కావ్యంలో వివిధ ధ్వని భేదాలను చెప్పాడు. "1) ధ్వని అనేది లేదు, 2) ఉన్నా దాన్ని నిర్వచించడం కష్టం, 3) లేదా దాన్ని లక్షణావృత్తిలో కలిపివేయవచ్చు అని మూడు విధాలుగా వాదించే ధ్వని విరోధులు మతాన్ని ఖండించి ప్రథమోద్యోతంలో ధ్వని స్థాపించబడింది. ద్వితీయ, తృతీయోద్యోతాల్లో వివిధ ధ్వని భేదాలు నిరూపించబడినవి. ధ్వని స్పర్శవల్ల కావ్యంలో కలిగే సౌందర్యం సోదాహరణంగా చతుర్థోద్యోతంలో స్పష్టీకరింపబడింది (శ్రీరామచంద్రుడు, పుల్లెల.1981.పుట.16).

మొదటి ఉద్యోతంలో ఇలా చెప్తాడు. ధ్వని గురించి ప్రారంభిస్తూ

**కా॥ కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యః సమామ్నాతపూర్వః**
**తస్యాభావం జగదురపరే భాక్తమహుస్తమన్యే,**

**కేచిద్వాచాం స్థితమవిషయే తత్త్వమూచుస్తదీయం**

**తేనబ్రూమః సహృదయమునః ప్రీతయే తత్స్వరూపమ్."**

**(ధ్వన్యా.ప్రథ.ఉద్యో. కా.1)**

అంటూ కావ్యానికి ఆత్మధ్వని అని చెప్తూ ధ్వని కావ్యానికి ఆత్మగా అంగీకరించనివారు కొందరు, కొందరేమో గౌణంగా ఉందని కొందరు, వాక్కుల అవిషయంలో ఉందని కొందరు చెప్పగా ఆ ధ్వని గురించి అందరి మనస్సులు సంతోషించేలా దాని స్వరూపాన్ని చెప్తానని పూనుకున్నానని ఆనందవర్ధనులు చెప్పారు.

ఎక్కడైతే శబ్దార్థాలు అప్రధానమై మనోహరమైన మరొక అర్థం స్ఫురిస్తుందో అక్కడ ధ్వని ఉన్నట్లుగా చెప్తారు. ఆనందవర్ధనుడు ధ్వనుల్లో రస ధ్వనికి ప్రాధాన్యత ఇచ్చాడు.

"ధ్వనియనునది గుణాలంకారాదులలోనంతర్భవించెడు స్వల్పవిషయము కాదు. గుణాలంకారాదులన్నియు ధ్వనికంగములు మాత్రమే. ధ్వని యంగి, అంగికంగములో నంతర్భావము పొసగదు. ధ్వని యనగా ప్రధానముగా రసమే" (2000.పుట.47) రసమే ధ్వని అని రసధ్వనియే కావ్యాత్మ అంటూ రఘునాథశర్మగారు వారి అభిప్రాయాన్ని తెలిపారు.

కావ్యంలో వాచ్యం, లక్ష్యార్థం ఉంటే వాటికన్నా భిన్నమైన అర్థాంతరం భాసిస్తుంది. అదే వ్యంగ్యార్థమని. అదే ధ్వని అని ఆనందవర్ధనుని మతం. ఆ అర్థాంతరం వాచ్యార్థం కన్నా లక్ష్యార్థం కన్న చమత్కారమైంది. "ధ్వని భేదాలను అతడు అతిసూక్ష్మంగా విభాగించి తద్భేదాలను సోదాహరణంగా వివరించాడు. ధ్వనిని అభిదా మూలధ్వని, లక్షణామూలధ్వని అని ప్రధానంగా రెండుగా ఆనందవర్ధనుడు విభాగించాడు. అభిధామూలధ్వనికి వివక్షితాన్యపరవాభ్యం. లక్షణమూలధ్వనికి అవివక్షిత వాచ్యం అని కూడా పేర్లు. వివక్షితాన్య పరవాచ్యంలో వాచ్యార్థం పొసగినా ధ్వనిపరంగా వివక్షింపబడుతుంది. అభిధా మూలధ్వని తిరిగి సంలక్ష్యక్రమ వ్యంగ్యం శబ్దశక్తిమూలక, అర్థశక్తి మూలక, ఉభయమూలక ధ్వని మూడు విధాలు. అసంలక్ష్యక్రమ వ్యంగ్యధ్వని, వస్తుధ్వని, అలంకారధ్వని, రసధ్వని అని మూడు విధాలు. విభావానుభావాదులచేత వ్యంగ్యమయ్యే రసధ్వని ఉత్తమమైందని ఆనందవర్ధన, అభినవగుప్తులు నిరూపించారు" (గోపాల్‌రెడ్డి, ముదిగంటి.2007.పుట.770).

ఇలా చాలా అంతర్ భేదాలను ధ్వనికారుడు చెప్పారు. మళ్ళీ లక్షణామూలధ్వనిలో కూడా అత్యంత తిరస్కృత వాచ్యం, అర్థాంతర సంక్రమిత వాచ్యం అని రెండు విధాలుగా కాగా మళ్ళీ

వాక్యగతం, పదగతంలో నాలుగు విధాలుగా ఇలా చాలా విభజనలు ఉన్నాయి. అన్నీ కలిసి 5304 ధ్వని భేదాలు చెప్పాడు.

ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతం అందరికి ఆమోదయోగ్యమైంది. తర్వాతివారు దాన్ని అనుసరించారు. కావ్యజగత్తులో దానికొక విశిష్టస్థానం ఏర్పడింది. దీనిని ఖండించినది మహిమభట్టు. 'వ్యక్తివివేక'మను గ్రంథంలో ధ్వని ఖండన చేశాడు. ఇతని దృష్టిలో ధ్వని అవసరం లేదు. అనుమానాంతర్భవం ధ్వని. మహిమ భట్టు వ్యక్తివివేకం ధ్వని సిద్ధాంతానికి ఖండన గ్రంథంగా చెప్తారు.

### 2.6.13.2. వక్రోక్తి

కేవలం అలంకారంగా కాకుండా కుంతకుడు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి దానిలో ప్రధానంగా ఆరు విభజనలు చేసి, మళ్లీ దాంట్లో అంతర్విభజనలు చేయడం కనిపిస్తుంది. ఈయన శబ్దార్థాలకు రెండింటికి ప్రాధాన్యమిస్తూనే లోకోత్తర చమత్కార కావ్యం వక్రత గలది అని చెప్పాడు. ఆనందవర్ధనుని తర్వాత వచ్చిన సిద్ధాంతం వక్రోక్తి. భామహుని వక్రోక్తి దండి గుణాలంకార సంప్రదాయమే కాకుండా వామనుని రీతి గుణ సంప్రదాయం కూడా దీనిలో అంతర్భవించింది. ఈయన ధ్వనికి వ్యతిరేకి కాదు. ఎక్కడా కూడా ఎదిరించినట్లు కనిపించదు.

"అందుకే కొందరు విమర్శకులు వక్రోక్తి సిద్ధాంతం ముసుగు వేసుకున్న ధ్వని సిద్ధాంతమే అని చెప్పారు. ధ్వనినే కుంతకుడు వక్రోక్తిగా పేర్కొన్నాడని అని అంటారు. కుంతకుని 'వక్రోక్తి' పూర్వాచార్యుల కావ్యతత్త్వ విచారాలన్నిటిని సమన్వయించే కొత్త సిద్ధాంతం" (గోపాల్‌రెడ్డి, ముదిగంటి.2007.పుట.776).

ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతంలో కుంతకుని వక్రోక్తి సిద్ధాంతంలో కొన్ని సామ్యతలు ఉన్నాయి. ఈ రెండు సిద్ధాంతాల్లో ప్రసిద్ధమైన వాచక అర్థం, శబ్దం అతిక్రమించడం కనిపిస్తుంది. అలాగే ఇద్దరూ కూడా వైచిత్ర్యాన్ని కోరుకున్నారు. "ఆనందవర్ధనుడు ధ్వనిలో కావ్యం యొక్క సూక్ష్మాతి సూక్ష్మ అవయవం మొదలుకొని వ్యాపక రూపంను కూడా అంతర్భవింపచేసి దానిని సర్వాంగపూర్ణంగా రాణింపజేసే యత్నం చేసినాడు. కుంతకుడు ఆనందవర్ధనుని పద్ధతిని పాటిస్తూ వక్రోక్తిలో కావ్య సర్వాంగాలన్నిటినీ సమావేశపరిచి దానిని వ్యాపక రూపం ప్రధానం చేసే యత్నం చేసినాడు. ఈ విధంగా ధ్వని, వక్రోక్తి రెండింటిలో సహవ్యాప్తి ఉంది. సుప్, తిఙ్, వచన, కారక, కృత్, తద్ధిత సమాస ఉపసర్గ, నిపాతం, కాలం, లింగం, రచన, అలంకారం, వస్తువు, ప్రబంధం మున్నగువాటిలో ఆనందవర్ధనుడు ధ్వని చమత్కారంను నిరూపించినాడు. అదే విధంగా కుంతకుడు

వక్రోక్తిని పదపూర్వార్ధ వక్రత, పద పరార్ధ వక్రత మొదలుకొని ప్రకరణ, ప్రబంధ వక్రత వరకు విస్తరింపజేసినాడు" (వెంకటేశం, బి.2015.పుట.127).

కుంతకుడు ధ్వని సిద్ధాంతాన్ని పూర్తిగా అర్థం చేసుకునే వక్రోక్తిని స్థాపించాడు. అతని రచనా విధానాన్ని పరిశీలిస్తే ఎంతటి పాండిత్యం కల్గినవాడో తెలుస్తుంది. ఆనందవర్ధనుని కారికలను చాలాసార్లు ఉదాహరణలుగా ఇచ్చాడు. అతని ప్రభావం కుంతకునిపై ఉందని చెప్పవచ్చు. ధ్వని తర్వాత కుంతకుడు ఈ సిద్ధాంతాన్ని తెలిపాడంటే ఏదో ఒక కారణం ఉండి ఉంటుంది. "మరి ఈతడీవిధమగు నిర్ణయమునకు వచ్చెనన్న అందును ఏదియో సామంజస్యముండి తీరవలెను గదా. సర్వలౌకికవ్యాహోఫక్కికనుండి కావ్యవాక్కు యొక్క పార్థక్యమును నిరూపించునది వక్రతయని యాతడు గుర్తించినాడు. సర్వకళాసృష్టికిని అధిష్టానప్రాయమైనట్టిది సౌందర్యము. కళా మర్మమునకు సంబంధించిన ఆ మూల సూత్రముల పునాదులపైననే తన సిద్ధాంత సౌధమును నిర్మించినాడు కుంతకుడు" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.357).

"వక్రోక్తి–ధ్వని ఈ రెండింటి తులనాత్మక విశ్లేషణ ద్వారా కొన్ని ముఖ్య తథ్యాలు బహిర్గతమవుతాయి. రెండు సిద్ధాంతాల్లో వైచిత్ర్యంతో సమానంగా వాంఛ కూడా ఉంది. ఈ రెండు సిద్ధాంతాలు సామాన్య జనవ్యవహార ఉక్తిని పరిత్యజించి అసామాన్యమైన వివక్షను స్పష్టపరిచినాయి. కుంతకుడు, ఆనందవర్ధనుడు ఇరువురు కావ్యంలో వైచిత్రి, ఉత్పత్తి, ప్రతిభ ద్వారానే సంభవమని అంగీకరించినారు. వక్రోక్తి, ధ్వని ఈ రెండింటిలో అద్భుతమైన వ్యాప్తి సామ్యం అగుపిస్తుంది" (వెంకటేశం, బి.2015.పుట.98).

"వక్రోక్తి శబ్దము ధ్వన్యాలోకముననను ప్రసక్తమైనది. కాని ఆనందవర్ధనుడు కుంతకునివలె తద్విశ్వరూప సందర్శనము చేసినవాడు కాదు. కుంతకుని వాదమునకు పునాదులు కవి ప్రతిభ, కావ్య సౌందర్యము, సహృదయాస్వాదము, ధ్వని వాదమున వ్యంగ్యము ప్రధానమై చమత్కారము సిద్ధించిన చాలును కావ్యత్వము సిద్ధించినట్లే యగుచున్నది. శబ్దార్థ సాహిత్య విచారణముతో అంతగా పనిలేకపోవుచున్నది. ఇది యొక లోపము అని భావించి ఆ లోపము అని భావించి ఆలోపమును సవరించుటయే కుంతకుని సంకల్పముగా తోచుచున్నది" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.356).

వక్రోక్తి సిద్ధాంతం కూడా ధ్వని సిద్ధాంతం లాంటిదే. ఇవి రెండు కూడా కావ్యస్వరూపాన్ని తెలిపాయి. అయితే కావ్యానికి ఆత్మ రసధ్వనిగా ఆనందవర్ధనుడు చెప్పితే కుంతకుడు వక్రోక్తిని

'కావ్యజీవితం'గా చెప్పాడు. ఆనందవర్ధనుడు అయిదువేలకుపైగా ధ్వనులను చెప్పగా కుంతకుడు ఆరు వక్రతలను చెప్పాడు. అందులో అంతర్విభజనలు చేసాడు.

వక్రోక్తి, ధ్వని సిద్ధాంతం తర్వాత వచ్చినకూడా ధ్వని అంతగా ప్రాచుర్యాన్ని పొందలేదు. ధ్వనికి అభినవగుప్తుడు వ్యాఖ్యానం రాయటంవలన లోకప్రసిద్ధి చెందింది. వక్రోక్తి ప్రచారాన్ని ధ్వని అంతగా వెలుగుచూడలేదు. కానీ కుంతకుడు శబ్దార్థాలకు ప్రాధాన్యమిచ్చి విచిత్రాభిధనే వక్రోక్తిగా చెప్పాడు. ధ్వనిలోని కొన్ని భేదాలుకూడా వక్రోక్తిలో అంతర్భవిస్తాయి. కుంతకుడు వక్రోక్తినే కావ్యాత్మగా భావించి కవివ్యాపారం, సహృదయునిహ్లాదాలనే తన సిద్ధాంతానికి ప్రాణంగా భావించాడు.

తెలుగులో ఉన్న కవులలో శ్రీనాథుడు ఈ కుంతకుని వక్రోక్తి మార్గాన్ని అనుసరించాడు. కుంతకుడు కూడా రసానికి చాలా ప్రాధాన్యతను ఇచ్చి దాని గూర్చి ప్రస్తావించాడు. శ్రీనాథుని రచనా మార్గంలో కూడా రసవంతమైన పద్యాలు కన్పిస్తాయి. ఆయన కూడా రసానికి పట్టం కట్టాడు. కుంతకుని వక్రోక్తి మార్గంలో శ్రీనాథుడు చెప్పిన గుణాలు ఒక్కోరకం వక్రతలో అంతర్భవిస్తాయని చెప్పవచ్చు. వాటిని సమన్వయం చేసి చూస్తే అవగతమవుతుంది. రాబోయే అధ్యాయాల్లో వాటిని విశ్లేషణాత్మకంగా చూడవచ్చు.

వక్రోక్తి ధ్వనిని ఖండించలేదు. రసాన్ని కాదనలేదు "నిజానికి వక్రోక్తి–ధ్వని సంప్రదాయాలకు రసం పట్ల దృక్పథం ఇంచుమించు ఒకటే అనౌచిత్యం లేదు. కావ్య లక్షణ ప్రయోజనాలలో అంతర్గతంగా–రస–ప్రాధాన్యాన్ని ప్రప్రథమంగా అంగీకరించినవాడు కుంతకుడే" (జి.వి.ఎస్.2012.పుట.239).

శైలీ పరిశీలనం మానవుడి అంతరంగాన్ని కళాకలితం చేసి రసార్ద్రం కావిస్తుంది. ఇది ఒకానొక కావ్య కర్తృత్వాన్ని, కవికాలాన్నీ నిర్ణయించడానికి ఉపకరిస్తుంది. ఈ శైలి కావ్య స్వరూప స్వభావ ప్రభావాలకు అద్దం పడుతుంది. శైలీ పరిశీలనం లేని సాహిత్య విమర్శనం అసమగ్ర దర్శనం. సాహిత్య చరిత్ర అపరిపక్వ పాకం. శైలీ పరిశీలనం వల్ల భాషావగాహనాధికారాలతో పాటు భావామలత్వామరత్వాలను గూడా సాధింపవచ్చు" (చేరెడ్డి, మస్తాన్‌రెడ్డి.1989.పుట.2).

ప్రాచీన ఆలంకారికులు శైలి గురించి చెప్పారు. దానినే రీతి అన్నారు . అదే కవితా మార్గంగా చెప్పవచ్చు. "శైలియనగా విశిష్ట పదరచన. దీనికే ప్రాచీనాలంకారికులు రీతియనియు, మార్గమని, ప్రస్థానమని బేర్లిడిరి. అయ్యది కవి స్వభావము, లేక ప్రవర్తనము, ప్రాక్తన జన్మ సంస్కారలబ్ధ, ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసములపై నాధారపడి యున్నది (ఈశ్వరదత్తు,

కుందూరి.1964.పుట.155). కవి అనుసరించిన కవితా మార్గమే అతని రచనా మార్గం. శైలి అనిపించుకుంటుందని స్పష్టమయ్యింది.

ప్రసిద్ధ కవి అయిన శ్రీనాథుడు అనుసరించిన రచనా మార్గం ఏమిటని పండితులు చర్చ చేసారు. కొందరు ధ్వని అని మరికొందరు వ్యక్తి అని, కొందరు రీతి మార్గం అని, అని తమ తమ అభిప్రాయాలకు తగిన ఉదాహరణలను శ్రీనాథుని పద్యాల్లో ఉదాహరణలు చూపించారు. ఇన్ని అభిప్రాయాలను వెల్లడించడానికి కారణం శ్రీనాథుడు తన రచనల్లో కొన్ని సందర్భాల్లో రచనా మార్గం గురించి చెప్పకోవడం ఒకటయితే అయితే, మరికొన్ని సందర్భాల్లో పూర్వకవులైన వారిని సంస్కృత కవులను, ఇటు తెలుగు కవులైన వేములవాడ భీమన్న,నన్నయ, తిక్కన, ఎర్రనలను తలుచుకున్నాడు. అంతే కాకుండా వారి కవితా మార్గాన్ని కూడా అనుసరించానని చెప్పాడు. అందుమూలాన వారి కవితా మార్గాలైన ఉద్దండ లీల, ఉభాయవాక్ప్రౌఢి, రసాభ్యుచిత బంధం, సూక్తి వైచిత్రులను కూడా పరిశీలించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

శ్రీనాథుని రచనల మీద కృషి చేసిన వారు భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించారు. కొందరి అభిప్రాయాలు ఇంకొకరితో ఏకీభవించేలా ఉంటే, వేరే కొందరివి విభేదించేలా ఉన్నాయి. శ్రీనాథుడు స్పష్టంగా తన పద్యాల్లో మూడు కవితా మార్గాలు ఉన్నాయని 'హరచూడా హరిణాంక వక్రత పద్యాన్ని ఆధారం చేసుకొని వక్రత, సరసత్వం, కాఠిన్యం కవితా లక్షణాలుగా చెప్పిన వారు ఉన్నారు.ప్రాచీన సంస్కృత సాహిత్యాన్ని చదివిన వాడు కనుక ఆలంకారికుల మార్గాలను అనుసరించిన వాడైనందున కుంతుకుని వక్రోక్తిని పాటించాడని అదే హరిణాంక వక్రత అని కొర్లపాటి శ్రీరామమూర్తి లాంటి వారు అభిప్రాయపడ్డారు. కనుక శ్రీనాథుని అసలైన కవితామార్గం ఏమిటని తెలుసుకోవలసిన అవసరం ఉన్నది ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం కూడా అదే నిర్ధారణ చేసేముందు కొంతమంది విమర్శకుల, పరిశోధకుల అభిప్రాయాలను చర్చించదలిచాను.

## 2.7. పరిశోధకుల అభిప్రాయాలు

### 2.7.1. జి.వి.సుబ్రమణ్యం

జి.వి.ఎస్. గారు శ్రీనాథుని కవితా మార్గం గురించి చెప్తూ "ఈనాటికి అతని కవితకు వన్నె వాసీ సడలిపోలేదంటే అతని కవితా ప్రస్థానం కలకాలం నిలిచే మార్గంలో సాగిందన్నమాట. రసము శ్రీనాథుని రచనాధ్యేయం రీతి అతని మార్గం" (జి.వి.ఎస్.2012.పుట.107) అంటూ శ్రీనాథున్ని రీతి ప్రాధాన్యవాదిగా అభిప్రాయపడ్డారు. విశిష్ట పదరచనా మార్గాన్ని కలిగి ఉన్నందున రీతి ప్రధాన శైలి అని చెప్పారు.

### 2.7.2. బండారు తమ్మయ్య

శివభక్తి ప్రబోధకములైన కృతులను రచించుటలో శ్రీనాథునికి మిగుల ఆసక్తి కలదనియు, సరసత్వము (వక్రత, ధ్వని) అతని కవిత్వమునందలి ప్రధాన గుణమనియు తమ్మయ్య గారు ప్రతిపాదించిరి" (రామారావు, ఎస్వీ.2007.పుట.253).

### 2.7.3. కుందూరి ఈశ్వరదత్త

శ్రీనాథుని కవితాతత్త్వం మీద పరిశోధన చేసిన పరిశోధకుడు కుందూరి ఈశ్వరదత్తుగారు శ్రీనాథుడు అనుసరించిన మార్గం విచిత్ర మార్గం అని తెలిపి

"విచిత్ర మార్గము 1) ప్రతిభాజాత శబ్దార్థ చమత్కారము

2) అలంకార సహితము

3) ఉక్తి వైచిత్ర్యము

4) ప్రతీయమాన అర్థ చమత్కారము

5) వక్రోక్తి నిబంధనము" (ఈశ్వరదత్తు, కుందూరి.1964.పుట.157) అని చెప్పారు.

అలాగే 'విచిత్ర మార్గమే శ్రీనాథుని శైలి అనుటకు భీమేశ్వర పురాణంలోని 'హరచుడా హరిణాంక వక్రతయు' నను పద్యములోని 1) వక్రత లేక విచ్ఛిత్తి, లేక వైచిత్ర్యము, 2) చండికా కుచకాఠిన్యము, 3) సరసత్వము లేక రసవత్వాతిశయోపన్నము మూడు లక్షణములు విచిత్ర మార్గము నందె కలవు. ఈ లక్షణములే కాశీఖండ సీసపద్యములో ఉద్దండలీల, ఉభయవాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధము, సూక్తివైచిత్రియు వక్కాణింపబడినవి" (1964.పుట.159) అని తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

### 2.7.4. కొర్లపాటి శ్రీరామమూర్తి

శ్రీనాథుని మీద ప్రసిద్ధమైన పరిశోధన చేసి చారిత్రక ఆధారాలను చూపెట్టిన కొర్లపాటి శ్రీరామమూర్తి శ్రీనాథుని కవితామార్గం గురించి 'హరచూడా' పద్యాన్ని ఉదాహరణ చెప్తూ "భరతముని ప్రోక్తమైన రసము కుంతకునిప్రతిపాదితమైన వక్రోక్తి, శైలీ పరిణతమైన ప్రౌఢిమ సత్కావ్య లక్షణములని శ్రీనాథుని సిద్ధాంతము. ఈ మూడును తన కవితా రీతులని శ్రీనాథుని ఋజుముఖ ప్రకటనము" (1992.పుట.123) అంటూ వక్రోక్తి కవి మార్గంగా సూచించారు.

### 2.7.5. జంధ్యాల జయకృష్ణ బాపూజీ

జంధ్యాల జయకృష్ణ బాపూజీగారు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి కుమారుడు. ఈయన 'శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం' అనే అంశం మీద ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి

డాక్టరేటు పొందారు. ఇందులో శ్రీనాథుని లభ్య గ్రంథాలను స్వీకరించి వాటిలో సంస్కృత ఆలంకారికులు చెప్పిన ఆలంకారిక ప్రస్థానాలు భరతుని రస ప్రకరణం మొదలుకొని క్షేమేంద్రుని ఔచిత్యం వరకు ప్రతి ప్రస్థానాన్ని పరిచయం చేసి ఆ సిద్ధాంతాలకు అనుగుణంగా శ్రీనాథుని కావ్యాల్లోని పద్యాలను ఉదాహరించారు. ఒక కవికి ఉండవలసిన కవితా గుణాలు శ్రీనాథునిలోఉన్నాయని చెప్పి రసం, అలంకారం, గుణం, రీతి, ధ్వని,వక్రోక్తి, ఔచిత్యం అన్నింటిని సమన్వయంం చేసారు. ఇన్ని మార్గాలు ఇతనిలో ఉన్నాయి కానీ అసలైన మార్గం ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. బాపూజీ గారు ప్రతి ఒక్క సిద్దాంతాన్ని సమన్వయం చేయటంలో కవికి సహజంగా ఉండే రచన మార్గాన్ని సూచించినట్టయ్యింది. వీటన్నిటిని ప్రత్యేక మార్గంగా చెప్పలేము.అన్ని ప్రస్థానాలతో పాటు కుంతకుని సిద్ధాంతాన్ని కూడా స్పృశించి పద్యాలను ఉదాహరించారు.

### 2.7.6. వెల్చేరు నారాయణరావు

వెల్చేరు నారాయణరావుగారు కూడా తమ అభిప్రాయాన్ని తెల్పుతూ 'Srinatha' అనే ఆంగ్ల పుస్తకంలో 'హరచూడా పరిణాంక వక్రత' పద్యాన్ని అనువాదం చేస్తూ

> **"A little crooked**
> **like the crescent moon on Siva's head**
> **sharp as the contours**
> **of the firm, quickened breasts of the goddess**
> **roused to fury at the end of time,**
> **yet soft and delicious:**
> **good poetry is all of this together,**
> **dancing forever**
> **wherever poets live"**

**(Narayana Rao, Velcheru.2012.pg.2)**

"The poet seems to contrast two kinds of time in the space of this little verse: there is the time that comes to an end, periodically, when the cosmos is destroyed – and the erotic thrill that the wild goddess kāli experiences at that moment, a thrill visible in the firm contours of her breasts, is integral to

good poetry – and there is the "forever" time of poetry itself dancing wherever poets live"

**(Narayana Rao, Velcheru.2012.pg.2)**

శ్రీనాథుని మూడు కవితా గుణాలని చెప్తూ వక్రోక్తి గూర్చి ప్రస్తావించారు.

"We should note the three active components minimally necessary for a poem: a certain vakrata or "deviance", "crookedness", "currature": a definite firmness or toughness (kāthinyamu), with clear outlines: and a taste (sarasatvamu) that is delicate and delicious. Here is a poet who has the courage to say that poetry needs a quality of harshness, along with a slight crookedness coupled with delicacy – and who clearly thinks his own poetry has all these qualities" **(Narayana Rao, Velcheru.2012.pg.2)** శ్రీనాథుని కవితాగుణాల్లో వక్రోక్తిని గూర్చి వెల్చేరు నారాయణరావుగారు ప్రస్తావించారు.

**2.8. వివరణ**

శ్రీనాథుడు మహాకవి ఆయన కేవలం శబ్దానికే కాక అర్థానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాడు. ఆయన మార్గం కుంతకుడు చెప్పిన విచిత్ర మార్గం. వక్రోక్తి సిద్ధాంతంలోని అంతర్భేదాలలో శ్రీనాథుడు చెప్పిన అన్ని కవిత్వ లక్షణాలు ఇమిడి ఉన్నాయి. "నన్నయ ఉభయ వాక్ప్రౌఢి" అంటే సంస్కృతాంధ్ర ఉభయ భాషల్లో కవిత్వం చెప్పగల దిట్ట అని అర్థం. శ్రీనాథునికి ఆ పాండిత్యం ఉందని చెప్తూ వెల్చేరు నారాయణరావుగారు "He mentions both languages – but he actually composed as far as we know, only in Telugu, in particularly musical and highly sanskritized style" (2012.pg.2) అని చెప్పారు.

సంస్కృత పదభూయిష్ఠమైన తెలుగు పదాలతో ఉన్న రచన ఉభయ వాక్ప్రౌఢి అయితే అది కుంతకుడు చెప్పిన వర్ణవిన్యాస వక్రతలో శబ్ద సంబంధిత వక్రతగా పరిగణించబడుతుంది. తిక్కన రసాభ్యుచిత బంధం రసోన్మేష వక్రతలో, ఎఱ్ఱన సూక్తి వైచిత్రి వాక్య వక్రతలో, ఉద్దండలీల శబ్ద సంబంధ వక్రతలో ఇలా ప్రతీ లక్షణం వక్రతా వ్యాపారంలో ఇముడుతుంది.

శ్రీనాథుని రచనలో వైదర్భీ రీతి విస్తృతంగా కనిపిస్తుంది. నన్నయ కూడా వైదర్భీ రీతిని ఆదరించాడు. కాని ఆయన రీతిని గుణపోషకంగా నిలిపాడు. గుణాలలో ప్రసాదానికి ప్రాధాన్యం ఇచ్చాడు. శ్రీనాథుడు కూడా నన్నయ లాగా ప్రసాద గుణాన్ని గైకొన్నా దాన్ని ఓజో మాధుర్య

గుణాలతో మిశ్రమం చేస్తాడు. ఇందులో ఎఱ్ఱన పోలికలు కొన్ని కన్పిస్తాయి. శ్రీనాథుడు ఎంతటి సమాసం వాడినా ఓజో గుణం గండూషించిన మాధుర్యాన్ని మాత్రం మరచిపోడు" (జి.వి.ఎస్. 2012.పుట.108)

ముఖ్యంగా శ్రీనాథుడు అనుసరించిన మార్గం వక్రోక్తి. శ్రీనాథుడు రసానికి ప్రాధాన్యత ఇచ్చాడు. కుంతకుడు కూడా ఎక్కడ రస వ్యతిరేకం చేయలేదు. అలాగే ఆనందవర్ధనుడు వక్రోక్తిని ప్రస్తావించి ధ్వనిని అనుసరించమని చెప్పాడు.

"Ānandavardhana does not treat vakrokti separately, he fully knows the concept of vakrokti enunciated by Bhāmaha. In the second chapter of his work Ānandavardhana speaks of vakrokti as an expressed figure (Vācyālaṅkāra). He would regard vakrokti as stated and dhvani as suggested" (1988.pg.27) అంటూ R.S. Pathak 'vakrokti and stylistical concepts' లో వివరించారు.

ఇందరి అభిప్రాయాల కారణంగా శ్రీనాథునిపై పరిశోధనలు చేసిన వారి ఆలోచనల దృష్ట్యా శ్రీనాథుని కవితా మార్గంగా వక్రోక్తిని నిర్ధారించవచ్చు. ఎందుకంటే అతను చెప్పిన కవితా గుణాలన్ని కుంతకుని వక్రోక్తిలో అంతర్భవించినవి. మరి అతను రసాన్ని ఓలలాడించినవాడు కదా ధ్వనిని పాటించలేదా అంటే ఆ మార్గాన్ని పాటించినప్పటికిని శబ్దార్థాలకు ప్రాధాన్యమిచ్చి కుంతకుని వక్రోక్తి మార్గం ప్రధానంగా చేసుకొని ఇతని కవితా మార్గం నడిచిందని చెప్పవచ్చు. రానున్న అధ్యాయాల్లో శ్రీనాథుని పద్యాలను కుంతకుని వక్రోక్తి సిద్ధాంతంతో సమన్వయం చేసి శ్రీనాథుని కవితా మార్గం వక్రోక్తి మార్గమని సోదాహరంగా నిరూపించే ప్రయత్నం చేస్తాను.

★★★

## అధ్యాయం–3

## శ్రీనాథుని కవిత్వం – వర్ణవిన్యాస వక్రత

కుంతకుడు చెప్పిన ఆరు రకాల వక్రతలలో వర్ణ విన్యాస వక్రత మొదటిది. వర్ణాలలో జరిగే విన్యాసం (దానిలో ఉన్న శోభ వలన) కలిగే వక్రత అని అర్థం. వర్ణ విన్యాస వక్రతను గూర్చి తెలుసుకునే ముందు వర్ణం గూర్చి కొంత చర్చించవలసిన అవసరముంది.

### 3.1. వర్ణం

వర్ణము అంటే "అక్షరము, అర్ణము, మాతృకయనునవి దీని పర్యాయపదములు. వర్ణించునది వర్ణము. భాషా ధ్వనిని వర్ణించునది" (ఛం.ద.IV.129) అని చెప్పబడ్డది.

"వర్ణమునకర్థము లేదు. ఇది యర్థభేదక సామర్థ్యము కలిగినదని – యాధునికులభిప్రాయము" (వ్యాకరణపదకోశం. 2005. పుట.488).

వర్ణము గూర్చి చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని పరిశీలించితే అచ్చులకు, హల్లులకు, కలిపి అక్షరాలు అనే అర్థంలో వర్ణం అనే పదాన్ని భాషాపరంగా వాడినట్లుగా "తెనుఁగునకు వర్ణములు ముప్పదియాఱు" అంటూ రాసిన సూత్రాన్ని గమనిస్తే తెలుస్తుంది.

ఆధునిక భాషావేత్తలు అర్థభేదన సామర్థ్యం గల ధ్వనిని వర్ణంగా గుర్తించారు. ఇందులో భాగంగా అచ్చు, హల్లు ఏదైనా వర్ణం కావచ్చు. ఇలా పలు అర్థాలలో భాషాపరంగా వాడిన 'వర్ణం' అనే పదం వర్ణ విన్యాస వక్రతలో కుంతకుడు ఏ అర్థాన్ని ఉద్దేశించి వాడాడు? అనే ప్రశ్నకు సమాధానం ఆవశ్యకమైంది.

వర్ణవిన్యాస వక్రతలోని 'వర్ణం' అనే పదం అచ్చుకు సంబంధించినది కాదు. హల్లుకు చెందినదని బాలానందిని వ్యాఖ్యానంతో 'వక్రోక్తి జీవితంలో' వివరించిన "ప్రసిద్ధి ననుసరించి, ఇచట వర్ణ శబ్దమునకు వ్యంజనము (హల్లు) అని యర్థము" (రామచంద్రుడు, పుల్లెల.2007.పుట.158) అని చెప్పారు.

ఇక్కడ 'వర్ణం' శబ్దానికి హల్లు అనే అర్థాన్ని గ్రహించాల్సి ఉంటుంది. వక్రోక్తి జీవితంలోని శ్లోక ఉదాహరణల్లో కూడా హల్లునే ప్రయోగించి వర్ణ విన్యాసాన్ని తెలిపారు.

**కా. "ఏకోద్వౌ బహవో వర్ణాబధ్యమానాః పునః పునః**
**స్వల్పాన్తరా స్త్రిధా సోక్తా వర్ణవిన్యాస వక్రతా"** **(వ.జీ.ఉ:2.కా:1)**

ఒకటి లేదా, రెండు లేదా అంతకంటె అధికమైన వర్ణాలు తక్కువ వ్యవధానంతో మాటిమాటికి కూర్చబడితే అది మూడు విధాలైన వర్ణవిన్యాస వక్రతగా చెప్పబడింది.

కుంతకుడు చెప్పిన "ఈ వర్ణవిన్యాస వక్రతా భేదాలు ఇతరాలంకారికులు అంగీకరించిన ఛేకానుప్రాస, వృత్త్యానుప్రాస, అంత్యానుప్రాస, లాటానుప్రాస, శ్రుత్యానుప్రాస అను ఐదు ప్రాసములతో అంతర్గతము అగును" (శ్రీరామచంద్రుడు, పుల్లెల:2007:పుట:162).

వర్ణాలు పదే పదే ఆవృత్తమయ్యే శబ్ద సౌందర్యాన్ని కుంతకుడు వర్ణవిన్యాస వక్రతగా తెలిపాడు. దానినే ఇతరాలంకారికులు శబ్దాలంకారంగా తెలిపారు.

వర్ణవిన్యాస వక్రతను ప్రధానంగా మూడు రకాలుగా చెప్పాడు.

1) ఏకవర్ణ పునరావృత్తి

2) ద్వివర్ణ పునరావృత్తి

3) బహువర్ణ పునరావృత్తి

వీటితోపాటు మరో మూడు రకాల వక్రతలను తెలుపుతూ

**కా॥ వర్గాన్తయోగినః స్పర్శా ద్వియుక్తాస్తలనాదయః**
**శిష్టాశ్చరాది సంయుక్తాః ప్రస్తుతౌచిత్య శోభినః**

**(వ.జీ.ఉ:2.కా.2)**

వర్గపంచమాక్షరాలతో కూడిన స్పర్శ వర్ణాలు 'క'కారం మొదలుకొని 'మ'కారం వరకు పునరావృత్తం కావటం, త, ల, న మొదలైనవి ద్విరుక్తాలుగా రావటం, అలాగే రేఫాది సంయుక్తాక్షరములు రావటం వలన శోభ కలగటం కూడా వక్రతగా తెలిపాడు. మరో మూడు రకాల వర్ణవిన్యాస వక్రతలను ఈ కారికలో వివరించాడు.

1) స్పర్శాలు వర్గపంచమాక్షరాలతో కలిసి రావటం.

2) ద్విరుక్తములైన త, ల, న వర్ణాలు పునరావృత్తం కావటం.

3) రేఫాది సంయుక్త వర్ణాలు ఆవృత్తం కావటం.

ఇలా వర్ణవిన్యాస వక్రత ఆరు విధాలు.

### 3.2. ఏకవర్ణ పునరావృత్తి

వర్ణవిన్యాస వక్రతలో మొదటి రకం వక్రత ఏకవర్ణ పునరావృత్తి. ఒకే హల్లు అనేక సార్లు ఆవృత్తమైతే అది ఏకవర్ణ పునరావృత్తిగా చెప్పి వర్ణవిన్యాస వక్రతలో భాగం చేశాడు కుంతకుడు. దీనిని ఇతరులు వృత్త్యానుప్రాసగా భావించారు.

### 3.2.1. ఏకవర్ణ పునరావృత్తి – సమన్వయం

**కం॥ తరతరమ దరువఁ దరువం**
**దరి యందుదయంబు నొందె ధన్వంతరిసా**
**గరమునఁ గడు గరగరనై**
**కరమునఁ గరమమరు నమృత కలశముఁ దానున్**

**(భీమే.పు.94 పద్యం)**

దేవతలు, రాక్షసులు కలసి పాలసముద్రాన్ని మథించగా అమృతభాండమును చేతిలో పట్టుకొని ధన్వంతరి పాలసంద్రం నుండి కాంతిమంతుడై ఉద్భవించిన సందర్భంలోనిది ఈ పద్యం.

ఇందులో 'రేఫ' 'ర' అనునది పలుమార్లు ఆవృత్తమైనది. దీనివల్ల శబ్ద సౌందర్యం ఏర్పడి పద్యం శ్రవణ సుభగంగా తోస్తుంది. రేఫ పలుమార్లు ఆవృత్తం కావటం వల్ల నిజంగా క్షీరసాగర మథనం అలాగే నిర్విరామంగా జరిగిందా? అనిపిస్తుంది. ఒకే అక్షరం పలుమార్లు ఆవృత్తమైనందున ఏకవర్ణ పునరావృత్తిగా చెప్తూ శ్రీనాథుని ఈ పద్యాన్ని వర్ణవిన్యాస వక్రతకు ఉదాహరణగా చెప్పవచ్చు.

**శా॥ ఆడెందాండవ మార్భటీ పటహలీలాటోప విస్ఫూర్జిత**
**క్రీడాడంబర ముల్లసిల్ల గరళగ్రీవుండు జూటాటవీ**
**క్రోడా ఘూట కరోటి కోటర కుటీ కోటీలురత్సింధు వీ**
**చీ డోలా పటలీ పరిస్ఫుటతం స్పీత ధ్వని ప్రౌఢిమన్**

**(భీమే.పు. 148 పద్యం)**

మహాశివుడు తాండవము చేసే సందర్భంలోనిది ఈ పద్యం. అడవిలో ఉన్న గంగాదేవి ఆ తాండవ వేగానికి అటుఇటు కొట్టుకుంటున్నది. శివుని మెడలోని కపాల మాలికలు కదులుతూ ధ్వనిస్తున్నాయి. ప్రమథుల వాద్యాలు బిగ్గరగా మోగుతున్నాయి. శివుని తాండవానికి గొప్ప ధ్వని ఉద్భవించిందని చెప్పే పద్యం.

ఇందులో 'ట' అనేక మార్లు ఆవృత్తమై పద్యానికి నాద సౌష్ఠవాన్ని తెచ్చి పెట్టింది. నిజంగా శివుని తాండవ ధ్వనిని తలపించేలా చేసింది ఈ 'ట' కార శబ్దమేమో అన్నట్లుగా ఉంది. అనేక మార్లు ఒకే అక్షరం ఆవృత్తం కావటం వల్ల పద్య సౌందర్యం ఏర్పడింది. శ్రీనాథుడు తన కవిత్వంలో వేములవాడ భీమన ఉద్దండలీల ఉంటుందని చెప్పిన విధంగానే ఈ పద్యం విజృంభణతో ఉద్ధతత్వాన్ని కలిగి ఉన్నది. అలాగే నన్నయలోని ఉభయ వాక్ప్రౌఢికి కూడా ఈ పద్యాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు. ఉద్దండత, ఉభయ వాక్ప్రౌఢి, కుంతకుని వర్ణవిన్యాస వక్రతలో ఇముడుతాయని చెప్పడానికి ఈ పద్యం చక్కని నిదర్శనం.

**కం॥ వడివిడువక యివ్వడువున**
**నుడుపతి ముకుటుండు చెవులకొనరని నుడుగుల్**
**నొడివిన నే నయ్యిరువుర**
**యడుగలcబడి కాశి వెడలి యరిగెడు వేళన్.**

(భీమే. ద్వితీ.ఆశ్వా. 155 పద్యం)

వ్యాసున్ని కాశీ వదిలి పొమ్మని శివుడు కోపగించే సందర్భంలోనిది ఈ పద్యం. ఇందు 'డ' కారం ప్రతీసారీ ఆవృత్తమై వర్ణవిన్యాసాన్ని కలిగించింది. మహాశివుడి మాట్లాడిన వేగాన్ని ఈ వర్ణ శబ్దం చెపుతున్నదా అన్నట్లు అనిపించటం ఈ పద్యంలోని ప్రత్యేకత. ఇది పోతన భాగవతంలోని 'అడిగెదనని కదువడిజను' పద్యాన్ని గుర్తుకు తెలుస్తుంది. 'డ' వర్ణవిన్యాసంతో అలరించిన ఈ పద్యం ఏక వర్ణవిన్యాసానికి ఉదాహరణ.

**తే॥ భీమ! భీమేశ్వరరేశ్వర! భీమనాథ!**
**భవ! భవారణ్య పావక! భవ్యమూర్తి!**
**భర్గ! పాలాక్ష! భసితాంగ! ఫణివిభూష!**
**శిఖి శిఖా భాసమాన! భజింతు నిన్ను.**

(భీమే. పంచ. ఆశ్వా. 134 పద్యం)

సర్వేశ్వరుడు అందరిచే నమస్కరించేవాడుగా తెలియజేస్తూ పర్యాయపదాలను వివరించాడు కవి. ఇది పర్యాయపద వక్రతగా కూడా చెప్పవచ్చు. ఇందులో 'భ' శబ్దం అనేక మార్లు ఆవృత్తం

కావటం మూలాన శ్రవణ సుభగత్వాన్ని కూర్చి వర్ణవిన్యాస వక్రతగా మారింది. అలాగే 'భవ', 'శిఖ', 'ఈశ్వర' శబ్దం పలుమార్లు ఆవృత్తం అయినందున ద్వివర్ణ విన్యాసంగా కూడా చెప్పవచ్చు.

**క॥ బలవదరినికర నిర్భర**
**బలసాదన బహుదర్ప బంధురలీలా**
**విలసనత యెసఁగ వచ్చెను**
**బలసూదను సభకు భక్తి భావం బలరన్.**

(హర. సప్త. ఆశ్వా. 142 పద్యం)

శత్రువులను జయించేటి భయముతో ఇంద్ర సభకు వచ్చాడు ఇంద్రుడు. ఆ విషయాన్ని వర్ణిస్తూ చెప్పిన పద్యం. 'బ' వర్ణం అనేకసార్లు ఆవృత్తం అయి వీనుల విందుగా నుండటం ఇక్కడ ఏక వర్ణవిన్యాస వక్రత.

**క॥ ఉఱుముఱిమి మూలగాడ్పులు**
**సఱచి విసరఁ జొచ్చెమదనసంహరుదెసఁగ్రొ**
**మ్మెఱుఁ గుద్భవించెఁ గప్పలు**
**గఱవఱ గఱవఱగయనుచు గట్టున నఱచెన్**

(హర. ద్వితీ. ఆశ్వా. 18 పద్యం)

కవి వర్షాగమన సూచనలను ఇక్కడ వర్ణించాడు. సహజంగా చిత్రిస్తూ ఉఱుములు ఉఱమటం, గాలి రావటం, కప్ప గఱవఱ అంటూ శబ్దం చేయటాన్ని తెలిపాడు. ఆ క్రమంలో బండి 'ఱ' శకట రేఫను పలుమార్లు వాడటం జరిగింది. 'ఱ' వర్ణం అనేకమార్లు రావటం కప్పల శబ్దాన్ని 'ఱ' వర్ణం చెబుతున్నదా అనేలా ఉంది. విన్నప్పుడు అక్షర చమత్కారాన్ని కలిగిస్తుంది. ఇది ఏక వర్ణవిన్యాసానికి ఉదాహరణ.

**తే॥ ఇవ్విధంబునఁ గ్రథకైశికేంద్రతనయ**
**మదన వేదన దోదూయమాన యగుచు**
**బహువిధంబుల విధుదూఱి పలుకుచుండెఁ**
**దొడఁగి మధురంబుగా విధుంతుదునిఁ బొగడె.**

(శృ.నై. ద్వితీ. ఆశ్వా. 132 పద్యం)

భీమరాజు కూతురైన దమయంతి మదనవేదనతో చంద్రుని నిందించటం మొదలు పెట్టిందని పద్య భావం. ఇందులో మదన, వేదన, ఉదయ, బహువిధ, విధుదూటి, మధుర, విధుంతుదుడు పదాల్లో 'ద' వర్ణం 'ధ' కూడా అనేకసార్లు ఆవృత్తం కావటం ఏక వర్ణవిన్యాసానికి ఉదాహరణ.

**తే॥ నిషధ భూపాలు నొల్లకే నృపతినొరుని**
**నభిలషించెద నేని, హంసాగ్రగణ్య**
**యామవతి చంద్రునొల్లక యన్యునొకని**
**నభిలషింపంగ నోంకార మాచరించు.**

**(శృ. నై. ద్వితీ. ఆశ్వా. 69 పద్యం)**

నేను నిషధరాజుని కాదని వేరే రాజుని కోరుకుంటే, చంద్రుని కాదని రాత్రి వేరేవాడిని అభిలషించినట్లవుతుంది. కావున నేను కాదనుకొనని దమయంతి హంసతో చెప్పింది. ఇందులో 'న' వర్ణం అనేక మార్లు ఆవృత్తం అయ్యింది. దమయంతి భావాన్ని 'న' వర్ణం వేగంగా తెలిపిందా అని తోస్తుంది. ఇది ఏక వర్ణవిన్యాసానికి ఉదాహరణ.

**కం॥ దరవికచ వకుళ కురవక**
**పరిమళ సంభారలోల బంభరమాలా**
**పరిషర్ఝుంకార ధ్వని**
**తెరువరులకు మన్మథ ప్రదీపన మొసఁగన్**

**(కాశీ. ప్రథ. ఆశ్వా. 92 పద్యం)**

అరవిరిసిన పొగడ పూవుల యొక్క గోరింటల యొక్క వాసనలకు వచ్చిన భ్రమరాలు జుమ్మను నాదం వినిపిస్తున్నాయట అని దీని అర్థం. ఇందులో రేఫ 'ర' పలుమార్లు ఆవృత్తం కావటం వలన పద్యానికి నాద సౌష్ఠవం ఏర్పడింది. నిజంగా సుకుమారంతో తుమ్మెదలు ధ్వని చేస్తున్నాయా అన్నట్లు ఉంది. సుకుమారంతో కూడిన కైశికి వృత్తితో గల శృంగార సంబంధ మన్మథ భావాన్ని ఉద్దీంపింప జేసినది ఈ పద్యం.

**కం॥ త్రిభువన భవనారంభా**
**రభటీ సంరంభ మూలరత్న స్థంభా!**
**యభినవ హిమకర రేఖా**

**శుభికాలంకార ధామ శోభిత మకుటా!**

**(హర. షష్ఠా. ఆశ్వా. 34 పద్యం)**

త్రిలోకాలను సృష్టించిన శివుని శిరస్సు చందమామతో శోభించే విషయం వర్ణిస్తూ 'భ' వర్ణం భువన, భవనారంభ, సంరంభ పదాల్లో పలుమార్లు ఆవృత్తం కావటం శబ్దంలో సౌందర్యమేర్పడింది. ప్రపంచంలోనే శోభాయమానమైందా ఈ చంద్రవంక అన్నట్లు ఈ పదాలే చెప్తున్నట్లుగా అనిపిస్తుంది.

**క॥ తరుణ హిమ కిరణరేఖా**
**భరణా! సుర నికర మకుట భాసుర రత్న**
**స్ఫురణా పరిచయ రంజిత**
**చరణా! నిరుపాధికాభి సంస్కృతి కరుణా!**

**(హర. షష్ఠా. ఆశ్వా. 36 పద్యం)**

చంద్రరేఖను ఆభరణంగా పెట్టుకున్నవాడా! ఎంతో మంది దేవతలచే నమస్కరించబడిన పాదాలు కలవాడా! అంటూ ఈశ్వర స్తుతి చేసిన ఈ పద్యంలో 'రేఫ' 'ర' పలుమార్లు ఆవృత్తం కావటం నాద సౌందర్యాన్నిచ్చింది. శ్రవణోపేతమైనది. ద్రాక్షపాకంతో, మాధుర్యగుణంతో, వైదర్భీ రీతిలో సులువుగా అర్థమై వీనుల విందు చేసిన పద్యమిది. రేఫ పలుమార్లు ఆవృత్తం కావటం వల్ల ఇది ఏక వర్ణవిన్యాస వక్రతగా గుర్తింపవచ్చు.

**క॥ తాఁచుచుఁ బొడుచుచుఁ బడుచును**
**నేఁచుచు నుడుకుచును బిట్టునెగయుచుగూలం**
**ద్రోచుచుఁ దూలుచుఁ బెనఁగిరి**
**ప్రాచీపతి సుతుఁడు హరుఁడు బాహాబాహిన్**

**(హర. సప్త. ఆశ్వా. 85 పద్యం)**

అర్జునుడు, హరుడు ఇద్దరి బాహాబాహి యుద్ధం ఏ విధంగా జరిగిందో కన్నులకు కట్టినట్టే 'చ' కార వర్ణాన్ని పలుమార్లు వాడి చూపాడు కవి. 'చ' అనేక మార్లు రావటం వలన ఎడతెరిపి లేకుండా యుద్ధం జరిగినట్టుందే అని అనిపిస్తుంది.

**శా॥ ధాటీఘోటక రత్న ఘట్టనమిళద్ద్రాఘిష్ఠ కళ్యాణ ఘం**
**టాటంకార విలుంఠలుంఠిమహోన్మత్తాహిత క్షోణిభృ**

త్కోటీరాంకితకుంభినీ ధర సముత్కూటాటవీఝూటక

ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ.

(ఛాటు. మణి. ప్రథ. భా. 295 పద్యం)

తెలుగు రాయని శౌర్య ప్రతాపాలను పొగుడుతూ రాయని జాతి అశ్వాలు శత్రుసైన్యపు అశ్వాల మీద దూకినపుడు వాటి జీనులు ఒకదానితో ఒకటి రాసుకొని శబ్దం విపరీతంగా వచ్చిందని, ఘంటాటంకార పదాలను వాడాడు. శత్రువర్గం తలలు తెగి వారి అరణాల్లో దొర్లాయి అంతటి శౌర్య ప్రతాపం నీది నీకు దీర్ఘాయుష్షు కలగాలని చెప్పిన పద్యం ఇది. ఇందులో 'ధా'టీఘోటక, ఘంటాటంకార, భృత్కోటీ, సముత్కూటాటవీ, ఝూటకర్ణాలు పదాల్లో పలుమార్లు 'ట' కారం ఆవృత్తం కావటం రాజు యుద్ధ రంగాన్ని తలపించింది. ఏకవర్ణావృత్తం నాద సౌష్టవాన్ని ఇచ్చింది. ఉద్దండతను కూడా ఈ అక్షరాలే తెలిపాయా అన్నట్లనిపించింది. 'ట' వర్ణంతోపాటు సంయుక్తాక్షర పదప్రయోగం కూడా పద్య సౌందర్యాన్ని పెంచింది.

క॥ రంభాస్తంభములూరువు

లంభోరుహనిభము లక్షులతను శరంబుల్

జంభాసురారి మదగజ

కుంభములీ నంబివారి కోడలి కుచముల్

(చాటు.మణి.ప్రథ.భా. 309 పద్యం)

నంబి వారి కోడలిని చూసి శ్రీనాథుడు ఆమె వక్షోజ సౌందర్యాన్ని, ఊరువులను వర్ణించు సందర్భం ఇది. ఇక్కడ 'భ' వర్ణం అనేక మార్లు ఆవృత్తం అయ్యింది! ఏకవర్ణ పునరావృత్తి ఉంది.

క॥ నీలాటిరేవులోపల

మేలిమితోఁ దీర్చినట్టు మెఱసి నిలుచున్

దాలిమిని వాలుఁ జూపుల

బాలామణి గుట్టు బైటఁబడఁగా జూచెన్.

(చాటు.మణి.ప్రథ.భా.321 పద్యం)

స్నానానికి వెళ్ళిన చోట శ్రీనాథునికి ఒక స్త్రీ కనిపిస్తే ఆమెను వర్ణిస్తూ ఆశువుగా రాసిన చమత్కార పద్యం అని చదివితేనే తెలిసిపోతుంది. ఇందులో 'ల' వర్ణం పలుమార్లు ఆవృత్తమై పద్య శబ్ద మాధుర్యాన్ని పెంచింది. ఇది ఏకవర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

**క॥ గిటగిటనగు నెన్నడుముల**
**పుటపుటనుగ చన్నుగవలు పున్నమనెలతో**
**జిటపొటలాడెదు మొగములు**
**కటితటముల కొమరు శబరకాంతలకమరున్**

**(చాటు.మణి.ప్రథ.భా. 338 పద్యం)**

కిరాత స్త్రీ సౌందర్య వర్ణన చేస్తూ, అవయవ సౌందర్యాన్ని వర్ణించాడు కవి. కిటకిట, పుటపుట, చిటపొట, కటితటములు పదాల్లోని 'ట' వర్ణావృత్తి పలుమార్లు జరగటం వలన పద్యంలో విశిష్టత కలిగింది. ఇతరాలంకారికులు వృత్యానుప్రాసగా చెప్పే అలంకారానికి ఇది సరైన ఉదాహరణ. అలాగే కుంతకుని దృష్టిలో ఏకవర్ణావృత్తి.

## 3.3. ద్వివర్ణ పునరావృత్తి

రెండు వర్ణాలు పదే పదే ఆవృత్తమైతే దానిని ద్వివర్ణ పునరావృత్తి అంటారు. ఇది కూడా వర్ణవిన్యాస భేదంగా కుంతకుడు పేర్కొన్నాడు. దానికి బాలరామాయణంలో ఉదహరణ ఇచ్చి అందులో 'పాయంపాయం', 'దలదలం', 'కెళీకలి', 'కుహకుహ' అనే ఉదాహరణలు ఇచ్చాడు. కుంతకుడు చెప్పిన ఈ వక్రతలు ఇతరాలంకారికుల దృష్టిలో వృత్యానుప్రాస, ఛేకానుప్రాస, అంత్యానుప్రాసగా చెప్పబడ్డాయి.

### 3.3.1. ద్వివర్ణ పునరావృత్తి – సమన్వయం

**క॥ ప్రతిఘటియింపఁగ వచ్చునె**
**ప్రతి భటులకు నసమ సమర ఫల్గునుతోడన్**
**శతకోటి దృఢ కఠార**
**క్షత శాత్రవు తోడ లింగసచివుని తోడన్**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 62 పద్యం)**

లింగమంత్రి వర్ణన ఇది. యుద్ధ విద్యలో ఆరితేరినవాడని చెప్తూ 'అసమ, సమ' పదాలను వాడటం, ప్రతి పదాన్ని రెండు చోట్ల వేరు వేరు అర్థాలలో వాడటం జరిగింది. దీనివల్ల కొంత చమత్కారం ఏర్పడుతుంది. ద్వి వర్ణాలు ఆవృత్తం కావటం ద్వివర్ణ విన్యాసవక్రతగా చెప్పాడు. కుంతకుడు, ఇతరాలంకారికులు దీనిని ఛేకానుప్రాసగా గుర్తించారు.

**క॥ పూజారివారి కోడలు**
**తా జాఱఁగ బిందె జారి దబ్బునఁ బడియెన్**
**మైజాఱు కొంగు దడిసిన**
**బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్**

**(చాటు.మణి.ప్రథ.భా.318 పద్యం)**

రేవు దగ్గర పూజారి వారి కోడలిని వర్ణిస్తూ నీటి బిందెను ఆమె పడేయగా కొంగు తడిసిందని బజారంతా తిరిగి చూశారని చమత్కార వర్ణన చేశాడు. ఇందులో 'రేఫ' పలుమార్లు ఆవృత్తమై మళ్ళీ మళ్ళీ చదవాలని అనిపించేంత చమత్కారంగా అక్షర విన్యాసం చేశాడు కవి. 'జారి' అనే పదంలో జ,ర, ద్వి వర్ణాలు ఆవృత్తం కావడంతో ఈ పద్యం ద్వివర్ణవిన్యాస వక్రతకు ఉదాహరణ.

**క॥ తారగిరి మందరముల బృందారకాది**
**తారకారాజ వదనలు తారుతార**
**తారతార శ్రుతి స్వరోదార లీలఁ**
**బాడుదురు బెండపూఁడన్న భవ్యకీర్తి**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 79 పద్యం)**

బెండపూడి అన్నయమంత్రి కీర్తి ఓంకారంలా మందరాది పర్వతస్త్రీలు ఉచ్చరిస్తున్నారని పొగుడుతూ, తారకరాజ, తారుతార, తారగిరి, పలుచోట్ల 'తార' శబ్దాన్ని భిన్న అర్థాలలో వాడటం జరిగింది. పద్యానికి రమణీయత చేకూరింది. కేవలం 'తార' పదం పలుమార్లు ఆవృత్తం కావటం శబ్ద సౌందర్యహేతువైంది.

**క॥ పూఁబోణులకును విటులకు**
**వేఁబోకలఁదలరు సొంప వీడ్కొలుపుఁబురిన్**
**వేఁబోకఁబోక తోఁటల**

**పూఁబాళల కమ్మతావి పొదలిన గాడ్పుల్**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 96 పద్యం)**

తెల్లవారు జామున పోకచెట్ల పూల వాసనలు గాలితో కలిసి సంతోషాన్నిచ్చాయి అని చెప్తూ 'పోక' అనే పదాన్ని పలుమార్లు వాడటం వల్ల నాద సౌందర్యమేర్పడ్డది. 'పోక' వర్ణాలు పలుమార్లు రావటం ద్వివర్ణవిన్యాస వక్రత.

**చం॥ వెల వెలఁ బాఱెఁ జంద్రుడును విన్నునఁదారక చక్ర వాళముల్**
**పలపలనయ్యె దీర్ఘికలఁ బద్మవనంబుల షట్పదాంగ నా**
**కలకలముల్ చెలంగె, వెడకన్ను మొగిడ్చె లలింగుముద్వతుల్**
**తెలతెలవాఱె జంభరిపు దిక్కునఁ దోఁచె ననూరు రాగముల్.**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. 48 పద్యం)**

సూర్యోదయ వర్ణన చేస్తూ కవి ఆకాశమున చంద్రుడు 'వెలవెల'బోగా ఉదయం 'తెలతెల' బోయెను అనే ఆమ్రేడితాలను వాడాడు. అలాగే నక్షత్రములు 'పలపలనయ్యె' (పలచన) అయ్యాయి అంటూ, ఆడ తుమ్మెదల 'కలకల'ములు ఎక్కువయ్యాయి అంటూ ఆకాశంలో ఉదయ కాంతులు ప్రసరిస్తూ తెలతెల వారిందని చెప్పాడు. ఇలా ద్విరుక్తంతో చెప్పటం వలన కొంత వినసొంపును కలిగిస్తుంది ఈ పద్యం. ఇది ద్వివర్ణ విన్యాస వక్రతకు ఉదాహరణ.

**తే॥ హేల నేలా తరంగిణీ కూల నిలయ**
**బాల బాలారుణా శోక పల్లవోష్ఠి**
**వేల వేలావనోద్దేశ విహృతిలోల**
**నేల నేలాయనక పాడ ఋషివరుండు.**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. 59 పద్యం)**

వ్యాసుడు 'ఏ'ల అనే నది ఒడ్డున ఆలయంలోని దేవతయైన 'హేల'కు జోలపాట పాడినట్లు కవి వర్ణిస్తూ 'హేల హేల, బాలబాలరుణా, వేలవేలా, (ఎలన్ + ఎలన్) ఏలనేలా' అని ద్విరుక్త పదాలను వాడుతూ, ప్రాసను కూర్చుతూ పద్య సౌందర్యాన్ని పెంచాడు.

**కం॥ అసమ సమ విషమ సమర**
**ప్రసృమర రిపు సుభట నిటలపట్ట విఘట్ట**

**వ్యసన దృఢ దోః కఠారా!**

**కుసుమ శరాసన సమానకోమలమూర్తీ!**

(భీమే. ద్వితీ. ఆశ్వా. 164 పద్యం)

వేమభూపాలుని పొగుడుతూ అతని పరాక్రమాన్ని తెలుపుతూ రకరకాల సమరములలో శత్రు సైనికుల నుదుటి పట్టములను చీల్చుటయందు ఆసక్తి కలిగినవాడా! మన్మథునితో సమానమైనవాడా అని వర్ణించాడు. ఇక్కడ 'అసమ, సమ', 'సమర', 'సమాన' పదాల్లో 'స' 'మ' అనే వర్ణాలు అనేక మార్లు భిన్న అర్థాల్లో వ్యక్తమయ్యాయి. ఇతరాలంకారికులు యమకంగా దీన్ని గుర్తించారు. కుంతకుడు వర్ణవిన్యాసంగా చెప్పాడు. ఇన్నిసార్లు ఈ హల్లుల జంట రావడం రాజు పరాక్రమాన్ని తెలియజేస్తూ శబ్ద సౌష్ఠవాన్ని కూర్చింది. సమానమైన, అసమానమైన, యుద్ధ సంబంధమైన అర్థాలను 'సమ' శబ్దం ఇక్కడ ఇచ్చింది.

**తే॥ భీమనాథుని త్రిభువనస్వామి, నాథుఁ**
**బార్వతీనాథుః శశ్వత్కృపాసనాథు,**
**దక్షవాటాధినాథు వేదత్రయైక**
**నాథు, నానాథుఁగొలుతు శ్రీనాథునాథు**

(భీమే. తృతీ. ఆశ్వా. 83 పద్యం)

భీమనాథుడు ఇంద్రునికి అధిపతి, పార్వతీ భర్త, కృపతో కూడినట్టివాడు, సర్వానికి నాథుడు, విష్ణువుకి కూడా ప్రభువు అని పొగుడుతూ అనేక పర్యాయాలు 'నాథ' శబ్దాన్ని రకరకాలుగా వాడి పద్య నాద సౌందర్యాన్ని పెంచాడు కవి. 'నాథ' పదం భిన్న సందార్భాల్లో పలుమార్లు ఆవృత్తమైనది.

**సీ॥ భవు, భవానీభర్త, భావసంభవవైరి**
**భవరోగ భంజను భాలనయను,**
**భోగప్రదుని, భోగి, భోగిరాజ విభూషు,**
**భూనభోఽభివ్యాప్తు, భువన వంద్యు,**
**భగవంతు, భర్గుని, భసితాంగ రాగుని,**
**భానుకోటి ప్రభా భాసమాను,**
**భాగీరథీమౌళి, భగదృగ్విపాటను,**

**భూరథాంగుని, భద్రభూతిధరుని,**

**తే॥ భామినీ సువిలాసార్థ వామభాగు,**
**భక్తితోఁడభజింపరో భవ్యమతులు**
**భావనాభాజుల కతండు ఫలములొసఁగు**
**భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవములు.**

**(భీమే. తృతీ. ఆశ్వా. 83 పద్యం)**

కవి ఈశ్వరుని గూర్చి తెలియజేస్తూ పార్వతీభర్త, భాలనేత్రుడు, భోగములనిచ్చువాడు, సర్పాలంకారుడు, భూమ్యాకాశాలను వ్యాపించినవాడు, సమస్తముచే నమస్కరింపబడేవాడు, భక్తులకు ధనం, సౌందర్యం అనే సంపదలనిచ్చేవాడుగా పొగిడాడు. ఇందులో 'భవ' శబ్దం పలుమార్లు ఆవృత్తమైంది. అలాగే 'భోగి' పదం అర్థభేదంతో వెనువెంటనే వచ్చింది. 'సౌభాగ్య', 'భాగ్య' పదాలు వెనువెంటనే ఆవృత్తమైనవి. ఈ హల్లుల జంట పలుమార్లు ఆవృత్తం కావటం వలన పద్యానికి రామణీయకత కలిగింది. 'భ' వర్ణం అనేకమార్లు వచ్చింది. ఈ పద్యంలో యమక, ఛేకానుప్రాస అలంకారాలున్నాయి. కుంతకుని ప్రకారం ద్వివర్ణ పునరావృత్తి 'భవ' శబ్దం, భోగి, భాగ్య శబ్దం వలన కలిగింది.

**క॥ తేజిత విష్ణు శిలీముఖుఁ**
**దేజః ప్రదు దక్షవాటి తీర్థైక మహా**
**రాజాధిరాజ రాజును**
**రాజకళాధరు భజింపరారో విభుదుల్!**

**(భీమే. తృతీ. ఆశ్వా. 84 పద్యం)**

దాక్షారామ భీమేశ్వరుడు, సర్వరాజాధిరాజులకు ఏకైక సమ్రాట్టు, చంద్రరేఖను ధరించినవాడు. అట్టి స్వామిని సేవింప రండి అని స్వామిని పొగుడుతున్న సందర్భంలోనిది ఈ పద్యం. ఇక్కడ 'రాజాధిరాజ' రాజును 'రాజ కళాధరు'ను అని 'రాజ' శబ్దాన్ని పలుమార్లు వాడటం జరిగింది. కనుక వర్ణ విన్యాస వక్రత.

**తే॥ శర్వు సర్వేశ్వరేశ్వరు సర్వ వంద్యు**
**శర్వు సర్వప్రదాయకు సర్వధాత**

శర్వు సర్వంసహా మహీ చక్రధరుని
శర్వు వర్ణింతు దేవతా సార్వభౌము

(భీమే. పంచ. ఆశ్వా. 135 పద్యం)

సర్వేశ్వరుడు అందరిచేత నమస్కరింపదగినవాడు. పాపులను శిక్షించేవాడు. సృష్టిస్థితిలయలు చేసేవాడు. సమస్తం భరించేవాడని వివరిస్తూ 'శర్వు', 'సర్వ' పదాలను చాలాసార్లు వాడటం వలన పద్యానికి శ్రవణ సుభగత్వం చేరింది. ఇది ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

తే॥ గ్రుక్కగ్రుక్కకుఁ గడుఁ దేజ మెక్కుచుండె
నమరులకు, గ్రుక్క గ్రుక్కకు నడఁగుచుండె
దైత్యులకుఁ దేజ మట్టి విధంబుగాక
రాహుకేతువు లనియెడు రాత్రిచరులు

(హర. షష్ఠా. ఆశ్వా. 126 పద్యం)

గ్రుక్కగ్రుక్కకు దేవతలకు తేజము అధికమవుతుంటే రాక్షసులకు తగ్గిపోసాగింది అనే విషయాన్ని 'గ్రుక్క, గ్రుక్క'కు అనే విషయాన్ని పలుమార్లు చెప్పటం వలన ఉన్నది ఉన్నట్లుగా దృశ్యమానవుతుందా? అనిపిస్తుంది. ఇది ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

తే॥ అఖిల కల్యాణ గుణగణా యత్తయత్త
మామ యౌదార్య తేజః క్షమామహితుఁడు
మాతులుండు యశో మహిమాతులుండు
తనయ! యేలయ్యెకై కోవు వినయబుద్ధి?

(కాశీ. చతు. ఆశ్వా. 92 పద్యం)

గుణనిధికి తల్లి మంచి చెప్పే సందర్భంలో మీ అత్తగారు గుణగణాల్లో అధీనురాలు, మామగారు ఉదార గుణములో గొప్పవాడు వారిని చూసి నేర్చుకోమని అంటుంది. ఇక్కడ 'యత్తయత్త' 'గుణగణ' పదాలు రెండుసార్లు రావటం ప్రత్యేకం 'ఆయత్త' అనగా అధీనురాలని అర్థం అత్త అనగా బంధువను అర్థాన్ని ఇవ్వటం హల్లుల జంట పక్కపక్కనే రావటం మామూలుగానైతే ఛేకానుప్రాస కానీ కుంతకుని దృష్టిలో ద్వివర్ణ విన్యాస వక్రత.

క॥ వైరి మదకుంభి కుంభవి

**దారణ దారుణ కృపాణ ధారలు పరిఘా**

**కారములు కందమూలో**

**ద్ధారములకుఁ బాలుపడెఁగదా నీకరముల్**

**(హర. సప్త. ఆశ్వా. 18 పద్యం)**

హరవిలాసంలో అర్జునుని చేతుల దృఢత్వాన్ని వర్ణిస్తున్న పద్యం ఇది. 'కుంభి', 'కుంభ' పదం ఆవృత్తం కావటం, 'ధార' అనే పదం పలుమార్లు రావటం వర్ణ సౌందర్యాన్నిచ్చింది. ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

**తే॥ వానిఁ గలలోనఁ గానని వనజముఖియు,**

**వాని మార్పునఁ బేర్కొని మానవతియు,**

**వానిఁగా నాత్మ భావించి వరునిం గవయ**

**నప్పళింపని సతియు, లేదయ్యె నెచట.**

**(శృం.నై. ప్రథ. ఆశ్వా. 62 పద్యం)**

నలున్ని స్మరించని స్త్రీ, నలుని ఆత్మలో నిలుపుకోని స్త్రీ, భర్తగా భావింపని స్త్రీ ఉండదని తెలుపుతూ చెప్పిన పద్యం. ఇందులో 'వాని' అనే పదం పలుమార్లు ఆవృత్తమై నలునికి ప్రత్యేకతను తెచ్చి పెట్టింది. ఆ ఒక్కడే గొప్పవాడు అనే అర్థం స్పురిస్తుంది.ఇది ద్వివర్ణ విన్యాస వక్రత.

**సీ॥ కాదుకాదుదయాద్రి కనక కూటంబిది**

**డంబైన పానవట్టంబుగాని**

**కాదు కాదిది సుధాకర పూర్ణబింబంబు**

**కాశ్మీర శంభు లింగంబుగాని**

**కాదు కాదు దయరాగ ప్రకాశంబిది**

**నవకుంకుమా లేపనంబుగాని**

**కాదు కాదిది కళంకచ్ఛటరింఛోళి**

**పూజ చేసిన కల్వపువ్వుగాని**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. 42 పద్యం)**

శివలింగాన్ని వర్ణిస్తూ కాదు కాదు అంటూ శ్రీనాథుని వర్ణన చెవులకు ఇంపుగా తోస్తుంది. ఎదురుగా కన్పించేది తూర్పుకొండ శిఖరం కాదు, అందమైన శివుని పానపట్టము తెల్లగా కనిపించే చంద్రబింబం కాదు. కాశ్మీర దేశపు శివలింగము. అది ఉదయకాలంలోని ఎరుపుపూత కాదు. శివునికి పూజ చేసిన కలువపూని కాని, చంద్రులోని మచ్చ కాదు. అంటూ సుందరవర్ణన హృదయంగమంగా చేయబడ్డది. ఇందులో 'కాదు' క, ద వర్ణాలు పదే పదే ఆవృత్తం కావటం మూలాన పద్యానికి సౌందర్యం చేకూరింది. ఇది ద్వివర్ణ పునరావృత్తి. అర్థపరంగా అపహ్నుతిగా కుడా చెప్పవచ్చు.

**తే॥ చంద్ర రజమునసోక పూర్ణచంద్రవదన**
**చంద్రమండల తిలకంబు సఖికిఁదీర్చెఁ**
**జంద్రశాలా శిలా ప్రదేశంబు నందు**
**నావహిల్లంగ నపుడు చంద్రానవస్థ**

**(శృం. నై. తృతీ. ఆశ్వా. 100 పద్యం)**

స్త్రీని వర్ణించే సందర్భంలో ఒక పూర్ణచంద్రుని వదనం కలిగిన స్త్రీ చంద్రశాలలో ఉండి, చంద్ర (కర్పూర) రజముతో తన చెలికి చంద్రబింబాకారంలో బొట్టును పెట్టిందని రమణీయంగా పద్యాన్ని కూర్చాడు. ఇక్కడ 'చంద్ర' అనే పదం పలుమార్లు ఆవృత్తమైంది. అలాగే 'చంద్ర' పదం చంద్రుని అర్థంలో ఒకసారి కర్పూర రజం అనే అర్థంలో వ్యవధానంతో వాడటం పద్య సౌందర్య హేతువైంది. సాధారణంగా ఆలంకారికులు యమకంగా చెప్తారు. కానీ కుంతకుడు ఇలాంటివి ద్వివర్ణ విన్యాస వక్రతగా భావించాడు. 'చంద్ర' పదంలో చ, ద, ర మూడు వర్ణాలు ఉన్నప్పటికి, 'ద కార', 'ర కారా'లమధ్య అచ్చు లేదు కనుక 'ద్ర' ఏకాక్షరంగా భావించాల్సి ఉంటుంది.

**శా॥ వేదాతీతుని వేదవేద్యుని శివున్ వేదాంత వేద్యున్ భవున్**
**వేదాంతోపనిషద్రహస్యముఁ జతుర్వేదీ విహారాలయున్**
**వేదాంగాది పురాణముఖ్య విలసద్వేద్యాగమ ప్రక్రియా**
**వేది న్నిన్ను భజింతు నెమ్మనమునన్ విశేవశ భీమేశ్వరా!**

**(భీమే. పంచ. ఆశ్వా. 136 పద్యం)**

భీమేశ్వరా! ఓ విశ్వేశ్వరా! వేదముల కన్న మించినవాడివి. వేదాలచేత చేత వేదాంతాలచేత తెలియబడేవాడివి. ఉపనిషత్తులలో సారమైనవాడా! నాలుగు వేదాలలో ఉండేవాడివని నిన్ను

స్తుతించెదము అని సప్తర్షులు వేడుకునే సందర్భంలోనిదీ పద్యం. ఇందులో 'వేద', 'వేద్యు', 'వేదాంత', 'వేదాంగాది', 'చతుర్వేది' పదాలలో 'వేద' అనే పదం పలుమార్లు ఆవృత్తమై పద్య సౌందర్యాన్ని పెంచింది. శ్రోతలకు శ్రవణానందాన్ని కల్పించింది. 'వేద' పదం పలుమార్లు ఆవృత్తం కావటంచేత ద్వివర్ణ విన్యాస వక్రతగా గుర్తించవచ్చు.

**కం॥ ఫాలేక్షణాస్త్ర వహ్ని**
**జ్వాలా జాలముల నసురవరనగరంబుల్**
**కాలిన నప్పుడు కాలక**
**కాలాంతక లింగ మొకటి కడునొప్పారెన్**

**(భీమే. పంచ. ఆశ్వా. 144 పద్యం)**

శివుడు ప్రయోగించిన నారాయణాస్త్రం అగ్నిజ్వాలలతో రాక్షసులను సంహరించినప్పుడు కాలాంతకుని లింగ రూపం మాత్రం దహనం కాక ప్రకాశించిందని చెప్పిన సందర్భంలోనిది ఈ పద్యం. ఇక్కడ 'జ్వాలా జాలముల' అనేటప్పుడు 'జాల'లోని వర్ణాలు రెండుసార్లు ఆవృత్తమయ్యాయి. అలాగే కాలిన,కాలక, కాలాంతక' అన్నప్పుడు 'కాల' పదం దహన సంబంధమైన, మృత్యు సంబంధమైన భిన్న అర్థాలలో అర్థభేదంతో వాడటం విశేషం.

**క॥ కరుణింపు సమాశ్రితభయ**
**హరణ! సురాసుర కిరీట హరిహయరత్న**
**స్ఫురణా! మధుకర పరివృత**
**చరణా! యత్యంతదాంతి శాంథ్యాభరణా!**

**(హర. ప్రథ. ఆశ్వా. 42 పద్యం)**

ఈ పద్యం ఆశ్రయించిన వాళ్ళని రక్షించేవాడా! దేవ రాక్షస గణంచేత నమస్కరింపబడేవాడా! మామీద దయ చూపమని తుంబురుడు దుర్వాసుని వేడుకునే సందర్భంలోనిది. 'రణ' అనే పదం పదగతంగా రెండుసార్లు రావటం వర్ణవిన్యాసంగా చెప్పబడుతుంది. మామూలుగా అయితే ద్వ్యక్షరప్రాసగా చెప్తాం.

**క॥ తరిగొండఁ దరువఁదరు వం**
**దిరుగుడువడు నుదధిలోనఁ దీవ్రముగా ది**

**ర్దిరఁ దిరుగుచుఁ దరఁగల వడి**

**దరతరమ సుపర్వసురభి దరికింజేరెన్.**

**(హర. షష్ఠా. ఆశ్వా. 90 పద్యం)**

మందర పర్వతాన్ని మథించగా సముద్ర అలల్లో కామధేనువు దరికి చేరిందనే విషయాన్ని వర్ణిస్తూ రాసిన పద్యం ఇది. 'త', 'ర' అనే రెండు వర్ణాలు పలుమార్లు ఆవృత్తమయ్యాయి. 'తరువతరువన్' అనేది కూడా రెండు సార్లు రావటం మూలానా ఆ మందర పర్వతాన్ని అంతగా మథించారా? అనే విషయాన్ని ఈ అక్షరాలే చెపుతున్నాయా? అన్నట్లుంది. ఇలా రెండు వర్ణాలు పలుమార్లు ఆవృత్తం కావటం ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

**క॥ నెల నెల దప్పక యుండఁగ**

**నెలభాస్కరుఁ జొచ్చుటెల్ల నియమముతోడం,**

**గలహంస! వేఁడి వెన్నెల**

**సొలయక నాయంగములు సూఁడుటకుఁజుమీ**

**(శృం. నై. ద్వితీ. ఆశ్వా. 33 పద్యం)**

నలుడు హంసతో మాట్లాడుతూ ఓ రాజహంసా! ప్రతీ నెల నెలకు చంద్రుడు సూర్యునిలో ప్రవేశించటం మానకుండా, ఆ వేడి వెన్నెలతో నా శరీరాన్ని కాల్చాలని అనుకుంటున్నాడు అని విరహ వేదనను తెలుపుతాడు. చంద్రుడు సూర్యునిలో ప్రవేశించటం అమావాస్య కావటం. చంద్రికలు ఉద్దీపన విభావాలుగా తెలియజేశాడు కవి. ఇలా 'నెల' అనే పదం పలుమార్లు ఆవృత్తమై అర్థభేదంతో ప్రయోగించబడింది. ఇది ద్వివర్ణ విన్యాస వక్రత.

**సీ॥ పంపా విరూపాక్ష బహుజటజూటికా**

**రగ్వధ ప్రసవ సౌరభ్యములకు**

**తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా**

**గంభీర ఘుమఘుమారంభములకు**

**కళసాపుర ప్రాంత కదళీవనాంతర, ద్రాక్షలతాఫలస్తబకములకు**

**కర్ణాటకామినీ కర్ణహాటకరత్న, తాటంకయుగధాళధళ్యములకు**

**గీ॥ నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత**

**తెలుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్తు**
**ప్రౌఢదేవేంద్రరాయ భూపాలవరుని**
**సమ్ముఖంబున దయఁజూడు ముమ్మసుకవి.**

**(చాటు.మణి.ప్రథ.భా. 374 పద్యం)**

ప్రౌఢదేవరాయల ఆస్థానానికి నన్ను తీసుకొని పోయి పరిచయం చేయి. పంపా తీర్థంలో ఉన్న విరూపాక్షుని జాటాజూటంలో అలంకరించబడ్డ పూలవాసనలకు, తుంగ భద్ర అలల ఘుమఘుమ ధ్వనులకు, కళసాపురంలోని అరటి, ద్రాక్ష గుత్తులకు, కర్ణాట స్త్రీల కమ్మల బంగారుమయమైన ప్రకాశించే కాంతులకు సరిపోయే కవిత్వాన్ని తెలుగు సంస్కృతంలో చెపుతానని ముమ్మకవితో శ్రీనాథుడు అన్నట్లు ఈ పద్య భావం. ఇందులో ధ్వని హృదయంగమంగా ఉంటుంది. జటాజూట, తుంగ, సముత్తుంగ, ఘుమ ఘుమ, కర్ణాట, కర్ణహాటక, ధాళధళ్యం ఇవి ద్వివర్ణ పునరావృత్తిగా చెప్పవచ్చు. శ్రీనాథునికి పాండితీ ప్రకర్షకు శబ్దంపై గల పట్టుకి ఈ పద్యం ఉదాహరణ.

**క॥ నెమలిపురి యమపురముగా**
**యముఁడాయెను బసివిరెడ్డి యంతకు**
**యమదూతలైరి కాఁపులు**
**క్రమ మెఱుఁగని దున్నలైరి కరణా లెల్లన్.**

**(చాటు.మణి.ప్రథ.భా. 331 పద్యం)**

నెమలి పురి ప్రాంతాన్ని యమపురిగా చెప్తూ 'యమ' పదాన్ని అనేక మార్లు వాడటం ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**క॥ చెవి నివి నీలపురాలా**
**యువిదరొ నిను రతులఁ దనుపనొకని తరాలా**
**యివి రుద్రాక్షసరాలా**
**జవరాల మహాత్మురాల జంగమురాలా!**

**(చాటు.మణి.ప్రథ.భా.341 పద్యం)**

ఒక జంగమ స్త్రీని ఉద్దేశించి రాసిన పద్యం ఇది. ఇందులో 'రాలా' అనే పదం పలుమార్లు ఆవృత్తం అయ్యింది. భిన్న అర్థాలలో రావటం సౌందర్యాత్మకం. పదగతంగా, ప్రశ్నాత్మకంగా

సంబోధనాత్మకంగా పాదం చివరన అంత్యానుప్రాసగా రావటం ఈ పద్య విశిష్టత. ఇందులో 'రాలా' పదంలోని వర్ణాలు. ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ. రెండక్షరాలతో శబ్ద చమత్కారం ఏర్పడ్డది.

**క॥ జొన్నకలి జొన్నయంబలి**
**జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్**
**సన్నన్నము సున్నసుమీ**
**పన్నగఁ బల్నాటి సీమ ప్రజలందఱకున్**

**(చాటు.మణి.ప్రథ.భా. 327 పద్యం)**

పల్నాటిసీమకు వెళ్ళినపుడు ఎక్కడ చూసిన జొన్నకలి, జొన్న అంబలి, సన్నటి బియ్యపు అన్నం లేదు అంటూ చమత్కార పద్యం అల్లాడు. ఇందులో 'జొన్న' పదం పలుమార్లు ఆవృత్తం కావడం విశేషం. 'సన్నన్నము సున్న సుమీ' అనేది శబ్ద సౌందర్యాన్ని కూర్చింది. ఇది ద్వివర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

### 3.4. బహువర్ణ పునరావృత్తి

రెండింటికంటె ఎక్కువ వర్ణాలు అంటే మూడు లేదా అంతకన్నా ఎక్కువ వర్ణాలు ఆవృత్తమైతే అది బహువర్ణ పునరావృత్తిగా చెప్పవచ్చని కుంతకుడు తెలియజేసాడు.

### 3.4.1. బహువర్ణ పునరావృత్తి – సమన్వయం

**కం॥ ఆనందజ్యోతినిఁ బర**
**మానందానందమూర్తి నవ్యయునిఁద్రిలో**
**కానందామృతదాయి మ**
**హానందుని వృషభ వాహునభివర్ణింతున్.**

**(భీమే. పంచ. ఆశ్వా. 138 పద్యం)**

భీమేశ్వర స్వామిని స్తుతిస్తూ ఆనందజ్యోతివి, బ్రహ్మానందం వలె ఉన్న హర్ష స్వరూపుడివి. త్రిలోకం అనే అమృతాన్ని ప్రసాదించే వాడివంటూ పొగిడిన పద్యం ఇది. ఇందులో 'ఆనంద' అనే పదం పలుమార్లు ఆవృత్తం కావటం పద్యానికి సౌందర్యం ఏర్పడింది. నిజమైన ఆనందాన్ని 'ఆనందం' అనే పదం కలిగిస్తున్నదా అన్నట్లు హాయిని గొల్పింది. ఇది బహువర్ణ పునరావృత్తి చేత బహువర్ణ విన్యాస వక్రతగా చెప్పవచ్చు.

**తే॥ హృదయమున నుండి యెప్పుడు హృదయనాథ!**
**ప్రియముఁ జెప్పెద ననుటెల్ల భేషజంబు**
**హృదయమున నుంట నిజమేని మదనయెట్లు**
**భస్మమైతివి నేనెట్లు బ్రదుకఁగంటి?**

**(హర. తృతీ. ఆశ్వా. 90 పద్యం)**

ఓ మన్మథా! నీవు భస్మం అయిపోయావు నేనెలా జీవించాలి? అంటూ రతీదేవి విలాపాన్ని వర్ణించాడు కవి. ఇక్కడ హృదయనాథ, హృదయమున, అనే పదాల్లో 'హృదయ' పదం పలుమార్లు ఆవృత్తమై హృదయ వేదనని వర్ణించింది కనుక బహువర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

**ఉ॥ ఏదెసఁ జూచినన్ విబుధు లేదెసఁ జూచినమౌని మండలం**
**బేదెసఁ జూచినన్ హరిదధీశ్వర వర్గము వాసవాది యం**
**దేదెసఁ జూచినన్ నవ మహేశ్వర మూర్తులు శ్రీనికుంభకుం**
**భోదరతండు భృంగిరిటి హూహుక హాహులు దక్షవాటికన్.**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 104 పద్యం)**

దాక్షారామంలో ఏ వైపు చూసినా దేవతలు, మునులు, ఇంద్రాది దిక్పాలకులు, కొంత శివలింగమూర్తులు, ప్రమథ గణాలు కన్పిస్తున్నాయనే విషయం వర్ణితం. ఇక్కడ 'ఏ దెస జూచినన్' అనే పదాలు పలుమార్లు ఆవృత్తమయ్యాయి. అన్ని దిక్కులా ఒకటే కన్పిస్తుంది అని వర్ణించి చెప్పటానికి బహువర్ణ పదాలను కవి అనేకమార్లు వాడారు ఇది బహువర్ణ విన్యాసం.

**ఉ॥ ఎక్కడఁ జూచినన్ సరసి, యెక్కడఁ జూచిన దేవమందిరం,**
**బెక్కడఁ జూచినందటిని, యొక్కడఁ జూచిన పుష్పవాటికం,**
**బెక్కడఁ జూచినన్నది, మహీవలయంబున భీమమండలం**
**బెక్కడ? యన్యమండలము లెక్కడ? భావన చేసి చూచినన్**

**(భీమే. తృతీ. ఆశ్వా. 23 పద్యం)**

భీమమండలంలో 'ఎక్కడ చూసిన తటాకమే' అంటూ ఎక్కడ చూసిన దేవాలయమే, ఎక్కడ చూసిన పూలతోటలే అని కవి వర్ణించిన పద్యం. 'ఎక్కడ జూసిన' అనే పదం పలుమార్లు ఆవృత్తం

కావటం వలన భీమమండల ప్రాముఖ్యతను, ఔన్నత్యాన్ని ఈ పదాలే ప్రత్యేకించి చెప్తున్నాయా? అని అనిపిస్తుంది. ఉత్సుకతను పెంచుతున్నది. బహువర్ణవిన్యాస వక్రతకు ఇది ఉదాహరణ.

**చ॥ పడితిమి కుక్కలుం బడనిపాటులు దుర్భరమైన వృత్తి వె**
**న్నడితిమి గర్భయంచకుల భంగి దరిద్రత నెట్టుకొంచు లోఁ**
**బడితిమి పాలలోఁబడిన బల్లులకైవడి నెల్ల వెంటలం**
**జెడితిమి వేయునేల సరసీరుహసంభవ! దుష్టదైత్యుచేన్.**

**(హర. తృతీ. ఆశ్వా. 15 పద్యం)**

తారక రాక్షసుని వలన దేవతలు పడరాని పాట్లు పడ్డామని చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం. పడితిమి కుక్కలుం బడని పాటులు, 'పడి'తిమి గర్భ యాచకుల' భంగి అంటూ పడితిమి పాలలో పలుమార్లు 'పడితిమి' అనే పదం ఆవృత్తమైనందున దేవతల కష్టాలను ఈ పదం విన్నవిస్తుందా? అని చెప్పేలా ఉంది ఈ పద్యం కనుక బహువర్ణగతమైన 'పడితి'మి పదం ఆవృత్తం కావటం వలన బహువర్ణ విన్యాస వక్రత.

**క॥ ఆ ఋషులఁ జూడ శివునకుఁ**
**దార పరిగ్రహము వెంటఁదద్దయుఁదవిలెన్**
**దార పరిగ్రహమే కద**
**సారపు ధర్మముల కెల్ల సాధనమరయన్**

**(హర. చతు. ఆశ్వా. 44 పద్యం)**

ఋషులను చూసిన వెంటనే శివునికి భార్య పరిగ్రహణం అనేది మనసులో పరుగెత్తింది అని కవి వర్ణించాడు. ఇక్కడ 'దారపరిగ్రహణం' అనే దాన్ని రెండుసార్లు వాడటం పద్య సౌందర్యహేతువైంది. బహువర్ణ విన్యాసం వలన కనుక బహువర్ణ పునరావృత్తిగా చెప్పవచ్చు.

**కం॥ లీల! మహాకాల! మహా**
**కాల మహాకాల! యనుచుఁ గడుభక్తి మహా**
**కాల స్థానాధీశ్వరుఁ**
**గాలగళున్ సంస్మరింపఁ గాంతురు ముక్తుల్.**

**(కాశీ. తృతీ. ఆశ్వా. 107 పద్యం)**

ఉజ్జయిని మహాకాళేశ్వరుని గూర్చి తెలుపుతూ 'మహాకాల' శబ్దాన్ని పలుమార్లు ఉచ్చరించటం ద్వారా పద్య సౌందర్యం చేకూరింది ఇలా బహువర్ణపదం పలుమార్లు ఆవృత్తం కావటం కూడా వర్ణవిన్యాస వక్రతే.

**కం॥ కాంతుండు సంతోషించిన**
**సంతోషింపంగ వలయు సతికతండాత్మన్**
**సంతాపించిన పట్టున**
**సంతాపింపంగ వలయు జలజేక్షణకున్**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 78 పద్యం)**

కవి భర్త సంతోషంగా ఉంటే భార్య సంతోషంగా ఉండాలి. భార్య భర్త సంతాపంగా ఉంటే తను సంతాపంతో ఉండాలి అనే విషయాన్ని వర్ణిస్తున్నాడు. 'సంతోషం' పదం రెండు సార్లు 'సంతాపం' పదం రెండు సార్లు ఆవృత్తం కావున బహువర్ణ పునరావృత్తి.

**తే॥ మొగుడం బాటిన యరవిందములను బాసి**
**గములు గములగ మత్త భృంగములు గూడి**
**డుంఠి విఘ్నేషు చెక్కు లుత్కంఠం జేరె**
**నభినవంబైన యపర సంధ్యాగమమున.**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. 28 పద్యం)**

సంధ్యాకాల సమయంలో విశాలాక్షి గంగానదిలో స్నానం చేసి అలంకరించుకొన్నదని, విశ్వనాథుడు తాండవ సూచకంగా మద్దెల మోగిందని అదే సమయంలో గుంపులు గుంపులుగా తుమ్మెదలు ముకుళించుకొన్న పద్మాలను విడిచి పెట్టి విఘ్నేశ్వరుని చెక్కిళ్లను చేరాయని వర్ణించాడు. ఇక్కడ 'గములు' 'గములుగ' 'భృంగములుగా' ఇలా 'గములు' అనే బహు వర్ణాలు పదే పదే ఆవృత్తమయ్యాయి. శబ్ద సౌందర్యాన్నిచ్చాయి. 'గములు' గుంపులుగా అనే అర్థంలో 'భృంగములు' అనే చోట తుమ్మెదలు అనే అర్థంలో వాడబడ్డాయి. ఇక్కడ వేరే ఆలంకారికుల దృష్టిలో యమకం. కుంతకుని దృష్టిలో వర్ణవిన్యాసానికి ఉదాహరణం.

**క॥ మగవారల నిందింపకు**
**తగవునుం బంతంబు నిజము ధర్మముం గృపయున్**

**మగవారికె కాకెందును**

**మగువలకుం గలదె చంద్రమండల వదనా?**

**(శివ. తృతీ. ఆశ్వా. 77 పద్యం)**

మాలెతతో సుకుమారుడు మగవారిని నిందింపవద్దు. మగవారికే పంతం, తగవు చెల్లుతుంది. స్త్రీలకు కాదనే విషయాన్ని తెలుపుతున్నాడు. ఇక్కడ 'మగవారల'లో 'మగవ' అలాగే 'మగువ'లో మ, గ, వ అనేక సార్లు ఆవృత్తం అయినందున కొంత చమత్కారం ఏర్పడ్డది. ఆ వర్ణ చమత్కారమే బహువర్ణ పునారవృత్తి. మగువ, మగవలో కేవలం 'ఉ' అచ్చుతోనే అర్థం మారింది.

**క॥ క్రూరాత్ముఁడీతఁడనఁగా**

**జోరుండితఁ డనఁగ నితఁడశుద్ధుఁడనదు**

**శ్చారుండితఁ డనఁగా సుకు**

**మారున కపకీర్తి హూణమండలిఁ బ్రబలెన్**

**(శివ. తృతీ. ఆశ్వా. 122 పద్యం)**

సుకుమారుడు క్రూరుడు, చోరుడు, అపవిత్రుడని, హూణ మండలం మొత్తం తెలిసిపోయిందని కవి చెప్పే సందర్భంలోనిది. ఇక్కడ 'ఈతడనగా' అనే పదం పలుమార్లు ఆవృత్తమైంది. 'డ, న, గ' వర్ణాలు పదే పదే వచ్చాయి. ఇన్నిసార్లు చెప్పటం ద్వారా సుకుమారుని చేష్టలను ఆతని గూర్చి నొక్కి వక్కాణించినట్లుగా అనిపిస్తుంది. ఇది బహువర్ణ పునరావృత్తి.

**క॥ నీహార భూధరేశ్వరు**

**నీహారమణీయ మూర్తి నిందుకరహిమా**

**నీ హార హీర కుముద సు**

**ధాహార సమాన కాంతినభివర్ణింతున్**

**(భీమే. తృతీ. ఆశ్వా. 165 పద్యం)**

అందమైనవాడు, వెన్నెలలాంటి, మంచులాంటి, వజ్రంలాంటి తెల్ల కలువలాంటి, శరీర కాంతి గల పరమేశ్వరున్ని స్తుతిస్తాను అని ఈ పద్య భావం. ఇందులో 'నీహార' పదం పలుమార్లు ఆవృత్తమైనది. న, హ, ర వర్ణాలు వచ్చాయి కనుక బహువర్ణ పునరావృత్తి. 'నీహార' పదం మంచు పదంగా కొన్నిసార్లు 'ఈహ' పదంగా కోరిక అనే అర్థంలో వాడబడింది. హిమవంతుని కోరిక చేత అనే

అర్థాన్ని కూడా ఇచ్చింది. సభంగ శ్లేష కూడా ఉంది. కానీ కుంతకుని ప్రకారం బహువర్ణ విన్యాసం వలన పద్యనాద సౌందర్యం చేకూరింది.

**కం॥ ఒకమాటు జలకమార్చిన**
**నొకమాటొక పువ్వు మౌళినునిచిన నొకమా**
**టుకుటిలమతి గుడిఁదిరిగిన**
**సకలేప్సితముల నతఁడు సంపాదించున్**

**(భీమే. తృతీ. ఆశ్వా. 170 పద్యం)**

నిర్మలమైన మనస్సుతో శివునికి ఒకసారి అభిషేకం చేసినా, ఒకసారి పువ్వు శివునిపై ఉంచిన, ఒకసారి ప్రదక్షిణం చేసినా మనిషికి కావాల్సిన వాటిని పొందుతాడని అర్థం. ఇందులో 'ఒకమాటు' అనే పదం పలుమార్లు ఆవృత్తమైనందున బహువర్ణ విన్యాసానికి ఉదాహరణ.

**కం॥ గూఢములు నిగూఢంబులు**
**గూఢా గూఢములు నగుచుఁ గోటుల సంఖ్యల్**
**గాఢ మహేశ్వర భక్తిని**
**రూఢిం దీర్థములు గలవు రుద్రుని వాటిన్**

**(భీమే. తృతీ. ఆశ్వా. 75 పద్యం)**

కవి దక్షారామంలో రహస్యాలు చాలా ఉన్నాయి. తీర్థాలు కోటానుకోట్లు ఉండి శివునిపై భక్తిని కలిగిస్తాయి అని తెలిపాడు. ఇక్కడ 'గూఢము' అనే పదం పలుమార్లు ఆవృత్తం కావటం వలన బహువర్ణ విన్యాస వక్రతగా చెప్పవచ్చు.

**క॥ సిరి యేలికయగు నరకే**
**సరియేమో కాని గర్వసంరంభముమై**
**సరి యేపొనరఁగ నితరులు**
**సరియేయరియేటి యన్న సచివాగ్రణికిన్**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 77 పద్యం)**

అన్నమంత్రి ఔద్ధత్యానికి లక్ష్మీసమేతుడైన నరసింహస్వామి సమానుడు అవుతాడు కానీ వేరెవరు కారు అనే విషయాన్ని చెప్తూ 'సరియే' అనే పదాన్ని పలుమార్లు వాడటం పద్యంలోని ప్రత్యేకత. స, ర, య అనేక మార్లు రావటం బహు వర్ణ విన్యాస వక్రత.

**తే॥ అనల సంబంధ వాంఛ నాకగునయేని,**
**యనల సంబంధ నాకగున చూవె;**
**చాలు సందేహ వక్ర భాషణము లింకఁ**
**దరళ, చక్రాంగ పాథః పతంగ శక్ర**

**(శృం. నై. ద్వితీ. ఆశ్వా. 71 పద్యం)**

దమయంతి హంసతో మాట్లాడుతూ ఆ నలుడిని కాకుండా వేరొకనితో కూడటం అనేది. అనలం (నిప్పు)లో పడి మాడటమే అనే విషయాన్ని చెప్తుంది. ఇక్కడ 'అనలం' అంటే నిప్పు. 'అనల' అనేది నలుని నామగత అర్థం. 'అనల సంబంధవాంఛ నాకగునయేని' అనే పదాలు రెండు సార్లు ఆవృత్తం కావటం బహువర్ణ విన్యాసం.

**ఉ॥ శర్మమెకాని, యవ్విబుధ సద్మమునందుఁ దలంచి చూడఁగా**
**ధర్మము సేయలేః దిచటధర్మము సేయఁగ, నిర్విశంకతన్**
**శర్మము నొందనుం, గలదు; శర్మము ధర్మముఁ గాంచుటొప్పునో,**
**శర్మముఁ గాంచు టొప్పునో, విచారము సేయుము నెమ్మనంబునన్**

**(శృం. నై. తృతీ. ఆశ్వా. 133 పద్యం)**

కేవల సుఖాన్ని పొందటం ముఖ్యమా? లేక ధర్మాన్ని సాధించి దాని ద్వారా వచ్చిన సుఖాన్ని, ధర్మాన్ని ఆచరించటం ముఖ్యమా? అనే విషయాన్ని దమయంతి చర్చిస్తూ ధర్మాన్ని, శర్మాన్ని పొందుతానని తెలుపుతుంది. ఇక్కడ 'శర్మము' 'ధర్మము' పదం అనేక సార్లు ఆవృత్తమైనందున పద్యానికి అందం చేకూరింది. ఇది బహువర్ణ పునరావృత్తి. శ, ధ, ర, మ వర్ణాలు పలుమార్లు ఆవృత్తమయ్యాయి.

**క॥ ఇందుండి యూర్ధ్వగతియును**
**నందుండి యధోగతియును నవసానమునన్**
**బొందును సజ్జను; డిందును**

నందును గలవాసి చూడుమా డెందమునన్

(శృం. నై. తృతీ. ఆశ్వా. 134 పద్యం)

ఇందుండి అంటే భూలోకం నుండి స్వర్గానికి పోవటం ఊర్ధ్వగతి అక్కడి నుండి భూలోకానికి రావటం అధోగతి మనసులో ఆలోచిస్తూ దమయంతి ఇక్కడ నల భార్యనై ధర్మం ఆచరించటం శ్రేయస్కరం అని భావించే సందర్భంలోనిది ఈ పద్యం. ఇందుండి, అందుండి పదాల్లో ద, డ, 'డెందము' డ, ద, అలాగే 'య' అనేకమార్లు ఆవృత్తం కావటం వలన పద్యంలో నాద సౌందర్యం ఏర్పడ్డది కనుక బహువర్ణ పునరావృత్తి.

క॥ కుంకుమ లేదో మృగమద
పంకము లేదో పటీరపాంసువులేదో
సంకుమదము లేదో యశు
భంకరమగు భస్మమేల బాలా! నీకున్.

(చాటు.మణి.ప్రథ.భా. 366 పద్యం)

స్త్రీ అలంకరణ విషయాలను బాగా గమనించిన వ్యక్తి శ్రీనాథుడని ఆతని వర్ణనల ద్వారా తెలుస్తాయి. కుంకుమ, కస్తూరి, జవ్వాది లేక కేవల భస్మమే ధరించావా? అని స్త్రీని ఉద్దేశించి రాసిన పద్యం ఇది. ఇందులో కుంకుమ లేదో, పంకము లేదో, సంకుమదము లేదో అనే పదాల్లోని క, మ, ల, ద అనే వర్ణాలు పలుమార్లు ఆవృత్తం కావటం వలన ప్రాసాక్షరయుక్తంగా పద్యం నడిచి శ్రవణానందాన్ని ఇచ్చింది. ఇది కుంతకుని దృష్టిలో బహువర్ణ పునరావృత్తికి ఉదాహరణ.

సీ॥ కవిరాజు కంఠంబు కౌఁగిలించెను గదా!
పురవీథి నెదురరెండ పొగడదండ
ఆంధ్రనైషధ కరత యంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత
వియ్యమందెను గదా వెదురుగొడియ
సార్వభౌముని భుజాస్తంభమెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్లగుండు

(చాటు.మణి.ప్రథ.భా. 369 పద్యం)

శ్రీనాథుడు భోగాలను అనుభవించిన కవి. తనకు ఆశ్రయమిచ్చిన రాజులు కాలం చేశారు. ధనం పోయింది. తనకు ఆశ్రయమిచ్చిన రెడ్డి రాజుల శత్రువులు ఎన్నో కష్టాలపాలు చేశారు. దానిని తలుచుకుంటూ రాసిన పద్యం కరుణరసార్ద్రంగా ఉంది. దీనిలో కవి దీనావస్థ వర్ణితం. ఇందులో 'కదా' అని పలుమార్లు రావటం పదానికి ముందు 'న' వర్ణం రావటం పలుమార్లు జరిగింది. అలాగే 'వ', 'గ' వర్ణాలు కూడా పలుమార్లు ఆవృత్తమయ్యాయి కనుక ఇది బహువర్ణ పునరావృత్తి.

### 3.5. స్పర్శవర్ణయుక్త వక్రత

కుంతకుడు ప్రధానంగా మూడు వక్రతలు చెప్పిన తర్వాత మరో మూడు భేదాలు చెప్పాడు. అందులో మొదటి భేదం స్పర్శవర్ణయుక్త వక్రత. స్పర్శాలతో వర్గపంచమాక్షరాలు కలిసి రావటం. సంస్కృతంలో వర్గ పంచమాక్షరాలతో కూడిన పదాలు ఉంటాయి. తెలుగులో వాటి స్థానంలో పూర్ణబిందువును వాడుతాం. కాబట్టి స్పర్శ వర్ణాలతో కూడిన పూర్ణ బిందువుగల పద్యాలను ఇందుకు ఉదాహరణగా ఇవ్వవలసి ఉంటుంది. వక్రోక్తి జీవితంలో ఈ లక్షణానికి ఉదాహరణగా

**"సరస్వతీ హృదయారవిన్దమకరన్ద బిన్దు సన్దోహసున్దరామ్"**

**(వ.జీ. పుట.164)**

అని ఇచ్చారు. పంచమాక్షరానికి బదులు మనం పూర్ణబిందువుని సూచిస్తాం. శ్రీనాథుని కవిత్వంలో ఇటువంటి పద్యాలను పరిశీలిద్దాం.

### 3.5.1. స్పర్శవర్ణయుక్త వక్రత – సమన్వయం

**క॥ చెంచుమల చూఱకారున**
**కంచిత బాహుపరాక్రమాధారునకున్**
**పంచారామ వధూటీ**
**పంచాస్త్ర విహార కేళిపాంచాలునకున్**

**(భీమే. ప్రథ. ఆశ్వా. 85 పద్యం)**

'చెంచుమల చూఱకార' అనే బిరుదుగల అన్నమ మంత్రిని పొగుడుతున్న సందర్భం. ఇందులో 'చెంచు', కంచిత, పంచాధామ, పంచాస్త్ర పదాలలో 'చ'వర్గ పంచమాక్షరం అయిన 'ఞ' రావాల్సి

ఉంది కానీ దానికి బదులుగా పూర్ణ బిందువు రావటం జరిగింది. ఇది స్పర్శవర్ణయుక్త వక్రతకు ఉదాహరణగా చెప్పవచ్చు.

**క॥ బంగారు కంక పత్రముఁ**
**గెంగేల ధరించి యొప్పె గిరినందన య**
**భ్యంగము తటి భాస్కర కర**
**సంగతయగు విదియనాఁటి శశికళవోలెన్**

**(హర. చతు. ఆశ్వా. 80 పద్యం)**

బంగారుమయమైన కంక పత్రాన్ని ధరించిన పార్వతి విదియనాటి చంద్రరేఖలా గొప్ప కాంతితో వెలుగొందటం వర్ణితం. ఇక్కడ బంగారు, కంక, గెంగేల, ధరించి, అభ్యంగ పదాలలో 'ఙ', 'ఞ' రావాల్సింది. కానీ పూర్ణబిందువు వచ్చింది. కనుక స్పర్శవర్ణగత వక్రతగా చెప్పవచ్చు. ఇలా వర్గపంచమాక్షరంతో కూడిన పదాలు ఉన్నప్పుడు కొంత ఉచ్చారణ సంబంధిత సౌందర్యం కనిపిస్తుంది.

**క॥ మందాకినీ తరంగము**
**లాందోళము నందఁజేయు చల్లల్లన సం**
**క్రందనుని మీఁదఁ బొలసెను**
**మందార లతా వనాంత మందానిలముల్**

**(హర. షష్ఠ. ఆశ్వా. 11 పద్యం)**

మందాకినీ నది తరంగాల నుండి వీచే మంద్ర వాయువులు ఇంద్రున్ని కమ్ముకొన్నాయని కవి వర్ణిస్తున్న సందర్భంలోనిది. ఇక్కడ 'మందాకినీ' తరంగము, ఆందోళము, అందజేయు, సంక్రందనుని, మందార, వనాంత, 'మందానిలము' పదాలలో న, ఙ వర్ణాలకు బదులు అనుస్వారం వాడబడింది. పూర్ణబిందువు అనేకమార్లు ఆవృత్తం కావటంతో శబ్ద సౌందర్యం ఏర్పడ్డది.

**క॥ అందు విహరించుఁగాంచన**
**కందర మందిరములందుఁ గౌతుకమొప్పన్**
**బృందారక మిథునంబులు**
**కందర్ప విహారములఁ బగళ్ళును రేలున్**

**(హర. పంచ. ఆశ్వా. 21 పద్యం)**

దేవదారు వన విహారంలో భాగంగా హిమవత్పర్వత వర్ణన చేస్తూ అక్కడ దేవతా స్త్రీలు, పురుషులు ఎప్పుడు మన్మథకేళిలో ఉంటారని వర్ణించాడు. ఇక్కడ అందు, విహరించు, కాంచన, కందర, మందిర, బృందారక, మిధునంబు, కందర్ప పదాలలోని న, ఞ, మ, వర్గ పంచమాక్షరాల బదులుగా అనుస్వారం వాడబడింది. ఇలా వర్గపంచమాక్షరాలతో వర్గ అక్షరాలు కలవటం మూలాన శబ్ద సౌందర్యం ఏర్పడుతుంది. ఇది కూడా వర్ణ విన్యాస వక్రతలో భాగమే.

**క॥ పందివడిఁ బాఱు దెంచెఁబు**
**రందరనందన నిశాకరధరుల నడుమన్**
**దందడి గౌరిజల తాఁకునఁ**
**గందుకములు వోలె శిలలుగఱువాఱంగన్**

**(హర. సప్త. ఆశ్వా. 45 పద్యం)**

వరాహం శివార్జునుల మధ్యకు వేగంగా పారిపోయి వచ్చింది అనే విషయాన్ని చెపుతూ పంది, తెంచెన్, పురందనందన, దందడి, కందుకము, పాఱంగన్ అనే పదాల్లో వర్గ పంచమాక్షరమైన 'న, ఞ, ఙ' కి బదులుగా పూర్ణానుస్వారం వాడటం జరిగింది. ఇలా పదాల్లోని (పదగతమైన) సిద్ధ అనుస్వారం కల పదాలను వాడటం వలన నిజంగానే వరాహం విజృంభించి పారిపోయిందా అని అనిపిస్తుంది. అక్కడి స్థితిని ఈ పదాలే తెలుపుతున్నాయా అనిపిస్తుంది.

**కం॥ మండెడు బలునారసమున**
**గుండియ పగులంగ నేసికూల్చితి దీనిన్**
**వెండి ప్రయోజనమేదీ**
**రండాసుత! దీనిపై శరముని గుడింపన్**

**(హర. సప్త. ఆశ్వా. 54 పద్యం)**

శివుడు కిరాత వేషధారియై అర్జునునితో మాట్లాడుతూ ఈ వరాహంపై వాడిగల బాణాన్ని ప్రయోగించి, దాని గుండెను చీల్చాడు. మళ్ళీ దానిపై బాణం వేయటం నిష్ప్రయోజనం అంటూ తూలనాడుతాడు. ఇక్కడ మండెడు, గుండియ, వెండి, రండాసుత, నిగుడింపగన్, పదాలల్లో 'న' వర్గ పంచమాక్షరంగా రావాలి. దాని స్థానంలో అనుస్వారం వచ్చింది. ఇలా వర్గ పంచమాక్షరాలు గల పదాలను వాడటం వలన శివుని క్రోధాన్ని వెలిబుచ్చాయి. ఆ వేగాన్ని మాటల తీరును సరిగ్గా

ప్రదర్శించాయి. మామూలుగా అప్పకవీయంలో ప్రాస స్థానంలో బిందువు ఉంటే దీనిని పూర్ణబిందు పూర్వక ప్రాసగా చెప్తారు. కానీ కుంతకుని ప్రకారం వర్గపంచమాక్షర స్థానం కాబట్టి స్పర్శయుక్తగత వర్ణవిన్యాసంగా భావించాలి.

### 3.6. త, ల, నాదుల ద్విరుక్తగత వక్రత

ద్విరుక్త త, ల, న మొదలైన వర్ణాలు ద్విరుక్తగత వర్ణ వక్రతకు ఉదాహరణలు. ఇక్కడ ద్విరుక్తం అంటే ద్విత్వంగా భావించాలి. 'తలనాదయః' అని కారికలో చెప్పడం వల్ల ఈ మూడే కాకుండా మిగిలిన హల్లులు కూడా అని భావించాలి. కుంతకుడు ఉదాహరణగా "తదను విరహోత్తామ్యత్తన్వీకపోలతద్యుతిః" (వ.జీ. పుట–165) వాక్యాన్ని ఉదాహరణగా ఇచ్చాడు. ఇక్కడ ద్విత్వ 'త' కారం రావటం గమనించాలి.

### 3.6.1. త, ల, నాదుల ద్విరుక్తగత వక్రత – సమన్వయం

**కం॥ ఎవ్వనితో నెచ్చోటను**
**జివ్వకుఁ జేసాచవలదు చేసాచినచో**
**నివ్వల నవ్వల నెవ్వరు**
**నవ్వకయుండంగఁ బగసనన్ దీర్పనగున్**

**(కాశీ. ప్రథ. ఆశ్వా. 109 పద్యం)**

మేరుపర్వతం గూర్చి వింధ్యా పర్వతం ఆలోచిస్తూ ఎవరితో ఏ పరిస్థితుల్లో కలహానికి చెయ్యి చాపొద్దు. ఒకవేళ చాచితే పూర్తిగా శత్రుశేషం చేయాలి అంటూ బాధను పొందుతూ ఉంటాడు. ఆ సందర్భంలోనిది ఈ పద్యం. ఇక్కడ ఎవ్వని, జివ్వకు, అవ్వల, ఇవ్వల, నవ్వక అనే పదాల్లో 'న' ద్విత్వంగా రావటం వలన విషయాన్ని నొక్కి చెప్తున్నట్లుగా అనిపిస్తుంది. ద్విత్వం పలుమార్లు ఆవృత్తం కావటం కూడా ఒక రకమైన వక్రతగా కుంతకుడు తెలియజేశాడు. ఇదోరకమైన ఉక్తి వైచిత్ర్యం.

**కం॥ వెల్లిగొనె నఖిల దిక్కుల**
**నల్లని చీఁకటి నవాంజన ప్రతిభటమై**
**భల్లూక సటా వల్లిమ**
**తల్లీ విభ్రమదమై యదభ్ర స్ఫురణన్**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. 34 పద్యం)**

వ్యాసుడు శివుడు తనుక చేసిన అవమానాన్ని తలుచుకొని బాధపడే సందర్భంలో అన్ని దిక్కుల్లో చీకటి కాటుకలాగ, ఎలుగుబంటి జూలులాగా కమ్మేసిందని వర్ణించాడు కవి. ఇక్కడ వెల్లి, నల్లని, భల్లూకం, సటావల్లిమ, తల్లీ పదాల్లో 'ల' ద్విత్వంగా రావటం వలన పద్య ఉచ్చారణలో కొంత విశిష్టత ఉన్నట్లుగా, అక్షర చమత్కృతి కనిపిస్తుంది. ఇది రెండవ భేదంలోని వర్ణవిన్యాస వక్రత.

**క॥ కిక్కురు మన కమృతంబుం**
**గ్రుక్కలు వెట్టుదురు సురలు కోణపముఖ్యుల్**
**తక్కరి సుధారసంబులు**
**గ్రుక్కలు వెట్టుదురువారిఁ గూడియె తారున్**

**(హర. షష్ఠా. ఆశ్వా. 125 పద్యం)**

ఇక్కడ క్షీరసాగర మధనం తర్వాత అమృతాన్ని దేవతలు గ్రుక్కలు పెట్టి తాగగా, వాళ్ళతోపాటు రాక్షసులు తాగుతున్నారని వర్ణించపడింది. కిక్కురు, గ్రుక్కలు, తక్కరి అనే పదాల్లో 'క్క' ద్విత్వంగా రావటం విశేషం. ద్విత్వాక్షర ప్రయోగం దృశ్యాన్ని చూపెట్టినట్లనిపించింది.

**కం॥ ఎవ్వనితో నెచ్చోటను**
**జివ్వకుఁ జేసాచవలదు చేసాచినచో**
**నివ్వల నవ్వల నెవ్వరు**
**నవ్వక యుండంగఁ బగసనన్ దీర్పనగున్.**

**(కాశీ. ప్రథ. ఆశ్వా. 109 పద్యం)**

వింధ్య పర్వతం మాటలు ఇవి. మొదట ఎవ్వరితో కలహమునకు చేయి చాచొద్దు. ఒకవేళ చాచినట్లయితే చివరి వరకు శత్రు శేషం ఉండకుండా సమూలంగా తీసివేయాలని అనుకున్న సందర్భంలోనిది ఈ పద్యం. 'ఎవ్వని', 'జివ్వకు', నవ్వని, నివ్వల, నవ్వల, ఎవ్వరు, నవ్వక పదాలలో 'వ్వ' ద్విత్వంగా రావటం వలన పద్యానికి సౌందర్యం చేకూరింది. ఒత్తి పలకటం మూలాన మాటలు చాలా కచ్చితంగా చెప్పాడా అని అనిపిస్తుంది. ఇది కూడా ఒక రకం వర్ణ విన్యాస వక్రతే.

**క॥ నిన్నుఁ ద్రిగజన్నివాసునిఁ**
**బన్నగ కంకణుని భక్తపరతంత్రుని న**
**భ్యున్నత కరుణా గుణసం**

**పన్నుని గనుఁగొంటి మన్టి బాలేందు ధరాః**

**(హర. సప్త. ఆశ్వా. 94 పద్యం)**

శివున్ని అర్జునుడు స్తుతిస్తూ చంద్రమౌళీ! ముల్లోకాల్లో ఉండే నిన్ను కనుగొనడం వల్ల నా జన్మ సార్థకమైందని అనే సందర్భంలోనిది ఈ పద్యం. ఇక్కడ నిన్ను, త్రిజగన్నివాసు, పన్నగ, అభ్యున్నత, సంపన్నుని పదాల్లోని ద్విత్వ 'న"కారం ఉండటం వలన కొంత చమత్కృతి ఏర్పడింది. ఇది వక్రతా భేదంలో భాగంగా చెప్పవచ్చు.

**గీ॥ చిన్న చిన్న రాళ్ళు చిల్లదేవుళ్ళు**
**నాగులేటి నీళ్ళు నాఁపరాళ్ళు**
**సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులునుదేళ్లు**
**పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు.**

**(చాటు.మణి.ప్రథ.భా.326 పద్యం)**

శ్రీనాథుడు పల్నాటిసీమ పల్లెటూళ్ళను దర్శించినపుడు చెప్పిన పద్యం. ప్రతి పదం చివరన 'ళ్ళ' ద్విత్వం రావటం విశేషం. ద్విత్వం ఉంటే వర్ణవిన్యాసంలోని రెండవ వక్రత భేదానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**గీ॥ దళమయినయట్టి కంబళ్లు తలలు బోళ్లు**
**పయిఁడికిని జూడఁబయిఁడెత్తు ప్రత్తివిళ్లు**
**చలముకొని వెదకిన లేవు చల్లనీళ్లు**
**చూడవలసెను ద్రావిళ్ల కీడు మేళ్లు.**

**(చాటు.మణి.ప్రథ.భా.349 పద్యం)**

అరవం వారి జీవితాన్ని వర్ణిస్తున్న పద్యం. ఇందులో అంత్యానుప్రాసగా 'ళ్ళ' వాడటం విశేషం. రెండవ వక్రత భేదానికి ఉదాహరణ.

### 3.7. రేఫాది సంయుక్తగత వర్ణగత వక్రత

రేఫాది సంయుక్త హల్లులతో కూడుకొని ఉన్నట్లయితే అది కూడా వర్ణ విన్యాస వక్రతగా చెప్పాడు కుంతకుడు. ఆది శబ్దం చేత రేఫనే కాకుండా మిగిలిన వర్ణాలు కూడా సంయుక్తం కావచ్చు. "కహ్లారహ్లాదః" ఇత్యాది ప్రయోగములలో హకార సంయుక్తమగు లకారము రెండు పర్యాయములు

ప్రయోగింపబడినది గాన ఇందులకుదాహరణము – దీనిని బట్టి "రాది సంయుక్తాః" అనుదానిలోని 'అది' పదముచే షకార, హకారాదులను గ్రహింపవలెనని యభిప్రాయము" (పుల్లెల, శ్రీరామచంద్రుడు, వ.జీ. పుట–165, 2007). 'కహ్లాదహ్లాదః' అనే పదాలను తీసుకొని ష, హ వర్ణాలు కూడా సంయుక్తాలుగా రావొచ్చని కుంతకుడు తెలిపాడు.

### 3.7.1. రేఫాది సంయుక్తగత వర్ణగత వక్రత – సమన్వయం

**సీ॥ ద్రాఘిష్ఠ కఠిన దంష్ట్రా దండ సంఘట్ట**
**కటుఘోర కిటకిటాత్కార మగుచుఁ**
**జటుల ఝుంఝామరు ఝంపా పరంపరా**
**సన్నిభ ఘ్రూణ నిశ్వాస మగుచు**
**వికలతారకచంద్ర విభ్రాంతి భీషణ, స్ఫార చక్షుర్ద్వయీభయదమగుచు**
**నిటల వీథి విటంక నిర్భర భ్రూకృటి**
**నటనక్రియాటోప పటహమగుచుఁ**

**గీ॥ గాల మృత్యువు శాణ చక్రమునఁ బట్టి**
**చికిలి చేసిన యడిదంబుఁ జేతఁ దాల్చి**
**జేగుఱించిన మొగముతోఁ జిత్త జారి**
**ప్రమథ వర్గంబుఁ దాఁకె నాగ్రహమెలర్ప.**

**(శివ. చతు. ఆశ్వా. 78 పద్యం)**

సుకుమారున్ని యమభటులు తీసుకెళ్ళే సందర్భంలో శివప్రమథగణాలు అడ్డుకున్నారు. ఆ సమయంలో వారి యుద్ధ సన్నద్ధతను తెలిపింది ఈ పద్యం. కర్ణకఠోరమైన శబ్దం చేస్తూ, ఝుంఝా మారుతం లాంటి నిశ్వాసాలని విడుస్తూ, భయంకరంగా కనుగ్రుడ్లను తిప్పుతూ భయపెడుతూ, నుదుటన కనుబొమ్మలు నాట్యం ఆడుతుండగా కోపంతో ముఖం ఎర్రబడింది. అప్పుడు యమభటులని అడ్డుకున్నారనే విషయాన్ని శ్రీనాథుడు రేఫాది సంయుక్త వర్ణాలతో సంస్కృతభూయిష్ట సమాసాలతో ఉద్దండతతో పద్యాన్ని రాసాడు. ద్రాఘిష్ఠకఠిన, దంష్ట్రా, చంద్రవిభ్రాంతి, సన్నిభఘ్రూణ నిశ్వాస, క్రియాటోప, నిర్భర భ్రూకటి పదాలను వాడటం మూలాన ప్రమథుల ఆవేశాన్ని ఈ పదాలే చెపుతున్నాయా అని అనిపిస్తుంది. వారి క్రోధాన్ని పదాల్లోని పరుషత్వం రేఫాది సంయుక్త వర్ణాలు

తెలియజేసాయి. దీనిని వేములవాడ భీమన ఉద్దండత కూడా చెప్పవచ్చు. ఈ ఉద్దండత సంయుక్త ద్విత్వ వర్ణాల వల్ల చేకూరుతుంది. శ్రీనాథుడు చెప్పిన భీమన కవితామార్గం కుంతకుని వక్రోక్తిలోని భాగమైన వర్ణవిన్యాస వక్రతలో భాగం అయింది. లాగే నన్నయ ఉభయ వాక్ప్రౌఢి అన్నాడు కవి. సంస్కృత, తెలుగు భాషాపదాల చేరిక ఈ పద్యంలో చూడవచ్చు. ఇందులో ఉభయ వాక్ప్రౌఢి కూడా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**చ॥ అనుల సమీరణాత్మకములైన మహాస్త్రము లేసిరుద్ధతిం**
**దనుజులుగాడ్పుతో బెరసి నల్గడలొక్కట విస్ఫులింగము**
**ల్గనకనఁ గ్రోలఁ బావకశిఖ ల్వెస ముంచె సురేంద్రనందను**
**న్గనలి యతండడంచెనవి గ్రక్కున వారి మహాశుగంబులన్**

**(హర. సప్త. ఆశ్వా. 170 పద్యం)**

అగ్ని వాయు అస్త్రాలను రాక్షసులు ప్రయోగిస్తే, అర్జునున్ని అవి చుట్టుముట్టగా, విపరీతమైన కోపంతో ఒకేసారి చాలా వేగంతో పర్జన్యాస్త్రాలు ప్రయోగించాడు. ఇక్కడ వాడబడిన సమీకరణాత్మక, మహాస్త్ర, ఉద్ధతిన్, సురేంద్రనందను, గ్రక్కున, రేఫాది సంయుక్తాక్షరాలే ఇక్కడ విజృంభణను తెలియజేస్తున్నట్లు తోస్తుంది. అలాంటి దర్శనీయ చమత్కృతి ఈ వర్ణ విన్యాస వక్రత ద్వారా చేకూరింది. దీర్ఘ సమాస ప్రయోగం వేగాన్ని సూచించింది.

**మహాస్రగ్ధర: దమయంతీ కేళిధాత్రీధర శిఖర హరిద్రత్న భాదర్భ సందో**
**హ మజాండాఘాత భగ్నస్యద భవ మదతావాప్తలజ్జావనమ్ర**
**త్వముమైనుత్తాన గామర్త్య సురభి వదనాంతః స్థమైలీలనత్య**
**ర్థము గోగ్రాస ప్రదాన వ్రత సుకృతము తోరంబుగా వీటికిచ్చున్.**

**(శృం. నై. ద్వితీ. ఆశ్వా. 43 పద్యం)**

దమయంతికి క్రీడాశైలము ఒకటి ఉంది. అక్కడ దర్భలు మహావేగంగా పెరిగి, పెరిగి వాటి తలలు తగిలి బ్రహ్మాండానికి, వాటి గర్వం అనిగినట్లే కిందికి వంగి కామధేనువుకు ఆహారం అయ్యాయి అని కవి వర్ణన. ఇందులో ధాత్రీ, హరిద్రత్న, భగ్న, తావాప్తలజ్జావనమ్రత్వం, గోగ్రాసం, ప్రదానవ్రత సుకృతం పదాల్లో రేఫాది సంయుక్త వర్ణ ప్రయోగం వలన దర్భ ఎదుగుదల, గర్వం, అతి వేగం, దృశ్యమానం అయ్యాయి. ఇది వక్రత మూడవ భేదానికి ఉదాహరణ.

ఉ॥ దండుభి వాద్య నిస్వనముతోఁ దులఁదూఁగెడు పక్షనాదమం
దంద యతర్కి తోపనతమై వినఁబడ్డ, విహారలీలం
జెంది పరాకునన్ మెలఁగు చిత్తము లుద్దవిడిం గలంగఁగా,
నిందునిభాస్యలప్పుడు సమీక్షణ చేసిరి రాజహంసమున్

(శృం. నై. ద్వితీ. ఆశ్వా. 45 పద్యం)

ఆకస్మాత్తుగా హంస వచ్చి తన రెక్కల శబ్దం చేయగా ఆటలాడుతున్న దమయంతీ చెలులు తమ చెవి వద్ద భేరి మోగించినట్లే భావించారని, కలవరపడి తిరిగి చూశారని కవి మనోహర వర్ణన. నిజానికి హంస సున్నిత శరీరానికి భేరి శబ్దం అనేది రాదు కానీ అంతటి ఉధృతంగా రెక్కలను ఆడించిందని భావం. ఇక్కడ దుందుభి వాద్య నిస్వనం, పక్షనాదం, నిభాస్యలు, సమీక్షణ, అతర్కిత పదాల్లోని సంయుక్తాక్షరాలు హంస రాకను రెక్కల శబ్దాన్ని తెలియజేశాయి. సంయుక్త పదగత వక్రతగా భావించవచ్చు.

మ॥ రణకండూభర దుస్సహం బయిన యా రాజన్య దేవేంద్ర ద
క్షిణ బాహాగ్రమునన్ జనించిన మహాకీర్తి ప్రవాహంబు గా
రణ సంక్రాంత గుణానుషంగమునసో ప్రస్ఫీత దిజ్మత్త వా
రణ గండస్థల కుంభ కూలములతో రాయుం దివారాత్రముల్

(శృం. నై. ద్వితీ. ఆశ్వా. 52 పద్యం)

ఆ నలమహారాజు కుడి భుజం యుద్ధం చేయాలనే దురదచేత వచ్చిన కీర్తిని పొంది ఆ దురద తీర్చుకోవడానికి రాత్రి పగలు దిక్కులనెడు ఏనుగు కుంభస్థలాలను రాచుకుంటున్నదని కవి వర్ణించాడు. నలుని కీర్తి దశదిశలా వ్యాపించదనే విషయాన్ని వెల్లడి చేస్తున్నాడు. ఇక్కడ దుస్సహం, రాజన్యదేవేంద్ర, దక్షిణ, బాహాగ్రం, మహాకీర్తి, ప్రవాహం, సంక్రాంత, ప్రస్ఫీత, గండస్థల దివారాత్రము అనే పదాలలో సంయుక్త వర్ణాల ప్రయోగం వలన రాజు ప్రతాపాన్ని, యుద్ధ ఔన్నత్యాన్ని పొగిడినట్లైంది. అందుకు సంయుక్త పదాలు సహకరించినట్లైంది. ఇది వక్రత. మూడవ భేదం.

శా॥ కాల్యాచారము లాచరించి కడఁకం గౌరవ్యశార్దూలుఁడౌ
జ్జ్వల్య స్ఫూర్జిత వస్త్ర భూషణ విశేష స్ఫూర్తియై విస్ఫుర
న్మాల్యా లేపనుఁడై విచిత్ర బలశుంభద్భవ్యదివ్యాస్త్ర సా

**ఫల్యప్రౌఢ తపోనిరూఢవిభవ భ్రాజిష్ణుఁడై యున్నతిన్**

(హర. సప్త. ఆశ్వా. 141 పద్యం)

ఇంద్రసభకు వచ్చేటప్పుడు అర్జునుని ప్రకాశించే ఆభరణాలు, వస్త్రాలు, పూలదండలను, అతని దివ్యాస్త్రాలను వర్ణిస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం. కౌరవ్యశార్దూలుడు, జౌజ్జ్వల్య స్ఫూర్జిత, వస్త్ర, విస్ఫురన్మాల్యా, బలశుంభద్భవ్య దివ్యాస్త్ర సాఫల్య ప్రౌఢ ఇలాంటి సంయుక్త పదప్రయోగం శబ్ద సౌందర్యాన్ని ఇవ్వటమే కాకుండా అర్జునుని పరాక్రమాన్ని తెలియజేసాయి. ద్విత్వయుక్త సంయుక్త పదాలతో కూడిన దీర్ఘ సమాస భూయిష్ఠ రచన ఏదైతే కలదో అది కాఠిన్యం (ప్రౌఢత)గా చెప్పుకున్నాం. ఇక్కడ 'బలశుంభద్భవ్య దివ్యాస్త్ర సాఫల్య ప్రౌఢ' అనే దీర్ఘ సమాసబంధురమైన ఈ పద్యం కాఠిన్యానికి ఉదాహరణగా చెప్పవచ్చు. సంయుక్త వర్ణ వక్రతలో కూడా కాఠిన్యం, ఉభయ వాక్ప్రౌఢి, ఉద్దండత అంతర్భవిస్తాయని గమనించాలి.

**శా॥ జంభారి ప్రభవ ప్రయుక్త నిబిడ జ్యారావగంభీర సం**
**రంభ భ్రామిత గాండివ ప్రసర దస్త్రవ్రాత దీవ్యత్పరా**
**సంభిన్నాంగములై సురారి తనువు ల్సంగ్రామ రంగంబునం**
**గుంభద్రోణములట్ల బిట్టుగురిసెం ఘోరంబుగా రక్తముల్**

(హర. సప్త. ఆశ్వా. 166 పద్యం)

ఇది అర్జునిని బాణాలు పెద్ద ధ్వనితో రాక్షసుల శరీరాలను చీల్చాయని తెలుపుతూ రక్తం కుండపోతగా కారిందని యుద్ధ భూమిని వర్ణించే సందర్భం. ఇక్కడ "ప్రభవ నిబిడ జ్యారావ గంభీర సంరంభ భ్రామిత గాండివ ప్రసర దస్త్ర వ్రాత" అనే దీర్ఘ సమాసం కాఠిన్యానికి ఉదాహరణ. ఈ పద్యంలోని ప్రభవ, భ్రామిత, ప్రసర, దస్త్రవాత, దీవ్యత్పరా, కుంభద్రోణము, సంగ్రామం మొదలైన పదాలు సంయుక్తాలు. యుద్ధ భూమిలోని భీకర దృశ్యాలను కంటికి కనిపింపచేస్తాయా అన్నట్లు ఈ వర్ణాలను ప్రయోగించాడు కవి. అర్జునిని శరపరంపరను వివరిస్తూ దీర్ఘ సమాసాన్ని, ఉధృత వాతావరణాన్ని నెలకొల్పటం వేములవాడ భీమన ఉద్దండతకు ప్రతీకగా చెప్పవచ్చు. వర్ణ విన్యాస వక్రతకు చక్కని ఉదాహరణ ఈ పద్యం.

**తే॥ గర్భ సంస్థితుడగు గ్రహాగ్రణి విశుద్ధ**
**సిత యశస్ఫూర్తి వెలిఁ బ్రకాశించినట్లు**

**తారమై దీఁగ వికచ లోధ్ర ప్రసూన**
**పాండురచ్ఛాయ నొయ్యొయ్యఁ బలుకఁ బాఱె**

**(కాశీ. చతు. ఆశ్వా. 206 పద్యం)**

గర్భం ధరించిన తార శరీరం లొద్దుగపూల కాంతిలాగ క్రమక్రమంగా తెల్లబడింది. గర్భంలోపల ఉన్న గ్రహగ్రామణి యొక్క స్వచ్ఛమైన కీర్తి బయటికి వస్తున్నదా అన్నట్లు శరీరం తెల్లబడ్డదని కవి వర్ణిస్తున్నాడు. ఇందులో గర్భ, సంస్థితుడగు, గ్రహాగ్రణి, యశస్స్ఫూర్తి ప్రకాశించినట్లు, ప్రసూన పదాలలో సంయుక్తాక్షర పదాలు వాడటం వలన పద్య సౌందర్యం చేకూరింది.

**శా॥ నక్షత్రగ్రహ తారకంబులు నరణ్యంబుల్ నదుల్ వార్ధివి**
**శ్వక్షోణీధ్రములన్ దిశావసుమతీ చక్రంబు కాలంబుచేఁ**
**బ్రక్షీణత్వముఁ బొందియున్నయెడ విశ్రాంతిన్ సుఖంబుండఁగా**
**శ్రీక్షేత్రంబిది యంబుజాక్షి! మనకున్ సిద్ధించె నెక్కాలమున్**

**(కాశీ. పంచ. ఆశ్వా. 11 పద్యం)**

అశ్విన్యాది నక్షత్రాలు, సూర్యాది గ్రహాలు, నదులు, సముద్రాలు, భూమి అన్ని కొంచెం కూడా నశించిపోయే సందర్భంలో విశ్రాంతంగా సుఖంగా ఉండే స్థలం కాశీక్షేత్ర మహిమను పొగిడే సందర్భంలోనిది ఈ పద్యం. నక్షత్రగ్రహ, అరణ్యం, వార్ధివిశ్వక్షోణీధ్రముల్, చక్రంబు, ప్రక్షీణత్వం అనే సంయుక్తాక్షర పదప్రయోగం పరుష వర్ణాలతో ఓజోగుణంతో కూడినవి. వీటి ప్రయోగం వలన ప్రపంచ నాశన విషయాన్ని ప్రళయాన్ని సరిగ్గా చెప్పినట్లయింది. ఇది కూడా వర్ణ విన్యాస వక్రత.

**శా॥ అర్ణోరాశిపరీత భూభవన మధ్యస్వర్ణఖండంబు సం**
**పూర్ణైశ్వర్య సమృద్ధిఁగాశిఁ గృతపాపుండైనఁదత్పట్టణా**
**భ్యర్ణ క్షోణుల నైదుక్రోశములఁ బ్రాణాంతంబునన్ మర్త్యుఁడా**
**కర్ణింపండు కృతాంతవాహ మహిషగ్రైవేయఘంటాధ్వనుల్**

**(కాశీ. పంచ. ఆశ్వా. 27 పద్యం)**

కాశీ పట్టణ విశిష్టతను తెలుపుతూ సమస్తమైన భూమి మధ్యలో స్వర్ణ ఖండమని పిలువబడే, ఐశ్వర్య సమృద్ధిగల ఆ కాశీ పట్టణ ప్రాంత భూముల్లో ఐదు కోసుల వరకు యముని మహిష కంఠఘంటలు మ్రోగవని తెలిపాడు. అంటే కాశీ పట్టణ ప్రాంత నివాస జనులకు యమలోకం

ప్రాప్తించదని వర్ణించాడు. ఇక్కడ అర్ణోరాశి, స్వర్ణఖండం, సంపూర్ణైశ్వర్యం, కృతపాపుడు, అభ్యర్ణక్షోణులు, ప్రాణాంతమునన్, మహిషగ్రైవేయ లాంటి రేఫాది సంయుక్త పదాలను వాడటం చేత కాశీ ఔన్నత్యాన్ని పొగడటంతోపాటు, యమలోక భయానక మహిష ఘంట ధ్వనులను సూచించినట్లయ్యింది. సముచిత వర్ణ ప్రయోగం భావానికి తగింది. ఇది కూడా రేఫాది సంయుక్త వర్ణగత వక్రతగా చెప్పవచ్చు.

**క॥ సప్తాశ్వ సంప్రతిష్ఠుని**
**సప్తమునీశ్వర ప్రధాన సంస్థితునంత**
**ర్గుప్త స్వరూపుఁ ద్రిభువన**
**గోప్త భీమేశ్వరేశుఁ గొలుపుము తరుణీ!**

**(భీమే. షష్ఠా. ఆశ్వా. 29 పద్యం)**

సూర్యుని చేత ప్రతిష్ఠింపబడినవాడు, సప్తర్షులచేత స్థిరంగా ఉంచబడినవాడు. మూడు లోకాలకు రక్షకుడైన భీమేశ్వరున్ని సేవించాలని పార్వతితో శివుని గొప్పతనాన్ని చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం. ఇందులో 'సప్తాశ్వ', సంప్రతిష్ఠుని, మునీశ్వర, సంస్థితు, స్వరూప, త్రిభువన, గుప్త, గోప్త పదాలలో సంయుక్త వర్ణాలు ఉన్నాయి. రేఫాది సంయుక్త వర్ణాలు ఉంటే కూడా వర్ణ విన్యాసంగా ఇదివరకే చెప్పుకున్నాం. ఈ సంయుక్త వర్ణాల ప్రయోగం వలన శివున్ని విశిష్టత తెలియజేయబడ్డది. పద ఉచ్చారణలో నాద సౌందర్యం ఏర్పడ్డది.

**మ॥ కొనియెం 'గంచుకముల్' సముద్భట నటద్ఘోటీభప్రౌఢిఁ; గై**
**కొనియె న్వేడుకఁ 'జీడికాడ' యహిత క్షోణీశులల్లాడఁ; జే**
**కొనియెన్ 'మాకవరంబు' వీఁక మదవద్ఘోరారి సంహారియై**
**ఘనుఁడల్లాడ మహీశు వేమన నిరాఘాటైక ధాటీగతిన్**

**(కాశీ. ప్రథ. ఆశ్వా. 33 పద్యం)**

శౌర్య పరాక్రమంగల అలవేమారెడ్డి ఆక్రమించుకున్న చీడికాడ, కంచుక, మాకవర దుర్గాలను తెలియజేసిన పద్యం ఇది. ఇందులో సముద్భట, నటద్ఘోటీ, ప్రౌఢి, క్షోణీ, మదవద్ఘోరారి, పదాల్లో సంయుక్త వర్ణాల ప్రయోగం వలన రాజు పరాక్రమం, యుద్ధ వీరత్వం తెలియజేసినట్లు అయ్యింది.

**మ॥ నలినప్రోద్భవసూతి కన్గొనియె వింధ్య క్షోణిభృత్కందరా**

బలవద్గండ శిలాభిఘాత విలుఠత్పాథస్తరంగచ్ఛటా
స్థల సంరంభం విజృంభమాణపటు ఝుంకారస్ఫుటాంతర్మదన్
గలనాతత్పర భక్తలోక పరిక్షాశర్మదన్ నర్మదన్

(కాశీ. ప్రథ. ఆశ్వా. 94 పద్యం)

ఇక్కడ వింధ్య పర్వత ప్రాంతంలో గుహలు, పెద్దగండ శిలలు ఉండగా వాటికి నర్మదా ప్రవాహం తగిలి పొరలి పడుతున్నాయి అని ఆ గండశిలలు పడటంతో నదిలో అలజడులతో ఝుంకార ధ్వని కలిగిందని వర్ణించబడింది. నదీ ప్రవాహా ఉధృతిని ఈ రేఫాది సంయుక్త వర్ణాలే తెలుపుతున్నాయా? అనిపించేలా కవి శబ్ద ప్రయోగం చేసాడు. ఘోద్భవ, క్షోణిభృత్కందర, బలవద్గండ, విజృంభ, ఝుంకారస్ఫుటాంతర, పరీక్షాశర్మదన్, నర్మదన్ అనే పదాలు నదీ తరంగ గతమైన విజృంభణను తెలుపుతూ ఆ భావానికి ప్రాణం పోసేలా ఉన్నాయి. ఇది సంయుక్త పదగత వక్రత అలాగే వేములవాడ భీమన కవి ఉద్దండతకు కూడా తార్కాణంగా చెప్పవచ్చు.

కుంతకుడు వర్ణ విన్యాస వక్రతను వివరిస్తూ చివరగా ఈ విషయాన్ని ఉపసంహరించే ముందు ఈ కారిక తెల్పాడు.

కా॥ వర్మచ్ఛాయానుసారేణ గుణమార్గానువర్తినీ,
వృత్తివైచిత్ర్యయుక్తేతి సైవ ప్రోక్తా చిరంతనైః

(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.5)

ఈ వర్ణ విన్యాస వక్రత అనేది వ్యంజనాలను అనుసరించి ఉండేదే అయినప్పటికీ ఇందులో గుణాలు, రీతులు కూడా ఉంటాయని తెలిపాడు. “అనగా వర్ణ విన్యాస వక్రతయను దానికొక స్వతంత్ర స్థితి లేదు. ఇది గుణములకును, తద్ద్వారా మార్గములకును, అంగముగనుండును. ఈ వర్ణ విన్యాస వక్రతను బట్టియే గుణము లేర్పడును. తద్ద్వారా మార్గము లేర్పడును అని అభిప్రాయము” (శ్రీ రామచంద్రుడు, పుల్లెల. వక్రోక్తి జీవితం. 2007. పుట.174). వర్ణాలు తీసివేస్తే పదాలుఉండనట్లు, వర్ణ విన్యాస వక్రతను తీసివేస్తే గుణాలు కూడా ఉండవని తెలుపుతూ పదాలనుండి విడదీసి వర్ణాలను గూర్చి చెప్పినట్లే, గుణమార్గాల నుండి కూడా వర్ణ విన్యాస వక్రతను విడదీసి చెప్పవచ్చని పుల్లెల శ్రీరామచంద్రుడు ప్రస్తావించారు.

దీనిని బట్టి కుంతకుని వర్ణవిన్యాస వక్రతలో గుణ, రీతులు మిళితమై ఉన్నాయని చెప్పవచ్చు. అందుకే శ్రీనాథుని పద్యాల్లో వర్ణవిన్యాస వక్రతకు ఉదాహరించిన పద్యాల్లో వర్ణవిన్యాసాన్ని తెలుపుతూ కొన్ని సందర్భాల్లో గౌడీరీతిని, ఓజోగుణాన్ని ప్రస్తావించడమైంది. నన్నయ మీద పరిశోధన చేసినవారు అతనిది మాధురీ గుణం అని చెప్పినవాళ్ళున్నారు. నన్నయ "వళిప్రాసాధికారం"లో 'పదావృత్తివర్ణావృత్తులు' అని ఒక పద్యం ఉంది. చూద్దాం.

క॥ **నుడిగిన పదమే మఱియున్**
**నుడుగం బదావృత్తియనఁగ నునుపైయుండున్**
**బడి బడి నొక్కక్షరమే**
**యిడ వర్ణావృత్తి యనఁగ నింపైయుండున్**

**(కవిచింతామణి.పుట.75)**

ఇలా ఇతరులు వర్ణవిన్యాస వక్రతలాంటిదాన్ని వివరించారు. లక్షణాలు ఒకే రీతిగా ఉన్నా కొంత రేఖామాత్రమైన తేడాలు ఆలంకారికుల సిద్ధాంతాల్లో కన్పిస్తున్నాయి అని చెప్పడానికి బలమైన ఉదాహరణ ఏమిటంటే వర్ణవిన్యాస వక్రతలో గుణాలు, రీతులు భాగమవుతాయి అని కుంతకుడు చెప్పటమే. ఇలా వివరిస్తూ యమకంలోని రకాలను కూడా కవిచింతామణిలో వివరించారు. ఆదియమకం, మధ్యయమకం, అంత్యయమకం, పాదయమకం, అర్ధయమకం, మహాయమకం, సందృష్టయమకం, ముక్తపదగ్రస్తయమకం, చక్రవాళయమకం ఇవన్నీ శ్రీనాథుని పద్యాల్లో కుంతకుని వర్ణవిన్యాసంలో భాగంగా ముందు చూపెట్టినవే. అందులోనూ కుంతకుడు కూడా యమక అలంకార ప్రస్తావన ఉపసంహారంలో చేసాడు. దానిని కూడా గమనించాలి. ఇలా వర్ణవిన్యాస వక్రతలో ఎన్ని విధాలున్నాయో తెల్సుకోవాల్సి ఉంది. సంస్కృత ఆలంకారికులైన భరతుడు, భామహుడు, వామనుడు, దండి మొదలైన వాళ్ళు కూడా శబ్దాలంకార చర్చలో వృత్యానుప్రాస, ఛేకాను, లాటాను, యమక అలంకారాలను చెప్పారు. కుంతకుడు ఆ పదం వాడకుండా వర్ణవిన్యాసంలో ఏక, ద్వి, బహువర్ణ పునరావృత్తులుగా తెలిపాడు.

కుంతకుడు చెప్పిన వర్ణవిన్యాస వక్రతలో రెండక్షరాలు, మూడక్షరాలు రావటం అనేది 'వెల్లంకి తాతంభట్టు ప్రణీతమైన' కవిచింతామణిలో ద్వంద్వప్రాసము, త్రిప్రాసము లాగా అనిపిస్తుంది.

క్రింది పద్యం చూద్దాం. ద్వంద్వప్రాస పద్యం ఇలా ఉంది.

క॥ ప్రాసము రెండక్షరములు
గా సముచితవృత్తి చెప్పఁగానగుద్వంద్వ
ప్రాసము సముదంచిత దర
హాసము ఖాంభోజ! యఘనిరాస! ముకుందా!

(కవిచింతామణి.పుట.73)

త్రిప్రాసము:

క॥ కరమలరంగా మూఁడ
క్షరములు ప్రాసములు సేయఁగాఁద్రిప్రాసం,
బుర మలిన దూరకీర్తన
పరిమళమలరించుఁ గృతులఁ బ్రౌఢిమ మెఱయన్

(కవిచింతామణి.పుట.73)

కుంతకుని వర్ణవిన్యాస వక్రత కూడా ఇలాంటిదే. ఇతర అలంకారికులు ప్రాసగా చెప్పినదాన్ని కూడా కుంతకుడు వర్ణవిన్యాస వక్రతగా భావించాడు. పూర్తిగా ప్రాసాక్షర పదాలతో ఉన్నదే వర్ణవిన్యాసం అని అర్థం కాదు ఇక్కడ. వర్ణాల వలన సౌందర్యహేతువైనది నాదసౌష్ఠవాన్నిచ్చేది వర్ణవిన్యాస వక్రతగా భావించాల్సి ఉంటుంది. ఈ వర్ణ విన్యాస సంబంధమైనదాన్ని వెల్లంకి తాతంభట్టు పదావృత్తి వర్ణావృత్తులుగా వివరించటం కవిచింతామణిలో కనిపిస్తుంది. ప్రసాద మాధురీ గుణాలున్నప్పుడు, ఆ గుణాలు వర్ణవిన్యాస వక్రతలో కూడా ఉన్నప్పుడు శ్రీనాథుడు నన్నయ మార్గాన్ని అనుసరించానని స్పష్టంగా తెలియజేసినప్పుడు కుంతకుని వక్రోక్తి మార్గంలో నన్నయ కవితారీతులు కూడా అంతర్భవించాయి కనుక శ్రీనాథుడు వక్రోక్తి మార్గం అనుసరించాడని చెప్పటం సరైందేనని భావిస్తున్నాను.

శ్రీనాథుని పద్యాల్లో ఎక్కువ సార్లు 'యమకాలంకారం' కనిపిస్తుంది. వచ్చిన పదమే అనేక సార్లు రావటం అర్థభేదంతో దర్శనమిస్తుంది. ఈ యమకాలంకారాన్ని ప్రస్తుతం ద్వితీయ వక్రత భేదమైన ద్వివర్ణ పునరావృత్తిగా, తృతీయ వక్రతభేదమైన బహువర్ణ పునరావృత్తిగా గుర్తించాను. స్వయంగా కుంతకుడే వర్ణవిన్యాస వక్రతను ఉపసంహరించే సందర్భంలో యమకాలంకార ప్రసక్తిని తీసుకువచ్చి ఇలా తెలిపాడు.

కా॥ సమాన వర్ణమన్యార్థం ప్రసాది శ్రుతిపేశలమ్,
ఔచిత్య యుక్తమాద్యాది నియతస్థానశోభియత్

(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.6)

సమానమైన వర్ణాలు ఉండి, భిన్నార్థాలను కలిగి ఉండి, ప్రసాద గుణయుక్తంగా ఉంటూనే, చెవులకు ఇంపైనట్టిది, ఔచిత్యవంతమైనది యమకంగా నిర్వచించాడు కుంతకుడు. దీనిని ఎక్కువగా వివరించలేదు. ఎందుకంటే మిగతా భేదాల్లో ఇది అంతర్భవిస్తుంది కాబట్టి. శ్రీనాథుని పద్యాల్లో ఈ అలంకార సంబంధిత పద్యాలను గమనించవచ్చు. వీటన్నింటిని పరిశీలించిన మీదట శ్రీనాథుడు వర్ణవిన్యాస వక్రతను పాటించాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

### 3.8. వర్ణ విన్యాసం – ఉపసంహారం

కుంతకుని వక్రోక్తి భేదాల్లో మొదటి వక్రతాభేదం వర్ణవిన్యాస వక్రతను శ్రీనాథుని రచనల్లో చూపించడమైంది. ఈ ఉదాహరణలు పరిశీలించిన మీదట శ్రీనాథుడు చెప్పినట్లుగానే వేములవాడ భీమన ఉద్దండలీల, నన్నయ ఉభయ వాక్ప్రౌఢి రెండు కూడా ద్విత్వయుక్త సంయుక్త కఠిన సమాస భూయిష్ఠ రచనలుగా తోస్తున్నాయి. ఓజోగుణ సంబంధ రచనగా ఈ రెండు లక్షణాలను చెప్పవచ్చు. ముఖ్యంగా ఉద్దండలీలను కుంతకుడు చెప్పిన వర్ణ విన్యాస వక్రతల్లోని అంతర్భేదాల్లో ఈ రెండు లక్షణాలు ఉన్నాయని సహేతుకంగా నిరూపించడమైంది. కుంతకుని వర్ణ విన్యాసంలో ఉభయ వాక్ప్రౌఢి, ఉద్దండలీల ఉన్నాయని స్పష్టమయ్యింది. కనుక శ్రీనాథుడు కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని అనుసరించాడని చెప్పడానికి ఎలాంటి సంశయం లేదని పెద్దలు చెప్పినట్లే మళ్ళీ నేను కూడా చెప్పటానికి సందేహించటం లేదు. అక్షర సంబంధియైన చమత్కారం, నాద సౌష్ఠవం, శబ్దాలంకార ప్రయోగమే వర్ణ విన్యాస వక్రత ఆ పేరులోనే విన్యాస పదం ఉంది. కనుక అక్షరాల విన్యాసం వల్ల కలిగే సౌందర్యంగా భావించవచ్చు. శ్రీనాథుడు తాను చెప్పుకున్నట్లే ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢి తన రచనలో ఉన్నాయి. అవి రెండు కూడా వర్ణ విన్యాస వక్రతలో అంతర్భవించాయని తెలియజేస్తున్నాను.

★★★

## అధ్యాయం-4

## శ్రీనాథుని కవిత్వం-పదవక్రత

### 4.1. పదపూర్వార్ధ వక్రత

కుంతకుడు వర్ణవిన్యాస వక్రత తెలిపిన తర్వాత పదవక్రతలను, వాటి అంతర్భేదాలను తెలియజేశాడు. మొదటగా పదం అనే అర్థాన్ని వివరించాల్సి ఉంది. వ్యాకరణపరంగా పదం అంటే "సుప్తిఙన్తం పదమ్'. సుబన్తం తిఙన్తఞ్చ పదసంజ్ఞం స్యాత్ సుబన్తమునకును తిఙన్తమునకును పదమని పేరు. 'రామ' మొదలగు ప్రాతిపదికల యన్తమున చేర్చబడు విభక్తి ప్రత్యయములు 'సుప్' ప్రత్యయములు. కావున 'రామః' 'రామం' మొదలగునవి సుబన్తములు. 'భూ' మొదలగు ధాతువుల యన్తమున చేర్పబడు 'తి' మొదలగు ప్రత్యయములు 'తిఙ్' ప్రత్యయములు. కావున 'భవతి' మొదలగునవి తిఙన్తములు. ఇట్టి సుబన్త తిఙన్తములకు పదములని పేరు" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2010.పుట.13).

సుబంతముల పూర్వార్ధంలో ప్రాతిపదిక ఉంటుంది. తిజంతపదాల పూర్వార్థాల్లో ధాతువు ఉంటుంది. సుబంతాలు నామవాచకాలను తెలిపితే, తిజంతాలు క్రియలను తెలుపుతాయి. ఇలా పదాలు సుబంతాలు, తిజంతాలు అని రెండు రకాలుంటాయి. పదంలో ప్రకృతి–ప్రత్యయం అనే భాగాలుంటాయి. ప్రకృతి భాగాన్ని పదపూర్వార్ధమని, ప్రత్యయ భాగాన్ని పదపరార్ధం అని అంటారు. సుబంతానికి ప్రకృతి అయిన దాన్ని 'ప్రాతిపదిక' అంటారు. తిజంతానికి ప్రకృతి అయిన దాన్ని ధాతువు అంటారు. పదం పూర్వంలో అంటే ప్రకృతిలో (ప్రత్యయం కాకుండా కేవల పదాల్లో) జరిగే వక్రతను పదపూర్వార్ధ వక్రత అని అంటారు. అందులో కుంతకుడు మళ్ళీ అంతర్భేదాలను తెలిపాడు.

పదపూర్వార్ధ వక్రత పది రకాలు. అవి 1) రూఢి వైచిత్ర్య వక్రత, 2) పర్యాయ వక్రత, 3) ఉపచారవక్రత, 4) విశేషణ వక్రత, 5) సంవృతి వక్రత, 6) పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత, 7) వృత్తి వైచిత్ర్య వక్రత, 8) భావవైచిత్ర్య వక్రత, 9) లింగవైచిత్ర్య వక్రత, మరియు 10) క్రియావైచిత్ర్య వక్రత.

#### 4.1.1. రూఢి వైచిత్ర్య వక్రత

**కా॥ యత్ర రూఢేరసంభావ్యధర్మాధ్యారోపగర్భతా,**
**సర్ధర్మాతి శయారోపగర్భత్వం వాప్రతీయతే.**

**కా॥ లోకోత్తరతిరస్కార శ్లాఘ్యోత్కర్షాభిధిత్సయా,**
**వాచ్యస్య సోచ్యతే కాపిరూఢివైచిత్ర్య వక్రతా.**

**(వ.జీ.ఉన్మే.ద్వితీ.కా. 8, 9)**

"వాచ్యమగు అర్థమునకు, లోకోత్తరమగు తిరస్కారమును గాని, శ్లాఘ్యమగు ఉత్కర్షను గాని చెప్పవలెననెడు ఇచ్చచే, ఎచట రూఢ శబ్దము అసంభావ్యమగు ధర్మము యొక్క అధ్యారోపము గర్భమునందున్నట్లుగ గాని, వాస్తవమునను్న ధర్మముయొక్క అతిశయము యొక్క ఆరోపము గర్భమునందున్నట్లుగ గాని, ప్రతీతమగునో అది (అట్టి ప్రతీతి). ఒకానొక అపూర్వమగు రూఢివైచిత్రయ వక్రతయని చెప్పబడుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. వక్రోక్తి జీవితం. 2007. పుట.178).

"రూఢములైన పదముల వైచిత్రి వలన కలిగిన వక్రిత రూఢి వైచిత్ర్య వక్రత. శబ్దముయొక్క నియతవృత్తిత్వరూపమైన ధర్మము రూఢి వాచ్యార్థము యొక్క లోకోత్తరతిరస్కార వివక్షచేత గాని లోకోత్తర ఉత్కర్షావివక్ష చేత గాని రూఢియొక్క అసంభావ్యధర్మారోపము లేదా విద్యమాన ధర్మాతిశయారోపము ప్రతీయమానమైనచో అది 'రూఢివైచిత్ర్య వక్రత' యని చెప్పనగును".

"1) అవయవార్థమును (వ్యుత్పత్త్యర్థమును) మాత్రము బోధించు శబ్దము యౌగికము, ఉదా॥ పాతకుఁడు, పచతీతి పాచకః – వంటను జేయువాఁడు అనువ్యుత్పత్త్యర్థము మాత్రమే బోధింపబడును. సామాన్యముగా 'వంటలవాఁడు' అను నర్థమై కానీ ఫలాని జాతివాఁడని యర్థము రాదు.

2) అవయవార్థముతోఁ బనిలేక సముదాయార్థమునే బోధించు పదము రూఢము, ఉదా॥ ఆకాశము, బల్ల, పుస్తకము మొదలగు ఈ పదముల కవయవార్థము లేదు. అనంతకాలము నుండి బవి రూఢిగా నొకయర్థమును బోధించుచున్నది.

3) అవయవార్థమును బోధించుచున్నను విశేషించి సముదాయార్థమునే బోధించు పదము యోగరూఢము. ఉదా॥ పంకజము. ఇది "పంకము వలనఁ బుట్టునది" అను నవయవార్థము బోధించుచున్నను 'పద్మము' అనునర్థమునందే రూఢమైయున్నది. మిగిలిన 'నత్తగుల్ల' మొదలగు నర్థములను బోధింపదు. యౌగికార్థమును రూఢ్యర్థమును గలది యోగరూఢము.

4) యౌగికార్థమును, రూఢ్యర్థమును నీ రెండును నే శబ్దమువలన బోధింపఁబడునో యది యౌగికరూఢము. ఉదా॥ ఉద్భిత్ (ఉద్భిదయ) "ఉద్భేదించునది" అను నవయవార్థమును బట్టి, తరుగుల్మాది' యనియు, రూఢ్యర్థమును బట్టి యాగవిశేషమనియు నర్థద్వితయమును నీ శబ్దము

స్వతంత్రముగా బోధించును ("ఉద్భిదాయజేత పశుకామః అనుచోట 'ఉద్భిత్' అనఁగా యాగవిశేషము") (సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం. 2008. కావ్యాలంకార సంగ్రహం. పుట. 153).

ఇలా వాచక భేదాలున్నాయి. ఇందులో రెండవది రూఢి రూఢములైన పదాల వలన వైచిత్ర్యం కలిగితే రూఢివైచిత్ర్యం అలాగే వాచ్యార్థము వల్ల ఉత్కర్ష, అపకర్ష ఏదైనా కలిగినా కూడా అది రూఢి వైచిత్ర్య వక్రతగా కుంతకుడు తెలిపాడు. ఉత్కర్ష వివక్షాకృతమైన రూఢివైచిత్ర్యానికి ఉదాహరణగా

**"తదా జాయన్తే గుణాః యదా తే సహృదయైర్గృహ్యన్తే**

**రవికిరణాను గృహీతాని భవన్తి కమలాని కమలాని"**

"సహృదయులెప్పుడు గ్రహింతురో అప్పుడే అవి గుణములగును. సూర్య కిరణములచే అనుగృహీతములగు కమలములే కమలములగును. ఇచట రెండవ 'కమలాని' అను పదమునకు 'సౌందర్యాది విశేషయుక్తములగు కమలములు' అనునర్థమగుటచే ఈ పదము అసంభావ్య ధర్మాధ్యారోప గర్భము గాన, ఇది ఉత్కర్ష వివక్షాకృతమగు రూఢివైచిత్ర్య వక్రతకు ఉదాహరణము" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.వక్రోక్తి జీవితం.2007.పుట.180). ఇక్కడ మొదటి పదమైన కమలం కన్నా రెండవ పదమైన కమలానికే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఇది రూఢివైచిత్ర్య వక్రతకు (ఉత్కర్ష) ఉదాహరణగా చెప్పాడు. అపకర్షకు ఉదాహరణను ఇస్తూ "బాల రామాయణంలోని పంచమాంకములో జనక శతానందులు మాటలాడుకొను సందర్భమున శతానందుడు – ఈ రావణుడు రావణుడే కనుక కాకున్నచో ఈతనికంటె ఉత్తముడగు వరుడు వేరొక డుండజాలడని అనుమాటలివి. ఇచట రావణ శబ్దముచే సకల లోక ప్రసిద్ధమగు దుర్విలాసం గల దశానుని యందు వ్యక్తమైనదియు, సద్వంశము, వివేకము, సదాచారము, ప్రభావము, సంభోగ సుఖము, సమృద్ధియనెడు సమస్తమగు వరగుణ సామగ్రీ వైశిష్ట్యము మరుగుపడి పోవుటకు కారణ భూతమును, సకలలోక ప్రసిద్ధమగు దశానుని దౌష్ట్యము కంటె భిన్నమును, స్వీకరింపతగినవాడు కాడు అని చెప్పుటకు కారణభూతమును అగు ఒకానొక నీచత్వము ప్రతీతమగుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.183). ఇలా రూఢివైచిత్ర్య వక్రత రకరకాలుగా జరుగుతుంది. రూఢ్యర్థం గల పదాల ద్వారా సౌందర్యం చేకూరినప్పుడు అలాగే, ఉత్కర్షను, అపకర్షను, పొగడ్తను తెలియజేసే పదాల ద్వారా కూడా ఏర్పడుతుంది. ఇలా నాలుగు రకాలుగా రూఢివైచిత్ర్య వక్రత కలుగుతుందని తెలిపాడు. శ్రీరామచంద్రుడు ఆనందవర్ధనుడు పేర్కొన్న

అర్థాంతర సంక్రమితవాచ్య ధ్వని అత్యంత తిరస్కృత వాచ్యధ్వని కుంతకుని రూఢివైచిత్ర్య వక్రతలో అంతర్భవిస్తుందనే తెలిపాడు.

### 4.1.1.1. రూఢి వైచిత్ర్య వక్రత – సమన్వయం

**కం॥ కాళీనందన కంఠే**
**కాలుర శిరములకు విరులు కల్పించునొకో**
**లీలావనాంతరమునను**
**మాలోపాముద్రయిడిన మల్లీవల్లుల్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.89 పద్యం)**

అగస్త్యుడు తన భార్య లోపాముద్ర నాటిన మల్లెతీగలు కాళీనందనుడు అయిన వినాయకునికి, 'కంఠేకాలుడు' అయిన శివునికి పూలు అందిస్తున్నాయా అని వ్యాసున్ని అడుగుతాడు. ఇక్కడ కాళీనందనుడు అనగానే వెంటనే స్ఫురించే అర్థం గణేశుడని ఇది రూఢ్యర్థం. కాళీనందన అనే పదానికి వ్యాసుడనే అర్థం కూడా ఉంది. కాళి అనే నామాంతరం గల సత్యవతి కుమారుడైనందున వ్యాసుడు కూడా కావచ్చు. ఇక్కడ 'కాళి' అనే పదం అవయవార్థంలో వాడబడలేదు. రూఢ్యర్థంలో వాడబడింది కనుక రూఢి వైచిత్ర్యం. ఇది ఒక రకం.

**ఉ॥ ఏడు దినంబులన్నమునకెడ్డెము పుట్టిన యంత మాత్రంలో**
**నేడుచుచున్నవాఁడవు మునీశ్వర! నేఁడును నీదు ధీరతల్**
**పాడటి పోయెనే శివుని భార్యకుఁ గాశికిఁ బుణ్యరాశికిం**
**గాడునొనర్పఁజూచెదవు కంఠపుఁగ్రోధము పెచ్చులెచ్చఁగన్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.116 పద్యం)**

వ్యాసుడు ఏడు రోజులు అన్నం దొరకపోతే వగస్తున్నావు అని ప్రశ్నించడంలో ఇన్ని రోజులు తినలేదా? అనే అర్థం వస్తుంది. నీ మంచితనం నశించిందా? తిని కూడా కృతజ్ఞత లేక శపిస్తున్నావు విశ్వాసం లేనివాడా? అన్నట్లుగా ఏడు దినాలకే ఏడుస్తున్నావు అనే వాక్యంలో ఈ అర్థం వస్తుంది. వాచ్యార్థం కాకుండా వేరే అర్థాన్నిస్తుంది. అర్థాపకర్షగా చెప్పవచ్చు. ఇదొక రకం రూఢి వైచిత్ర్యం.

**గీ॥ ఈశ్వరుండద్రిజానాథుం డిందుమౌళి**
**కరుణ లేకున్న మనకెట్లు కలుగనేర్చు**

**జంద్రచందన చంద్రికా శైత్యమైన**
**పుత్ర పరిరంభ సౌఖ్యంబు పువ్వుబోణి?**

**(శివ.ద్వితీ.ఆశ్వా. 33 పద్యం)**

యజ్ఞదత్తుడు సుశీలతో మాట్లాడుతూ పార్వతీపతి, చంద్రమౌళి దయ లేకపోతే పుత్రుని సౌఖ్యం మనకు ఎలా కలుగ గలదు అని అంటాడు. కలుగజాలదు అనే అర్థాన్నిస్తుంది. 'మనకెట్లు కలుగనేర్చు' అనే వాక్యంలో కలుగదు అనే తిరస్కృత వాచ్యం ఏర్పడుతుంది. అలాగే 'కలుగజాలదు' అనటంలో శివుని అనుగ్రహం, దయ అనే ఉత్కర్ష ద్యోతకమవుతుంది. ఇదొక రకమైన రూఢిగా చెప్పాడు. కుంతకుడు చెప్పే వాచ్యానికి అంతరార్థం ఉండటం.

**తే॥ ఏ భయంబును నెచ్చోట నెనయలేదు**
**నరున కెప్పాట విద్యాధనంబ ధనము**
**చోరబాధాదికములచేఁ జూఱపోవు**
**ధనము ధనమౌనె యెన్ని చందములఁదలఁప**

**(కాశీ.చతు.ఆశ్వా.112 పద్యం)**

గుణనిధి బాధపడుతున్న సందర్భం ఇది. ఎక్కడ ఏ భయం లేకుండా ఉండే విద్యాధనమే ధనము అని అంటూ, దొంగలచేత దోచుకోబడే ధనం ధనమవుతుందని భావిస్తాడు. 'విద్యాధనంబు, ధనము', ధనము ధనమౌనె' పదాల్లో మొదటి పదంగా కలిగిన ధన శబ్దం కన్నా రెండవ పదం గల ధనానికి ఉత్కర్ష ఉంది. మొదటి దానికన్న రెండవది గొప్పది.

**తే॥ అనిన విని సోమయాజి కోపాగ్రహమునఁ**
**దత్తరించుచు వడి సోమిదమ్మఁ బలికె**
**నౌనె సత్పుత్ర జనయిత్రిఁ యౌనె సాధ్వి!**
**యౌనె సూనృత భాషిణి! యౌనెదేవి!**

**(కాశీ.చతు.ఆశ్వా.ప.106)**

యజ్ఞదత్తుడు, సోమిదమ్మతో ఆవేశంతో మాట్లాడుతూ జౌనె సత్పుత్ర జనయత్రి, సాధ్వి, సూనృత భాషిణి, దేవీ అంటాడు. తనని మోసం చేసినందులకు నువ్వు పతివ్రతవు, సత్యప్రియ వచనవు, దేవతవు ఎలా అవుతావు? అనడంలో చెడ్డదానివి, వంచకురాలివి, నువ్వొక దేవతవా? అని నిందించటం

కన్పిస్తుంది. ఇక్కడ వాచ్యార్థం లోకోత్తర తిరస్కార వివక్ష కలదు. ఇదొక రకమైన రూఢి. అందుకే ఈ వక్రతను ధ్వని భేదమైన అత్యంత తిరస్కృత వాచ్యధ్వనిలాంటిదని చెప్పబడింది.

### 4.1.2. పర్యాయవక్రత

రూఢి వైచిత్ర్య వక్రత తర్వాత పర్యాయ వక్రత భేదాన్ని ఇలా తెలిపాడు.

**కా॥ అభిధేయాన్తరతమస్తస్యాతిశయ పోషకః।**
**రమ్యచ్ఛాయాన్తరస్పర్శాత్తదలఙ్కర్తుమీశ్వరః॥**

**కా॥ స్వయం విశేషణేనాపి స్వచ్ఛాయోత్కర్షపేశలః।**
**అసమ్భావ్యార్థపాత్రత్వ గర్భం యశ్చాభిధీయతే॥**

**కా॥ అలఙ్కారోపసంస్కార మనోహారినిబన్ధనః।**
**పర్యాయస్తేన వైచిత్ర్యం పరా పర్యాయ వక్రతా॥**

(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 10, 11, 12)

సమానమైన అర్థాన్నిచ్చే పదాలను పర్యాయ పదాలంటారు. ఒక్కొక్క శబ్దానికి చాలా పర్యాపదాలుంటాయి. కవి తన రచనలో సౌందర్యాన్ని పోషించడానికి సందర్భానుసారమైన పర్యాయ పదాలను, కావ్య శోభాహేతుకమైన వాటిని కూర్చుతాడు దానినే కుంతకుడు పర్యాయ వక్రతగా చెప్తున్నాడు. కేవలం పర్యాయాలను వాడటం కాకుండా సందర్భానికి తగిన రీతిగా పర్యాయాలను వాడటంలోనే విశేషం ఉంది. కొన్ని సందర్భాల్లో అర్థ ద్వయం ఉన్నప్పుడు ప్రకృతానికి సరిపోయే పదాన్ని తీసుకోవాలి. సంయోగము మొదలైనవాటిని దృష్టిలో పెట్టుకోవాలి.

**"సంయోగో విప్రయోగశ్చ సాహచర్యం విరోధితా**
**అర్థః ప్రకరణం లిఙ్గం శబ్దస్యాన్యస్య సన్నిధిః**
**సామర్థ్యమౌచితీ దేశః కాలోవ్యక్తిః స్వరాదయః**
**శబ్దార్థస్యా నవచ్ఛేదే విశేషస్మృతిహేతవః"**

(వ.జీ.పుట.192)

శబ్దానికి అర్థమేమిటి అని సందేహం వచ్చినప్పుడు సంయోగాది సంబంధంచేత నిర్ణయించాలి.

**"ఏ శబ్దము బోధింపవలసియున్న అర్థమునకు దగ్గరగ నుండునో**
**దానియొక్క అతిశయమును పోషించునో, రమ్యమగు**

**శోభాన్తరము యొక్క సంబంధముండుటచే దానిని**

**(అభిధేయార్థమును) అలంకరింప సమర్థమగునో"**

"స్వయముగ (విశేషణరహితముగ) గాని, విశేషణ సహితిమై యుండిగాని, తన సౌందర్యాతిశయముచే మనోహరముగ నుండునో, అసంభావ్యమగు అర్థము గర్భమునందుండు విధమున ప్రయోగింపబడునో"

"అలంకారములచే కలిగిన సంస్కారముచే మనోహరమగు కూర్పు కలదో అట్టి శబ్దము, పర్యాయ శబ్దము. దానిచే నేర్పడిన వైచిత్ర్యము ఉత్కృష్టమగు పర్యాయ వక్రత్వము" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. వక్రోక్తి జీవితం. 2007.పుట.185, 186). ఈ కారికల అర్థాన్ని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానించాడు. రకరకాల కావ్యాలనుండి ఉదాహరణలు కుంతకుడిచ్చాడు. కిరాతార్జునీయంలో ఇంద్రుని గూర్చి చెప్పేటప్పుడు 'వజ్రిణః' అనే పదం సముచితంగా ఉందని తెలిపాడు. అలాగే అభిధేయం అయిన అర్థం యొక్క ఉత్కర్షను ఏది పోషిస్తుందో దానిని కూడా పర్యాయ వక్రతగా చెపూ చంద్రుని వర్ణించే సందర్భాన్ని ఉదాహరిస్తూ చంద్రునికి పర్యాయ పదాలుగా రఘువంశీయుల రాజబంధువు, మన్మథ వ్యాపార దీక్షకు గురువు, ఈశ్వర శిరోరత్నము అని పలు పర్యాయ పదాలు చంద్రుని గొప్పతనాన్ని పొగిడినవంటూ ఇదొక పర్యాయ వక్రత రకంగా తెలిపాడు. ఇలా పర్యాయ వక్రత పలువిధాలుగా జరుగుతుందని కుంతకుడు శ్లోకాలను ఉదాహరణలుగా ఇచ్చాడు.

### 4.1.2.1. పర్యాయ వక్రత – సమన్వయం

1) శా॥ **ఏలా యీ యధమాధికార పరాధీనత్వదుఃఖాద్యమున్**
**గైలాసంబున కేఁగియున్ శివుని శ్రీ కంఠున్ విరూపాక్షునిన్**
**త్రైలోక్యాధిపు సంస్తుతించెద మదధ్యక్షత్వ చిహ్నంబు ము**
**ద్రాలంకారము పాదపద్మ మణిపీఠాగ్రంబునం బెట్టెదన్**

**(శివరాత్రి మహాత్మ్యం.పంచ.ఆశ్వా.7 పద్యం)**

యముడు చిత్రగుప్తునితో మాట్లాడు శివుని వద్దకు వెళతానని చెపూ కైలాసంలో గరళకంఠుని, విరూపాక్షుడు, త్రిజగత్పతిని సేవిస్తానని అంటాడు. ఈ మూడు పదాలు పర్యాయ పదాలు శివున్ని సేవిస్తా అనకుండా తన అధికార ముద్రను జగత్పతి వద్ద ఉంచుతానని వాడటం వల్ల అందరికి

త్రిలోకాధిపతి అతనే వేరెవరు సాటిరారు నేనెంత? అనే భావనను కల్పిస్తుంది. సందర్భానుసారంగా 'త్రిజగత్పతి' అనే పదం వాడటం కవి కౌశలానికి నిదర్శనం.

2) సీ॥ **ఓ జగన్నాథ! యో యుదు రాజశేఖర**
**యోకృపాంభోరాశి! యోత్రినేత్ర**
**యో విష్ణు ధాత్రాది దేవతా కోటీర**
**పరిచిత శ్రీపాదపద్మయుగళ**
**యో జలంధరవైరి! యోగంధ కరికృత్తి**
**కంథాధురంధర స్కందపిత**
**యో నీలలోహిత! యో లలాటాంబక**
**జ్వలన జిహ్వాదగ్ధశరభచిహ్నా**

**(శివ.పంచ.ఆశ్వా.13 పద్యం)**

యముడు శివున్ని వేడే సందర్భంలో, జగత్పతీ, చంద్రమౌళి, దయా సముద్రా, ముక్కంటి దేవతల కిరీటాలకు తెలిసిన పాదపద్మ ద్వయం గలవాడా! అని చెప్పటంలో శరణు వేడుతున్నాడు కనుక సందర్భానుగుణంగా దయాసముద్రుడా అని అనటం, ముక్కంటి అంటే పూర్వం నొసటి కంటి మంటచే దహించి వేయబడినవాడనని యముడు తెలియబర్చటం పర్యాయ పదాల్లో కూడా సముచిత పదాలను వాడటం కవి ప్రతిభ.

3) తే॥ **దేవదేవ! మహాదేవ! దివిజవంద్య!**
**సర్వలోకైక రక్షణ చతుర! శర్వ**
**హాలహలకూట సంపర్క నీలకంఠ**
**మ్రొక్కెదము దేవికిని నీకు ముదముతోడ**

**(భీమే.చతు.ఆశ్వా.33 పద్యం)**

కాలకూట విషాన్ని మింగినపుడు శివున్ని దేవతలు ప్రార్థించారు. దేవుళ్ళే ప్రార్థించారు కనుక దేవదేవుడయ్యాడు. మహాదేవుడు దేవతలు నమస్కరించారు కనుక దివిజవంద్యుడు. సర్వలోక రక్షణార్థం, గరళాన్ని కంఠంలోనే చతురతో నిల్పినవాడు కనుక, సర్వలోకైక రక్షణ చతురుడు. హాలాహలం మింగినందున నీలకంఠుడు. ఇన్ని పర్యాయ పదాలు శివున్ని తెలుపుతున్నాయి. కాలకూట

విషాన్ని శివుడు మింగిన సందర్భంలో చెప్పిన ఈ పద్యం సందర్భానుసారంగా, కావ్యశోభహేతుకమయ్యాయి. ఈ పదాలనే వాడటం సముచితమైంది.

4) కం॥ **దగ్ధ స్మరాంగ! శంకర!**
**ముగ్ధేందు కళాకలాప మూర్ధాయన!,**
**స్నిగ్ధ విధాతృ కపాల**
**స్రగ్ధారి! ఘటింపు త్రిపుర సంహారంబున్**

**(భీమే.చతు.ఆశ్వా.115 పద్యం)**

త్రిపురాసురులను సంహారించాలంటూ దేవతలు శివున్ని కోరుతూ, బూడిద చేసి మన్మథుని దేహం కలవాడా, విధాతృకపాల స్రగ్ధారి అంటే బ్రహ్మదేవున్ని కపాల పుఱ్ఱెలనెడి మాలను ధరించినవాడా. శంకర అనగా శుభాలనిచ్చేవాడా అని స్తుతించారు. శివుని రౌద్రరూపం, అసుర సంహారం కోసం ప్రేరేపిస్తూ స్వామి రూపాన్ని గుర్తు చేయటం ఉచిత పర్యాయ పదాలను వాడటం సందర్భానికి వన్నెను తెచ్చాయి.

5) శా॥ **ఆనందంబున నర్ధరాత్రమునఁ జంద్రాలోకముల్ కాయఁగా**
**నానాసైకత వేదికా స్థలములన్ నల్దిక్కులన్ శంభుఁగా**
**శ్రీనాథున్ దరుణేందు శేఖరు శివున్ శ్రీకంఠునిన్ బాడుదు**
**న్మేనెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.91 పద్యం)**

అగస్త్యుడు కాశీని తలచుకొని తన్మయత్వం చెందే సందర్భంలో రాసిన ఈ పద్యం నిజంగా చందమామ వెన్నెలను తలపిస్తున్నదా? అన్నట్లే మనోహరమైన పర్యాయపదాలతో అల్లినది. ఆనందంగా అర్ధరాత్రి సమయంలో వెన్నెల కాస్తుండగా ఆ చంద్రశేఖరుని కొలుస్తుండేవాడిని అంటూ తరుణేందు శేఖరునిన్, శంభున్, శివున్, శ్రీకంఠునిన్ అంటూ కవి వర్ణించిన తీరు మనోజ్ఞమైంది. శిరస్సునందు చంద్రుడు, గంగానది ఇసుక తిన్నలపై వెన్నెలలు కాయటం దగ్గరి సంబంధాన్ని కలిగి ఉన్న పర్యాయాలను సందర్భానుసారంగా వాడాడు. సిగదండగా గల శివుడు చల్లని హాయిని గొల్పుతున్నాడనే కవి హృదయం ఇది.

6) క॥ వాణికిఁ జరణానత గీ

ర్వాణికి నేణాంక శకలరత్న శలాకా

వేణికిఁ బుస్తక వీణా

పాణికి సద్భక్తితో నుపాస్తి యొనర్తున్

(హర.ప్రథ.ఆశ్వా.4 పద్యం)

శ్రీనాథుడు సరస్వతిని స్తుతిస్తూ, గిర్వాణి, పుస్తక వీణాపాణికి అనే పర్యాయ పదాలను వాడాడు. తను రాసే గ్రంథానికి ఆటంకం కూడదని పుస్తక వీణాపాణికి అనే పదాన్ని ప్రయోగం చేసాడు.

### 4.1.3. ఉపచార వక్రత

ఉపచార వక్రతను వివరిస్తూ ఈ కారికలను తెలిపాడు.

కా॥ యత్ర దూరాన్తరేఽన్యస్మాత్సామాన్యముపచర్యతే।

లేశేనాపి భవత్కాంచిద్వక్తుముద్రిక్త వృత్తితామ్॥

కా॥ యన్మూలా సరసోల్లేఖారూపకాదిరలంకృతిః।

ఉపచార ప్రధానాసౌ వక్రతాకాచిదుచ్యతే॥

(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 13,14)

“ఉపచార శబ్దమునకు విశ్వనాథ కవిరాజీ విధముగ నర్థము చెప్పినాడు. ‘అత్యంత విశకలితయోః సాదృశ్యాతిశయమహిమ్నాభేద ప్రతీతి స్థగన ముపచారః’ అనగా అత్యంతము విభిన్నములైన పదార్థములకు సాదృశ్యాతిశయము కారణముగ భేద ప్రతీతిని కప్పిపుచ్చి అభేద ప్రతీతిని కల్పించుట ఉపచారము. అమూర్థ పదార్థములందు మూర్తపదార్థధర్మారోపము. ఘనపదార్థములందు ద్రవపదార్థ ధర్మారోపము, అచేతనములకు చేతన ధర్మారోపము ఉపచారమనిపించుకొనును. ఉపచారము వలన కల్పింపబడిన వైచిత్రీ విశేషమే ఉపచార వక్రత” (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977.పుట.370).

ఎక్కడైతే కవి చమత్కారాన్ని, సౌందర్యాన్ని చూపాలనుకుంటాడో అక్కడ ఉన్న వస్తువు స్వభావము ఇతర వస్తువుతో, భిన్నమై ఉన్నపుడు ఆ రెంటికి మధ్య సామ్యాన్ని చూపెట్టడం. ఒక వస్తువుకు గల ధర్మాన్ని వేరే వస్తువులో ఆరోపించడం. ఒక రకమైన ఉపచార వక్రత. దీనికి ఉదాహరణగా మేఘదూతంలోని శ్లోకాన్ని ఇచ్చాడు. “అచట సూదులచే గ్రుచ్చదగిన చీకట్లనే చూపులు

ఆనని రాజమార్గమున్నది” అనే అర్థం గల శ్లోకం ఇది. ఇక్కడ చీకటి అమూర్థ భావన, సూచి భేద్యములు అనే మూర్తభావనతో కలిపి చెప్పటం వృత్తి వైచిత్ర్యం ఉందని తెలిపాడు కుంతకుడు.

అలాగే రెండు వస్తువుల మధ్య సాదృశ్యం కలిగి ఉండి అభేదం చెప్పడం రూపకాది అలంకారాల్లో కన్పిస్తుంది. అలాంటి సందర్భంలో అన్యవస్తు ధర్మం కాకుండా అన్యవస్తు రూపాన్ని ఆరోపించడం కూడా వృత్తివైచిత్ర్యంగా చెప్పాడు కుంతకుడు.

ఉదా: **“సత్స్వేవ కాలశ్రవణోత్పలేషు**

**సేనావనాలీ విషపల్లవేషు,**

**గాంభీర్య పాతాళ ఫణీ శ్వరేషు**

**ఖడ్గేషు కోవా భవతాంమురారిః**

**(వ.జీ.పుట. 200)**

యముని కర్ణమునందలి నల్లకలువలును, సేనలనెడు వనపంక్తుల విష పల్లవములును, గాంభీర్యమనెడు పాతాళమునందలి సర్పరాజములును, అగు ఖడ్గములు ఉండగా మీకు ఈ విష్ణువు ఎంత?

**వ్యా:** “ఇచట కాలశ్రవణోత్పలాదులతో సాదృశ్యముచే కలిగిన అలె సామీప్యముచే నేర్పడినదియు, (అభేదోపచార) ఉపచార మూలకమును అగు ఉత్పలాదిరూపత్వము ఖడ్గములందు ఆరోపింపబడినది” (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.208).

ఇలా మూర్థ, అమూర్థ భావనలను ఒకదానినుండి ఇంకో దానిలో ఆరోపించడం. అది రూపకాది అలంకారాల్లో కూడా చూపటం ఉపచార వక్రతగా తెలిపాడు.

ఉదా: **గచ్ఛన్తీనాం రమణ వసతిం యోషితాం తత్రనక్తం**

**రుద్ధాలోకే నరపతి పథే సూచి భేద్యైస్తమోభిః!**

**(వ.జీ.పుట.205)**

అక్కడ సూదులచే గుచ్చదగిన చీకట్లనే చూపులు ఆనని రాజమార్గ రాత్రుల్లో ప్రియులు నివాసానికి వెళుతున్నారని భావం. సూచి మూర్థ భావన, చీకట్లు అమూర్థ భావనలో ఆలోపించబడింది కనుక ఉపచారానికి ఉదాహరణ.

### 4.1.3.1. ఉపచార వక్రత – సమన్వయం

శా॥ పంచారామ విలాసినీ ధవళదృక్పాఠీన జాలయమా
నాంచ త్కోమలనిర్నిబంధనమనోజ్ఞాకారరేఖా (కళా)
పంచా స్తుండగు నా కుమారుఁడురుదర్పస్ఫూర్తి నవ్వీటిలో
సంచారం బొనరించెం గాంచనమహా సౌధాగ్ర భాగంబులన్

(శివ.ద్వితీ.ఆశ్వా.85 పద్యం)

సుకుమారుని సౌందర్య వర్ణన ఇది. పంచారామంలోని స్త్రీల సౌందర్య చూపులనెడి కొర్ర చేపలకు, సుకుమారుని, మృదువైన, మనోహరమైన సౌందర్యానికి వల అవుతున్నదని భావం. స్త్రీల చూపులు అనేవి అమూర్థం కనిపించదు. తాకలేదు కాని సుకుమారుడు వల అవటం అనేది మూర్థ భావన. చూపులకి వలకి సంబంధాన్ని చెప్పటం సుకుమారుని సౌందర్యం అనే అమూర్థాన్ని వల అంటూ భౌతికంగా తాకే వస్తువుగా చెప్పటం పద్యంలోని రమణీయత. ఉపచార వైచిత్ర్యం.

ఉ॥ భాసురమధ్యరేఖకిరు పక్కియలందును మోవి కించి దు
చ్ఛ్వాసమునొంది యున్నయది చంద్ర నిభాస్యకు నేనొకప్డు ని
ద్రా సమయంబులం గలల రాకల నీకలకంఠిఁ గూడి వ
క్త్రా సవ మాని యాని దశనాంకుర మొత్తఁగదా రసోద్ధతిన్

(శృ.నై.తృతీ.ఆశ్వా.171 పద్యం)

దమయంతి అదర వర్ణన. ఆమె పెదాలు కొంత ఉచికి ఉన్నట్లు ఉండగా నలుడు స్వప్నంలో వచ్చి చేసిన దంతక్షతానికి కలిగిన క్రియగా చెప్పబడ్డది. మోవి ఉచ్ఛ్వాసాన్ని పొందటం అనేదానికి రదక్షతం హేతువే అయినా మానసంలో చేసిన దంతక్షతానికి భౌతికంగా కార్యం కలుగటం అనేది కవి సౌందర్యంగా చిత్రించిన పద్యం. కవి ఊహాజనితం. ఇక్కడ స్వప్నం అమూర్థం, ఉచ్ఛ్వాసం మూర్థ భావన కనుక ఉపచార వక్రత.

మ॥ జవమేపార మురారి పద్మజ భూజౌ చక్రీభవచ్ఛార్ఙ్గగాం
డివకోదండ వినిర్గత ప్రబల సందీప్తాస్త్ర సంఘాతముల్
భువన క్రోడము నిండి భాను కిరణంబుల్ దూఱనీ కుండుటం
బవలుం బర్వె మహాంధకారములు పైపై సూచినిర్భేద్యముల్

(శివ.ప్రథ.ఆశ్వా.90 పద్యం)

బ్రహ్మ విష్ణువులు ఒకరిపై ఒకరు బాణాలను ప్రయోగించుకున్నారు. వారి పరాక్రమంతో ప్రపంచం చీకటి కమ్మింది. పగలు కూడా అంధకారమయ్యిందని వర్ణిస్తూ "పవలుంబర్వె మహాంధకారములు పైపై సూచి నిర్భేద్యములు" అనే ప్రయోగం చేసాడు శ్రీనాథుడు. సూదితో కూడా భేదించలేనిదని చీకట్లను గూర్చి తెల్పాడు. చీకట్లు అమూర్థం, సూచిభేద్యం మూర్థభావన. కానీ అమూర్థాన్ని మూర్థపదంలో ఆరోపించాడు. శ్రీనాథుడు వక్రోక్తి మార్గాన్ని అనుసరించాడు అనటానికి ఈ పద్యం చక్కటి ఉదాహరణ ఎందుకంటే ఉపచార వక్రతను చెప్తూ కుంతకుడిచ్చిన ఉదాహరణలో మేఘదూతంలో "అచట సూదులచే గ్రుచ్చదగిన చీకట్లచే చూపులు ఆనని రాజమార్గమున్నది" అనే అర్థం గల శ్లోకాన్ని రాసాడు. ఈ శ్లోకాన్ని అనుసరించి శ్రీనాథుడు కూడా అదే రకంగా రాసాడని చెప్తూ వక్రోక్తి మార్గాన్ని అనుసరించాడని చెప్పవచ్చు.

**తే॥ గాలమనియెడు సిద్ధుండు గమిచి మ్రింగి**
**కుతుక మొప్పఁగ నుమిసిన ఘుటికయనఁగ**
**గగన మందిర దీపికా కళికయనఁగ**
**భానుఁడుదయించె దేదీప్యమానుఁడగుచు**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.49 పద్యం)**

సూర్యోదయాన్ని వర్ణిస్తూ ప్రాతఃకాల సంధ్య అనే స్త్రీ నుదుటి సింధూరం లాగా, శచీదేవి అలంకరించుకోవడానికి ధరించే అద్దంలాంటి తూర్పుకొండపై చిగుర్చిన అశోక వృక్షపు పొదరిల్లులాగా, ఇంద్రుని సౌధంపైన గల బంగారు కలశంలాగా ఉదయిస్తున్నాడని చెప్తూ, కాలం అనే సిద్ధుడు మ్రింగి ఉమిసిన మాత్రలాగా ఉందని తెల్పటం వైచిత్ర్యం. మింగి ఉమిసిన అనే పదాలు మూర్థమైనవి దానిని సూర్యోదయానికి చెప్పటం ఉపచార వక్రత.

**తే॥ దీనికంఠంబునందు వాగ్దేవియుండి**
**వీణ మొరయించుచున్నది వీను లలర**
**నదియ ముఖమున వాగ్భావ మాశ్రయించి**
**యమృతధారా ప్రవాహరూపముగ నిల్చె**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.178 పద్యం)**

దమయంతీ స్వర వర్ణన ఇది. సరస్వతీ వీణానాదం ఆమె మాటగా పరిణమించి నా వీనులు తనవియునట్లు చేస్తుంది. ఆ నాదం నా చెవులలో అమృతధారా ప్రవాహం అయ్యింది. ప్రవాహం మూర్థభావన స్వరం అమూర్థం కనుక ఉపచారం.

### 4.1.4. విశేషణ వక్రత

కుంతకుడు విశేషణ వక్రతను ఇలా వివరించాడు.

**కా॥ విశేషణస్య మహాత్మ్యాత్ క్రియాయాః కారకస్య వా।**

**యత్రోల్లసతి లావణ్యం సా విశేషణవక్రతా॥**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.15)**

విశేషణం చేత క్రియకు గానీ, కారకానికి గానీ సౌందర్యం చేకూరుతుందో అది విశేషణ వక్రత. ఉదాహరణగా సంస్కృత శ్లోకాన్నిచ్చి వివరించబడింది.

**"కరాన్తరాలీన కపోల భిత్తిర్బాష్పోచ్ఛలత్ కూణితపత్రలేఖా,**

**శ్రోత్రాన్తరే పిండిత చిత్తవృత్తిః శృణోతి గీతధ్వనిమత్రతన్వీ"**

**(వ.జీ.పుట.210)**

"అరచేతుల నడుమ అణిగిపోయిన చెక్కిళ్లు కలదై, భాష్పముచే పైకి ప్రసరించుచున్న, మునిగిపోయినట్లైన మకరాది పత్రరేఖలు కలదై, శ్రోత్రముల యందు ముద్దగ చేయబడిన మనస్సు కలదై, తన్వి ఇచట గీత ధ్వనిని వినుచున్నది. ఇచట గూడ విశేషణ మాహాత్మ్యముచే తన్వీస్వాభావిక సౌందర్యము స్పష్టీకరింపబడుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.211) అని భావం. క్రియకు ఎక్కువగా విశేషణాలు ఉంటే అది క్రియా విశేషణ వైచిత్ర్యంగా చెప్పాడు. కారకం యొక్క లావణ్యం కూడా ప్రకాశిస్తే అది కూడా విశేషణ వక్రతే. ఒక వాక్యంలో నామవాచకం మరియు క్రియ మధ్య ఉండే సంబంధాన్ని సాధారణంగా కారకం అంటారు. 'కరోతీతి కారకం – క్రియానిమిత్తం కారకం' అనే మాటలున్నాయి. కర్త, కర్మ, కరణం, సంప్రదానం, అపాదానం, అధికరణం అనేవి కారకాలుగా వ్యాకరణంలో చెప్పబడ్డాయి. ఇవన్నీ కూడా క్రియను అంటే చర్యను అర్థం చేసుకోవడానికి దోహదపడుతాయి. కారకం అనేదాన్ని క్రియతో అర్థం చేసుకోవాలి. ఇలా కారకాల్లో కూడా లావణ్య ప్రకాశిస్తే అది కూడా విశేషణ వక్రతగా చెప్పాడు కుంతకుడు.

4.1.4.1. విశేషణ వక్రత – సమన్వయం

సత్యహరిశ్చంద్రునకు
నిత్యా ప్రతిమాన దాన నిర్మల మతికిం
గృత్యా కృత్య వివేకికిఁ
బ్రత్యర్థి ద్విరద దళన పంచాస్యునకున్

(శివ.ప్రథ.ఆశ్వా.45 పద్యం)

కృతి భర్తను పొగుడుతూ కవి చెప్పిన పద్యం. సత్యవాక్యంలో హరిశ్చంద్రుడు, ఎల్లప్పుడు సాటిలేని నిర్మలమైన మనస్సు కలవాడు. కృత్యము అకృత్యము మంచి చెడ్డల జ్ఞానము కలవాడు. శత్రువులనే గజాలకు సింహం లాంటివాడికి అంకితం అని చెప్పాడు. కర్తకు వేసిన విశేషణాలు.

గీ॥ పల్లవాధర మడుగైన యొల్లెగట్టెఁ
గొంగుమణి హేమ కంఠికా కోటిఁజెరివి
సొబగుంగాటుక బొట్టుతోఁజూడ నొప్పె
వింత చెలువునఁ బచ్చి బాలెంతరాలు

(శివ.ద్వితీ.ఆశ్వా.77 పద్యం)

చిగురులాంటి వాతెరగల సుశీల కొంగు మణిహేమమయమైన కంటె యంచున గ్రుచ్చి పరిశుద్ధ వస్త్రాన్ని ధరించింది. సుందరమైన కాటుక బొట్టును పెట్టుకొని కొత్త అందంతో చూడముచ్చటగా ఉంది. ఆ పచ్చి బాలెంతరాలు అని కవి వర్ణించిన తీరు మనోహరంగా విశేషణాలు పద్యానికి సౌందర్యాన్నిచ్చాయి.

కం॥ మొగి విరిసి కళుకు గూడక
పగులక వెడలుపును నిడుపుఁ బసిమియుఁగల లేఁ
జిగురరఁటాకులు పెట్టిరి
దిగదిగనద్దేవి యాజ్ఞదివ్యపురంధ్రుల్

(భీమే.ద్వితీ.ఆశ్వా.128 పద్యం)

వ్యాసునికి అన్నపూర్ణాదేవి విస్తరి వేసి వడ్డించు సందర్భంలోనిదీపద్యం. బాగా వికసించిన, పెళుసుతనం లేక, చినుగక ఉన్న పెద్ద పెద్ద లేత అరటి ఆకులలో వడ్డించారనే విషయాన్ని చెప్తూ “మొగి

విరిసి కఱకు గూడక పగులక వెడలుపును” అని అంటూ సహజ విశేషణంతో పద్యాన్ని రక్తి కట్టించాడు శ్రీనాథుడు. ఈ విశేషణం ఆకు రూపాన్ని కళ్ళకు కట్టినట్లుగా తెలిపింది.

**తే॥ దాడిమీ పక్వ ఫల బీజ తతుల గెలిచి**
**దంత కురవింద పంక్తి యీతరుణి కమరు**
**నాస్యశీతాంశు మండల స్యందమాన**
**నవ సుధారస బిందు బృందంబు వోలె**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.174 పద్యం)**

దమయంతీ మోమును, పళ్ళ వరుసను వర్ణిస్తూ ‘దాడిమీ పక్వఫల బీజతతులు’ అంటే ఎర్రగా ప్రకాశిస్తున్న దానిమగింజలు లాగా ఉన్నవని, మోము చంద్రుని నుండి రాలిపడ్డ తొలి సుధారస బిందులలాగా దంతాలు మెరుస్తున్నాయని తెలిపాడు. ‘నవ’ పదం సంజను సూచించటం, సంజ సూచన ఎరుపుకు సంకేతం. దంతాలు తాంబూలంతో ఎర్రగా ఉంటాయి కదా ఈ విశేషణాలతో మనోహర వర్ణన చేసాడు శ్రీనాథుడు.

**తే॥ వర శిరీష ప్రసూన కేసర శిఖాగ్ర**
**పేలవంబుగ మేను గల్పించి ధాత,**
**కలిత సుకుమార సర్గ ప్రకర్షుఁడగుచు**
**నిలిపె మార్దవ మీయింతి పలుకులందు**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.176 పద్యం)**

దమయంతీ శరీర సౌకుమార్యాన్ని వర్ణిస్తూ ‘వరశిరీష ప్రసూన కేసర శిఖాగ్రం’ అని దిరిసెన పువ్వు యొక్క కొస కంటె కోమలం అని, ఆమె వాక్కు అంతకంటే మృదుత్వం కలదని వర్ణించాడు. దమయంతీ మృదుత్వానికి దిరిసెన పువ్వుతో సంబంధించిన విశేషణాన్ని వాడటం సౌందర్యాత్మకమైంది. ఆమె కోమలత్వాన్ని ఈ విశేషణం తెలుపుతున్నది. కర్తకు గల విశేషణం కర్తను గూర్చి తెలియజేస్తుంది కనుక ఇదొక వక్రతే అంటాడు కుంతకుడు.

**క॥ కవితాగాన ప్రియవా**
**గ్వివరణ సీమావిభాగ విధిరేఖలునా**
**ధవళాక్షి కంఠసీమం**

బ్రవిమల రేఖాత్రయంబు ప్రస్ఫుటమయ్యెన్

(శృ.నై.తృతీ.ఆశ్వా.186 పద్యం)

కవిత్వం, గానం, ప్రియమైన మాట అనే ఈ మూడింటి ప్రకాశానికి హద్దుగా కలిగి ఆమె కంఠసీమ బ్రహ్మ గీసిన గీతలా అన్నట్లు ఉన్నవని కవి వర్ణన. దమయంతీ కంఠ సౌందర్యాన్ని, పాండిత్యాన్ని తెలుపుతుంది. ఈ కవితాగాన ప్రియవాగ్వివరణ సీమా విభాగ విధి రేఖలు' అనే విశేషణం సౌందర్యానిచ్చింది.

**తే॥ వేదశాఖా విభాగ సంవేది యతఁడు**
**లలిత బిల్వత్రిశాఖా పలాశ సమితి**
**సంగమేశ ఘటోద్భవ శంకరులకు**
**నర్చనము సేయుఁబ్రణవ పంచాక్షరముల**

(భీమే.ద్వితీ.ఆశ్వా.71 పద్యం)

వ్యాసమహర్షి గొప్పదనాన్ని పొగుడుతూ "వేదశాఖా విభాగ సంవేది యతఁడు" అంటూ వేదాలను శాఖలుగా విభజించటంలో జ్ఞాని యని, సంగమేశ్వర, అగస్త్యేశ్వరుల త్రిబిల్వంతో ప్రణవ పంచాక్షరంతో పూజ చేస్తాడని చెప్పటం హృదయంగమముగా ఉంది.

**తే॥ మలయ దుర్దుర గిరిగుహా మందిరుండు**
**తామ్ర పర్ణీజలస్నాన ధౌత మలుఁడు**
**కలుషితాంభః ప్రసాదైక కతక ఫలము**
**కోమలియుఁదాను నేతెంచెఁగుంభ భవుఁడు**

(భీమే.ద్వితీ.ఆశ్వా.78 పద్యం)

కవి అగస్త్యున్ని వర్ణిస్తూ మలయ దర్దుర పర్వత గుహలలో నుండెడువాడు. తామ్రపర్ణీ నదిలో స్నానం చేసి పవిత్రమైనవాడు, 'కలుషిత నీటిని శుభ్రపరుచువాడు' అనే విశేషణాలను వాడాడు. అగస్త్య నక్షత్రం శరత్కాలంలో ఉదయించటం వలన అప్పుడే బురద నీరు స్వచ్ఛమవుతాయట అందుకు సంబంధిత విశేషాన్ని వాడాడు శ్రీనాథుడు.

**సీ॥ పర్యంత మందార పారిజాత కవనీ**
**రమమాణ నిర్ఝరీ సముదయంబు**

సరస రసాసిద్ధ వరవారి సంపూర్ణ
గంభీరతర పరఖా పయోధి
ప్రబల చింతారత్న పాషాణ సంఘాత
వప్రరేఖా చక్రవలయితంబు
కామధేను సహస్ర కఠిన రింఖాటంక
దళన దంతురిత రథ్యాముఖంబు
తే॥ భద్ర పాతాళ భైరవ పాలితంబు
గుహ వినాయక రక్షణా కుంఠితంబు
సప్తమాతృక పరివార సంకులంబు
వసుమతీ నూపురము దక్షవాటిపురము

(భీమే.ప్రథ.ఆశ్వా.88 పద్యం)

దక్షారామ సౌందర్య వర్ణన చేస్తూ దేవకాంతలు విహరించు భూమి, పారిజాత వనాలు కలిగినది, స్వచ్ఛమైన నీటితో నిండి సముద్రంలా కన్పించే అగడ్త కలది. చింతామణి రాళ్ళ సమూహంతో నిర్మించినవా అన్నట్లు కోట గోడలు కల నగరం. భైరవుడు, వినాయకుడు కాపాడుతుండగా సప్తమాతృకలతో, పరిజనులతో నిండిన నగరం భూదేవికి కాలయందెగా ప్రకాశిస్తున్నదని తెలిపాడు. ఇందులోని విశేషణాలు సరసరసాసిద్ధ వరవారి సంపూర్ణ, ప్రబల చింతారత్న పాషాణ సంఘాత మొదలగు పదాలు పద్యాన్ని మనోహరం చేసాయి.

మ॥ చతురంగ ధ్వజినీ సమేతులగుచున్ శస్త్రాస్త్ర విద్యానిధుల్
రతిరాజప్రతిమాన మూర్తులు శరద్రా కేందు బింబాననుల్
చతురంభోధిపరీతు విశ్వవసుధా చక్రంబునం గల్గురా
సుతులెల్లం జనుదెంచి రవ్విభవముం జూడంగ నొక్కుమ్మడిన్

(శృ.నై.చతు.ఆశ్వా.120 పద్యం)

దమయంతీ స్వయంవరాగతుల వర్ణన ఇది. ఆ రాజుల రాకను వర్ణిస్తూ శరదృతువులోని పూర్ణిమా చంద్రమండలం లాంటి ముఖం కలవారని, రతిరాజైన మన్మథునికి సాటియైన రూపం

కలవారని, రథ, గజ, తురగ, పాథాతి దళాలతో వచ్చే రాజులని వారి ఔన్నత్యాన్ని, సౌందర్యాన్ని ఈ విశేషణాలతో చెప్పాడు కవి. ఈ విశేషణాలు రాజుల గొప్పదనాన్ని తెలిపాయి.

**తే॥ పద్మరాగ విభూషణ ప్రతతిమాఱు**
**లలి నశోకలతా ప్రవాళములు దాల్చి**
**సింధువార ప్రసూన రాజీవరాజిఁ**
**గ్రమ మౌక్తిక రత్న శృంగార యగుచు**

**(హర.తృతీ.ఆశ్వా.68 పద్యం)**

పార్వతి సౌందర్యాన్ని వర్ణిస్తూ పద్మరాగాలతో ఉన్న ఆభరణాలకు బదులుగా లేత చిగురుటాకులను దాల్చిందని చెప్తూ, నీరు జారిపడుతున్న పద్మాల నీటిబొట్లు ముత్యాలలాగా కన్పిస్తున్నాయని చక్కని వర్ణన చేసాడు. "సింధువార ప్రసూన రాజీవరాజి గ్రమమౌక్తిక రత్న శృంగార" అంటూ పార్వతి అందం ఎలా భాసించిందో ఈ విశేషణం తెలిపింది.

**తే॥ పాశుపత దివ్యదీక్షా విభాసమాన**
**దివ్య తేజోవిశేష సందీప్తమూర్తి**
**కా లతాంగికి శతవృద్ధులైన మునులు**
**ప్రణతులగుదురు భావిప్రభావశక్తి**

**(హర.చతు.ఆశ్వా.13 పద్యం)**

పాశుపతదీక్ష తీసుకొని దివ్య తేజస్సుతో వెలుగుతున్న మూర్తి ఆ పార్వతిని చూసి భవిష్యత్తులోని మహత్వాన్ని ఊహించి శతాధిక వృద్ధులైన మునులు సైతం ప్రణమిల్లారు. 'దివ్య తేజో విశేష సందీప్త మూర్తి' అనే విశేషణం పార్వతి దివ్యత్వాన్ని తెలియజేసింది.

**తే॥ మందరాచల మంథాన మథ్యమాన**
**దుగ్ధ పాథోధిలో సముద్భూతమయ్యె**
**బాలశశిరేఖ యసురులు వేలుపులును**
**నిచ్చి రవ్వస్తు వర్థి భీమేశ్వరునకు**

**(భీమే.చతు.ఆశ్వా.92 పద్యం)**

మందర పర్వతమనెడి కవ్వంతో చిలుకబడుతున్న పాల సముద్రం నుండి పుట్టింది. ఆ చంద్ర కళను దేవతలు రాక్షసులు కలిసి భక్తితో స్వామికి సమర్పించారు. "దుగ్ధపాథోధిలో సముద్భూతమయ్యే" అనే విశేషణం సౌందర్యానిచ్చింది.

### 4.1.5. సంవృతి వక్రత

కుంతకుడు సంవృతి వక్రతను ఇలా వివరించాడు.

**కా॥ యత్ర సంవ్రియతే వస్తు వైచిత్రస్య వివక్షయా**
**సర్వనామాదిభిః కైశ్చిత్ సోక్తా సంవృతి వక్రతా**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.16)**

కవి సౌందర్యాన్ని ఉద్దీపింపజేయాలని ఎక్కడైతే సర్వనామాది పదాలతో వర్ణించదగిన వస్తువును కప్పిపుచ్చడం జరుగుతుందో అది సంవృతి వక్రత. సంవృతి అంటే కప్పి పుచ్చడం అని అర్థం. దీనికి ఉదాహరణగా కుమారసంభవంలోని అష్టమసర్గలోని శ్లోకం ఉదాహరణగా ఇచ్చాడు కుంతకుడు.

**"దర్పణేచ పరిభోగదర్శినీ పృష్ఠతః ప్రణయినో నిషేదుషః,**
**వీక్ష్య బింబమనుబింబమాత్మనః కాని కాని న చకారలజ్జయా.**

**(వ.జీ.పుట.215)**

కొత్త వధువైన పార్వతీదేవి అద్దంలో సంభోగ చిహ్నాలను చూసుకుంటూ, తన ప్రక్కనే వెనుకవైపు కూర్చున్న శివున్ని చూసి సిగ్గుతో ఏమి ఏమి చేయలేదు అని వర్ణించాడు. ఏమి చేసిందో కప్పిపుచ్చి 'ఏమి ఏమి' చేయలేదు అనటంలో సౌందర్యం ఉంది. అదే సంవృతి వక్రత.

### 4.1.5.1. సంవృతి వక్రత – సమన్వయం

**ఆ॥ డాయఁబోయి యప్పుడాయమ్మ యెవ్వరో**
**యేకులంబు నదియొ యెఱుఁగకయును**
**నే జోహారు నిడితి హృదయంబ నేరుచు**
**నెదురు ప్రాభవంబు నేర్పరింప**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.112 పద్యం)**

వ్యాసుడు కాశిని శపించే సందర్భంలో ఇలా చెప్పుతూ ఆ ఇల్లాలు ఎవరో ఏ కులమో తెలియకనే సమీపించాను. ఎదుటివాళ్ళ గొప్పదనం తెలుసుకోవడానికి మనస్సే సమర్థం అయినది. ఆమె 'ఎవరో'

అనే సర్వనామాన్ని తెలుపుతూ వచ్చిన వారిని కప్పి పుచ్చడం సంవృతి. 'ఎవ్వరో' అనటంలో ఆపదలో ఆదుకున్నది. ఏ పుణ్యాత్ముారాలో అనే ఉత్కర్షను ఈ సర్వనామం తెలుపుతుంది.

**తే॥ కాశివెలువడి వచ్చి పరాశరాత్మ**
**జుండు ఖేదంబునొంది శిష్యులునుఁదాను**
**నెచట వసియించె నెచ్చోట నేమిచేసె**
**ననఘ! యే తీర్థమాడె మా కానతిమ్ము**

**(భీమే.ప్రథ.ఆశ్వా.121 పద్యం)**

సూత మహర్షి వ్యాస మహర్షి బాధపడి తన శిష్యులతో కాశిని వదలి ఎక్కడ నివసించి, ఎక్కడెక్కడ ఏమేమి చేసాడు అని శౌనకాదులడిగారు. ఇక్కడ ఎక్కడెక్కడ 'ఏమి చేసెను' అనే సర్వనామం వల్ల ఎన్ని బాధలను అనుభవించాడు. ఏ పూజలు చేసాడు. ఏ తీర్థాలను తిరిగాడనేది దాగి ఉంది. 'ఏమి చేసెను' అని అర్థం ఎచట, ఎచ్చోట, ఏమి అనే పదాలు వ్యాసుని పనులను తెలుసుకునే ప్రయత్నాన్ని చెప్పాయి.

**ఉ॥ క్రొన్నెల పువ్వుదాల్చునకుఁగూరిమి భోగపురంధ్రి కక్కటా**
**యిన్నగరీలలామమున కీపరిపాటికి నిట్టికోపమే**
**లన్న! ఘటించెదో మునకులాగ్రణి! నిక్కమువో "బుబుక్షితః**
**కిన్నకరోతిపాప"మను కేవల నీతి దలంచి చూడఁగన్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.117 పద్యం)**

ఓ మునికులాగ్రణీ! శివునకు ప్రియ భార్య అయిన కాశి మీద ఇంత చిన్న విషయానికి కోపమెందుకు. అయినా ఆలోచిస్తే ఆకలితో ఉన్నవాడు ఏ పాపము చేయడు? అని అగస్త్యుడు వ్యాసునితో అనే సందర్భం. "బుబుక్షితః కిన్నకరోతిపాపం" అనటం 'ఏపాపం' అనటంలో ఏ రకమైన పాపం చెప్పకపోవటం సంవృతి. పాపరకాన్ని కప్పిపుచ్చుతూనే అన్ని రకాల పాపాలు చేస్తాడనే విషయం 'ఏ' అనే సర్వనామం తెలుపుతుంది.

**తే॥ కాశిపైఁ గోపగింపఁగఁ గాదు నీకు**
**నెంత కోపించునో యింత కిందుమౌళి**
**విప్రుఁడవు గాన నేరము వెదకఁ దగదు**

**భిక్షఁగొన రమ్ము మాటలు పెక్కులేల**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.118 పద్యం)**

కాశిపై కోపించకూడదు. శివుడెంద కోపిస్తాడో ఇంతకు నువు చేసిన నేరానికి అని పుణ్యస్త్రీ వ్యాసున్ని అనటం ఇక్కడి విషయం. 'ఎంత' కోపించునో అనే దాంట్లో 'ఎంత' అనే సర్వనామం సంవృతి. శివుని కోపాన్ని తీవ్రతను చెప్పకనే చెప్తుంది. అలాకు 'ఇంతకు' అనే సర్వనామం వ్యాసుని తెలివి తక్కువతనాన్ని తెలియజేయక కప్పిపుచ్చుతూ శోభించింది.

**ఉ॥ ఎయ్యది కారణంబుగ మహీపతియంచిత ధైర్యకంచుకం**
**బయ్యతనుండు సించె నలరమ్ములచేనదికారణంబుగాఁ**
**దొయ్యలి రాజనందనునితోడన గూర్పఁదలంచుచున్నయా**
**దయ్యమునెత్తికోలు తుదిఁదాఁకుటఁ గానఁగ నయ్యెనయ్యెడన్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.83 పద్యం)**

ఆ నలదమయంతుల విషయంలో ఏ కారణం చేత దేహం లేనివాడైన మన్మథుడు తన బాణాలతో రాజు ధైర్యాన్ని చీల్చెనో ఆ కారణం చేతనే దమయంతిని పొందటం జరిగిందని తెలుపుతున్నాడు. ఎయ్యది, ఆ కారణం, అనే సర్వనామాలను వాడుతూ రాజు మన్మథుని చేష్టలకు లొంగిపోయి అనుభవించాడని తెలుపుతున్నాడు. ఇది సంవృతి వక్రత.

### 4.1.6. పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత

సంవృతి వక్రత తర్వాత పదం మధ్యలో వచ్చే కృతద్ధితాది ప్రత్యయాలు వస్తే పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రతగా చెప్పాడు కుంతకుడు.

**కా॥ ప్రస్తుతౌచిత్య విచ్ఛిత్తిం స్వమహిమ్నావికాసయన,**
**ప్రత్యయః పదమధ్యేఽ న్యాముల్లాసయతి వక్రతామ్.**

**కా॥ ఆగమాదిపరిస్పన్దసున్దరః శబ్ద వక్రతామ్**
**పరః కామపి పుష్ణాతి బన్ధచ్ఛాయా విధాయినీమ్**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 17, 18)**

పదమధ్యంలో ప్రత్యయం వస్తే ప్రస్తుతార్థానికి శోభ కలగటం ఒక రకమైన వక్రతకాగా, ఇదే వక్రతలో భాగంగా పదం మధ్యలో ముగాగమాది కృదాది ప్రత్యయాలు, వర్తమాన కాలాన్ని బోధించే

శతృ ప్రత్యయాలు కూడా కావ్య సౌందర్యానికి దోహదం అవుతాయని తెలిపాడు. దీనికి ఉదాహరణగా "స్నిహ్యత్కటాక్షే దృశౌ" అనే వాక్యాన్ని వివరిస్తూ 'నేత్రములు స్నేహపూర్ణములగుచున్న కటాక్షములు కలవి అని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానించాడు. అగుచున్న అనేది వర్తమాన కాలాన్ని బోధించే 'శతృ' ప్రత్యయం కనిపిస్తుంది. ఇలా ప్రత్యయాల ద్వారా పదం మధ్యలో సౌందర్యం చేకూరిచే అది వక్రతగా భావించాలని తెలియజేశాడు కుంతకుడు.

### 4.1.6.1. పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత – సమన్వయం

**శా॥ ఆటోవారభటి న్మునీశ్వరుఁడు తన్నందంద వర్ణింపఁద**
**చ్చాటుప్రౌఢికిఁ జేసె ధూర్జటి మహా శ్లాఘాశిరఃకంపమున్**
**జూటీకూట విటంకకోట విలుఠత్ స్రోతస్వినీవీచికా**
**కోటీధాటి రత్కరోటి కుహర క్రోడావకాశంబుగాన్**

**(కాశీ.చతు.ఆశ్వా.253 పద్యం)**

ఆరభటీవృత్తితో, ఆటోపంతో తోటక వృత్తాలు చదువుతూ బృహస్పతి మాటిమాటికి శివున్ని స్తుతిస్తూ ఉంటే ఆ స్తుతిలోని ప్రౌఢికి, శ్లాఘాపూర్వక శిరఃకంపము చేసాడు. అప్పుడు జటాజూట శిఖరములోని పొరలి పడుతున్నదైన గంగానది కెరటాల పరంపలు రవళించి బ్రహ్మ కపాల రంధ్రంలో నుండి మార్మోగాయి అని వర్ణించాడు కవి. 'విటంకకోటి విలుఠత్' అనే పదం, 'ధాటీ రఠత్' అనే శతృ ప్రత్యయాలు పద్యానికి సౌందర్యాన్ని చేకూర్చాయి. నిజంగా గంగానదీ ప్రవాహ రవళిని ఆలకిస్తున్నామా? అన్నట్లు ఈ పదాలు వాడడం వలన అనిపించింది.

**మ॥ తిమిరంబున్ ఘటియించెఁ బట్టపగలున్ దేవీ, మరుద్విద్విషత్**
**సమరారంభములన్ సముద్భట భుజాచక్రీభవద్దీర్ఘ దు**
**ర్ధమ కోదండ వినిర్గతంబులయి హేరాళంబువార క్షుర**
**ప్ర మహాభల్ల శిలీముఖాంజలిక నారాచార్ధ చంద్రేషువుల్**

**(కాశీ.షష్ఠా.ఆశ్వా.242 పద్యం)**

దేవదానవుల యుద్ధ సమయంలో రాక్షసకోటి శక్తిగణంలో సమానంగా పోరాడింది. ఆ వర్ణనను చేసే పద్యం ఇది. వారి యుద్ధంలో మిక్కిలి సమర్థవంతమైన (చక్రీభవత్) వలయాకృతమైన అవుతున్న,

ధనుస్సుల నుండి, వెలువడుతున్న మహా బల్లాల, బాణాలు పట్టపగలే చీకటిని సృష్టించాయి. సముద్భట, విద్విషత్, చక్రీభవత్ అను పదాల వల్ల యుద్ధ భీకరత్వం తెలియజేయబడింది.

**మ॥ దళదిందీవరకాంతిఁ బంచష దళత్వక్పాటనానంతరో**
**జ్జ్వల రంభా తరు గర్భ సంపుట లసచ్ఛాయా కలాపంబుతోఁ**
**గలయం గూర్చి చతుర్ముఖుం డొనరించెం గాఁబోలు నాకర్ణ శ**
**ష్కులి కాపాంగకమైన యీ చిగురుటాకుంబోఁడి నేత్రద్వయిన్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.321 పద్యం)**

దమయంతి నేత్రద్వయం వర్ణన ఇది. బ్రహ్మ నల్ల కలువల కాంతి మొత్తాన్ని, అరటిచెట్టు పట్టలోలిచిన తర్వాత కన్పించే లోపలి తెల్లని కాంతిలో ఉంచి ఈ కాంత కన్నులను చేసాడని కవి సౌందర్యాత్మక వర్ణన. ఇందులో దళత్ ఇందీవరకాంతినే, దళత్వక్, ఉజ్జ్వల రంభాతురుగర్భ, లసత్ చాయా మొదలగు పదాలు దళత్వక్, లసత్ శతృప్రత్యయాంతాలు, వర్తమానార్థకాలు, వికసిస్తున్న అనే పదం నిజంగా కన్నులకు కట్టినట్టుగా భావింపజేస్తుంది. ఎక్కువ కాంతి గలవని చెప్పకనే చెబుతున్నవి ఈ పదాలు వాడటం వలన పద్యసౌందర్యం ఇనుమడించింది.

### 4.1.7. వృత్తివైచిత్ర్య వక్రత

వృత్తివైచిత్ర్య వక్రతను ఇలా నిర్వచించాడు.

**కా॥ అవ్యయీభావ ముఖ్యానాం వృత్తీనాం రమణీయ తా**
**యత్రోల్లసతి సాజ్ఞేయా వృత్తివైచిత్ర్య వక్రతా!**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 19)**

అవ్యయీభావం వలన రామణీయకత ఏర్పడితే అది వృత్తివైచిత్ర్య వక్రతగా చెప్పాడు. ఒక శ్లోకాన్ని ఉదాహరణగా ఇచ్చి అందులో "అధిమధులతానాం నవరసః" అని ఉండగా అందులో 'అధిమధు' అనే అవ్యయీభావసమాసం వలన శ్లోకానికి సౌందర్యం ఏర్పడిందని అర్థవంతంగా ఉన్నదని వివరించాడు.

### 4.1.7.1. వృత్తివైచిత్ర్య వక్రత – సమన్వయం

**శా॥ తల్లీ! యిన్ని దినాలకేనియు సుధాధారా రసస్యందియై**
**యుల్లంబున్ సుఖియింపఁజేయు పలుకేట్లోవింటినివ్వీటిలోఁ**

బెల్లాకొన్న కతాన నేనొకఁడనే భిక్షానకున్ వత్తునో

యెల్లన్ శిష్యులఁగొంచు వత్తునొ నిజం బేర్పాటుగాఁ జెప్పుమా

(భీమే.ద్వితీ.ఆశ్వా.120 పద్యం)

వ్యాసుడు అమ్మా! ఇన్ని దినాలకైన ఈ పట్టణంలో అమృత తుల్యమై మనస్సుకు సంతోషం కలిగే మాట విన్నాను. భిక్షకు ఒక్కడినే రావాలా? ఎల్ల శిష్యులన్ తీసుకొని రావాలా? అని ప్రశ్నించే సందర్భంలో 'యిన్నిదినాలకేనియు' అనే సముచ్చయార్థక పదం అవ్యయం. ఈ అవ్యయాన్ని వాడటం బట్టిం ఎన్నో రోజుల నుండి వేచి చూస్తున్న హృదయ ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు అయ్యింది. దీనివల్ల పద్యానికి సొబగు చేకూరింది.

తే॥ నట్టిగోలోకమున యందు నధివసింతు

రభవుచే నెల్లప్రొద్దు నెయ్యంబుఁగనుచు

నలఘుమూర్తులు గోమాతృకలు సుశీల

యాదిగాఁగల పరమ కల్యాణ నిధులు

(కాశీ.ద్వితీ.ఆశ్వా.28 పద్యం)

మహా కైలాసం గోలోకానికి ఇరుగుపొరుగు అవటం మూలాన శివుని స్నేహసౌఖ్యం అనుభవిస్తూ 'ఎల్లప్రొద్దు' (ఎల్లకాలం) కల్యాణ నిధులు సుశీల మొదలగు గోమాతృకలు ఆ లోకాన్ని అధివసించి ఉన్నారు. 'ఎల్లకాలం' అనే పదాన్ని వాడటం వల్ల సర్వకాలంలో ఉత్కృష్టమైనదిగా తెలుస్తుంది. దాని వైశిష్ట్యాన్ని చెప్పకనే చెపుతుంది.

తే॥ గమియ నామూలచూడంబుగా ఫలించి

యంబరము మోచియున్న యుదుంబరములు

లీల ప్రహ్మాండభాండ మాలిక భూష

లవధరించిన వృషభాంకు ననుకరింప

(కాశీ.ప్రథ.ఆశ్వా.91 పద్యం)

వింధ్యా పర్వత వర్ణన చేస్తూ కాండం నుండి చిటారు కొమ్మ దాకా విరుగడి ఆకాశాన్ని అంటుతున్న మేడి చెట్లు ఆపాదమస్తకం బ్రహ్మాండ భాండా మాలామయాలైన భూషణాలను ధరించిన శివునిలా ఉన్నాయంటూ "ఆమూలచూడంబుగా" క్రింది నుండి పై వరకు పండిన పళ్ళను తెలుపుతూ

శివునితో పోల్చాడు. అవ్యయీభావ సమాసం వలన రమ్యత చేకూరింది. ఈ పద్యాన్ని జంధ్యాల జయకృష్ణ బాపూజీగారు వృత్తివైచిత్ర్య వక్రతకు ఉదాహరణగా ఇచ్చారు.

**చ॥ ధరణిపు చక్కి కట్టెదురఁదామరసాక్షికిఁ జేష్టనష్టతం**
**బొరసె, మనోనురాగ పరిపూర్తి నొకించుక సేపు నిర్భర**
**స్మరశరపుంఖ సంఘటిత షట్చరణప్రమదాగరుచ్ఛటా**
**స్ఫురదని లావతారమున బోరనఁదా మొదలెత్తెనో యనన్**

**(శృ.నై.షష్ఠ.ఆశ్వా.7 పద్యం)**

దమయంతి నలుని ఎదుట నిలబడింది. కొంత సేపే అనే విషయాన్ని 'ఇంచుక సేపు' అనే దాంట్లో 'ఇంచుక' అనే అవ్యయం వాడటం వలన కొంత క్షణమే ఎక్కువ కాదు అనే అర్థాన్నిస్తూ పదప్రయోగం పద్యానికి సొబగునిచ్చింది.

### 4.1.8. భావవైచిత్ర్య వక్రత

భావవైచిత్ర్య వక్రతను నిర్వచిస్తూ ఇలా చెప్పాడు.

**కా॥ సాధ్యతామప్యనాదృత్య సిద్ధత్వేనాభిధీయతే,**
**యత్ర భావో భవత్యేషా భావవైచిత్ర్య వక్రతా**

**(వ.జీ.ద్వి.ఉన్మే.కా. 20)**

ఎక్కడైతే భావం సాధ్యరూపంలో ఉన్న సిద్ధరూపంలో చెప్పబడుతుందో అది భావవైచిత్ర్య వక్రత. అనిష్పన్నమైన భావమును నిష్పన్నమైనట్లు చెప్పడం అంటే క్రియలు జరగకముందే జరిగినట్లు వర్ణించటం కూడా భావవైచిత్ర్య వక్రతగా కుంతకుడు భావించాడు.

### 4.1.8.1. భావవైచిత్ర్య వక్రత – సమన్వయం

**ఇతడు దరిద్రుఁడౌ ననుచు నేర్పడ నర్థిలలాట పట్టికన్**
**శతధృతి వ్రాసినట్టి లిపి జాల మనర్థము గానియట్లుగా**
**వితరణ ఖేలనా విభవ విభ్రమ నిర్జిత కల్పభూరుహుం**
**డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రునిఁ జేయు నాతనిన్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.57 పద్యం)**

నలుని గొప్పతనాన్ని కవి వర్ణిస్తూ దాత అయిన రాజు యాచకుల నొసటన బ్రహ్మ రాసిన పేదరికం లిపిని ధనమిచ్చి అబద్ధం చేసి చూపాడని నుతించాడు. అలాగే పేదరికంలోనే పేదవానిగా చేసాడంటూ 'దరిద్రతాగుణమునందు దరిద్రునిఁజేయు' కవి గొప్ప వర్ణన. ఇక్కడ బ్రహ్మ రాసిన లిపిని ఎవరూ తప్పించలేరు. అది సహజం కానీ దానిని కూడా తప్పించగలడని చెప్పడం సాధ్యం. అసాధ్యం సుసాధ్యం అయ్యింది కనుక భావవైచిత్ర్యం. బ్రహ్మ రాతను కూడా అన్యథాకరింప సమర్థుడని చెప్పడం సాధ్యభావం. ఇతరాలంకారికులు ఈ పద వక్రతను అలంకారాల్లో అయితే సంబంధాతిశయోక్తిగా చెప్తారు. సప్తవిధ అతిశయోక్తిల్లో ఇదొక రకం. వేదం వెంకటరాయశాస్త్రి బ్రహ్మరాతను అన్యథాకరింప సమర్థుడు కావున ఇందులో సంబంధాతిశయోక్తి ఉందని వ్యాఖ్యానంలో తెలిపాడు.

**మరొక ఉదాహరణ:**

**చ॥ నియమ విచిత్ర భంగి మహనీయుఁడు భూమి విభుండు మిత్త్రజే**
**తయును నమిత్త్ర జేతయుఁబ్రతాపగుణంబున, నీతిఁ జారదృ**
**ష్టియును విచారదృష్టియు, నటే! పరిపంథి మహీశులట్ల త**
**ద్భయమున భేత్తృతాగుణము వాసెనొ కాక విరుద్ధధర్మముల్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.54 పద్యం)**

నలుని వర్ణనలో భాగంగా రాజు సూర్యుని కన్న తేజస్వి, శత్రువులను జయించేవాడు, నీతిమంతుడు, చారదృష్టి కలవాడు, ఆలోచనపరుడు. అతని పాలనలో రాజులు భయపడి వైరాలు మానుకొని ఒద్దిక కలిగి ఉన్నారని మనోహరంగా వర్ణించాడు. 'భూవిభుండు మిత్త్రజేతయును నమిత్త్ర జేతయుఁ' అనే పదాలవల్ల భావవైచిత్ర్యం ఏర్పడింది. ఒక ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించడం జరగదు కానీ ఇక్కడ రాజు శత్రువులు శత్రుత్వాన్ని మానుకొన్నారు అని చెప్పడం భావవైచిత్ర్య వక్రత.

**మరొక ఉదాహరణ:**

**తే॥ మహిమ హిమ వేళలందు నమ్మానవతికి**
**మాసరము లయ్యెఁదలఁపంగవాసరములు**
**పొడవు గలిగి తపర్తు సంపూర్తియందు**
**నంచితాయామవతు లయ్యెయామవతులు**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.75 పద్యం)**

నలచింతచేత పగళ్ళు ఎప్పుడు ముగియక, రాత్రుళ్ళు తెల్లవారక దమయంతికి వేసవి కాలంలో విరహాన్ని అనుభవిస్తున్నదని కవి వర్ణించాడు. ఇందులో 'వాసరములు మాసరములు' అయ్యాయని తెల్పాడు. వాసరములు అంటే పగళ్ళు, మాసరములు అంటే దీర్ఘాలు అయ్యాయని చెప్పటం. ఎక్కడ కూడా పగలు, రాత్రి దాని సమయాలను మార్చుకోవు. సృష్టి ధర్మం అది కానీ సృష్టికి విరుద్ధంగా పొడిగించడం అసాధ్యం కానీ చింతతో సాధ్యంగా చెప్పటం భావవైచిత్ర్యం. ఇతరుల దృష్టిలో విరోధాభాసం. కుంతకుని దృష్టిలో పదవక్రత.

**మరొక ఉదాహరణ:**

**చ॥ తనహృదయాధినాయకునిఁదక్కఁగఁ దక్కొరు సన్నుతింపఁగా**
**వినుట సతీవ్రతంబునకు విగ్రహ, మిట్టిది ధర్మశాస్త్ర వా**
**సన; యటుగాన, నోదివిజ శంభళి, యింకిటఁ బట్టి నీకు మీ**
**యనిమిషరాజు పాదముల యాన సుమీ మఱి యేమివల్కినన్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.144 పద్యం)**

ఇంద్రుడిని పరిణయమాడమని చెప్పగా దమయంతి తన సఖులనెల్లవారించి ఇలా అంటున్న సందర్భంలోదీపద్యం. ఇందులో తన హృదయాధినాథుడైన నలునిని తప్ప వేరేవారిని పొగడటం వాటిని వినటం సతీవ్రతంబునకు కూడదని పల్కుతుంది. నలునికి తాను స్వహృదయదత్త కాబట్టి ఆయన పతిగా భావించింది. పరిణయానికి ముందే 'సతీసాధ్వీ పతివ్రతా' ధర్మాలను తెలపటం అసహజం అయినప్పటికి భర్తగా భావించి చెప్పటం సాధ్య భావన. పెళ్ళికాకముందే పతివ్రతగా దమయంతిని వర్ణిస్తూ "సతీవ్రతంబునకు విగ్రహ మిట్టిది ధర్మశాస్త్ర వాసన" అనటంలో భావవైచిత్ర్యం ఉంది.

### 4.1.9. లింగవైచిత్ర్య వక్రత

లింగవైచిత్ర్య వక్రతను వివరిస్తూ ఇలా చెప్పాడు.

**కా॥ భిన్నయోర్లింగయోర్యస్యాం సామానాధికరణ్యతః।**
**కాపి శోభాభ్యుదేత్యేషా, లిఙ్గవైచిత్ర్య వక్రతా॥**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 21)**

**కా॥ సతి లిఙ్గాన్తరే యత్ర స్త్రీ లిఙ్గంచ ప్రయుజ్యతే**
**శోభానిష్పత్తయే యస్మాన్నామైవ స్త్రీతి పేశలమ్**

**(వ.జీ.ద్వి.ఉన్మే.కా. 22)**

ఎక్కడైతే రెండు భిన్న లింగాలకు సమానాధికరణం ఉంటుందో అక్కడ గొప్పనైన శోభ ఏర్పడితే అది లింగవైచిత్ర్యం అని చెప్పాడు. అలాగే ఎక్కడైతే ఇతర లింగ పదాలున్నప్పటికి శోభను కూర్చడానికి స్త్రీలింగాన్ని వాడుతారో అక్కడ కూడా లింగవైచిత్ర్యం ఉన్నట్లే అని తెలిపాడు. అందుకు ఉదాహరణగా 'తట' శబ్దాన్ని ఉదహరిస్తూ 'తట' శబ్దం మూడు లింగాల్లో ఉన్నప్పటికి 'తటీ' శబ్దాన్నే స్త్రీలింగాన్నే వాడారని శ్లోకాన్ని ఉదాహరిస్తూ ఇక్కడ లింగ వక్రత ఉందని తెలిపాడు. వాడు రత్నము, ఆమె నిండు కుండ. ఇలాంటి వాక్యాల్లో లింగ సమానాధికరణం కనిపిస్తుంది. సౌందర్యం కోసం ఒక లింగానికి బదులు మరో లింగాన్ని వాడటమే ఈ వక్రత. లాగే లింగ వక్రతలో మరొక రకాన్ని చెప్తూ ఇలా వివరించాడు.

**కా॥ విశిష్టం యోజ్యతే లిఙ్గమన్యస్మిన్ సమ్భవత్యపి।**
**యత్ర విచ్ఛిత్తయే సాన్యా వాచ్యౌచిత్యానుసారతః॥**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా. 23)**

ఎక్కడైతే వేరే లింగాన్ని కూర్చడానికి అవకాశం ఉన్నప్పటికి వైచిత్ర్యం కోసం మరొక లింగాన్ని కూర్చడం కూడా లింగవైచిత్ర్యంగా చెప్పాడు.

ఇక్కడ రామాయణ సంబంధ శ్లోకాన్ని ఉదహరించాడు.

**"మృగ్యశ్చ దర్భాంకుర నిర్వ్యపేక్షా**
**స్తవాగతిజ్ఞం సమబోధయన్ మామ్।**
**వ్యాపారయన్త్యో దిశిదక్షిణస్యా**
**ముత్పక్ష్మ రాజీని విలోచనాని॥**

**(వ.జీ.పుట.229)**

రాముడు సీత జాడ విషయంలో పలికిన మాటలు ఇవి ఆడలేళ్ళు దర్భాంకురాలు తినటం మానేసి నీవు వెళ్ళిన మార్గం దక్షిణం వైపు తమ కళ్ళను తిప్పుతూ నీవు పోయిన మార్గాన్ని నాకు చూపాయి అంటాడు. ఇక్కడ 'మృగ' అనే పదం పుంలింగం వాడొచ్చు కానీ 'మృగ్యః' అని ఆడలేళ్ళు అని స్త్రీ లింగాన్ని సౌందర్యం కోసం వాడటం ఇలా అవకాశమున్నప్పటికి లింగం మార్చటం లింగవైచిత్ర్య వక్రతగా చెప్పాడు.

### 4.1.9.1. లింగ వైచిత్ర్య వక్రత – సమన్వయం

తే॥ మీతలంపే నెఱుంగుదు, మిన్నకుండుఁ
డంబుజాననలార, యాయాస ముడిగి;
యే ననాది సంచారిణియైన యాత్మ
హేతు పంక్తికి విధికి నధీనబుద్ధి

(శృ.నై.తృతీ.ఆశ్వా.137 పద్యం)

దమయంతి తన చెలులతో చెప్తూ మీ ఆలోచన నాకు తెల్సు ఊరుకోండి. అనాది నుండి ఎన్నో జన్మలు ఎత్తి ఉన్నాను ఆ కర్మ నన్ను అనుసరిస్తుంది. ఆ పరంపర అనాది నుండి తెంపు లేక ప్రవహిస్తుంది. ఆ క్రమానికి నేను వశమయ్యాను నలున్నే వరించేలా చేస్తుంది నా బుద్ధి అని చెప్పడం ఇక్కడి భావం. "పంక్తి అనే శబ్దం ఇక్కడ స్త్రీ లింగం, అమహత్తు రెండు. కానీ దీనికి సంచారిణీ అనే స్త్రీలింగాన్నే విశేషణంగా వాడారు". సౌకుమార్యం కోసం స్త్రీ లింగాన్ని వాడటం కూడా వక్రతే.

### 4.1.10. క్రియావైచిత్ర్య వక్రత

కుంతకుడు సుబంత తిఙ్గంతాలలో ప్రాతిపదిక రూపంలో ఉన్న వక్రతను చెప్పిన తర్వాత ధాతురూప పదాల్లో పూర్వభాగంలో వక్రత ఎలా సంభవిస్తుందోనని తెలుపుతూ ధాతురూపం అంటే క్రియనే కాబట్టి క్రియావైచిత్ర్య వక్రత ఎన్ని రూపాలుగా జరుగుతుందనే విషయాన్ని వివరించాడు.

కా॥ కర్తురత్యన్తరంగత్వం కర్త్రన్తర విచిత్రతా।
స్వవిశేషణవైచిత్ర్యముపచార మనోజ్ఞతా॥

కా॥ కర్మాది సంవృతి పంచప్రస్తుతౌచిత్యచారవః।
క్రియావైచిత్ర్య వక్రత్వప్రకారాస్త ఇమేస్మృతాః॥

(వ.జీ.ద్వి.ఉన్మే.కా. 24, 25)

క్రియావైచిత్ర్య వక్రత అనేది ఐదు రకాలుగా ఉంటుంది. 1) కర్తురత్యంతరంగత్వం, 2) కర్త్రన్తరవిచిత్రత, 3) సవిశేషణవైచిత్ర్యం, 4) ఉపచార మనోజ్ఞత, 5) కర్మాది సంవృతి.

### 4.1.10.1. కర్త్యురత్యంతరంగత్వము

ఎక్కడైతే క్రియ కర్తకు చాలా దగ్గరగా ఉంటుందో అది సౌందర్య సంపాదకం అవుతుందో అది కర్తురత్యంతరంగత్వము. దీనికి ఉదాహరణగా

**"కిం శోభితాహమనయేతి పినాకపాణేః।**

**పృష్టస్య పాతు పరిచుమ్బన మత్తరం వః॥**

**(వ.జీ.పుట.232)**

దీనితో అందంగా ఉన్నానా? అని అడిగే పార్వతి ప్రశ్నకు శివుడు చుంబిస్తాడు. చుంబించడం కర్తకు దగ్గరగా ఉన్నది. క్రియ ఇక్కడ చుంబనం. కనుక క్రియావైచిత్ర్యంలో భాగం అయ్యింది.

### 4.1.10.1.1. కర్త్యురత్యంతరంగత్వము – సమన్వయం

**ఉ॥ మంకెనపువ్వుమీఁది యళిమాడ్కినృపాధర పల్లవోదరా**
**లంకృతియైన దంతపదలాంఛనముం గని కన్నుఁగోనలం**
**దంకురింతంబులైన దరహాస లవంబులు పద్మనేత్రయి**
**ట్టింకులు సేసెఁబక్ష్మముల యీఅమిఁగాటుక చిమ్మచీఁకటిన్**

**(శృ.నై.సప్త.ఆశ్వా.193 పద్యం)**

నలదమయంతుల ప్రణయ సమయంలో తన మోవిపై పడిన పలుగాటుని కంటి కొనలతో చూసి దమయంతి నవ్వుకుంటుంది. ఆ నవ్వ అతనిపై ఎగతాళి అవుతుందని నవ్వును దాచాలి అనుకుంటూ తన కంటిరెప్పలను తానే మూసుకుంటుంది. 'నవ్వులు' ఇక్కడ ఎగతాళి, దాచటం మరియాద 'పద్మనేత్ర యిట్టింకులు సేసె' అంటాడు కవి ఇక్కడ దమయంతి కళ్ళు మూసుకోవటం అనే క్రియ ద్వారా ఆమె చేష్టలు అవగతమయ్యాయి. నలునియందు గల గౌరవాన్ని తెల్పాయి. ఆమె చిరునగవునుతానే ఆపి వేసిందని తెలిసింది. కన్నులు మూయటం, నవ్వు కనబడకుండా చేయటం 'ఇట్టింకులు సేసె' అనే క్రియాపదం ద్వారా తెలుస్తుంది. కర్తకు క్రియ దగ్గరగా ఉంది కనుక కర్త్యురత్యంతరంగత్వం. కర్త అంతరంగాన్ని ఈ క్రియ మాత్రమే తెలియజేసింది కానీ వేరే పదం కాదు. ఇట్టింకులు చేయటం అంటే బొత్తిగా ఇంకిపోవునట్లు, అదృశ్యం అయ్యేటట్లు చేయడమని అర్థం.

**మ॥ అని సంకల్ప భవైక సాక్షులగు శయ్యానేక సంభోగ చి**
**హ్నానలన్ భూపతిప్రత్యభిజ్ఞ కొఱకైయందంద వాక్రువ్వ, న**
**వ్వనితా రత్నమువాలుఁగన్నులఁబతి న్వారించుచు. న్మసె నొ**
**య్యన ధాత్రేయి శ్రుతి ద్వయంబు నిజ హస్తాంభోజ యుగ్మంబునన్**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.87 పద్యం)**

రాజు వారి ప్రణయ రహస్యాలను చెప్పుతూ ఉండగా వలదని కన్నుగీటి వెంటనే కళావతి చెవులను తన చేతులతో మూసినది. చెవులు మూయటం అనే క్రియ ద్వారా ఆ రహస్యాన్ని వినిపించటం ఇష్టం లేదని తెలుస్తుంది. ఈ క్రియ కర్తకు దగ్గరగా ఉంది.

**సీ॥ ప్రాణేశు నొసలి లాక్షాంకంబు వొడగాంచి**
**ముసిముసినగవుతో మోము మలఁచు**
**నేల నవ్వితి చెప్పుమిప్పుడంచడిగిన**
**నధిపు చేతికి మించుటద్దమిచ్చు,**
**మఱుపెట్టి చనుదోయి మదనాంకములు సూచుఁ**
**దను నవ్వు విభుఁజూపులన యదల్చు**
**రాజుచేఁ జికుర భారము సెజ్జమోవంగ**
**మ్రొక్కించుకొనుఁ బాదములకు నలిగి**
**తే॥ రుద్రమూర్తి జిగీషానురూప కలన**
**కతనుఁడేకాద శాకృతియైన భంగిఁ**
**జరణ నఖదర్పణములందు ధరణి విభుఁడు**
**లీలఁ బ్రతిబింబితుండుగా లోలనయన**

**(శృ.నై.సప్త.ఆశ్వా.191 పద్యం)**

దమయంతి నలుని నొసలి భాగానికి అంటిన లత్తుక చిహ్నాన్ని చూసి నవ్వుతూ, మోహాన్ని తిప్పుకుంటుంది. ఎందుకు నవ్వావు అని అడిగితే నలుని చేతికి అద్దం ఇస్తుంది. చాటుగా కామక్రీడ చిహ్నాలను చూసుకుంటుంది. నలుడు అడుగగానే చేతికి అద్దమివ్వటం అనేది సమాధానం. ఈ చేష్ట తప్పా వేరే ఏది కూడా సౌందర్యాన్నివ్వలేదు. అద్దం ఇవ్వడం అనేది కర్తకు దగ్గరగా ఉన్నది కనుక ఇది కర్తురత్యంతరంగత్వం. ఇదొక రకమైన క్రియావైచిత్ర్యం. జంధ్యాల జయకృష్ణ బాపూజీ కూడా ఈ పద్యాన్ని క్రియా వైచిత్ర్యంలో కర్తురత్యంతరగంత్వానికి ఉదాహరణగా ఇచ్చారు.

### 4.1.10.2. కర్త్రంతర విచిత్రత

ఇతరులకు సాధ్యం కానిది ఒకే కర్తకు సాధ్యం అయినట్లు చెప్పటం విచిత్రమైన క్రియావైచిత్ర్యాన్ని ఇస్తుంది. ఇది కర్త్రంతర విచిత్రత.

దీనికి ఉదాహరణగా

**“స దహతు దురితం శాంభవోవః శరాగ్నిః”**

**ఈశ్వరుని ఆ శరాగ్ని మీ యొక్క పాపమును కాల్చివేయుగాక”**

**(వ.జీ.పుట.233)**

ఈశ్వరుడు తప్ప వేరెవరు పాపాలను నశింపజేయలేరనే అర్థాన్ని ఇస్తుంది. ఇది ఒక రకమైన క్రియావైచిత్ర్యం. ఏక కర్తకే సాధ్యం. అన్యులకు అసాధ్యమనే భావాన్నే తెలిపే క్రియ.

### 4.1.10.2.1. కర్త్రంతర విచిత్రత – సమన్వయం

**సీ॥ పంచాక్షరీ మంత్ర పారాయణమునకు**
**నెవ్వాని మానసం బేడుగడయు**
**దర్పోద్ధతులగు వాతాపీల్వలులకును**
**వధశిలాస్థాన మెవ్వాని కుక్షి**
**యాదినెవ్వాని దివ్యావతారమునకుఁ**
**బూర్ణాంబుకుంభంబు పురిటి యిల్లు**
**మెఱసి లోపాముద్ర మెఱుఁగు బాలిండ్లపైఁ**
**బవళించు నెవ్వాని భవ్యమూర్తి**
**కసరి యెవ్వాని కంఠహుంకారరవము**
**కొండచిలువల కులములోఁ గూర్చె నహుషు**
**నట్టి పరమమహాశైవు నలఘుతేజు**
**వెదకి రా నందవనములో విబుధమునులు**

**(కాశీ.ద్వితీ.ఆశ్వా.ప.40)**

మునులు కాశీలో అగస్త్యున్ని వెతుకుతూ ఉన్న సందర్భంలోనిది. ఆ విషయాన్ని చెప్తూ ఎవరి కంఠహుంకార ధ్వని నహుషున్ని కొండ చిలువల కులంలో ఆవిర్భవింపజేసింది. ఆ మునిని వెతుకుతున్నారని చెప్పటం విశేషం. లోకములో ఎన్నో కంఠాలు ఉన్నా అగస్త్యుని కంఠహుంకారమే నహుషున్ని కొండ చిలువగా మార్చగలిగింది. ఎవరికి లేని ప్రత్యేకత లోకోత్తర కార్యనిర్వహణ

సామర్థ్యం ఒక్కడికే చెప్పబడ్డది. ఒకే కర్తకు గొప్పతనం చెప్పడం, ఇతరులకు సాధ్యం కాదని తెల్పటం ఇక్కడ వైచిత్ర్యంగా భావించాలి.

### 4.1.10.3. సవిశేషణ వైచిత్ర్యం

విశేషణం వలన క్రియకు వైచిత్ర్యం ఏర్పడితే అది కూడా క్రియా వైచిత్ర్యమే. ముందు చెప్పిన విశేషణ వక్రత కారకాలన్నిటికి వర్తిస్తుంది. ఇది కేవలం క్రియకే వర్తిస్తుంది. విశేషణం క్రియా విశేషం అయి ఉండాలి. దీనికి ఉదహరణగా "మయ్యాసక్తశ్చకితహరిణీహారినేత్ర త్రిభాగః" భయపడిన ఆడలేడివలె మనోహరమగునట్లుగా నేత్రాంతము నాయందు లగ్నము చేయబడినది" అని వివరించాడు (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.234) అని ఇవ్వబడింది.

ఇక్కడ 'భయపడిన' అనేది క్రియా విశేషణం దీనికి సౌందర్యం క్రియా విశేషణం వలన కలిగిందని కుంతకుని అభిప్రాయం.

### 4.1.10.3.1. సవిశేషణ వైచిత్ర్యం – సమన్వయం

**ఉ॥ హస్తగృహీత పుస్తకమునందు లిఖించిన యిట్టి నీలకం**
**ఠస్తవమున్ బఠించుచు ఘనంబుగ ధీగుణ వైభవోన్నతుల్**
**విస్తరిలంగ బాలకులు వేవురిలో సిరియాళుఁడుండె న**
**భ్యస్తలిపి ప్రపంచుఁడు గ్రహంబులలో నుడురాజుకైవడిన్**

**(హర.ద్వితీ.ఆశ్వా.73 పద్యం)**

సిరియాలుడు గ్రహాల్లో చంద్రునిలా ప్రకాశిస్తున్నాడు. విద్యార్థుల సమూహంలో అని వర్ణిస్తూ "హస్తగృహీత పుస్తకమనందు యిట్టి నీలకంఠస్తవమున్ బఠించుచు ఘనంబుగ" అనే వాక్యంలో చేతబట్టిన పుస్తకంలో స్తవాన్ని చదువుతూ అనే క్రియా విశేషణం సహజత్వాన్ని తెలిపింది. కంఠస్తవం పఠించడం అనే క్రియకు 'హస్తగృహీత' అనే క్రియా విశేషణం సౌందర్యానిచ్చింది. కనుక క్రియా విశేషణ వైచిత్ర్యం అదే సవిశేషణ వైచిత్ర్యం.

**తే॥ ఆ జటాధారి చేరంగ నరుగుదెంచి**
**తనకు సాష్టాంగమెఱఁగి తాత్పర్యమెసఁగఁ**
**గేలుదమ్ములు మొగియించి కెలన నున్న**
**చిన్ని ముద్దుల సిరియాళ సెట్టి కనియె**

(హర.ద్వితీ.ఆశ్వా.74 పద్యం)

ఆ జటాధారి సమీపంగా వచ్చి, సాష్టాంగ నమస్కారం చేసి, భక్తి ఉప్పొంగగా చేతులు మోడ్చి నమస్కరించి తన సమీపంలో ఉన్న సిరియాళునితో ఇలా అంటున్నాడు. చేరంగ, సాష్టాంగ మెఱఁగి, తాత్పర్యమెసఁగ అనేవి క్రియా విశేషణాలు. 'కేలుదమ్ములు మొగియించి' అనే క్రియకు పై క్రియా విశేషణాలు సౌందర్యానిచ్చాయి. కనుక సవిశేషణ వైచిత్ర్యం.

**గీ॥ గగన యానవేగంబున గలబరించి**
**కడుపు నిండంగఁ గ్రోలిన కమలమధువుం**
**గ్రక్కెనో నాగ గగన మార్గంబునందు**
**భానుబింబంబు రక్తాతపంబు గాసె**

(శివ.తృతీ.ఆశ్వా.94 పద్యం)

సూర్యబింబ వర్ణన ఇది. గగన మార్గంలో ప్రయాణించు వేగంతో డోకు పుట్టి తానంతకు ముందు కడుపు నిండా తాగిన పద్మ మకరందాన్ని కక్కున్నాడా? అన్నట్లు సూర్యబింబం ఆకాశంలో ఎర్రటి ఎండను కాసింది. ఇందులో 'కలబరించి' అంటే డోకు పుట్టి అని అర్థం. "కడుపు నిండగా గ్రోలిన మధువు క్రక్కెనో" అని అనటంలో క్రియా విశేషణం ఉంది. గ్రోలటం క్రియా విశేషంగా వాడబడి పద్యానికి సౌందర్యానిచ్చింది. దీనిని క్రియావిశేషణ వైచిత్ర్యంగా చెప్పవచ్చు.

**ఉ॥ పువ్విలు కానితోడ సరిపోలెడు చక్కనివాఁడు భూమిలో**
**నెవ్వఁడు చెప్పుఁడా? యనుచు నిష్టవయస్యలఁగూర్చి యాత్మలో**
**నువ్విళులూరుచుం బలుకు నొప్పులకుప్ప నలుండు గాకయొం**
**డెవ్వఁ? డనంగ మెచ్చుఁదరళేక్షణ నెయ్యము లియ్యమెట్టిదో!**

(శృ.నై.ప్రథ.ఆశ్వా.77 పద్యం)

మన్మథునితో సమానమైన చక్కనివాడు ఈ భూమ్మీద ఎవరున్నారని నెచ్చెలులను మనస్సులో 'ఉవ్విళూరుచు బలుకు' దమయంతి. అపుడు చెలులు ఓ ఒప్పులకుప్పా నలుడు కాక ఇంకెవరున్నారు అంటే ఆమె ఆనందం చెప్పవశం కానిదని అర్థం ఇక్కడ ఉవ్విళూరడం అంటే ఆత్రపడటం. ఆత్రపడుతూ చెప్పిందనటం క్రియా విశేషణం. ఈ క్రియా విశేషణం వాడటం వలన దమయంతీ భావన సొగసుగా వ్యక్తమైంది.

శా॥ ఆవామాక్షి మనోహరాకృతి యమోఘాస్త్రంబుగా భూవరున్
లావణ్యాధికు నచ్చలంబుమెయి గెల్వంబూని యిందిందర
జ్యావల్లీ కిణకర్కశం బయిన హస్తం బుద్ధతిం జాఁపివే
పూవుందుంపులజోదు పుచ్చుకొనియెం బుంద్రేక్షుకోదండమున్

(శృ.నై.ప్రథ.ఆశ్వా.79 పద్యం)

నలమహారాజు మన్మథుని కన్నా అందగాడు. అందుకే ఆయన మీద పగబట్టి తీర్చుకోవడానికి సరైన సమయం చూసి దమయంతి గుణాలను విన్న తర్వాత తన నల్ల చెరుకువింటిని అందుకొని దమయంతి రూపాన్నే బాణంగా ప్రయోగించాడనేది ఇక్కడ వర్ణన. ఇందులో నలమహారాజును "అచ్చలంబుమెయిన్ గెల్వంబూని" అనే పదాల్లో అచ్చలంబు అంటే ఆగ్రహించడం, ఇది క్రియా విశేషణం 'అచ్చలంబుమెయిన్‌గెల్వం' అనే క్రియా విశేషణంలో ఈ పద్యానికి సౌందర్యం ఏర్పడింది. మన్మథుడు ఆగ్రహించడం అంటే ఇక్కడ నలుని సౌందర్యాన్ని అధికంగా చెప్పటం, దమయంతీ రూపాన్ని బాణంతో ప్రయోగించడం అనే విషయాన్ని వైచిత్ర్యంగా చెప్పటం. అలా ఆగ్రహంతో గెల్వడానికి పూనుకొని కార్యాన్ని పూర్తి చేసాడనే భావాన్ని స్ఫురింపజేస్తున్నాయి ఈ పదాలు. నలుని లావణ్యం ఆగ్రహానికి కారణం. ఇది క్రియావిశేషణంతో కూడిన వైచిత్ర్యం.

### 4.1.10.4. ఉపచార మనోజ్ఞత

ఉపచార మనోజ్ఞత అనేది క్రియావైచిత్ర్య వక్రత యొక్క మరొక విధము. సాదృశ్యాది సంబంధమును ఆశ్రయించి ధర్మాంతరము ఆరోపించుట అదే ఉపచార మనోజ్ఞత. ఉపచారం అంటే అర్థం సాదృశ్యాది సంబంధం. మనోజ్ఞత అంటే వక్రత అనే భావంతో ఇక్కడ వాడబడింది. ఇందుకు ఉదాహరణగా "తరన్తీవాంగాని స్థలదమల లావణ్య జలధౌ" తరంగితమగు విమల లావణ్యాంబుధిలో అవయవములు ఈదుచున్నట్లున్నవి (వ.జీ.పుట.235).

ఇక్కడ లావణ్యం అనేది అమూర్థ భావన అంబుధి మూర్థ భావన. లావణ్యం అనే అంబుధిలో అవయవాలు ఈదుచున్నవి. అనటం అమూర్థ భావనలో మూర్థసంబంధ క్రియను వాడటం జరిగింది. ఇలా క్రియలో సౌందర్య ఏర్పడితే అమూర్ధములందు మూర్ధధర్మాలను ఆరోపిస్తే అది క్రియలో అయితే ఉపచార మనోజ్ఞత.

### 4.1.10.4.1. ఉపచార మనోజ్ఞత – సమన్వయం

**తే॥ ఇష్టమానసమయిన యా హేమఖగము**
**నలుని మానస మానంద జలధియందుఁ**
**గర్ణ శష్కులి కలశంబుఁ గౌఁగిలించి**
**యీఁదఁ జేయుచు మృదుభాష నిట్టులనియె**

(శృ.నై.ద్వితీ.ఆశ్వా.7 పద్యం)

ప్రియమైనట్టి మానస సరస్సు గల ఆ బంగారు పక్షి నలుని మానసం అనే జలధిలో చక్కిలంలాంటి చెవియనే కలశాన్ని కౌగిలించుకొని ఈదుతున్నది. ఈ దిన కొలది ఈత సముద్రంలో తనివి అనుభూతమయినట్లు విన్నా కొద్ది అధిక ఆనందం పొందే విధంగా, తన మానసానికి ఆనందం కలిగించే నలుని మానసానికి మహదానందాన్ని కావించింది హంస. మానసం అనే అమూర్థమైన జలధిలో హంస ఈదటం అనే మూర్థక్రియను చెప్పటం కనిపిస్తుంది. క్రియలో ఈ వక్రత ఉన్నందున ఉపచార మనోజ్ఞత కావున ఇది క్రియావైచిత్ర్య వక్రతలో భాగం.

**తే॥ ముదిత క్రొమ్మేని కాంతిలో మునిఁగె మొదల**
**నంత నానంద రస వార్ధియందుఁ దేలెఁ**
**బిదప సమ్మోద బాష్పాంబు బిందుధార**
**యందు నవగాహనము చేసె నధిపు దృష్టి**

(శృ.నై.తృతీ.ఆశ్వా.146 పద్యం)

నలుని చూపు దమయంతి దేహ లావణ్యంలో మునిగింది. ఆ తర్వాత ఆమె లావణ్యాన్ని చూసి ఆనందాతిశయంతో భాష్పధారలను గురిసాడు. తనివితీరచూసాడనే అర్థం. చూపు అనేది లావణ్యం అనే అమూర్థ భావనంలో మునగటం, తేలటం అనే మూర్థ క్రియలను చెప్పటం వలన ఇది ఉపచారం.

**చ॥ మగువ ముఖేందువందమృత మధ్యమునన్మునుఁగంగఁబాఱియో**
**మగువ కుచద్వయంబు నడుమం బడి రాయిడి దందసిల్లి యో**
**మగువ గభీర నాభి బిల మార్గముఁదూఱి పరిభ్రమించి యో**
**సొగపున రాజనందనుని చూపులు నిల్చుఁ దదంతరంబులన్**

(శృ.నై.తృతీ.ఆశ్వా.149 పద్యం)

నలుని చూపులు దమయంతి ముఖచంద్రునిలోని అమృతం నడుమ మునిగిపోయి, ఆమె లోతైన నాభిలో దూరి సుడి తిరిగిందని వర్ణించాడు. పారవశ్యాన్ని చూపులు చేసిన క్రియలుగా తెల్పాడు. చూపు అమూర్ధ భావన ముఖ చంద్రుని అమృతం మునగటం అనే క్రియ మూర్ధ భావన. క్రియ రూపంలో ఉపచారం ఉంది. ఇది ఉపచార మనోజ్ఞతగా చెప్పవచ్చు. దీని వలననే వైచిత్ర్యం ఏర్పడింది. ఇదొక రకం క్రియావైచిత్ర్య వక్రత. ఇందులో మునుగంగ, దందసిల్లి, పరిభ్రమించి అనే క్రియాపదాల సౌందర్యం ఏర్పడింది.

**తే॥ నారదంబుల వలపుపొన్నలఁ బెనంగి**
**విచికిలా మోదములతోడ వియ్యమంది**
**పాటలీ పుష్పకేతకీ పరిమళములు**
**పొదల విలసిల్లుఁ బీఠికాపురము నందు**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.54 పద్యం)**

పిఠాపురంలో ప్రతి సంవత్సరము రెండు కారులందు ప్రాసంగి వరి పండుతుంది. వేరు పనస వాసనకి తుమ్మెదలు వాలుతాయి. పాటలీ పుష్పాల మొగలి వాసనలు, నారింజలతో, సువాసన పొన్న చెట్లతో పెనుగులాడి, మల్లె వాసనలతో బంధుత్వం కలుపుకొని గుబాళిస్తాయి. వాసనలు పెనుగులాడటం, బంధుత్వం కల్పుకోవటం కావ్య సౌందర్యాత్మకం. ఈ క్రియలు మూర్ధమైనవి. అమూర్ధంలో చెప్పబడ్డాయి.

### 4.1.10.5. కర్మాది సంవృతి

సంవృతి అంటే కప్పి పుచ్చడం. సర్వనామాదికం చేత కర్మాదికాన్ని ఆచ్ఛాదించి చెప్పడం. కప్పివేసి చేసి చెప్పటం అని అర్థం. దీనికి ఉదాహరణ శ్లోకాన్నిచ్చాడు.

**“నృత్తారమ్భాద్విరతరభసస్తిష్ఠ తావన్ముహూర్తం**
**యావన్మౌలౌ శ్లథమచలతాం భూషణంతే నయామి**
**ఇత్యాఖ్యాయ ప్రణయమధురం కాన్తయా యోజ్యమానే**
**చూడాచన్ద్రే జయతి సుఖినః కోఽపి శర్వస్యగర్వః”**

**(వ.జీ.పుట.237)**

నృత్యం చేసిన వేగంతో ఉన్న శివున్ని కొంచెం ఆగు నీ శిరోభూషణం జారిపోతుంది. దానిని నేను స్థిరంగా పెడతానని చంద్రుని సరిచేసే సందర్భంలో పార్వతి మధురమైన మాటలకు సుఖవంతుడైన ఈశ్వరుడు ఏదో వర్ణింపనలవిగాని గర్వముతో ఉన్నాడని భావం. ఇక్కడ 'కోఽపి' శబ్దం సర్వనామం. దీని ప్రయోగం వలన అతని గర్వం అతనికే గోచరమవుతుంది. కనుక ఇది కూడా వైచిత్ర్యమే.

### 4.1.10.5.1. కర్మాది సంవృతి – సమన్వయం

**శా॥ ఏమో గ్రొత్త యపూర్వవార్త వినుచేమోచెప్పుచున్, దండ నా**
**థా మాత్యాదులు పాదచారమున సేవాసక్తిమైఁ గొల్చిరా**
**భూమీశాగ్రణి సొచ్చెఁ బట్టణము సంపూర్ణానురాగంబుతో**
**భామానేత్ర చకోర చుంబిత ముఖప్రాలేయరుగ్బింబుఁడై**

**(శృ.నై.సప్త.ఆశ్వా.19 పద్యం)**

అమాత్యాదులు వచించే వింత వార్తలను వింటూ, వాళ్ళతో ఏమేమో వచిస్తూ నలమహారాజు సంపూర్ణ ప్రీతితో పురప్రవేశము చేసాడు. మంత్రి దండనాథాదులు కలిసి రాజుతో నడిచారు. ఇక్కడ నలరాజు అప్రయత్నంగా ఏమేమో వింటున్నాడు. ఏమేమో చెప్తున్నాడు. అనే సర్వనామాలు సౌందర్యహేతుకమైనవని చెప్తూ ఇది కర్మాది సంవృతికి ఉదాహరణగా చెప్పవచ్చు. జంధ్యాల జయకృష్ణ బాపూజీ కూడా ఈ పద్యాన్ని కర్మాది సంవృతికి ఉదాహరణగా ఇచ్చారు.

## 4.2. పదపరార్ధ వక్రత

కుంతకుడు పద పూర్వార్ధ వక్రతను తెలిపిన తర్వాత పదపరార్ధ వక్రతను అంటే పద ప్రత్యయరూపమైన వక్రతను వివరించాడు.

పద ఉత్తరార్థాన్ని అనుసరించి వచ్చిన వైచిత్రీ విశేషణాన్ని ఆరు రకాలుగా చెప్పాడు.

1) కాల వైచిత్ర్య వక్రత, 2) కారక వక్రత, 3) సంఖ్యా వక్రత, 4) పురుష వక్రత, 5) ఉపగ్రహ వక్రత 6) ప్రత్యయ వక్రత.

### 4.2.1. కాలవైచిత్ర్య వక్రత

కాల వైచిత్ర్యాన్ని ఇలా వివరించాడు.

**కా॥ ఔచిత్యాన్తరతమ్యేన సమయోరమణీయతామ్**

**యాతియత్రభవత్యేషా కాలవైచిత్ర్య వక్రతా**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.26)**

ఎక్కడైతే ప్రస్తుత వస్తువుకు రమణీయత చేకూర్చడానికి కాలానికి రమణీయతను చేకూర్చితే అది కాల వైచిత్ర్య వక్రత. ఇందుకు ఉదాహరణగా ఒక శ్లోకాన్ని ఉదాహరించాడు.

**"యావత్కించిదపూర్వమార్ద్రమన సామావేదయన్తోనవాః**
**సౌభాగ్యాతిశయస్య కామపిదశాం గన్తుం వ్యవస్యన్త్యమీ**
**భావాస్తావదనన్య జస్య విధురః కోఽప్యుద్యమో జృమ్భతే**
**పర్యాప్తే మధు విభ్రమే తు కిమయా కర్తేతి కమ్పామహే"**

**(వ.జీ.పుట.239)**

వసంత కాల వర్ణన ఇది. మన్మథుని మనోహర ఉద్యమం విజృంబిస్తున్నది. వసంత విభ్రమం పూర్తి అయిన తర్వాత మన్మథుడు ఏమి చేయుచున్నాడో అని వణుకుతున్నాము అని ఈ శ్లోకార్థం. ఇక్కడ 'వ్యవస్యన్తి' ఉద్యమించుచున్నది. 'జృమ్భతే' విజృంభించుచున్నాడు. 'కర్తా' ఏమి చేయనున్నాడో అనే కాల సంబంధ విషయాల ద్వారా ప్రస్తుతానికి సౌందర్యం ఏర్పడింది కనుక కాలవైచిత్ర్యంగా చెప్పాడు. వర్తమాన, భవిష్యత్కాల సూచన ఉంది. ఇందులోని పదాంత ప్రత్యయాల వలన ప్రత్యేక కాల సూచనం ఉంది కాబట్టి ఇది పదపరార్థ వక్రతగా తెలిపాడు.

### 4.2.1.1. కాలవైచిత్ర్య వక్రత – సమన్వయం

**ఉ॥ నేడు కృతార్థులైరి జననీజనకుల్ఫలియించెఁ బుణ్యముల్**
**నేడు పురాకృతంబులవనీరుహ మూల నివాసియైన కా**
**ట్రేడిలు వేల్పు నేడ యొనరించె మనోరథ సిద్ధి సంపదల్**
**నేడు గదా (సువారమిది నీ కృప) గంటి ధరాసురోత్తమా**

**(శివ.తృతీ.ఆశ్వా.09 పద్యం)**

మాలెత సుకుమారునితో మాట్లాడే సందర్భంలోనిదీపద్యం. నేడు నా తల్లిదండ్రులు ధన్యులైరి, నేడు పూర్వజన్మ పుణ్యకార్యం ఫలించెను. నేడు గదా సుదినం అంటూ మాలెత ఆనందాతిశయాన్ని వ్యక్తం చేసిన ఘట్టం. 'నేడు' అనే పదం వర్తమాన కాలాన్ని సూచించింది. ప్రతీసారీ నేడు అనే కాలవాచక పదం వాడటం వలన ఎన్నో రోజుల తరబడి ఎదురుచూసిన సౌఖ్యం, కల నెరవేరిందని

జీవత పరమార్థం లభించిందని చెప్పకనే ఆ పదం చెప్తుంది. ఇక్కడ కాల పదానికి ప్రాముఖ్యత ఇవ్వటం కూడా కాలవైచిత్ర్య వక్రతే.

**ఉ॥ పంచశరుండుఁ దత్పరత బాణ విమోక్షణ కాలముం బ్రతీ**
**క్షించుచు గౌరి శంకరునిఁ జేరినయప్పటినుండి యెప్డు మ**
**న్నించునొకో హరుండు తరుణీమణి నంచును వింట నారి సా**
**రించుచునుండెఁ జెంత నురరీకృత దైవత కార్యధుర్యుఁడై**

**(హర.తృతీ.ఆశ్వా.77 పద్యం)**

పార్వతి శంకరుని సమీపించినది మొదలు దైవకార్యంలో నిమగ్నుడైన మన్మథుడు, ఆమె సపర్యలను శివుడు ఎప్పుడు మన్నించునో? అంటూ బాణాన్ని వదలడానికి ఎదురు చూస్తూ ఉన్నాడు. ఇందులో ఎపుడు 'మన్నించునో' అనే పదం భవిష్యత్ కాలసూచి. అలాగే మన్మథుడు వేచి చూడటం కూడా కాలసంబంధి. శివుని కృపకై ఎదురుచూడటాన్ని వైచిత్ర్యంగా చెప్పాడు కవి.

**ఉ॥ పల్లవపుష్పభంగములు పాదసరోరుహయుగ్మకంబుపైఁ**
**జల్లి శ్రవోవతంసమగు సంపగి మొగ్గ యొకింత జాఱఁగా**
**నల్లనఁ మొక్కెఁ బార్వతి భయంబును భక్తియు సంభ్రమంబు సం**
**ధిల్లఁగ భావి భర్తకు ఫణిప్రభుహారున కంధకారికిన్**

**(హర.తృతీ.ఆశ్వా.75 పద్యం)**

ఇది పార్వతీ శివున్ని మ్రొక్కుతున్న సందర్భం. చిగురుటాకులు, పూలరేకులు, శివుని పాదాలపై చల్లి, భయంతో, భక్తితో, సంతోషంతో భవిష్యత్తులో భర్త కానున్న ఈశ్వరునికి మ్రొక్కిందని భావం. ఇక్కడ 'భావి భర్తకు ఫణిప్రభుహారునకు' అనటంలోనే సౌందర్యం ఉంది. భర్త కాకముందే భవిష్యత్తును సూచిస్తూ 'భావిభర్తకు' అనటం కాలసూచనం. 'భావి' పదం భవిష్యత్ కాలవాచి. దీనివలనే సౌందర్యం ఏర్పడటం వలన కాలవైచిత్ర్య వక్రత. ఈ పద ప్రయోగం ఈశ్వరునిపై పార్వతికి గల అనురాగాన్ని, వారి బాంధవ్యాన్ని తెలియజేస్తుంది.

### 4.2.2. కారకవక్రత

**కా॥ యత్ర కారక సామాన్యం ప్రాధాన్యేన విబధ్యతే।**
**తత్వాధ్యారోపణాన్ముఖ్యగుణభావాభిధానతః॥**

**కా॥ పరిపోషయితుం కాఞ్చిత్ భఙ్గీభణితిరమ్యతామ్।**

**కారకాణాం విపర్యాసః సోక్తా కారకవక్రతా॥**

**(వ.జీ.ద్వి.ఉన్మే.కా. 27,28)**

కావ్య రమణీయతను సాధించడానికి సామాన్యమైన కారకానికి ప్రాధాన్యతను కూర్చడం, అలాగే ప్రధాన కారకానికి గౌణత్వం చెప్పటం, ఈ రకమైన కారక విపర్యాసమునే కారక వక్రత అంటారు. కర్తను ప్రధానంగా చెప్పాల్సినపుడు కరణంతో చెప్పటం. ముఖ్యమైన దాన్ని వదిలి అముఖ్యమైన దానికి ప్రాధాన్యం ఇలాంటివి కారక వక్రత కిందికి వస్తాయి. దీనికి కుంతకుడు ఒక శ్లోకాన్ని ఉదాహరించాడు. అందులో చివరి చరణం చూద్దాం.

**"పాణిః సంప్రతి మేహతాత్ కిమపరం స్ప్రష్టుం ధనుర్వాఞ్ఛతి".**

**(వ.జీ.పుట.241)**

దీని అర్థం ఇక్కడ నా హస్తాలు హఠాత్తుగా ధనుస్సును స్పృశించడానికి పరుగెత్తుతున్నాయని చెప్పబడ్డది. నేనే ధనుస్సును తీసుకోవడానికి వెళ్తున్నాను అని కర్తకు ప్రాధాన్యం ఇవ్వకుండా కరణం అయిన హస్తాలకు ప్రాధాన్యం ఇవ్వడం వలన ఇది కారక వక్రత.

### 4.2.2.1. కారకవక్రత – సమన్వయం

**పక్షము పెంపునం గుసుమ బాణుని మీఁదనెవ్రాలె దేవతా**

**ధ్యక్షుని వేయికన్నులును దక్కిన వేల్పుల నుజ్జగించి సూ**

**క్ష్మేక్షికం జూడఁ గార్యగతి యిట్టిదయా ప్రభువుల్ ప్రయోజనా**

**పేక్ష నొకప్పుడాశ్రితుల కీరె సమంచిత గౌరవోన్నతుల్**

**(హర.తృతీ.ఆశ్వా.39 పద్యం)**

మనస్సులో ప్రేమ అధికమై ఇంద్రుని కన్నులు మన్మథునిపైనే వ్రాలాయి. మిగిలిన దేవతలను విడిచి ఒక్కోసారి ప్రయోజనాన్ని ఆశించి, ఆశ్రితుల మీద ఉన్న గౌరవాదరాలను చూపుతారు. వారిపై దృష్టి సారిస్తారని భావం. మన్మథునిపై ఇంద్రుని చూపు పడిందని చెప్పకుండా కన్నులు వాలెనని చెప్పడం కారక వక్రత. ప్రధాన కారకం ఇంద్రుడు కర్త. గౌణ కారకం కన్నులు. కన్నులే ప్రధానంగా చెప్పటం వైచిత్ర్యం కనుక కారక వక్రత. ఈ పద్యాన్ని కారక వక్రతలో భాగంగా జంధ్యాల జయకృష్ణ బాపూజీ కూడా ఉదహరించారు.

సీ॥ దంతక్షత వ్యథాదాయి కాస్యమునకు
దంతక్షత వ్యథ దండు వయ్యెఁ
గుచకుంభ మర్దన క్రూర కర్మంబైన
కరము పాదము లొత్తి కరుణ వడసె
దీప మార్చిన యప్డు దీప్తి సూపిన కల్ల
మౌళి రత్నము మ్రొక్కిమాన్చికొనియె
నొత్తిన తప్పువో నుడిపెఁ గ్రీడాశ్రాంతి
నమృతంబు గురిసి దివ్యాభరణము

(శృ.నై.సప్త.ఆశ్వా.192 పద్యం)

మన్మథ కేళీ సమయంలో నలుని హస్తం దమయంతి పాదాలను ఒత్తి మన్నన పొందింది. దీపమార్పిన యపుడు మౌళి రత్నం అపరాధాన్ని మాన్పించుకుంది. ఇక్కడ కర్త కారకం నలుడు. కరణాలు, మౌళి రత్నం గౌణాలు. అవే మన్నించమని కోరి మన్నన పొందినట్లు చెప్పబడింది. గౌణ కారకాలకు ప్రాధాన్యం ఇవ్వటంతో ఒకానొక వైచిత్ర్యం ఏర్పడింది. ఇది కారక వక్రత. కరణం అయిన హస్తాలకు ప్రాధాన్యం ఇవ్వబడింది. రాజు కాకుండా చేతులే పాదాలను ఒత్తాయని కవి వర్ణన.

శా॥ నీలావణ్య పయోబ్ధియందు నలరున్ నేత్రాబ్జముల్, నీ మనో
జ్ఞాలా పంబులయందుఁ గర్ణములు, నీయాలింగన ప్రక్రియా
కేలిన్ మేనులు, నీ ముఖాస్వదన సక్తిన్నాలుకల్, మాకు, నో
బాలా, స్వప్న సమాగంబుల నిశా పర్యంత యామంబులన్

(శృ.నై.చతు.ఆశ్వా.45 పద్యం)

దివ్యులు దమయంతి లావణ్యాన్ని పొగుడుతున్న సందర్భం ఇది. నీ లావణ్య పయోబ్దిలో మా నేత్రాలు, నీ మనోజ్ఞాలాపంలో కర్ణాలు, నీ ఆలింగనంలో మేనులు సంతోషిస్తాయని భావం. ఇక్కడ ప్రధాన కారకాలు కర్తల గూర్చి చెప్పకుండా గౌణ కారకాలు అయిన నేత్రాలు, వీనులు, నాలుకలు, మేనులు ప్రధానంగా చెప్పడం వైచిత్ర్యం ప్రధాన కారకానికి గౌణత్వం ఏర్పడింది కనుక ఇది కారక వక్రత. రాజులు దమయంతిని కోరుకోవటం కాకుండా వారి అవయవాలు కోరుకున్నట్లు వర్ణించటం విశేషం.

### 4.2.3. సంఖ్యా వక్రత

**కా॥ కుర్వన్తి కావ్యవైచిత్రయ వివక్షాపరతన్త్రితాః।**

**యత్ర సంఖ్యావిపర్యాసం తాంసంఖ్యావక్రతావిదుః॥**

కావ్య సౌందర్యం ఆపాదించడానికి సంఖ్యా విపర్యాసం చేయడం సంఖ్యా వక్రత. ఏక వచనం చెప్పవలసిన చోట బహువచనం చెప్పటం, భిన్న వచనాలు చెప్పాల్సి వచ్చినప్పుడు సామానాధికరణం చెప్పటం సంఖ్యా వక్రతగా వివరించాడు. దీనికి పలు ఉదాహరణలిచ్చాడు కుంతకుడు. అందులో ఒకటి పరిశీలిద్దాం.

**"శాస్త్రాణి చక్షుర్నవమ్"**

**"శాస్త్రములు నూత్నమైన నేత్రము"**

**(వ.జీ.పుట.245)**

ఇక్కడ శాస్త్రము'లు' బహువచనం కాగా నేత్ర'ము' ఏక వచన ప్రత్యయం వాడటం సంఖ్యావక్రత.

### 4.2.3.1. సంఖ్యా వక్రత – సమన్వయం

**చ॥ మదగజరాజ కుంభముల మచ్చరికించు చురోజ కుంభముల్**

**గదిపి కలంత మేరయునుఁ గైకొని యున్నవి యెల్లవారికిన్**

**విదితముగాఁగ నిట్టి తటి నీ చెలి డెందమునందు నేమియుం**

**గదలక మాకు నుండ నవకాశము లేదు గదే కళావతీ**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.65 పద్యం)**

నలుడు కళావతితో మాట్లాడుతూ ఆమె సౌందర్యం జగత్ప్రసిద్ధం. అంతటి సౌందర్యవతి హృదయంలో (డెందము) నాకు చోటు లేదు. ఆ స్థలం స్తనాక్రాంతం అని తెలుపుతూ 'మాకునుండ నవకాశం' లేదంటాడు నలుడు. నాకు అనే ఏకవచనానికి బదులుగా 'మాకు' అనే గౌరవార్థక బహువచన ప్రయోగం కలదు. ఇది రాజు ఆత్మాభిమాన విషయాన్ని తెలుపుతుంది. సంఖ్యావక్రతగా చెప్పవచ్చు.

**తే॥ తోఁక చుక్కలఁ బోలు దృక్తోయజముల**

**వెలితి లేకుండ మీబోఁటి చెలులఁజూచుఁ;**

గాంత వీక్షింప దరగంటఁగాని మమ్ము
నేము నేసిన యపరాధమేమి? సెపుమ

(శృ.నై.అష్ట.ఆశ్వా.60 పద్యం)

నలుడు దమయంతీ చెలికత్తెతో మిమ్మల్ని చూసినట్లు కాంత నన్ను చూడటం లేదు. అరకంట చూస్తుంది కానీ నిండు కంట జూడటం లేదే. నేను చేసిన అపరాధమేమిటి? అని ప్రశ్నిస్తూ 'నేను' అనే ఏక వచనానికి బదలు 'మేము' చేసిన అపరాధం ఏమిటని అడుగుతాడు. నన్ను చూడటం లేదు అనడానికి బదులు 'మమ్ము' అని అంటాడు. ఈ బహువచనాలు ఆ రాజు గొప్పతనాన్ని, గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని తెలుపుతూ మహారాజు వైభవాన్ని, మర్యాద పూర్వకంగా తెలుపుతున్నాయి.

క॥ నవమాసంబులు నిండిన
ధవళేక్షణ గాంచె సుతు సుధాకరతారా
రవి బుధ ధిషణ విధుంతుద
కవులుచ్చముగను నమృతఘటికలు నడువన్

(శివ.ద్వితీ.ఆశ్వా.65 పద్యం)

సుకుమారుని జనన ప్రస్తావనలోని పద్యం. తొమ్మిది నెలలు నిండగా చంద్రుడు, నక్షత్రాదులు ఉచ్చస్థితిలో ఉండగా అమృత గడియలు ప్రవర్తిల్లే సమయంలో సుశీలపుత్రున్ని కన్నదని భావం. 'నవమాసంబులు' అనే పద ప్రయోగం కాలవాచి, అలాగే 'అమృత ఘటికలు' అనేది కూడా కాల సంబంధ విషయం తెల్పేదే. వీటిని తెల్పడం వలన ప్రస్తుత వస్తువుకు సహజ సౌకుమార్యం చేరింది. అలాగే అమృత ఘటికలు అనే దాని వలన గొప్పతనాన్ని కాలాన్ని తెల్పడమే కాక శిశువు అదృష్టాన్ని తెలియజేస్తుంది. కాలపద ప్రయోగం వలన వస్తువుకు సహజమైన రమణీయత ఏర్పడింది. ఇది కాలవైచిత్ర్య వక్రత.

### 4.2.4. పురుష వక్రత

ప్రత్యక్తా పరభావశ్చ విపర్యాసేన యోజ్యతే
యత్ర విచ్ఛిత్తయే సైషాజ్ఞేయా పురుషవక్రతా

(వ.జీ.ద్వి.ఉన్మే.కా.30)

ఎక్కడైతే స్వత్వము అంటే తనకు తాను అని చెప్పుకోక ఇతరుల గూర్చి చెప్పినట్లుగా భాషిస్తే అది పురుష వక్రత. ఉత్తమ, ప్రథమ, మధ్యమ పురుషలలో ఒకదానికి బదులుగా ఇంకొకటి వాడటమే పురుష వక్రత. ఉదాహరణగా ఒక శ్లోకానిచ్చాడు కుంతకుడు.

**"కౌశామ్బీం పరిభూయనః కృపణకైర్విద్వేషిభిః స్వీకృతాం**
**జానామ్యే(త్యే?) వ తథా ప్రమాదపరతాం పత్యుర్నయద్వేషిణః"**

**"స్త్రీణాం చ ప్రియ విప్రయోగ విధురం చేతః సదైవాత్ర మే**
**వక్తుం నోత్సహతే మనః పరమతో జానాతు దేవీ! స్వయమ్"**

**(వ.జీ.పుట.245)**

ఇది కథ మధ్యలో భాగం గల శ్లోకం. నీచులైన శత్రువులు కౌశాంబీ నగరాన్ని ఆక్రమించారని తెలుసు, స్త్రీల మనసు ప్రియుని వియోగముచే బాధపడుతుందని తెలుసు. నాకు ఏమి చెప్పాలని లేదు అంతా దేవికే తెలుసు కదా అనుకున్నాను అని అర్థం. ఇక్కడ ఒక స్త్రీతో పురుషుడు మాట్లాడుతున్న సంభాషణ అంతా మీకే తెలుసు కదా అని యుష్మదర్థక వాక్యం పలుకకా 'దేవీ'కే తెలుసునని ప్రథమ పురుష పదాన్ని వాడటం వలన ఆమెకు అధికారం ఉంది కనుక ఏది హితమో కాదో తెలుసుకునే శక్తి సామార్థ్యాలు కలదనే విషయం చెప్పకనే చెప్పటం ఇక్కడ పురుష వక్రత వైచిత్ర్యం.

### 4.2.4.1. పురుష వక్రత – సమన్వయం

**తే॥ వలతునే భక్తకోటికి వారిజాక్షి**
**లలన! యా భక్తకోటియు వలచు నాకు**
**"భక్తిగతి లింగపతి" యను ప్రాఁత మాట**
**నేఁడుగాఁ గల్గెనే యలినీలవేణి**

**(హర.ద్వితీ.ఆశ్వా.13 పద్యం)**

శివుడు పార్వతి సంభాషణ ఇది. దేహం చెమర్చుట గూర్చి విశదీకరిస్తూ నేను భక్తులను వలతును, నన్ను భక్తులు వలతురు అని అంటాడు. ఈశ్వరుడు భక్తులవాడే అనే మాట ఇప్పటిది కాదు అంటూ 'భక్తిగతి లింగపతి' అంటాడు. నేను అనే ఉత్తమ పురుష పదాన్ని వాడక అన్యున్ని చెప్పినట్లుగా 'లింగపతి' భక్తులవాడే అని ప్రథమ పురుషలో చెప్పటం కవి చేసిన వైచిత్ర్యం. లింగపతి అనటంలో కొంత సౌందర్యం ఉన్నది కనుక పురుష వక్రత.

తే॥ వనిత హృదయంలోనున్నవాఁడ వీవు
నీ ప్రతిచ్ఛాయ మదనుండు నృపవరేణ్య
యట్లు గాకున్న, నశరీరుఁ డయిన యతఁడు
పుణ్య శుభమూర్తి దేవరఁబోలు టెట్లు

(శృ.నై.అష్ట.ఆశ్వా.58 పద్యం)

ఓ రాజోత్తమా దమయంతి హృదయంలో ఉన్నవాడివి నీవే. నీ ప్రతిబింబమే మన్మథుడు. కాకపోతే అశరీరుడైన మన్మథుడు ఈ దేవరను (దొరను) ఎలా పోలి ఉంటాడని దమయంతి నెచ్చెలి పలుకుతుంది. నిన్ను మన్మథుడు ఎలా పోలి ఉంటాడు అనడానికి బదులు 'దేవరబోలుటెట్లు' ఈ దొరను ఎలా పోలి ఉంటాడని ప్రథమ పురుషలో భాషిస్తుంది. మధ్యమ పురుషగా మిమ్ము అనడానికి బదులుగా 'దేవర' అంటూ ప్రథమలో వాడటం ఉక్తి వైచిత్ర్యం కనుక పురుష వక్రత. ఎదురుగా ఉన్నా లేనట్లుగా మనోహరంగా చెప్పటం.

గీ॥ (ప్రణవ శతరుద్ర్య)మును నధర్వంబు శిఖియుం
బవన గీతియుం ద్వరితంబు బౌరుషంబు
నీల రుద్ర్యంబుం బఠియుంచు నియతి నెవ్వం
డతని నాకూర్మి భక్తుంగా నాత్మందలంపు

(శివ.పంచ.ఆశ్వా.46 పద్యం)

శివుడు యమునితో సంభాషిస్తూ నా భక్తుల వద్దకు నీవు పోవలదని వారిస్తాడు. ఆ చెప్పే సందర్భంలో ప్రణవ శతరుద్రమును, అథర్వమును, శిఖిని, పవనగీతిని, నీలరుద్ర్యంబును, పఠించే వానిని నా ప్రియ భక్తునిగా ఆత్మలో ఉంచుకో అంటాడు. ఇక్కడ రుద్రుడే నీలరుద్ర్యంబు, ప్రణవశతరుద్ర్యంబు చదివేవాడని ప్రథమ పురుషలో వేరే వారిని ఉద్దేశించి చెప్పినట్లు చెప్పటం విశేషం. ఉత్తమ పురుషకు బదులుగా ప్రథమ పురుష వాడటం ఇక్కడి వైచిత్ర్యం. దీని వలన శివుని ఔన్నత్యం దీప్తమవుతుంది. తనకు తానే రుద్రుడిగా పొగుడు కోవటం విశేషం.

### 4.2.5. ఉపగ్రహ వక్రత

కా॥ పదయోరుభయోరేకమౌచిత్యాద్వినియుజ్యతే।
శోభాయై యత్ర జల్పన్తి తాముపగ్రహ వక్రతామ్॥

ఔచిత్యం బట్టి, కావ్యశోభ కొరకు పరస్మైపది, ఆత్మనే పది పదాలను ఒకదాన్ని వాడినట్లయితే అది ఉపగ్రహ వక్రత. ఇక్కడ ఉపగ్రహ అంటే పరస్మైపది, ఆత్మనేపది అనే పదాలుగా భావించాలి. దీనికి ఉదాహరణగా రఘువంశంలోని శ్లోకాన్ని ఉదాహరించాడు కుంతకుడు.

**తస్యాపరేష్వపి మృగేషు శరాన్ముముక్షోః**

**కర్ణాన్తమేత్య బిభిదే నిబిడోఽపి ముష్టిః**

**త్రాసాతి మాత్రచటులైః స్మరయత్సునేత్రైః**

**ప్రౌఢ ప్రియానయన విభ్రమ చేష్టితాని**

**(వ.జీ.పుట.247)**

భయంతో చంచల నేత్రాలు కలిగిన ప్రియురాలిలాగ ఉన్న మృగాలపై బాణాలు వెయ్యడానికి ప్రయత్నిస్తూ పిడికిలిని బిగించి చెవి వరకు వెళ్ళగానే ఆ పిడికిలి వదులైపోయెను అని ఈ శ్లోకార్థం. ఇక్కడ రాజు ప్రయత్నం ఆగిపోయి పిడికిలి స్వయంగా తనకు తానే వదులైపోయిందనటం ఆత్మనేపది. వదిలివేసాడు అనకుండా వదులైపోయింది అనటం ఇక్కడ ఉపగ్రహ వైచిత్ర్యం.

### 4.2.5.1. ఉపగ్రహ వక్రత సమన్వయం

**ఆ.వె. గ్రుచ్చి కౌఁగిలించుకొని యమ్మహీధర**

**సార్వభౌముదేవి చతుర భంగి**

**బుజ్జగించి కూర్మి పొంపిరి వోవంగ**

**హితమితోక్తిఁ బుత్రి కిట్టులనియె**

**(హర.చతు.ఆశ్వా.5 పద్యం)**

పార్వతి దేవిని హిమవంతుని భార్య అయిన మేనక దగ్గరకు తీసుకొని, కౌగలించుకొని, ప్రేమ అతిశయించే విధంగా, బుజ్జగించి, హితవు తెల్పుతుందని భావం. శివుడు దృష్టి పెట్టలేదని బాధపడుతుండగా కుమార్తెను ఒళ్ళోకి తీసుకొన్నది మేనక. గాఢంగా కౌగిలించుకొన్నదనే విషయాన్ని కవి చెప్తూ 'గ్రుచ్చి కౌగిలించుకొని' అంటాడు కవి. 'కొని' పదం ఆత్మనేపదిని సూచిస్తుంది. కౌగలించింది అని చెప్పవచ్చు కానీ 'కౌగలించుకొని' అని చెప్పటంలోనే తనది అనే భావన, ప్రేమానురాగం, లాలన అతిశయిస్తుంది కనుక ఉపగ్రహ వక్రత.

**గీ॥ మకరకేతను పాదపద్మములు సాక్షి**

**రతిమహాదేవి జఘన భారంబు సాక్షి**

**సత్యమెన్నడు నినుఁబాయ సమ్మతించి**

**కౌగలింపగ నీఁగదే కమలవదన!**

**(శివ.తృతీ.ఆశ్వా.83 పద్యం)**

సుకుమారుడు మాలెతతో ఎప్పటికీ విడువనని తెల్పి, మన్మథుని సాక్షి, రతీదేవి సాక్షి, సత్యంగా విడువను నిన్ను నన్ను కౌగలించుకొనియ్యవా? అని అంటాడు. ఇది ఆత్మనేపది. తన సంపదగా భావించినట్లు, తన దేహమే అది అనే విషయాన్ని చెప్పకనే చెప్తున్నట్లు ఆ ఒక్క పదంలోనే తెలియటం వలన ఉపగ్రహ వక్రత.

**తే॥ అఖిల మోహినియైన యయ్యలరుఁ బోణి**

**శైశవము వీడుకొన్నది సందు గాఁగ**

**ననుదినంబును రాజనందనుల మీఁద**

**వేఁట లాడుచునున్నాఁడు విషమశరుఁడు**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.26 పద్యం)**

దమయంతి యౌవనానికి వచ్చిందనే విషయాన్ని చెప్తూ శైశవం వీడిపోయిందని పరస్మైపదిగా చెప్పవచ్చు. 'శైశవము వీడుకొన్నది' తనకు తానుగా బాల్యాన్ని విడిచిపెట్టుకొన్నదని ఆత్మనేపద ప్రయోగం. కొంత వైచిత్ర్యాన్ని ఇచ్చింది. కనుక ఉపగ్రహ వక్రత. దమయంతే వీడుకొన్నదని చెప్పటం సౌందర్యహేతువైంది.

**తే॥ ధరణినాథానేందు సుధారసంబు**

**సౌధజాల మృణాళికా జాలకముల**

**నుత్పలాక్షీ కటాక్ష నీలోత్పలములు**

**ప్రేమమున దప్పి వోవంగఁ బీల్చికొనియె**

**(శృ.నై.సప్త.ఆశ్వా.22 పద్యం)**

నలుని పురప్రవేశనం చేస్తుండగా అక్కడి స్త్రీలు నలుని ముఖచంద్రుడనే అమృతాన్ని కిటికిలనే తామర తూడులతో తనివితీరా పీల్చుకొంటున్నారు. "పీల్చికొనియె" అనే పదం ఆత్మనేపది. పీల్చారు

అని పరస్మైపదిలో చెప్పకపోవటమే సౌందర్యం. కావాలని, ప్రేమాతిశయాలను మీరే విధంగా వారి అనురాగ దప్పికను ఈ పదం తెల్పుతున్నది కనుక ఉపగ్రహ వక్రత.

### 4.2.6. ప్రత్యయ వక్రత

**కా॥ విహితః ప్రత్యయాదన్యః ప్రత్యయః కమనీయతామ్**

**యత్ర కామపి పుష్ణాతి సాన్యా ప్రత్యయ వక్రతా.**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.32)**

ఎక్కడైతే పద ఉత్తరార్థంలో వచ్చే ప్రత్యయం వల్ల సౌందర్యం చేకూరుతుందో అది ప్రత్యయ వక్రత. ఉదాహరణగా ఒక శ్లోకాన్ని పరిశీలిద్దాం.

**లీనం వస్తుని యేన సూక్ష్మసుభగం తత్త్వం గిరాకృష్యతే**
**నిర్మాతుం ప్రభవేన్మనో రమమిదం వాచైవయోవాబహిః**
**వన్దేద్వావపి తావహం కవివరౌ వన్దేతరాం తం పున**
**ర్యోవిజ్ఞాతపరిశ్రమోయమనయోర్భారావతాక్షమః**

**(వ.జీ.పుట.248)**

ఏ కవి వస్తువులో లీనమైన, సుందరమైన తత్త్వాన్ని వాక్కుతో ఆకర్షిస్తాడో, ఏ కవి మనోహరంగా బాహ్యప్రపంచాన్ని ఆవిష్కరించ సమర్థుడో ఆ ఇద్దరు కవులను నమస్కరిస్తున్నాను. కానీ వీళ్ళ శ్రమ ఎరిగి భారాన్ని తగ్గించే వానికి ఎక్కువగా నమస్కరిస్తున్నాని అర్థం. ఇక్కడ మూడవపాదంలో ‘వన్దేతరాం’ అనే ప్రత్యయం రావటం ప్రత్యయ వక్రతగా చెప్పబడ్డది. కేవలం ‘తరామ్’ అనే చిన్న ప్రత్యయం వలన అధికతరమైన, గొప్పనైన అర్థాన్నిచ్చింది.

### 4.2.6.1. ప్రత్యయ వక్రత – సమన్వయం

**తే॥ అట్లు పురుషోత్తముండైన యతని వలన**
**ముక్తి గాంచిన యాద్విజ ముఖ్యుఁడెలమి**
**డెందమునకును వాక్కునకందరాని**
**యధికతరమైన యానంద మనుభవించె**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.3 పద్యం)**

పురుషోత్తముడైన నలమహారాజు వలన విముక్తి పొందిన హంస మాటలకందని ఆనందాన్ని పొందిందని భావం. ఇక్కడ 'వాక్కున కందరాని యధికతరమైన' ఆనందాన్ని పొందిందని కవి చెప్పాడు. 'తరప్' ప్రత్యయాన్ని పదం చివరన వాడటం వలన పద్యానికి సౌందర్యం చేకూరింది. ఈ ప్రత్యయ ప్రయోగం వలన ఉన్నతమైన, చెప్పరాని, అధికమైన, మిక్కిలి, అనిర్వచనీయమైన సంతోషాన్ని చెప్పినట్లయ్యింది. ఇది ప్రత్యయం వలన కలిగిన వైచిత్ర్యం.

**తే॥ దేవమునిమాట లమృతంపుఁదేట లగుచు**
**నధికతరమైన యాహ్లాద మాచరింప**
**వేడ్కపడె నెమ్మనంబులో విబుధరాజు**
**భోజ కన్యా స్వయంవరంబునకుఁ బోవ**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.33 పద్యం)**

నారదుని మాటల వలన భీమరాజు సంతోషించాడనే విషయాన్ని కవి వర్ణించాడు. దేవముని మాటలు అమృతసారంలా ఉన్నాయట. అవి అధికతరమైన ఆహ్లాదాన్ని పంచాయట. "అధిక తరమైనయాహ్లాదమాచరింప" అని 'తరప్' ప్రత్యయాన్ని వాడటం ఆనందం మిక్కిలి ఎక్కువయ్యిందని తెల్పక తెల్పినట్లయ్యింది. కనుక ఇది ప్రత్యయ వక్రత.

**తే॥ అధికతరులైనఁగాని దిశాధిపతులు**
**కౌతుకము నాకు నీ వంశ కథల యందె**
**దప్పిగొన్నట్టి వారికాదప్పి దీఱ**
**సలిల పూరంబు హితవొ? యాజ్యంబు హితవొ?**

**(శృ.నై.చతు.ఆశ్వా.52 పద్యం)**

ఇంద్రాదులకు రాయబారిగా వచ్చి వారి గొప్పతనాన్ని నలుడు దమయంతికి చెప్తున్న సందర్భంలోనిది. దిశాధిపతులు గొప్పవాళ్ళైనా పర్వాలేదు. నెయ్యి గొప్పదని దాహానికి నీటికి బదులుగా తాగలేమని చెప్తుంది దమయంతి. 'అధికతరులైన గాని దిశాధిపతులు' అనే చోట 'తరప్' ప్రత్యయం వాడటం వలన రాజు కన్నా దిశాధిపతులు గొప్పవాళ్ళని వారి ఆధిక్యాన్ని చెప్పబడింది. కనుక ప్రత్యయ వక్రత.

**శా॥ ప్రీత్యుత్ఫుల్ల సఫాలనేత్రుఁడగు శ్రీ భీమేశ్వరస్వామిని**
**ష్ప్రత్యూహంబగు సౌహృదంబున హరిబ్రహ్మాదులన్ భ్రూలతా**
**ప్రత్యుద్బోధన సంజ్ఞచేసి కనుగిర్వంజాగె గంగోదకా**
**హత్యాక్షేప హృతి ప్రపంచములు దక్షారామ మధ్యంబునన్**

**(భీమే.పంచ.ఆశ్వా.114 పద్యం)**

భీమేశ్వరస్వామి సంతోషించి ఫాలనేత్రం వికసించింది. కనుబొమలు కదిలినవి. క్రీగంటి చూపుతో విష్ణువు బ్రహ్మ మొదలైన వారి వైపు ఆదరంగా చూశాడు. ఆ శివుని కనుబొమల కదలికతోనే దక్షారామంలో వసంతోత్సవం జరిగింది. కనుబొమ కదలికకు పై గంగాజలం కిందికి వచ్చిందని భావం. ఇక్కడ 'ప్రత్యూహంబు' పదానికి 'నిర్' ఉపసర్గ చేరి 'నిష్ప్రత్యూహంబు' పదం ప్రయోగించబడింది. అలాగే 'ఉద్బోధన' పదానికి 'ప్రతి' పదం చేరి 'ప్రత్యుద్బోధన' అయ్యింది. మిక్కిలి స్నేహంతో, బాగా ప్రేరేపించి, ఎలాంటి అడ్డులేని అనే అర్థాలను సౌహృదయం, ప్రత్యుద్బోధన, నిష్ప్రత్యూహం అనునవి ఇస్తున్నాయి. ఈ ఉపసర్గలు చేరిన పదాలు వాడటం వలన ఉక్తి వైచిత్ర్యం ఏర్పరుస్తూ అధికమైన అర్థాన్ని, విశిష్టమైన అర్థాన్ని పద్యానికి ఇస్తున్నాయి.

### 4.2.6.2. ఉపసర్గ వక్రత

పదపరార్ధ వక్రతలో భాగంగా కుంతకుడు సుప్తింగంత రూపాల్లో ప్రకృతిని వేరు చేసి రకరకాల వక్రతలు తెలిపాడు. తర్వాత ఉపసర్గ, నిపాతాలకు సంబంధించిన వక్రతను తెలిపాడు. ఉపసర్గ నిపాతాలకు ప్రకృతి ప్రత్యయ విభాగం ఉండదు కనుక వాటిని మొత్తం రూపంగా గ్రహించి వక్రతను తెలిపాడు కుంతకుడు.

"సంస్కృత వ్యాకరణముననుసరించి పదములు నాలుగు విధములు. 1) నామములు, 2) ఆఖ్యాతములు, 3) ఉపసర్గలు, మరియు 4) నిపాతములు. నామములనగా సంఖ్యా వాచక పదములు. ఆఖ్యాతములనగా ధాతువులు. ఉపసర్గములనగా ధాతువునకు పూర్వమందు చేర్పబడు ప్ర, పరా, అప, అను మొదలైనవి. నిపాతములనగా ఏమి, ఎట్లు, ఆహా, ఓహో మొదలగు అవ్యయములు" (జయకృష్ణబాపూజీ, జంధ్యాల.1977.పుట.391).

ఉపసర్గ వక్రతను ఇలా నిర్వచించాడు కుంతకుడు.

**కా॥ రసాదిద్యోతనం యస్యాముప సర్గనిపాతయోః।**

**వాక్యైక జీవితత్వేన సాపరా పదవక్రతా॥**

**(వ.జీ.ద్వితీ.ఉన్మే.కా.33)**

ఎక్కడైతే ఉపసర్గ, నిపాతాల వలన ప్రధానంగా కావ్యానికి జీవితం అయిన రసం కలుగుతుందో అది మరియొక రకమైన పదవక్రత అని అర్థం.

ఉపసర్గలైన, ప్ర, పర, అప, నిర్, నిస్, దుర్, దుస్ మొదలగు వాటి వలన వైచిత్ర్యం ఏర్పడటం ఉపసర్గ వక్రత. ఉపసర్గలు మొత్తం 22. వాటి గూర్చి సంస్కృత వ్యాకరణంలో ఇలా చెప్పారు. "ఉపసర్గాః క్రియాయోగే ప్రాదయః క్రియా యోగే ఉపసర్గ సంజ్ఞాః స్యుః" ప్రాదయః అను సూత్రం అనువర్తించును. ప్రాదులు క్రియాసంబంధ మేర్పడినపుడు ఉపసర్గ సంజ్ఞములగును. ప్ర, పరా, అప, సమ్, అను, అవ, నిస్, నిర్, దుస్, దుర్, వి, ఆఙ్, ని, అధి, అపి, అతి, సు, ఉత్, అభి, ప్రతి, పరి, ఉప, ఏతే ప్రాదయః ప్ర, పరా మొదలగు ఇరువది రెండును ప్రాదులు" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2010.పుట.30).

ఈ వక్రతకు కుంతకుడు ఒక శ్లోకాన్ని ఉదాహరణగా ఇచ్చాడు.

**అయమేకపదే తయా వియోగః**

**ప్రియయాచోపనతః సుదుః సహోమే**

**నవవారిధరోదయాదహో భి**

**ర్భవితవ్యం చ నిరాత పత్వరమ్యైః**

**(వ.జీ.పుట.251)**

"ఇచ్చట – పరస్పరము సుదుస్సహత్వముతోడను, ఉద్దీపన సామర్థ్యము తోడను కూడిన ప్రియావిరహ వర్షాకాలములు రెండును ఒకే కాలమున వచ్చి పడినవి అని చెప్పుటయే ప్రధానోద్దేశ్యముగా గల 'చ' శబ్ద ద్వయము, ఒకే సమయమున బయల్వెడిలిన అగ్నిదాహదక్షిణ వాయువుల వలన కలిగిన ఆపదవలెనున్నదని సమర్థించుచు ఒకానొక వాక్య వక్రతను వెలుగొందించుచున్నది. 'సు', 'దుః' అను శబ్దములు కూడ ప్రియవిరహమునకు ప్రతీకారమేదియును లేదు అను విషయమును సూచించుచున్నవి" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.250). ఇది ఉపసర్గ వక్రత.

#### 4.2.6.2.1. ఉపసర్గ వక్రత – సమన్వయం

తే.గీ.॥ చిత్తగింపుమనాది సంసిద్ధమైన
యొక్క పుణ్యేతిహాసమనూన చరిత
శిశింగిరి రాజ సంప్రతిష్ఠిత విశుద్ధ
రత్నలింగేశు మహిమ విభ్రాజితముగ

(కాశీ.షష్ఠా.ఆశ్వా.168 పద్యం)

ఓ మహిత చరిత్రుడా! అనాది నుండి ప్రసిద్ధమైన ఇతిహాసాన్ని విను దానివలన హిమాచల రాజు 'సంప్రతిష్ఠితమైన' రత్నేశ్వర లింగం మహిమ నీకు తెలుస్తుందని పద్య భావం. ఇక్కడ 'ప్రతిష్ఠితమైన' అని అంటే సరిపోతుంది కానీ 'సంప్రతిష్ఠితమైన' అనటంలో 'సం' అనే ఉపసర్గ ప్రతిష్ఠిత పదానికి ముందు చేరి ఆ పదానికి అర్థానికి విశిష్టమైన అర్థాన్నిచ్చింది. ఇదొక వైచిత్ర్యమే అంటాడు కుంతకుడు.

తే.గీ.॥ మేదినీధర విభ్యంగి మిన్నుముట్టి
నిట్టనిలుచుండి చూచె నిర్నిమిషదృష్టిఁ
దనయనుష్ఠానకాలంబుఁ దప్పకుండ
బ్రాహ్మణుఁడు తేపకడఁ బోలె భానుపొడుపు

(కాశీ.ప్రథ.ఆశ్వా.119 పద్యం)

వింధ్యా పర్వతం మిన్నంటి నిట్టనిటారుగా ప్రాతఃకాల సమయాన తన అనుష్ఠాన సమయం హెచ్చుతగ్గులు లేకుండా చూసుకునే బ్రాహ్మణుడిలాగా రెప్ప వాల్చకుండా సూర్యోదయం కోసం ఎదురుచూస్తుందని భావం. ఇక్కడ 'నిర్నిమిషదృష్టి' పదంలో 'నిర్' అనే ఉపసర్గ వాడబడింది. రెప్పపాటు లేకుండా చూడటంలో ప్రతీక్షణ, తపన ద్యోతకమవుతుంది. ఇది కూడా వైచిత్ర్యానికి కారణం అయ్యింది. సాధారణంగా ఎదురు చూసిందనడానికి బదులుగా 'నిర్నిమిషదృష్టి' అనటంలో తీవ్రత గోచరమయ్యింది.

తే॥ శ్రవణపూరతమాల పల్లవ చయంబు
మేపుదము వీనిలో నున్న మృగ శిశువున
కది ప్రవర్థన మొందెనే ముదితలార

**మండలం బెల్లఁ దానయై యుండుఁగాని**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.126 పద్యం)**

దమయంతి చెలులతో మాట్లాడుతూ చెలులారా ఈ చంద్రునిలో జింక పిల్లకు చీకటిమ్రాని చిగుళ్ళ మోపిచ్చి మేపుతాను. అప్పుడది వృద్ధి పొంది పెద్దగయి చంద్రున్ని ఆక్రమిస్తుందని అంటుంది. ఇక్కడ వృద్ధి పదానికి వర్ధనం అని వాడక 'ప్రవర్ధనం' అనే 'ప్ర' ఉపసర్గయుత పదాన్ని వాడటం వలన ఆ క్రియకు సౌందర్యం ఏర్పడి హెచ్చయిన వృద్ధి అనే అర్థాన్నిస్తుంది. ఇది ఉపసర్గ వలననే సాధ్యమయ్యింది.

### 4.2.6.3. నిపాత వక్రత

ముందు కారికలో చెప్పినట్లు నిపాతాల వలన కూడా సౌందర్యం ఏర్పడితే అది నిపాత వక్రత. దానికి ఉదాహరణను ఇలా ఇచ్చాడు.

**"వైదేహీతు కథం భవిష్యతి హహా హా దేవి ధీరా భవ"**

**"అక్కటా వైదేహి ఎట్లుండునో? అయ్యో దేవీ! ధైర్యము వహింపుము"**

**(వ.జీ.పుట.250)**

సీతాదేవిని రక్షించాలనుకున్న శ్రీరాముడు ఆ ఉత్సాహంతో సంతోషించి, ఆమెకు ఆపద కలుగుతుందేమోనని భావించి ధైర్యంగా ఉండమని కోరుకుంటాడు. ఇక్కడ రాముని సంతోషాన్ని తెలియజేస్తూ 'హహాహ' నిపాతం వాడటం జరిగింది. ఇది నిపాత వక్రతకు ఉదాహరణ.

### 4.2.6.3.1. నిపాత వక్రత – సమన్వయం

**శా॥ ఆహా! యింత మనోహరంబగునె దక్షారామ! మివ్వీటిలో**
**నీహారాంశు కళాకిరీటుఁడు భవానీ భర్త దివ్యాప్సరో**
**వ్యూహంబుల్ ప్రతి సంధ్యముం గొలువఁగా నున్నాఁడు గోదావరీ**
**వాహిన్యబ్ధి సమీర పానకలనా వర్ధిష్ణు కేయూరుఁడై**

**(భీమే.తృతీ.ఆశ్వా.125 పద్యం)**

ఆహా! దక్షారామం ఇంత మనోహరమైందా? ఈ పట్టణంలో చంద్రశేఖరుడు, భవానీ భర్తయగు శంకరుడు ప్రతిదినము సంధ్యాకాల సమయాన అప్సరసలు సేవింగా గోదావరీ సముద్రంపై నుండి వచ్చే గాలిని తాగిన సర్పాలు వృద్ధినొందగా వాటిని భుజకీర్తులుగా ధరించి ఉన్నాడని భావం. ఇక్కడ

'ఆహా!' అనే నిపాతం ఒక్కదాని వలన ఈ పద్యంలో ఆహ్లాదం, రమణీయకత, మానసికానందం వ్యక్తమయ్యాయని మొదటి పదమైన నిపాత ప్రయోగం వలననే తెలిసింది. ఏకపద ప్రయోగం వలన హర్షం వ్యక్తమైంది. రసాదిద్యోతక కారణం అయ్యింది. ఇది కూడా ఒక వైచిత్ర్యమే.

**చ॥ అహహ! దయారసానుగతమైన మనంబున దక్షవాటికా**
**గృహపతి భీమనాయకుఁడు కీట పతంగ సరీసృపాళికిన్**
**సహజ జహత్సమీరమగు సంకట కాలము వీనులందను**
**గ్రహ మొనరించునట్టి మధురంబగు తారక మంత్ర రాజమున్**

**(భీమే.తృతీ.ఆశ్వా.128 పద్యం)**

అహహ! దాక్షారామానికి యజమాని అయిన భీమేశ్వరుదు కరుణ రసంతో కూడిన మనస్సుతో మరణ సమయంలో పురుగులకు, పశుపక్ష్యాదులకు సైతం తారక మంత్రం వినిపిస్తాడని భావం. ఇక్కడ 'అహహ!' అనే నిపాతం ఆశ్చర్యానందాన్ని, వింతను తెలియజేస్తూ శివుని ఔన్నత్యాన్ని తెలుపుతుంది. శివుడు కరుణామయుడనే విషయాన్ని గోచరింపజేస్తూ కరుణరస ప్లావితమైన ఈ పద్యానికి రసాదిద్యోతకం అయ్యేలా చేసింది.

**కం.॥ ఏమి శకునమునఁ జొచ్చితి**
**మో? మన్మథదమను వీడహోరాత్రంబుల్**
**మే యేడు నాళ్ల దనుకను**
**స్వామీ! యుపవాసముండి జడిసితిమి మదిన్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.96 పద్యం)**

వ్యాసుదు కాశి విషయంలో అన్నం దొరకలేదని బాధపడుతూ స్వామీ! 'ఏమి శకునమునఁజొచ్చితి' అనటంలో ఏ చెడు సమయంలో అడుగుపెట్టామో? ఇన్ని కష్టాలు పడుతున్నాము అని సూచితమయ్యింది. ఏమి అనే పదంలో వేదన వ్యక్తం అయ్యింది కనుక ఇదొక వైచిత్ర్యం.

**గీ॥ ఎట్టు వేగింతు సంసార మిచట నుండి**
**యేల నినుఁ బాసి యొంటి నా కిచట నుండఁ**
**గలుగనిమ్ము బంధువులు పెక్కండ్రు నాకు**
**బంధువు గలండె నాకు నీ పాటివాఁడు**

(శివ.తృతీ.ఆశ్వా.135 పద్యం)

చండాలి సుకుమారునితో పలుకుతున్న సందర్భం. ఇక్కడ నుండు సంసారం ఎట్ట చేయుదును? నిన్ను విడిచి నేను ఎలా ఉండగలను. నాకు బంధువులు ఎక్కువగా ఉన్నా నీతో సరియగు వాడు లేడు కదా అనే సమయంలో 'ఎట్టు వేగింతు', 'ఎలానినుబాసియెంటి' అనే పదాల్లో ఎట్టు, ఎలా అనే నిపాత ప్రయోగం చండాలి వేదనను, ప్రశ్నార్థకమైన జీవితాన్ని హృదయంలో సంతాపాన్ని తెలియజేస్తున్నాయి. ఈ పదాల వలన ఇక్కడ కరుణపూరితమైన రసం ఉద్దీప్తమైంది. రసాది ద్యోతకానికి నిపాతం కారణం అయితే ఆ వైచిత్ర్యం కూడా వక్రతే అన్నాడు కుంతకుడు. దానికి నిదర్శనం ఈ శ్రీనాథుని పద్యం.

**తే॥ అక్కటకట! దురోదర వ్యసనమెట్లు?**
**యాయజూక విశిష్టాన్వవాయమెట్లు?**
**ఎట్లు చేసినఁ జేసెఁగా కేమనంగ**
**నేర్చువారము? విధి దయానిస్వహృదయి**

(కాశీ.చతు.ఆశ్వా.113 పద్యం)

గుణనిధి తన తప్పుల గూర్చి తానే బాధపడుతూ అక్కటకట ద్యూత వ్యసనం ఎట్లు, శిష్టుల మా వంశం ఎటువంటిది. దయా దరిద్రహృదయమైన ఈ విధి ఎలా చేసిన చేయగలదు. ఏమనాలి అని వ్యధకు గురి అవుతాడు 'అక్కటకట' అనే నిపాతం జరగాల్సింది జరిగి పోయింది. దుర్భర అవస్థలో ఉన్నాననే విషయం తెలియజేస్తుంది. 'ఎట్లు' అనే పదం ఎలా అధిగమించాలి. ఎలాంటి గొప్ప వంశం ఇలా అయ్యిందనే అర్థాన్ని తెలియజేస్తుంది. ఈ రెండు నిపాతాలు గుణనిధి పశ్చాత్తాప భావాన్ని, అతని నీచమైన పరిస్థితిని కన్నులకు కడుతున్నాయి. ఇది నిపాత వైచిత్ర్యానికి ఉదాహరణ.

**తే॥ అహహ! తెలిసితి విస్మయంబైన యర్థ**
**మేల సందేహ మందంగ హృదయవీథి?**
**సిద్ధ సంసేవితము సర్వసిద్ధి కరము**
**దర్శన స్పర్శనములఁ దీర్థముల రాజు**

(కాశీ.తృతీ.ఆశ్వా.230 పద్యం)

ఆహా! ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. ఇంకా సందేహించడం దేనికి. సిద్ధులచేత సేవింపబడిన, దర్శన, స్పర్శన మాత్రంతోనే సకల సిద్ధిప్రదమైన తీర్థరాజం ఈ కాశీక్షేత్రం అని అర్థం.

‘అహహ!’ అనే నిపాతం ఆనందాన్నిస్తూ, జన్మజన్మల పుణ్యం లభించే, సర్వసిద్ధిదాయిని అయిన తీర్థ క్షేత్ర మహాత్మ్యాన్ని కొనియాడింది. భక్తిపారవశ్యాన్ని తెలిపింది. ఇది కేవలం నిపాత వైచిత్ర్యం వలననే ఆ భావన వ్యక్తమైంది. పద్య సౌందర్య హేతుకమై, మనోహరమైంది.

★★★

# అధ్యాయం–5

# శ్రీనాథుని కవిత్వం–వాక్యవక్రత

## 5.1. స్వభావోక్తి – చర్చ

పదపూర్వార్ధ, పరార్ధ వక్రతలు తెలిపిన తర్వాత కుంతకుడు వాక్య వక్రతను ప్రస్తావించాడు. ఒక వక్రత ఉంటేనే కావ్యానికి రమణీయత చేకూరితే ఒకేసారి అనేక వక్రతలు ఒక్కచోట కలిస్తే అది ఇంకా ఎంతటి సౌందర్యాన్ని సంపాదిస్తుందని ప్రశ్నించుకొని దానికి సమాధానంగా ఈ కారికను చెప్తున్నాడు చూద్దాం.

**కా॥ పరస్పరస్య శోభాయై బహవః పతితాః క్వచిత్**
**ప్రకారా జనయన్త్యేతాం చిత్రచ్ఛాయా మనోహరామ్**

**(వ.జీ.ఉన్మే.ద్వితీ.కా. 34)**

అనేకాలైన వక్రతలు పదంలోగాని, వాక్యంలోగాని కలిసి పరస్పర శోభకొరకు చిత్రచ్ఛాయచేత మనోహరమైన, చమత్కారజనకమైన ఈ వక్రతను కూర్చుతాయని వాక్య వక్రతను ఉద్దేశించి చెప్పాడు. ఈ విధంగా ద్వితీయ ఉన్మేషంలో వాక్యానికి అవసరమయ్యే శబ్ద, పద వక్రతలను విచారించి తృతీయ ఉన్మేషంలో వాక్య వక్రతను నిరూపించాలని వాక్యార్థ వక్రతను తెలియజేశాడు. ఇందులో భాగంగా వస్తువక్రత అనే ఒక వక్రతా భేదాన్ని తెలియజేసాడు. వస్తువక్రత అనేది స్వభావోక్తి కాదని వివరించాడు.

ప్రథమోన్మేషంలో స్వభావోక్త్యాలంకార చర్చ చేసి స్వభావోక్తి అనేది అలంకారం కాదని తెలిపాడు. దండి, ఉద్భటాలంకారికులు స్వభావోక్తి అనేది అలంకారంగా చెప్పారు. కానీ కుంతకుడు దానిని నిరాకరిస్తూ ఇలా అంటాడు.

**కా॥ అలంకారకృతాం యేషాం స్వభావోక్తి రలంకృతిః।**
**అలంకార్యతయా తేషాం కిమన్యదవతిష్ఠతే॥**

**(వ.జీ.ప్రథ.ఉన్మే.కా.11)**

ఏ అలంకారికులు స్వభావోక్తి అలంకారం అంటున్నారో అది వస్తువు స్వభావం దానినే వాళ్ళు అలంకారం అంటే కావ్య శరీరంతో సమానమైన వేరొక వస్తువు దేనిని చూపెడతారని ప్రశ్నించాడు. అలాగే వాదిస్తూ మరొక కారికలో ఇలా అంటాడు.

**కా॥ స్వభావవ్యతిరేకేణ వస్తుమేవ న యుజ్యతే**
**వస్తు తద్రహితం యస్మాన్నిరుపాఖ్యం ప్రసజ్యతే**

(వ.జీ.ఉన్మే.ప్రథ.కారిక.12)

స్వభావం అనేది లేకుండా ఏ వస్తువు ఉండదు. స్వభావం లేని వస్తువును గూర్చి శబ్దంతో చెప్పటం సాధ్యం కాదని వివరించాడు.

**కా॥ శరీరం చేదలంకారః కిమలంకురుతేఽ పరమ్।**
**ఆత్మైవనాత్మనః స్కన్ధం క్వచిదప్యధిరోహతి॥**

(వ.జీ.ఉన్మే.ప్రథ.కా.13)

శరీరమే అలంకారం అయితే మరి అన్యము దేనిని అలంకరిస్తుంది. శరీరం శరీరభాగమైన భుజాన్నే ఎక్కలేదు. కాబట్టి స్వభావోక్తి అలంకారం కాదని తెలిపాడు. స్వభావానికి అవకాశాన్ని బట్టి శోభాతిశయాన్ని కలిగించడానికి ఏదో ఒక అలంకారాన్ని కూర్చాలని తెలియజేసాడు. ఇది ప్రథమోన్మేషంలోని చర్చ.

తృతీయోన్మేషంలో కుంతకుడు స్వభావోక్తి సంబంధమైన విషయాన్ని తెలుపుతూ దాని లక్షణాలు కలిగియున్న వక్రత ఒకటి కలదన్నట్లుగా వస్తు వక్రత అనే నూతనమైన పేరును తెలియజేసాడు. దానిని కొంత చర్చించాల్సిన అవసరముంది.

## 5.2. వస్తువక్రత

వస్తువక్రత అనేది ఒకటుందని తెలియజేస్తూ ఇలా వివరించాడు.

**కా॥ ఉదార స్వపరిస్పన్ద సున్దరత్వేన వర్ణనమ్।**
**వస్తునో వక్రశబ్దైక గోచరత్వేన వక్రతా॥**

(వ.జీ.తృతీ.ఉన్మే.కా.1)

వస్తు స్వభావ సౌకుమార్యం అనేది మ్లానం అయిపోకుండా, శబ్దం వలన ఏదైతే స్ఫురిస్తుందో ఉదారంగా, స్వభావసుందరంగా ఉండటమే వస్తు వక్రత అని తెలిపాడు. కుంతకుడు ప్రథమ ఉన్మేషంలో స్వభావోక్తి అలంకారం కాదని చెప్పి దానిని అలాగే కొనసాగిస్తూ యుక్తియుక్తంగా ఉండే విధంగా వస్తు వక్రత అంటారు అని చెప్పుతున్నాడు. వస్తు స్వభావ సౌందర్యాన్ని స్వభావోక్తి అనకూడదు వస్తువక్రత అనాలని ఎవరైతే ఈ లక్షణాన్ని స్వభావోక్తిగా భావించారో వారికి సమాధానాన్ని తెలిపాడు. దానికి ఉదాహరణగా కాళిదాసు కుమార సంభవ శ్లోకాన్ని ఉదహరించాడు. చూద్దాం.

**“తాంప్రాఙ్ముఖీం తత్ర నివేశ్య తన్వీం**
**క్షణంవ్యలంబంత పురో నిషణ్ణాః**

భూతార్థశోభా హ్రియమాణ నేత్రాః
ప్రసాధనే సన్నిహితేఽపి నార్యః

(వ.జీ.పుట.258)

కాళిదాసు పార్వతీ వివాహ ఘట్ట సమయంలో స్త్రీలు పార్వతిని ఆసనము మీద తూర్పు దిక్కుగా కూర్చుండబెట్టి, ఎదుట కూర్చున్న వాళ్ళు అలంకరణ సామగ్రి ముందే ఉన్నప్పటికి, ఆమె స్వాభావిక శోభతో ఆకర్షితులైన నేత్రాలు కలిగి క్షణకాలం ఆలస్యం చేశారని ఉన్నదున్నట్లు వర్ణించాడు. ఇది వస్తు వక్రతకు ఉదాహరణగా ఇచ్చాడు కుంతకుడు. ఇక్కడ అలంకారాలను కూర్చితే స్వభావ సౌందర్యం పోతుందని ఇది అలంకార భారశూన్యమైన వస్తువక్రతగా తెలిపాడు. పుల్లెల శ్రీరామచంద్రుడు వివరిస్తూ "అనగా సాతిశయమగు వస్తు స్వభావము అలంకార్యమే కాని 'స్వభావోక్తి' అలంకారము కాదని మా(కుంతకుని) అభిప్రాయము. సాతిశయ వస్తు స్వభావము అలంకార్యమేయైనను అదియే స్వయముగ శోభాతిశయమును కూర్ప సమర్థముగాన దానిపై మరియొక అలంకారమును చేర్చుట కుదరదు. ఈ అభిప్రాయముతోడనే మేము (పూర్వపక్షి) దీనిని అలంకారమనుచున్నాము – అని యున్నచో అది మా పక్షమే గాన మాకు విప్రతిపత్తి లేదు అని సిద్ధాంతి అభిప్రాయము".

"వ్యా. సాతిశయ స్వభావ భిన్నమగు మరియొక అలంకారమేదియు ఇచట చేర్చుట పొసగదు అనునభిప్రాయముతో మీరు దానిని (సాతిశయస్వభావమును) (స్వభావోక్త్యలంకారమని) చెప్పుచున్నారుగాన మాకును ఈ విషయమున వివాదము లేదు" (శ్రీరామచంద్రుడు, పుల్లెల . 2007.పుట.263) అన్నారు.

వస్తువక్రత స్వభావోక్తి తేడా లేదని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానించాడు. వస్తువు వక్రత సహజంగా ఉంటుంది అలాగే ఇంకొక రకంగా కూడా ఉంటుందని తెలిపాడు.

కా॥ అపరా సహజాహార్య కవి కౌశల శాలినీ।
నిర్మితిర్నూతనోల్లేఖలో కాతిక్రాన్తగోచరా॥

(వ.జీ.ఉన్మే.తృతీ.కా.2)

సహజము, ఆహార్యము అయిన కవి కౌశలంచేత, ప్రకాశించేది నూతనమైన ఉల్లేఖాలచేత లోకాతీతమయ్యేది రెండవ వస్తుప్రకారం అని చెప్పాడు.

"ఈ వర్ణనీయ వస్తు వక్రత సహజాహార్య భేదభిన్నమై రెండు విధములగ నున్నది (సహజ శక్తిచే కూర్చబడినది సహజ వక్రత. వ్యుత్పత్త్యభ్యాసాదులచే లభించినది ఆహార్య వక్రత). ఆహార్య

వక్రత, ప్రస్తుత విచ్ఛిత్తి స్వరూపమైనదే యైనను, అలంకారములు లేకుండగ ఆ విధముగను ఉపపన్నము కాదు. కావున బహువిధములగు ఆ అలంకారముల భేదముల ద్వారా (ఆహార్య వక్రతా సంబద్ధములగు) పదార్థములు విస్తృత వ్యవహారములై కానవచ్చుచున్నవి" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.265) అని అన్నారు.

### 5.2.1. వస్తువక్రత – సమన్వయం

సీ॥ మువ్వన్నె పులితోలు మొలదిండుగాఁగట్టి
కర్కోట కాహిఁ బాగగ బిగించి
చిలువ పోఁగులను వ్రేల్చెవులఁ గీలనచేసి
వలరాచనీఱు మైఁగలయ నలది
చిన్నారి పొన్నారి శిశిరాంశుఁదలఁదాల్చి
కొనగోట జత లేడి కొదమఁ బూని
పచ్చియేనిక తోలు పచ్చడంబు ధరించి
గిలుకు మువ్వల కోలగేలఁబట్టి
తే॥ పసిడి జలపోసనముతోడ నెసఁక మెసఁగ
బిసరుహాసను పుఱియ కప్పెర ధరించి
పెద్ద నడివీథి నిలుచుండి భిక్షయడుగు
నాశ్రమంబున యందు ఖట్వాంగపాణి

(హర.పంచ.ఆశ్వా.56 పద్యం)

శివుడు భిక్షధారియై బయలుదేరి భిక్ష అడిగే సందర్భంలోని పద్యం. శివుని వేషధారణ సహజసిద్ధంగా వర్ణించాడు కవి. పులితోలు మొలకు గట్టి, కర్కోటకమనే సర్పాన్ని తలపాగగ జుట్టి, పాములను చెవులకు పోగులుగా పెట్టి, భస్మాన్ని శరీరం అంతా పూసి, బాలచంద్రుని శిరమున ధరించి, ఏనుగు చర్మాన్ని వస్త్రంగా ధరించి, మోగె మువ్వల చేగఱ్ఱపూని, బ్రహ్మ కపాలాన్ని భిక్షా పాత్రగా చేత బూని, నడివీథి నిలుచుండి భిక్షయడుగెనని వర్ణించాడు. ఇలా ఉన్నది ఉన్నట్లు వర్ణించటం ఇక్కడి వస్తువు. చంద్రున్ని ధరించి వెలుగొందుతాడేమో శివుడని, మువ్వలకర్ర ధరించాడనటంతో మువ్వలు మోగే శబ్దాన్ని ఊహించటం, నిజరూపాన్ని దర్శించినట్లు అనిపించటం ఇక్కడ స్వభావ వర్ణన. ఇదే వస్తువక్రతగా చెప్పవచ్చు.

సీ॥ జడలయల్లిక యూడ్చి సంపంగినూనియు
బిన్నకూఁకట్లు జొబ్బిలఁగ నంటి
గోప్యదేశంబు సంకుమద ద్రవంబున
నయమార నుద్వర్తనంబు సలిపి
గీసి గొజ్జగి నీరుపోసి నూటిన క్రొత్త
చిరుబంతి పసుపులోఁ జెవపునలఁది
కస్తూరిఁ బొరపిన గంధసారంబుతో
సీకాయ యెరుపున జిడ్డుపఱపి
తే॥ తేట నులివెచ్చనీరును దీర్థమాడి
వేణి యీటార్చి సురపొన్న విరులుముడిచి
మడుఁగుకట్టి కాటుక యిడితొడివిపూసి
భసిత రేఖా త్రిపుండ్రంబునొసట దీర్చి

(హర.ద్వితీ.ఆశ్వా.108 పద్యం)

సిరియాలుడు ఎలా ఉన్నాడని కవి వర్ణించాడు. అతని జడల అల్లికను తీసి, నూనె రాసి, చక్కగా నలుగుపెట్టి, పన్నీటితో నూరిన పసుపుతో సింధూరమలది, కస్తూరి కలిపిన చందనంతో, సీకాయపొడితో శరీరం జిడ్డు పోగొట్టి నులివెచ్చని నీటితో స్నానం ఆడించి, జుట్టును దువ్వి, పువ్వులను అలంకరించి, బట్టలు వేసి, కాటుక పెట్టి, మూడు భస్మంతో రేఖలను నుదుటిపైన రాసి కుమారున్ని అలంకరించారని భావం. ఇలా సిరియాళుని అలంకరణ వర్ణన సహజ సిద్ధంగా ఉంది. ఇది క్రియలు జరిగిన రూపాన్ని కళ్ళకు కట్టింది. ఇది సహజమైన వైచిత్ర్యం.

సీ॥ సెలయేటి తెలినీటఁ జిఱుబంతి పసుపాడి
సేసక్రుమ్ముళ్ళపిచ్చియలు తుఱిమి
గురువింద పేరులు గుబ్బచన్నులదాల్చి
నెమలిపింఛెంపుఁ బుట్టములు కట్టి
పయ్యెద మాఱుగాఁ బొఱుటాకులమర్చి
చాఁదునఁ దిలకంబు సంతరించి
కంకేళి చిగురాకుఁ గర్ణపూరముఁజేసి
కుసుమ పూవుల ధూళిఁ గురులఁదాల్చి

తే॥ చెంచుఁ చిగురాకుఁ బోణుల చేఁత లెల్ల
నభినయింతురు పర్ణశాలాంతరములఁ
దండ్రులెందేనిఁ జనునప్డు తల్లు లెదుర
గారవమ్మున ముని కన్యకా జనంబు

(హర.పంచ.ఆశ్వా.38 పద్యం)

ముని బాలికల చేష్టలను కవి వర్ణించాడు. సెలయేళ్ళలో స్నానమాడి, కొప్పున నెమలి ఈకలు ధరించి గురివింద దండలు ధరించి, నెమలి పింఛెల బట్టలు వేసుకొని, బొట్టుగా చాదును పెట్టుకొని, అశోక చెట్టు చిగురాకులను కర్ణాభరణములుగా ధరించి, కుసుల పూల పుప్పొడిని, కురులపై పూసుకొని ముని బాలికలు తండ్రులు ఇంట్లో లేని సమయంలో తల్లుల ముందు చెంచు స్త్రీలను అనుకరిస్తారు. వారి అనుకరణ, అలంకరణను మనోహరంగా, నాటకాన్ని చూసినట్టు సహజసిద్ధంగా వర్ణించాడు కవి. ఇది వస్తువక్రత వస్తువు సహజత్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా చెప్పటం వైచిత్ర్యమే అంటాడు కుంతకుడు.

సీ॥ నందికేశ్వరు నొక్క నవశాద్వలంబున
హరితాంకురములు మేయంగఁబనిచి
ప్రమథుల నొక్క సరస్సమీపంబున
లింగార్చనంబుఁ జెల్లింపనునిచి
భూతజాతము నొక్కపులిన స్థలంబున
నాత్మేచ్ఛ నుండంగ ననుమతించి
మాతలేద్వురు నొక్క మణికందరంబున
విశ్రామ ముండంగ వెరవు చేసి

తే॥ పసిడి కొప్పెర లాతంబుఁ బచ్చకోల
జోగపట్టియ కకపాల జోలెసంచి
కలికి కాటుక గీర్బొట్టు పలుఁగు పేరు
జాతిగాఁదాల్చి నెఱమిండ జంగమగుచు

(హర.పంచ.ఆశ్వా.41 పద్యం)

పరమేశ్వరుని విటజంగమ వేషధారణను కవి వర్ణించాడు. నందికేశ్వరుని ఒక పచ్చిక బయలున పచ్చికమేయ పంపి, ప్రమధులను సమీపంలో లింగ పూజ చేయపంపి, భూతగణాన్ని,

సప్తమాతృకలను ఒకచోట ఉండమని చెప్పి, బంగారు కమండలం, యోగదండం, పచ్చలు తాపిన కర్రను, యోగపట్టె, భస్మపు సంచి ధరించి, నొసట కాటుక బొట్టు పెట్టి, అక్షమాలను ధరించి, విట జంగమ వేషధారియైనాడు. ఇక్కడ వర్ణన సహజంగా, దృశ్యమానంగా ఉంది. ఇతర ఆలంకారికులు స్వభావోక్తి అంటే కుంతకుడు వస్తువక్రతగా చెప్పాడు. ఈ పద్యంలో జంగమ వేషధారియైన శివుడు వస్తువు అతని అలంకారాన్ని వర్ణించే తీరే వైచిత్ర్యం. ఈ శోభయమాన వైచిత్ర్యానికి అలంకారం వేరొకటి అవసరం లేదని చెప్పటమే కుంతకుని అభిప్రాయం.

**క॥ తెలతెలవాఱుచు వచ్చెం**
**బలపలనయ్యెం బయోదపథమునఁదారల్**
**కలవింకంబుల కోమల**
**కలకలములు చెలఁగె గాళికావిపినమునన్**

**(శివ.చతు.ఆశ్వా.3 పద్యం)**

తెల్లవారుజాము వర్ణన వస్తువు. తెలవారుతుంది. ఆకాశంలోని చుక్కలు మెల్లగా కాంతి విహీనం అవుతున్నాయి. కాళికాలయంలో ఉన్న పిచ్చుకల మృదువైన కలకల ధ్వనులు వినిపిస్తున్నాయని సహజసుందరంగా వర్ణించాడు కవి.

**తే॥ చూచియునుఁ జూచుఁ గ్రమ్మఱసుదతిఁదివుటఁ**
**గౌఁగిలించియు నప్పుడ కౌఁగిలించు**
**జుంబనము సేసియును రాజసూనుఁడెలమిఁ**
**జుంబనము సేయుఁ బౌనరుక్త్యంబుగాఁగ**

**(శృ.నై.సప్త.ఆశ్వా.181 పద్యం)**

నలుడు చెప్పినదే చెప్పినట్లు, చూసిందే మళ్ళీ చూసి, కోరికతో కౌగిలించి, వెంటనే మళ్ళీ కౌగిలించి, చుంబన చేసి, మళ్ళీ వెంటనే చుంబన చేసి తనివితీరేదాకా ఎప్పటికి ఇలా చేస్తూనే ఉంటాడా అన్నట్లు ప్రవర్తించాడని భావం. నలదమయంతుల ప్రణయం వర్ణితం దృశ్యమానంగా సహజసిద్ధంగా వారి చేష్టలు వర్ణింపబడినవి. వస్తువు సహజత్వాన్ని కలిగి ఉంది. ఇది వస్తు వక్రతకు చక్కని ఉదాహరణ.

**క॥ నిలయవ్యాపారంబుల**
**యలపుల మేనులు చెమర్చియపరాహ్ణమునన్**
**సెలయేఱులలోఁ జిల్లులు**

**చిలుకులు నాడుదురు మునులు చివురుంబోణుల్**

(హర.పంచ.ఆశ్వా.37 పద్యం)

మునుల భార్యలు గృహ పనుల వలన కలిగిన ఆయాసంతో శరీరం చెమర్చగా, మధ్యాహ్న వేళలో సెలయేరులో ఒకరిపై ఒకరు నీళ్ళను చిందిస్తూ ఆటలను ఆడుకుంటారు. సహజంగా వారి క్రీడా వినోదాన్ని వర్ణించాడు కవి.

**సీ॥ కనకనూపుర రణత్కార నిక్వాణంబు**
**రవళి మెట్టియలతో రాయిడింప**
**రవయుంగరంబుల రత్నాల దీప్తులు**
**వాలారు గోళ్ళపై జాలు వాఱఁ**
**గుదురునిండిన మించు గుబ్బచన్నుల మీఁద**
**ముత్యాలహారంబు మురుపుసూపఁ**
**గంపించు బంగారు గమ్మల క్రొమ్మించు**
**నిద్దంపుఁ జెక్కుల నీడసూప**

**తే॥ నెదురుగా నల్లనేతెంచి హేమపాత్ర**
**నాజ్యమధు శర్కరా ఫలాద్యర్చితముగ**
**మదనవైరికి నర్పించె మంజుఘోష**
**యమృత దివ్యాన్నపాయసాహార భిక్ష**

(హర.పంచ.ఆశ్వా.45 పద్యం)

అప్సరస శివునికి భిక్ష ఒసగే సమయంలో ఆమెను వర్ణించాడు కవి. ఆమె బంగారు అందెల ధ్వని మెట్టెల ధ్వనితో కలువగా, రవ్వల ఉంగరాల కాంతి తనవాడి అయిన గోళ్ళపై కాంతులు ప్రసరించగా, కుదురైన వక్షోజాల మీద ముత్యాల హారాలు ఊగులాడగా, బంగారు చెవికమ్మలు, బుగ్గలపై తళుకులీనగా, మంజు ఘోష అనే అప్సరస, ఎదురుగా వచ్చి బంగారు పాత్రలో, నేయి, తేనె, పంచదార, వివిధ ఫలాలతో కూడిన అమృతమయ క్షీరాన్నాన్ని శివునికి భిక్ష పెట్టింది. ఇక్కడ అప్సరస అలంకరణ, సౌందర్యం, ఆభరణాల సోయగం ఉన్నది ఉన్నట్లు వర్ణిస్తూ సహజత్వాన్ని కూర్చాడు కవి. అచ్చర భిక్ష నొసగిన విధానం చెప్పటమే ఇక్కడ వస్తువు. అది సహజ సిద్ధంగా దృశ్యమానం చేయడం వైచిత్ర్యం.

వస్తు వక్రతను చెప్పిన తర్వాత వాక్య వక్రత్వం గూర్చి ఇలా అంటున్నాడు.

**కా॥ మార్గస్థవక్రత శబ్దార్థ గుణాలంకార సమ్పదః।**
**అన్యద్వాక్యస్య వక్రత్వం తథాభిహితి జీవితమ్॥**
**కా॥ మనోజ్ఞ ఫలకోల్లేఖ వర్ణచ్ఛాయాశ్రియః పృథక్।**
**చిత్రస్యేవ మనోహారి కర్తుః కిమపి కౌశలమ్॥**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.3, 4)**

సుకుమారాది మార్గాల్లో ఉన్నటువంటి వక్రములైన శబ్దార్థగుణాలంకారముల సంపద కంటె భిన్నమైనదియు వర్ణింపనలవి కాని సహృదయసంవేద్యమైన లోకోత్తర కవి కౌశల విశేషమే వాక్య వక్రత అవుతుంది. అది ఎలా అంటే చిత్ర ఫలకం మీద రాయబడ్డ వర్ణాల కాంతి కంటె చిత్రకారుని అపూర్వమైన, మనోహరమైన కౌశలంలాగా అనిర్వచనీయ కౌశలంలా వాక్య వక్రత ఉంటుందని తెలిపాడు. సుకుమారాది మార్గ భిన్నమైన అనిర్వచనీయ కవికౌశల రూపంగా వాక్య వక్రతను నిర్వచించాడు. పుల్లెల శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానిస్తూ "దీని తాత్పర్యమేమనగా – చిత్తరువు యొక్క ఫలకము మొదలగు ఉపకరణముల కలాపము కంటె భిన్నమైనదియు, సకలములగు ప్రకృత (ఫలకాది) పదార్థములకు జీవము వంటిదియు అగు చిత్రకారుని కౌశలము వేరుగాను, ముఖ్యముగాను, ఏ విధముగ భాసించుచుండునో అట్లే వాక్యము విషయమున గూడ మార్గములు మొదలగు ప్రకృత పదార్థముల సముదాయము కంటె భిన్నమైనదియు కవి కౌశలరూపమును, సహృదయ సంవేద్యమును, ప్రకృతములగు సకల పదార్థములకు జీవిత భూతమైనదియునగు ఒకానొక వక్రత్వము ప్రత్యేకముగా కానవచ్చుచున్నది".

"కావున వస్తువుల స్వభావ సౌకుమార్యమును వర్ణించుట యందుగాని శృంగారాది రసముల స్వరూపము యొక్క సమున్మీలనమునందుగాని వివిధాలంకారముల విన్యాసమునందు విచ్ఛిత్తిని రచించుటయందుగాని (వాక్య వక్రతా సంపాదితమగు) గొప్ప పరిపోషణాతిశయమే సహృదయాహ్లాదకరమగుచున్నది. పదమునందుగాని వాక్యైక దేశమునందుగాని ఉండెడు వక్రతా ప్రకారములన్నింటికిని కవి కౌశలమే మూలకారణముగ నున్నది. ఏలయన, కల్పాది నుండియు కేవలము తమ తమ నియమ స్వరూపములతో వ్యవస్థితములైయున్న స్వభావాలంకార రూపములగు వక్రతా ప్రకారముల నవనవమగు ఉల్లేఖముచే విలక్షణమైన చేతన చమత్కారియగు ఒకానొక స్వరూప విశేషము దీని వలననే (కవి కౌశలము వలననే) ఆవిర్భవించుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.273,274) అన్నారు. కాబట్టి వాక్య వక్రత అనేది స్వభావం, రసం, అలంకారం ఈ మూడింటిని ఆశ్రయించి ఉంటుందని గ్రహించాలి. ఇంకా వివరిస్తూ

"రసమునకును, స్వభావమునకును అలంకారములకును వీని కన్నింటికిని కవి కౌశలమే జీవితము, ఐనను, వర్ణింపబడుచున్న వస్తువునకు భూషణముగ నుండవలెనని అభిమతమైనదియు, కేవలము స్వరూపము తోడనే స్ఫురించుచున్నదియు యథార్థ రూపమున (ఉన్నది ఉన్నట్లుగ) కూర్చబడుచున్నదియునగు అలంకారము. ప్రత్యేకముగ కవి కౌశలానుగ్రహము లేనిచో తద్విదాహ్లాదకారి కాజాలదు" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.275). ఈ విధంగా వాక్య వక్రతలో రసస్వభావ అలంకారాదులున్నట్లు తెలుస్తున్నాయి. వాక్య వక్రతను మరొక విధంగా నిర్వచిస్తూ

**వాక్యస్య వక్రభావోఽన్యో భిద్యతే యః సహస్రధా**

**యత్రాలంకారవర్గోఽ సౌ సర్వోఽప్యన్తర్భ విష్యతి**

**(వ.జీ.ప్రథ.ఉన్మే.కా.20)**

సహస్ర భిన్నమైన వాక్య వక్రత్వం ఒకటి ఉంది. అది ఉపమాద్యాలంకారాలన్ని దీనిలో అంతర్భవిస్తాయని ప్రథమ ఉన్మేషంలో తెలిపాడు. 'సహస్ర' అంటే అనేక విధాలు అనుకోవాలి కానీ వెయ్యి అని కాదు. 'సహస్ర దలమ్' వేయి దళములు గల పద్మం అని అర్థం కాదు. అలానే ఇది. దీని విషయంలో ఎలాగ నియమిత సంఖ్య అర్థం బోధించదో కవి ప్రతిభాజన్యమైన వాక్యవక్రతకు వర్తించదని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానించాడు. ప్రథమోన్మేషంలో సంగ్రహంగా వాక్య వక్రతలో అలంకార ప్రస్తావన ఉంది కానీ తృతీయోన్మేషంలో, స్వభావం, రసం కూడా వాక్య వక్రతలో భాగం చేసాడు. కవి కౌశలోజ్జీత స్వభావానికి, రసానికి ఉదాహరణ కూడా ఇచ్చారు. దీనికి లక్షణాన్ని వివరించలేదు కానీ వాక్య వక్రతలో భాగమైన కవికౌశలోజ్జీవిత స్వభావాన్ని ఉదహరించాడు చూద్దాం.

### 5.3. కవికౌశలోజ్జీవిత స్వభావం:

స్వభావాన్ని వివరిస్తూనే కవి ప్రతిభావంతంగా తీర్చిదిద్దితే అది కూడా వాక్య వక్రతగా తెల్పాడు కుంతకుడు. దీని లక్షణాన్ని ప్రత్యేకంగా వివరించలేదు కానీ ఉదాహరణ శ్లోకం ద్వారా వ్యాఖ్యాత వివరణ తెలిపాడు.

**తేషాం గోపవధూ విలాస సుహృదాం రాధారహః సాక్షిణాం**

**క్షేమం భద్రకళిన్దశైలతనయా తీరేలతావేశ్మనామ్**

**విచ్ఛిన్నే స్మరతల్పకల్పనమృదుచ్ఛేదోపయోగేఽధునా**

**తే మన్యే జరఠీ భవన్తి విగలన్నీలత్విషః పల్లవాః**

(వ.జీ.పుట.276)

"భద్రా? (ఉద్ధవా!) గోపికల విలాసములకు మిత్రములును, రాధ యొక్క రహస్య క్రీడలకు సాక్షీభూతములును అగు యమునాతీర లతాగృహములు క్షేమముగ నున్నవా! ఇపుడు లేత చిగురుటాకులను స్మరతల్పముగ ఉపయోగించుట నిలిచిపోయినదిగాన నీలిరంగు కాంతి తగ్గిపోయిన ఆ చిగుళ్ళు ముదిరిపోవుచున్నవని తలచెదను" (శ్రీరామచంద్రుడు, పుల్లెల:2007: పుట.276). ఇందులో స్వభావంతోపాటు కవికౌశలం కనిపించింది. పూర్తి స్వభావోక్తి కాకుండా స్వభావంతోపాటు కవిప్రతిభ కూడా తోడైంది కనుక స్వభావోక్తి కన్న కొంత భేదంగా ఉందని తోస్తుందని వ్యాఖ్యానించాడు.

### 5.3.1. కవికౌశలోజ్జీవిత స్వభావం – సమన్వయం

**రా॥ ఆయావేళల మౌని భార్యలు గృహవ్యాపార లీలాభవ**
**త్కాయక్లేశములుజ్జగింత్రు విలసత్కర్పూర రంభా తరు**
**చ్ఛాయాశీతల చంద్రకాంత మణిపాషాణ ప్రదేశంబులన్**
**వాయుప్రేరణఁ బచ్చకప్పురముపై వర్షింప నక్కానలోన్**

**(హర.పంచ.ఆశ్వా.35 పద్యం )**

మునుల భార్యలు, ఇంటి పనుల నిర్వహణలో కలిగిన శరీరాయాసాములను తీర్చు కోవడానికి, అడవిలో ఉన్న కర్పూర, అరటి మొదలైన వృక్షఛాయలతో చల్లగా ఉండే చంద్రకాంత మణిశిలావేదికలపై, పచ్చకర్పూరంపై వీచే గాలితో ఉపశమనాన్ని పొందుతారు. ఇక్కడ విషయాన్ని సహజంగా వర్ణిస్తూనే స్వభావ సుందరంగా తీర్చి దిద్దడానికి కవి చేసిన ప్రయత్నం, అతని ప్రతిభ వ్యక్తమయ్యేట్లుగా వాయు తాకిడి పచ్చకర్పూరంపై వర్షించిందని వర్ణించడం వల్ల గోచరమవుతుంది.

**తే॥ కనకనూపుర మేఖలా కలకలంబు**
**రత్నకంకణ రవముతో రాయిడింప**
**నభవునకుఁ బెట్టె మధుర దివ్యాన్నభిక్ష**
**చిత్తభవకీర్తి శశిరేఖ చిత్రలేఖ**

**(హర.పంచ.ఆశ్వా.51 పద్యం)**

మన్మథుని కీర్తిపతాక అనే చంద్రలేఖ అనే అప్సరస బంగారు అందెలతో కూడిన మొలనూలు ధ్వని కాగా, రత్నాలను తాపిన చేతి కడియపు ధ్వని మేళవించగా పరమేశ్వరునికి మధురమైన భిక్షాన్నమును వడ్డించింది. ఇందులో జరిగిన విషయాన్ని సహజంగా తెలుపుతూ

కనకనూపుర మేఖలా కలకలంబు అనడం స్వభావాన్ని తెలుపుతుంది. కానీ 'చిత్తభవకీర్తి శశిరేఖ' అనే విశేషణం, 'మధుర దివ్యాన్ని భిక్ష' అన్నప్పుడు ప్రయోగించిన విశేషణం పద్యానికి సొబగును తీసుకొచ్చాయి. కవి కౌశలాన్ని జోడించి పద్యాన్ని రమణీయంగా తీర్చిదిద్దాడు. ఇది కవికౌశలోజ్జిత స్వభావ వైచిత్ర్యానికి చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు.

**ఉ॥ క్రచ్చలఁ బారిజాత లతికా వనదేవత జంభవైరిపై**
**మచ్చికఁ గూర్పగా నవసుమప్రకరంబుల వేల్పుటేటిలో**
**విచ్చిన పైఁడి తామరల వెంబడి వచ్చిన కమ్మగాడ్పులన్**
**మెచ్చులరీతిఁ గోకిల సమీరణ దీవనలిచ్చె నొప్పుగన్**

**(హర.షష్ఠా.ఆశ్వా.10 పద్యం)**

ఇంద్రుడు ఆకాశమార్గంలో స్వర్గానికి వచ్చాడు. ఆ సమయంలో స్వర్గ వర్ణన ఇది. ఆ ప్రాంతము అంతా పారిజాత పుష్పాల వాసన, ఆకాశగంగలో వికసించిన తామర పుష్పాల సువాసన కలిపి కమ్ముకున్నాయి. ఇంద్రునిపై ప్రేమతో కోకిలలు గానాన్ని వినిపించాయని భావం. అక్కడి వాతావరణాన్ని తెలుపుతూ మనోహరంగా వర్ణించడం, కోకిలలు దీవెనలిచ్చాయని పోలికలు చెప్పడం. కవి ప్రతిభకు నిదర్శనం.

**శా॥ గీర్వాణాధిపు చెంగటన్నిలిచె నక్షీణప్రభావాధి కాం**
**తర్వాణి స్తుత వాగ్విలాసుఁడు కృత ద్వంద్వ వ్యుదాసుండు చి**
**న్నిర్వాహ స్థిరయోగవైభవ కథానిత్యోద యోల్లాసుఁడ**
**ద్దుర్వాసుండు ప్రసూనమాల్యరుచిమద్దోః పద్మవిన్యాసుఁడై**

**(హర.షష్ఠా.ఆశ్వా.14 పద్యం)**

దుర్వాసమహాముని పరిచయాన్ని తెల్పుతూ మిక్కిలి గొప్ప విద్వాంసుల పొగడ్తలకర్హమైన వాక్చతురత కలవాడు. సకల ద్వంద్వములను జయించినవాడు. మనస్సును ఆయత్తపరచి, సుస్థిరయోగంలో నిత్యం ఉల్లాసం చెందేవాడు అయిన దుర్వాస మహర్షి పుష్పమాలను చేతిలో ఉంచుకొని ఇంద్రుని వద్దకు వచ్చి నిలిచాడని వర్ణించాడు. ఇక్కడ ముని స్వభావాన్ని, వాక్చతురతను తెల్పడం ప్రధానం. అలాగే ఇంద్రుని వద్దకు చేరిన విధానాన్ని తెల్పడం ఉద్దేశ్యం. వాటిని ఉన్నతంగా చిత్రించడానికి కవి చేసిన ప్రయత్నమే కౌశలం.

**ఉ॥ కాంచన కేతకీ కుసుమ గర్భదళోదర సోదర ప్రభా**
**భ్యం చితమై పటీర ఘుసృణాగురు సౌరభ లక్ష్మితోఁబిసా**

**ళించుచుఁగమ్మనై పరిమళించు సముజ్జ్వల గోపి చందనం**
**బించిన వేడ్కతోడ ధరియింతురు భాగవతోత్తముల్ పురిన్**

**(కాశీ.తృతీ.ఆశ్వా.115 పద్యం)**

ద్వారవతిలోని భాగవతుల వర్ణన కాశీఖండంలో ఉంది. వాళ్ళను వర్ణిస్తూ పసిడి కేతకి పూవు, నడిమిరేకు కాంతికి అన్నదమ్ములలాంటి కాంతితో, చందన, కుంకుమ, మాగురు, సౌరభసంపదతో వ్యాపించు సువాసన గల గోపీచందనాన్ని ద్వారవతిలోని భాగవతులు ఎక్కువ ఇష్టంతో ధరిస్తారు. ఈ వర్ణన సహజంగానే ఉంది. భాగవతుల చందనధారణ ప్రసక్తమైంది. కానీ వర్ణిత విషయాన్ని కొంత సొగసుగా "కాంచనకేతకీ కుసుమ గర్భదళోదర సోదర ప్రభా" అనటం కవి ప్రతిభకు, వర్ణనా హృదయానికి నిదర్శనం.

**తే॥ రమణి! ధరియింతు రూర్ధ్వపుండ్రముల మెఱయ**
**ఫాలతలమున నవ్వీట భాగవతులు**
**కఠిన పాపపరంపరా కంఠనాళ**
**ఖండన ప్రక్రియా క్రూరఖడ్గలతలు**

**(కాశీ.తృతీ.ఆశ్వా.116 పద్యం)**

ఆ ద్వారవతిలోని భాగవోత్తముల నొసటిపైన పాపపరంపరల కంఠనాళాల్ని ఖండించే ఊర్ధ్వపుండ్రాలను ధరిస్తారు అని చెప్తూనే పాపాలను ఖండించే ఖడ్గలతలైనవిగా విశేషణపూర్వకంగా చెప్పడం కవి ప్రతిభకు తార్కాణం. కవి సహజ వర్ణనకు తన ప్రతిభను తోడు చేసాడు.

**శా॥ పౌనఃపున్యమునన్ ఘటింపఁదొడఁగెన్ బ్రహ్మాన్వయోత్తంస! గౌ**
**ష్ఠీనాగ్రంబున వేఁగపెయ్యయిది కంటే! కామధేనూద్భవం**
**బానందంబున డెందముబ్బఁగ జనన్యాపేన వాపీ సుధాట**
**పానోత్పుచ్ఛమనూనమౌ చట్రల ఝంపాతాండవాటోపమున్**

**(కాశీ.తృతీ.ఆశ్వా.199 పద్యం)**

ఒకప్పటి ఆవుల కొట్టం ముంగిలిలో కామధేనువుకు పుట్టిన లేగదూడ (జనన్యాపినవాపీసుధాపానోత్పుచ్ఛము) తల్లియొక పొదుగుడనే బావి నుండి తాగిన అమృతమయమైన క్షీరాన్ని ఆనందిస్తూ హృదయం ఉప్పొంగగా తోక కుచ్చును ఎత్తి పట్టలేని ఆనందంతో చిందులు తొక్కుతున్నది అని భావం. ఇక్కడ లేగదూడ వర్ణనం సహజ సిద్ధం. పశువు తోకలెత్తి దూకడం అనేది లోక సిద్ధం. కానీ పొదుగనే బావి నుండి తాగిన అమృతమయక్షీరం

అనటం కవి హృదయం. పీనవాపీసుధాపానం, ఝుంపాతాండవాటోపం అనటం కవి ప్రతిభలో వేసిన విశేషణాలు. స్వభావోక్తికి కొంత ప్రతిభ తోడైంది.

**ఉ॥ అల్లనఁ జేరవచ్చిధవళాన్నముఁగమ్మనియాల నేతితో**
**బెల్లముతోడ నాల్కడపుఁ బేసముతోఁదనిపండ్లతోడ శ్రీ**
**వల్లభు కూర్మి నెచ్చెలికి వారణవైరికి మంచుగొండ రా**
**జల్లునికిం బినాకికిఁ బ్రియంబున నూర్వశిపెట్టె భిక్షమున్**

**(హర.పంచ.ఆశ్వా.47 పద్యం )**

ఊర్వశి శివుని సమీపించి తెల్లని అన్నము, కమ్మని నేతితో బెల్లముతో, కొబ్బరితాజుతో, తనిపండ్లతో భిక్షాన్నం పెట్టిందనే విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణిస్తూనే 'వల్లభ కూర్మి నెచ్చెలికి' అంటూ లక్ష్మీ వల్లభుని ప్రాణమిత్రునికి, వారణవైరికి, పినాకపాణికి మిగుల కూర్మితో ఇచ్చెను అని తెలుపుతాడు. ఇక్కడ విష్ణుమూర్తి ప్రియమిత్రునికి అని తెలియజేయటం ఎందుకంటే ఊర్వశి శ్రీ మహావిష్ణువు ఊరువుల నుండి జన్మించిదని, ఆమె భిక్ష ఒసగుతుంది కనుక విష్ణు ప్రశం చేసాడు కవి. యుక్తియుతంగా ఉంది. కవికౌశలానికి నిదర్శనంగా చెప్పవచ్చు. స్వభావానికి కౌశలం తోడైంది. ఇది కూడా వైచిత్ర్యమే.

**తే॥ సహజ సౌజన్య సహజన్య శంకరునకుఁ**
**బొసఁగ వడ్డించెఁ దత్కాల పుణ్యభిక్ష**
**సారదోర్మూల కూలంకషంబులైన**
**వీఁగుఁ బాలిండ్లు పయ్యెద వీడుకొలుప**

**(హర.పంచ.ఆశ్వా.49 పద్యం)**

ఒక అప్సరస వర్ణన చేస్తూ 'సహజ సౌజన్య సహజన్య' అనే విశేషణాన్ని వాడుతూ సహజ సిద్ధమైన మంచి స్వభావంతో జన్మించిన అప్సరస భుజాల కట్టువరకు వక్షాలతో పయ్యెద తొలగుతుండగా భిక్షను ఒసగుతుందని తెల్పుతూ కార్యాన్ని దృశ్యమానం చేస్తూ అప్సరస ఔన్నత్యాన్ని పొగుడుతూ విశేషణ యుక్తమైన కౌశలాన్ని నిరూపించుకున్నాడు. ఆమెకు చెప్పిన విశేషణం ఆ సౌందర్యవతి సహజ స్వభావ సౌందర్యాన్ని తెలిపింది.

**శా॥ అక్షయ్యంబుగ దివ్యమాధుకర భిక్షాన్నంబు వడ్డించెఁ దా**
**గోక్షీరంబులతోడ శర్కరలతోఁ గ్రొన్నెతితోఁ దేనెతో**
**ద్రాక్షా దాడిమ చూత పాకములతో దాక్షాయణీ భర్తకున్**

**చక్షూరాగ మెలర్పగా హరిణి విశ్వాసంబుతో ముంగిటన్**

**(హర.పంచ.ఆశ్వా.46 పద్యం)**

హరిణి అనే అప్సరస శివునికి భిక్షను ఇచ్చిన సందర్భంలోనిది పద్యం. క్షయం లేనట్టి ఆవు పాలు, పంచదార, కొత్త నేయితో, తేనెతో, దాక్ష, దానిమ్మ, చూతకపాకాలతో దాక్షాయణీ భర్తయైన శివునికి, కళ్ళలో అనురక్తి కలుగగా భిక్ష సమర్పించిదట. ఇక్కడ దాక్షాయణీ భర్తకు అనటం అక్షయంబైన పదార్థాలని చెప్పటం వలన విశ్వాసంతో ఇవ్వటం అనే పదాలను కూర్చటం వలన పద్యానికి కొంత సౌందర్యం ఏర్పడింది. అదే ఇక్కడ వైచిత్ర్యం.

**తే॥ వలచుఁ గస్తూరి నిగరాల తలుపు దెఱవ**
**గాజుటోవరిలో ధూప గంధ లహరి**
**హాట దురుస్ఫూర్తి నాసికాపుట కుటీర**
**కోటరాంతః కుటుంబితా పాటవమున్**

**(శృ.నై.సప్త.ఆశ్వా.154 పద్యం)**

గాజుతో చేయబడిన గదిలో కస్తూరితో చేయబడిన తలుపు గల కిటికీ తెరువగానే ఆ గదిలోని ధూప పరిమళ ప్రవాహ గాటుగా ముక్కున జొచ్చి కాపురం చేసిందని భావం. ఇక్కడ గది, పరిమళ వర్ణన సహజం. కానీ నాసికలో కాపురముండే అని కొంత వైవిధ్యంగా చెప్పటం వైచిత్ర్యం.

**తే॥ కనక కింకిణికా జాలకములు మెఱయ**
**గగన తరు పుష్పమగు పుష్పకంబువోలె**
**నెచట నుండియొ యేతెంచి యెదుటనున్న**
**పసిడి తేరెక్క వసుమతీ పాలసుతుఁడు**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.27 పద్యం)**

వసుమతీ పాలసుతుడైన నలుడు పసిడి తేరు ఎక్కిన విధాన్ని వర్ణించాడు కవి. నలుడు బంగారు చిరుగంటల సమూహాలు మెరుస్తుండగా ఆకాశం అనే చెట్టుకు పూసిన పువ్వులాగా ఉన్న బంగారు పుష్పక విమానం లాంటి తేరును ఎక్కాడని, స్వభావాన్ని చెప్తూనే పుష్పక విమానంతో పోలుస్తూ చెప్పటం కవి కౌశలోజ్జిత స్వభావ వర్ణనకు ఉదాహరణగా చెప్పవచ్చు.

## 5.4. కవి కౌశలోజ్జీవిత రసం

రసయుక్తమైన రచన కూడా వాక్యవక్రతగా చెప్పాడు. దానికి ఉదాహరణగా ఈ శ్లోకాన్నిచ్చాడు.

**లోకోయాదృశ మా హ సాహసధనం తంక్షతియాపుత్రకం**
**స్యాత్ సత్యేన స తాదృ గేన భవేత్ వార్తా విసంవాదినీ**
**ఏకాం కామపి కాలవిపృషమమీ శౌర్యోష్మకణ్డూవ్యయ**
**వ్యగ్రాః స్యుశ్చిరవి స్మృతామరచమూడిమ్భాహవా బాహవః**

**(వ.జీ.పుట.73)**

"ఇచట తగిన ఆలంబన విభావరూపమగు (ఇచట శ్రీరాముడు ఆలంబన విభావము) విషయమునందలి సౌందర్యాతిశయమును, (ఇచట పరాక్రమాతిశయము) శ్లాఘించుటయందు శ్రద్ధాళువై విజిగీషు వగు రావణుడు చేయు వైదగ్ధ్యముతో కూడిన భంగీ భణితి వైచిత్ర్యముచే ఉత్సాహరూపమగు స్థాయిభావము అధికమగు ఈ పరిపుష్టమైన రసత్వస్థితిని పొందింపబడుచు వాక్య వక్రత్వ రూపమగు అపూర్వమైన కవి కౌశలమును సూచించుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.277) అన్నారు. ఇవి చెప్పిన తర్వాత చేతన, అచేతనాదుల స్వరూపాన్ని తెలుపుతూ కుంతకుడు ఇలా అన్నాడు.

**కా॥ ముఖ్యమక్లిష్ట రత్యాది పరిపోష మనోహరమ్।**
**స్వజాత్యుచిత హేవాక సముల్లేఖోజ్జ్వలంపరమ్॥**

**(వ.జీ.తృ.ఉన్మే.కా.7)**

ముఖ్యమైన చేతన స్వరూపంగల సురాదులకు రత్యాదుల స్థాయిభావ పోషణం సరియైనది. అచేతనాలు అంటే ఇక్కడ అల్పబుద్ధిగల పశుపక్ష్యాదులకు స్వభావాన్ని వర్ణించితే వాటి స్వజాతికి ఉచితంగా ఉంటుందని రసపోషణ విషయాన్ని తెలుపుతున్నాడు.

### 5.4.1. కవికౌశలోజ్జీవిత రసం – సమన్వయం

**తే॥ నూర్మి పంక్తుల నుయ్యాల లూఁగి యాడుఁ**
**దివుటఁ దియ్యని తమ్మిపూఁదేనె గ్రోలు**
**బ్రమదమున నాఁచుఁదీఁగె జొంపములఁదూఱు**
**నరుగుఁగేళీ కులాయ శుద్ధాంతములకు**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.5 పద్యం)**

నలుడు చేతి నుండి వదిలి వేసిన తర్వాత హంస ఆనందాన్ని తెలుపుతున్నాడు కవి. అలలబారులలో తిరగాలని కోరికతో తమ్మి, తామరల మకరందాన్ని తాగుతూ, హర్షముతో నాచుదీగల గుబురులోకి, చెట్లమీది ఆట తావులైన గూండ్లనే అంతఃపురాలకు వెళ్ళిపోతుంది. హంస

ఆలంబన విభావం, దాన్ని విడిచి పెట్టడం ఉద్దీపన విభావం. హర్షము దీని వ్యభిచార భావం, హాసము స్థాయి భావం. నలున్ని విడిచిన తర్వాత తన స్థలానికి హర్షానందంతో ఉరకలు వేయటం దాని రసస్థితిని తెలుపుతుంది.

రసయుక్తంగా కవి రచించడం ఇదే కవి కౌశలం. దీనినే కుంతకుడు కవి కౌశలోజ్జిత రసం అన్నాడు. ఇక్కడ హంస యొక్క స్వభావాన్ని వర్ణించాడు కవి. పశుపక్ష్యాదుల స్వభావాన్ని వాటి స్వజాతికి ఉచితంగా ఉంటుందని అదే రసపోషణ అని కుంతకుని మతం.

**క॥ ఒకచోటఁబువ్వుఁబందిరి**
**యొకచోఁ జప్పరము, దూఁగుటుయ్యెలయొకచో**
**సకినల గిలిగిలిమంచం**
**బొకచోఁ గప్పురపుఁ బలుఁగుటో వరి యొకచోన్**

**(శృ.నై.సప్త.ఆశ్వా.148 పద్యం)**

నలదమయంతులు విహారానికి వెళ్ళినపుడు అక్కడ గల పరిస్థితిని వర్ణించే సందర్భం. ఒక పందిరి పువ్వులతో ఉంది. ఒకచోట తూగుటుయ్యల ఉంది. ఒకవైపు సకినల పిట్టల కిలికి ధ్వని. ఒకచోట కర్పూరం లాంటి స్పటిక శిలలతో కూడిన చంద్రశాల ఉంది. ఇక్కడ విహార సౌధంలోని తూగుటుయ్యల, చంద్రకాంత శిలలు, పిట్టల ధ్వని ఉద్దీపన విభావాలు. అవి కూడా తటస్థాలు. శృంగార రస ప్రేరేపితాలు. రసం శృంగారం. ఇక్కడ ఏ అలంకారం అవసరం లేకుండానే రస విషయం చెప్పబడింది. ఇదే కవి కౌశల రసం.

**తే॥ కామశర వృత్త వర్తికా గంధ తైల**
**దీపితానేక దీపికా దీప్తిజాల**
**వర్ధితాటోప కామదేవ ప్రతాప**
**మయిన యా హర్మ్యమెక్కె నింతియును దాను**

**(శృ.నై.సప్త.ఆశ్వా.159 పద్యం)**

నలుడు, దమయంతి కామశర కర్పూర వత్తులచే నిష్పన్నమైన, గంధతైలతావి నూనెతో వెలిగించబడ్డ పెక్కు దీప జ్వాలలతో పెంచబడిన సంరంభం కలదైన మన్మథ ప్రభావంతో మదనోద్రేకకారి అయిన మేడను చొచ్చిందని భావం. ఆలంబన విభావాలు, నాయికా నాయకులు, ఉద్దీపన విభావం పరిమళవర్తి అయిన తైలజ్వాల. శృంగార రసానికి ఉపస్కారకం అయ్యాయి. ఉత్సుకత వ్యభిచారి భావం రస ఉత్పత్తికి ఇవన్నీ తోడయ్యాయి.

తే॥ స్వప్న సంభోగ శత సహస్రములు వోయె
భ్రమసమీక్షా వినోదార్బుదములవు సనియె
మనములో నిండి యున్నది ననుపుఁగూర్మి
యింక లజ్జాభయంబుల కెడము గలదె?

(శృ.నై.సప్త.ఆశ్వా.161 పద్యం)

లక్షల కోట్ల భ్రాంతి దర్శనాలు, స్వప్న సంభోగాలు అయిపోయాయ. మనసులో కూర్మి అతిశయించగా మదన లజ్జా భయాలను తొలగించాడని భావం. శృంగారం రసం, రతిస్థాయి భావం, ఆలంబన విభావం, నాయికా నాయకులు, లజ్జాభయం చేష్ట. ఇవి రసోత్పత్తికి కారణాలు. లజ్జా భయాన్ని మదనుడు పోగొట్టడం అనే ఉక్తి వైచిత్ర్యం రస నిష్పన్నానికి కారణంగా తెలిపాడు కవి.

తే॥ కోరగించిన కడకంటి కొలికిఁ జూచి
వాఁడి వాలిక పూఁదూపు వంకదీర్చు
చొరగి రతిదేవి పాలిండ్ల నొత్తగిలిన
యించు విలుకాని వ్రాసినా రిడుపునందు

(శృ.నై.సప్త.ఆశ్వా.150 పద్యం)

విహార సౌధంలో మన్మథుని చిత్రపటం చిత్రించారు. అది ఎలా ఉందంటే కరుకైన పూవు బాణాన్ని, కడకంటి కొనతో చూసి తీర్చి సరిచేసే విలుకాడైన మన్మథుని చిత్రాన్ని గోడమీది భాగంలో చిత్రించారు. ఇది కూడా శృంగార రసం. కడకంటి కొనతో చూడటం విభావం. శృంగార రసానికి ఉద్దీపన గోడ మీది తటస్థ విభావమైన చిత్రం. నలుడూ దమయంతి ఆలంబన విభావం. కవి రసపోషణకు, కౌశలానికి ఈ పద్యం నిదర్శనం.

సీ॥ తల్లిమదేకపుత్త్రక, పెద్ద కన్నులు
గానవిప్పుడు, మూడు కాళ్లముసలి
యిల్లాలు కడుసాధ్వి, యేమియు నెఱుఁగదు
పరమ పాతివ్రత్య భవ్యచరిత
వెనుక ముందర లేరు నెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
గానక కన్న సంతానంబు శిశువులు

జీవనస్థితికేన తావలంబు

తే॥ కృపఁ దలంపఁ గదయ్యయో నృపవరేణ్య
యభయమీవయ్య యోతుహినాంశు వంశ
కావగదవయ్య యర్థార్థి కల్పశాఖి
నిగ్రహింపకువయ్య యోనిషధరాజ

(శృ.నై.ప్రథ.ఆశ్వా.109 పద్యం)

హంసను నలుడు విడిచి పెట్టాలని తన దీనావస్థను తెలియజేస్తుంది. మా అమ్మకు నేను ఒక్కడినే పుత్త్రున్ని. ముసలిది, కన్పించవు కళ్ళు. నా భార్య కడుసాధ్వి. ఏమి యెరుగదు, ముందు వెనుక ఎవరు చుట్టాలు లేరు. నా పిల్లలకు నేను లేకపోతే ఏ దిక్కు లేదు. నాపై దయజూపు నృపవరేణ్య అంటూ వేడుకుంటుంది. ఇది కరుణ రసప్లావితమైన పద్యం. దుఃఖం స్థాయి భావం. దీనికి ఆలంబన హంస, ఉద్దీపన దాని కుటుంబ పరిస్థితి. ఇవన్నీ కరుణ రస నిష్పన్నానికి కారణ భూతాలు. హంస దుఃఖాన్ని శ్రీనాథుడు హృదయంగమంగా సహజ సిద్ధంగా వర్ణించాడు.

సీ॥ క్రొమ్ముడికై పెక్కికుసుమంబులుమియుచు
నవటుప్రదేశంబునందుఁబొరల
జేవురించిన లేఁత చెక్కుటద్దంబులఁ
దాటంక యుగళంబు తన్నియాడ
నాక్రోశపరిదేవనాక్షర వ్రాతంబు
కంఠగద్గదికచేఁ గ్రక్కుపడఁగ
హరినీలములచాయ నక్షిగోళమ్ముల
సొబగుగాఁ గన్నీటి సోన గురియ

తే॥ ముత్తేయంబుల పేరులు ముఱిసి పడఁగ
హస్తముల వీఁగుఁ జనుదోయియడచికొనుచు
సంబెరం బిచ్చె రతిదేవి శంబరారి
కప్పుడు వసంతు నెదుట దుఃఖార్తయగుచు

(హర.తృతీ.ఆశ్వా.92 పద్యం)

ఇది శివుడు భస్మం చేయగా మన్మథుడి చూసి రతీ విలాపం వర్ణించిన పద్యం. కొప్పులో పూలు జారిపోగా, ఎర్రబడిన చెక్కిళ్ళతో, దుఃఖంతో కంఠం గద్గదికం కాగా, కన్నీళ్ళు కళ్ళ నుండి

ధారలుగా జారిపడగా గుండెలను బాదుకుంటూ, దుఃఖాన్ని పొందింది రతీదేవి. రతీ దుఃఖం కరుణ రస స్థాయి భావం. ఆమె గద్గగ కంఠం, అశ్రువులు, సాత్త్విక భావాలు. ఆమె హృదయ విషాదం వ్యభిచారీ భావం. ఆమె దుఃఖంలో విషాదం సంచరిస్తుంది. గుండెలు బాదుకోవడం ఉద్దీపనం. ఇవన్నీ కరుణ రసానికి తోడయ్యాయి. ఇలా శ్రీనాథుని రస పోషణ వైచిత్ర్యం సహజ సిద్ధంగా కన్పిస్తుంది.

**తే॥ శైలసుతయును భావంబు కీలు దెలిసి**
**యంగకంబులం బులకంబులంకురింప**
**వ్రాల్చె నెమ్మోములజ్జాభరంబు పేర్మిఁ**
**గేకరాలోకనంబులఁ గెల్లుమలఁగి**

**(హర.తృతీ.ఆశ్వా.81 పద్యం)**

పార్వతి, శివుని అంతరంగాన్ని తెలిసినదై, శరీరంపై ఆనందాతిశయం పొందగా, పులకలు వచ్చి, సిగ్గుతో తలవంచి, ప్రక్కకు తిరిగి కడకంటి చూపులతో శివుని చూసింది. శివ పార్వతులు ఆలంబన విభావాలు. క్రీగంటి చూపులు పార్వతి చూడటం ఉద్దీపన విభావం. హర్షాతిరేకం అనేది ఇక్కడ సంచారి భావం. స్థాయి భావం రతి. ఇందులో సంచరిస్తున్న భావమే ఆనందం. సుఖదుఃఖాలలో వాటిని మాటిమాటికి భావించటం వలన కలిగే భావాలు సాత్త్వికాలు. ఇక్కడ రోమాంచం సాత్త్వికభావం. అందుకే కవి 'పులకంబులంకురింప' అన్నాడు. ఇవన్నీ శృంగార రసాన్ని పోషిస్తున్నాయి. ఇట్టి రసపోషణ శ్రీనాథుని రచనల్లోని వైశిష్ట్యాన్ని, వైచిత్ర్యాన్ని, కవి కౌశలాన్ని తెలుపుతుంది.

**ఉ॥ యోగ సమాధి తత్పరతనున్న విధంబున వ్రాసినట్లు మూ**
**ర్ఛాగమ మీలితాత్ముండగు చాకృతి నిశ్చలదేహయష్టియై**
**సోగ కనుంగొనల్ నుదురు చొక్కుల కిక్కలుగాఁగ నత్తటిన్**
**రాగ రసాతిరేకమున బ్రాహ్మణుఁడాదటఁ జూచెమాలెతన్**

**(శివ.తృతీ.ఆశ్వా.34 పద్యం)**

సుకుమారుడు మాలెతను చూసిన తర్వాత ధ్యాన తత్పరతతో ఉన్న విధంగా మూర్ఛ వచ్చి మనసు మూతపడి కదలని దేహం కలవాడిగా ఉంటూనే, పొడవైన కన్ను చివరలు, నుదురు పారవశ్యం పొందగా ప్రేమ రసం విజృంభించగా మాలెతను ప్రీతితో చూసాడు. ఇక్కడ మన్మథ అవస్థలలో, దృష్టి (చక్షుఃప్రీతి) మనస్సంగమం, మూర్ఛ అనేవి వర్ణించబడ్డాయి. రసం శృంగారం.

క॥ శరచాప ధారణంబున్
బరమ మనశ్శాంతిదాంతి పరిపాకంబున్
బరికింపఁ జంక దుడ్డును
శరణార్థియు ననెడు నట్టి చందము దోఁచెన్

(హర.సప్త.ఆశ్వా.17 పద్యం)

శరచాపాలు ధరించి ఉండటం, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం, నీ మనశ్శాంతి, చంకలో కర్ర పెట్టుకొని శరణు కోరే విధంగా ఉన్నది చూస్తుంటే ఎవరినో వేడుతున్నావని తోస్తుందని ఇంద్రుడు అర్జునున్ని అంటాడు. శాంత ప్రస్తావన, అర్జునుని తపస్సు, ఓర్పు చెప్పటం వలన ఇది శాంతరస ప్రధానం అని చెప్పవచ్చు.

తే॥ ఎవఁడవురోరి నీవు నా యెదురఁబాఱు
పందినేసితి బాహు దర్పంబు మెఱసి
యెఱుగవుర యోరి నన్ను నీ యింద్రకీల
పర్వంతంబేలు వనచర సార్వభౌము

(హర.సప్త.ఆశ్వా.50 పద్యం)

శివుడు మాయా వేషంలో అర్జునునిపై కోపగిస్తూ ఎవ్వడవురా నీవు భుజపరాక్రమం వెల్లడి అయ్యేట్టు నా ఎదుట పరిగెత్తే పందిని చంపావని ఆగ్రహిస్తాడు. ఇక్కడ భావం కోపం. రసం రౌద్రం, ఉగ్రత, గర్వం అనే సంచారీ భావాలు పోషింపబడ్డాయి. ఎవ్వడవురా అనే పదం వల్లనే ఇక్కడి వైచిత్ర్యం రసం వ్యక్తమైంది. ఇది కౌశలోజ్జిత రౌద్ర రస పోషణం.

## 5.5. అలంకార నిర్వచనం

కుంతకుడు వాక్యవక్రతలో భాగంగా అలంకార వక్రతను తెలిపాడు. అలంకార వక్రతకు ముందుగా అలంకారానికి గల కావ్యంలోని స్థానం, నిర్వచనం మొదలగు విషయాలను తెలుసుకోవలసి ఉన్నది.

" 'అలం' అనగా భూషణము (Ornament). దీని వలననే అలం + కృ వృద్ధిచే అలం + కార్ = అలంకార శబ్దము కలిగినది. దీనికి విభూషణమని అర్థము. అలంకృతియే అలంకారము. దీనిచే నలంకరింపబడును గావున అలంకారము. అలంకరింపబడునవి రసధ్వనులు అలంకార్యములు" (నరసింహారావు, ఎస్.ఎల్.1981.పుట.8).

"సంస్కృతమున అలంకార శబ్దము ఆభరణార్థమున నుండగా గ్రీకు భాషలో 'Aurum' శబ్దము 'Gold' అను నర్థమున గలదు. ఋగ్వేదమున అంలకృతి శబ్దము.

**"కాతే అస్త్యరం కృతిః సూక్తైః"**

**(ఋ. 7–29–3)**

ఇత్యాది శ్లోకమున అరంకృతిగా ప్రయుక్తమగుట గమనార్హము. 'Alam–aurum' శబ్దముల సాన్నిహిత్యము వలన అలంకారము లౌకికార్థమున నుండి రూపకాలంకార పద్ధతిలో (Metaphorical) కావ్యలక్షణముగా నేర్పడిదనుటకు అవకాశము గలదు" (నరసింహారావు, ఎస్.ఎల్.1981:పుట.9). కావ్యం దేనిచేతనైతే అలంకరింపబడుతుందో అంటే సౌందర్యాన్ని పొందుతుందో అదే అలంకారంగా చెప్తారు.

"అలంభూషణ పర్యాప్తి శక్తి వారణ వాచకమ్" అని అమరకోశం చెబుతుంది. అలంకరణ అనగా – భూషణ కరణం, పర్యాప్తి కరణమము, శక్తికరణము, వారణకరణము అనే ర్థాలు కలవు. ఇచట సందర్భాన్ని బట్టి 'భూషణం' అనే అర్థం గ్రహింపదగును" (శ్రీనివాస్, గొట్టె.2004.పోతన భాగవతం.అలంకార శిల్పం. సిద్ధాంతవ్యాసం:పుట.22).

"అలంకార ప్రాచీన ప్రయోగము వేదములందు కనుపింపగా అలంకార లక్షణభావనమసకమనకగా ప్రాచీన నిఘంటువులలో, వ్యాకరణములలో దర్శనమిచ్చును. సౌందర్య దిదృక్షగల ప్రాక్తన కవులు సాహిత్య నిర్మాణమున ముందంజవేయగా లక్షణ నిర్మాణ ప్రయత్నము చిరకాలము పురిటినొప్పులు పడుచుండెను".

"అలంకార శాస్త్ర సంబంధమగు ప్రధమావగాహన నిఘంటువులందు నిరుక్తమునందు కనుపట్టును. భాషా లక్షణ పరిశీలనము నుండి కవితాస్వరూప పరిశీలనము వైపు దృష్టిమరలినది ఐనను భాషాదృష్టియే ప్రాధాన్యము వహించినది. అలంకార శబ్దము అలంకార పరిభాషగా కాక అలంకరిష్ణు అనురూపమున అలంకరించునది యను వ్యవహారార్థమున యాస్కుడు నిరుక్తమున ప్రయోగించెను. ఇది శతపథబ్రాహ్మణ, ఛాందోగ్యోపనిషత్తులందు గల అలంకారశబ్ద నిరూపణమునకే ఉద్దేశింపబడినది" (నరసింహారావు, ఎస్.ఎల్.1981.పుట.23).

### 5.6. అలంకార తత్త్వము

అలంకారతత్త్వం గూర్చి ప్రాచీన అలంకారికులు తమ అభిప్రాయాలను తెలిపారు అంటూ జంధ్యాల జయకృష్ణ బాపూజీ వివరిస్తూ

**"కావ్యశోభాకరాన్ ధర్మానలంకారాన్ ప్రచక్షతే"**

(అలంకారములు కావ్య సౌందర్య సంపాదకములని అభిజ్ఞులు పలికిరి) అను దండ్యాచార్యుని యభిభాషణమును –

**"కావ్యం గ్రాహ్యమలంకారాత్ సౌందర్యమలంకారః"**

(అలంకార సంసర్గముచేత కావ్యము సహృదయులకు ఉపాదేయమగుచున్నది. అలంకారమే సౌందర్యము) అను వామనాచార్యుని వక్కణములను, అలంకారతత్త్వనిరూపకములు. వామనుడు తన గ్రంథమున తృతీయాధికరణ ప్రథమాధ్యాయములో –

**'కావ్యశోభయాః కర్తారో ధర్మాగుణాః'**

**'తదతిశయ హేతవస్త్వలంకారాః'**

అని చెప్పియుండెను. అనగా కావ్య శోభను కలిగించునట్టివి గుణములు. కాగా ఆ శోభ నతిశయింపజేయునవి అలంకారములగుచున్నవి అని భావము (జయకృష్ణ బాపూజీ జంధ్యాల:1977:పుట.141) అని చెప్పుకు వచ్చారు.

ఇలా అలంకార తత్త్వ చర్చ చేసారని తెలిపారు.

## 5.7. అలంకార స్వరూపం

అలంకార స్వరూపాన్ని గూర్చి వివిధ ఆలంకారికులు చర్చ చేసారు. అలాగే అలంకార ప్రాధాన్యం గూర్చి వివరించారు. అలంకార ప్రస్థానాన్ని స్థాపించిన భామహుడు, దండి, ఉద్భటుడు, రుద్రటుడు మొదలైన వాళ్ళు అలంకార స్వరూప చర్చ చేశారు.

### 5.7.1. భరతుడు

**మూ. అలంకారైర్గుణైశ్చైవ బహుభిః సమలంకృతమ్,**
**భూషణైరివ విన్యస్తైః తద్ భూషణమితి స్మృతమ్**

**(నాట్య (అధ్యా–16, శ్లో.5))**

**భూషణం:** దేహాన్ని ఆయా అవయవాల మీద ఉంచిన (ధరించిన) భూషణాలలాగా, అనేకమైన అలంకారాలచేత, గుణాలచేత కావ్యాన్ని అలంకరించడం భూషణం అని చెప్పబడుతుందని "అలంకారం అనగా వేరుగా తీసి చూడడానికి వీలైన హారకుండలాదికం. కావ్యాలలో ఉపమాదికం. అలంకారాన్నే భూషణం అని కూడ అనవచ్చు. ఐతే ఇక్కడ భూషణం అనగా అందంగా ఉండటానికి ఉపకరించే అన్నింటినీ ఒకచోట అమర్చడం, అలంకరించడం అన్నది కవి గత వ్యాపారం; పని. తద్వారా కావ్యగతమైనది. అందుచేత 'అలంకారం' కాకుండా అలంకారాదులతో అలంకరించడం

అనేది భూషణం. అదే లక్షణం" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.నాట్యశాస్త్రం.పుట.524) ఇలా అలంకార స్వరూపాన్ని తెలిపాడంటూ వ్యాఖ్యాత వివరించారు.

### 5.7.2. భామహుడు

**రూపకాదిరలఙ్కారస్తస్యాన్యైర్బహుధోదితః।**
**నకాన్తమపి నిర్భూషం విభాతివనితాననమ్॥**

రూపకాది అలంకారాలు కావ్యానికి అనేకులు అనేక రకాలుగా చెప్పారు. స్త్రీ ముఖం అందమైనదే అయినప్పటికి అలంకార రహితమైతే ప్రకాశింపదని ఈ శ్లోక భావం.

**గిరా మలఙ్కారవిధిః సవిస్తరః స్వయం వినిశ్చిత్యధియామయేరితః**
**అనేన వాగర్థ విదా మలఙ్కృతా విభాతినారీవ విదగ్ధ మణ్డనా**

**(భామ.కావ్యా.తృతీ.పరి.కా.58)**

నా బుద్ధి చేత స్వయంగా నిశ్చయించి, సవిస్తారంగా వాక్కుల అలంకార రచనా విధానాన్ని చెప్పాను. ఈ అలంకారాలచే అలంకృతమైన స్త్రీలాగా కవులు రచించిన కావ్యం ప్రకాశిస్తుందని తెలిపాడు. ఇలా భామహుడు అలంకార స్వరూపాన్ని స్త్రీతో పోల్చాడు.

### 5.7.3. భోజదేవుడు

**నిర్దోషం గుణవత్ కావ్యమలంకారైరలంకృతమ్**
**రసాన్వితం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతిం చ విన్దతి**

**(భోజ.సరస్వతి.ప్రథ.పరి.కా.2)**

దోషాలు లేనిది, గుణాలు కలది, అలంకారాలతో అలంకరించబడ్డది. రసాలచే ఆస్వాదనీయమైన కావ్యాన్ని రాసిన కవి యశస్సును, ఆనందాన్ని పొందుతాడని అలంకార ప్రాధాన్యాన్ని తెలిపాడు భోజుడు.

### 5.7.4. మమ్మటుడు

**కా॥ ఉపకుర్వన్తి తం సన్తంయేఽ ఙ్గద్వారేమ జౌతు చిత్**
**హారాదివదలంకారాస్తేఽ నుప్రాసోపమాదయః**

**(కావ్య.ప్రకా.అష్ట.ఉల్లా.కా.67)**

కంఠాది అవయవాలకు, హారాది అలంకారాలు స్త్రీకి ఏ విధంగా శోభను కూరుస్తాయో శబ్దార్థాల ద్వారా అనుప్రాస ఉపమాలంకారాలు ప్రధాన రసానికి ఉపస్కారకాలవుతాయని దీని అర్థం. శోభనిస్తాయి. ఇలా రుయ్యకుడు, వాగ్భటుడు, హేమచంద్రుడు, జయదేవుడు, విద్యానాధుడు,

విశ్వనాథ కవిరాజు, విశ్వేశ్వర కవిచంద్రుడు ఇలా చాలామంది అలంకారికులు అలంకార వివేచన చేసారు.

### 5.8. అలంకార సంఖ్య – వర్గీకరణ

ప్రాచీన కవుల ప్రయోగం, సమకాలపు సమాజంలో భాషనుబట్టి, ఆలంకారికులు అలంకార శాస్త్రాల్లో చర్చించిన దాన్ని బట్టి అలంకార సంఖ్యా అనేది పెరుగుతూ వచ్చింది. మొదట భరతుడు చెప్పినదాన్ని బట్టి నాలుగే కానీ తర్వాత వచ్చిన అప్పయ దీక్షితుల నాటికి నూట ఇరవై నాలగు అయ్యాయి.

"భరతుడు నాట్యశాస్త్రమున ఉపమ, దీపకము, రూపకము, యమకము అను నలంకార చతుష్టయమును చెప్పెను. భామహుడు ముప్పది యెనిమిదలంకారములను, దండిముప్పదియేడ లంకారములను, ఉద్భటుడు నలువది యొక్క యలంకారములను, వామనుడు ముప్పది మూడలంకారములను, రుద్రటుడు డెబ్బదిమూడలంకారములను, అగ్నిపురాణకారుడు ఎనిమిది లంకారములను భోజదేవుడు డెబ్బది రెండలంకారములను, హేమచంద్రుడు ముప్పదియైద లంకారములను, రుయ్యకుడు ఎనుబదినాల్గలంకారములను, వాగ్భటుడు ముప్పది తొమ్మిదలంకారములను, జయదేవుడు నూటారలంకారములను, విద్యానాథుడు డెబ్బదిమూడలంకారములను, విశ్వనాథుడు ఎనుబదెనిమిది అలంకారములను, విశ్వేశ్వరుడు ఏబది యైదలంకారములను, అప్పయ్యదీక్షితుడు నూటయిరువది నాలుగలంకారములను నిరూపించినారు"(జయకృష్ణ బాపూజీ, జంధ్యాల.1977.పుట.146). సాధారణంగా అలంకారాలను మూడు రకాలుగా విభజించారు. 1) శబ్దాలంకారాలు, 2) అర్థాలంకారాలు, 3) ఉభయాలంకారాలు. కుంతకుడు వక్రోక్తి జీవితంలో చెప్పిన 6 ప్రధాన వక్రతల్లో వాక్య వక్రత ఒకటి. అందులో భాగంగా 20 అర్థాలంకారాలను తెలిపాడు. కుంతకుడి కన్నా ముందు, తర్వాత ఆలంకారికులు చెప్పిన అర్థాలంకారాలను, సంఖ్యను పరిశీలిద్దాం. కొన్నింటిని అంగీకరించిన కుంతకుడు కొన్నింటిని తిరస్కరించాడు. ఆలంకారికులు రకరకాల విభజనలు కూడా చేసారు.

#### 5.8.1. భరతుని అర్థాలంకారాలు

భరతుడు అర్థాలంకారాలను మూడింటిని తెలిపాడు.

**మూ. ఉపమా రూపకం చైవదీవకం యమకం తథా**

**అలఙ్కారాస్తు విజ్ఞేయాశ్చత్వారో నాటకాశ్రయాః**

**(నాట్య.అధ్యా.16.శ్లో.40)**

నాటకాల్లో ఉపమ, రూపకం, దీపకం, యమకం అనేవి ఉంటాయి అని తెలిపాడు.

### 5.8.2. భామహుని అర్థాలంకారాలు

భామహుడు ద్వితీయ, తృతీయ పరిచ్ఛేదంలో అలంకారాలు తెలిపాడు. కుంతకుడు స్వభావోక్తిని అలంకారంగా భావించనట్లే భామహుడు కూడా అంగీకరించలేదని ఈ మూల శ్లోకాన్ని చూస్తే తెలుస్తుంది.

**స్వభావోక్తి రలంకార ఇతికేచిత్ ప్రచక్షతే**

**అర్థస్య తదవస్థత్వం స్వభావోఽభి హితో యథా**

**(భామ.కావ్యా.ద్వితీ.పరి.శ్లో.93)**

స్వభావోక్తి కూడా అలంకారమని కొందరు చెప్తారు. ఒక వస్తువు దాని స్వరూపాన్ని కలిగి ఉండటం దానిని ఉన్నది ఉన్నట్లు వర్ణించడమే స్వభావోక్తి. వస్తు సహజ స్వభావం అదని తెలుపుతాడు. దీన్ని బట్టి అలంకారంగా అంగీకారం కాదని తెలుస్తుంది. హేతు, సూక్ష్మ, లేశాలను కూడా త్యజిస్తూ ఇలా అంటాడు.

**హేతుశ్చ, సూక్ష్మో లేశోఽథనాలఙ్కారతయా మతః**

**సముదాయాభానస్య వక్రోక్త్యనభిధానతః**

**(భామ.కావ్యా.ద్వి.పరి.శ్లో.86)**

హేతు, సూక్ష్మ లేశాలు అలంకారాలు కావు. ఎందుకంటే ఇందులోని పూర్ణ వాక్యాలు వక్రోక్తిరూపమైన వాక్యాలు కావు అని అర్థం. వక్రోక్తిని సర్వాలంకా బీజంగా భావించాడు కనుక ఇందులో వక్రత లేని కారణంగా అంగీకరించలేదు. కొన్నింటిని అంగీకరించాడు. కొన్నింటిని తిరస్కరించాడు. ఉపమ, రూపక, అర్థాంతరన్యాస, వ్యతిరేక, విభావన, సమాసోక్తి, అతిశయోక్తి, ఉత్ప్రేక్ష, యథాసంఖ్యా మొదలైన అలంకారాలను 36గా తెలిపాడు. అతిశయోక్తి అలంకారం అన్నింటిలో ఉంటుందని తెలుపుతూ ఇలా అంటాడు.

**ఇత్యేవ మాదిరుదితా గుణాతిశయయోగతః**

**సర్వైవాతిశయోక్తిస్తు తర్కయేత్తాం యథాగమమ్**

**(భామ.కావ్యా.ద్వితీ.పరి.శ్లో.84)**

అతిశయోక్తి అలంకారం గుణాతిశయంతో సంబంధముండటంచేత ఏర్పడుతుందని తెలిపాడు. ఈ అతిశయోక్తి అలంకారం లోకోత్తర గుణవర్ణనమును కలిగి ఉంటుందని అదే వక్రోక్తిని తెలుపుతూ

**సైషాసర్వైవ వక్రోక్తిరనయార్థోవిభావ్యతే**
**యత్నోఽస్యాంకవినా కార్యః కోఽలఙ్కారోఽనయావినా**

**(భామ.కావ్యా.ద్వితీ.పరి.శ్లో.85)**

ఈ అతిశయోక్తి అంతా వక్రోక్తియే అని తెలిపి వక్రోక్తి లేనిది ఏ అలంకారం లేదన్నాడు. ఇలా భామహుడు వక్రోక్తిని సర్వాలంకారంగా అతిశయంగా చెప్తూ 36 అలంకారాలను అంగీకరించాడు.

### 5.8.3. దండి అర్థాలంకారాలు

దండి అలంకారాలు కావ్యానికి శోభాహేతువులుగా తెలుపుతూ 35 అర్థాలంకారాలను వివరించాడు. వాటి మూల శ్లోకాలను చూద్దాం.

**మూ. స్వభావాఖ్యానముపమా రూపకం దీపకావృతీ**
**ఆక్షేపోఽర్థాన్తరా న్యాసోవ్యతిరేకో విభావనా**
**సమాసాతిశయోత్ప్రేక్షా హేతుః సూక్ష్మోలవః క్రమః**
**ప్రేమో రసవదూర్జస్వి పర్యాయోక్తం సమాహితమ్**

**(కావ్యాదర్శం.ద్వితీ.పరి.శ్లో.4, 5)**

స్వభావోక్తి, ఉపమ, రూపకం, దీపకం, ఆవృత్తి దీపకం, అక్షేపము, అర్థాన్తరన్యాసం, వ్యతిరేకం, విభావన, సమాసోక్తి అతిశయోక్తి, ఉత్ప్రేక్ష, హేతువు, సూక్ష్మము, లేశము, క్రమము, ప్రేయస్సు, రసవత్తు, ఊర్జస్వి. పర్యాయోక్తము, సమాహితము, ఉదాత్తము, అపహ్నుతి, శేషము, విశేషము మొదలైన 35 అర్థాలంకారాలను తెలిపినట్లు కావ్యాదర్శంలోని మూల శ్లోకాల్లో గమనించవచ్చు. ఇలా రకరకాలుగా అలంకారాలను తెలిపారు. వీరి తర్వాత వచ్చిన ఉద్భటుడు, 37 అర్థాలంకారాలను, వామనుడు, 29 అర్థాలంకారాలను, రుద్రటుడు, 68 అర్థాలంకారాలను, భోజుడు 24 అర్థాలంకారాలను, తెలిపారు. కుంతకుడు 20 అలంకారాలను, మమ్మటుడు 59 అలంకారాలను, రుయ్యకుడు 75 అలంకారాలను, వాగ్భటుడు 60 అలంకారాలను, హేమచంద్రుడు 29 అలంకారాలను, జయదేవుడు 87 అలంకారాలను, విద్యానాథుడు 67 అలంకారాలను, విశ్వనాథుడు 77 అలంకారాలను, అప్పయదీక్షితులు 119 అర్థాలంకారాలను తెలిపారు. ఒక్కొక్కరు ఒక్కోరకంగా విభజించారు.

విద్యానాథుని విభజన ఉదాహరణకు చూద్దాం. శబ్ద, అర్థ, ఉభయ అలంకారాలను విభజించాడు. అందులో అర్థాలంకారాలను పరిశీలించగా ఇలా భేదాలున్నాయి. 1) ప్రతీయమానవస్తుకములు, 2) ప్రతీయమానౌపమ్యములు, 3) ప్రతీయమానరసభావాదులు, 4)

అస్ఫుటప్రతీయమానములు, 5) సాధర్మ్యమును బట్టి భేద ప్రధానములు, 6) అభేదప్రధానములు, 7) భేదాభేదాప్రధానములు, 8) అధ్యవసానమూలములు, 9) విరోధమూలములు, 10) వాక్యన్యాయమూలములు, 11) లోక వ్యవహారమూలములు, 12) తర్కన్యాయమూలములు, 13) శృంఖలాన్యాయమూలములు, 14) అపహ్నవమూలములు, 15) విశేషణ వైచిత్ర్యమూలములు.

**1) ప్రతీయమాన వస్తుకములు:**

"సమాసోక్తి పర్యాయోక్తి ఆక్షేపము వ్యాజస్తుతి ఉపమేయోపమ అనన్వయము అతిశయోక్తి పరికరము అప్రస్తుత ప్రశంస అనుక్త నిమిత్త విశేషోక్తి".

**2) ప్రతీయమానౌపమ్యములు:**

"రూపకము పరిణామము సందేహము భ్రాంతిమంతము ఉల్లేఖము అపహ్నవము ఉత్ప్రేక్ష స్మరణము తుల్యయోగిత దీపకము ప్రతి వస్తూపము దృష్టాంతము సహోక్తి వ్యతిరేకము నిదర్శనము శ్లేష".

**3) ప్రతీయమానరసభావాదికములు:**

"రసవంతము ప్రేయస్వి సమాహితము భావోదయము భావసంధి భావశబలత".

**4) అస్ఫుట ప్రతీయమానములు:**

"ఉపమ వినోక్తి అర్థాంతరన్యాసము విరోధము విభావన ఉక్తగుణ నిమిత్త విశేషోక్తి విషమము సమము చిత్రము అధికము అన్యోన్యము కారణమాల ఏకావళి వ్యాఘాతము మాలాదీపకము కావ్యలింగము అనుమానము సారము యథాసంఖ్యము అర్థాపత్తి పర్యాయము పరివృత్తి పరిసంఖ్య వికల్పము సముచ్చయము సమాధి ప్రత్యనీకము ప్రతీపము విశేషము నిమీలనము సామాన్యము అసంగతి తద్గుణము అతద్గుణము వ్యాజోక్తి వక్రోక్తి భావికము ఉదాత్తము" (విద్యానాథుని ప్రతాపరుద్రీయం. పుట.401). ఇవి కాకుండా శబ్ద భేదాలను కూడా తెలిపారు. శబ్దాలంకారంలో వృత్త్యానుప్రాస, ఛేకానుప్రాస, లటానుప్రాస, యమక లంకారాలను తెలిపాడు. ఇవి కుంతకుని వర్ణవిన్యాసంలో భాగమయ్యే విధంగా ఉన్నట్లు తెలిపాము. జయదేవుడు తను రాసిన చంద్రాలోకంలో వంద అర్థాలంకారాలను సోదాహరణంగా వివరించారు. ఇలా ఆలంకారికులు శబ్ద, అర్థ అలంకారాలను తెలిపారు. ఇక కుంతకుడు చెప్పిన అలంకారాల గూర్చి చర్చించటం ప్రస్తుత అంశం.

### 5.9. కుంతకుని అలంకార వక్రత – భేదాలు

వాక్య వక్రతలో భాగంగా కుంతకుడు స్వభావానికి, రసానికి ప్రాధాన్యత ఇచ్చి అవన్నీ కూడా వాక్య వక్రతలో సాధ్యమవుతాయని చెప్పాడు. వాక్యవక్రతలో ప్రధానంగా అలంకారాలను కుంతకుడు ఇరవై అలంకారాలను తెలిపాడు.

1) రసవత్తు, 2) దీపకం, 3) రూపకం, 4) అప్రస్తుత ప్రశంస, 5) పర్యాయోక్తి, 6) వ్యాజస్తుతి, 7) ఉత్ప్రేక్ష, 8) అతిశయోక్తి, 9) ఉపమ, 10) శ్లేష, 11) వ్యతిరేకము, 12) సహోక్తి, 13) దృష్టాంతం, 14) అర్థాంతరన్యాసం, 15) ఆక్షేపం, 16) విభావనాలంకారం, 17) ససందేహం, 18) అపహ్నుతి, 19) సంసృష్టి 20) సంకరము.

### 5.9.1. రసవత్తు

రసవదలంకార లక్షణాన్ని పూర్వులు చెప్పినదాన్ని ఖండిస్తూ ఇలా అంటాడు.

**కా॥ అలంకారోన రసవత్ పరస్యాతిప్రతిభాసనాత్**
**స్వరూపాతిరిక్తస్య శబ్దార్థాసంగతేరపి**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.11)**

వర్ణించే వస్తువు స్వభావాన్ని, స్వరూపాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించి దాని లోపల ఎలాంటి వైచిత్ర్యం శోభించకుండా శబ్దార్థాల సంగతి లేకుండా ఉంటే అది రసవత్ కాదు అంటున్నాడు. పదార్థాల స్వభావం సర్వదా అలంకార్యమే కానీ అది అలంకారం కాదని స్వభావోక్తి విషయంలో చెప్పినట్లు రసవదలంకార విషయంలో అదే విధంగా చెప్తున్నాడు. రసము కూడా అలంకార్యమే కానీ రసమే అలంకారం కాదు. రసాలనే స్పష్టంగా ప్రతిపాదించిన దానినే రసవత్తు కాదు. ఏది రసవత్ అంటే ఈ కారికలో తెల్పాడు. చూద్దాం.

**కా॥ యథాస రసవన్నామ సర్వాలంకార జీవితమ్**
**కావ్యైకరసతాం యాతి తథేదానీం వివిచ్యతే**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.14)**

**కా॥ రసేనవర్తతే తుల్యం రసవత్త్వ విధానతః**
**యోఽలంకారః స రసవత్ తద్విహ్లాదనిర్మితేః**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.15)**

ఏ రసవదలంకారము సర్వాలంకారాలకు జీవితమై కావ్యంలో ప్రధానసారంగా ఉంటుందో అది ఇప్పుడు వివేచించబడుతుంది. ఏ అలంకారము కావ్యాన్ని రసవంతం చేయడానికి రసముతో

సమానంగా సహృదయాహ్లాదకారి అవుతుందో అది రసవత్ "ఆ రసవదలంకారమునేక రసే నేత్యాది కారికచే లక్షణము చెప్పుచున్నాడు. ఏ అలంకారము కలదో అది రసవత్ – అని అన్వయము. ఏ రూపకాద్యలంకారము ఈ విధముగా ఉండునో అది రసవత్ అని చెప్పబడును. ఆయలంకారములు స్వరూపము చేతనే అట్లగుచున్నవా? 'రసేన వర్తతే తుల్యమ్' రసేన = శృంగారాది రసముతో, తుల్యముగనుండును (బ్రాహ్మణకర్మ చేయుటచే) క్షత్రియుడు ఏ విధముగ బ్రాహ్మణుని వలె నున్నాడని చెప్పుదుమో అట్లే (రసకార్యమును చేయుటచే ఈ యలంకారము కూడ రసవత్ (రసమువతి) నుండును" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.320).

కుంతకుడు ప్రధానంగా రసంతో కూడిన ఇతరాలంకారములు ఏవైనా సరే రసవత్ అవుతాయని తెల్పాడు. కేవలం రసమే ఉంచి అందులో ఏ వైచిత్ర్యం లేకపోతే అది అలంకారం కాదని తెల్పాడు. శృంగారాది రసాలతో ఉండి రసకార్యం చేయడం ద్వారా ఈ అలంకారం కూడా రసం లాగే ఉంటుంది. రసంలాగే సమానంగా ఉండే అలంకారం రసవత్ అని అర్థం. కుంతకుని అభిప్రాయం ప్రకారం రస ప్రతీతి ఉంటే రూపక్యాదలంకారాలు కూడా 'రసవత్తు'లు అవుతాయి. లేకపోతే మామూల రూపకాద్యాదులు అవుతాయి. ఉదాహరణగా ఒక శ్లోకాన్నిచ్చాడు.

**"అంగుళీభిరివ కేశ సంచయం సంనిగృహ్యతిమిరం మరీచిభిః**
**కుడ్మలీకృత సరోజలోచనం చుంబతీవ రజనీముఖంశశీ**

**(వ.జీ.పుట.323)**

### 5.9.1.1. రసవత్తు – సమన్వయం

**తే॥ మెలఁతయప్పుడు మందాక్ష మీలితములు**
**సౌహృదస్మేరములు నైన సంగమముల**
**ముకుళితంబులుఁ బుష్పితంబులును నైన**
**భూజములతోడి యుద్యానభూమిఁ బోలె**

**(శృ.నై.సప్త.ఆశ్వా.175 పద్యం)**

మదనోదయమైన తర్వాత దమయంతి సిగ్గుచేత, సంకుచితమై, సహృదయ కూర్మిచేత వికసితాలైన పుష్పాలతో కూడిన విహార వన ప్రదేశం లాగా ఉంది. ఇక్కడ విహార ప్రదేశంలాగా ఉందని చెప్పటం ఉపమ. ముకులిత పుష్పాలకి ఉద్యాన వనభూమికి బింబప్రతిబింబ భావం చెప్పబడ్డది. అలంకార ఉపమ కానీ ఇందులో శృంగార రసం ఉంది. ఆలంబన నలదమయంతులు,

ఉద్దీపన సిగ్గు, ప్రేమ ఈ రసాన్ని పోషించడానికి ఉపమ అలంకారం దోహదమయ్యింది కనుక రసవదలంకారం.

**క॥ తరుణికి ధాత్రీపతికిని**
**బరిచుంబన వేళదంతపరిపీడన మి**
**క్షురసంపుఁ బానకములో**
**మిరియఁపు గారంబువోలె మెచ్చొ నరించెన్**

(శృ.నై.సప్త.ఆశ్వా.108 పద్యం)

నలదమయంతుల పరిచుంబన వేళ, దంతక్షతం చెరుకు రసంలో మిరియపు గింజకలాగా కలిగి కారాన్ని కలిగించిందని క్షతాన్ని కారంతో పోల్చాడు. ఇందులో ఉన్న అలంకారం ఉపమ. రసం శృంగారం. మన్మథ చేష్టలు దంతక్షతం. స్థాయి రతి. పోలిక మిరియపు కారంతో చెప్పటం. ఉపమేయ ఉమానాల సమాన ధర్మం చెప్పటంతో ఇది ఉపమాలంకారం. ఇందులో రసానికి అలంకారం తోడైంది కనుక రసవత్తు.

**తే॥ సతత తాంబూల భోగ కషయితములు**
**నుదయ భాస్కర నవ సౌర భోల్బణములు**
**నయిన యధరామృతముల నింతియును బతియుఁ**
**జలిపి రన్యోన్య మధుపాన లలితకేళి**

(శృ.నై.సప్త.ఆశ్వా.184 పద్యం)

తాంబూలంలో చేరే ఉదయ భాస్కరం అనే పేరు గల కర్పూర విశేషం యొక్క పరిమళం చేత ఒప్పే అధరమృతాలను గ్రోలడం వలన ఇద్దరు మద్యము త్రాగటం వల్ల కలిగే మనోజ్ఞ క్రీడను పొందారు అని అనటం నిదర్శనాలంకారం. ఇక్కడ కేళిలాంటి కేళి అన్నారు. కానీ అదే కేళి అని చెప్పలేదు. మన్మథ చేష్టితం వర్ణించబడింది రసవత్తు.

**తే॥ చివురుగెమ్మోవి చిఱలగాటు నెపముగాఁగఁ**
**దామరసనేత్ర! కోపింప తగదు మమ్ము**
**ఫల రసాస్వాదన మొనరించు చిలుక మీఁద**
**బింబవల్లీ మతల్లి కోపించునెట్లు?**

(శృ.నై.అష్ట.ఆశ్వా.47 పద్యం)

చిగురులాంటి ఎర్రటి పెదవిపై నేను కావించిన చిన్నకాటు కారణంగా నన్ను కోపించకని నలుడు అంటాడు. ఫలరసా స్వాదనం కోసం దొండపండు రుచి అనుభవానికి చిలుక చేసిన గాటుకి దొండ తీగ కోపించదు. నీవు నామీద అలుక దాల్చితే అది ఉచితం కాదని అంటాడు. 'కోపింపనట్లు' అనే పోలిక చెప్పడం ఉపమాలంకారం. శృంగార రసపోషణ యుక్తమైనందుకు రసవత్తు.

**చ॥ హింసయ నీకు వేడ్కయగునేని గృపాశ్రయ మైనయీసరో**
**హంసముఁజంపనేల? కలవా తరువాత వసుంధరాధి పో**
**త్తంస, విజృంభమాణ భుజ దర్ప నిరంకుశ సాహసక్రియా**
**మాంసల చిత్తవృత్తులయి మత్తిలియుండు నరాతిభూపతుల్**

(శృ.నై.ప్రథ.ఆశ్వా.107 పద్యం)

హంస నలునితో సంభాషిస్తూ హింస నీకు వేడుక అయితే కరుణాపాత్రం అయిన నాలాంటి కొలను హంసను చంపడం ఎందుకు. మదించి ఉన్న శత్రు రాజులు లేరా అంటూ తన ఆవేదనను తెలుపుతుంది. కృపాపాత్రమైన సంఘటన రసం కరుణం. ఈ రసానికి పరికరాలంకారం తోడైంది కనుక రసవత్తు.

**క॥ స్తంభించి నిలిచె గరళము**
**శంభుని ముందట యుగాంత జలధరము గతిన్**
**గంభీర హుంక్రియావ**
**ష్టంభ సముజ్జృంభమాణ సంరంభమునన్**

(హర.షష్ఠా.ఆశ్వా.ప.68)

గంభీరమైన హుంకారం వల్ల అతిశయించిన వేగంతో నిరోధించబడి, గరళం చలనం లేక, ప్రళయ కాలవేళలోని మేఘంలాగా శంభుని ఎదుట చలనం లేక నిలిచిపోయింది. ఉపమేయ, ఉపమానాలకు పోలిక చెప్పబడింది. అలంకారం ఉపమ కానీ ఇందులో గంభీరమైన హుంకారం అనే క్రోధం వల్ల జనియించిన గరళం గూర్చి చెప్పటం విశేషం. క్రోధం స్థాయి భావం, రౌద్రం, రసం. ఈ రసానికి ఉపమాలంకారం తోడయ్యింది కనుక రసవత్తు.

**శా॥ ప్రారంభంబొక యింత లేకను దృణప్రాయంబు నట్లొందఁగాఁ**
**గ్రూరాజిందెగనేసెనో నటికెనో క్రొవ్వాడి అంపంబుచే**
**నీ రీతిందునుమాడవచ్చునె యనన్ హేలాగతింద్రుంచె దు**
**ర్వారాహంకృతి నీశ్వరుండు విజయాస్త్రవ్రాతమున్ వ్రేల్మిడిన్**

(హర.సప్త.ఆశ్వా.69 పద్యం)

మొదలు అనేదే లేకుండా ఒక్కసారిగా ఉధృతంగా అర్జునుడు వేసిన బాణాల గుంపును, యుద్ధరంగంలో రంపంతో తెగగొట్టాడా? అనేంత ఆశ్చర్యంగా ఒక్క క్షణంలో తుంచివేసాడు శివుడు. ఇక్కడ ఆశ్చర్యం స్థాయీ భావం. రసం అద్భుతం గడ్డిపోచల సమూహాన్ని, ఒక్కసారి రంపంతో కోసినట్లు చేసాడని ఉత్ప్రేక్షించడం చేత ఉత్ప్రేక్షాలంకారం. ఇందులోని రసానికి ఈ అలంకారం సహకారి అయినందున రసవత్తు.

**క॥ కుసుమాయుధ నిభుండగు నా**
**రసికునిపై వ్రాలు సానురాగముతోడన్**
**బిసరుహనయనల చూపులు**
**భసలంబులు పూవుందోంటపయి వ్రాలుగతిన్**

(శివ.ద్వితీ.ఆశ్వా.92 పద్యం)

సుకుమారుడు మన్మథాకారం కలవాడు. ఆ శృంగార పురుషునిపై పద్మాక్షుల చూపులు తుమ్మెదలు పూదోటపై వాలినట్లు అనురక్తితో వాలుతాయి. తుమ్మెదలతో పద్మాక్షుల చూపులు పోల్చటం ఉపమాలంకారం. సుకుమారుని మన్మథునిగా భావించటం శృంగారం. ఈ రసానికి ఉపమాన అలంకారం తోడయ్యింది కనుక రసవత్తు.

**ఉ॥ కాళిక దివ్యమందిరము క్రట్టెదురం బశుకంఠ నాళకీ**
**లాలరసంబు గ్రోలు నభిలాషమునం జనుదెంచియున్నవే**
**తాళగణంబు వోలె నతిదైర్ఘ్యమునన్ దివి దాకియున్న హిం**
**తాళవనంబు గన్గొని యతండు మహాద్భుతమందె నాత్మలోన్**

(శివ.తృతీ.ఆశ్వా.110 పద్యం)

సుకుమారుడు కాళికాదేవి దివ్యదేవాలయము ఎదుట ఉన్న హింతాళ వనం చూసి మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు. ఆ వృక్షాలు పశువుల కుత్తుక గొట్టంలో రక్తం తాగే కోరికతో వచ్చియున్న పిశాచాల లాగా పొడవుగా ఆకాశాన్నంటుతున్నవని భావం. ఇక్కడ భావం ఆశ్చర్యం. పోషింపబడ్డ రసం అద్భుతం. ఈ రసానికి అతిశయించే విధంగా ఉన్నదానికన్నా ఎక్కువ చెప్పటం అతిశయోక్తి అలంకారం తోడై రసానికి బలాన్నిచ్చింది కనుక రసవత్తు.

**చ॥ సుదతి ముఖేందు మండలము సొంపున రాగ రసాంబురాశి య**
**భ్యుదయముఁ బొంది యెంతయును నుబ్బున వేల నతిక్రమించుదున్**

**మది౯గడుభీతి౯ బొందిన క్రమంబున భూవరు దృష్టి సేరెన**

**మ్మద గజరాజయాన కుచమండలతుంగ మహీంద్రశృంగమున్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.148 పద్యం)**

నలునికి దమయంతి ముఖం అనే చంద్రున్ని దర్శించటంలో అనురాగ సముద్రం ఉప్పొంగి చెలియలికట్టను దాటుకొని పోగా, ఆ చూపు తాను ఆ వెల్లిలో మునిగిపోతాననే భయంతో ఆ మత్తగజయాన వక్షస్సుపై గిరి శిఖరం అనుకొని ఎక్కాడని భావం. ఇక్కడ ఉత్ప్రేక్ష, రూపకాలంకారాలు ఉన్నాయి. శృంగార రసానికి దోహదమయ్యాయి. కనుక రసవత్తు. స్తన సౌందర్యాన్ని శిఖరంగా ఊహించటం ఉత్ప్రేక్ష, ముఖేందు బింబం అనటం రూపకం.

**తే॥ యౌవనాంభోధ రోద్భూత హావభావ**

**వారి ధారాభిపూర్ణ శృంగార తటిని**

**యబ్జభవ సృష్టి విద్యా రహస్య భూమి**

**నిఖిల లావణ్య సీమ యీ నీరజాక్షి**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.155 పద్యం)**

ఈ దమయంతి యౌవనంచేత కలిగిన హావభావాలతో రంజిల్లుతూ ఉన్న శృంగారం కలదై నూతన మేఘాల జడివానతో నిండిన నదిలాగా శోభిస్తుంది. దీనికి మించిన లావణ్యం ఎవ్వరికి లేదని భావం. యౌవనాదులు ఉద్దీపన విభావం. రసం శృంగారం. ఇందులో అలంకారం 'శృంగార తటి' అనటం రూపకం. ఈ అలంకారం రసవృద్ధికి కారణభూతమయ్యింది.

### 5.9.2. దీపకం

కుంతకుడు పూర్వులు చెప్పిన రసవదలంకార నిర్వచనాన్నే కాకుండా దీపకాలంకారాన్ని కూడా తిరస్కరించాడు. దీనికి భామహుని దీపకాలంకార లక్షణాన్ని ఉదహరణగా ఇలా ఇచ్చాడు.

**ఆది మధ్యాంత విషయం త్రిధా దీపకమిష్యతే**

**ఏకస్యైవ త్ర్యవస్థత్వాదితి తద్భిద్యతే త్రిధా**

**అమూని కుర్వతేऽ స్వర్థామస్యాఖ్యామర్థ దీపనాత్**

**త్రిభిర్నిదర్శనైశ్చేదం త్రిధా నిర్దిశ్యతేయథా**

**(వ.జీ.పుట.325) (11-25, 26)**

"దీపకము ఆది విషయమనియు, మధ్య విషయమనియు, అంత విషయమనియు మూడు విధములుగ అంగీకరింపబడుచున్నది. ఒకే క్రియాపదము మూడు స్థానములలో నుండుటచే అది

మూడు విధములుగా నుండును. ఇవి (ఈ క్రియాపదములు) అర్థమును దీపింపచేయుటచే దీని యొక్క (దీపకము యొక్క) నామధేయమును సార్థకమైన దానినిగ చేయుచున్నవి. ఇది మూడు విధములుగ నిర్దేశింపబడుచున్నది అని వీటి అర్థం" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.326). ఇక్కడ దీవకం అంటే క్రియాపదం ఇతర పదాలతో అన్వయించటం అని అర్థం. దానిని ఖండించి, కుంతకుడు భామహుని లక్షణంలో ఎనిమిది దోషాలను చూపెట్టాడు. సాధారణంగా దీపకం అంటే ఉపమేయ ఉపమానాలకు సాధన ధర్మంతో ఒకే అన్వయాన్ని చెప్పటం. దీపకాలంకారాన్ని మమ్మటుడు తన కావ్య ప్రకాశంలో ఇలా చెప్పాడు. చూద్దాం:

**కా॥ సకృద్వృత్తిస్తు ధర్మస్య ప్రకృతాప్రకృతాత్మనామ్**
**సైవక్రియాసు బహ్వీసు కారకస్యేతి దీపకమ్**

**(కా.ప్ర.ఉల్లా.10.కా.103)**

ప్రాకరణికా ప్రాకరణికాలకు అంటే ఉపమేయ ఉపమానాలకు సంబంధించిన క్రియాధర్మం ఒక్కసారే చెప్పితే అది అన్ని వాక్యాలను ప్రకాశింపజేస్తుంది కాబట్టి దీపకం అనే పేరు వచ్చిందని తెలిపాడు.

కుంతకుడు చెప్పిన దీపకాలంకా నిర్వచనాలు చూద్దాం.

**కా॥ ఔచిత్యావహమమ్లానం తద్విదాహ్లాద కారణమ్**
**అశక్తం ధర్మమర్థానాం దీపయద్వస్తు దీపకమ్**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.17)**

ఒక్కోసారి ఒకే దీపకం ఉంటుంది. కొన్నిసార్లు అనేకాలకు అనేకాలు ప్రకాశాలుగా ఉంటాయి. అది ఒకటిగాని, పంక్తి సంస్థముగా గాని రెండు విధాలుగా కనబడుతుందని అర్థం. దీపకానికి ఉదాహరణగా శ్లోకాన్ని ఇచ్చాడు చూద్దాం.

**"కవికేసరి వచనానాం మౌక్తికరత్నానామాదివై కటికః**
**స్థానాస్థానం జానాతి కుసుమానాం చజీర్ణమాలాకారః"**

**(వ.జీ.పుట.331)**

"కవి సింహము పదముల యొక్కయు, పురాణరత్న పరీక్షకుడు మౌక్తిక రత్నముల యొక్కయు, వృద్ధమాలాకారుడు పుష్పముల యొక్కయు, స్థానాస్థానములను (ఏది దేనికి తగిన స్థానము; తగని స్థానము అను విషయమును) తెలిసి కొనగల్గుచున్నాడు".

"ఇచట 'స్థానాస్థానం జానాతి' అనెడు అనేక పద సముదాయము మూడు పాదములలో నున్ను అనేక పదార్థములకు ప్రకాశకముగ నున్నది గాన ఇది పంక్తి సంస్థ దీపకమునకు ఉదాహరణము" (శ్రీరామచంద్రుడు.వక్రోక్తిజీవితం.2007.పుట.332). దీన్నే వేరే వాళ్ళు మాలా దీపకం అన్నారు. పూర్వుల లాగే కుంతకుడు కూడా చెప్తున్నాడు కదా దాంట్లో భేదం ఏంటని సందేహం కలుగగా దీనిని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానిస్తూ ఇలా సమాధానాన్ని తెలిపాడు.

"వెనుక పూర్వాచార్యులు గూడ దీనినే ఉదహరించినారు కదా? మొదట దానిని నిరాకరించి ఇపుడదియే సరిగనున్నట్లు చూపబడినది? (సమాధానము) నిజమే పల్కితివి. ఇదిగో అభిప్రాయము చెప్పుచున్నాను. ఒక్క క్రియాపదము మాత్రమే దీపకమని వారి తాత్పర్యము. కాని మా అభిప్రాయమేమనగా – కర్తృపదాదులను బట్టి ఏర్పడు దీపకములు అనేక విధములుగ సంభావ్యములు అని" (శ్రీరామచంద్రుడు.వ.జీ.వ్యా.2007.పుట.335) వ్యాఖ్యానించారు. దీపకానికి సరైన లక్షణాన్ని చెప్తూ కుంతకుడు ఈ కారికను చెప్పాడు. చూద్దాం.

**కా॥ యథాయోగి క్రియాపదం మనః సంవాది 'తద్వి'దామ్**
**వర్ణనీయస్య విచ్ఛిత్తేః కారణం వస్తుదీపకమ్**

**(వ.జీ.తృ.ఉన్మే.కా.18)**

అనుకూలమైన విధంగా సంబంధించిన క్రియాపదం కలది, కావ్యజ్ఞుల మనస్సుతో సంవందించునది, వర్ణనీయమగు విషయానికి శోభకు కారణం అయ్యే వస్తువు దీపకం అని అర్థం.

### 5.9.2.1. దీపకం – సమన్వయం:

**తే॥ కాలమృత్యువు వెసఁదోలి కఱవవెఱచు**
**నహిమ రోచియు నెండఁ గాయంగ నఱఁగు**
**నగ్ని శంకించు నెరమంట లప్పళింప**
**భూమిదానంబొనర్చిన పుణ్యతముని**

**(భీమే.పంచ.ఆశ్వా.65 పద్యం)**

భూదానం సర్వ దానాల్లో గొప్పదని కొనియాడుతున్న పద్యం ఇది. భూదానం చేసిన పుణ్య శ్రేష్ఠున్ని కాలమృత్యు పేరుగల యముడు వేగంగా తరిమి కబళించడానికి జంకును. సూర్యుడు ఎండకాయక శాంతించును. అగ్ని నిండైన మంటలతో కమ్ముకోవడానికి భయపడునని భావం. ఇక్కడ వేసిన క్రియాపదాలు కర్తృ పదాలను బట్టి ఏర్పడిన దీపకాలు అని చెప్పవచ్చు. కుంతకుడు చెప్పిన విధంగా కర్త పదానికి అనుకూలమైన క్రియాపదాలను వాడటమే దీపకం అన్నాడు. ఈ

పద్యంలో కాలయముడు కబళించడం అనేది క్రియ. కాలం కబళించడం అనుకూలమైన క్రియ సంబంధింతమైంది కూడా. అలాగే అగ్నిమంటలతో కమ్ముకోవడం కూడా సరైన క్రియగా చెప్పవచ్చు. అలాగే సూర్యుడు కూడా ఎండ కాయక శాంతించడం కూడా సరైన క్రియనే. ఉచితమైన క్రియలను కర్త పదానికి సరిగ్గా వాడటమే దీపకం. కాబట్టి ఈ పద్యంలో ఆ అలంకారం ఉంది.

### 5.9.3. రూపకం

**కా॥ ఉపచారైక సర్వస్వం యత్రతత్ సామ్యముద్వహత్**
**యదర్పయతిరూపం స్వంవస్తు తద్రూపకం మతమ్**

**(వ.జీ.తృ.ఉన్మే.కా.19)**

ఎక్కడైతే ఉపచారానికి ప్రధాన జీవితమైన సామ్యాన్ని పొంది ఏ వస్తువు తన స్వరూపాన్ని అర్పిస్తుందో అది రూపకమని సాధారణంగా లక్షణాన్ని చెప్పాడు. ఉదాహరణ కూడా ఇచ్చాడు.

**"మృదుతనులతావసన్తః సుందరవనేందు బింబసిత పక్షః**
**మన్మథమాతంగ మదోజయత్యహోతరుణతారంభః"**

**(వ.జీ.పుట.337)**

మృదువైన తనులతకు వసంతం, సుందరమైన ముఖచంద్రబింబానికి శుక్లపక్షం, మన్మథ గజానికి మదము అయ్యే యౌవనారంభము సర్వోత్కృష్టముగా ఉన్నది అని అర్థం. తనువు, లత, ముఖం, చంద్రుడు, సమానత్వాన్ని ఆరోపించడం రూపకం. ఉపమేయ ఉపమానాలకు అభేదం చెప్పబడింది.

### 5.9.3.1. రూపకం – సమన్వయం

**తే ॥ వర్ణితంబైన సావర్ణి వంశముకుఁ**
**బట్టు గొడుగైన యంభోజబాంధవునకుఁ**
**గూడ నేతెంచుగారాపుఁ గొడుగు చేతి**
**దండ మవ్వేళ నాలంబ దండమయ్యె**

**(శృ.నై.సప్త.ఆశ్వా.32 పద్యం)**

దమయంతీ స్వయంవరం వేళ యముడు వచ్చే సందర్భంలోనిదీపద్యం. ఆ సమయంలో తద్వంశ్యులయిన రాజులకు పట్టుగొడుగు అయ్యాడు. సూర్యునికి సమీపంగా వచ్చే యముడి చేతికర్ర చేతబట్టుకొనే కామ అయ్యిందంటూ, 'ఆలంబదండమయ్యె' అని అనటం ఇక్కడ రూపకం.

**ఆ ॥ అధిక దూరమగుట నాకాశ లక్ష్మికిఁ**
**గర్ణపాశమగుచుఁ గరమువొలిచె**
**దివ్యభవ్య కాంతి దేదీప్యమానమై**
**పాశపాణి పాణి పాశవల్లి**

**(శృ.నై.సప్త.ఆశ్వా.33 పద్యం)**

వరుణుడు చేతిలో పాశాన్ని పట్టుకొని వస్తూ ఉంటే స్వర్గసంబంధి అయిన కాంతి చేత ఆ పాశం వల్ల కము వెలుగుతుంది. ఆకాశలక్ష్మికి కర్ణపాశంలాగా ఆ చేయి దూరం నుండి చూస్తూ ఉంటే శోభిస్తుందని అని భావం. ఇక్కడ 'ఆకాశాన్ని లక్ష్మి'గా చెప్పటం, పాశాన్ని 'పాణిపాశవల్లి' గా చెప్పడం రూపకం. పాశాన్ని 'కర్ణపాశం'గా చెప్పడం కూడా రూపకం అనే అలంకారమే.

**తే ॥ ప్రతిఫలించు ప్రవేణికా భార రచిత**
**మల్లికలు రాజతాక్షర మాలికలుగ**
**శంబరారాతి విజయ శాసనసువర్ణ**
**పట్టికయుఁ బోలె నొప్పు నిప్పణఁతి వీఁపు**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.195 పద్యం)**

ఈ దమయంతీ వేణీ నల్లగా ఉండి తరుణి వీపు అనే బంగారు పలక నడుమ తాపించిన ఇంద్రనీలపు రేకులో వెండి అక్షరాలు రాసిన మదన విజయ శాసన పట్టికనో అన్నట్లు ఉంది. ఆమె కురులలో ప్రతిబింబించే మల్లెలు తెల్లగా వేణి నల్లగా వీపు బంగారంతో చేసినట్లుందని కవి వర్ణన. ఆమె వీపు సౌందర్యాన్ని కవి 'శంబరారాతి విజయ శాసన సువర్ణ' పట్టిక లాగా పోల్చడం కవి చేసిన రూపకాలంకారం. ఆమె సౌందర్యానికి, మన్మథుని పట్టికకు అభేదం చెప్పబడ్డది కనుక రూపకాలంకారం.

**ఉ ॥ కందక గాజువాఱక వికాసము దప్పకమందహాస ని**
**ష్యందము చెక్కుటద్దముల జాఱక నెమ్మది నిద్రవోవున**
**ట్లందము నొందె ధాత్రి సిరియాల కుమారుని వక్త్రచంద్రుఁడా**
**నందము నొందెనప్పుడెలనాఁగ మనంబును భర్తచిత్రమున్**

**(హర.ద్వితీ.ఆశ్వా.119 పద్యం)**

వసివాడక, కళావిహీనంకాక, చెక్కిళ్ళపై చిరునవ్వు చిందక నింద్రపోయే సిరియాలుని ముఖచంద్రం అందంగా భాసించింది. ఆ సమయంలో దంపతుల హృదయాలు ఆనందంతో

నిండాయి. 'చెక్కుటద్దములు', 'వక్త్ర చంద్రుడు' అనే పదాల్లో విశేషణ విశేష్యాలకు అభేదం చెప్పడం చేత సౌందర్యం ఏర్పడింది. రూపక అలంకారం. సిరియాలుని సౌందర్యం గోచరమైంది.

**తే ॥ వర్ణితంబైన సావర్ణి వంశముకుఁ**
**బట్టు గొడుగైన యంభోజబాంధవునకుఁ**
**గూడ నేతెంచుగారాపుఁ గొడుగు చేతి**
**దండ మవ్వేళ నాలంబ దండమయ్యె**

**(శృ.నై.సప్త.ఆశ్వా.32 పద్యం)**

దమయంతీ స్వయంవరం వేళ యముడు వచ్చే సందర్భంలోనిదీపద్యం. ఆ సమయంలో తద్వంశ్యులయిన రాజులకు పట్టుగొడుగు అయ్యాడు. సూర్యునికి సమీపంగా వచ్చే యముడి చేతికర్ర చేతబట్టుకొనే కామ అయ్యిందంటూ, 'ఆలంబదండమయ్యె' అని అనటం ఇక్కడ రూపకం.

**ఆ ॥ అధిక దూరమగుట నాకాశ లక్ష్మికిఁ**
**గర్ణపాశమగుచుఁ గరమువొలిచె**
**దివ్యభవ్య కాంతి దేదీప్యమానమై**
**పాశపాణి పాణి పాశవల్లి**

**(శృ.నై.సప్త.ఆశ్వా.33 పద్యం)**

వరుణుడు చేతిలో పాశాన్ని పట్టుకొని వస్తూ ఉంటే స్వర్గసంబంధి అయిన కాంతి చేత ఆ పాశం వల్ల కము వెలుగుతుంది. ఆకాశలక్ష్మికి కర్ణపాశంలాగా ఆ చేయి దూరం నుండి చూస్తూ ఉంటే శోభిస్తుందని అని భావం. ఇక్కడ 'ఆకాశాన్ని లక్ష్మి'గా చెప్పటం, పాశాన్ని 'పాణిపాశవల్లి' గా చెప్పడం రూపకం. పాశాన్ని 'కర్ణపాశం'గా చెప్పడం కూడా రూపకం అనే అలంకారమే.

**తే ॥ ప్రతిఫలించు ప్రవేణికా భార రచిత**
**మల్లికలు రాజతాక్షర మాలికలుగ**
**శంబరారాతి విజయ శాసనసువర్ణ**
**పట్టికయుఁ బోలె నొప్పు నిప్పణఁతి వీఁపు**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.195 పద్యం)**

ఈ దమయంతీ వేణీ నల్లగా ఉండి తరుణి వీపు అనే బంగారు పలక నడుమ తాపించిన ఇంద్రనీలపు రేకులో లేక వెండి అక్షరాలు రాసిన మదన విజయ శాసన పట్టికనో అన్నట్లు ఉంది. ఆమె కురులలో ప్రతిబింబించే మల్లెలు తెల్లగా వేణి నల్లగా వీపు బంగారంతో చేసినట్లుందని కవి

వర్ణన. ఆమె వీపు సౌందర్యాన్ని కవి 'శంబరారాతి విజయ శాసన సువర్ణ' పట్టిక లాగా పోల్చడం కవి చేసిన రూపకాలంకారం. ఆమె సౌందర్యానికి, మన్మథుని పట్టికకు అభేదం చెప్పబడ్డది కనుక రూపకాలంకారం.

**ఉ॥ కందక గాజువాఱక వికాసము దప్పకమందహాస ని**
**ష్యందము చెక్కుటద్దముల జాఱక నెమ్మది నిద్రవోవున**
**ట్లందము నొందె ధాత్రి సిరియాల కుమారుని వక్త్రచంద్రుఁడా**
**నందము నొందెనప్పుడెలనాఁగ మనంబును భర్తచిత్రమున్**

**(హర.ద్వితీ.ఆశ్వా.119 పద్యం)**

వసివాడక, కళావిహీనంకాక, చెక్కిళ్ళపై చిరునవ్వు చిందక నింద్రపోయే సిరియాలుని ముఖచంద్రం అందంగా భాసించింది. ఆ సమయంలో దంపతుల హృదయాలు ఆనందంతో నిండాయి. 'చెక్కుటద్దములు', 'వక్త్ర చంద్రుడు' అనే పదాల్లో విశేషణ విశేష్యాలకు అభేదం చెప్పడం చేత సౌందర్యం ఏర్పడింది. రూపక అలంకారం. సిరియాలుని సౌందర్యం గోచరమైంది.

**క॥ మంకణ మహామునీశ్వర**
**సంకల్ప వితీర్ణి కల్పశాఖికి, భువనా**
**లంకృతికి, దక్షవాటికి**
**శంకర నటనటన నాట్యశాలకు జేజే**

**(భీమే.తృతీ.ఆశ్వా.131 పద్యం)**

మంకణ ముని సంకల్పించిన దానిని ఇవ్వటంలో కల్పవృక్షమయ్యింది, జగత్తునలంకారం అయ్యింది. పరమేశ్వరుడనే మహానటుని అభినయానికి రంగస్థలం అయిన దాక్షారామానికి జయమగు గాక అని అర్థం. 'వితీర్ణి కల్పశాఖి', 'శంకర నటనటన నాట్యశాల' అనడంలో కల్పవృక్షానికి, నాట్యశాలకు, దక్షారామంలో అభేదం చెప్పబడ్డది. ఈ రెండు పోలికల ద్వారా దాక్షారామ వైభవం తెలిసింది.

**తే॥ తాఁద్రినేత్రుని యపరావతారమగుటఁ**
**దెలుపు దిక్పాలకాం శావతీర్ణుఁడతడు**
**కామ సంచార హరణప్రగల్భమైన**
**శాస్త్రమను పేరి యధికలోచనము కలిమి**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.49 పద్యం)**

రాజు ఎనిమిది దిక్పాలకుల అంశచేత సృజించబడ్డాడు. ఆ రాజు ఈశ్వరుని అవతారము. ఆయన ఈశ్వరుడు కనుక మూడవ కన్ను ఉండాలి కదా? అంటే మూడవ కన్నగు శాస్త్రము ఉన్నందున త్రిలోచనుడు. శాస్త్రం అనే పేరుగల అధిక లోచనంగల త్రిలోచనుడు నలుడు. 'శాస్త్రమనెడి అధికలోచనం' అనటం వలన శాస్త్రలోచనం అయ్యింది. శాస్త్రానికి లోచనానికి అభేదం చెప్పబడింది. దీని వలన పద్యానికి రమణీయత చేకూరింది. అభేదం వలన రూపక అలంకారం. ఇది రూపక వైచిత్ర్యం.

**తే॥ అతని బాహుపరాక్రమంబభినుతింప**
**నలవియే పద్మజునకైన నబ్జవదన**
**శాతతద్బాణ ధారా భుజంగభుక్తి**
**వైరి రాజవ్రజీ యాసు మారుతంబు**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.150 పద్యం)**

నలుని బాహుపరాక్రమాన్ని నుతించడానికి బ్రహ్మకు కూడా సాధ్యమవుతుందా? శత్రుల ప్రాణమనే వాయువును తన బాణధారలచే మింగి వేసే అతను భుజంగం వలే తోస్తున్నాడు. పాము వాయువును ఆహారంగా తీసుకున్నట్లు శత్రు ప్రాణవాయువును రాజు కబళించే భుజంగంలా ఉన్నాడని భావం. 'తద్బాణ భుజంగ భుక్తివైరి' అనటంలో రూపకం ఉంది. రాజు ఉపమేయం, పాము ఉపమానం, మారుతాన్ని హరించటం సమాన ధర్మం. పాముకు వాయువు ఆహారం, వాయువును పాములు మాపినట్లు ఇతని బాణాలు వైరుల ప్రాణాలను మాపును. కనుక పాముకి, రాజు బాణాలకి అభేదంతో రూపక వైచిత్ర్యం ఏర్పడింది.

**తే॥ తదనుసంభవుఁడఖిల విద్యావిరించి**
**యర్థిజన కామదుగ్ధేను వన్న మంత్రి**
**క్రీడ సల్పును వాని సత్కీర్తికాంత**
**సప్తలోక మహోత్సవ సౌధ వీథి**

**(భీమే.ప్రథ.ఆశ్వా.72 పద్యం)**

తల్లమంత్రి తర్వాత పుట్టిన అన్నమమంత్రి సర్వవిద్యల్లో బ్రహ్మదేవుడు అనడానికి కవి అభేదం చెప్తూ 'విద్యావిరించి' అనే పదాన్ని వాడాడు. అలాగే యాచకులైన జనులకు కోరికలను తీర్చుకునే కామధేనువు. ఇతని కీర్తికాంత పై ఏడు లోకాల్లో ఉన్నతమైన మేడల వరుసల్లో

విహరించునని కవి వర్ణన. ఇక్కడ 'కీర్తికాంత' అనడం కూడా ఉపమేయం కీర్తి. ఉపమానం కాంత. రెండూ సమానంగా చెప్పబడ్డాయి కనుక రూపం. ఈ పదాలే పద్యానికి సౌందర్యానిచ్చాయి.

**సీ॥ హాలాహలంబను నల్లొ నేరెడు పండు**
**మిసిమింతుఁడును గాక మ్రింగినాఁడు**
**పెనువ్రేలి కొనగోర బిసరుహాసను మోముఁ**
**గెందమ్మి విరివోలె గిల్లినాఁడు**
**పంచవన్నియ తోడఁబ్రసవ నారరాచచుని**
**నెట్టి చిచ్చులకంట జుట్టినాఁడు**
**మెఱుఁగు గోఱలు డుల్ల మృత్యుదేవత నోరు**
**ధట్టించి యఱకాలఁ దన్నినాఁడు**

**తే॥ త్రిపుర దైత్యావరోధ నారీవిలాస**
**దంత తాటంకముల కెగ్గు దలఁచినాఁడు**
**దక్షపురి సాని కూఁతులఁదవిలినాఁడు**
**విశ్వలోక కుటుంబి భీమేశ్వరుండు**

**(భీమే.ప్రథ.ఆశ్వా.111 పద్యం)**

సమస్త లోకాలకు అధిపతైన శ్రీ భీమేశ్వరుడు హాలహలాన్ని పెద్ద నేరేడు పండులా శ్రమ లేకనే మింగాడు. బొటనవేలి కొనగోటితో బ్రహ్మదేవుని ముఖాన్ని గిల్లిండు. చిలుక వాహనంగల మన్మథున్ని బూడిద చేసాడు. మృత్యుదేవత యొక్క పదునైన కోరలూడిపడినట్లు అరికాలితో చాచి తన్నాడు. త్రిపురాసురులను చంపి వాళ్ళ భార్యలకు అన్యాయం చేసాడు అని భావం. కెందమ్మివిరి, పంచవన్నియ, ఉపమేయ, ఉపమానాలకు అభేదం వల్ల దీనిని రూపకాలంకారంగా చెప్పవచ్చు.

**శా॥ చాముస్ వైశ్యకులాబ్ధిసోము విలసత్సౌందర్య లీలా కళా**
**కాముస్ దానకళాభిరాము సుమనః కల్హారవాటీ సుధా**
**ధాముస్ కోమల యామినీధవళోత్తంస ప్రశంసారుచి**
**శ్రీమన్మా నస శివయోగి విహితక్షేమున్నుతింపందగున్**

**(హర.ప్రథ.ఆశ్వా.25 పద్యం)**

చామిసెట్టి వర్ణన పద్యం. వైశ్య కులాబ్ధి చంద్రుడు, సౌందర్య రేఖలో అభినవ మన్మథుని లాంటివాడు. దానశీలి, సుజనులనే కలువల సమూహానికి చంద్రుని లాంటివాడు. చంద్రరేఖ

ధరించిన గొప్ప మనస్సు కల శివయోగులకు శుభాన్ని చేకూర్చేవాడు అని వర్ణించాడు కవి. వైశ్య కులాబ్ధి సోముడు, సౌందర్యలీలా కళాకాముడు అనే ప్రయోగంలో చంద్రునికి, ఇతనికి తేడా లేదని, మన్మథునికి ఇతనికి తేడా లేదని ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్పటం చేత ఇది రూపకాలంకారం.

**క॥ ఆ పుణ్యశ్లోకునకు ను**
**మాపతి పాదారవింద మధుకరమునకున్**
**ద్వీపాంతర మండలికా**
**భూపాలక మాననీయ పురుషార్థునకున్**

**(హర.ప్రథ.ఆశ్వా.32 పద్యం)**

అవచి తిప్పయ గూర్చి వర్ణన చేసాడు కవి. ఆ కీర్తిశాలి, పరమేశ్వర పాదపద్మముల తుమ్మెద, ద్వీపాంతర మండల భూపతులకు, గౌరవార్హమైన పురుషార్థములు సాధించుకున్నవాడని అర్థం. 'ఉమాపతి పాదారవింద మధుకరం' అనటంలో రూపకం ఉంది. అరవిందంలోని మకరందాన్ని తుమ్మెద తాగుతుంది. పరమేశ్వరుడనే భక్తి పాదాలనే పద్మాలను రుచిచూసే తుమ్మెద ఈ భక్తుడని తెల్పడం ఇందులోని రూపక అలంకారం. ఇక్కడ అవచి తిప్పయ ఉపమేయం. ఉమాపతి పాదపద్మాలను గ్రోలే తుమ్మెద ఉపమానం. ఈ రెండింటికి తేడా లేదు ఒకటేనని భావన.

**తే॥ ఉత్తరాభిముఖుండైన యుష్ణరశ్మి**
**చందమీక్షించి దక్షిణా శాపురంధ్రి**
**గంధవాహంబు దీర్ఘ దీర్ఘంబుగాఁగఁ**
**జాఁగ విడిచెను విరహ నిశ్వాసధార**

**(హర.ఆశ్వా.తృతీ.55 పద్యం)**

ఉత్తర దిశగా ప్రయాణిస్తూ సూర్యున్ని చూసి, దక్షిణ దిక్కు అనే స్త్రీ ఎక్కువ దీర్ఘము కాగా తన నిశ్వాస వాయువుని విడిచింది. ఎడబాటుతో నిట్టూర్పులు విడినట్టుంది ఆ సన్నివేశం. ఇక్కడ 'దక్షిణదిక్కనెడుస్త్రీ' అనే అర్థానికి 'దక్షిణా శాపురంధ్రి' అనటం ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్తూ స్త్రీ, దక్షిణ దిక్కు ఒకటే వేరు కావనే భావనను తెలుపుతుంది. ఇది రూపకం.

**క॥ నవకములగు ములు మోదువుఁ**
**బువు మొగ్గలు విపిన వీథిఁబొల్పెసలారెన్**
**దివుట వసంతుండను ప**

**ల్లవుఁడిడిన నఖక్షతంబులకు సరియగుచున్**

**(హర.తృతీ.ఆశ్వా.58 పద్యం)**

మృదువైన ముళ్లమోదుగు పూలు అడవియందంతట పూచి అందగించాయి. ఇది ఎలా ఉందంటే రసికుడు ప్రియురాలిపై ఉంచిన గోరుగిచ్చులాగా ఉందని కవి వర్ణన. ఇక్కడ వసంతుడను రసికుడు పెట్టి గోటిగాటుకి అభేదం చెప్పబడ్డది కనుక రూపకం.

**తే॥ హేమ శైలంబు దోగ్ధగా భూమి సురభి**
**నఖిల రత్నౌషధులును గల్పాదియందు**
**బృథు మహారాజు పన్పునఁ బితికె నెలమి**
**మంచు కొండను బెయ్యఁగావించి గిరులు**

**(హర.పంచ.ఆశ్వా.23 పద్యం)**

మేరు పర్వత భూమిని గోవుగా చేసి ఆ పర్వతాల్లోని రత్నం లాంటి ఔషధాలను పృథు మహారాజు హిమవంతున్ని దూడగా చేసి పితికాడు. మేను పర్వతాల్లోని భూమిని గోవుగా చెప్పటం, ఔషధాలను రత్నాలుగా చెప్పటం, హిమవంతుని దూడగా చెప్పటం అనేది ఉపమేయ ఉపమానాలకు అభేదం కన్పిస్తుంది కనుక రూపకం.

**తే॥ ధాతుతామ్రాధరుడు దేవదారు భుజుఁడు**
**సాను వక్షఃస్థలుఁడు వటస్కంధుఁడైన**
**మంచు గుబ్బలిరాజు సంభ్రమముతోడ**
**ఋషిసమూహంబు నతిభక్తి నెదురుకొనియె**

**(హర.చతు.ఆశ్వా.55 పద్యం)**

ఇది హిమవత్పర్వత వర్ణన. గైరికాధి ధాతువులను ఎర్రని పెదాలుగా కలవాడు. దేవదారు వృక్షాలు భుజాలుగా గలవాడు. కొండ చరియలను వక్షస్థలంగా కలవాడు. మర్రి చెట్లను మూపులుగా కలవాడగు హిమపర్వతుడు సంతోషంతో అత్యంత భక్తితో మునుల గణాలకు ఎదురువెళ్ళి స్వాగతించాడని భావం. ఇక్కడ 'ధాతు తామ్రాధరుడు, దేవదారుభుజుఁడు, సాను వక్షస్థలుడు, వటస్కంధడు, మంచు గుబ్బలిరాజు అనే పదాలన్నింటిలో శరీర అవయవాలకు, హిమవంతుని ప్రకృతి సౌందర్యానికి సమానత్వం చెప్పటం జరిగింది. హిమవంతుని సంపద ఉపమేయం, శరీరాంగాలుగా చెప్పడం ఉపమానం. ఈ రెండింటికి అభేదం చెప్పబడ్డది కనుక

రూపక అలంకారం. ఆ ప్రకృతి సౌందర్యానంతా ఒక మనిషి ఆకారంగా భావించి చెట్లు ఉన్న ఎత్తైన, దిగువ స్థలాలను ఊహించి మనోహర వర్ణన చేసాడు కవి.

**కం॥ చరమాచల శిఖరంబునఁ**
**దిరమై యొక్కింత తడవు దినకరుఁడొప్పెన్**
**వరుణుని శుద్ధాంతంబున**
**నరవిందాక్షులకు మించుటద్దంబగుచున్**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.27 పద్యం)**

పడమటి కొండ శిఖరం పై భాగంలో కొంచెం సేపు నిలిచి సూర్యుడు పడమటి దిక్కుకు పతియైన వరుణుని అంతఃపుర కాంతల నేత్రాలకు తళతళమనే అద్దములుగా ప్రకాశించాడని భావం. అరవిందాక్షులకు సూర్యుడు అద్దం కావటం ఇక్కడ రూపకం. ఈ వర్ణనావైచిత్ర్యం విశేషంగా ఉంది.

**తే॥ భీమనాథేశ్వరుఁడు గౌరిఁబెండ్లియాడి**
**దక్షిణాముఖ కల్యాణ దర్మమున**
**వత్సరము వత్సరంబు నెవ్వానిఁ జూచు**
**నతఁడు గగనాగ్ర మాణిక్య మరుగుదెంచె**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.77 పద్యం)**

అగస్త్యుని రాకను తెలియజేస్తూ ఎవడైతే భీమనాథుడు పార్వతిని వివాహమాడి ప్రతి సంవత్సరం వివాహానంతరం దక్షిణ దిశయందుగల ద్వారం వైపు ఉన్న, గగనానికి మాణిక్యమైన వాడైన అగస్త్యుడు వచ్చాడంటాడు కవి. 'గగనాగ్ర మాణిక్యం' అరుగుదెంచెను అంటాడు కవి. ఇక్కడ మాణిక్యంతో సమానంగా అగస్త్యున్ని చెప్పడం రూపకం. ఆ పదం వల్ల అగస్త్యుని గొప్పతనం అర్థమయ్యింది.

**ఉ॥ ఈవును నేనపోలెను మునీశ్వర! భాగ్యము లేమిఁజేసి కా**
**శీ విరహాగ్ని తాపమునఁ జేద్పడినాఁడవు చెప్పవయ్య! నా**
**త్రోవ మహాత్మ! దక్షపురి ధూర్జటి శంభుఁడు భీమనాథుఁడా**
**ర్యా విభుఁడాశ్రయింపనగునా? నను నేలికొనం దలంచునా?**

**(భీమే.తృతీ.ఆశ్వా.5 పద్యం)**

వ్యాసుడు అగస్త్యునితో మాట్లాడుతూ మునీంద్రా! నీవు కూడా నాలాగే అదృష్టం లేక కాశీ విరహాగ్ని తాపంతో బాధపడుతున్నావు అయ్యా! నాకు తోవ చూపుః ఆ దక్షారామ శంభుడు, పార్వతీ పతియగు భీమేశ్వరస్వామిని ఆశ్రయింపదగునా? ఆ స్వామి నన్ను గైకొనదలంచునా? అని అంటాడు. ఇక్కడ 'కాశీ విరాహాగ్ని తాపం' అనటంలో విరహామనే అగ్ని అని చెప్పటం ఉపమేయ ఉపమానాలకు అభేదం కన్పిస్తుంది. ఈ రూపకం వలననే పద్యంలోని సౌందర్యం అవగతమయింది.

**తే॥ గౌతమీసింధు కౌంతేయ కణ్వనదులుఁ**
**దుల్యభాగయునేలేరు దుమ్మికొనలు**
**భువన సంభావ్యమైన యీ పుణ్యభూమి**
**యనఘ! సంసార తాపశాంత్యౌషధంబు**

**(భీమే.తృతీ.ఆశ్వా.50 పద్యం)**

గౌతమీ, కౌంతేయ, కణ్వనది, తుల్యభాగ్, ఏలేరు అనే నదులు గల ఈ దేశం సర్వలోకాలచేత పూజింపదగేది. జనన మరణాది రూపమైన సంసారంలో కలిగే ఆధ్యాత్మిక, దైవిక, భౌతిక తాపత్రయాన్ని ఉపశమింపజేసే ఔషధం ఈ భూమి అని దక్షారామ వర్ణన చేసాడు. 'సంసార తాపశాంత్యౌషధం' అనటంలో రూపకం ఉంది.

### 5.9.4. అప్రస్తుత ప్రశంస

**కా॥ అప్రస్తుతోఽపి విచ్ఛిత్తిం ప్రస్తుతస్యావతారయన్**
**యత్ర తత్సామ్యమాశ్రిత్య సంబంధాన్తరమేవవా**
**వాక్యార్థోఽ సత్యభూతో వాప్రాప్యతే వర్ణనీయతామ్**
**అప్రస్తుత ప్రశంసేతి కథితాసావలంకృతిః**

**(వ.జీ.ఉన్మే.తృతీ.కా.21,22)**

ఎక్కడైతే రూపకానికి సంబంధించిన సామ్యముగాని, మరొక సంబంధం గాని ఆశ్రయించి, వాక్యార్థంగాని, అసత్యమైన పదార్థంగాని అప్రస్తుతమైనప్పటికి, ప్రస్తుతానికి శోభను కూర్చితే అప్రస్తుతాప్రశంసాలంకారం.

ఉదాహరణ శ్లోకాని చూద్దాం.

**"లావణ్య సింధురపరైవ హి కేయమత్ర**
**యత్రోత్పలాని శశినా సహ సంప్లవన్తే**

**ఉన్మజ్జతి ద్విరదకుంభతటీ చ యత్ర**

**యత్రాపరే కదలికాండమృణాలదండాః**

(వ.జీ.పుట.343)

ఈ లావణ్య నది ఏదో అపూర్వంగా ఉందే! ఇక్కడ కలువలు చంద్రునితో తేలిపోతున్నాయి. గజకుంభద్వయము పైకి తేలుచున్నది. అరటి స్తంభాలు తామర తూడులు కూడా తేలుచున్నాయని అర్థం. ఇక్కడ స్త్రీ కటాక్షచ్ఛటా, ముఖ, కుచయుగ, ఊరుయుగ, బాహు యుగములకు ఉత్పలాలతో సాదృశ్యం చెప్పుతూ అప్రస్తుతమైన ఉత్పలం మొదలైన వాటిని వర్ణించటం వలన ప్రస్తుత అంశమైన స్త్రీ నయనాలను, ఇతర అంగాల సౌందర్యాన్ని పెంచాయి. కనుక అప్రస్తుతం చేత ప్రస్తుతం శోభించింది.

### 5.9.4.1. అప్రస్తుత ప్రశంస – సమన్వయం

**క॥ లలన కనుదోయి ముందట**

**నలవటి నలినంబు మలినమయ్యెను హరిణం**

**బులు పూరిమేయఁదొఱఁగెను**

**గలితద్యుతిఖంజమయ్యె ఖంజనకులమున్**

(శృ.నై.ద్వితీ.ఆశ్వా.12 పద్యం)

దమయంతి యొక్క కన్నులు కమలం వలె మలినం లేక సుందరంగా ఉన్నందుకు ఆమె కన్నుల ఎదుట వాటి కన్నులు కాంతిహీనమై హరిణాలు గడ్డి మేయడం మానేసాయి. ఆమె కన్నుదోయి సౌందర్యానికి కాటుక పిట్టల సమూహానికే కాంతి కొరవడింది. అంతటి నల్లదనంతో శోభించాయని అర్థం. ఇక్కడ దమయంతి కన్నులను నళినంతో పోల్చడం, సుందరమైనవిగా చెప్పటం ప్రస్తుత ప్రశంస. వీటితో హరిణాలు మేయలేదని, కాటుక పిట్టల కాంతి తగ్గిందని తదీయ కార్యాన్ని చెప్పటం అప్రస్తుత ప్రశంస. ఇక్కడ అప్రకృతాఖ్యానం జరిగింది. అప్రస్తుత ప్రశంసలో ఇదొక భాగం. దీని వలన కవి వర్ణనకు రమణీయత చేకూరంది.

**తే॥ రాజబింబంబునందు సారము హరించి**

**చేయఁబోలు విధాత యా చెలువమోము**

**నడిమి రంధ్రంబునందుఁ గానంగ వచ్చు**

**ఖనిఖ నీలిమ యది నిదర్శనము గాదె!**

(శృ.నై.ద్వితీ.ఆశ్వా.13 పద్యం)

చంద్రుని బింబంలోని శ్రేష్ఠమైన అంశాన్ని గ్రహించి ఆ చెలువ మోమును విధాత నిర్మించాడు. ఆ సారాన్ని గ్రహించడానికి చంద్రున్ని తవ్వగా, పూసలోని బెజ్జంలా ఇటు నుండి అటు ఏర్పడినట్లు, ఆకాశంలో నీలిమ కనిపిస్తుంది. చంద్రుని శ్రేష్ఠాంశాన్ని దవ్వినాడని ఆకాశ నీలిమ చెప్తుందని భావం. ఇక్కడ దమయంతీ వదన నిర్మాణంకై రాజబింబసారం, కళంకం ఖనిఖ నీలిమలో ఉత్ప్రేక్షించబడ్డాయి. కానీ అప్రాకరణిక అర్థమైన దమయంతీ వదనగత లోకోత్తర సౌందర్య విశేషం తెలుస్తుంది. చంద్రున్ని సారాన్ని గ్రహించి మోము నిర్మించటం ప్రస్తుతం. కానీ ఆమె లోకోత్తర సౌందర్య ప్రచారం అప్రస్తుతం అయినప్పటికి ఇక్కడ దమయంతీ సౌందర్యం ప్రశంసించబడినందుకు అప్రస్తుత ప్రశంస.

**చ॥ కటికితనంబు మాన్చి, చటుకాకు విడంబముఁ గూర్చిలజ్జసం**
**కటపడఁజేసి, యర్థిఁగడుఁగాఱియపెట్టిన పాతకంబు న**
**క్కట తలఁగంగఁ జాలునొకొ కాలవిలంబుము నాచరించి పి**
**మ్మటఁదదభీప్సితార్థము సమర్పణ సేయు ప్రదాతయెమ్మొయిన్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.54 పద్యం)**

దాత అనేవాడు యాచకుని మనోధైర్యాన్ని పోగొట్టి, బతిమాలించుకొని, పేద మాటలు పలికించి, క్లేశపెట్టి సిగ్గుపరచిన పాపము, వాని కోరిన అర్థము జాగుచేసి ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండదని భావం. ఇక్కడ దాత దానగుణం గూర్చి ప్రస్తుతాంశం. అడుగక ముందే ఇవ్వాలి అని చెప్పటం సామాన్యోక్తి. అతను అడిగించుకొని దానం చేస్తే పాపం కలుగుతుందని చెప్పటం ప్రస్తుత విషయంలో అభిప్రాయం. కాబట్టి సామాన్య నిబంధన అప్రస్తుత ప్రశంస అవుతుంది. పాపం కలుగుతుందని అప్రధాన విషయ చర్చ ఇక్కడ సూచితం.

**ఉ॥ శర్మమె కాని, యవ్విబుధ సద్మమునందుఁదలచి చూడఁగా**
**ధర్మము సేయలేః దిచట ధర్మము సేయఁగ, నిర్విశంకతన్**
**శర్మమునొందనుం, గలదుః శర్మము ధర్మముఁగాంచుటొప్పునో**
**శర్మముఁగాంచుటొప్పునొ విచారము సేయుము నెమ్మనంబునన్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.133 పద్యం)**

ఇంద్రాదులను వరిస్తే శర్మము (సుఖము) దక్కుతుంది. నలుని వరిస్తే ధర్మము చేయవలసి వస్తుంది. శర్మధర్మాలలో శర్మమొకటే అనుభవించుట మేలో శర్మధర్మాలను రెండింటిని సాధించుట మేలో నిండు మనస్సులో చక్కగా ఆలోచించమని దమయంతి కోరు సందర్భం ఇది. భూలోక, స్వర్గ

లోకాల్లో శర్మము సాధారణం. భూమినందు ధర్మము చేయటం విశేషం. ధర్మము చేయటం వలన సుఖం లభిస్తుంది. గృహస్థాశ్రమంలో శర్మము, ధర్మము రెండు ఉంటాయని చెప్పటం ప్రస్తుత విషయం కానీ గృహస్థాశ్రమంలోని సామర్థ్యం విశేషం, గొప్పదనాన్ని చెప్పకనే చెప్పినట్లు అవుతుంది. గార్హస్థ్య సంబంధ ఉపదేశం అనేది కారణ నిబంధన అప్రస్తుత ప్రశంస. దీని వలన ఉక్తి వైచిత్ర్యం ఏర్పడింది.

**తే॥ నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ**
**నడరి కాకులుబిట్టు పెద్దఱచి నప్పు**
**డుడిగి రాయంచ యూరకయుంట లెస్స**
**సైఁపరాకున్న నెందేనిఁ జనుటయొప్పు**

**(భీమే.ప్రథ.ఆశ్వా.14 పద్యం)**

ఇక్కడ రాజమహేంద్రవరంలోని అసూయపరుల గూర్చి చెప్పబడింది. కాకి మూక చుట్టూ చేరి కర్ణకఠోరంగా మాటిమాటికి అరుస్తునప్పుడు రాజహంస ఏమీ పలుకుండా ఊరుకోవడం మంచిది. సహించనపుడు అక్కడి నుండి వెళ్ళి పోవడం మంచిదని భావం. ఇక్కడ కాకిమూక గూర్చి చెప్పటం ప్రస్తుతాంశం. దాని గూర్చి చెప్తూనే రాజహంస ఔన్నత్యాన్ని, విశేషాన్ని చెప్పడం జరిగింది. కనుక అప్రస్తుత ప్రశంస.

### 5.9.5. పర్యాయోక్తి

**కా॥ యద్వాక్యాన్తరవక్తవ్యం తదన్యేన సమర్థ్యతే**
**యేనోపశోభా నిష్పత్త్యై పర్యాయోక్తం తదుచ్యతే**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.23)**

విచ్ఛిత్తి విశేషం సంపాదించడానికి ఎక్కడైతే ఒక వాక్యముతో ప్రతిపాదింపబడవలసిన అర్థము మరొక వాక్యముతో ప్రతిపాదింపబడుతుందో అది పర్యాయోక్తి. వాచ్యర్థం ఒకటి వ్యంగ్యార్థం ఒకటి ఉంటుంది. కానీ వాచ్యార్థంలోనే వ్యంజక భావం అర్థమయ్యేల చెప్పటం అనే విషయాన్ని ఇదే విధంగా మమ్మటుడు కావ్య ప్రకాశంలో తెలిపాడు. కాబట్టి కుంతకుడు అందరి ఆలంకారికుల లాగే నిర్వచించాడని చెప్పవచ్చు.

ఉదాహరణ శ్లోకాన్ని చూద్దాం.

**“చక్రాభిఘాత ప్రసభాజ్ఞయైవ చకారయోరాహువధూజనస్య**
**ఆలింగనోద్దామవిలాస వంధ్యం రతోత్సవం చుంబనమాత్రశేషమ్**

(వ.జీ.పుట.347)

ఏ విష్ణువు చక్రప్రహారం అనేటువంటి అనుల్లంఘనీయ ఆజ్ఞచేత ఆలింగన ప్రధానమైన విలాసాలు లేనిదైనట్టి రాహు వధూజనుల రతోత్సవమును చుంబనం మాత్రమే శేషించిన దానినిగా చేసాడు. రాహువు శిరస్సును ఖండించాడు అనే అర్థాన్ని వేరే వాక్యం ద్వారా తెలియజేసాడు. చుంబించిన దానిగా మాత్రమే శేషించే విధంగా చేసాడనటంలోనే ఆ వాక్యంలోనే వ్యంగ్య అర్థం ఉంది. చంపేసాడనే ఒక వాక్యార్థం, ఇంకొక వాక్యంలో తెలుపబడింది.

### 5.9.5.1. పర్యాయోక్తి – సమన్వయం

**మ॥ హిమవద్భూధర సార్వభౌమ వరవిశ్వేశోపహారక్రియా**
**క్రమ సంతాడిత ఘంటికా ఘణఘణత్కారంబు విన్నట్టి యు**
**త్తమపుణ్యుండు వినండు ప్రాణపవనోత్క్రాంతివ్యథావేళ దు**
**ర్దమ వైవస్వతవాహ ఘోరమహిషగ్రైవేయ ఘంటాధ్వనుల్**

**(భీమే.తృతీ.ఆశ్వా.167 పద్యం)**

హిమవదీశ్వరుడు (శివుడు) మహానివేదనం చేసేటపుడు మోగించే ఘంటా ధ్వనిని వినే ఉత్తమ పుణ్యాత్ముడు అవసాన దశలో ప్రాణం పోతుండగా భయంకరమైన యముని మహిషంయెడలోని ఘంటాధ్వనులను వినడని భావం.

ఇక్కడ ఈశ్వరుని పూజించిన వాడు కైలాసానికి వెళతాడు అని చెప్పటం ప్రధాన కర్తవ్యం. కానీ యమలోకానికి వెళ్ళడు అనే వాచకంలో కైలాసానికి వెళతాడు అనే వ్యంగ్యం దాగి ఉంది. వాచ్యాంతర వ్యంగ స్ఫురణ. వేరే వాక్యంతో చెప్పటం పర్యాయోక్తి.

**తే॥ రాజకన్యలు జగతి, నాక్రమమునందుఁ**
**గందువారల నిట్టూర్పు గాడ్పు వేఁడి**
**ముకురములు చారుమోహనమూర్తియనఁగఁ**
**బరఁగు దమయంతి చేతి దర్పణము దక్క**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.70 పద్యం)**

నలుని సౌందర్యానికి తాము తగుతామో లేదో అని దమయంతీ కాక వేరే రాజకన్యలు అద్దంలో చూసుకుని తగమని నిట్టూర్పులు విడగా ఆ వేడిగాలుల వలన ముకురం (చేతి అద్దం) మలినమయ్యింది. దమయంతి ముకురము తప్ప అందరి ముకురాలు మలినమయ్యాయని అర్థం. ఎంతటి సుందరీమణులైనా అతని సౌందర్యానికి ఈడు కాదని, దమయంతి మాత్రమే

సరిపోతుందని ఆమె సంతోషించిదని అంతరార్థం. ఇతరుల ముకురములు కందును. ఆమె ముకురం కందదు అని చెప్పటం ఇక్కడ ప్రధాన కర్తవ్యంయ కానీ అదే విషయాన్ని చెప్పినట్లే చెప్పి 'దమయంతి ముకురం తప్ప' అనటం భంగ్యంతరం ఇక్కడ వ్యంగ్య స్ఫూర్తి ద్యోతకం. సూటిగా విషయాన్ని చెప్పకుండా ఆమె అద్దం తప్పా అనటంలో దమయంతి సౌందర్యవతియని, నలునికి సరిజోడని, ఆమె సంతోషాతిశయంలో ఉందని ఈ పర్యాయోక్తి తెలిపింది. కనుక వచనంలో ఉన్న అర్థం కాకుండా కొంత వైచిత్ర్యం ఏర్పడింది. ఒక వాక్యంతో ప్రతిపాదించాల్సిన విషయం వేరే వాక్యంతో చెప్పబడ్డది కనుక పర్యాయోక్తి.

**చ॥ కొలకొలమంచు నుండు సితకోకనదప్రభవ ప్రసూత, నా**
**కొలు విదితొంటినాఁడథికోటుల సందడిః నిప్పుడెంతయుం**
**బలపలనయ్యె బందుగులు పల్మఱుఁగైకొనురాకయున్కి నా**
**కలిమి నిజోదరైక భృతి కార్యకదర్యతఁ జిన్నవోయెడున్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.13 పద్యం)**

ఇంద్రసభ గూర్చి వర్ణితం ఈ పద్యం. పూర్వంలో ఆ సభ అతిథులతో నిండి కళకళలాడుతుండేది. ఇప్పుడు వాళ్ళు లేకపోవటంతో పాడుపడింది. కావున ఆ సంపద స్వోదరపూరములవల్ల, పిసినారితనం చేత ఖిన్నమై ఉంది. ఇక్కడ సంపద ఇవ్వడానికి లేదు. ఇంద్రసభ అనే ఏక ఆధారమునందు కాలక్రమంలో అవస్థాభేదాలు ఆధేయాలు కావటం వలన పర్యాయాలంకారంగా చెప్పవచ్చు. ధనం ఇవ్వలేకపోతున్నాననే విషయాన్ని పిసినితనంచేత ఖిన్నమైనదని భంగ్యంతరంగా చెప్పటం పర్యాయోక్తి.

**తే॥ తెఱవ యిన్నాళ్లు నడుగఁ బుత్తేఁడు నిన్ను**
**నెరయనిది తప్పుగాదె? సంవరణ వేళఁ**
**గట్టు మమరేంద్రు కంఠంబు గప్పురంపుఁ**
**బలుకు లెడఁబెట్టి కట్టిన యలరుదండ**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.123 పద్యం)**

దూతిక దమయంతి వద్దకు వచ్చి మాట్లాడుతున్న సందర్భం ఇది. ఓ యింతీ ఇంద్రుడు ఇన్నాళ్ళు నిన్ను వరింపుమని అడగలేదు. అతని తప్పుకాదా. 'సంవరణ వేళ గట్టు మమరేంద్రు కంఠంబు' అని అంటుంది. వివాహ సమయంలో పువ్వులదండ వేసినట్లు అతని మెడను కూడా

దండకట్టు అంటుంది. వరించు అనటానికి బదులు దండించు అనే అర్థాన్ని నర్మగర్భంగా, నిపుణతో చెప్పటం వలన ఇది పర్యాయోక్తి. వాచ్యాంతర వ్యంగ్య స్ఫురణ ఉంది. ఇది వైచిత్ర్యం.

**తే॥ రాజునాఁగ నిజాంశ సంప్రభవుఁడైన**
**జిష్ణునకు నేను బరిచర్య సేయగలను**
**మున్నె నలునకు నన్నిచ్చు కొన్నదాన**
**నింక నొరునకు నెబ్భంగి నిత్తుఁజెపుమ?**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.130 పద్యం)**

దమయంతి నలున్నే వరిస్తానని నేరుగా చెప్పకుండా 'రాజునాగ నిజాంశ సంప్రంభవుడైన జిష్ణునకు' సేవ చేస్తాను అంటుంది. ఏ రాజైన కావచ్చు కదా అంటే కాదు. కేవలం 'నాగ నిజాంశ సంప్రభుడైన' నలుడే రాజవుతాడు అతన్నే వరిస్తానని తెల్పుతుంది. అలా నలుడు అష్టదిక్పాలకుల రూపంలో ఇంద్రుని అంశ కలవాడు కనుక నలుడు ఇంద్రుడే కదా ఇంకా ఇంద్రున్ని వరించటం. దేనికి అనే అర్థాన్నిచ్చినట్లు మాట్లాడుతూ నలవరణ ఇష్టాన్ని, ఇంద్రుని పరిత్యజించడాన్ని తెలుపుతుంది. 'ముందే నలునికి నేను ఇచ్చుకున్నాను' అనే వాచ్యంలో వేరేవారికి తావులేదనే విషయాన్ని చెప్పకనే చెప్తుంది. ఆ భావానికి పర్యాయంగా ఈ వాచ్యం ఉంది. ఇది ఉక్తి వైచిత్ర్యం. అదే పర్యాయోక్తిగా చెప్పాడు కుంతకుడు.

**క॥ ఏవేల్పు సోమ పీథులు సేవింతురు**
**ముఖ్యతనువు శిశువునకు నేవే**
**ల్పేవేల్పు వెలుఁగులకు గని**
**యావేలుపు నిను వరింప నాకాంక్షించెన్**

**(శృ.నై.చతు.ఆశ్వా.30 పద్యం)**

అగ్నిదేవున్ని వరించమని చెప్తూ సూటిగా అతని పేరు చెప్పకుండా ఏ వేల్పు సోమరసం తాగే సోమయాజులు కొలుస్తారు. శివుని అష్టతనువు, సూర్యచంద్రుల యజమాని ఏ దేవుడో ఆ దేవుడు నిన్ను వరిస్తాడని చెప్పడం కన్పిస్తుంది. అగ్నిదేవుడని చెప్పక ఆ వేల్పు విశేషణాల ద్వారా అతను గొప్పవాడనే అర్థం గోచరించేలా చెప్పటం పర్యాయోక్తి. పేరు చెప్పక విశేషణంతో భంగ్యతరం కావటం ఇక్కడి వైచిత్ర్యం.

## 5.9.6. వ్యాజస్తుతి

దీనికి సంబంధించిన ఉదాహరణలు ఉన్నాయి. కానీ లక్షణ వివరణ కారికలు లేవని అలంకార నిరూపణ భాగములు కూడా గ్రంథపాతమైనట్లు తోస్తుందని శ్రీరామచంద్రులు వ్యాఖ్యానంలో తెలిపారు. లభిస్తున్న ఇతర ఆలంకారికుల కారికల ప్రకారం అయితే మమ్మటుడు కావ్యప్రకాశంలో ఇలా చెప్పాడు.

**కా॥ వ్యాజస్తుతిర్ముఖే నిన్దాస్తుతిర్వా రూఢిరన్యథా**

**వృ॥ వ్యాజరూపా వ్యాజేన వా స్తుతిః క్రమేణోదాహరణ**

**(కావ్య.ప్ర.ఉల్లా.10.పుట.660)**

పైకి నిందలా కనబడుతుంది కానీ స్తుతి తాత్పర్య విషయం అవుతుందన్నాడు. అదే వ్యాజస్తుతి. దీనికి కుంతకుడు ఉదాహరణ శ్లోకం ఇచ్చాడు పరిశీలిద్దాం.

**"భూభారోద్వహనాయ శేషశిరసాం సార్థేన సంనహ్యతే**
**విశ్వస్యస్థితయే స్వయం సభగవాన్ జాగర్తి దేవోహరిః**
**అద్యాప్యత్ర చ నాభిమానమసమం రాజంస్త్వయాతన్వతా**

**(వ.జీ.పుట.347)**

భూభారాన్ని వహించడానికి శేషుని శిరః సముదాయము ఇంకా ప్రయత్నం చేస్తూనే ఉంది. భగవంతుడు ఆ విష్ణువు విశ్వసంరక్షణకై జాగరూకుడుగనే ఉన్నాడు. ఓ రాజా! 'నేనే భూభారాన్ని మొత్తం మోస్తున్నానని' అత్యంత అభిమానాన్ని నీవు చూపెడుతున్నావు. మరి వారికి ఒక్క క్షణం కూడా విశ్రాంతి కలగటం లేదు. ఇది ఏమి పద్ధతి? ఇక్కడ పైకి నిందించినట్లు ఉన్న రాజు భూభరత్వాన్ని కొనియాడటం చేత వ్యాజస్తుతి.

## 5.9.6.1. వ్యాజస్తుతి – సమన్వయం

**తే॥ కామ సమ్మోహిత క్రౌంచ ఘాతమునకు**
**వగచి నీ చాటు కవి చెంచు వానిఁగినిసెఁ**
**గామ మోహిత యగునింతిఁగస్తిపఱుప**
**ననుజుఁ బురికొల్పి; తిది నీకుఁ జనునె రామ?**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.130 పద్యం)**

నలుడు విష్ణుమూర్తిని స్తుతించే సందర్భంలోనిది ఈ పద్యం. రామా నిన్ను ప్రియస్తుతులు చేసే వాల్మీకి మదనమోహినమైన క్రౌంచ పక్షుల చంపినందుకు దుఃఖించి చెంచువానిపై

కోపించాడు. నీవు కామ మోహితయగు ఇంతిని బాధపెట్టమని తమ్ముడిని పంపావు. నీకిది తగుతుందా? అని భావం.

నీవంటే ఇష్టపడే కవికి ఉన్నదయా హృదయం నీకు లేదనే పైకి నింద కనిపిస్తుంది. అలాగే ఒక స్త్రీని సైతం చూడకుండా హింసించిన నువ్వు గొప్పవాడివి కాదని నిందించినట్లుంది. కానీ దాని అంతరార్థంలో అవినీతి, దురాచారం గల అసుర స్త్రీని దండించావనే స్తుతి తెలుస్తుంది. పైకి నిందతోచిన లోపల గల పొగడ్త వలన వ్యాజస్తుతి.

**తే॥ దైత్యమర్దన, శ్రీవత్సధారణంబు**
**పొసఁగు దేవర శ్రీవల్లభుండ వగుటఁ**
**దామరసనేత్ర, నీవు రాధాప్రియుండ**
**వకట! రాధేయుఁ జంపించు టర్హమగునె**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.ప.135)**

ఓ దేవా శ్రీవల్లభుండువు కాబట్టి శ్రీ వత్సమనే మచ్చను దాల్చావు ఉచితంగానే ఉంది. రాధాప్రియుడవు రాధేయున్ని చంపటం నీకు తగుతుందా? ఇక్కడ శ్రీలక్ష్మి భర్తవు కాబట్టి శ్రీవత్సం అనే మచ్చను దాల్చావు బాగుంది. కానీ రాధావల్లభుడవని చెప్పుకుంటావు. రాధ పేరు నీకు ప్రియమైనట్టిది. మరి కుంతీ కుమారుడిని రాధ అనే జాలరి పెంచుకున్నది కనుక రాధేయుడైన కర్ణుని చంపుట తగునా అని దీని అంతరార్థం. కర్కష హృదయుడివని నిందించటం పైకి కనిపిస్తుంది. పక్షపాతం లేకుండా న్యాయంగా ఎవరినైనా సంహరించగలవు అనే స్తుతి అందులో దాగి ఉంది. ఈ వైచిత్ర్యం వ్యాజస్తుతి.

**తే॥ మమ్ము రక్షించి తనియేల మాటిమాటి**
**కభినుతింపంగ దక్షవాటాధినాథ**
**తల్లిదండ్రులు రక్షింపఁ దలఁపకుండ్రి**
**ప్రజల భీమేశ! బహువిధోపద్రవముల**

**(భీమే.చతు.ఆశ్వా.79 పద్యం)**

భీమేశ్వరున్ని దేవతలు స్తుతిస్తూ ఇలా అన్నారు. దక్షారామ భీమేశ్వరా! మమ్ములను రక్షించావని మాటిమాటికి నిన్ను స్తుతించుటెందుకు! తల్లిదండ్రులు అనేకమైన ఆపదల నుండి తమ బిడ్డలను కాపాడుకోరా అట్లే మమ్ము కాపాడితిరి అని అర్థం.

ఇక్కడ భీమేశ్వరుని గొప్పతనం ఏముంది మాటిమాటికి ఎందుకు స్తుతించాలి అని నిందిస్తూనే జగత్తుకు తల్లిదండ్రులైన మీరు మమ్మల్ని కాపాడారు అని వాత్సల్యపూర్వకంగా పొగడటం వాక్చాతుర్యాన్ని తెలుపుతుంది. కొంత నిందలా అనిపించినా అంతర్గతంగా భీమనాథుని పొగడ్త ఉంది.

## 5.9.7. ఉత్ప్రేక్ష

**కా॥ సంభావనానుమానేన సాదృశ్యేనోభయేన వా**
**నిర్వర్ణ్యాతి శయోద్రేక ప్రతిపాదన వాంఛయా**
**వాచ్యవాచకసామర్థ్యాక్షిప్త స్వార్థైరివాదిభి**
**తదివేతి తదేవేతి వాదిభిర్వాచకం వినా**
**సముల్లిఖిత వాక్యార్థ వ్యతిరిక్తార్థయోజనమ్**

**(వ.జీ.తృ.ఉన్మే.కా.24,25)**

“వర్ణనీయమగు వస్తువునకు అతిశయోద్రేకమును సంపాదింపవలె ననెడు అభిలాషచే, సంభావనాకృతమగు అనుమానమునుగాని, సాదృశ్యములు రెండింటిని గాని నిమిత్తగ గొని, ‘ఇది అప్రస్తుతము వలెనున్నది’, ‘ఇది అప్రస్తుతవస్తురూపముననే’ ఉన్నది అని ‘వా’ (‘వా’ ఇవార్థకము) మొదలగు వాటిచేగాని; లేదా వాచకములగు ఇవాదులు లేని పక్షమున వాచ్యవాచకముల సామర్థ్యముచే ఆక్షిప్తములగు స్వార్థముగల (అనగా గమ్యమానములగు) ఇవాదులచేగాని, ప్రస్తుత వాక్యార్థముకంటె భిన్నమగు వాక్యార్థమును కూర్చుట ఉత్ప్రేక్ష” (వ.జీ.పుట.348). పుల్లెల శ్రీరామచంద్రులు కారిక అర్థాన్ని తెలియజేసారు (రామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.348).

ఇక్కడ వర్ణనీయ వస్తువు ఉపమే వైచిత్ర్య సంపాదన కొరకు ఉపమానంతో సమానంగా ఊహించి చెప్పటం ఉత్ప్రేక్ష గతంలోని వారు చెప్పినట్లే కుంతకుడు చెప్పాడు. సంభావనకు సాదృశ్యానికి ఉదాహరణలు ఇచ్చాడు

ఒక ఉదాహరణ చూద్దాం.

**“రాశీభూత స్త్రీ భువనగురోస్త్ర్యంబకస్యాట్టహాసః”**

**(వ.జీ.పుట.350)**

ఈ కైలాసము ప్రతీ దినము రాశిగా ఏర్పడిన ఈశ్వరుని అట్టహాసంలా ఉంది అని అర్థం. ఇక్కడ ఈశ్వరుని అట్టహాసం కాల్పనికం కాబట్టి సాదృశ్యం కూడా కల్పనమే. ఇది సాదృశ్య కల్పిత ఉత్ప్రేక్షకు ఉదాహరణ.

**మరో ఉదాహరణ:**

**"లింపతీవ తమోంగాని వర్షతీవాంజనం నభః"**

**(కావ్యాద.11.226)**

"చీకటి అవయవములను పూయుచున్నట్లున్నది. ఆకాశము కాటుకను వర్షించుచున్నట్లున్నది (ఇచట తమస్సుకు లేపన కర్తృత్వము. ఆకాశమున అంజన వర్షణ కర్తృత్వమును ఆరోపింపబడినవి)" (శ్రీరామచంద్రుడు పుల్లెల.వ.జీ.2007.పుట.353). ఇది కూడా ఉత్ప్రేక్షకు ఉదాహరణ.

### 5.9.7.1. ఉత్ప్రేక్ష – సమన్వయం

**తే॥ తద్దిశాజయ యాత్రోత్థ ధరణిధూళి**
**దోఃప్రతాప వైశ్వానర ధూమరేఖ**
**పాలమున్నీటిలోఁబడి పంకమయ్యె**
**నమృతదీధితిమైఁ జెంది యంకమయ్యె**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.52 పద్యం)**

నలుని పరాక్రమ వర్ణన ఇది. అతని యుద్ధదాడుల్లో లేచిన ధూళి బాహుపరాక్రమమనే అగ్నికి పొగచాలుగా ఉంది. ఆ ధూళి పాలకడతో పడి బురదలా మారి అందులో పుట్టిన చంద్రుని మేనికంటినది. అదే చంద్రునిలోని కళంకము. సప్తసాగర పర్యంతం భూమిని జయించాడని అర్థం. చంద్రునిలో మచ్చ ధూళిత్వాన్ని, తత్పంకత్వాన్ని సంభావించటం ఉత్ప్రేక్ష. రాజు పరాక్రమంలో పుట్టిన ధూళి ఉపమేయం చంద్రునిలోని మచ్చ ఉపమానం. ఈ ఉపమేయమే ఉపమానం అయ్యింటుందని, ధూళినే మచ్చగా ఊహించి చెప్పటం ఉత్ప్రేక్ష. రాజు పరాక్రమం విశ్వవ్యాప్తం అని ఉత్ప్రేక్ష ద్వారా గోచరం. 'అమృతదీధిమైఁ జెంది యంకమయ్యె' అనే వాక్యగత ఉత్ప్రేక్ష సౌందర్యోపస్కారమైంది.

**తే॥ ఆది వైద్యుఁడతండు దుగ్ధాబ్ధిఁ బుట్టె**
**నమృతపూర్ణకుంభం బొక హస్తమునను**
**నంబుచరమును గరక కాయయును నొకటిఁ**
**దాల్చి సాకారమైన శాంతమ యనంగ**

**(హర.షష్ఠ. ఆశ్వా.84 పద్యం)**

ఆదివైద్యుడైన అతడు (ధన్వంతరి) ఒక చేత పూర్ణకుంభాన్ని ఇంకొక చేత శంఖాన్ని, కరక కాయను ధరించి రూపుదాల్చిన శాంతియో అనునట్లు పాలసముద్రములో జన్మించాడు. రూపుదాల్చిన శాంతి అనేటట్లు ఉన్నాడని భావం. ఇక్కడ శాంతిలో ఊహించి చెప్పటం ఉత్ప్రేక్ష.

**శా॥ మౌళింగోహళి సంఘటించిన క్రియన్మధ్యాహ్నవేళన్మహా**
**కాళంబైన నభోవిభాగమున వీఁకంగాసె బీరెండ యా**
**ప్రాలేయాహిత సంప్రదీప్త కిరణ ప్రక్రీడ దర్కోపల**
**జ్వాలాజాల జటాల జాంగలతటీ వాచాలకోయష్టియై**

**(హర.సప్త.ఆశ్వా.109 పద్యం)**

మంచుకు సరిపడని తీక్షణమైన ఎండ, వేడి అంతటా వ్యాపించగా అక్కడి నేలలో కొంగల లాంటి జలపక్షులతో నిండియున్న ఆ ప్రాంతంలో అర్జునుని తలపై ఉల్లడ పట్టిందా? అన్న విధంగా అప్పుడు బాగా ఎండ కాసింది. ఇక్కడ ఎండ ఉల్లడ పట్టిందా? అన్నట్లు ఉండటం 'జ్వాలాజాల జటాల జాంగల' విశేషణంతో చెప్పడం ఉత్ప్రేక్షాలంకారం.

**క॥ చుట్టంబులుఁ జెలులుం దన**
**చుట్టుఁ దిరిగియుండ ముదము సొంపెసలారన్**
**నెట్టిపడి చచ్చిక్రమ్మఱఁ**
**బుట్టినచందమున హంసము దటాకములోన్**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.4 పద్యం)**

సంతోషం అతిశయించగా చుట్టాలు, స్నేహితులు తన చుట్టూ తిరుగుతుండగా నెట్టుకొని పడి మళ్ళీ పుట్టిన విధంగా సంతోషాన్ని పొందింది. 'చచ్చి క్రమ్మఱఁ బుట్టిన చందము' అనటంలో ఉత్ప్రేక్ష ఉంది. తటాకంలో హంస సంతోషాతిశయాన్ని కవి వర్ణించాడు. మనోహరంగా ఉంది వర్ణన.

**తే॥ పదియు నెనిమిది విద్యలీ పద్మనయన**
**శ్రవణముల రెంట నర్థమర్థము గ్రహించె**
**నంత రుత్కీర్ణ గంభీర హారిలేఖ**
**యదిగదా వీనులందుఁ దొమ్మిదవ లెక్క**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.184 పద్యం)**

దమయంతి పద్దెనిమిది విద్యలను రెండు చెవులతో చెరి తొమ్మది గ్రహించిందని చెవులలో లోతైన గీఅగా చెక్కబడిన నవ సంఖ్య తెలుపుతుంది. అంటే చెవులోపలి స్థానం తొమ్మిది అంకెలాగా ఉన్నదని కర్ణ సౌందర్యాన్ని తెలుపుతున్నాడు. తొమ్మిది అంకెలా ఉందని. తొమ్మిది విద్యలు నేర్చిందని ఊహించటం ఉత్ప్రేక్ష.

**ఉ॥ ఇందునిభాస్య యోర్తుగదియించెఁ గుమారుని పేరురంబునం**
**గందక యాణిపాణియును గల్గిన తోరపుఁదార హారమున్**
**జిందిలిపాటు లేకయదసీయ ముఖేందు వినిర్గళత్సుధా**
**తుందిల బిందు బృందములు తోయముఁ గైకొనియుండెనో యనన్**

**(శృ.నై.షష్ఠా.ఆశ్వా.56 పద్యం)**

నలుడు ముత్యాల హారాన్ని ధరించాడు. తెల్లనైన ముత్యాల హారాన్ని ధరించటం చేత వాటిని దమయంతి కదిలించిన కూడ కదలక అతని ముఖచంద్రుని అమృతం ఎక్కువై పిక్కటిల్లి చెదరకుండా ఒక్కసారే కిందికి దిగిందా అన్నట్లు ఉందట. ఇక్కడ నలుని ముత్యపు హారాలు ఉపమేయం. చంద్రుని అమృతంతో పోల్చడం, ఊహించడం ఉపమానం. ఇందులోని రమణీయత కూర్చిన అలంకారం ఉత్ప్రేక్షగా చెప్పవచ్చు. ఊహించి చెప్పడం కూడా వైచిత్ర్యమే.

**తే॥ ఒక్క తరలాక్షి యప్సరో యువతివోలెఁ**
**జూచెఁ గనుఱెప్ప వెట్టక రాచవాని**
**రాజసంబున వలరాచ రాచవాఁడు**
**తేఁటి ఱెక్కల గఱియమ్ముఁ దీడుకొనఁగ**

**(శృ.నై.షష్ఠా.ఆశ్వా.65 పద్యం)**

చంచలాలు అయిన కళ్ళు కలిగిన ఒక స్త్రీ కనురెప్ప వేయకుండా నలున్ని చూసింది. ఆమె అప్సరస కనుక రెప్పపాటు ఉండదు. రాజసాన్ని మెచ్చి నలున్ని చూసినందుకు వలరాజు ఈర్ష్యతో తుమ్మెద బాణాలను వాడిగా చేసి ప్రయోగించాడట. వలరాజు బాణాలు పూమొగ్గలు. కానీ ఇక్కడ తుమ్మెద రెక్కలనే బాణాలను ప్రయోగించటం అంటే ఆ స్త్రీ కళ్ళ నీలకాంతి నలునిపై చేరిందని భావం. నలునిపై ఎక్కువ వలపును వహించిందని భావం. చూపులనే తుమ్మెద బాణాలను అనే పద అర్థాన్నిచ్చేలా 'తేటి రెక్కల గరియమ్ము' అనే పదాల ప్రయోగం చేసాడు కవి. చూసిన చూపులలాంటి బాణాలు, వాలని రెప్పలలాంటి తేటి రెక్క గదులు అని చెప్పటం కవి ఊహా కల్పితం. ఇది ఉత్ప్రేక్షకు నిదర్శనం.

ఉ॥ తెప్పలు వాల్ప కప్పుడమితేని మనోహరమూర్తి నిచ్చలుం
దప్పక చూచిచూచి విబుధప్రమదల్ ప్రమదంబులాత్మలం
జిప్పిలుచుండ నెద్దిపరిశీలన సేసిరొయట్టియబ్బెసం
బిప్పుడు వారు చూపుదు రషేతనిమేషములైన చూపులన్

(శృ.నై.ప్రథ.ఆశ్వా.67 పద్యం)

ఆ నలభూపతి ఆకారాన్ని వేల్పు జవరాండ్రు సంతోషంతో మనస్సు ఉప్పొంగగా కన్నార్పకుండా చూసారు. ఆ కన్ను రెప్ప మూయకపోవటం అనేది ఇప్పటికి అలవాటుగా చేసుకొని అనిమేషులుగా ఉన్నారని భావం. దేవకాంతలకు అనిమేషత్వం అనేది సహజ సిద్ధం స్వాభావికం. కానీ నలదర్శనాదుల చేత అనిషమేషత్వం సిద్ధించటం ఊహాజనిత హేతువు. కనుక ఉత్ప్రేక్ష.

క॥ హరిత చ్ఛాయాచ్ఛలమున
భరఖేదము వాయనమృత పానీయ సరో
వరమగు నీ శశియందుం
దరణీ యోలాడుచున్న ధరణిం గంటే?

(శృ.నై.అష్ట.ఆశ్వా.182 పద్యం)

చంద్రుని లోపల ఉన్న నలుపు మచ్చ గాదు. అది భూమే. అమృతమయమైన సరోవరంలాంటి చంద్రునిలో భారశ్రమ తీర్చుకొనడానికి వచ్చిందని కవి ఊహాజనితం. ఇక్కడ చంద్రునిలోని మచ్చను జలకమాడటానికి వచ్చిన భూమిగా ఊహించి చెప్పటం ఉత్ప్రేక్ష.

ఉ॥ నేమమెలర్పఁగా గొడుగునీడ వహించు వసుంధరాస్థలీ
సీమనె యెక్కి యాడెను విచిత్ర గతిందురగోత్తమంబు నా
భూమివిభుండు దద్భ్రములు వోయెడత్రెవ్వక యభ్యసించు వా
త్యామయ చక్ర చంక్రమ విహారములన్ సుడిగాడ్పులీడ్చుచున్

(శృ.నై.ప్రథ.ఆశ్వా.90 పద్యం)

నల మహారాజు గొడుగు నీడ ఒకచోట పడిన మేరకే తన గుర్రాన్ని నానాద్భుత నృత్యాలను ఆడిస్తాడు. సుడిగాలులు కూడా ఆ గుర్రాల సంచారాన్ని చూసి ఇప్పటికి అవి తిరిగినట్టు తిరగాలని ప్రయత్నం చేస్తున్న అది నెరవేరటం లేదని కవి ఊహాజనిత వర్ణన. ఇక్కడ సుడిగాలులు ఉపమానం కావాలి కానీ గుర్రాల చలనక్రమాన్ని ఉపమానంగా ఊహించటం, నలరాజు గుర్రాల అద్భుత

కృత్యాలకు ఆధిక్యం చెప్పటం చేత ఉపమేయమే ఉపమానం అయ్యింది. కనుక ఈ వర్ణనా వైచిత్ర్యానికి కారణం ఉత్ప్రేక్ష.

**మ॥ నభమెల్లంగలయంగ నిండఁబొడిచె న్సంధ్యావశేషాదృతా**
**రభటీ డంబరతాండవభ్రమరి కారంభంబునన్మాంభవీ**
**ప్రభు పాదాహతి మీఁదికి న్నెగయుచున్ బ్రహ్మాండ**
**నభిసంబద్ధములయ్యెనో రజత శైలాశ్మంబులన్నట్టుడుల్**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.160 పద్యం)**

సాయంకాల సమయంలో శివుడు తాండవం మాడుతాడనేది ప్రసిద్ధం. కాబట్టి అప్పుడు ఆకాశంలో ఉన్నట్లుండి ఒత్తుగా నక్షత్రాలు ఉప్పతిల్లి ఆ తాండవ భ్రమరానికి కైలాసం పైకి ఎగసి బ్రహ్మాండ గోళం వరకు వెళ్ళి లోపలి వైపు గుచ్చుకున్నాయా? అన్నట్లు ఉన్నాయట నక్షత్రాలు. ఇలా కవి నక్షత్రాలను బ్రహ్మాండ గోళానికి గుచ్చుకున్నట్లు ఊహించటమనే రమణీయత వైచిత్ర్యం ఉత్ప్రేక్షగా చెప్పవచ్చు.

**పరలోకస్తుఁ బతిన్ ఝుషాంకు బ్రతికింపంగోరియోంకార శం**
**కరుమ్రోలన్ రతిముక్త కంఠముగ నాక్రందించునా నొప్పు న**
**ప్పుర బాహ్యోపవనాంత దీర్ఘికల రేపున్ మాపు వీతెంచు పు**
**ష్కరకింజల్క భుజిక్రియా సుఖితహంస క్రేంక్రియారావముల్**

**(శివ.ద్వితీ.ఆశ్వా.8 పద్యం)**

రత్నపురంలోని దిగుడుబావుల వర్ణన చేస్తూ కవి ఇలా అంటాడు. ఆ పూలతోటల్లో దిగుడు బావులున్నాయి. అందులో కలహంసలు విహరిస్తున్నాయి. అందులోని కింజల్కాలను కడుపు నిండ తిని ఆనందంగా శబ్దాలు చేస్తున్నాయి. ఆ రాయహంస క్రేంకార రావాలు భస్మమైపోయిన తన పతి మన్మథున్ని బ్రతికించమని రతిదేవి పరమేశ్వరున్ని ప్రార్థిస్తున్నట్లున్నాయి. రతిదేవి ప్రార్థనతో హంసల ధ్వనులను ఊహించబడింది. ఉపమానంలో ఉపమేయాన్ని ఊహించి చెప్పడమైంది. ఈ వైచిత్ర్యం ఉత్ప్రేక్షగతమైంది.

**క॥ కమాలధిరాజ్యపదవీ**
**సమధిష్ఠిత మీవధూటి చారుముఖాంబో,**
**జము మఱియటు గాదే నే**
**నిమిత్తమున సేవ సేయు నేత్రాంబుజముల్**

(శృ.నై.తృతీ.ఆశ్వా.181 పద్యం)

దమయంతి ముఖ సౌందర్యాన్ని వర్ణించాడు కవి. ఈ భామ సుందర వదనారవిందం కమలాల సామ్రాజ్యం అనే విభవాన్ని ఆశ్రయించింది. ఈమె ముఖాంబోజం కమలాలకెల్ల రాజు కావాలి లేకపోతే నేత్ర కమలాలు ఆ ముఖాన్ని ఎలా సేవిస్తాయి. ఉపమానంగా ఉపమేయాన్ని ఊహిస్తూ ముఖాన్ని ముఖ కమల సామ్రాజ్యాధి నేతగా చెప్పబడ్డది కనుక ఉత్ప్రేక్ష. నేత్రాంబుజాలు అనటంలో అంబుజానికి నేత్రానికి అభేదంతో రూపకం. ఇక్కడ ఉత్ప్రేక్ష అంగి, రూపకం అంగం.

**తే॥ అబ్జగర్భుండు సుషమా సమాప్తియందు**
**నెత్తి చూడcగc బోలు నీ యింతి వదన**
**మంగుళీ యంత్రణ క్రియా భంగి నమరెc**
**జిబుకమున యందు నా నిమ్నసీమ సంధి**

(శృ.నై.తృతీ.ఆశ్వా.179 పద్యం)

దమయంతి వదనాన్ని వర్ణిస్తూ బ్రహ్మ ఈ యింతిముఖాన్ని చేసినపుడు సంపూర్ణమైన శోభను ఇవ్వడానికి పరీక్షార్థం ముఖాన్ని ఎత్తి చూసాడేమోననిపిస్తుంది. ఎందుకంటే ఆమె గడ్డం కింది భాగంలోని పల్లం బ్రహ్మ బొటన వేలి ఒత్తుగా కనిపిస్తుంది. ఇక్కడ బ్రహ్మ వేలి ముద్రను ఊహించడం ఉత్ప్రేక్ష.

### 5.9.8. అతిశయోక్తి

**కా॥ యస్యామతిశయః కోఽపి విచ్ఛిత్త్యాప్రతిపాద్యతే**
**వర్ణనీయస్య ధర్మాణాం తద్విదాహ్లాదదాయినామ్**

(వ.జీ.తృ.ఉన్మే.కా.27)

ఎక్కడ సహృదయాహ్లాదమయ్యే వర్ణనీయమునందలి ధర్మాలకు సంబంధించిన అతిశయం, విచ్ఛిత్తి విశేషముతో ప్రతిపాదింపబడితే అది అతిశయోక్తి. ఉదాహరణగా భామహుని కావ్యాలంకారంలోనివి ఇచ్చాడు.

**"స్వపుష్పచ్ఛవిహారిణ్యా చంద్రభాసా తిరోహితాః**
**అన్వమీయన్త భృంగాలీవాచా సప్తచ్ఛదద్రుమాః"**

(భామ. కావ్య.ద్వితీ. II–82)

"తమ పుష్పముల కాంతిని తిరస్కరించెడు చంద్రకాంతిచే కప్పబడిన ఏడాకుల అరటి చెట్లు తుమ్మెదల సముదాయముల ధ్వనిచే ఊహింపబడినవి. ఇచట సప్తచ్ఛద వృక్షములు చంద్రకాంతిచే

తిరోహితములు కాకున్నను తిరోహితములైనట్లు వర్ణింపబడినది గాన అతిశయోక్త్యలంకారము" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.355).

**5.9.8.1. అతిశయోక్తి – సమన్వయం**

**ఉ॥ తమ్ముని వీరభద్ర వసుధాధిపు విక్రమ వీరభద్రుని**
**న్సమ్మదలీలరాజ్యభరణ స్థితిఁ బట్టముఁగట్టిబాహుద**
**ర్పమ్మున వేమభూవరుఁడు వ్రాసెజగద్విజయప్రశస్తి వ**
**ర్ణమ్ములు దిగ్ధురంధర సురద్విప కుంభ విషాణ మండలిన్**

**(భీమే.ప్రథ.ఆశ్వా.34 పద్యం)**

వేమభూపతి పరాక్రమంలో వీరభద్రుడైన, తన తమ్ముడు వీరభద్ర భూపతిని రాజుగా పట్టాభిషిక్తుని చేసి రాజ్యభారాన్ని వహించాలని పట్టంగట్టి, ఆప్రశస్తిని దిక్కులనే దేవగజాల కుంభస్థలంలోని దంతాలపై లోక విజయాలను పేరుతో రాయించాడు. దిక్కులన్నింటికి అతని కీర్తి, పరాక్రమం పాకిందని అర్థం. చెప్పేదానికన్నా ఎక్కువగా పొగుడుతూ చెప్పడం అతిశయోక్తి. తన ప్రశస్తిని దేవగజాల కుంభస్థలిపై రాయటం అతిశయం.

**సీ॥ పాతాళ భువనాధిపతికి శేషాహికిఁ**
**ప్రియలతో మసకానఁ బెనఁగఁగలిగె**
**దిక్సింధురములకు దివ్యవాహిని లోనఁ**
**దేఁటి రాయిడి మానఁ దేల నొదవె**
**నుర్వీధరములకు నుదధిలోఁగాఁపున్న**
**కొలము సాముల యిండ్లఁ గుడువనబ్బెఁ**
**గుహనా కిటికి లక్ష్మికుచకుంభముల మీఁది**
**కుంకుమంబున నుసుల్ కొనఁగఁగూడె**

**తే॥ రాయ వేశ్యాభుజంగ వీరప్రతాప**
**భాసియల్లాడవిభు వీరభద్ర నృపతి**
**సర్వసర్వం సహాచక్ర సర్వభరము**
**పృథు భుజాపీఠమున సంభరించటయును**

**(భీమే.ప్రథ.ఆశ్వా.35 పద్యం)**

రాయవేశ్యా భుజంగుని వీరప్రతాపం వల్ల ఆదిశేషుల భూమిని మోసే పని తప్పింది. దిగ్గజాలు దిక్కుల బాధలు మోయలేక తప్పించుకొని ఆకాశగంగలో క్రీడించడానికి వెళ్ళినవి. కులపర్వతాలు తమ వంశాధిపతుల ఇండ్లలో సుష్ఠిగా భోజనం చేస్తున్నాయి. భూమిని కాపాడటానికి అవతారమెత్తిన విష్ణువు నిర్విచారుడై లక్ష్మీదేవితో క్రీడిస్తున్నాడు. ఇక్కడ ఆదిశేషుడు, సప్త పర్వతాలు, వరాహం భూమిని మోస్తున్నయని పురాణ వచనం కానీ ఇపుడు రాజే మోస్తున్నాడని చెప్పటం అతిశయోక్తి చమత్కారం. ఇది రాజు పరాక్రమం వర్ణితం.

**శా॥ దేవబ్రాహ్మణ భక్తి వర్ధిత ధరిత్రీచక్ర సామ్రాజ్య ల**
**క్ష్మీ వాస్తోష్పతి సంస్తుతింపఁగఁదగున్ శ్రీవేమ పృథ్వీశ్వరున్**
**లావణ్యాపర మత్స్యలాంఛనుని నాలంకాపురీ శంకర**
**గ్రావాభ్యంతర కూల ముద్వహయశః కల్లోలినీ వల్లభున్**

**(భీమే.ప్రథ.ఆశ్వా.39 పద్యం)**

శ్రీ వేమభూపాలుడు దేవతలలో బ్రాహ్మణులలో పెంచబడిన సామ్రాజ్య సంపదకు ఇంద్రుడు లాంటివాడు. అందంలో అపర మన్మథుడు, లంకా నగరం నుండి కైలాస పర్వతం వరకు గల మధ్యప్రదేశంలో ఒడ్లు ఒరుసుకుని ప్రవహించే యశోనదికి నాయకుడు. చుట్టు రాజులను గెల్చి సామంతులుగా చేసుకొని అతని కీర్తి సర్వ భారతదేశం వ్యాపించిందని రాజు గూర్చి చెప్పాల్సిన దాని కన్నా అధికంగా చెప్పటం, మన్మథుడు, ఇంద్రుడితో పోల్చడం భారతదేశం మొత్తం వ్యాపించిందని అనటం అతిశయోక్తి.

**మాలిని. జరఠ కమఠ రాజస్తబ్ధరోమ ప్రధాన**
**ద్విరసన పతి భూభృద్ దిగ్గజగ్రామభూమ**
**స్థిరతర ధృత సంపదేహా బాహాగ్రపీఠీ**
**పరిచయ సుఖ లక్ష్మీ పక్షల క్షోణి చక్రా**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.113 పద్యం)**

ఇది కూడా రాజు రాజ్య పరిపాలన గూర్చి చెప్పడం జరిగింది. 'జరఠకమఠరాజం' ఇక్కడ ఆదికూర్మం చేత, ఆదివరాహం చేత, ద్విరసన పతి అయిన అనంతుని చేత, 'భూభృత్' కుల పర్వాతాలచేత చాలా కదళికలతో భూమి మోయబడి అలసిపోయింది. ఇపుడు మామిడి సింగనరాజు రాజ్యాధికారంలో అతని బాహువుల ఆసనం మీద కూర్చుండి సుఖంగా ఉంది రాజ్యలక్ష్మి. పలువురు కమఠాదులచేత మోయబడి అలసట చెందిన భూమి ఇతని బాహాగ్ర పీఠంపై

కూర్చుండి సుఖపడుతున్నదని భావం. ఇతని రాజ్యపాలన చక్కగా ఉందని చెప్పకనే చెప్పటం. ఆదివరాహాదులు కూడా చేయని పని రాజు చేస్తున్నట్లు చెప్పడం అతిశయోక్తి. అతని ఔన్నత్యాన్ని తెలుపుతుంది ఈ అలంకారం.

**తే॥ అపుడు లీలాదినిర్జితానంగుఁడైన**
**యతనిఁగనియును వినియుఁజిత్తానురక్తి**
**స్వర్గమర్త్య పాతాళ విష్టపములందు**
**విబుధ నరభోగి కాంతలు వివశలైరి**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.66 పద్యం)**

తన విలాసాలతో అవలీలగా మన్మథున్ని గెలిచిన నలుడు అతని చేష్ట గూర్చి విని, మర్త్య, పాతాళ లోకాలలో సురకాంతలు, నాగకాంతలు అందరూ వివశులు అయ్యారని భావం. ఇక్కడ మన్మథుని కన్నా ఎక్కువ చెప్పటం, నరునికి దేవతలు సైతం ముగ్ధులయ్యారని అధికంగా చెప్పటం అతిశయోక్తి. రాజును గొప్పగా చెప్పటం ప్రస్తుత వైచిత్ర్యం. ఉపమానం కంటె ఉపమేయం అధికంగా చెప్పబడ్డది. ఇక్కడ వివశత అనేది దేవకాంతలకు ఉండదు కానీ లేని వివశతను ఉందని చెప్పటం సంబంధాతిశయోక్తిగా చెప్పవచ్చు.

**తే॥ తద్గుణాకర్ణనంబునఁదద నిరీక్ష**
**ణమున ధన్యత్వమునున ధన్యతయుఁబొంది**
**యభిమతానభిమతమైన యక్షియుగముఁ**
**దాల్చుఁ జక్షుశ్శ్రవః స్త్రీ కదంబకంబు**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.68 పద్యం)**

పాతాళలోకంలోని నాగ కన్యలు నలుని గూర్చి వినాలని తపిస్తున్నాయి. నాగులకు కళ్ళే చెవులు వాటితో వింటాయి, చూస్తాయి. ఆ నలుని గూర్చి వినటం వల్ల కృతార్థతను పొందాయి. అతను కనిపించక పోవటం వాటికి అప్రియమైనదని కళ్ళు మూసుకుంటాయి. కానీ అతని గూర్చి వినాలని కళ్ళు మూసుకున్నప్పటికి చెవులలాంటి మూసిన కళ్ళతోనే వింటాయి. ఇక్కడ కళ్ళతోనే వినడం, చూడటం రాజు లేనందుకు ఆ కళ్ళను అవే నిందించుకోవటం అతిశయోక్తి. మూసిన కళ్ళతో వినటం అనే సంబంధం చెప్పడం ద్వారా సంబంధాతిశయోక్తి. ఈ అలంకారం రాజు సౌందర్యాన్ని గొప్పదిగా చేసింది.

**చ॥ మొలచిన కూర్మిఁగన్నుఁగవ మోడ్చిన యప్పుడజస్రభావనా**

**బలమున నా నృపాలకునిఁ బాయక చుతురు మర్త్యభామః లా**
**యలికులనీలవేణులకు నమ్మెయి నవ్విభుఁ జూచువేళలన్**
**గలుగవు వోనిమేషపరికల్పనఁ బుట్టెడు నంతరాయముల్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.ప.69)**

దేవతా స్త్రీలకు రెప్పపాటు ఉండదు. అందుకే వారు అనిమేషులు. నరులకు ఉంటుంది. దేవతలకుండదు కనుక నలుని సౌందర్య దర్శనానికి విఘ్నం లేదు. అలాగే చూస్తూ ఉండిపోతారు. ఒక్క క్షణం కూడా అతని సౌందర్యాన్ని వీడిపోరు. మరి మర్త్య భామలు నలధ్యానం నిరంతరం చేస్తూనే ఉన్నారు. కాబట్టి ఆ కనుమూత సమయంలో కూడా వారికి నలుడు కనిపిస్తూనే ఉన్నాడని భావం. దేవతల లాగే వీరికి ఎలాంటి కొరత లేదనే చెప్పటం ఇక్కడి సంబంధం నలుని గూర్చి అందరు కాంతలు తపించడం, కనులు మూయకుండా దర్శించడం, అదీ దేవతా స్త్రీలు కూడా ఆ అవస్థను అనుభవించడం, అతిశయోక్తిగా చెప్పవచ్చు. ఈ అలంకార వైచిత్ర్యం వల్ల పద్యం హృదయంగమం అయ్యింది.

**ఉ॥ ఆ వసుధాధినాథుని మహాధృతిశాలి జయించు తెంపునన్**
**భావజుఁడప్పుడున్మదన బాణము తియ్యనివింటఁ గూర్చుచోఁ**
**గేవల సాహసంబు మదిఁగీల్కొనఁజేసియుముంచెఁదాఁద్రిలో**
**కీ విజయార్జితంబులగు కీర్తి భరంబులు సంశయాంబుధిన్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.81 పద్యం)**

మహా ధైర్యంతో అతిశయిస్తున్న నల మహారాజుని ఎలాగైనా జయించాలని అనుకొని తన చెరుకు వింటిని సంధించి, జయింప సాహసించి, అతని కీర్తి సంద్రంలో తన బాణం మునిగిపోతుందని భయపడ్డాడు. సంశయించాడు. ఇక్కడ నలున్ని ఎక్కువ చేసి చెప్పటం అతిశయోక్తి. మన్మథుడే భయపడటం, నలుని సౌందర్యాతిశయం అతని మీద పగ పెంచుకునేలా చేయడం అతిశయం. లోకోత్తర సౌందర్యరాశి అయిన మన్మథుడే అతని సౌందర్యానికి ఈర్ష్య పడటం అతిశయోక్తి. మదనునికి కీర్తి ఆశ లేదు కానీ ఉన్నట్లు చెప్పటం ఇక్కడి సంబంధం. మన్మథుని కన్నా రాజుని ఉన్నతంగా చెప్పటం, అతని కీర్తి, వైభవాన్ని, ధైర్యాన్ని తెలిపింది ఈ అలంకార వైచిత్ర్యం.

**తే॥ పరివహ స్కంధ మారుతాస్ఫాలనమున**
**వీతి హోత్రుండు నర్తించు విధముచూచి**

భీమనందన నీతండు పెండ్లి యాడఁ
బోలునని యభ్రచరకోటి బుద్ధిఁదలఁచె

(శృ.నై.సప్త.ఆశ్వా.34 పద్యం)

అగ్ని జ్వాలలు గాలికి అటు ఇటూ ఊగుతుంటే ఆకాశంలో సంచరించే వారికి దమయంతీ పెళ్ళాడటానికి అంగీకరించిన లాభం కలిగిందో ఏమోనని తలిచారట. ఇక్కడ వాయువు చేత అగ్ని కదలటం సర్వ సాధారణమైన విషయాన్ని ఒక సంబంధాన్ని కల్పించి, కవి అతిశయించే విధంగా చెప్పటం అతిశయోక్తి అలంకారం.

ఉ॥ ఎందఱు జంగమప్రమథు లెత్తఱి నేమి పదార్థమెంతయే
కందువ వేఁడినం దిరముగా నతఁడందఱి, కాపదార్థమా
కందువ యేపుప్రాణమెడఁగా నిడియైన గరించిపెట్టుఁబూ
ర్ణేందుని భాస్యవాని సరి యెవ్వఁడు లేఁడువసుంధరాస్థలిన్

(హర.ద్వితీ.ఆశ్వా.5 పద్యం)

జంగములు ఎందరు ఏ సమయంలో, ఏ పదార్థం ఎంత ఏ విధంగా కోరినా, సంకోచించకుండా అందరికి ఆ విధంగా ప్రాణాలు పణం పెట్టైనా ఇచ్చేవాడు నంబి. ప్రపంచంలో మరొకడు లేడని 'సరియెవ్వఁడు లేడు వసుంధరాస్థలిన్' అనే విశేషణం అతిశయోక్తిని తెల్పుతుంది. ఏదైనా ఇవ్వగలడనేది కూడా అతిశయాన్ని తెల్పుతుంది.

మ॥ కని యత్యుద్ధతి శంఖమొత్తుటయు, నా కంపించెధాత్రీతలం
బనిలస్కంధము లేడు చిక్కువడియెన్యాదోనిధుల్డిందె ఘూ
ర్ణనముంబొందెసురేంద్రలోకములు విన్నంబోయెఁబాతాళము
ల్వినియోగంబులు దప్పెభూతచయముల్ప్రీలెన్దిశాభాగముల్

(హర.సప్త.ఆశ్వా.157 పద్యం)

రాక్షసపుర వర్ణన ఇది. భూమి చలించి పోయింది. వాయువులు చిక్కుబడ్డాయి. సముద్రాలు కృశించాయి. లోకాలు మహానాదంతో కంపించాయి. ఇంద్రాది లోకాలు చిన్నబోయాయి. పాతాళాలు గతి తప్పాయి. దిక్కులు బద్దలయ్యాయి. ఇవన్నీ సహజంగా జరగవు కానీ జరిగినట్లు చెప్పటం అతిశయోక్తి. ఉన్నదానికన్నా అసాధ్యాన్ని చెప్పటం వలన అక్కడ భీకర పరిస్థితి అవగతమయ్యింది.

### 5.9.9. ఉపమ

కా॥ **వివక్షిత పరిస్పన్ద మనోహారిత్వ సిద్ధయే।**
**వస్తునః కేన చిత్ సామ్యం తదుత్కర్షవతోపమా॥**
**తాంసాధారణ ధర్మోక్తౌ వాక్యార్థే వాతదన్వయాత్।**
**ఇవాదిరపి విచ్ఛిత్త్యా యత్ర వక్తి క్రియాపదమ్॥**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.28, 29)**

ప్రకృతమైన వర్ణనీయ వస్తువుకు వివక్షితమైన ధర్మ సౌందర్యం సిద్ధించడానికి, ప్రస్తుత పదార్థములో ఏ ధర్మములు ఉంటాయో ఆ ధర్మాలు కల మరొక వస్తువుతో సామ్యాన్ని చెప్పటమే ఉపమ. ఉపమాలంకారం చెప్పేటపుడు సాధారణ ధర్మం స్పష్టంగా ప్రతిపాదించినపుడు గానీ, వాక్యార్థంలో అన్వయించినపుడు గాని 'ఇవా'ది పదాలు ఉపమను బోధిస్తాయి. విచ్ఛిత్తి విశేషముచే క్రియాపదము కూడా బోధిస్తాయి. ఉపమను బోధించే క్రియాపదం ఇష్టం. అంతే కాని వివక్షితం కాదు. ఎక్కడైనా అముఖ్యరూపమైన క్రియ ఉంటే అది ఉపమావాచకమే. ఈ విధంగా వస్తు సామ్యము తుల్యమే అయినా ఉపమావస్తువు భిన్నమే అని చెప్తున్నాడు. అముఖ్యమైన క్రియాపద ఉపమకు ఉదాహరణగా ఈ శ్లోకాన్నిచ్చాడు.

**"పూర్ణేందోస్తవ సంవాది వదనం వనజేక్షణే।**
**పుష్ణాతి పుష్పచాపస్య జగత్త్రయ జిగీషుతామ్॥**

**(వ.జీ.పుట.358)**

ఓ వనజేక్షణా! పూర్ణచంద్రునితో పోలి ఉన్న నీ ముఖం, మన్మథుని జగత్త్రయ విజయాభిలాషను పెంచుతుంది. ఇక్కడ సామ్యం 'సంవాది' పదంతో (అప్రధాన క్రియతో) చెప్పబడ్డది. ఉపమలో భేదాలను తెలుపుతూ ఆఖ్యాతపద ప్రతిపాద్యోపమ, సమాన ప్రతిపాద్యోపమను తెలిపాడు. అలాగే ప్రతివస్తూపమాలంకారాన్ని నిర్వచించి సమానములైన వస్తులపై కూర్చే ఉపమ ప్రతివస్తూపమ అని భామహుని కావ్యాలంకారంలోని కారికను ఉదాహరించాడు. నిదర్శనాలంకారాన్ని కూడా ఉపమ అంతర్గతంగా తెలిపాడు.

### 5.9.9.1. ఉపమ – సమన్వయం

క॥ **తెక్కలకొనలం గలిగిన**
**యిక్కాంచన మాసపడియెదే నృప? నీకే**
**యక్కఱ దీనం దీరెడు**

నక్కట నీహారలేశ మబ్ధికిఁ బోలెన్

(శృ.నై.ప్రథ.ఆశ్వా.105 పద్యం)

రెక్కల కొనగల బంగారం మీద ఆశపడుతున్నావా? ఈ కొంచెం బంగారం చేత నీకు ఏ అక్కెర తీరుతుందని అర్థం వస్తుంది. అలాగే రెక్కల కొనగల ఈ కొంచెం బంగారానికి ఆశపడితే సముద్రానికి చిన్న మంచుబొట్టు చేత ఏ ఉపయోగం ఉంటుందని భావం. ఇక్కడ కాంచనానికి, నీహార కణికి పోలిక చెప్పటం ఉపమాలంకారం.

క॥ తరుణి యతి లలిత పర్వ
స్మర పంచశరీ సమాన మహనీయ నఖాం
కుర మృదు లాంగుళివిలస
త్కరపంజక యుగళి దీనిఁదరమెనుతింపన్

(శృ.నై.తృతీ.ఆశ్వా.188 పద్యం)

దమయంతి అతి లలితమైన చేతివ్రేళ్ళు మదనుని పంచ బాణాలకు సమానమైనట్టు ఐదేసి బాణాలకు ఐదు వేళ్ళు బాణాలకు కణుపులున్నట్లే వేళ్ళకు కనుపులున్నాయి. బాణాలకు అలుగున్నట్లే వేళ్ళకు మొలక గోర్లున్నాయని పోలుస్తూ, మన్మథుని అంపపొదుల జంటలాగా చేతులున్నాయని చెప్పటంతో ఉపమేయ ఉపమానాలకు పోలికతో ఉపమాలంకారం.

గీ॥ అతనియర్ధాంగలక్ష్మి యక్కాంబ గనియె
నాత్మజుల వేదమూర్తుల నబ్ధినిభుల
వెలయశ్రీ పెద్దనామాత్య వీరభద్ర
మారన ప్రభు నామన మంత్రివరుల

(శృ.నై.ప్రథ.ఆశ్వా.25 పద్యం)

అక్కాంబ నలుగురు పుత్రులను కన్నదనే విషయాన్ని వివరిస్తూ సముద్రతుల్యులు, నలుగురిని కన్నదని వారు వేదాలు నాలుగు ఎలాగో వారు కూడా అలా ఉన్నారని సంఖ్యా సామ్యం చెప్పబడింది. వేదాలతో సామ్యం ఇక్కడి వైచిత్ర్యం.

తే॥ కామినీ విప్రయోగ దుఃఖమునఁ గుందెఁ
జక్రవాకంబు సురనదీ సైకతమునఁ
గాశికా విప్రయోగ దుఃఖమునఁ గుందు
బాదరాయణ ముని సార్వభౌము కరణి

(భీమే.ద్వితీ.ఆశ్వా.31 పద్యం)

ఇది ఉపమాలంకారానికి ఉదాహరణ. కాశిని వదలి వెళ్ళాలని దుఃఖంతో పరితపిస్తున్న వ్యాస మహర్షిలాగా చక్రవాక పక్షి తన ప్రియురాలి ఎడబాటు వలన గంగానది ఇసుక తిన్నెపై తపించింది. ఇక్కడ వ్యాసుని దుఃఖాన్ని, చక్రవాకం విరహాన్ని పోల్చడం తపించడం సామ్యాన్ని చెప్పటం ఇక్కడి వైచిత్ర్యం. పక్షితో వ్యాసున్ని పోల్చకుండా పక్షే వ్యాసునిలా ఉందని చెప్పబడ్డది.

**తే॥ అనుచుఁ దీక్ష్ణంబుగా భీమతనయ పలుక**
**నెలుఁగు వినువేడ్క గోయిల నెగిచినట్లు**
**విబుధరాజ ప్రసంగంబు విస్తరించి**
**మఱియుఁ బలికింపఁ దలఁచి యమ్మనుజవిభుఁడు**

(శృ.నై.చతు.ఆశ్వా.71 పద్యం)

దమయంతితో మాట్లాడుతూ ఆమె మాట్లాడకపోతే మళ్ళీ పలికించి మాట్లాడాలని ప్రయత్నం చేసాడట. ఎలాగంటే కోయిల కూత వినాలని దాన్ని అనుకరించి మళ్ళీ వినడానికి కోయిలను రెచ్చగొట్టిన విధంగా నలుడు దమయంతి పలుకులను వినాలకున్నాడని భావం. కోయిలను రెచ్చగొట్టినట్లుగా చెప్పటం ఇక్కడ ఉపమాలంకారం కోయిల కూత ఉపమానం, దమయంతి మాటలు ఉపమేయం. ఇది ఉపమాలంకారం.

**తే॥ ప్రబలమై యంధకారంబు బలిసియుండఁ**
**దారకంబులు కాంతినెంతయును బెరసె**
**నీలిపుట్టంబుఁ బఱచి పైనిలిపినట్టి**
**వలుఁద ముక్తాఫలముల తావళములట్లు**

(భీమే.ద్వితీ.ఆశ్వా.36 పద్యం)

కాశీ నగర చీకటిని వర్ణిస్తూ చీకటి అధికమై ఉంటే నక్షత్రాలు నల్లని వస్త్రాన్ని పరిచి దానిపై ఉంచిన లావైన ముత్యాల దండలాగా ప్రకాశిస్తున్నాయని కవి తెలిపాడు. కవి వర్ణనలో చీకటిలోని నక్షత్రాలకు, ముత్యాల దండకు పోలిక చెప్పటం ఉపమ వల్ల కలిగిన వైచిత్ర్యం.

**తే॥ పాతకము చేసియైనను బరితపించి**
**ధరణి దానంబు చేసిన ధన్యుఁడడఁచు**
**నయ్యఘముఁ దథ్యమిది నిర్జరాధి నాథ**
**కుబుస మూడ్చెడి మేటి నాగువును బోలె**

(భీమే.పంచ.ఆశ్వా.71 పద్యం)

పాపం చేసిన వాడైన పశ్చాత్తాపాన్ని పొందితే, భూదానం చేస్తే మొదట చేసిన పాపము నశిస్తుంది. ఎలా అంటే పాము కుబుసాన్ని వదిలి వేసినట్లుగా ఆ పూర్వపాపం నశిస్తుంది. ఇది ఉపమాలంకారం. పాము కుబుసానికి, పూర్వగత పాప నాశనానికి సామ్యం చెప్పబడ్డది. ఇదే వైచిత్ర్యాన్ని ఎర్రన సూక్తినిధిగా కూడా చెప్పవచ్చు. ఎర్రన సూక్తి వైచిత్రిని కూడా శ్రీనాథుడు పాటించానని చెప్పడం విదితమే. సందర్భానుసారంగా సూక్తిని, లోకోక్తిని, నీతిని చెప్పటమే సూక్తి వైచిత్ర్యం. మానవుని పశ్చాత్తాప విషయ వర్ణన ఇక్కడి వైచిత్ర్యం. ప్రస్తుతం దీనిని ఉపమా వైచిత్ర్యంగా వాక్యవక్రతలో భేదంగా చెప్పబడ్డది. దీనిని సూక్తి వైచిత్ర్యంగా కూడా చెప్పవచ్చు.

**తే॥ శ్వేత పక్షంబు లోపలఁ బెరుఁగు నెట్లు**
**దినదినంబును నీహార దీప్తి దీప్తి**
**నవ్విధంబునఁ బెరుఁగు నిత్యాభివృద్ధిఁ**
**బంటపంటకు భూదాన భర్తఫలము**

(భీమే.పంచ.ఆశ్వా.70 పద్యం)

శుద్ధ పాడ్యమి నుండి పున్నమి వరకు చంద్రుని కాంతి ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో అదే విధంగా భూదానం చేసినవాని ఫలితం పంట పంటకు ఎడతెగని అభివృద్ధి పొందుతుంది. చంద్రకాంతి వృద్ధికి, పంట అభివృద్ధికి సామ్యం కనుక ఉపమాలంకారం. విషయాన్ని చెప్పేటప్పుడు పోలిక చెప్పటం వైచిత్ర్యమేనని కుంతకుని భావన.

**తే॥ అర్కుడెబ్బంగి నభమున కాభరణము**
**భువనములకెల్ల నాభంగి భూషణంబు**
**దక్షవాటీపురము భోగమోక్ష విభవ**
**పావనంబందు విశ్వాసపరులు గంద్రు**

(భీమే.పంచ.ఆశ్వా.97 పద్యం)

సూర్యుడు ఏ విధంగా ఆకాశానికి ఆభరణమో అదే విధంగా లోకాలన్నింటికి దక్షారామ నగరం ఆభరణం. భోగమోక్షాల వైభవానికి పవిత్రమైంది. సూర్యునికి, దక్షారామానికి సామ్యాన్ని చెప్పటం, లోకోత్తరోత్కర్షను సూచించడం, దక్షారామ వైభవాన్ని గోచరించేలా చెప్పటం ఇక్కడి ఉపమాలంకార వైచిత్ర్యం.

**తే॥ జలజ పత్రంబు తనమీఁదఁజల్లియున్న**

**యుదక బిందులతో గూడకున్నయట్లు**
**బ్రహ్మ విజ్ఞాని తన మీఁదఁ బడినయట్టి**
**విషయ మలమునఁ బడకుండు విమలచరిత**

**(భీమే.పంచ.ఆశ్వా.189 పద్యం)**

తామరాకు మీద పడిన నీటి బొట్లతో కలువకుండనే బ్రహ్మ జ్ఞాని తన మీద పడిన లౌకిక సుఖదుఃఖాలనే మురికిలో పడడు అనే తాత్త్విక విషయాన్ని సహజమైన తామరాకు నీటితో సామ్యం చెప్పటం ఉపమాలంకార వైచిత్ర్యం.

**తే॥ భక్షితంబైన విషమెట్లు కుక్షి నఱుగు**
**విమల మణి మూల మంత్రౌషధముల చేత**
**ననుభవించిన విషయంబులట్ల యఱుగు**
**బ్రహ్మ విజ్ఞానమునఁ జేసి పరమ మునికి**

**(భీమే.పంచ.ఆశ్వా.190 పద్యం)**

ఋషియైన వానికి పవిత్ర రత్నాలు, చెట్ల వేర్లు, గరుడాది మంత్రాలు, మందులతో తిన్న విషం ఎలా పొట్టలో జీర్ణమవుతుందో అదే విధంగా బ్రహ్మ జ్ఞాన సంపాదన చేత అనుభవించిన లౌకిక సుఖదుఃఖాలు క్షీణిస్తాయి అని భావం. ఇక్కడ సుఖ దుఃఖాలకు, ఋషికి సామ్యం, క్షీణత సమాన ధర్మంగా చెప్పటం ఉపమాలంకారం.

**తే॥ వహ్ని సందీప్తమై మహావనము నందు**
**సరస నీరసతరుల భస్మంబు సేయు**
**బ్రహ్మ విజ్ఞానమును నట్ల ప్రజ్వరిల్లి**
**శుభమునశుభము నొకటిగా సుడికికాల్చు**

**(భీమే.పంచ.ఆశ్వా.188 పద్యం)**

అగ్ని ప్రజ్వలించి, కార్చిచ్చై మహారణ్యంలో ఎండిన చెట్లతోపాటు పచ్చని చెట్లను కాల్చి బూడిద చేసిన విధంగా బ్రహ్మ జ్ఞానం కూడా ప్రజ్వరిల్లి శుభాశుభాలను ఒకే రీతిగా చుట్టి కాల్చి వేస్తుందని భావం. అగ్ని ప్రజ్వలనకు, బ్రహ్మ జ్ఞానానికి సమానత్వం చెప్తూ పోలికను చెప్పటం, కాల్చుడం సమాన ధర్మం బ్రహ్మ జ్ఞాన ఆధిక్యం విదితం.

**తే॥ అందఱను బ్రమవెట్టుచు నవ్వధూటి**
**యెవ్వరికిఁ దానుబ్రమయకయెడన యుండె**

**దానిపై వాలి చొక్కెనందఱ మనములు**
**గంధఫలి మీద వాలు భృంగముల పగిది**

**(హర.షష్ఠా.ఆశ్వా.105 పద్యం)**

మోహిని అవతార వర్ణన ఇది. అందరిని తాను భ్రమపెడ్తూ తానెవ్వరి పట్ల భ్రమనొందక ఉంది మోహిని. ఎలా అంటే సంపెంగపై వాలిన తుమ్మెద లాగా అందరి మనస్సులు ఆమెపై వాలాయి. సంపెంగ పువ్వుతో, మోహినిని పోలిక చెప్పటం ఉపమ. సంపెంగపై తుమ్మెదలు వాలవు. కారణం మకరందం వాటిలో ఉండదు. కానీ ఇక్కడ కవి వాలాయి అని చెప్పాడు. వ్యతిరేకంగా సంపెంగపై భ్రమరాలు వాలిన ఉపయోగం లేదని చెప్పకనే చెప్తూ జగన్మోహినిపై అసుర మనస్సులు వాలాయని భావం. కానీ ఆమె ఎవ్వరికి అందదని చెప్పటం ఇక్కడ సందర్భం.

**చ॥ లలిత జటా కిరీట సదలంకృతమైన శశాంక రేఖ కో**
**మలరుచి దంతదీధితి సమాజముతోఁ బొదలంగఁ జేయుచున్**
**బలికె లలాటలోచనుఁడు ప్రస్ఫుట భంగి మునివ్రజంబుతోఁ**
**దొలకరి మేఘ ఘోషములతోఁ బురుణించు సమంచిత ధ్వనిన్**

**(హర.చతు.ఆశ్వా.47 పద్యం)**

అందమైన జడలతో భాసించే శిరోభాగంలోని చంద్రరేఖ కాంతితో, తన దంత కాంతి సరిపోలుతుండగా శివుడు తొలకరి మేఘములు చేయు ధ్వనిని పోలిన కంఠ ధ్వనితో ముని సమూహంతో పలికాడు. చంద్రుని కాంతితో సరిపోలు దంతకాంతి, శివుని కంఠధ్వనితో, మేఘధ్వని పోలిక చెప్పడం ఉపమాలంకారం.

**తే॥ గగనమున నుండి డిగ్గి సత్కార యుక్తి**
**వెలిఁగె హిమపర్వతాంతర స్థలమునందు**
**నిర్మలంబైన నిధిలోని నీడఁదోఁచు**
**నిందు బింబములను బోలి ఋషి గణంబు**

**(హర.చతు.ఆశ్వా.53 పద్యం)**

ఆకాశం నుండి, హిమపర్వత సమీప ప్రాంతంలో దిగి, వాళ్ళకు నియమింపబడ్డ పనిలో అత్యంత శ్రద్ధాళువులై స్వచ్ఛమైన సముద్రంలో ప్రతిబింబించే చంద్రబింబాల లాగా మునిగణం ప్రకాశించింది. చంద్రబింబంతో సామ్యం చెప్పటం, ప్రకాశించటం సమాన ధర్మం ఉపమా సౌందర్యం.

తే॥ కలిత గోరోచనా పత్రకములతోడఁ
గరము విలసిల్లె నీహార గిరితనూజ
చక్రవాక పదాంకిత సైకతములఁ
గరము విలసిల్లు నాకాశగంగవోలె

(హర.చతు.ఆశ్వా.84 పద్యం)

గోరోచన ద్రవ్యంతో చెక్కిళ్ళపై మకర పత్రాలను రచింపబడ్డ పార్వతి చక్రవాకాల అడుగుల ముద్రలతో మిక్కిలి అందగిస్తూ ఇసుక తిన్నెలతో కూడిన ఆకాశగంగలాగా ఉందని భావం. ఇక్కడ ఉపమేయం పార్వతి, ఉపమానం ఆకాశగంగ రెండిటికి సౌందర్యాన్ని ఆపాదించి చెప్పటం ఉపమ వైచిత్ర్యం.

క॥ వడిఁబాము వ్రేలఁగట్టిన
వడువున నలుగడల ముసరివార్వాహంబు
ల్జడివడి కురియఁదొడంగెను
వెడవెలుపును లేక పాండవేయుని మీఁదన్

(హర.సప్త.ఆశ్వా.168 పద్యం)

అర్జుననిపై వేగంగా జడివాన కురిసిందనే దాన్ని కవి పోలుస్తూ వేగంగా పాములు వేలాడగట్టిన విధంగా నాలుగు దిక్కుల మేఘాలు కమ్మి అర్జుననిపై ఎడతెరపి లేని వర్షం కురిసిందని అంటాడు. కవి కవిత్వాన్ని దృశ్యమానం చేస్తూ పాములతో సామ్యాన్ని చెప్పటం ఉపమాలంకారం. చెప్పే విధానాన్ని గమనిస్తే అందులోని వైచిత్ర్యం అవగతం అవుతుంది. సాధారణంగా చెప్పకుండా కొంత వర్ణనతో సామ్యంతో చెప్పటం దీనినే కవితారీతి అంటారు. ఇదే కుంతకుడు అలంకారగత వాక్యవైచిత్రి అన్నాడు.

చ॥ విరుల సుధాంశు కాంత మణివేదికపై నవహంసతూలత
ల్పమున సుఖప్రసుప్తి పరిపాకము నొంది విశాల నేత్ర ప
ద్మములు మొగిడ్చి శేషఫణిపైఁ బవళించిన యంబుజాక్షుభా
వమునఁ గరంబుఁ బొల్పమరువానిఁ గనుంగొ నె నింతిపార్థునిన్

(హర.సప్త.ఆశ్వా.120 పద్యం)

నిర్మలమై చంద్రకాంత శిలపైన అమర్చిన హంసతూలికా తల్పంపై, తన విశాలమైన కళ్ళను మూసుకొని శేషతల్పం మీద పవళించే విష్ణువుగా అందంగా అర్జునుడు నిద్రించగా ఊర్వశి

చూసిందని భావం. ఇక్కడ అర్జునిని సౌందర్యాన్ని, విష్ణువుతో సామ్యం చెప్పటం సమాన ధర్మం నిద్ర. విష్ణువు, సౌందర్యానికి ధీటైనా వాడని, చెప్పుతూ అర్జునుని సౌందర్యాన్ని పొగడటం ఇక్కడి విశేషం.

## 5.9.10. శ్లేష

'నానార్థ సంశ్రయం శ్లేష' అని అందరికి తెలిసినదే. శ్లేషాలంకార నిర్వచన కారికను కుంతకుడు నిర్వచించినప్పటికీ అది ప్రస్తుతం లేదు. కేవలం ఉదాహరణ భాగాలను బట్టి "ఉద్భటుననుసరించి శ్లేషను అర్థ శ్లేష, శబ్ద శ్లేష, శబ్దార్థోభయ శ్లేషయని మూడు విధములుగ విభజించినట్లు కనబడుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.వ.జీ.పుట.374) అని వ్యాఖ్యాత వక్రోక్తి జీవితంలో తెలిపాడు.

అర్థశ్లేష ఉదాహరణ శ్లోకాన్ని చూద్దాం.

**"స్వాభిప్రాయ సమర్పణ ప్రవణయా మాధుర్యముద్రాఙ్కయా**
**విచ్ఛిత్త్యా హృదయేఽభిజాతమనసామన్తః కిమప్యుల్లిఖత్**
**ఆరూఢం రసవాసనాపణతేః కాష్ఠాకవీనాం పరాం**
**కాన్తానాం చ విలోకితం విజయతే వైదగ్ధ్యవక్రం వచః"**

**(వ.జీ.పుట.375)**

"స్వాభిప్రాయమును తెలుపుటయందు ఆసక్తియైనదియు మాధుర్య ముద్రాంకితమును అగు విచ్ఛిత్తిచే అభిజాతులు మానసములందు ఏమేమియో వ్రాయుచున్నదియు, రసానుభూతి పరిణతి యొక్క పరాకాష్ఠను పొందినదియు అగు, వైదగ్ధ్యముచే వక్రమగు కవుల వాక్కును, కాంతల విలోకనమును సర్వోత్కర్షముగ నున్నవి.

(ఇచట స్వాభిప్రాయ ఇత్యాది శబ్దములకు కవివచః కాంతాకటాక్షముల పక్షమున అర్థము ఒకటియే యైనను తాత్పర్యమున భేదమున్నది గాన అర్థశ్లేషకుదాహరణము)" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.వ.జీ.2007.పుట.375). కుంతకుడు శబ్ద, అర్థ, శబ్దార్థ శ్లేషలను చెప్పినట్లు తెలుస్తుంది. శ్లేషను రకరకాలుగా చెప్పిన ఆలంకారికులున్నారు. మమ్మటుడు కావ్య ప్రకాశంలో తొమ్మిది రకాలుగా శ్లేషను విభజించాడు. ప్రధానంగా రెండు రకాలు – సభంగ శ్లేష, అభంగ శ్లేష. సభంగ శ్లేషలో వర్ణ, పద, లింగ, భాషా, ప్రకృతి, ప్రత్యయ, విభక్తి వచనాల భేదాన్ని బట్టి ఎనిమిది విధాలు. మొత్తం అభంగ శ్లేషతో కలిపి 9 రకాలు చెప్పాడు. శ్రీరామచంద్రుని వాఖ్యాన గ్రంథంలో కుంతకుని

శ్లేష శబ్ద, అర్థ, ఉభయాత్మకంగా ఆచరణీయమని తెల్పారు కనుక ఈ మూడింటి దృష్టితో చూడవలసి ఉన్నది.

### 5.9.10.1. శ్లేష – సమన్వయం

**తే॥ విమల పాథోధిఁబుట్టిన యమృతమూర్తి**
**భీమనాథుఁడు మా స్వామి కేమి చోద్య**
**మహరహంబును బాదసేవానురక్త**
**భక్తజనలోక భవరోగ భంజనంబు**

**(భీమే.తృతీ.ఆశ్వా.81 పద్యం)**

భీమేశ్వరస్వామి నిర్మలమైన సముద్రం నుండి పుట్టిన అమృతమయుడు నిరంతరం అతని పాదసేవతో అందు అనురక్తులయ్యే జనుల సంసార తాపం అనే రోగాన్ని పోగొట్టడానికి ఆ స్వామికి అచ్చెరువు అవుతుందా? అనేది సందర్భానుసారమైన భావం. ఇక్కడ అమృత పదానికి నానార్థాలు చూస్తే ధన్వంతరి, ఔషధం, పాదరసం అనే అర్థాలున్నాయి. సేవ చేయుటలో ఔషధ సేవనం, పాదసేవ అనే అర్థాలూ ఉన్నాయి. భవం అంటే పుట్టుక, సంసారం, శ్రేష్ఠం అనే అర్థాలు ఉన్నాయి. ధన్వంతరి ఇచ్చిన ఔషధసేవనం వలన ఎంత గొప్ప రోగమైనా పోతుందనే భావాన్ని తీసుకోవచ్చు. సందర్భానుసారంగా గ్రహించాలంటే ఉత్తమమైన ఔషధాన్ని కొంచె సేవించిన ఎంత గొప్ప రోగమైన నశించినట్లు అమృతమూర్తి అయిన భీమేశ్వరుని పాదసేవ చేసేవారికి భవము (పుట్టుక) నాశనం అవుతుంది. అంటే మోక్ష పథగామి కావచ్చు అనే విషయాన్ని గ్రహించవచ్చు. ఇక్కడ పదశ్లేషతో చమత్కారం కలగడం శ్లేషాలంకార వైచిత్ర్యం. పదాన్ని విరవకుండా చేసిన శ్లేష అభంగ శ్లేష. కుంతకుడు చెప్పిన రకాల్లో అర్థపరమైన శ్లేషకు ఉదాహరణ ఈ పద్యం.

**చ॥ అమృత పయోనిధానమున యందుదయించెఁగళాసమృద్ధిఁద**
**నృమర సుధాకరుండు, నిజమారఁగఁ జూచిన దక్షవాటికా**
**రమణుఁడు భీమ నాయకుఁడు రాజశిశాభరణుండు గానినాఁ**
**డమరమునీంద్ర సంఘము కరాంబుజముల్ మొగుడంగ నేర్చునే?**

**(భీమే.తృతీ.ఆశ్వా.80 పద్యం)**

అమృత కిరణాలను చల్లే చంద్రుడు అమృతమయమైన సముద్రంలో షోడశకళాపూర్ణుడై చల్లదనం కలిగి జన్మించాడు. నిజంగా పరిశీలిస్తే దాక్షారామంలోని భీమేశ్వరుని శిరస్సులో అలంకారంగా ఉన్నాడు. శివుడు ఆభరణంగా ధరించని రోజు దేవతల సమూహాలు వచ్చి వారి

‘కరాంబుజాలతో’ నమస్కరిస్తారా? అంటే వారి ‘హస్తపద్మాలు మొగుడంగ నేర్చునే? అంటాడు కవి. ‘హస్తపద్మాలు’ అనే పదంలో ‘మొగుడంగనే’ పదంలో శ్లేష ఉంది. మొగుడటం అంటే ముకుళించడం. రాత్రి చంద్రుని సమయంలో పద్మాలు ముకుళిస్తాయి. కలువలు విచ్చుకుంటాయి. సూర్యోదయ సమయంలో పద్మాలు విచ్చుకుంటాయి. కలువలు ముడుచుకుంటాయి. మరి శివుడు చంద్రవంకను ధరించకపోతే అక్కడికి వచ్చిన మునుల ‘హస్తపద్మాలు’ ముడుకుకుంటాయో? లేవో? అని అనటం ఇక్కడ శ్లేష మొగడటం అంటే చేతులు జోడించి నమస్కరించడం అని అర్థం. చమత్కారమైన ప్రయోగాన్ని హస్తాలకు కమలాలకు చేసాడు కవి. ఇది శ్లేషకు ఉదాహరణ.

**సీ॥ అండజాధీశ, నీయాకారరేఖతో**
**దులఁదూఁగ లేవు వస్తువులు జగతి**
**నీడోద్భవశ్రేష్ఠ నీదుసౌశీల్యంబు**
**పలుకుల కందంగఁ గొలఁది గాదు**
**పతగపుంగవ నీ సుభాషితంబులయట్ల**
**యవయవంబుల సువర్ణాత్మకములు**
**పక్షివంశవతంస పక్షపాతము నీకు**
**గతియందకాదు సద్వితతియందు**

**తే॥ నధికతాపపరీతాత్ముఁడైన నాకు**
**నెట్లు వచ్చితి చలిగాడ్పునట్లు నీవు**
**పూర్వజన్మ మహాతపః స్ఫురణఁజేసి**
**నీదు సన్నిధి సమకూరె నిధియుఁబోలె**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.28 పద్యం)**

హంసకు సంబంధించిన పద్యం ఇది. సువర్ణాత్మకములు, పక్షపాతం అనే పదాల్లో శ్లేష ఉంది. హంసతో రాజు అంటున్నాడు ఇలా ఓ పక్షిరాజా నీ ఆకారరేఖతో జగతిలో ఎవరూ తలుతూగలేరు ఎందుకంటే హంస బంగారుది కాబట్టి.

నీవే కాదు నీ సుభాషితాలు, అవయవాలు సువర్ణత్మకాలు అంటాడు. నీ అవయవాలే బంగారువి ఎందుకంటే నీవు బంగారు పక్షివి కనుక. అలాగే నీ సుభాషితాలు మంచి అక్షరాలు బంగారు స్వరూపం కలవి ఎందుకంటే నీ దేహమే బంగారం కాబట్టి. ఇక్కడ హంస దేహపరంగా బంగారుది కాబట్టి బంగారు మాటలు అవయవపరమైన అర్థం. మాటలు మంచివని సువర్ణాత్మకం

అని ఒక అర్థం. మంచి మాటలు సువర్ణాత్మకంగా ఉంటాయి కానీ హంస దేహం కూడా సువర్మాత్మకమే కదా ఇక్కడ శ్లేష ఉంది. 'పక్షివతంస' పక్షపాతం నీకు ఎందుకంటే నామీద కాక సాధువుల మీద స్నేహాన్ని చూపెడుతున్నావు. అలాగే పక్షివి కనుక పక్షాలతో ఎగరటం ఉంది అనటం కూడా శ్లేషగా భావించాలి.

**తే॥ అప్పుడనలావరుద్ధత నారఁగూరి**
**బాణ పురమును బోని యాభైమిమనముఁ**
**బుష్పబాణాసనుఁడు భోగభోజియైన**
**వరవయో విశేషంబు వార్వముగఁ దఱిసె**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.72 పద్యం)**

ఈ పద్యంలో బాణసనుడు అంటే బాణాసురుడు, మన్మథుడు అనే అర్థాన్ని వయః విశేషం అంటే వయస్సు, పక్షి విశేషం అని, అవరుద్ధత అంటే, అగ్నితో చుట్టబడిన లేదా ఆ సమయంలో ఆక్రమించబడిన అనే అర్థాలను గ్రహించాల్సి ఉంటుంది. నిజానికి ఈ పద్యం నలదమయంతుల దృష్ట్యా రాసినప్పటికి బాణాసురుని రాజధాని అయిన శోణితపురానికి అగ్ని ప్రాకారం ఉంటే మన్మథ రూపమైన ప్రద్యుమ్నుని సహాయంతో అనిరుద్ధుడు బాణ తనయ అయిన ఉష కొరకు గరుఢారూఢులై ఆ ప్రాంతాన్ని ప్రవేశించారనే విషయం కూడా తెలుస్తుంది. ఈ సందర్భానికి అనుగుణంగా అన్వయిస్తే నిప్పు ప్రాకారంతో చుట్టబడిన ప్రాంతాన్ని గరుత్మంతుని చేత మదనుడు ఎలా చొచ్చెనో ఇప్పుడు నలరాజాక్రాంతమయిన దమయంతీ హృదయాన్ని భోగాలను భవించే యౌవనము చేత దమయంతి నలునిపై మదనానురాగం వహించిందని భావం. శ్లేష చమత్కారం ఈ పద్యంలో ఉంది. దీనిని వాక్య సంబంధమైన ఉక్తి వైచిత్ర్యంలో భాగం చేసాడు కుంతకుడు.

**తే॥ చలదింద్రనీల గోళా**
**మల కోమల తారతార మండలములు ప**
**క్ష్మలములు ప్రాంశు శ్వేతం**
**బులు చపలము లౌర మెఱుఁగుఁ బోఁడి నయనముల్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.164 పద్యం)**

నేత్రాలను గూర్చి చెప్పుతూ ఒకటి మీన పరమైన అర్థం. ఇంకొకటి స్త్రీ నేత్రపరమైన అర్థాన్ని ఒకే పద్యంలో రాసాడు శ్రీనాథుడు. ఇందులో శ్లేషచమత్కారం మనోహరంగా ఉంది. 'చలదింద్రనీల గోళామల' అంటే ఇంద్రనీలమణులలాంటి చంచలమైన నల్లగ్రుడ్డు గలవి అని అర్థం ఇది. స్త్రీ

పరమైంది. అటుఇటు కదిలే చంచల నేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందేది అని గ్రహించాల్సి ఉంటుంది. అదే పదాలు చంచలం అయిన అమల మనోజ్ఞమైన కనీనికలు, దట్టమైన తెల్లటి రెక్కలు కల మీనాలు అనే అర్థం స్ఫురిస్తుంది. అటు ఇటు కదిలే కంటి పాప, రెప్పలు స్త్రీ నుద్దేశించి చెప్పటం, ఇక్కడి చమత్కారం. రెండింటికి ఒకే స్వభావాన్ని చెప్పే పదాలని ఏక కాలంలో వాడటం కవి నిశితమైన ప్రతిభకు తార్కాణం. ఇది శ్లేషకు ఉదాహరణ.

**తే॥ అతనిఁ గోరుదునే నంతరంగసీమ**
**నంత చింతామణికిఁ జింత యాచరింపఁ**
**బద్మముఖుఁడైనయతఁడు నాపాలి కనఘ**
**పెన్నిధానంబు, మాటలు పెక్కులేల?**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.75 పద్యం)**

దమయంతి హంసతో సంభాషించే సందర్భంలోనిది ఈ పద్యం. నేను హృదయసీమలో అతన్ని కోరుకున్నాను కానీ చింతామణి మీద కూడా అతని మీద ఉన్నంత కోరిక లేదు అంటుంది. 'చింత' మణిదృష్ట్యా, ఆలోచన దృష్ట్యా వాడబడింది. 'పద్మముఖుడైన అతడు పెన్నిధానం' అంటుంది దమయంతి. 'పద్మ' పదం నవ నిధుల్లో ఒకటి. పద్మము చింతామణులు ముఖ్యంగా కలవాడు. అతడు నాకు పెద్ద నిధి అని అర్థం. అతని ముఖమై పద్మ నిధులు కలదని భావం. పద్మమణులు కలవాడని ఒక రకమైన అర్థం, అతని ముఖమే పద్మమణులతో సమానం అని, పద్మం పువ్వు అనే సౌందర్యవంతమైన పోలిక కూడా అనుకోవచ్చు ఇలా నానార్థాలతో వైచిత్ర్యం ఏర్పడింది. కమలం లాంటి ముఖం గల అతని ముఖమే నాకు పద్మ నిధి, పద్మాది నిధులన్ని కూడా నాకు అతడే అనే రెండు భావాలను చమత్కారంగా చెప్పాదు కవి.

### 5.9.11. వ్యతిరేకం

**కా॥ సతి తచ్ఛబ్ద వాచ్యత్వేధర్మసామ్యేఽన్యథాస్థితేః**
**వ్యతిరేచన మన్యస్మాత్ ప్రస్తుతోత్కర్ష సిద్ధయే**
**శాబ్దః ప్రతీయమానో వా వ్యతిరేకోఽభి ధీయతే**

**(వ.జీ.తృ.ఉన్మే.కా.33)**

ధర్మసామ్యము ఉన్నప్పటికి రెండింటిలో తుల్యంగా ఉన్న ధర్మం కంటె భిన్నమైన ధర్మాన్ని పురస్కరించుకొని ప్రస్తుతమైన పదార్థానికి ఉత్కర్షను పెంచడానికి మరొక దానికంటె (అప్రస్తుతం కంటె) భిన్నంగా ఉన్నదని చెప్పటం వ్యతిరేక అలంకారం. ఒకదానిని ప్రస్తుతంగ పరిగణించి

రెండవదాని నుండి వేరు చేయటం. అది ఉపమేయము నుండి ఉపమానము లేదా ఉపమానము నుండి ఉపమేయము కావచ్చు అదే వ్యతిరేకాలంకారం. ఉపమేయాన్ని సాధారణంగా ఆధిక్యం ఉన్న ఉపమానంతో పోలుస్తారు. కానీ ఉపమేయమే అధికంగా చెప్పినట్లయితే అది వ్యతిరేకం అని ఇతరులు చెప్పారు. కుంతకుడు కూడా అలాగే చెప్పుతూ రెండింటిలో ఏదో ఒకదాన్ని ప్రస్తుతంగా భావించి వేరుచేయడం అన్నాడు. ఉదాహరణ శ్లోకంలో ఉపమేయానికే ప్రాధాన్యాన్నిచ్చాడు చూద్దాం.

**"ప్రాప్తశ్రీ రేష కస్మత్ పునరపిమయితంమంథఖేదం విదధ్యాత్**
**నిద్రామప్యస్య పూర్వామనలసమనసో నైవ సంభావయామి**
**సేతుం బధ్నాతి భూయః కిమితి చ సకల ద్వీపనాథానుయాత**
**స్త్వయ్యాయాతే వితర్కానితి దధత్ ఇవాభాతి కంపః పయోధేః**

**(వ.జీ.పుట.379)**

"(ఇదివరకే) పొందబడిన లక్ష్మిగల ఈతడు నాకు మరల ఆ మథన క్లేశమును ఏల కలుగచేయును? మాంద్యరహితమగు మనస్సుగల ఈతనికి వెనుకటి వలె నిద్రయున్నదని గూడ భావించను. (అందుచే ఈతడు నాపై నిద్రించుటకై వచ్చిన మహావిష్ణువనుకొనుటకు వీలు లేదు) సకల ద్వీపాధి రాజులచే అనుసరింపబడిన ఈతడు మరల సేతువును ఏలకట్టునో? ఈ విధముగ నీవు దరిజేరగనే, ఊహలలో పడినవాడు వలె నున్న సముద్రుని కంపము ప్రకాశించుచున్నది" (శ్రీరామచంద్రుడు, పుల్లె.2007.పుట.379) అని వివరణ.

ఇక్కడ విష్ణువు కంటె రాజుకు ఆధిక్యం సూచితం. విష్ణువుకు సముద్రం మథించిన తర్వాతే లక్ష్మి లభించింది. ఈతనికి ముందే లభించింది. కాబట్టి వ్యతిరేకాలంకారం. దీనినే ప్రతీయమాన రూపకం చెప్పినవాళ్ళు కూడా ఉన్నారని తెలిపాడు.

### 5.9.11.1. వ్యతిరేకం – సమన్వయం

**చ॥ మడవక ముష్టి యోగ్యమగుమధ్యముతో నెలవంకయైన య**
**ప్పడఁతుక భ్రూలతా ధనువు పట్టి మనోభవుఁడింతనుండియున్**
**విడుచున కాని మానఁడిది నిక్కము, షట్పదకీట జుష్టమై**
**యుడుగక కమ్మధూళినుసియొల్కుచు నున్న పురాణచాపమున్**

**(శృ.నై.పంచ.ఆశ్వా.12 పద్యం)**

మన్మథుడు ఇకనుండి వంపకుండనే ధనుస్సును ఎక్కుపెడుతాడు ఎందుకంటే సహజ సిద్ధంగా వంపనక్కరలేని, పిడికిటికి తగిన నడిమి భాగం గల నెలవంకలా వంపుగల తరుణిబొమతీవ అనే వింటిని పట్టి సంధిస్తాడు. కానీ పురాతనమైన పుప్పొడి సువాసన చూర్ణం గల వింటిని విడిచి వేస్తాడా? విడువడని భావం.

ఇక్కడ మన్మథుని విల్లుతో స్త్రీ కనుబొమను పోల్చాలి. ఉపమేయం ఇంతి భ్రూలత. ఉపమానం మదనుని ధనువు. ఉపమానం కంటే ఉపమేయమే గొప్పదని తెల్పుతూ ఆధిక్యం చెప్పడు వ్యతిరేకాలంకారం.

**శా॥ గ్రీవాలంకృతి పట్టసూత్రలతికా శ్రీకార రేఖాంకితన్**
**దేవీయవ్రణ వంశ సంభవ గుణాన్వీతన్ నినుంగాయజుం**
**డావిర్భూత రతింధనుర్లతికగా నంగీకరించున్ బలే!**
**పూవింటన్ నిషధాధినాథు గెలువం బూనంగ రాకుండుటన్**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.96 పద్యం)**

మదనుడు పూవింటితో నలున్ని గెలువలేకపోయాడు. కానీ దమయంతీ గుణలావణ్యాది గుణాలతో కూడుకున్న అల్లెతాడును కట్టి, అనురాగమనే ధనుస్సును సంధిస్తే దానిని స్వీకరించాడు నలుడు. నలవశీకరణ మదనుని చేత కాలేదు. కానీ, దమయంతీ వలన అయ్యిందని భావం. ఇక్కడ పూవింటితో జయం లేదు కానీ, మేని వింటితో జయం కలగటం. ఉపమానం కంటే ఉపమేయానికి ఆధిక్యం చెప్పబడింది.

**ఉ॥ హాలహలద్వయంబు గలశాంబుధిఁ బుట్టె వినీల పాండుర**
**జ్వాలలతోడ, నందొక విషంబొక వేలుపమ్రింగె; నెందఱో**
**వేలుపులోలిమై ననుభవించిన రెండవ యీవిషంబుని**
**ర్మూలము గాక యున్నయది! ముద్దియ, పాంథులపాపమెట్టిదో**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.121 పద్యం)**

పాలసముద్రంలో రెండు పుట్టాయి. ఒకటి నలుపుది కాలకూట విషం. రెండవది చంద్రుడనే కాలకూటం తెల్లనిది. అది నలుపు జ్వాలలతో, ఇది తెలుపు జ్వాలలతో ఉంది. విషాన్ని శివుడొకడే మింగాడు. వెన్నెల జ్వాలలను దేవతలు 'కళల' రూపంలో తాగిన పదిహేను (15) రోజుల తర్వాత మళ్ళీ ఉద్భవిస్తుంది. అమావాస్య నాటికి ఏమీ లేకుండా అయిపోయినప్పటికి, మళ్ళీ మళ్ళీ శుక్లపక్షం నాటికి రావడం విరహులు చేసిన పాపఫలమే అని భావం.

ఇక్కడ కాలకూట విషం ఉపమానం, తెల్లని కూటం వెన్నెల ఉపమేయం. కాలకూటానికి అంతం ఉంది. కానీ దీనికి నాశనం భోక్తమైనప్పటికి లేదని చెప్పటమే ఆధిక్యం. కనుక వ్యతిరేకాలంకారం చేత కలిగిన వైచిత్ర్యం.

**తే॥ ఇతని తాతభగీరథుండతుల మహిమ**
**నవనిఁ బ్రవహింపఁగాఁ జేసె నభ్రగంగ**
**నితఁడు త్రైలోక్యమునఁ బ్రవహింపఁజేసెఁ**
**గీరభాషిణి! వరధర్మ కీర్తిగంగ**

**(శృ.నై.పంచ.ఆశ్వా.109 పద్యం)**

సరస్వతి దమయంతిలో నలుని గూర్చి చెప్పుతూ సాటి ప్రభావంచేత భూమ్మీద, ఆకాశంలోని గంగను ఇతని ప్రవహింపజేసాడు. అతడే భగీరథుడు. కానీ నలుడు మూడు లోకాల్లో కీర్తి అనే గంగను ప్రవహించేలా చేస్తున్నాడు. తాత ఒక్కటే గంగనే పారిస్తే మూడు లోకాల్లో గంగను పారించే ఇతడు ఉత్తముడు. తాతను మించిన ఉపమేయాధిక్యం చెప్పడంతో వ్యతిరేకాలంకారం.

### 5.9.12. సహోక్తి

కుంతకుడు సమాసోక్తి భామహుడు చెప్పిన లక్షణాల దృష్ట్యా ఉపమాంతర్గతమే అని చెప్పి కావ్యాలంకారంలోని ఉదాహరణలను ఇచ్చాడు.

**"తుల్యకాలేక్రియే యత్ర వస్తుద్వయ సమాశ్రయే**
**పదేనైకేన కథ్యతేసహోక్తిః సామతాః యథా**
**హిమపాతావిలదిశో గాఢాలింగన హేతవః**
**వృద్ధిమాయాన్తి యామిన్యః కామినాం ప్రీతిభిః సహ"**

**(కావ్యాలంకార.111.39–40)**

"ఎచట రెండు వస్తువులను ఆశ్రయించి యున్నవియు, సమానకాలమున జరిగినవియు అగు రెండు క్రియలు ఒక పదముచే చెప్పబడునో అది సహోక్తియని చెప్పబడును. ఎట్లనగా" – "హిమపాతముచే వ్యాకులమైన దిక్కుల కలిగనవియు, గాఢాలింగన ములకు హేతు భూతములును అగు రాత్రులు కాముకలు ప్రేమలతో గూడ వృద్ధి పొందుచున్నవి" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.వ.జీ.పుట.384) అనే తాత్పర్యాన్ని శ్రీరాంచంద్రుడు వివరించారు.

ఇది భామహుని ప్రకారం సహోక్తి అని తెలిపి తను చెప్పే లక్షణాన్ని సహోక్తిగా వివరిస్తున్నాడు.

**కా॥ యత్రైకేనైవ వాక్యేన వర్ణనీయార్థ సిద్ధయే**
**ఉక్తిర్యుగపదర్థానాం సాసహోక్తిః సతాంమతా**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.35)**

ప్రధానంగా వర్ణించాల్సిన అర్థ సిద్ధి కోసం ఉపయోగించి ఒకే వాక్యంతో ఒకేసారి అనే అర్థాలు (విషయాలు) చెప్పబడుతాయో అది సహోక్తి అని నిర్వచించాడు. దీనికి ఉదహరణగా ఉత్తర రామచరిత శ్లోకాన్నిచ్చాడు.

**"హే హస్త దక్షిణ మృతస్య శిశోర్ద్విజస్య**
**జీవాతవే విసృజ శూద్రమునౌకృపాణమ్**
**రామస్య పాణిరసి నిర్భర గర్భ ఖిన్న**
**దేవీ ప్రవాసన పటోః కరుణా కుతస్తే"**

**(వ.జీ.పుట.    )**

ఓ దక్షిణ హస్తమా మృతుడైన బ్రాహ్మణ కుమారుని జీవనము కోసమై శూద్రమునిపై ఖడ్గము విసురు. నిండు గర్భంతో అలసట చెందిన భార్యను ప్రవాసం పంపగల్గిన రాముని హస్తము కదా నువ్వు! నీకు కరుణ ఎట్లుంటుంది? అని అర్థం. ఇక్కడ శూద్రమునిపై శస్త్ర ప్రయోగం కచ్చితంగా జరుగుతుందని సూచించడానికి ఒకే వాక్యంలో సీతా ప్రవాస వృత్తాంతం కూడా చెప్పబడింది కనుక సహోక్తి.

### 5.9.12.1. సహోక్తి – సమన్వయం

**తే॥ ఎవ్వడుపదేశ మొనరించె నింద్రుగూర్చి**
**తపము సేయుము నీవంచు దయదలిర్ప**
**నాతఁడెఱుఁగఁడుగాక యాయద్రిభేది**
**గౌతముని యింటఁజేసిన కామగోష్ఠి**

**(హర.సప్త.ఆశ్వా.21 పద్యం)**

అర్జునునితో మాయావేషంలో వచ్చిన ఇంద్రుడు మాట్లాడుతున్న సందర్భంలోనిది ఈ పద్యం. ఇందులో నిన్ను ఇంద్రుని గూర్చి తపస్సు చేయమని చెప్పినవాడికి గౌతమముని ఇంట్లో చేసిన మన్మథ చేష్టల గూర్చి తెలియదు కాబోలు అని అంటాడు. ఇక్కడ ఇంద్రుని గూర్చి తపస్సు చేయటం అనే విషయాన్ని చెప్పుతూ, ఇంకొక విషయమైన ఇంద్రుడు గౌతమముని ఇంట్లో చేసిన కామగోష్ఠి గూర్చి ఒకే వాక్యంలో చెప్పడం జరిగింది. ఏక వాక్యంలో రెండు విషయాలు వెల్లడి

అయ్యాయి. ఒకే విషయంతోపాటు మరో విషయాన్ని చెప్పడం చేత సహోక్తిగా చెప్పవచ్చు. కుంతకుడు సహోక్తికి ఇచ్చిన నూతన లక్షణానికి సరైన లక్ష్యంగా శ్రీనాథుని ఈ పద్యాన్ని భావించవచ్చు.

**ఉ॥ భాగ్యముగాదె యత్రమమ పన్నగ కంకణంచేఁదపఃక్రియా**
**యోగ్యతఁ జేసి విశ్వభువనోపకృతి ప్రతిపాదనైక సౌ**
**భాగ్య ధురంధరంబయిన పాశుపతాస్త్రము గాంచితింక వై**
**రాగ్యము పుట్టుఁగాక కురురాజు పయిన్నిజ రాజ్యలక్ష్మికిన్**

**(హర.సప్త.ఆశ్వా.106 పద్యం)**

ఇంద్రుడు అర్జునున్ని పాశుపతాస్త్రాన్ని సంపాదించినందుకు పొగుడుతూ ఇలా అంటాడు. ఎంత అదృష్టమో దివ్య పాశుపతాస్త్రాన్ని పొందితివి. ఈ క్షణముననే కౌరవ రాజ్యలక్ష్మికి కురురాజుపై విరక్తి పుడుతుంది.

ఈ వాక్యంలో పాశుపతాస్త్ర సాధనను తెలుపుతూ సర్వలోక శుభానికి ఏకైక సాధనం అయిన అస్త్ర విశేషాన్ని తెలుపుతూ, కౌరవులు తప్పక రాజ్యాన్ని కోల్పోతారు అనే విషయాన్ని నిశ్చయించి చెపుతుంది. రెండు విషయాలను పాశుపతాస్త్ర సంపాదన వలన సాధ్యం అని ఏకకాలంలో చెప్పటం చేత సహోక్తిగా చెప్పవచ్చు.

### 5.9.13. దృష్టాంతం

**కా॥ వస్తుసామ్యం సమాశ్రిత్య యదన్యస్య ప్రదర్శనమ్**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.36)**

వస్తుసామ్యాన్ని ఆశ్రయించి పదార్థాంతరాన్ని చెప్పటం దృష్టాంతాలంకారం. సామ్యం అంటే సాదృశ్యం అని అర్థం. దీనినే బింబ ప్రతిబింబ భావంగా చెప్పటం అన్నారు ఇతరులు కుంతకుడిచ్చిన ఉదాహరణ చూద్దాం.

**"సరసిజమను విద్ధం శైవలేనాపి రమ్యం**
**మలినమపి హిమాంశోర్లక్ష్మ లక్ష్మీం తనోతి**
**ఇయమధిక మనోజ్ఞావల్కలేనాపి తన్వీ**
**కిమివ హిమధురాణాం మండనం నాకృతీనామ్"**

**(వ.జీ.పుట.389)**

నాచు చుట్టుకొని ఉన్నా పద్మం రమ్యంగానే ఉంటుంది. చంద్రునికి మలినంగా ఉన్నా కలంకము శోభను కూర్చుతుంది. ఇందులో నాచు చుట్టుకోనడం, మలినం ఉండటం అనే సాదృశ్యాన్ని చెప్పడమైంది. పై విషయాన్ని చెప్పి అది ధ్రువీకరించడానికి రెండో విషయం ఉదాహరణగా చెప్పబడింది. రెండోది దృష్టాంతం. దృష్టాంతం అంటేనే ఉదాహరణ అని అర్థం.

### 5.9.13.1. దృష్టాంతం – సమన్వయం

**చ॥ పనివడి నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహ**
**ర్షుని కవితానుగుంభములు సోమరిపోతులు కొందఱయ్యతా**
**నని కొనియాడ నేర రదియట్టిద తేజవరాలు చెక్కుఁగీ**
**టిన వసవల్చు బాలకుఁడు డెందమునం గలఁగంగ నేర్చునే?**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.17 పద్యం)**

నారికేళ ఫలపాకం, ద్రాక్షాపాకం అని కవిత్వానికి గల పాకాలు. నారికేళ పాకం బయటకు కఠినంగా ఉండి లోప మృదువుగా ఉంటుంది. కవితారచనలను చక్కగా ఉన్నాయని పొగడటానికి అందరికి సాధ్యం కాదని తెలుపుతున్నాడు కవి. లేతప్రాయంలో ఉన్న సుందరి చెక్కిటి మీటినంత మాత్రానా శిశువు హృదయంలో కామం జనిస్తుందా? అలాగే మూర్ఖులు మెచ్చనంత మాత్రానా ప్రబంధ ప్రాశస్త్యమునకు ఏ కొరత కలుగదని, మూర్ఖులు సత్కావ్యాన్ని నిందించినంత మాత్రాన దాని గొప్పదనం పోదని భావం. ఇక్కడ శిశు హృదయంలో కామోద్రేకం కలుగక పోవటం అనే విషయాన్ని, ప్రబంధ ప్రాశస్త్యాన్ని మూర్ఖులు చెప్పలేరంటూ సామ్యాన్ని బింబ ప్రతిబింబ భావంతో చెప్పటం దృష్టాంతం.

**ఉ॥ నాగతి విన్నవించుట యనర్థము సుమ్ము ని జావరోధ సం**
**భోగ నితాంత తృప్తుఁడగు భూపతికిన్ సలిలంబు దప్పివోఁ**
**ద్రాగినవారి కింపగునె తన్నును దియ్యఁదనంబు వాసనా**
**యోగముఁ గల్గెనేనియు ఖగోత్తమ, నిర్మల వారి పూరముల్**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.81 పద్యం)**

దమయంతీ హంసతో పలుకుతూ విహంగపుంగమ నిజరాణీవాసాలు పొందటంచేత తనిసినవాడైన భూపతికి నా వృత్తాంతం విన్నవించుట తగనిది సుమా. దప్పిక కలిగినవాడికి నీరు తాగిన తర్వాత దప్పితీరి చల్లని, తియ్యని, నిర్మలమైన నీళ్ళు ఇస్తే ఇంపు అవుతాయా అంటుంది. తాను రాణుల కన్నా అధిక గుణసంపన్నవతినని 'నిజావరోధ సంభోగనితాంతతృప్తుడైన రాజుకు'

అనటంలో చెప్పకనే చెపుతున్నది. ఇక్కడ రాజు రాణీవాసముల తడిసి ఉన్నాడనే విషయాన్ని చెప్తూ దప్పిక కలిగిన వాడికి నాలాంటి నిర్మలమై ఉన్నతమైన స్త్రీ అవసరం లేదనే విషయాన్ని 'నీటిదాహం' అనే విషయంతో సామ్యం చెప్పడం దృష్టాంతం. నీటికి, దమయంతికి బింబప్రతిబింబ భావం చెప్పబడ్డది.

**తే॥ విప్రకృకతులైన యబ్బంది వేల్పులెల్ల**
**మనఁగఁ గోరిరి సేనాని మత్ప్రసూతి**
**ననఘులార! తృష్ణాతురులైనవారు**
**వారివాహంబు ఘన వృష్టిఁ గోరినట్లు**

**(హర.చతు.ఆశ్వా.49 పద్యం)**

శివుడు దేవతలతో ఇలా అంటున్నాడు. ఓ పుణ్యాత్ములారా! తమ స్వత్వాన్ని కోల్పోయిన నిర్బంధితులై దేవతలందరూ వారి కష్టాలను బాపుకోవడానికి నా కుమారున్ని సేనానిగా కోరుతున్నారు. ఇది ఎలాగంటే దాహపీడితులైనవారు మేఘాన్ని గొప్ప వర్షం కురిపించమని కోరినట్లుంది అని భావం. తక్కువ ప్రయోజనానికి ఎక్కువ పనిని ఆశించి నట్లుంది. ఇక్కడ వర్షాన్ని, మేఘాన్ని పోలిక చెప్తూ సైన్యాధ్యక్ష పదవికి సామ్యం చెప్పటం దృష్టాంతం. రెండింటికి పోలికల్లో తేడా లేకుండా చెప్పటం వైచిత్ర్యం.

**శా॥ ఆ చందంబున నంతరంగమున కత్యంతంబుఁదీవ్ర వ్యథా**
**ప్రాచుర్యంబు ఘటింపజాలఁ దతిఘోరంబైన దావానలం**
**బే చందంబున్ నంతరంగమున కిట్లీ జ్ఞాతి భూభృజ్జిగీ**
**పా చింతాంభర మావహించు నతి దుఃసాధ వ్యథా భారమున్**

**(కాశీ.ప్రథ.ఆశ్వా.110 పద్యం)**

మనస్సుకు శత్రువును జయించాలి అన్న కోరికను బట్టి ఏర్పడిన చింతాభారం ఓర్వలేని బాధను ఏవిధంగా ఆవహింపజేస్తుందో ఆ విధమైన బాధను అతి భయంకరంగా దావానలం కూడా కలిగింపజాలదని భావం. ఇక్కడ భేదాన్ని చెప్పటం. ఒక విషయానికి ఇంకొక విషయం ఉదాహరణ ఇవ్వడం ఇక్కడి దృష్టాంతం. దావానలం కూడా కలిగించలేదనటంలో అతి భయంకర వ్యథను తెలుపుతుంది.

**తే॥ విశ్వరూప, భవద్భూరి విభవ మహిమ**
**యెంత వర్ణింపఁజాలు మా యీవనంబు?**

ప్రాంత పై చీర చెఱంగున బడుగువాఁడు
హేమ శైలంబు చిదిపి ఱాలెన్నిముడుచు?

(శృ.నై.అష్ట.ఆశ్వా.148 పద్యం)

శ్రీహరిని పొగడుతూ మా బుద్ధి నీయొక్క గొప్ప ఐశ్వర్యాన్ని వర్ణించడానికి సరిపోదు. ఎలాగంటే ప్రాత చినుగులు ఉన్న చీర యొక్క చెంగులో ఒక అశక్తుడు బంగారు కొండను చిన్న చిన్న రాళ్ళలాగా చిదియగొట్టి ఎన్ని రాళ్ళు తీసుకెళ్ళగలడు? తీసుకెళ్ళలేడని భావం. అతను అశక్తుఁడు మోయలేడు. బంగారం బరువు కావటం వల్ల, గుడ్డ చివికి పోయింది కాబట్టి రవ్వంత ఎక్కువ కూడా ఇముడదు. అలాగే నిన్ను స్తుతించడం ఎవ్వరితరము కాదని చెప్పటం భావం. సామ్యాన్ని చెప్తూ హరి వైభవ స్తుతిని, బంగారు ముక్కలు మోయలేని వస్త్రాన్ని, బింబ ప్రతిబింబ భావంతో చెప్పటం విశేషం. ఈ దృష్టాంతమే ఇక్కడ వైచిత్ర్యం. హరి వైభవ వైశిష్ట్యం అవగతానికి కారణం అయ్యింది ఈ అలంకారం.

క॥ మగువా! నీ పెంచిన లత
చిగురున ముకుళంబు నుల్లసిల్లెనె చెపుమా!
పగడపుఁ గెమ్మోవిపయి
న్నగ వుదయించిన విధంబునం బ్రస్ఫుటమై

(హర.చతు.ఆశ్వా.19 పద్యం)

ఓ తరుణీ పగడాన్ని పోలిన పెదవులపై చిరునవ్వు తేటగా వెలసినట్లు నీచేత పెంచబడిన లతాగ్రాల పూమొగ్గలు వికసించాయా? అని ఈ పద్య భావం. ఇక్కడ పెదవుల చిరునవ్వుని, లతల పూలను పోల్చి సామ్యాన్ని చెప్పటం దృష్టాంతం. ఒకదానికోసం ఇంకొకటి ఉదహరించడం గోచరం.

తే॥ అక్షధూర్తులలోన నీ యనుఁగుఁ గొడుకు
దొరయు నంతటి యక్ష ధూర్తుండు లేఁడు
క్షితతలంబున యాగదీక్షితులలోనఁ
గీర్తి నీయట్టి యాగ దీక్షితుఁడు లేఁడు

(కాశీ.చతు.ఆశ్వా.101 పద్యం)

గుణనిధి కథలోని పద్యం. ఒక జూదరి యజ్ఞదత్తునితో గుణనిధి గూర్చి మాట్లాడుతూ భూమి మీదున్న జూదరులలో నీ ప్రియ పుత్రునితో సాటిరాగల జూదరి ఇంకొకడు లేదు. ప్రఖ్యాతి చెందిన

యజ్ఞ దీక్షితులలో నీయంతటి ప్రఖ్యాతిగల యజ్ఞదీక్షితుడు లేడని అంటాడు. ఇక్కడ తండ్రి కొడుకులకు బింబ ప్రతిబింబ భావం విలక్షణంగా చెప్పబడ్డది. "త్వమేవ కీర్తిమాన్ రాజన్ విధురే వహికాంతమాన్" అని ఓ రాజా నీవే కీర్తిమంతుడవు, చంద్రుడే కాంతిమంతుడు అన్న లక్ష్యానికి సమానంగా ఉంది ఈ పద్యం. ఇది కూడా ఒక వైచిత్ర్యమే.

**తే॥ ఇచ్చ లేకుండినను నగ్ని యెట్లుకాల్చుఁ**
**దన్ను నంటినవారిని దాహశక్తి**
**నిచ్చలేక గ్రుంకినను దహించినట్ల**
**తైర్థికునిఁ బొందియున్న పాతకము గంగ**

**(కాశీ.చతు.ఆశ్వా.46 పద్యం)**

గంగానది పుణ్యం గూర్చి తెల్పటం ఇక్కడి సందర్భం. తాకాలని అనుకోకుండానే తాకిన వెంటనే తనకున్న సహజమైన దాహశక్తితో అగ్ని తనని తాకిన వాళ్ళని కాల్చేస్తుంది. ఆ విధంగానే మునుగాలని సంకల్పం లేకుండా మునిగి కూడా గంగానది తైర్థికుని ఆవేశించి ఉన్న పాపాన్ని దహించి వేస్తుంది. ఇక్కడ గంగను, అగ్నిని బింబ ప్రతిబింబ భావ స్వభావంతో చెప్పటం ఇక్కడి వైచిత్ర్యం.

**చం॥ బిసరుహ పత్రలోచన! కృపీటకములందు మునింగియాడవే**
**మొసళులు మీలు కర్కటకముల్ కమఠంబులు వాని కబ్బునే?**
**యసదృశమైన తీర్థఫల మట్టివిధంబు సుమీ! తలంప మా**
**నసమగు తీర్థమాడని జనంబులకున్ బహు బాహ్యతీర్థముల్**

**(కాశీ.తృతీ.ఆశ్వా.74 పద్యం)**

అగస్త్యుడు లోపాముద్ర సంభాషణలోని పద్యం ఇది. తీర్థ స్నాన ఫల విషయ చర్చ చేస్తూ నీళ్ళల్లో ఎన్ని మొసళ్ళు, చేపలు, ఎండ్రకాయలు, తాబేళ్ళు మునిగి ఆడుతున్నాయి. వాటికి తీర్థఫలం లభించటం లేదు. ఆ విధంగానే మానసతీర్థాలలో ఆడకుండా బాహ్య తీర్థాలు ఎన్ని ఆడిన జనులకు తీర్థస్నానం లభించదని చెప్తాడు.

ఇక్కడ మొసళ్ళు, చేపలు మొదలైన జలచరాలు నిరంతరం గంగలోనే జలాధివాసం చేస్తాయి. కానీ వాటికి తీర్థ ఫలం లభించదు. అలాగే 'మానసమగు తీర్థమాడని జనంబులకున్' ఫలం లభిస్తుంది. కానీ బయట చేసే స్నానాలకు కాదని సామ్యాన్ని చెప్తూ బింబ ప్రతిబింబ భావాన్ని తెల్పటం దృష్టాంతం.

తే॥ సుదతి! యేటికి నంతర్విశుద్ధిలేని
బాహ్య సంశుద్ధి? బహుతీర్థ పరిచయమున
వేయుఁ గడవల జలముల వెలిఁగడిగినఁ
గలుగునే శుద్ధి? వారుణీ కలశమునకు?

(కాశీ.తృతీ.ఆశ్వా.75 పద్యం)

ఎన్నో తీర్థాల్లో స్నానమాచరించిన నిష్ఫలమే అంటూ అగస్త్యుడు లోపాముద్రకు తెలుపుతూ, చిత్తశుద్ధిలేని తీర్థాలు నిష్ఫలం బయట స్నానాలు ఎన్ని చేసిన మానస తీర్థం ఆడకపోతే చిత్తశుద్ధి కలుగదు అంటాడు. వెయ్యి కడవలతో కుండ బయట భాగాన్ని కడిగితే కల్లుకుండ లోపల ఉన్న తర్వాత అది పవిత్రం కాదని అంటాడు. బాహ్య స్నానానికి, కల్లు కుండలోని లోపలి భాగానికి దృష్టాంతం.

### 5.9.14. అర్థాంతర న్యాసం

సామాన్యం, విశేషం చేత విశేషం సామాన్యం చేత సమర్థించి చెప్పితే అర్థాంత న్యాసాలంకారం అదే విషయాన్ని కుంతకుడిలా నిర్వచించాడు.

కా॥ వాక్యార్థాన్తర విన్యాసో ముఖ్యతాత్పర్య సామ్యతః
జ్ఞేయః సోఽర్థాన్తరన్యాసఃయః సమర్పకతయాహితః

(వ.జీ.తృతీ.ఉన్మే.కా.37)

ప్రధాన వస్తువు తాత్పర్యముతో ఉన్న సామ్యం వల్ల తత్సమర్థకంగా ఉన్న మరొక వాక్యం యొక్క విన్యాసాన్నే అర్థాంతరన్యాసంగా చెప్పవచ్చని అర్థం.
ఉదాహరణ చూద్దాం.

"ఇయమధికమనోజ్ఞావల్కలేనాపి తన్వీ
కిమివ హి మధురాణాం మండనం నాకృతీనామ్"

(వ.జీ.పుట.389)

ఈ తన్వి వల్కలములతో కూడా అధిక మనోహరముగా ఉన్నది. సుందరమగు ఆకారములకు అలంకారం కానిదేది! మొదటి వాక్యాన్ని రెండవ వాక్యంతో సమర్థించటం చేత ఇది అర్థాంతరన్యాసం.

5.9.14.1. అర్థాంతరన్యాసం – సమన్వయం

ఉ॥ పక్షము పెంపునం గసుమబాణుని మీఁదనెవ్రాలెదేవతా
ధ్యక్షుని వేయికన్నులును దక్కినవేల్పుల నుజ్జగించి సూ
క్ష్మేక్షికఁ జూడఁ గార్యగతి యిట్టిదయౌప్రభువుల్ ప్రయోజనా
పేక్షనొకప్పుడాశ్రితుల కీరె సమంచిత గౌరవోన్నతుల్

(హర.తృతీ.ఆశ్వా.39 పద్యం)

మనస్సులో ప్రేమ అధికం అవుతుంటే, ఇంద్రుడు మిగిలిన దేవతలను విడిచి మన్మథునిపైనే తన వేయికన్నులను నిలిపాడు. సూక్ష్మంగా ఆలోచిస్తే ప్రభువులైనవాళ్ళు ఒక్కోసారి వాళ్ళ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొనమి ఆశ్రితుల మీద అధిక గౌరవాదరాలను చూపెదుతారు. ఇది సాధారణమే కదా. పనుల సాధన ఇలాగే ఉంటుందని భావం. ఇక్కడ ఇంద్రుడు వేయి కన్నులను నిల్పడం విశేషఁ. ఆశ్రితుల వద్ద సమయానుకూలంగా ప్రవర్తించడం సాధారణం. విశేషం సామాన్యం చేత సమర్థించబడింది.

తే॥ అచ్చరలు పాడుహిందోళ మాలకించి
యిందు మౌళి ప్రసంఖ్యాన మెడలఁడయ్యె
నిర్జితేంద్రియులైనట్టి నియమపరుల
నంతరాయంబంతేమి సేయంగఁ గలవు?

(హర.తృతీ.ఆశ్వా.63 పద్యం)

శివుని నిష్ఠాగరిష్ఠతను వర్ణించాడు కవి. అప్సరసలు హిందోళరాగాలాపన చేస్తున్నారు. అది ఆలకించి పరమేశ్వరుడు తపస్సును విడువలేదు. ఇంద్రియాలను జయించిన నిష్ఠాగరిష్ఠులను ఈ అడ్డంకులు ఏమి చేస్తాయని భావం. రాగాలాపనతో భంగం కావటం సాధారణం. కానీ ఆ కార్యం ఇక్కడ జరగలేదు. కారణం శివుడు జితేంద్రుడు. విశేషాన్ని సామాన్యంగా చెప్తూ మహా పురుషులు దేనికి లొంగరనే విషయాన్ని తెలియజేస్తుందీపద్యం. శ్రీనాథుడు శివుడు కఠోర తపస్సు చేశాడనే సులభతరమైన వాక్యాన్ని చెప్పకుండా అతని జితేంద్రునిగా వర్ణించటమే ఇక్కడి అలంకార వైచిత్ర్యం.

తే॥ అని నివారించె గిరిపత్నియనుఁగుఁగూఁతుఁ
బార్వతియుఁ దజల్లిమాటఁ జేపట్టదయ్యె
నీప్సితార్థంబునకుఁ బాఱు హృదయరుచియు
నిమ్నమున కోడిగిలు నీరు నిలుపరాదు

(హర.చతు.ఆశ్వా.7 పద్యం)

పార్వతి తపస్సు చేస్తానని భీష్మించుకుని కూర్చుంది. ఆ సందర్భంలో హిమవంతుని భార్య, పార్వతి జనని అయిన మేనకాదేవి పార్వతి ప్రయత్నానికి అడ్డుపడింది. పార్వతి తల్లి మాట వినటం లేదు అనే విషయాన్ని తెలుపుతూ వాంఛితం వైపు పరుగెత్తే మనోభిలాషను, పల్లానికి పారే నీటిని నిలుపలేం కదానని అంటాడు కవి. లోకంలోని సహజరీతిని, అభిలాషను సాధారణంగా చెప్పటంతో పై వాక్యాన్ని సమర్థించడమైంది. కనుక ఇది అర్థాంతరన్యాసం.

**తే॥ అంధకారి యరుంధతినాదరించె**
**గౌరవంబున భేదంబు కలుగకుండఁ**
**బెద్దవారికి స్త్రీ పుంవిభేదమేల**
**మాననీయంబు పుణ్యకర్మంబుగాక**

(హర.చతు.ఆశ్వా.43 పద్యం)

పరమేశ్వరుడు మునులను సత్కరించే సందర్భంలో సప్తర్షులతో సమానంగా ఎట్టి భేదభావంలేక అరుంధతిని కూడా సమాదరించాడు. గౌరవింపదగింది పుణ్యకార్యం తప్ప పెద్దవాళ్ళకు స్త్రీపుంస విభేదమెందుకు ఉంటుందని భావం. ఇక్కడ గౌరవించడం ప్రధానమని తెలుపడం అర్థాంతరన్యాసాలంకారం. స్త్రీ, పురుష అభేదం ద్యోతకమవుతుంది.

**తే॥ అతివ మిథ్యావలోక నాభ్యాస కలన**
**నిజముగా రాజుఁజూచియు నెమ్మనమునఁ**
**దాల్పదయ్యెను శాలీనతా భరంబు**
**తథ్యమిథ్యా వివిక్తిముగ్ధలకుఁగలదె**

(శృ.నై.చతు.ఆశ్వా.3 పద్యం)

దమయంతి తన ఎదుట ఉన్న వాస్తవ నలున్ని చూసి భ్రాంతి నలునిలాగే తలచి ఆతని మోహాన్ని చూసి బిడియాన్ని పొందడం లేదు. కామార్తలకు తథ్యమిథ్యా వివేకం ఉండదు కదా అని భావం. పై రెండు పాదాల్లోని విశేషాన్ని, ఆశ్చర్యాన్ని చివరి పాదంలోని సామాన్య వాక్యం ద్వారా సమర్థించడం చేత ఇది అర్థాంతరన్యాస వైచిత్ర్యంగా చెప్పవచ్చు.

**తే॥ జన్యజనకంబులకు భేద శంక లేదు**
**దేహమన్నజ మిందు సందేహ మెద్ది**
**మీర లమృతాశు లమృతంబు మిమ్ముఁజూడఁ**

**దృష్టి సంపద నొందె మదీక్షణములు**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.ప.59)**

నలుడు దేవతలతో మాట్లాడుతూ మీ దర్శనంతో పరమానంద భరితుడనయ్యానని చెప్పాడు. ఆ సందర్భంలో జన్యజనకాలకు భేదం లేదు. ఎలా అంటే బంగారం, జనకం, కడియం జన్యం. కడియం పేరు వేరయినా బంగారమే కదా అలాగే అమృతాశనులైన ఇంద్రాదుల దేహం జన్యం. మీ మూర్తులు అమృతమే కాబట్టి మిమ్మల్ని చూసి నా చూపులు అమృతమయాలై సుఖిస్తున్నాయా అంటూ మనోహరంగా వర్ణించాడు కవి. సామాన్యం జన్యజనకాలకు భేదం లేదని చెప్పటం, విశేషం చూపులు అమృతం కావటం సామాన్య విశేషోక్తి చేత అర్థాంతరన్యాసాలంకారంచెప్పబడ్డది.

### 5.9.15. ఆక్షేపం

**కా॥ నిషేధచ్ఛాయ యాక్షేపః కాన్తిం ప్రథయితుం పరామ్**
**ఆక్షేప ఇతి సజ్ఞేయః ప్రస్తుతస్యైవ వస్తునః**

**(వ.జీ.తృతీ.ఉన్మే.కా.38)**

ఉత్కృష్టమైన కాంతిని వృద్ధి పొందించడానికి, నిషేధం అనే విచ్ఛిత్తి చేత ప్రస్తుత వస్తువునే నిషేధించడం ఆక్షేపం. అప్రధానం చేయడానికి వీలులేని, చెప్పాల్సిన విషయాన్ని దాని గూర్చి చెప్పడం శక్యం కాదనే ఉద్దేశ్యం చేతనో, ఆ విషయం చాలా ప్రసిద్ధమైనదని, చెప్పాల్సిన పనిలేదనో నిషేధించడం ఆక్షేపమన్నారు. దీనికి కుంతకుడు ఉదాహరణగా ప్రాకృత శ్లోకాన్నిచ్చాడని శ్రీరామచంద్రుడు తెలిపాడు.

### 5.9.15.1. ఆక్షేపం – సమన్వయం

**ఉ॥ నీ చరితంబు చూడనతి నిష్ఠురమయ్యెడుః లోకపాల దు**
**ర్వాచిక సూచికాంకుర పరంపరఁ దూర్చెదు మాటి మాటికిన్**
**నా చెవులందుః నీకుఁదగునా యిటు సేయఁగఁ? దప్పునింటిః బా**
**ధాచరణంబు నైజమ గదా తలపోయుఁ గృతాంత దూతకున్**

**(శృ.నై.చతు.ఆశ్వా.81 పద్యం)**

దమయంతి నలునితో మాట్లాడుతూ దిక్పాలుర పాడు సందేశం అనే సూదులతో నా చెవులను ఎందుకు గుచ్చుతున్నావు. అయ్యో పొరబాటుగా పలికాను. ఆలోచించి చూస్తే యమదూతలకి బాధ పెట్టడం సహజమే కదా అని అంటుంది. మొదట విషయాన్ని చెప్తుంటే వద్దని చెప్పి ప్రస్తుత వస్తువును నిషేధించింది తర్వాత చెప్పమని తన మాటే తానే కాదనుకున్నది. కావున

ఆక్షేపం. తనను తానే వద్దనుకోవడం ఇక్కడ ఆక్షేపం. ఆక్షేపం మూడు రకాలుగా ఉంటుందని అలంకారశాస్త్రం చెపుతుంది. తన మాట తను ఆక్షేపించడం, నిషేధం ఆభాసం కావటం, నిషేధమే గమ్యం కావటం దీనిలో నిషేధం తన మాట అయ్యింది.

**తే॥ ఉవిద, నీమాట విననొల్లమూరకుండు**
**కాదనక వింటిమేనేమి కారణంబొ**
**రాజకీరంబు మము నిష్ఠురంబులాడుఁ**
**బ్రతిపదంబును బరుసగాఁ బలుకు వీణ**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.48 పద్యం)**

నలుడు దమయంతి మధుర వాక్కులను తెల్పుతున్నాడు. ఓ జవరాల నీవు ఎక్కువగా మాట్లాడకు. నీ మాటలు వినను. కాదని నువ్వు మాట్లాడితే నీ మధురవాణి విన్న చెవులు కీరముల పలుకులను వినటంలో కఠినంగా అనిపిస్తుంది. మాటి మాటికి వీణానాదం కూడా కటువుగా ఉంటుంది. కనుక దానికి నీ కంఠ మాధుర్యమే కారణం అని అంటాడు. ఆమెను పలుకొద్దని చెప్పటం ఆమెను ఎక్కువగా పలికించడానికే. ముందు మాటలను నిషేధించటం ఇక్కడి విచ్ఛిత్తి చేత ప్రస్తుత వస్తువును ఆక్షేపించటం. కావున ఇది ఆక్షేపాలంకారం.

**చ॥ మదగజరాజ కుంభముల మచ్చరికించు చురోజ కుంభముల్**
**గదిపి కలంత మేరయునుఁ గైకొనియున్నవియెల్లవారికిన్**
**విదితముగాఁగ; నిట్టి తఱి నీ చెలి డెందమునందు నేమియుం**
**గదలక మాకు నుండ నవకాశము లేదుగదే కళావతీ**

**(శృ.నై.అష్ట.ఆశ్వా.65 పద్యం)**

కళావతితో నలుడు మాట్లాడుతున్నాడు. నీ చెలి దమయంతి హృదయంలో నేను లేను. ఆమె హృదయం మొత్తం స్తనాక్రాంతం అయ్యింది. ఇంకెక్కడ చోటుంది. అందరికీ విదితమే కదా మీకు. ఆమె మనస్సున అవకాశం లేకపోవటం స్పష్టం అయ్యింది. అనురాగం ఇక్కడ ప్రకృత వస్తువు. ఆ అనురాగానికే చోటు లేక నిషేధం అయ్యింది. ఇంక నన్నే నామ జపం ఎలా చేస్తుంది అంటాడు నలుడు. అనురాగం ఆక్షేపం అయ్యింది కనుక ఆక్షేపాలంకారం.

### 5.9.16. విభావనం

**కా॥ వర్ణనీయస్య కేనాపి విశేషణ విభావనా**
**స్వకారణ పరిత్యాగపూర్వకం కాన్తి సిద్ధయే**

**(వ.జీ.ఉన్మే.తృతీ.కా.39)**

వర్ణనీయమైన వస్తువుకు కాంతి సిద్ధించడానికి ఏదో ఒక విశేషాన్ని, కారణాన్ని విడచినట్లు భావించటం విభావనాలంకారం. కారణం లేదని చెప్తూనే కార్యం జరిగినట్లు చెప్పటం. హేతువు నిషేధం కానీ కార్యం సఫలం కావటం అని అర్థం.

ఉదాహరణ చూద్దాం.

**"అసంభృతం మండన మంగయష్టే**
**రనా సవాఖ్యం కరణం మదస్య**
**కామస్య పుష్పవ్యతిరిక్తమస్త్రం"**

**(వ.జీ.పుట.392)**

శరీరానికి ప్రయత్నపూర్వకంగా కూర్చబడని అలంకారమైనట్టిది, మద్యమనే పేరు లేని మదసాధనమైనట్టిది, పుష్ప భిన్నమైన మన్మథ బాణమైనదగు బాల్యము కంటె పరమగు వయస్సును ఆమె పొందింది. కారణాలైన సంభృతాదులు నిరాకరింపబడ్డవి కనుక విభావనాలంకారం.

### 5.9.16.1. విభావనం – సమన్వయం

**శా॥ ఆమూలాగ్రమశోక పాదపము ప్రత్యగ్రప్రవాళావళి**
**వ్యామిశ్రంబుగఁ బూచెనప్పుడటు నీహారాద్రికుంజంబునన్**
**భామాకోమల పాదపంకరుహసంపర్కం బపేక్షింప కు**
**ద్దామంబైన వసంత జృంభణము సత్వం బొప్పదీపింపఁగన్**

**(హర.తృతీ.ఆశ్వా.56 పద్యం)**

హిమవత్పర్వత వనాల్లో అశోక వృక్షాలకు దోహదక్రియ స్త్రీపాద తాడనం. మన్మథుడు వసంత ఋతువుతో కలిసి వచ్చే సమయం అది. అప్పుడు హిమవత్పర్వత వనములో, అశోక వృక్షాలు స్త్రీల పాదతాడనం కోరకుండానే, వసంతుని విజృంభణం ప్రకాశింపగా నిలువెల్లు చిగురు తొడగి పుష్పించింది. ఇక్కడ హేతువు లేకుండా కార్యం జరిగింది. హేతువు నిషేధం అయ్యింది. కార్య సఫలత జరిగింది కనుక విభావనాలంకారం.

**తే॥ అపపయోద సముద్భవంబైన వాన**
**యనధిగత పుష్ప జాలకంబైన ఫలము**
**పుణ్యనిధులార! నాగృహంబునకు మీరు**
**తలఁపుగాని తలంపుగాఁ దారసిలుట**

(హర.చతు.ఆశ్వా.57 పద్యం)

హిమవంతుడు తన అంతఃపురానికి వచ్చిన మునులతో ఇలా అంటున్నాడు 'నా గృహానికి తాము తలవని తంపుగా తారసిల్లటం మేఘం లేకుండానే వర్షం, పూలు లేకుండా ఫలం రావటం లాంటిదంటాడు. ఇక్కడ కారణం లేకుండా కార్యం జరగటం హిమవంతుడు చెప్పకనే వారు రావటం. ఆకాశంలో మేఘం లేకుండా వర్షం రావటమనేది విభావనాలంకారానికి ఉదాహరణ. కవి పోలిక చక్కగా ఉంది.

**క॥ నీ వజ్రము సుఖముండుం**
**గావుత దివ్యాస్త్రశాలికామధ్యమునన్**
**దేవేంద్ర చెఱకు వింటం**
**బూవులు శరములుగ నేరిపుల నిర్జింతున్**

(హర.తృతీ.ఆశ్వా.47 పద్యం)

ఇంద్రునితో మన్మథుని సంభాషణ ఇది. నీ వజ్రము, దివ్యాయుధాలు ఉంచే స్థలంలోనే ఉండనివ్వు. దానితో పనిలేదు. నీ వజ్రాయుధం చేయాల్సిన పని నా చెరుకు వింటితో పూల బాణాలను సంధించి శత్రువులను ఓడిస్తాను అని అంటాడు మన్మథుడు. ఇక్కడ వజ్రాయుధంతో జరగాల్సిన పనులు అది లేకుండా చెరుకు విల్లుతో జరగటం సహేతుకం కాదు కాబట్టి విభావనాలంకారం.

## 5.9.17. ససందేహం

**కా॥ యస్మిన్నుత్ప్రేక్షితం రూపం సందేహమేతి వస్తునః**
**ఉత్ప్రేక్షన్తర సద్భావాత్ విచ్ఛిత్త్యైతత్**

(వ.జీ.తృతీ.ఉన్మే.కా.39)

ఎక్కడైతే మరొక ఉత్ప్రేక్ష ఉండటం వలన, వస్తువు యొక్క ఉత్ప్రేక్షింపబడ్డ రూపం, విచ్ఛితి కొరకు సందేహాస్పదంగా ఉన్నట్లు వర్ణింపబడితే ససందేహం. ఒకదాన్ని చూసి మరొక దానితో ఉన్న పోలికను బట్టి ఇదా అదా అనే సంశయం కలిగితే అది ససందేహం. సామ్య సంబంధం, సంభవానుమానం దీనికి కారణం అవుతుంది. ఉదాహరణ చూద్దాం.

**కిం సౌందర్యమహార్షీ సంచిత జగత్కో శేయరత్నం విధేఃట**
**కిం శృంగారసరః సరోరుహమిదం స్వాత్సౌకుమార్యావధి**
**కిం లావణ్యపయోనిధేరభివనం బింబం సుధాధీధితే**

ర్వక్తుం కాన్తతమాననం తవ మయాసామ్యం న నిశ్చీయతే

(వ.జీ.పుట.394)

అతి సుందరమైన నీ ముఖం బ్రహ్మదేవుడు పోగుచేసిన సౌందర్యం అనే అమూల్యకోశ జగత్తుకు సంబంధించిన రత్నమా? సౌకుమార్యానికి పరమావధియైనా? శృంగార సరస్సులోని పద్మమా? లావణ్య సముద్రానికి చెందిన చంద్రుని బింబమా? దేనితోనూ సమానంగా నిశ్చయించలేకపోతున్నాను అని అనుమానం వ్యక్తం చేయటం వలన ఇది ససందేహానికి ఉదాహరణ.

## 5.9.17.1. ససందేహం – సమన్వయం

**ఉ॥ అక్షరముల్ పఠించు సమయంబునఁ బాఠము సేయఁడయ్యెనో?**
**శిక్షిత వర్ణమధ్యమునఁ జెందెనొ విస్మృతి? నంచు, నర్థులు**
**త్ప్రేక్ష యొనర్తు రీక్రియ నభీష్ట ఫల ప్రతిపాదన క్రియా**
**దక్షుని నిన్నుఁ గూర్చిన యధర్మనికారమునన్నకారమున్**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.70 పద్యం)**

నలున్ని యాచకులు ఎల్ల అభీష్టాలను ఒసగేవాడని అతని పుణ్యకర్మలను నుతించే సమయంలో ఈ రకంగా ఉత్ప్రేక్షిస్తారు. ఈ రాజు ఎవరేమి వేడినా లేదు అనడు. ఈయన అక్షరాలు నేర్చుకున్నప్పుడు 'న' వర్ణము (లేదనే మాట) నేర్వలేదో, నేర్చి మరిచాడో, రెండింటిలో ఏదో ఒకటి కారణం అయి ఉండాలి అని అనుకుంటారు. ఇక్కడ నేర్వలేదో నేర్చి విస్మృతి చెందెనో అనటంలో సందేహాస్పదం ఉంది కనుక సందేహాలంకారం.

**ఉ॥ మోహము దాహమున్ మదికి మూఁడ్చును నున్నవి, పాయదెప్డు సం**
**దేహము మీనకేతనుని దివ్యశరంబులు పువ్వుమొగ్గలో?**
**యూహయొనర్పఁగాఁ బిడుగులో కులిశంబులొ? యట్ల! భారతీ**
**వాహకులావతంస, విషవల్లి సముద్భవముల్ ప్రసూనముల్**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.34 పద్యం)**

మన్మథ బాణాలు పూవులని చెప్తారు. మోహ తాపాలని కలుగజేసే ఇవి పువ్వులో? పిడుగులో? ఇంద్రుని వజ్రాయుధాలో అని అనిపిస్తుందంటాడు నలుడు హంసతో. సంశయాస్పదంగా ఉంది కనుక నిశ్చయం లేదు. ఇది సందేహాలంకారంగా చెప్పవచ్చు. ఇలా

సంశయించడంలో వైచిత్ర్య. కూడా మనోహరమైందే అందుకే వీటిని వాక్య వక్రతలో భాగం చేసాడు కుంతకుడు.

సీ॥ ద్వివిధ చంద్రమతి ప్రతీతియో? కాకతి
స్వచ్ఛపదార్థోపసర్పణంబొ?
యంగుళీ ముఖ పీడితాక్షి విక్రియ యొక్కొ
మకరాంకు శాంబరీ మహిమ యొక్కొ
విరహ కాలోద్భ్రాంతి విభవానువృత్తియో
రూపింప నలు విశ్వరూప యొక్కొ
గణుతింప వేల్పుల కపట నాటక యొక్కొ
భారతీ పరిహాస భంగి యొక్కొ

తే॥ కాక యీయే పురందు నొక్కరుఁడు నలుఁడొ?
మారుఁడొక్కఁడొ? యొకఁడు పురూరవుండొ?
వరుస నున్న యీ చక్కని వారిరువురు
దేవతావైద్య యుగ్మంబొ? తెలియరాదు

(శృ.నై.పంచ.ఆశ్వా.178 పద్యం)

దమయంతీ స్వయంవరానికి వచ్చిన వారి గూర్చి ఇలా అనుకుంటుంది. నలుడే ఒక్కడు ఇందరిలో కన్పిస్తున్నాడా, నా కళ్ళు సరిగా కనబడక ఇద్దరిలో కన్పిస్తున్నాడా? మన్మథుని ప్రభావమా? అదృశ్యకరణి విద్య తెలిసి ఇందరిలో కన్పిస్తున్నాడా? నా చిత్తం పరీక్షించడానికి, ఇంద్రాదుల కపట నటనేమో? సరస్వతి వేళాకోళం చేయడానికి పూనుకున్నదా? ఆ ఇద్దరిలో నలుడా? పురూరవుడా? ఆశ్వినేయులు ఇరువురిలో? అంటూ నలాది సందేహం ఇక్కడ వ్యక్తమయ్యింది. ఉత్ప్రేక్షించటం, ఇదా అదా అనే సంశయం సామ్యనిబంధనం, సంభవావనుమానం ఇవన్నిటి దృష్ట్యా ఇది సందేహాలంకారంగా చెప్పవచ్చు. దమయంతీ అనుమానం ద్యోతకం.

### 5.9.18. అపహ్నుతి

కా॥ అన్యదర్పయితుం రూపం వర్ణనీయస్య వస్తునః
స్వరూపాపహ్నవో యస్యామసావపహ్నుతిర్మతా

(వ.జీ.తృతీ.ఉన్మే.కా.39)

వర్ణనీయమైన ప్రకృత వస్తువుకు మరొక రూపం కల్పించడానికి ఎక్కడైతే దాని స్వరూపం మరుగున పడుతుందో అది అపహ్నుతిగా చెప్పబడ్డది. ప్రకృతాన్ని నిషేధించి, అప్రకృతాన్ని స్థాపించడం అపహ్నుతి.

ఉదాహరణ చూద్దాం.

**పూర్ణే న్దోః పరిపోషకాన్తవపుషః స్ఫార ప్రభాభాసురం**
**నేదం మండలమభ్యుదేతిగగనే భాసోజ్జి హీర్షోర్జగత్**
**మారస్యోచ్ఛ్రితమాత పత్రమధునా పాండుప్రదోషక్రియో(తో)**
**మానో బంధుజనాభిలాషదలనోఽద్యోఽచ్ఛిద్యతే కిం నతే**

**(వ.జీ.పుట.395)**

"పరిపుష్టిచే సుందరమగు శరీరం కలిగినట్టియు, కాంతిచే జగత్తును పైకి లేవదీయనున్నదియు అగుపూర్ణేందుని, అధిక కాంతిచే సుందరమగు ఈ మండలము ఉదయించుట లేదు. ఇపుడు మన్మథుని యొక్క శ్వేతచ్ఛత్రము పైకి ఎత్తబడినది. ప్రదోషసమయమున గ్రహింపబడినదియు, బంధుజనము (ప్రియుని) యొక్క అభిలాషకు విఘ్నకరముగా నున్నదియు అగు నీ మానము ఏల తొలగిపోకున్నది"? ఆ కనబడునది చంద్రబింబము కాదు. మన్మథుని శ్వేతచ్ఛత్రమని చెప్పుటచే ఇది అపహ్నుతి" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.395) అని భావం.

### 5.9.18.1. అపహ్నుతి – సమన్వయం

**సీ॥ మధుకరంబులు వుట్టె మధుకరంబులు గావు**
**రమణీయ వేణీభరములుగాని**
**శశి బింబములు వుట్టె శశి బింబములుగావు**
**మహిత వక్త్రేందు బింబములుగాని**
**మెఱఁగుఁ దీగెలు వుట్టె మెఱుఁగుఁ దీగెలు గావు**
**లలిత కోమల తనూలతలుగాని**
**చక్రవాకులు వుట్టెఁ జక్రవాకులుగావు**
**కఠినంబులగు చన్నుఁగవలు గాని**

**తే॥ యనఁగ మందర కందర వ్యాప్తి చలిత**
**వార్థి కల్లోల వీచికా వర్తతతుల**

నుద్భవిల్లిరి రంభాతిలోత్తమాదు
లప్సర స్త్రీలు దేవవేశ్యా జనములు

(హర.షష్ఠా.ఆశ్వా.ప.89)

అప్సర స్త్రీలు, దేవగణాలు ఉద్భవించిన తీరును కవి వర్ణిస్తున్నాడు. తుమ్మెదలు పుట్టినట్లనిపించింది కానీ తుమ్మెదలు కావు అందమైన శిరోజాలు. చంద్రబింబం పుట్టినట్లనిపించింది కానీ ముఖచంద్రాలు. మెరుపు తీగెలు పుట్టినవనిపించింది కానీ అవి కావు కోమల శరీర లతలు. చక్రవాకాలు పుట్టెవనిపించింది కానీ కావు కాఠిన్య వక్షోజాలు. మందర పర్వతం తిరిగిన వేళ చలించిన సముద్ర తరంగాల సుడిగుండం నుండి రంభాతిలోత్తమాది అప్సరసలు ఉద్భవిల్లారని కవి హృదయం నుండి వచ్చిన పదాలు.

ప్రకృత వస్తువుకు మరో రూపం కల్పించడానికి ప్రయత్నం చేయడం ఇక్కడ శిరోజాలకు తుమ్మెదలను, ముఖాలకు చంద్రున్ని, దేహాలకు తీగలను చెప్పటంలోని సౌందర్యమే అపహ్నుతి ఉపమానాలను కావని ఉపమేయాలుగానే చెప్పడం కన్పిస్తుంది.

## 5.9.19. సంసృష్టి

కుంతకుడు సంసృష్టి గూర్చి చెప్పిన కారికలు గాని వృత్తిగాని స్పష్టంగా లేదు. ఉదాహరణలు కూడా పాఠక దోషాలున్నాయని వ్యాఖ్యాత తెలియజేసాడు. ఆ ఉదాహరణలను ఉద్దేశించి మిగిలిన ఆలంకారికులు చెప్పిన లక్షణంలాగా సంసృష్టి ఉందని భావిస్తూ భామహుని అభిప్రాయాన్ని వ్యాఖ్యాత తెలియజేసాడు. ఒక వాక్యంలో అనేక అలంకారాలుండటం సంసృష్టి అన్నాడు.
భామహుని కావ్యాలంకారంలో చూసినట్లయితే ఇలా ఉంది.

వరా విభూషా సంసృష్టిర్బహ్వలఙ్కారయోగతః
రచితా రత్న మాలేవ సా చైవముదితాయథా

(భామ.కావ్యా.తృతీ.పరి.కా.49)

అనేక రత్నాలను కూర్చిన రత్నమాలలాగా అనేకములైన అలంకారాలతో ఏర్పడితే సంసృష్టి ఉత్తమమైన అలంకారంగా చెప్పబడ్డది. ఇలా అనేక అలంకారాలుంటే సంసృష్టి.

### 5.9.19.1. సంసృష్టి – సమన్వయం

సీ॥ చన్నిచ్చు లాగున జనయిత్రి తొడలపైఁ
బసిబిడ్డఁ బవ్వళింపంగఁ బెట్టెఁ
జందనిక తనహస్త ప్రవాళంబులఁ

గ్రిందనంటుక సంతరించుకొనియెఁ
జిన్నిబుగ్గలలేఁత చిఱుత నవ్వువెలర్ప
సిరియాళుఁడు మొగిడ్చెఁ జేయిదోయి
చిఱుతొండనంబి క్రొమ్మెఱుఁ గారచురకత్తి
వాఁడిగా నూరుచు వంక దీర్చె
తే॥ నేకమైయట్లు ముప్వురి హృదయములును
గుందకానందవారిధి యందుఁ దేలె
గురులు ముప్వురును గుమార వరునితోడ
నేకవాక్యంబుగాఁ బ్రీతి నిట్టులనిరి

(హర.ద్వితీ.ఆశ్వా.116 పద్యం)

ఇది సిరియాలుని చంపి శివునికి వండి పెట్టే సందర్భంలోనిది. పాలిచ్చే విధంగా తల్లి తన తొడలపై సిరియాలున్ని పడుకోబెట్టింది. చందని తలకు ఒత్తుకు చేతులను పెట్టింది. ఇది స్వభావోక్తిని తెలుపుతుంది. సిరియాలుడు చిరునవ్వు వెలయిస్తూ, చేతులను ముకుళిస్తూ నమస్కరిస్తాడు. తండ్రి చిఱుతొండడు కత్తిపదును చేస్తాడనటంలో అతిశయోక్తి ఉంది. చనిపోయే బాలుడు నవ్వాడనటంలో అతిశయం ఉంది. ఆ ముగ్గురి హృదయాలు 'ఆనంద వారిధి యందు దేలే' అనటం రూపకం. ఆనందానికి వారిధికి అభేదం చెప్పబడింది. ఆ ముగ్గురు కూడా అతి సంతోషంతో ఉన్నారని, సంతోష సముద్రంలో ఓలలాడరని వర్ణించాడు కవి. ఇక్కడ స్వభావోక్తి అంటే కుంతకుని వస్తు వక్రత, అతిశయోక్తి, రూపకం మూడు అలంకారాల సమ్మేళనంతో ఈ పద్యం వైచిత్ర్యాన్ని పొందింది కనుక సంసృష్టి.

సీ॥ సప్తమాడియ రాయచంద్రబింబాననా
చికుర వల్లరులపైఁ జిన్నిపువ్వు
ఝూడె జంతుర్నాటి జననాథ శుద్ధాంత
కుచకుంభములమీఁది కుంకుమంబు
బారహదొంతి భూపాలలీలావతీ
గండస్థలంబులఁ గలికి నవ్వు
కలువపల్ల్యొడ్డాది కటకాధిపతి వధూ
సీమంత వీథులఁ జేరుచుక్క

తే॥ యల్లడాధీశ వేమక్ష్మాధినాథు
భూరి నిష్ఠుర ధాటీ విహారచటుల
సైన్య నాసీర తుక్ఖార శఫపుటోత్థ
వింధ్యపార్శ్వ వసుంధరా విపుల ధూళి

(కాశీ.ప్రథ.ఆశ్వా.34 పద్యం)

అల్లాడ వేముని దండయాత్రలో సేనల ముందు కదనుదొక్కుతున్న గుర్రాల గిట్టల నుండి వచ్చిన ధూళి వింధ్యపార్శ్వ సీమలయందలి కెంధూళులులాగా తేలుకొండ జవరాళ్ళ ముంగురులపై చిన్ని పువ్వులను చెక్కుతుంది. రాణివాసాల స్తనకుంభాలమీద కుంకుమలద్దుతుంది. దొంతిగా ఉన్న పన్నెండు మన్యపు రాజ్యాలను వెలుతున్న దొరల నగళ్ళలోవి చెలువల చెక్కిళ్ళపైన కలికి నవ్వులుగా ముద్దులొలుకుతుంది. కలువపల్, బద్దాది, కటకాధిపతుల సీమంతినుల పాపటమీద చేర్చుక్కలను చేర్చుతుంది అని భావం. ఇక్కడ వేముని పరాక్రమం వర్ణితం. రాణివాసాలకు ఆనందాన్నిస్తుందని చెప్పటం పర్యాయోక్తం. ముంగురులపై చిన్నిపువ్వు, చెక్కిలిపై నవ్వులుగా పోల్చటం ఉత్ప్రేక్ష. కలువపల్లి మొదలైనవాటిని గెలవడం వరుసగా చెప్పటం ఉల్లేఖం. భంగ్యంతరంగా వేముడు అన్ని దేశాలను గెలిచాడని చెప్పుతూ ఇన్ని అలంకారాలు ఒకే సందర్భంలో వాడటం సంసృష్టి.

మ॥ శమనారాతి నివృత్తధైర్యుఁడగుచుంజంద్రోదయారంభ కా
లమునం బొంగిన దుగ్ధ సాగరములీలం బక్వబింబాధరో
ష్ఠముఁ గర్ణాంత విలాసనేత్రము నతి స్వచ్ఛంబునై యొప్పు గౌ
రి ముఖాంభోజమునందునిల్పె సరసప్రేమంబునం జూడ్కులన్

(హర.తృతీ.ఆశ్వా.80 పద్యం)

శివుడు ధృతిని కోల్పోయి చంద్రోదయవేళ ఉప్పొంగే పాలసంద్రంలాగా, పండిన దొండ పండు పెదవులు, అత్యంత తెల్లనైన ఆకర్ణాంత విశాలనేత్రాలుగల పార్వతీ ముఖపద్మాన్ని కోరికమీర సరసత్వం నిండిన చూపులతో చూశాడని భావం. ఇక్కడ ఉప్పొంగే పాలసముద్రం వలె అని పోల్చటంలో ఉపమాలంకారం ఉంది. పార్వతీ ముఖపద్మం అనటంలో ముఖానికి పద్మానికి అభేదంతో రూపకం చెప్పబడ్డది కను. ఉపమ, రూపకాల సమ్మిళితమై సంసృష్టి.

తే॥ కంఠికా నీలరత్నంబు కరణినొప్పె
లలిత మృగనాభి పంకంబు చెలువుదాల్చెఁ
గాలకూట విషంబు తత్కంఠమునకు

**నాభరణమయ్యె బ్రహ్మాదులభినుతింప**

**(హర.షష్ఠా.ఆశ్వా.71 పద్యం)**

బ్రహ్మాదులంతా శివున్ని స్తుతించగా, ఆ కాలకూట విషం కంఠానధరించిన నీలమణిలాగా ప్రకాశించి, అందగించింది. లలితమైన కస్తూరి పూతలాగా భాసించి, ఆ కంఠానికి ఆభరణం అయ్యింది. ఇక్కడ నీలమణిలాగా ప్రకాశించటం ఉపమాలంకారం. నీలమణి ఉపమానం, కాలకూటం ఉపమేయం, ప్రకాశం సమాన ధర్మం. నీలమణిని 'కంఠికా నీలరత్నం' అనటం రూపకం. కంఠమే నీలరత్నం, నీలరత్నమే కంఠం అన్నట్లు అభేదాన్ని చెప్పాడు కవి.

**తే॥ అసమబాణ పునర్జీవ నౌషధంబు**
**రాగజలధి విధూదయారంభ వేల**
**సకల జగదేక సౌభాగ్య జన్మభూమి**
**శంభుడాయంగ వచ్చెనా శైలకన్య**

**(కాశీ.చతు.ఆశ్వా.146 పద్యం)**

మన్మథునికి పునస్సంజీవనౌషధం, అనురాగ సముద్రానికి చంద్రోదయం కలిగే వేళ, సకల జగత్సౌభాగ్యానికి ఒకే ఒక జన్మభూమి అయినట్టి. ఆ శైలకన్య శంభుని చేరడానికి వచ్చిందని భావం. ఔషధం, చంద్రోదయం, సౌభాగ్యం వీటన్నింటికి అనేక రకాలుగా చెప్తూ జన్మభూమిని చెప్పడం ఇక్కడ ఉల్లేఖాలంకారం. అలాగే అనురాగ సముద్రం, జగత్సౌభాగ్యం అంటూ ఉపమాన ఉపమేయాలకు అభేదం చెప్పడం రూపకం ఈ రెండు అలంకారాల సమ్మిళితం సంసృష్టి.

**ఉ॥ తియ్యనితేనెవోలె సుదతీ తిలకంబు గుణంబులుత్సవం**
**బయ్యె శ్రుతిద్వయంబునకు నాదిమకాలమునందు నిప్పుడా**
**తొయ్యలి నీవు సమ్మదముతో వినుతింపఁగ మన్మథాగ్ని కిం**
**ధాయ్యముఁబోలె నయ్యెనది; ధైర్యము పల్లటిలెన్ ఖగేశ్వరా**

**(శృ.నై.ద్వితీ.ఆశ్వా.31 పద్యం)**

ఓ విహంగరాజా! పూర్వం ఇతరులు వర్ణించినప్పుడు దమయంతీ సౌందర్యాది గుణాలు తియ్యని తేనెలాగా వీనులకు పండుగయ్యింది. ఇప్పుడు నీలాంటి ఆప్తుడిచే వినటం వల్ల మన్మథాగ్నికి ఆజ్యం అయ్యింది. నా ధైర్యం తూలిపోయింది అని నలుడంటాడు. వారి వర్ణన వలన పండుగ కావటం, నీ వర్ణన వల్ల 'మన్మథాగ్నికిధాయ్యం' కావటం రెండు పండుగ, మండుట అనే భావన వ్యతిరేకాలంకారంలా ధ్వనిస్తుంది. 'తియ్యని తేనెవోలె' అని పోలిక చెప్పటం ఉపమాలంకారం.

'మన్మథాగ్ని' అనేది అభేదం కనుక రూపకం. ధైర్యం పోవడానికి దానికి పూర్వ వాక్యం కారణం కాబట్టి వాక్యార్థ హేతుక కావ్యలింగాలంకారం. ఇలా ఇన్ని అలంకారాలు వాడటం వల్ల ఈ పద్యం సంసృష్టికి ఉదాహరణ.

### 5.9.20. సంకరం

దీనికి కూడా కారికలు లేవు. ఉదాహరణ చూపబడింది. అలంకారాలు ఎక్కడైతే స్వాతంత్ర్యం పొందకుండా పరస్పరం అనుగ్రాహ్యానుగ్రాహకత్వాన్ని ధరిస్తాయో అవి ఒకదానితో ఒకటి కలిసిపోతాయో ఆ స్వరూపమే సంకరంగా చెప్తాడు. మమ్మటుడు కారిక చూద్దాం.

**కా॥ అవిశ్రాన్తి జుషామాత్మన్య ఙ్గాఙ్గిత్వం తు సంకరః**

**వృ॥ ఏతే ఏవ యత్రాత్మని అనాసాది త స్వతన్త్ర భావాః**

పరస్పరమ్ అనుగ్రాహ్యానుగ్రాహకతాం దధతి స ఏషాం సంకీర్యమాణ స్వరూపత్వాత్ సంకరః" (కావ్య.ప్రకా.పుట.734).

అలంకారాలు ఒకదానిపై ఒకటి ఆధారపడిన స్వరూపంగా తెలియజేసాడు. లక్షణం అలభ్యమైనప్పటికి కుంతకుడిచ్చిన ఉదాహరణను పరిశీలిద్దాం.

**"రూఢాజాలైర్జటానా మురగపతిఫణైస్త్రపాతాలకుక్షౌ**
**ప్రోద్యద్బాలాంకురశ్రీర్దిశి దిశిదశనై రేభిరాశాగజానామ్**
**అస్మిన్నాకాశదేశే వికసిత కుసుమా రాశిభిస్తారకాణాం**
**నాథ! త్వత్కీర్తివల్లీ ఫలతి ఫలమిదం బిమ్బమిన్దోః సురాద్రేః"**

"ఆ పాతాల మధ్యమునందు ఆదిశేషుని పడగలచే వ్రేళ్ళతో పాదుకొన్నదియు (పాతాలమునందలి ఉరగపతి యొక్క పడగలు ఈ లత యొక్క వేళ్ళు అని భావము; ఇట్లే ముందును) ప్రతి దిక్కునందు దిగ్గజముల ఈ దంతములచే బయల్వెడలుచున్న బాలాంకురములు కలదియు, ఈ ఆకాశ ప్రదేశమున నక్షత్రరాశులచే వికసించిన పుష్పములు కలదియునగు ఈ కీర్తిలత, ఓ రాజా! మేరు పర్వతమునుండి, ఈ చంద్రబింబమనెడు ఫలమును ఫలించుచున్నది". "(ఇచట ఉరగపతి ఫణాదుల యందు జటాత్వాద్యారోపము కీర్తియందు లతాత్వారోపముపై సాధారపడి యున్నది గాన అనుగ్రహ్యాను గ్రాహక రూపమగు సంకరము)" (శ్రీరామచంద్రుడు, పుల్లెల.2007.పుట.397).

### 5.9.20.1. సంకరం – సమన్వయం

**చ॥ కెరలి మహాసివేమ సహకృత్వరి తద్భటకోటీ చాతురీ**

తురి సమరాంగణంబులఁ జతుర్థారి దావరణంబులన్ యశోం
బరముల నేయుచుండు బహుభంగులఁ బున్నమనాఁటి నిండుచం
దురు నునుసోగ వెన్నెలలతోఁ దులఁదూఁగెడు తద్గుణంబులన్

(శృ.నై.ప్రథ.ఆశ్వా.50 పద్యం)

నలరాజు శౌర్య ధైర్యాలను పొగుడుతూ చెప్పిన పద్యం ఇది. నలమహారాజు పెద్ద పట్టా కత్తి అనే నేత పలకకు సహకరించే బంటుల నేర్పు అనే నాడె (నేత పనిముట్టు) యుద్ధక్షేత్రంలో నాలుగు దిక్కులనే అంగనలకు కప్పడాలుగా కీర్తులనే కప్పడాలను, రాత్రి చంద్రుని కిరణాలలాంటి విమలాలు, దీర్ఘాలు అయిన నలుని శౌర్య ధైర్యాది గుణాలనే నూలుపోగులను నేస్తుందని భావం.

నలమహారాజు స్వయంగా కత్తితో పోరాటం చేసి బంట్ల చాతుర్యంతో యుద్ధంలో గెలుపొంది దిగంత విశ్రాంత నిర్మల కీర్తిని పొందాడని తాత్పర్యం.

ఇక్కడ ఉన్న అలంకారం సంకరం. సంసృష్టి భిన్న అలంకారాల కలయిక. తిలతండూల న్యాయాన్ని కలిగి ఉంటుంది. కానీ సంకరం క్షీర నీర న్యాయం. అంటే పాలు నీళ్ళలా కలిసి ఉంటాయి అలంకారాలు. వీడదీయని బంధాన్ని కలిగి ఉండటం సంకరంలోని వైచిత్ర్యం.

వెన్నెలకు చెప్పిన విశేషణం అంతా కూడా 'నునుసోగనూలి' పోగుల సాదృశ్యం కొరకని అర్థం అవుతుంది. ఇది ఉపమగా భావించవచ్చు. ఇందులో మొత్తం అంతట ఆరోపం ఉండటంచేత రూపకాలంకారం. 'యశోంబరములు' అనే చోట కూడా రూపకం ఉంది. కీర్తి అనే వస్త్రం అనటం అభేదం. ఇలా పద్యంలోని వివిధాలంకారాలను విడదీయలేని సంబంధం కలిగి ఉండటం సంకరాలంకారానికి నిదర్శనం.

★★★

# అధ్యాయం – 6

# శ్రీనాథుని కవిత్వం – ప్రకరణ, ప్రబంధ వక్రతలు

## 6.1. ప్రకరణ వక్రత

కుంతకుడు చెప్పిన ఆరు ప్రధాన వక్రతల్లో ప్రకరణ వక్రత ఐదవది. వర్ణవిన్యాస, పదపూర్వార్థ, పదపరార్థ, వాక్య వక్రతల తర్వాత కుంతకుడు నాల్గవ ఉన్మేషములో ప్రకరణ వక్రతను తెలిపాడు. "అనేక వాక్యముల సముదాయమై సమగ్ర ప్రబంధములోనొక భాగమైన దానిని ప్రకరణమందురు. కొన్ని వర్ణములు కలిసి పదమైనట్లు కొన్ని పదములు కలిసి వాక్యమైనట్లు కొన్ని వాక్యములు కలిసి ప్రకరణముగ రూపుదిద్దుకొనును. కవి సహజమైన లేదా ఆహార్యమైన సౌకుమార్యముచే సహృదయంగమముగ ప్రకరణమును దిద్దితీర్చుటయే ప్రకరణ వక్రతయగుచున్నది" (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977. పుట.407).

కుంతకుడు ప్రకరణ వక్రత గూర్చి ఈ కారికల్లో వివరించాడు.

**కా॥ యత్ర నిర్యన్త్రణోత్సాహ పరిస్పన్దోపశోభినీ,**
**వ్యావృత్తిర్వ్యవహర్తృణాం స్వాశయోల్లేఖ శాలినీ,**
**అప్యామూలాదనాశంక్య సముత్థానే మనోరథే,**
**కాప్యున్మీలతి నిస్సీమా సా ప్రబంధస్య వక్రతా.**

**(వ.జీ.చతు.ఉన్మే.కా. 1, 2)**

ఎక్కడైతే కథ ప్రారంభము నుండి కథాగతికి సంబంధించిన కవుల అభిప్రాయము వికాసాన్ని పొంది, ఏ అడ్డూ లేకుండా శోభిస్తుందో, అక్కడ ప్రకరణ వక్రత ఉన్నట్లుగా కుంతకుడు రెండు కారికల్లో తెలిపాడు. "అంతరాంతములలోని మనోరథము అఖండ సమున్మేషము నందినప్పుడు అనంతము, అనిర్వచనీయమునైన ఉత్సాహముతో నలరారుచు ఆశయ ప్రకాశనముచే అత్యంత సుందరమైన వ్యవహర్తల ప్రవృత్తి ఎచ్చట సమున్మీలితమగునో అచ్చట ప్రకరణ వక్రత" అని బాపూజీ గారు వివరించారు (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977. పుట. 406).

ప్రకరణ వక్రత భేదాలను 9 రకాలుగా కుంతకుడు చెప్పాడు. ప్రతీ భేదానికి సంస్కృతి కావ్యాలను ఉదహరించాడు.

### 6.1.1. ప్రకరణ వక్రత మొదటి భేదం

సమర్థుడైనటువంటి కవి పురాణంలో ఒక ఇతివృత్తాన్ని తీసుకొని తన బుద్ధిబలంతో స్వతంత్రంగా, సముచితంగా నూతన కల్పనలు చేసి మూలకథకు భంగం కలగకుండా చేయటం ఒక రకమైన వక్రతగా చెప్పాడు కుంతకుడు. ఇందుకు ఉదాహరణగా రఘువంశ కావ్యంలో కౌత్సవృత్తాంత ఘట్టాన్ని వివరించాడు.

శ్రీనాథుడు తన కావ్యాల్లో ప్రకరణ వక్రత భేదాలను పాటించిన తీరును పరిశీలిద్దాం.

**మొదటి భేదం ఉదాహరణ–1**

మూలంలో లేని కథను స్వతంత్రంగా కాశీఖండంలో కూడా సృష్టించాడు. శ్రీనాథుడు అది పలుచోట్ల కనబడినట్లుగా మల్లంపల్లి శరభేశ్వర శర్మ రాసిన కాశీఖండ మణికర్ణికా వ్యాఖ్యాన గ్రంథంలో తెలియజేసారు.

“దేవతలు, మునులు అగస్త్య మహామునికై అన్వేషించిన ప్రదేశములు వివరింపబడుచున్నవి. ఈ వివరణములు మూల గ్రంథములో లేవు. సరాసరి వెళ్ళినట్లేయున్నది. ఆయన సుప్రసిద్ధుఁడు. ఇంత శ్రమపడి వెదకి పట్టుకొన నవసరములేదు. మూల కాశీఖండములో – ‘జగ్ముః పరోపకారార్థ మగస్తిర్యత్ర తిష్ఠతి’ అని మాత్రమే యున్నది. తెనుఁగులోని యీ అన్వేషణ క్రమమును బట్టి ఆ దేవమునుల కార్యవ్యగ్రతా లక్షణము లోక స్వభావానుసారముగఁ జిత్రింపబడినదనకొనవెలను” (శరభేశ్వరశర్మ, మల్లంపల్లి. 2012. పుట.186).

శ్రీనాథుడు మూలంలో లేని విధంగా ఈ పద్యంలో ఈ వివరిస్తూ స్వతంత్ర కల్పన చేశాడు.

**సీ॥ డుంఠి విఘ్నేశుదుండు ప్రదేశ మీక్షించి**
**లోలార్కు నగరి మోసాల వెదకి**
**దండపాణ్యాసవ భాండేశ్వరంబులు**
**కుక్కుట స్థానంబు గుద్దలించి**
**కేశవస్వామి లోఁగిలి పరామర్శించి**
**కాలభైరవుదేవుగవనుఁజూచి**
**శ్రీ విశాలాక్షి గోష్ఠీ వాటి శోధించి**
**యపవర్గ మంట పోపాంతమరసి**

**తే.గీ.॥ విభుద గంగా తరంగిణీవేణి మధ్య**
**సైకతోత్సేధ వేదికా సంప్రరూఢ**

**తరుణ వంజుల కుంజవైతస కుడుంగ**
**వీథి కలయందు దృష్టియావిష్కరించి**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 41 పద్యం)**

లోకసహజంగా ఎవరినైన వెతికినపుడు ఎలా స్థలాలను వెతుకుతారో దేవతలు అగస్త్యముని కోసం మొదట డుంఠి విఘ్నేశ్వరుడు ఉండే స్థలం, తర్వాత, లోలార్కుని మొగసాల, దండపాణి నిలయం, సురాభాండేశ్వరం, కుక్కుట స్థానం, ఆదికేశవ మందిరం, కాలభైరవ కోట, విశాలాక్షి సభావాటిక, గంగానది, చెట్లు, పొదరిల్లు అన్ని వెదికారు అని సహజంగా వర్ణిస్తూ మూలంలో లేని దానిని కూడా కల్పించి కావ్య సౌందర్యాన్ని ఇనుమడింపజేసాడు శ్రీనాథుడు.

**మొదటి భేదం ఉదాహరణ–2**

అలాగే మరొక ఉదాహరణను ప్రకరణ వక్రతకు ఉదాహరణగా కాశీఖండంలోనే చూద్దాం. అగస్త్యుడు కాశీని విడిచి పెట్టాల్సిన సందర్భంలో దుఃఖానికి గురి అయి లోపాముద్రతో చెప్తూ పలురకాలుగా మనోవ్యధకు గురి అవుతాడు.

**తే.గీ. ఏమి చెప్పగనున్నది? యేవిధమునఁ**
**గాశి వెడలించుచున్నాఁడు కాలగళుఁడు**
**మనములోఁ గితి మేనిలోఁగునె శివాజ్ఞ?**
**యుడుము నడిఁకిన నడుఁకునే ఒడియపెట్టు?**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 144వ పద్యం)**

ఇంకా చెప్పాల్సిందేముందీ? ఏ విధంగానైతేనేమి? కాశీ నుండి శివుడు వెళ్ళగొడుతున్నాడు. మనము వెనుక అడుగు వేసిన శివుని ఆజ్ఞ వెనుక దీస్తుందా? అని అగస్త్యుడు బాధపడుతాడు. అగస్త్యుడు కన్నీళ్ళు పెట్టుకున్నట్టు శ్రీనాథుడు వర్ణిస్తూ ఇలా అంటాడు.

**చం॥ అని యెదురుండి మ్రొక్కి నయనాంబురుహంబుల బాష్ప**
**చినుకఁగ వెక్కివెక్కి కలశీసుతుఁడోయన నేడ్చు నీ రెలుం**
**గుననొక కొంత కొంత మఱి గ్రుమ్మరు మిన్నునమ్రోవనుద్ధుర**
**ధ్వనిఁ బఠియింపఁ జొచ్చెఁ బ్రణవంబునఁ గూర్చిన మంత్రరాజమున్**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా.147వ పద్యం)**

కాశీ నగరానికి ఎదురు నిలబడి నమస్కరించి కళ్ళలో నుండి కన్నీళ్ళు వస్తుండగా ఏడ్పును ఆపి ఆపి చివరికి ఏడ్చేసాడని, తర్వాత దుఃఖంతో కూడిన కంఠంతో పంచాక్షరీ మంత్రాన్ని

పఠించడం మొదలుపెట్టాడని అగస్త్యుని వేదనను కరుణరసభరితం చేశాడు శ్రీనాథుడు. నిజానికి మూలంలో ఈ ప్రసక్తి లేదని శరభేశ్వర శర్మగారు తెలుపుతూ "మూలములో ఈ ప్రకరణమునందు దీని ప్రసక్తి ఏమియును లేదు. దాదాపుగా. ఈ ప్రకరణమంతయును శ్రీనాథుడు తన పురాణ విజ్ఞానధారముగా ప్రపంచించి వ్రాసినదే. మూలములో అగస్త్య మహర్షి కాశీని విడుచుట, తెనుఁగులో శ్రీనాథుడు వ్రాసిన దానికన్న మిక్కిలి సంగ్రహముగానున్నది. ఈ ప్రకరణము తెనుఁగులో నున్నంత రసవంతముగా సంస్కృతములోలేదు" (2012. పుట.285) అని అంటాడు శ్రీనాథుడు. ఈ ప్రకరణాన్ని విస్తరించాడు. ఇది శ్రీనాథుని ఉపజ్ఞయే అని శరభేశ్వర శర్మగారు వ్యాఖ్యానించారు. ఇలా అగస్త్యుని వేదనావస్థని వర్ణించటం కరుణరసప్లావితం చేయటం కథానుగత ఆసక్తిని పెంచటం, ప్రకరణాలను కల్పించటం కూడా వక్రత భేదమే కనుక ఈ ఘట్టం అందుకు ఉదాహరణ. ఇంకొక ఉదాహరణ కాశీఖండంలోనే కన్పిస్తుంది. మూలంలో లేని విషయాన్ని శ్రీనాథుడు చెప్పాడు.

**మొదటి భేదం ఉదాహరణ–3**

**తే.గీ.॥ దలవకారంబు శ్వేతాశ్వతరము ననెడు**
**నుపనిషత్తులు తలపోయు నొయ్యనొయ్యఁ**
**గాశికా క్షేత్ర విప్రయోగ ప్రభూత**
**హృదయ సంతాపశాంతికై యిల్వలారి॥**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 151 పద్యం)**

కాశీ క్షేత్రాన్ని విడవటానికి బాధనొందుతూ హృదయ సంతాపాన్ని తగ్గించుకోవడానికి అగస్త్యుడుఉపనిషత్తుల సారమైన భగవద్గీతను తలచాడని స్వీయ సృష్టి చేసాడు. ఇది కూడా ప్రకరణ వక్రతే.

మూల కాశీఖండములో సుదీర్ఘంగా లేదు. మూలంలో ఇలా ఉందంటూ

**"తపోయానమి వారుహ్య నిమేషార్థేనవై మునిః**
**అగ్రేదదర్శతం వింధ్యం రుద్ధాంబర మధోన్నతం"**

అని మిక్కిలి సంక్షేపముగా ఇంత మాత్రమే యున్నది. ఈ ఘట్టమంతయును శ్రీనాథుడు యోగశాస్త్రాది విషయములతో ప్రపంచించి వ్రాసెను. ఈ ప్రకరణము ఆయన శాస్త్ర విజ్ఞానమునకు దార్శనికతకు దృష్టాంతముగా నున్నది (శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. 293. 2012).

అలాగే లోపాముద్రాదేవి శ్రీశైల శిఖరదర్శనం ఎంతో అడిగినట్లు ఒక వచనంలో, పద్యాల్లో శ్రీనాథుడు విస్తరించాడు. కానీ మూలగ్రంథంలో అలా లేదంటూ శరభేశ్వర శర్మ వ్యాఖ్యానిస్తూ...

**“శ్రీశైల శిఖరంధృష్ట్వ పునర్జన్మ నవిద్యతే**

**ఇదమేవ హి సత్యంచేత్ కిమర్థం కాశిరిష్యతే?**

శ్రీశైలం శిఖర దర్శనంతోనే పునర్జన్మ లేకపోతే, అదే నిజమైతే కాశీకి ఎందుకు వెళ్ళాలి? అని మూలంలో ప్రశ్నిస్తుంది. కానీ శ్రీనాథుని కాశీఖండంలో అగస్త్యుదుని ఇలా అడుగుతుందని చెప్తూ ఎనుబది నాలుగు ఆమడల కైవారం, ఒక ఆమడ యెత్తు, ముప్పది ఆమడల వెడల్పు ఉన్న శ్రీశైల పర్వతంలో మూడుకోట్ల ఎనభై లక్షల తీర్థాలతో, ఎనభై ఎనిమిది వేల మంది మునీంద్రులతో ఉన్న ఈ పర్వతం పైన ఉన్న శ్రీశైల శిఖర దర్శనం ముక్తిని ఇవ్వడం ఆశ్చర్యం అంటూ విస్తరించాడు. ఇది ప్రకరణ వక్రత కిందికే వస్తుంది. స్వతంత్ర కల్పన వల్ల కలిగిన సౌందర్యం.

**మొదటి భేదం ఉదాహరణ–4**

మూలకథ అయిన బసవపురాణంలో నంబి కుమారుని దగ్గరకు శివుడు వెళ్ళే ప్రకరణం లేదు. పార్వతి నంబి భార్య వద్దకు వెళ్ళే ప్రకరణం కూడా లేదు. కానీ శ్రీనాథుడు అద్భుతంగా పోషించాడు ఈ ఘట్టాలను వాత్సల్యపూర్వకంగా తీర్చిదిద్దాడు. హరవిలాసంలోని ఈ పద్యం పరిశీలిద్దాం.

**శా॥ అన్నా! యీ చిఱుతొండనంబియను పాపాత్ముండు మీ తండ్రియే**

**యన్నిర్భాగ్యుఁడు జోగి కొక్కరునికిన్ హాలామదోన్మాదికిన్**

**నిన్నుంజంపి మహేశహారముగ వండింపంగనున్నాఁడు సం**

**పన్న స్నేహముతోడ నీకు నెఱిఁగింపన్ వచ్చితింజెచ్చెరన్**

**(హర. ద్వితీ. ఆశ్వా. 75.పద్యం)**

మీ తండ్రి నిన్ను చంపాలనుకున్నాడు. శివయోగికి నీ శరీర మాంసాన్ని నైవేద్యంగా పెట్టాలని అనుకుంటున్నాడు అని సిరియాలునికి చెప్పే ఘట్టం కరుణ రసార్ద్రమైనదిగా మలిచాడు శ్రీనాథుడు. అలాగే చనిపోయేవాడు కూడా మనస్ఫూర్తిగా ఈశ్వరునికి అంకితం కావాలనే అభిలాషను కథోచితంగా తెలియజేసాడు. అలాగే పార్వతి కూడా బాలింతరాలిగా చిఱుతొండనంబి భార్య వద్దకు వెళ్ళి పుత్ర వాత్సల్యాన్ని పరీక్షిస్తుంది. మూలంలో కన్నా కొన్ని కల్పనలతో రస ఉద్విజ్ఞతను పోషించాడు కవి. ఇది ప్రథమ వక్రత భేదానికి ఉదాహరణ.

### 6.1.2. ప్రకరణ వక్రత–రెండవ భేదం

ప్రకరణ వక్రతలో రెండవ భేదాన్ని వివరిస్తూ ఇలా అంటాడు.

**కా॥ ఇతివృత్త ప్రయుక్తేఽపి కథావైచిత్ర్యవర్త్మని,**
**ఉత్పాద్యలవ లావణ్యాదన్యా భవతి వక్రతా.**
**తథాయథాప్రబంధస్య సకలస్యాపి జీవితమ్,**
**భాతి ప్రకరణం కాష్ఠాధి రూఢరస నిర్భరమ్.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.3,4)**

ప్రతిభ కలిగిన కవి ఏదో ఒక సన్నివేశాన్ని కల్పించి కావ్యానికి దానిని ప్రధాన అంగంగా, ప్రాణభూతంగా మలచటం కూడా ప్రకరణ వక్రతే. ఇది రెండు విధాలుగా ఉంటుంది. 1) ఇతివృత్తంలో పూర్వంలేని దానిని చెప్పటం, 2) ఇతివృత్తంలో ఉన్నదాన్నే అనౌచిత్యాన్ని పరిహరించటం కోసం కొత్త పద్ధతిలో చెప్పడం.

దీనికి ఉదాహరణగా దుర్వాసుడు, శకుంతలను శపించిన ‘అభిజ్ఞాన శాకుంతల’ వృత్తాంతాన్ని వివరించాడు.

శ్రీనాథుని పద్యాల్లో ప్రకరణ వక్రత ద్వితీయ భేదాన్ని పరిశీలిద్దాం.

**రెండవ భేదం ఉదాహరణ–1**

బసవపురాణంలో ఉన్న విషయాన్ని కొంత మార్చి కూడా కథను నడిపించాడు శ్రీనాథుడు. ఇది కూడా ఔచిత్యంగా చెప్పవచ్చు.

మిండజంగముడు తలమాంసం అడిగినప్పుడు చెప్పే సమాధానం మూల బసవపురాణంలో ఇలా ఉంది.

**“తలసూచియైనను దనయుని మీఁది – వలపుదక్కింపంగవచ్చుఁబొమ్మనియొ**
**తలదాచుకొన్నారు; తగవయ్య! బాలు – తలగొని యిఁక మీరు ధన్యులుగారు**
**ఏమియు లేదు శిరోమాంసమిట్లు – నేమంబునకుఁ జెల్లునే? యాగమోక్తి**
**దాన ‘సర్వస్య గాత్రస్య శిరఃప్ర–ధానం’ బనెడు మాట గానేర దింక**
**ననవుడు బతియును నతివయు బెదరి – “యనఘ! మహాత్మ! యిట్లానతీఁదగునె**
**ఉపమింపఁ గేశదుష్టపరీతశాక – ముపహతం బనఁబడునోయని వెఱచి**
**పుచ్చితి మదియు నిప్పుడు చందనంగ – సెచ్చెరఁబాకంబు సేసెఁదా” ననుచు.**

**(బసవపురాణం. చతు. ఆశ్వా. పుట.116)**

హరవిలాసంలో ఇలా ఉంది. చూద్దాం.

తే॥ కటకటా మా వ్రతంబు భగ్నంబుఁజెందె
నేటిపారణమిది మాకు నేటి కింక
నుత్తమాంగపు మాంసము నుజ్జగించి
యేల యధమాంగ మాంసమే నెటు భుజింతు

(హర. ద్వితీ. ఆశ్వా. 128 పద్యం)

వ. "అనిన విని చిఱుతొండండు భయంపడి వెలవెలబాఱుఁచు
దిరువెంగనాంచి వదనంబాలోకించి యింక నెట్లనినం జిట్టమిడుచు నంతఁ
దలకాయ పొలమేలొగిరంబు ముందటంబెట్టి చందనిక యిదియేను
మొదలన బెడందకాంద్రగు యోగి బృందారకుల చందంబెఱింగినదాన
నగుటంజేసి పాకంబుఁ జేసియున్నదానఁ"

(హర. ద్వితీ. ఆశ్వా. 129వ వచనం)

బసవపురాణంలో శిరోమాంసం వండలేదంటే వెంట్రుకలున్నాయి. అందుకే వండలేదని చెప్పడం అనౌచిత్యంగా పరిగణించాడు శ్రీనాథుడు. అంత శరీర మాంసాన్ని వండినవారు ప్రధానమైన శిరస్సును వదిలివేయటం సరికాదు. అందుకే 'అనౌచిత్యంబు పరిహరించి, ఔచిత్యంబనుసరించి' అంటాడు శ్రీనాథుడు. జంగములు తలమాంసం తింటారని తెలిసినదాన్ని అందుకే వండి తెచ్చాను. అని హరవిలాసంలో ఉండటం మూలంలో ఉన్నదాని కన్నా కొంత ఔచిత్య పోషణగా అనిపించింది. ఇలా కొంత మార్పు చేయటం కూడా కుంతకుడు ద్వితీయ వక్రత భేదంగా చెప్పాడు.

**రెండవ భేదం ఉదాహరణ–2**

హరవిలాసంలో చిరుతొండనంబి కథ ప్రారంభానికి ముందుగల దుర్వాసమహాముని శాప విషయం తర్వాత గల కథకు ప్రాణభూతం అయ్యింది. ఇదే ఘట్టాన్ని ప్రకరణ వక్రత భేదంగా జంధ్యాల జయకృష్ణ బాపూజీ కూడా చెప్పారు.

తే॥ బదరికాశ్రమ భూమిఁదాత్పర్యనిష్ఠఁ
దపము సేయుచు నుండె శాంతత వహించి
క్రోధ సంవర్ధమాన తపోధనుండు
ఘనుఁడు దుర్వాసుఁడను మహాముని వరుండు

(హర. ప్రథ. ఆశ్వా. 38 పద్యం)

దుర్వాస మహాముని బదరికా వనంలో నిష్ఠతే, శాంతితో తపస్సు చేస్తున్నాడు. పూజ పూర్తిచేసి ఆశ్రమంలో ఉన్న లేడి పిల్లలకు పాయసాన్నం తినిపిస్తుండగా చూసిన ప్రమథుడు అయిన తుంబురుడు ఆకాశంలో సంచరిస్తూ చిటికె వేయగా ఆ శబ్దం విని లేడిపిల్లలు చెల్లాచెదురైపోతాయి. వెంటనే దుర్వాసుడు శపిస్తాడు.

**శా॥ హుంకారం బొనరించి తుంబురునితో నోరీ! దురాచార! నా**
**జింక ల్భుక్తి గొనంగనేమిటికిరా చేచిట్టమ్రోయించి యా**
**తంకంబున్ ఘటియించి తిట్టియపరాధంబేను సైరింతునే?**
**యింకన్మర్త్యుఁడవై జనింపుమహిలో నింకంగ నీ గర్వమున్.**

(హర. ప్రథ. ఆశ్వా. 40 పద్యం)

కోపంతో తుంబురున్ని ఓరీ! దుర్మార్గుడా జింకలు తినగా ఆటంకం కల్పించావు. నీవు గర్వం నశించేటట్టు భూలోకంలో జన్మిస్తావంటాడు.

**క॥ కరుణింపు సమాశ్రితభయ**
**హరణ! సురాసురకిరీట హరిహయరత్న**
**స్ఫురణా! మధుకర పరివృత**
**చరణా! యత్యంతదాంతి శాంత్యాభరణా!**

(హర. ప్రథ. ఆశ్వా. 43 పద్యం)

ఆశ్రయించిన వారి భయం పోగొట్టే మిక్కిలి దాంతి, శాంతి కలవాడా రక్షించు అని వేడుకొనగా దుర్వాసుడు శాంతించి ఇలా అంటాడు.

**మ॥ చిఱుతొండండను పేర వైశ్యకుల మౌర్జిత్యంబునం బొంగఁగాఁ**
**గఱకంఠుం దరుణేందు శేఖరుని షట్కాలంబు పూజించునెం**
**దఱు భక్తుల్దను వేఁడినన్ప్రమదమున్ దాత్పర్యమున్భక్తియు**
**న్వెఱపుంగల్గి తదీప్సితార్థములు గావించున్నిరాలస్యతన్**

(హర. ప్రథ. ఆశ్వా. ప.47)

చిరుతొండడనే పేరుతో వైశ్య కులంలో జన్మించి పూర్వజన్మ వాసన ఫలితంగా ఈశ్వరున్ని పూజిస్తూ, భక్తుల కోరికలను తీరుస్తూ ఉండమని చెప్తాడు. ఇలా చిరుతొండనంబి కథకు కావలిసిన

ఘట్టాన్ని ముందే సిద్ధం చేసుకున్నాడు కవి. ఇలా దుర్వాస శాపం ప్రాణభూతం కావటం ప్రకరణ వక్రత భేదంగా చెప్పవచ్చు.

### 6.1.3. ప్రకరణ వక్రత–మూడవ భేదం

ప్రకరణ వక్రతలో మూడవ భేదాన్ని ఇలా వివరించాడు కుంతకుడు.

**కా॥ ప్రబన్ధస్యైక దేశానాం ఫలబన్ధాను బన్ధవాన్,**
**ఉపకార్యోప కర్తృత్వ పరిస్పన్దః పరిస్ఫురన్.**
**అసామాన్య సముల్లేఖ ప్రతిభా ప్రతిభాసినః,**
**సూతే నూతనవక్రత్వం రహస్యం కస్యచిత్కవేః.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.5, 6)**

ప్రధాన ఫలం ఏదైతే ఉందో ప్రబంధానికి సిద్ధింపజేయడానికి సమర్థవంతమైన ప్రకరణాన్ని ఉపకార్యోపకారక భావముతో ప్రతిభావంతంగా సృజించటమే తృతీయ భేదము అని చెప్పాడు.

"దీని తాత్పర్యమేమనగా... నేర్పరియు, వక్రతాచమత్కారము కలవాడును అగు ఒకానొక కవియొక్క స్వభావసుందరమగు ప్రతిభచే ప్రకాశింపచేయబడుచున్నదియు అందమగు కూర్పుచే ప్రకాశించుచున్న ప్రబంధావయముల (ప్రకరణముల)కు ప్రధాన కార్యఫలముతో గల సంబంధముపై ఆధారపడి యున్నదియునగు అనుగ్యాహ్యానుగ్రాహక భావము, అలౌకికమగు వక్రతోల్లేఖ కృతమగు లావణ్యమును ఉద్దీపింపచేయును (అనగా ప్రబంధావయవములు ప్రకరణములు) ప్రధాన కార్యము యొక్క ఫలముతో సంబంధించినట్లు కూర్పవలెను. అపుడు ప్రధాన కార్యఫలము అనుగ్రాహ్యమగును. ప్రకరణములు అనుగ్రాహకములగును. ఇట్టి అనుగ్రాహ్యానుగ్రాహక భావమును కూర్చుటచే వక్రతా లావణ్యము ఇనుమడించనని యభిప్రాయము)" (రామచంద్రుడు, పుల్లెల. వక్రోక్తి జీవితం. 2007. పుట.412).

ఇందుకు కుంతకుడు పుష్పదూషితమును (సముద్రదత్తుని కథను), ఉత్తర రామచరితములోని జృంభకాస్త్ర ప్రయోగమును ఉదహరించాడు.

శ్రీనాథుని కావ్యాల్లో ప్రకరణ వక్రత మూడవ భేదాన్ని పరిశీలిద్దాం.

#### మూడవ భేదం ఉదాహరణ–1

ప్రబంధం ప్రధాన ఫలం సిద్ధించడానికి శ్రీనాథుడు మూలంలో లేనటువంటి నూతన వధూవరుల గృహప్రవేశ వర్ణనను కల్పించాడు. శ్రీ హర్షనైషధంలో ఆ ప్రకరణం లేదు.

సంస్కృతంలో పదిహేడవ సర్గలో 119వ శ్లోకంలో దమయంతి స్వయంవరాన్ని తెలుపుతూ ఈ శ్లోకం ఉంది. గమనించాల్సి ఉంది.

**శ్లో॥ నాగేషు సానురాగేషు పశ్యత్సు దివిషత్సు చ,**
**భూమిపాలం నలం భైమీ వరం సావవరత్ వరమ్.**

(హర్ష .నైష. సర్గ. 17. శ్లో.119)

ఆదమయన్తి అనురాగముతో నాగకుమారులు, దేవతలు చూస్తుండగా వారినందరిని గణింపక చక్రవర్తియైన నిషధ దేశపు రాజగు నలుని వరునిగా వరించింది అని భావం. ఇలా నలున్ని వరించిన తర్వాత ఇంద్రుని మాటలు విని రెచ్చిపోయిన రోషం గల కలిపురుషుని ఆగడాలను తెలియజేసాడు హర్షుడు. దాంతో 17వ సర్గ ముగుస్తుంది.

అష్టాదశ సర్గ ప్రారంభంలో ఈ శ్లోకాలను రాశాడు.

**శ్లో॥ సోఽయ మిత్థ మథ భీమనందినీం**
**దారసార మధిగమ్య నైషధః।**
**తం తృతీయ పురుషార్థ వారిధేః**
**పారలమ్భనతరీ మరీరమత్।**

(హ. నై. సర్గ–17. శ్లో–1)

ప్రసిద్ధుఁడైన నలమహారాజు పూర్వము వర్ణించిన విధంగా భార్యల్లో గొప్ప స్త్రీ రత్నమగు ఆ దమయంతిని పొంది ధర్మార్థకామమోక్షాలలో మూడవదైన కామమనే పురుషార్థ సముద్రానికి ఆవలిగట్టును పొందడానికి నౌక అయిన దమయంతిని రమింపజేసెనని భావం. ఈ విషయం చెప్పిన తర్వాత నేరుగా వివాహ సౌధ వర్ణన మూలంలో కన్పిస్తుంది. ఆ శ్లోక పంక్తులను గమనిద్దాం.

**శ్లో॥ ఆత్మవిత్సహ తయా దివానిశం**
**భోగభాగపి న పాప మాప సః**
**ఆహృతా హి విషయైనతానితా**
**జ్ఞానధౌ తమనసం న అమ్పతి**

(హ. నై. 18–సర్గ. శ్లో–2)

ఆత్మజ్ఞానం కలిగిన ఆ నలుడు దమయంతితో పగలు, రాత్రి గడపాలనే కోరికను కలిగి ఉన్నాడని తెలుపుతూ వారి సౌధాన్ని వర్ణిస్తూ ఇలా శ్లోకాన్ని రచించాడు.

శ్లో॥ న్యస్య మన్త్రిషు సరాజ్య మాదరా
దారరాధ మదనం ప్రియాసఖః
నైకవర్ణమణి కోటికుట్టిమే
హేమ భూమిభృతి సౌధభూధరే

(హ. నై. 18 సర్గ. శ్లో.3)

నలమహారాజు మంత్రులయందు రాజ్య భారాన్ని ఉంచి మణులతో పొదగబడిన, దివ్యమణుల సమూహం గల ప్రభావంతో వెలుగొందుతున్న, మేరు పర్వతాన్ని కూడా కోరిన విషయాల్లో సమకూర్చే విషయాల్లో అధిగమించేంతగా గొప్ప మేడ కలదని వర్ణిస్తాడు. అలాగే మేడ సౌందర్యాన్ని తెలుపుతూ ప్రతి గవాక్షంలో పచ్చ కర్పూరం, చందనం మున్నగువాటి చూర్ణాలను పట్టించడంతో దానిపైన వచ్చే గాలి చల్లదనాన్ని ఇస్తుందని, ఆ భవనం ముంగిళ్ళు, కుంకుమపువ్వు కస్తూరి లేపంతో అలుకబడిందని, మనోహరమైన వర్ణాలుగల పూల పడకతో ఆ మేడ శోభిస్తుందని చాలా శ్లోకాల్లో మేడ వర్ణన ఉంది. ముందుగా ఆ మేడను వర్ణించడానికి ముందు నలదమయంతులు వివాహానంతరం గృహప్రవేశం చేసినట్లు హర్షుడు వర్ణించలేదు. నేరుగా మేడ సౌందర్యాన్ని నలదమయంతుల శృంగారాన్ని విపరీతంగా వర్ణించాడు. శ్రీనాథుడు ఈ సందర్భంలో ఒక కొత్త ప్రకరణాన్ని ప్రవేశపెట్టాడు. అది మూలంలో లేదు. అదే గృహప్రవేశం. నలదమయంతు గృహప్రవేశ ఘట్టం మూడు పద్యాల్లో ఒక వచనంలో వర్ణించడం జరిగింది. లోక ప్రచారంలో వివాహనంతరం గృహప్రవేశం ఒక కార్యంగా ఉంటుంది. దానిని శ్రీనాథుడు స్వతంత్ర కల్పనతో రాశాడు. ఇది అమూలకం అయినప్పటి విహార సౌధం గూర్చి వర్ణించటం విశేషం కనుక నేరుగా విహార సౌధాన్ని వర్ణించాలంటే అక్కడ గృహప్రవేశ ఘట్టం తప్పనిసరని భావించి దీనిని రచించాడు. శ్రీనాథుని శృంగార నైషధంలోని గృహప్రవేశ పద్యాలను చూద్దాం.

తే॥ అవ్విధంబున నిషధదేశాధిరాజు
నగరు సొత్తెంచి యంతరాంతరములందు
దొరల మంత్రుల దండనాథులను నృపుల
నిజ నివాసంబులకు నన్పె నిలిచి నిలిచి

(శృ. నై. సప్త. ఆశ్వా.144 పద్యం)

ఆ విధంగా నిషధరాజైన నలుడు తనతో వచ్చిన సామంతరాజులను వారి గౌరవానికి తగిన రీతిగా వారి వారి నివాసాలకు పంపాడు.

**ఉ॥ పాయ దొలంగుఁ డంచుభయ పార్శ్వములం బగళంబు సేయుచుం**
**దోయజలోచనల్గొలిచి తోఁ జనుదేరఁగఁబెండ్లికూఁతు ర**
**త్యాయత వైభవ స్ఫురణ నంతిపురంబున కేఁగు దెంచెఁ బై**
**డాయఁగ జిడ్డివైచిన కడాని మెఱుంగు పసిండి పాలకిన్**

**(శృ. నై. సప్త. ఆశ్వా.145 పద్యం)**

తోయజ లోచనాలు గల పెండ్లికూతురు మేల్మి బంగారు పల్లకిలో మిక్కిలి ఐశ్వర్యంతో అంతఃపురములోకి ప్రవేశించిందని భావం. లోకరీతిని కవి వర్ణించాడు. ఇది శ్రీనాథుని కల్పనలో భాగం అలాగే మరొక పద్యాన్ని కూడా చెప్పి చివరకు పెళ్ళి కథ. గానాలు చేసారని చెప్తాడు. అలాగే వచనాన్ని రాసాడు. చూద్దాం.

**"వ॥ అనంతరంబు వధూవరులు లౌకిక వైదికాచార పారగులగు**
**పెద్దల పనుపున గృహప్రవేశ సమయోచితంబులగు**
**మంగళాచారంబులఁ బ్రవర్తించుచుండి రప్పుడు వివిధ శిల్ప**
**కల్పనా నిపుణులగు శిల్పి జనులు సుపర్వ పర్వత శిఖరోత్సేధంబగు**
**విహార సౌధం బలంకరించిరందు"**

**(శృ. నై. సప్త.ఆశ్వా.147)**

తర్వాత వధూవరులు ఆచార్యులు చెప్పినట్లు పెద్దల మాటలు వింటూ గృహప్రవేశ మంగళాచారాలను ఆచరిస్తున్నారు. అప్పుడు వివిధ రకాల నిపుణులు వారి వివాహ సౌధాన్ని అలంకరిస్తున్నారు అని వచన అర్థం.

నేరుగా మేడను అలంకరించడం అందులోకి వధూవరులు వెళ్ళటం అనేది కృత్రిమంగా ఉంటుందని భావించే శ్రీనాథుడు గృహప్రవేశ గానాలు, కథలు కల్పించినట్లు తోస్తుంది. గృహప్రవేశం తర్వాతనే విహార సౌధానికి ఎవరైనా వెళతారు కాబట్టి ఈ గృహప్రవేశ ఘట్టం విహార సౌధానికి ఉపకారకం అయ్యింది. విహార సౌధంలో నలదమయంతుల ప్రణయం, విహారం అనే ఫలం సిద్ధించడానికి ఇంటిలోకి ప్రవేశించటం, ఆ తర్వాత మేడ వద్దకు వెళ్ళటం సబబుగా ఉంది. గృహప్రవేశ ఘట్టం సమర్థవంతమైన ప్రకరణంగా చెప్పవచ్చు. ఇది కూడా ప్రకరణ వక్రతగా చెప్పవచ్చు.

**మూడవ భేదం ఉదాహరణ–2**

పురాణంలో కథను తీసుకొని స్వతంత్రంగా పెంచి పోషిస్తూ, కథకు భాగం కలుగకపోవటం అనేది ఒక వక్రత భేదంగా ప్రథమ భేదంగా కుంతకుడు చెప్పినట్లు ముందే వివరించుకున్నాము. శ్రీనాథుడు రాసిన హరవిలాస కావ్యంలో ఘట్టాలు వివిధ మూల గ్రంథాలనుండి తీసుకోబడినవి. చిరుతొండనంబి కథను పాల్కురికి బసవపురాణం నుండి గ్రహించి రెండు ఆశ్వాసాల్లో తీర్చిదిద్దాడు కవి. పద్య బసవపురాణంలోని చిరుతొండనంబి కథ సిరియాలుని కథగా కనిపిస్తుంది. పాత్రల పేర్లు కూడా భేదంతో కన్పిస్తాయి. హరవిలాసంలోని చిరుతొండనంబి కథను చెప్తూ శ్రీనాథుడు జంగమ వేషంలో శివుడు నంబి ఇంటికి రావడానికి ముందు తన దేహం చెమర్చగా పార్వతి అలిగినట్లు ఒక ప్రకరణాన్ని కల్పిస్తాడు. నిజానికి బసవపురాణంలో ఆ ఘట్టం లేదు. బసవపురాణంలోని సిరియాలుని కథలో పార్వతిదేవితో కలసి వచ్చినట్లే లేదు. కానీ శ్రీనాథుడు ఆ ప్రకరణాన్ని సృష్టించాడు. పార్వతీదేవితో కలసి చిఱుతొండని ఇంటికి ఈశ్వరుడు రావాలంటే ముందుగా ఒక ప్రకరణాన్ని సృష్టించాలని కల్పనలు చేసాడు. పార్వతీ దేవి శివునితో ఇలా అంటుంది.

**చ॥ అమరవరేణ్య! ప్రేంకణములాడెడు వేలుపులేమజూచియే**
**చెమరిచితంచుఁ గేళి సరసీ రుహ మెత్తిప్రతాపమొప్పఁగా**
**హిమగిరి రాజనందన మహేశ్వరు మొత్తెమధూళికా పరా**
**గములు శశాంక శేఖరుని కన్నులమూఁటను జిందునట్లుగన్**

**(హర.ప్రథ. ఆశ్వా. 61 పద్యం)**

నాట్యమాడుతున్న అప్సరసను చూసి నీ దేహమును చెమర్చావు అని కోపంతో లీలారవిందమును పరమేశ్వరుని మూడుకన్నులలో పుప్పొడి చిందేటట్టుగా కొడుతుంది. పార్వతీ దేవి అలకను బాగా వర్ణించాడు శ్రీనాథుడు. కథాగమనానికి ఉత్సుకతను ప్రేరేపించడానికి చేసిన ప్రకరణం. అప్పుడు శివుడు పార్వతిని బుజ్జగిస్తూ కాంచీపురంలోని చిఱుతొండని భక్తిని తెలుపుతూ

**శా॥ ఆ కాంచీ నగరంబునందు శివభక్త్యాచార సామ్రాజ్య ల**
**క్ష్మీ కంఠా భరణంబు నిర్మల వణిక్శ్రేష్ఠాన్వయాంభోధికిన్**
**రాకాపూర్ణ నిశాకరుండు చిఱుతొండ శ్రేష్ఠుఁడయ్యుత్తముం**
**డే కాలంబును బాయకుండు గిరిపుత్రీ! జంగమారాధనల్**

**(హర.ద్వితీ.ఆశ్వా.4 పద్యం)**

కాంచీపురములో శివభక్తి అనెడి ఆచార సామ్రాజ్యానికి కంఠాభరణమైనవాడు, మచ్చలేని

వ్యాపార కులాంబోధికి పూర్ణచంద్రుని వంటివాడు చిఱుతొండడను శ్రేష్ఠుడు గలడు. ఎప్పుడు జంగమారాధనలు చేస్తూ ఉంటాడని అతని గూర్చి తెలిపాడు. ఒకరోజు ఒక జంగముని సేవించుటలో భాగంగా చేగాను ఆడిన చెరుకు రసంతో శివున్ని అర్చించుటకై వెళ్ళి చెరుకు మోపును ఎత్తలేక చతికిల పడగా సహాయమునుచేసాను. ఆ చెమరించుటయే ఈ చెమరించుట సుమీ అనిశివుడు తెలుపగా

**వ. "అనినం బార్వతి యాశ్చర్యంబంది యాసర్వజ్ఞుతోడ,**
**దేవా! యవ్వీరమహేశ్వరు నాకుం జూడవలయు గంచికిం**
**దోడ్కొనిపోవెయని ప్రార్థించిన నప్పంచవదనుండు సమీపంబునం**
**గాచియున్న పాకశాసనుం గాంచి యిట్లని యానతిచ్చె"**

**(హర.ద్వితీ.ఆశ్వా. వచనం.14)**

శివునితో, పార్వతి వస్తాననటం, ఇంద్రునికి వర్షాలు కురిపించమని చెప్పటం మూలంలో లేని ప్రకరణం కానీ శ్రీనాథుడు ఔచిత్యవంతమైన కల్పనలు చేసి కథాగమనాన్ని చక్కగా నిర్వహించాడు కుంతకుడు చెప్పిన ప్రకరణ వక్రతకు ఉదాహరణగా చెప్పవచ్చు. శివభక్తుని గూర్చి తెల్పడానికి శివుడు చెమర్చటం అనే ఘట్టం మూలంలో లేకపోయిన ప్రధాన ఫలం కోసం కవి సృష్టించాడు. రాబోయే కథను తెల్పటానికి ఈ ప్రకరణం ఉపకారంగా మారింది కనుక ఇది ప్రకరణ వక్రతగా చెప్పవచ్చు.

### 6.1.4. ప్రకరణ వక్రత–నాల్గవ భేదం

**నాల్గవ భేదం**:

నాల్గవ భేదాన్ని వివరిస్తూ ఇలా వివరించాడు.

**కా॥ ప్రతిప్రకరణం ప్రౌఢ ప్రతిభాభోగయోజితః,**
**ఏక ఏవాభిదేయాత్మా బధ్యమానః పునఃపునః.**
**అన్యూన నూతనోల్లేఖ రసాలంకరణోజ్జ్వలః,**
**బధ్నాతి వక్రతోద్భేద భంగీ ముత్పాదితాద్భుతామ్.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.7, 8)**

"ప్రౌఢమగు ప్రతిభా వైశాల్యముచే కూర్చబడినదియు. ప్రతి ప్రకరణము నందును మాటిమాటికి నిధింపబడునదియు, అన్యూనమును నూతనమును అగు ఉల్లాసము గల రసముచేతను అలంకారముల చేతను ప్రకాశించునదియు అగు ఒకే వస్తు స్వరూపము,

ఆశ్చర్యజనకమగు వక్రతా వికాస భంగిని ఏర్పరచును" (రామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.416).

ఒకే విషయాన్ని అనేక ప్రకరణాల్లో మాటిమాటికి కథను అనుసరించి చెప్పడం, అది కూడా రసమనోజ్ఞముగా చెప్పటం కూడా ప్రకరణ వక్రతే కుంతకుడు ఇందు ఉదాహరణగా హర్షచరిత్ర నుండి కొన్ని ఘట్టాలను, తాపసవత్స రాజ చరితమునుండి కొన్ని ఉదాహరణలను చెప్పాడు. రఘువంశంలోని నవమసర్గలో దశరథుని మృగయా విహార వృత్తాంతము చెప్పుతూ దశరథుడు వృద్ధులకు అంధ తాపసుల కుమారుని చంపెనని ఒకే వాక్యంలో చెప్పకుండా కవి తన ప్రతిభతో వేటను, అడవిని కొన్ని శ్లోకాలతో వివరించాడు. ఇలా ఏక వాక్యంలో చెప్పవీలైన అంశాన్ని కొన్ని శ్లోకాలలో వర్ణించటం కూడా ప్రకరణ వక్రతగా కుంతకుడు తెలియబరిచాడు.

ప్రకరణ వక్రత నాల్గవ భేదానికి గాను శ్రీనాథుని ఉదాహరణలను పరిశీలిద్దాం.

**నాల్గవ భేదం ఉదాహరణ–1**

ఒకే విషయాన్ని ఎక్కువగా వర్ణిస్తూ చెప్పడం కూడా ప్రకరణ వక్రతే. శ్రీనాథుడు హరవిలాసంలో ఇంద్రుడు కాంచీపురంలో వర్షం కురిపించగా జరిగిన విశేషాలను చాలా పద్యాల్లో వర్ణించాడు. మూలంలో లేదు కానీ ఎడతెరపిలేని కుంభవృష్టి ఉన్నప్పటికీ శైవాచార దీక్ష తప్పని భక్తునిగా చిరుతొండడిని ప్రతిష్ఠించాలనే ఉద్దేశ్యంతో కథలో కల్పించిన ప్రకరణాలు ఇవి. ఇందులో వర్షం కుంభవృష్టిగా కురిసింది అని చెప్పడానికి 14 పద్యాలలో, నాలుగు వచనాలలో వర్ణించాడు. ఇది కవి కౌశలానికి తార్కాణం. కొన్ని పద్యాలను చూద్దాం.

**క॥ ఉఱుముటిమి మూలగాడ్పులు**
**సఱచి విసరఁజొచ్చె మదసంహరుదెసఁగ్రొ**
**మ్మెఱుఁ గుద్భవించెఁ గప్పలు**
**గఱవఱ గఱవఱగయనుచు గట్టున నఱచెన్**

**(హర. ద్వితీ. ఆశ్వా.18 పద్యం)**

ఉరుములు, గాడ్పులు, ఉత్తర దిక్కున వచ్చినవని వర్షాగమన సూచనలను చెప్పాడు.

**ఉ॥ తూనిఁగ లాడఁజొచ్చె దివిఁధూళి భ్రమింపఁగఁ జొచ్చెఁబిచ్చుకల్**
**మానిక యుబ్బె గబ్బులుఁగు మాటిమాటికిఁ గ్రొల్చెఁ గొమ్మపై**
**వాన యవశ్యమింక బహువాసరముల్ జడి పట్టునం చొగిన్**
**వానికి వాని కాడిరి యవారణఁ బౌరులు కంచిలోపలన్**

(హర. ద్వితీ. ఆశ్వా.19 పద్యం)

ఆకాశమందు తూనీగలు ఆడుచుండెను. ధూళి తిరుగబడుతుంది. పిచ్చుకలు మారుతున్నాయి. గుబ్బులుగు కొమ్మపై ఊరికే అరుస్తుంది. చాలా రోజుల వర్షానికి పౌరులు ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. స్వాభావిక వర్ణన చేసాడు.

**మ॥ గ్రహసిద్ధాంత కళా విదుత్ నలిలనక్షత్రంబు నీ హారరు**
**క్షహవాసంబున నభవీథిఁ బరివేషస్థాయియైయుండుటన్**
**బహు వర్షంబటఁ గల్గునంచుఁదమలో భాషింపఁగాఁ గంచిలో**
**గృహమేధుల్ భయమంది రింధనతృణక్లేశంబు చింతించుచున్**

(హర. ద్వితీ. ఆశ్వా.20పద్యం)

జ్యోతిష్కుల ఆకాశమున, పూర్వాషాడ నక్షత్రం చంద్రున్ని సమీపించి ఉంది. ఎక్కువగా వర్షం పడుతుందని తెలిపారని జ్యోతిష్య సంబంధ విషయాన్ని తెలిపాడు కవి. ఒకే విషయాన్ని ఎక్కువసేపు వర్ణిస్తున్నప్పటికి విసుగు రాకుండా రచన చేస్తూ ఆహ్లాదాన్ని కలిగించే చమత్కృతి ప్రతిభగల కవులకే కలదు. అందుకే ఏక వర్ణ్యాంశం కూడా ప్రకరణ వక్రతగా సూచించాడు కుంతకుడు. ఈ వర్ణనలే కాదు దేవదారు వనవిహార వర్ణనలు కూడా ప్రకరణ వక్రత భేదంగా చెప్పవచ్చు.

**నాల్గవ భేదం ఉదాహరణ–2**

ఒకే విషయాన్ని ప్రతి అంకంలో చెప్పడం కూడా ప్రకరణ వక్రతే. విసుగు లేకుండా ఒకే విషయాన్ని సందర్భానుసారంగ సౌందర్యంగా మలచటం అని అర్థం. శ్రీనాథుడు భీమఖండంలో సప్తగోదావరిని వర్ణిస్తూ సందర్భం వచ్చినచోటల్లా వివరించాడు. ప్రతీ ఆశ్వాసంలో సప్త గోదావరి ప్రస్తావన కచ్చితంగా ఉంటుంది.

**క॥ అదియాదిగఁ దీర్థంబులు**
**పదియును రెండయిన తీర్థపాలీ జాతం**
**బదియును నెక్కువయై యు**
**న్నది సప్తతటంబు నందునన్మని వర్యా!**

(భీమే. తృతీ. ఆశ్వా.162 పద్యం)

శివుడవతరించినప్పటి నుండి పన్నెండు తీర్థాలు ఏర్పడ్డాయి. ఆ తీర్థ స్థాన సమూహములో ఎక్కువ భాగము సప్త గోదావరి ఉందని అగస్త్యుడు వ్యాసునికి పంచ తీర్థాల గూర్చి చెప్పే

సందర్భంలో వివరించాడు. అలాగే అత్రి, జమదగ్ని, భృగువు, వసిష్ఠుడు మున్నగు మహర్షులు నారదమునిని భూమండలంలోని పుణ్యతీర్థాలు చెప్పుమని అడుగగా నారదుడు సప్తగోదావరిని వివరిస్తూ ఇలా అంటాడు.

**తే॥ అఖిల తీర్థోత్తమోత్తమంబనఘులార!**
**పావనంబైన సప్తగోదావరంబు**
**తనకుఁదాన మహానదీతటమునందు**
**నెలమినున్నాఁడు భీమేశ్వరేశ్వరుండు**

**(భీమే.చతు.ఆశ్వా.18 పద్యం)**

ఇలా ఒకే విషయాన్ని సందర్భానుగుణంగా పొందిక కుదిరేలా ప్రకరణాన్ని కల్పించుకొని నదీ పవిత్రతను పొగడటం కవి నేర్పుకి చిహ్నం లాంటిది. ఇది కూడా ఒక వక్రత భేదంగా ప్రకరణంలో చెప్పాడు కుంతకుడు. ఇంకా చాలా పద్యాల్లో గోదావరీ వర్ణనం ఉంది.

### 6.1.5. ప్రకరణ వక్రత – ఐదవ భేదం

కుంతకుడు ఐదవ భేదాన్ని ఇలా వివరించాడు.

**కా॥ కథావైచిత్ర్యపాత్రం తద్వక్రిమాణం ప్రపద్యతే,**
**యదంగం సర్గబంధాదేః సౌందర్యాయ నిబధ్యతే.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.9)**

కావ్య సౌందర్యం కొరకు ఏ ప్రకరణము కూర్చబడుతుందో అది కథావైచిత్ర్య వక్రత అవుతుంది. కావ్య సౌందర్యానికి, కథావైచిత్రికి అనుగుణంగా జలకేళి, పుష్పచయము అనునవి తోడ్పడుతాయి. కనుక కావ్యంలో జలక్రీడా పుష్పచయం ఉండటం కూడా ప్రకరణ వక్రతలో భాగంగా తెలియజేయడమైంది. కుంతకుడు ఈ ప్రకరణ వక్రత భేదానికి గాను రఘువంసమునందలి షోడశసర్గములోని కుశజలక్రీడా వృత్తాంతమును వివరించు శ్లోకాలను ఉదహరించాడు.

**ఐదవ భేదం ఉదాహరణ–1**

కావ్య సౌందర్య కోసం కాశీ పట్టణం విశిష్టతను తెలియజేస్తూ కాశీఖండంలో వారణాసీ వర్ణనను 2వ ఆశ్వాసంలో 45వ పద్యం నుండి 58వ పద్యం వరకు రచించాడు. వాటిని గమనిద్దాం.

**తే.గీ.॥ ఎన్నడుఁను సేగి లేనట్టి యిమ్మహాశ్మ**
**శాసనమునఁ గాపురంబున్న జంతువులకు**

నేటి నాకంబు? పున్నియంబెడలి నప్పు
డొఱకమునఁ గూలవలయుఁ గీలూడినట్లు

(కాశీ. ద్వితీ.ఆశ్వా.45 పద్యం)

ఏనాటికీ హాని లేని ఈ కాశీ క్షేత్రంలో కాపురం ఉంటున్న ప్రాణులకు స్వర్గం కంటే భద్రమైన ప్రదేశం కాశీ పట్టణం అని అర్థం.

తే.గీ.॥ అపునరావృత్తి శంభులోకాధివాస
సౌఖ్య మొనఁగూడు నిచ్చోటి జంతువులకుఁ
గాన మనకంటెఁ గడుమేలు కాశినుండు
కీట పక్షి సరీసృప క్రిమికులంబు

(కాశీ.ద్వితీ.ఆశ్వా.46 పద్యం)

ఇంద్రాది పదవులలో ఉన్నవారికి స్థానభ్రంశ భయముంది కానీ కాశీ పట్టణంలో క్రిమీ కీటకాలకు కూడా పదవీ భంగ భయం లేదు. అంటే పునరావృత్తి లేని శాశ్వత శివలోకనివాస సౌఖ్యము ననుభవిస్తున్నాయని భావం.

సీ॥ కాశికానగరంబు కడసీమమున నున్న
చండాలుఁ బోలఁ డాఖండలుండు
నానంద వనములో ననశనస్థితి నున్కి
భువన సామ్రాజ్య వైభవముఁబోలు
నవిముక్త దేశస్థుఁడయ్యేనేఁ బతితుండు
నశ్వమేథాధ్వరాహర్తదొరయు
వారాణసీ సంభవంబైన మశకంబు
నైరావణముతోడ నవఘళించు

తే.గీ.॥ నాటుకొని శ్రీ మహాశ్మశానమున నున్న
యణుక నగ్నాల? వటుఁడైన నా గ్రహమున
గర్వితోద్ధతి నేతెంచు కాళరాత్రి
మృత్యు దేవత మునిపండ్లు మెఱుకఁ జాలు

(కాశీ.ద్వితీ.ఆశ్వా.47 పద్యం)

కాశీనగరం వెలివాడలో ఉన్న పెద్దకులంవాడితో త్రిలోకాధి పతియైన ఇంద్రుడు కూడ సరిపోలడు. ఆనందవనములో తిండికి లేక పస్తులు ఉండే పరిస్థితి కూడా సకల భువన సామ్రాజ్య వైభవాన్ని సరిపోలి ఉంటుందని. అవిముక్త దేశనివాసి అయిన ఎంతటి భ్రష్టుడైన అశ్వమేధయాగం చేసిన పుణ్యపురుషునితో సాటికి వస్తాడు. వారణాసిలో పుట్టిన దోమ కూడా ఐరావతంతో సరితూగుతుంది. చిన్న వయస్సు గల ప్రళయకాలంలో ఆగ్రహించి వచ్చే మీదబడుతున్న మృత్యు దేవత యొక్క ముందటి పండ్లను పెరికి వేయగలదని భావం.

**తే.గీ.॥ ఉత్తరోత్తర మభివృద్ధి నొందుచుండుఁ**
**గాశిధర్మార్థ కామమోక్షములు నాల్గు**
**చంద్రకళయట్లు శుక్ల పక్షంబు రేలు**
**నాఁడు నాటికి నభివర్ధనంబు నొందు**

**(కాశీ.ద్వితీ. ఆశ్వా.52 పద్యం)**

శుక్లపక్ష రాత్రుల్లో చంద్రకళ ఏ విధంగా ఉత్తరోత్తరాభివృద్ధి పొందుతుందో అదే విధంగా కాశీనగరంలో ధర్మార్థకామమోక్షాలు ఉత్తరోత్తరాభివృద్ధిని పొందుతాయని కాశీపట్టణ విశిష్టతను తెలియజేస్తూ అలాంటి నగరంలో లోపాముద్రదేవి, అగస్త్యుల పర్ణశాల ఉన్నదని తెలియజేయడానికి మహోన్నతులుగా వారిని చిత్రించడానికి వారణాసీ వర్ణన చేయడం కావ్య సౌందర్యోపస్కారకమైన ప్రకరణంగా చెప్పవచ్చు.

**ఐదవ భేదం ఉదాహరణ–2**

శృంగార నైషధంలో నలుని ఉపవన విహారంలో శ్రీనాథుని రచనా పాటవం గమనిస్తే ది కూడా ప్రకరణ వక్రతగా తోస్తుంది.

**తే॥ పత్త్రముల మీఁద మూఁగిన భ్రమరకులము**
**హర విసర్జన జనిత దుర్యశముఁబోలఁ**
**గమియ విచ్చిన గేదంగి కన్నె పువ్వుఁ**
**గౌతుకము పల్లవింపంగఁ గాంచె విభుఁడు**

**(శృ.నై. ప్రథ.ఆశ్వా.92 పద్యం)**

శివపూజకు మొగలి పువ్వు నిషిద్ధం. మొగలి వికసించినపుడు దాని పరిమళం కోసం మూగిన తుమ్మెదల గుంపు నెత్తిమీద అపకీర్తో అన్నట్లు ఉంది. ఆ మొగలి పూవులను చాలా ప్రేమతో నలుడు చూసాడని అర్థం.

సీ॥ శేష పుచ్ఛ చ్ఛాయఁ జెలువారు బిసములు
తన్మగ్న సురదంతి దంతములుగ,
నిండార విరిసిన పుండరీక శ్రేణి
యామినీ రమణ రేఖాళి గాఁగఁ
బ్రతిబింబి తోపాంత బహుల పాదపములు
గర్భస్థ శైల సంఘములుగాఁగఁ
నేక దేశంబున నిందీవరంబులు
కాలకూట మయూఖ ఖండములుగ

తే॥ బాలశైవాల వల్లరీ జాలకంబు
బాడబానల భవధూమ పంక్తిగాఁగ
వారిరాశియుఁ బోలె గంభీరమైన
ఘన తటాకంబుఁ గాంచె నజ్జనవిభుండు

(శృ.నై.ప్రథ.ఆశ్వా.98 పద్యం)

ఆ రాజు అనంతుని తోక వన్నెతో చెలువారే తామర తూండ్లు కలిగిన బాగా వికసించిన తెల్ల తామరల వరుసలు గలిగినట్టి, సమీపంలో గల చెట్ల ప్రతిబింబాలు గలిగినట్టి, నల్ల కలువలు కలిగినట్టి, లేత నాచుగల, లోతైన సద్రమో అన్నట్లున్న చెరువును చూసాడు.

సీ॥ విలులిత జంబాల పులిన భాగమున ను
ద్దండ పద్మాత పత్రంబు నీడఁ
గమలకాండ కఠోర కంట కాంకుర పంక్తి
నొయ్యనఁ గంధరం బొరసికొనుచు
నొంటి కాలనె నిల్పి యూర్మిమారుతములఁ
జిగురు ఱెక్కల ఱేకు తెగయుచుండ
విరళమై పక్షతి ద్వితయంబు వెడజాఱఁ
జంచు లొకించు కాకుంచితముగ

తే॥ వరుణ రాజున కిడిన చామరము వోలెఁ
బొడవు మిగిలిన పొందమ్మి పువ్వుఁ బోలె
నిబిడ నిద్రాభిముద్రిత నేత్రమైన

రాజహంసంబుఁగాంచె నా రాజసుతుఁడు

(శృ.నై.ప్రథ.ఆశ్వా.ప.100)

ఆ రాజసుతుడైన నలుడు, తామరాకు గొడుగు నీడలో, తామరకాడకు మెల్లగా మెడను రాసుకుంటూ, రెక్కలను కదిలిస్తూ, నోరు కొంచెం తెరుస్తూ, కళ్ళను నిద్రచేత మూస్తూ ఉన్న బంగారు వర్ణంగల రాజహంసను చూశాడని భావం.

ఇక్కడ హంస దౌత్యానికి రంగం సిద్ధం చేయడానికి హంస ప్రస్తావన అవసరం. అందుకుగానూ తటాక ప్రస్తావన తీసుకొచ్చి అనుకూల పరిస్థితిని ఏర్పరుస్తూ రాజు ఉపవన విహారాన్ని కవి అద్భుతంగా వర్ణించాడు. కావ్య సౌందర్యానికి వనవిహారఘట్టం సౌందర్యహేతుకమైనందున ఇది ప్రకరణ వక్రతలో ఐదవ భేదంగా చెప్పవచ్చు.

**ఐదవ భేదం ఉదాహరణ–3**

వ్యాసమహర్షి తన శిష్యులకు దక్షారామ క్షేత్ర విశేషాలను వివరించు సందర్భంలో కవి చేసిన సూర్యాస్తమ, చంద్రోదయ వర్ణనలు అద్భుతమైనవి. సూర్యాస్తమయాన్ని వర్ణిస్తున్న పద్యం గమనిద్దాం.

**తే॥ అల్లనల్లన గగన మధ్యమున నుండి**
**వ్రాలెనస్త్రాద్రి కరుణసారథి రథంబు**
**పశ్చిమాంభోధి మారుతాస్ఫాలనమునఁ**
**గేతనము మీఁది పసిఁడి కింకిణులు మొరయ**

(భీమే.ద్వితీ.ఆశ్వా.24 పద్యం)

పడమటి సముద్ర వాయువులచే జెండాపైన బంగారు గంటలు మోగుతుంటే ఆకాశం మధ్య నుండి సూర్య రథం పడమటి కొండపై దిగిందని అద్భుత వర్ణన ఇది. అలాగే చంద్రోదయ వర్ణన పద్యాన్ని చక్కగా తీర్చిదిద్దాడు.

**ఉ॥ ఆతత లీలఁగోమల నవాంశుక పాళి మహాంధకార సం**
**ఘాతము మీటె నద్భుతముగా శశిలాంఛనుఁడభ్రవీథికిన్**
**శ్వేత వరాహమూర్తియగు వెన్నుఁడుప్రన్నని యొంట కోఱధా**
**త్రీతల మెంత యంతయు ధరించిన యట్టి విజృంభణంబునన్**

(భీమే.ద్వితీ.ఆశ్వా.ప.39)

వరాహావతారమెత్తి విష్ణువు తన తెల్లని ఒంటికోరతో భూగోళమునంత అవలీలగా పైకెత్తినట్లు ఆకాశంలో చీకట్ల సమూహాన్ని చంద్రుడు తోసివేస్తున్నాడని భావం.

**తే॥ అర్థమండలముదయించు నమృతభానుఁ**
**డుదయ రాగంబుతోఁ గూడ నొప్పుమిగిలెఁ**
**బ్రకట తాంబూల రాగ సంకర్తమైన**
**ప్రాగ్దిశా కాంత బింబాధరంబు వోలె**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.140 పద్యం)**

ఎర్రదనంతో ఉదయిస్తున్న చంద్రుని అర్ధ బింబం తాంబూలం వేసుకోవటం వలల్ ఎర్రబడ్డ తూర్పు దిక్కు అనే స్త్రీ పెదవిగా ఉందని భావం. అద్భుత వర్ణన.

**సీ॥ అభిషేక మొనరించు నమృతధారావృష్టి**
**మదనాంతకుని ముక్తిమంటపికకు**
**నలవోకగా విశాలక్షీ మహాదేవి**
**నిద్దంపుఁజెక్కుల నీడఁజూచు**
**నెరియించు మిన్నేటి యిసుక తిన్నెలమీఁదఁ**
**జక్రవాకాంగనా సముదయంబు**
**డుంఠి విఘ్నేశునిష్ఠుర కంఠవేదిపైఁ**
**గౌదమ చుక్కలరాజుఁ గుస్తరించుఁ**

**తే॥ గాయు వెన్నెల యానంద కాననమునఁ**
**గాలభైరవు దంష్ట్రకు డాలు కొలుపు**
**విధుఁడు వారణాసీ సోమవీథి చక్కి**
**నభ్ర ఘంటాపథంబున నరుగునపుడు**

**(భీమే.ద్వితీ.ఆశ్వా.44 పద్యం)**

చంద్రుడు కాశీ నగరంలో ఆకాశ మార్గంలో వెళుతున్నప్పుడు విశ్వేశ్వరుని ముక్తి మంటపాన్ని వెన్నెల వర్షంతో అభిషేకం చేస్తాడు. విశాలాక్షి చెక్కిళ్లపై ప్రతిబింబిస్తాడు. గంగానది ఇసుక తిన్నెలపై చక్రవాకాంగనలను బాధపెడతాడు. డుంఠి విఘ్నేశ్వరుని కంఠ సమీపములో ఉన్న నెలవంక రేకను లాలిస్తాడు. కాశీ అంతా వెన్నెలకాని క్షేత్రాన్ని రక్షించే కాలభైరవుని కోసం కాంతినిస్తాడు అని వ్యాసుడు కాశీ నగర విశిష్టతను తెలుపుతూ చేసిన చంద్రోదయ వర్ణన వ్యాసుని

మానసిక స్థితిని, కాశీని ఎడబాయు వేదనను తెలియజేస్తున్నాయి. కావ్యానికి ఈ ప్రకరణం చేకూర్చడం వలన కాశీ సౌందర్యం, విశిష్టత తెలియవచ్చాయి.

**ఐదవ భేదం ఉదాహరణ–4**

కాశీఖండంలో ఓంకారాదులైన ఎనభై రెండు లింగాలు ఉన్నాయని అవి కాకుండా వీరేశ్వరుడనే లింగం కాశీలో ఉందని తెలుపుతూ వీరేశ్వర ప్రభావ వర్ణన చేసాడు కవి. ఆ సందర్భంలో ప్రభాత వర్ణన ఉండగా ఆ వర్ణన మూలంలో లేదని కవి కల్పితమని కాశీఖండ వ్యాఖ్యానం చేసిన మల్లంపల్లి శరభేశ్వర శర్మ చెప్పుతూ "జాతి వార్తా సుభగమైన యీ ప్రభాత వర్ణనము శ్రీనాథకవి సార్వభౌముని యుపజ్ఞః దీనికి మూలము లేదు" (కాశీఖండం. శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. 2012. పుట.522) అన్నాడు. కావ్యం సౌందర్యం కోసం చేసిన ఏ వర్ణనైనా ప్రకరణ వక్రతగా కుంతకుడు 5వ వక్రత భేదంగా తెలిపాడు. ఆ పద్యాన్ని పరిశీలిద్దాం.

**సీ॥ ప్రథమసంధ్యాకాల బలిశంఖనినదంబు**
**ప్రభవించె శ్రీవిశ్వవిభుని నగరఁ**
**గదిసెనంగుళి యుగ్మకంబంతరము కాఁగ**
**గగనగంగా రథాంగద్వయంబు**
**నెఱయంగఁ గైసేసి నిలువుటద్దము చూచె**
**నవిముక్తమున విశాలాక్షి గౌరి**
**'కొక్కెరొకో' యని కుక్కుటంబులు గూసెఁ**
**గడఁగి కుక్కుట చతుష్కంబు నడుమఁ**
**తే॥ బ్రహరిఁ దిరుగుట చాలించి భైరవుండు**
**గవని మొగసాల యరుగుపైఁ గన్నుమొగిచె**
**దుంఠివిఘ్నేశుఁ డొనరగండూషసేసి**
**యుమిసె వినువీథిఁ జంద్రకుండోదకములు**

**(కాశీ.తృతీ.ఆశ్వా.237 పద్యం)**

శ్రీ విశ్వనాయకుని నగరం నుండి మొదటి సంధ్యాకాల శంఖానినదాలు ఉదయిస్తున్నాయి. ఆకాశగంగ సైకతాల మీద చక్రవాకాలు తమ నడుమ రెండు వ్రేళ్ళు మాత్రమే ఎడం కలిగే విధంగా డాసి జతకట్టాయి. అవి ముక్తసీమలో శ్రీ విశాలక్షీదేవి నిండార అలంకరించుకొని నిలువుటద్దంలో తన నీడ చూసుకొంటుంది. కుక్కుట మండపం నడుమ మెడలు రిక్కించి కొక్కొరోకో అని కోళ్ళు

కూస్తున్నాయి. ప్రహరి తిరగటం ఆపి మొగసాల అరుగుమీద క్షేత్రపాలకుఁడైన భైరవస్వామి కన్ను పడిందని ప్రభావవంతంగా ప్రభాత వర్ణన చేసాడు. మూలంలో లేని వర్ణన కావ్య సౌందర్య హేతువు కావటం మూలాన ప్రకరణ వక్రత.

### 6.1.6. ప్రకరణ వక్రత–ఆరవ భేదం

కుంతకుడు ఆరవ భేదాన్ని వివరిస్తూ...

**కా॥ యత్రాంగిరస నిష్యన్దనికషః కోఽపి లక్ష్యతే,**

**పూర్వోత్తరై రసంపాద్యః సాంకాదేః కాపివక్రతా.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.10)**

ఎక్కడైతే ప్రధాన రసము మిగిలిన ప్రకరణాల కంటే ఎక్కువగా పోషించబడుతుందో అది కూడా ఒక రకమైన వక్రతగా తెలిపాడు. పూర్వోత్తర ప్రకరణాలలో అంగిరసం ప్రధానంగా ఏ ప్రకరణంలో చూపెట్టబడితే ఆ ప్రకరణము అంగీరసానికి నికషోపలంలాంటిదని కుంతకుడు పేర్కొన్నాడు. దీనికి ఉదాహరణ విప్రలంభ శృంగారం అంగిరసంగా ఉన్న విక్రయోర్వశీయం ఉన్మత్తాంకమును ఉదాహరణగా ఇచ్చాడు.

ప్రకరణ వక్రత ఆరవ భేదం శ్రీనాథునిలో గమనిద్దాం.

**ఆరవ భేదము ఉదాహరణ–1**

ప్రధాన రసం మిగిలిన ప్రకరణాల కంటే ఎక్కువగా ఎక్కడ పోషింపబడుతుందో అది కూడా ఒక వక్రత కనుక. ఇందుకు శృంగార నైషధ కావ్యాన్ని శ్రీనాథుని రసపోషణను గమనిద్దాం.

హర్షుడు వ్రాసిన నైషధచరితను శ్రీనాథుడు శృంగార నైషధ ప్రబంధంగా తీర్చిదిద్దాడు. ఇందులో ప్రధాన రసం శృంగారం. విభావానుభావ వ్యభిచారీ భావాలతో ఉద్భవించేది రసం. విభావం రెండు రకాలు. అవి 1) ఆలంబన విభావం, 2) ఉద్దీపన విభావం. నాయిక నాయకుల వల్ల రసం ఉద్భవిస్తే ఆ రసానికి నాయిక నాయకులు ఆలంబన అవుతారు. శృంగార నైషధంలో నలదమయంతులు రసానికి కారకులు.

"శృంగార రసమునకు స్థాయి భావము రతి. "తత్ర సంభోగ విషయక ఇచ్ఛా విసేషోరతిః" అని లక్షణము. స్థాయి భావము విభావాదులచే సమర్థముగ పరిపుష్టమైన చిత్తవృత్తి విశేషమే రసము. శృంగార రసమునకు స్థాయిభావమయిన రతి యంకురపల్ల వకలికా ప్రసూన ఫలాద్యవస్థలు కలది. అంతే కాదు. ఈ రతి ప్రథమతః నాయికకు, తదుపరి నాయకునకు జనించినట్లు కావ్యమునందు వర్ణింపఁబడవలెనని యాలంకారికనియమము".

**"పూర్వం నారీ భవేద్రక్తా పుమాన్ పుమాన్ పశ్చాత్తదిఙ్గితైః**
**తతస్సంభోగలీ లేతి స్వభావసుభగా స్థితిః"**

**( కొర్లపాటి. శ్రీనాథుడు. పుట.647)**

అదే విధంగా పైన చెప్పినట్టు నల వర్ణనతో కావ్యం ప్రారంభమయ్యి నలునిపై దమయంతి అనురక్త కావటం కన్పిస్తుంది. మూలానికి అనుగుణంగా ఉండటమే కాకుండా కొన్ని కల్పనలు కూడా శ్రీనాథుడు చేసాడు. అమూలకాలు కన్పిస్తాయి. శృంగార నైషధం హర్షనైషధానికి సంగ్రహరూపంగా చెప్పవచ్చు. శృంగార నైషధంలో ప్రధాన రసాన్ని కొన్ని ప్రకరణాల్లో విపరీతంగా శ్రీనాథుడు వర్ణించాడు అంగి రసానికి అవి గీటురాళ్ళుగా చెప్పవచ్చు. రాజహంసం నలునికి దమయంతి సౌందర్యాన్ని వర్ణించి చెప్పటం కన్పిస్తుంది.

ఉద్దీపన విభావం రెండు రకాలుగా ఉంటుంది. 1) సహజోద్దీపన విభావం, 2) తటస్థోద్దీపన విభావం. యౌవన, భూషణాదులు సహజ ఉద్దీపనాలు, మలయానిలం, చంద్రాదులు తటస్థాలు అని ఆలంకారింకులు సూచించారు. నలదమయంతుల యౌవన వర్ణన, సహజోద్దీపన విభావం. నలుని ఉద్యాన వనవిహారం తటస్థం. వీటన్నింటిని చక్కగా పోషించాడు శ్రీనాథుడు.

**మ॥ జనకుం గొల్వఁగ వచ్చినప్పుడు తదాస్థానంబులోఁ బాఠకుల్**
**వినుత ప్రౌఢి వసుంధరాధిపతులన్ వేర్వేఱ కీర్తించుచో**
**వనితా రత్నము వీరసేనతనయున్ వర్ణింపఁగా నున్నత**
**స్తనభారంబు కెలంకులన్ నినుచుఁ జంచల్లీల రోమాంచముల్**

**(శృ.నై.ప్రథ.ఆశ్వా.74 పద్యం)**

దమయంతి తండ్రిని సేవించడానికి వచ్చినపుడు వందులు వచ్చి నానారాజుల గుణాతిశయాలను పాడుతున్నప్పుడు వింటున్నది నలుని పొగడ్తలను పాడినప్పుడు స్తనభారమందు పులకలు కలిగినవని అర్థం. ఇలా నలమహారాజు వర్ణన, దమయంతి నలునియందు అనురక్త కావటం, నలుని ఉపవనవిహారం, హంసనుపట్టటం మొదటి ఆశ్వాసంలో ఉన్నాయి. ఈ ప్రకరణాలు అంగి రసానికి ప్రారంభకాలు.

రెండవ ఆశ్వాసంలోని హంసదూత కార్యం, దమయంతి వర్ణన, దమయంతి విరాళి, చంద్రోపలంభం, మదనావస్థ, శిశిరోపచారాలు స్వయంవర విశేషాలు అంగిరసానికి గీటురాయిగా చెప్పవచ్చు. ఇది కూడా ప్రకరణ వక్రతగా భావించవచ్చు. దమయంతి అవస్థను తెలుపుతూ శ్రీనాథుడిలా వర్ణించాడు.

మ॥ దశలంతంతకు నెక్కఁగా, విరహ సంతాపాతిరేకంబునన్
శశిబింబాననకుం దమస్వసకుఁ గార్శ్యబొందెదేహం; బహ
ర్నిశమున్ సాంద్ర నిరంతరస్మృతి సమున్మేషంబునం గాంతకుం
దశ దిగ్భిత్తులయందుఁ గానఁబడియెం దద్రూప చిత్రావళుల్

(శృ.నై.ద్వితీ.ఆశ్వా.116 పద్యం)

మదనావస్థలు ఒకటికన్నా ఒకటి పెరిగి దమయంతి కృశతను పొందింది. ఆమెకు నిరంతర నలధ్యాన సంజాత మదనజ్వరం వచ్చిందని కవి వర్ణన. అలాగే మరో పద్యంలో శిశిరోపచారాలను తెలుపుతూ ఇలా వర్ణించాడు కవి.

తే॥ చెలులు శిశిరోపచారముల్ సేయుపొంటెఁ
ప్రోవులిడ్డ మృణాల కర్పూర వితతిఁ
గాంచి వైదర్భి మదిలోనఁ గళవళించె
జాలకాయాత చంద్రికా జాలమనుచు

(శృ.నై.ద్వితీ.ఆశ్వా.116 పద్యం)

దమయంతి చెలులు చలువ గొలుపు సేవలు (శిశిరోపచారాలు) చేయడానికి పూనుకొని కర్పూరాల సమూహాన్ని చూసి కిటికీ నుండి వచ్చిన చంద్రికల సమూహమేమో అని దిగులు చెందింది.

తే॥ మన్మథానల తాపంబు మాన్పవేఁడి
డెందమునఁ జేర్పఁబూనిన కెందలిరులు
వెలఁది నిట్టూర్పుగాడ్పుల వెచ్చదాలి
బెరసి యరత్రోవయంద మర్మరములయ్యె

(శృ.నై. ద్వితీ.ఆశ్వా.118 పద్యం)

కవి దమయంతి మన్మథ తాపాన్ని తీర్చడానికి వేడి ఆర్పడానికి వక్షముపై ఎర్రనిచిగుళ్ళను ఉంచితే ఆమె వేడి నిట్టూర్పులుగాలి వలన ఆ చిగుళ్ళు మధ్యలోనే వాడి తడి ఆరి మర్మరములు అయ్యాయని వర్ణించాడు.

ఇలా శృంగార నైషధ కావ్యంలో అంగి రసమైన శృంగారాని మొదటి ఆశ్వాసంలో కొంత ద్వితీయ శ్వాసంలో కొంత ఎక్కువగా కావ్యంలో చెప్పడం కూడా ప్రకరణ వక్రతగా భావించవచ్చు.

నలదమయంతుల స్వయంవరంలో దమయంతి సౌందర్యానికి నలుడు ఆశ్చర్యపడే సందర్భంలో, నలవరణము, నలుడు వివాహమంటపానికి వెళ్ళే సందర్భంలో ఒకటి రెండు పద్యాల్లో కొంత శృంగారం తొంగి చూసింది కానీ ఎక్కువగా ప్రథమ, ద్వితీయాశ్వాసాల్లో కన్పించింది. అలాగే వివాహం తర్వాత విహార సమయంలో ఎక్కువగా శృంగారం కన్పిస్తుంది. మూలాన్ని అనుసరిస్తూ రాసిన కావ్యం అయినప్పటికి శ్రీనాథుని కొన్ని స్వతంత్ర కల్పనలు కూడా కావ్యంలో ఉన్నాయి. శ్రీనాథుడు శృంగార నైషధంలోని అంగి రసాన్ని సప్తమాశ్వాసంలో ఎక్కువగా రచించటం జరిగింది. కొన్ని పద్యాలను చూద్దాం.

**ఉ॥ భావము పల్లవింపఁ బువుఁ బానుపుమీఁదికి నేర్పునన్వయ**
**స్యావలి దార్పనెంతయును నర్మిలితోఁ గుసుమాస్త్ర శాస్త్ర వి**
**ద్యా విదుఁ డొయ్యఁబైఁ దిగిచి యక్కునఁ జేర్చె భుజాయుగాంకపా**
**ళీ వలయంబులోనఁ దవిలించి కురంగ విశాల లోచనన్**

**(శృ.నై.సప్త.ఆశ్వా.165 పద్యం)**

చెలికత్తెల గుంపు నలుని వద్దకు దమయంతిని పంపగా నలుడు నూతన వధువును, కామశాస్త్రతత్త్వము తెలిసినవాడై దగ్గరకు తీసుకొని ఆళింగనం చేసుకున్నాడు.

**క॥ హారపరీక్షా మిషమున**
**భూరమణుఁడు గమిచె నింతి పొంకపుఁ జన్నుల్**
**కూరిమి నేరిమిఁ బులకాం**
**కూరంబులు వొడమఁ జిగురుగోరులకొనలన్**

**(శృ.నై.సప్త.ఆశ్వా.166 పద్యం)**

ఇందులో భూరమణుడు ముత్యాల దండను పరికించే మిషతో వక్షస్థంలోని నఖాగ్రాలతో తాకుతూ ఉండటం వలన గగుర్పాటు కలిగిందని చెప్పటం కనిపిస్తుంది. ఇక్కడ రోమాంచం అనే సాత్త్విక భావం చెప్పబడింది.

**తే॥ మెలతఁ యప్పుడు మందాక్షమీలితములు**
**సౌహృదస్మేరములు నైన సంగమముల**
**ముకుళితంబులుఁ బుష్పితంబులు నునైన**
**భూజములతోడి యుద్యాన భూమిఁబోలె**

**(శృ.నై.ఆశ్వా.సప్త.175 పద్యం)**

సంగమ సమయంలో దమయంతి అరమోడ్పు కన్నులు ముకిలించిన పుష్పాల లాగా ఉన్నాయని వర్ణించాడు. ఈ ప్రకరణం అంగిరసానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈ రెండు సందర్భాల్లో అంగిరసం మిగిలిన వాటికన్నా ఎక్కువగా ఉంది.

**ఆరవ భేదము ఉదాహరణ–2**

శివరాత్రిమహాత్మ్యం భక్తిరస ప్రధాన కావ్యం. ఈశాన సంహిత నుండి కథామూలాన్ని తీసుకొని ప్రబంధ కావ్యంగా మలిచాడు కవి. ఇందులో ముఖ్య విషయం శివుని భక్తిని తెలియజేయటం. భక్తిరసం అంగిరసం. శృంగారం అంగరసంగా పాటింపబడింది. ప్రధాన రసాన్ని ఎక్కువగా మొదటి నాలుగు ఆశ్వాసాల్లో చెప్పకుండా చివరి నాలుగు, ఐదు ఆశ్వాసాల్లో తెల్పాడు. మొదటి ఆశ్వాసంలో సూతుడు శౌనకాది మునులకు శివరాత్రి మహాత్మ్యాన్ని తెల్పే సందర్భంలో కథ మొదలవుతుంది. ఆ పద్యాన్ని గమనిద్దాం.

**ఉ॥ తాపస సార్వభౌములు సదా శివరాత్రి మహావ్రతంబు దో**
**షాప హృతిక్షమంబు వినుఁడాదరణంబున నేను సద్గురు**
**శ్రీపద పద్మము ల్దలంచి చెప్పెద శంకర సంహితా కథా**
**దీపిత భవ్యమార్గమునందేటపడన్ మొదలింట నుండియున్**

**(శివ.ప్రథ.ఆశ్వా.55 పద్యం)**

శౌనకాది మునులారా! శివరాత్రి మహావ్రతమును, వ్యాసమహర్షి దివ్య పాదాలను తలచి చెప్తాను వినండి అని మొదలుపెట్టాడు. ఇలా చెప్పుతూ విష్ణువు క్రోడాకారంలో భూమినుద్ధరించి శయనించే విషయం. శివరాత్రి వ్రత ప్రస్తావన బ్రాహ్మణ కథ ప్రారంభం అవుతుంది. రెండు, మూడు ఆశ్వాసాలు సుకుమారుని కథ, దుశ్చేష్టితాల వివరణ తర్వాత శివరాత్రి మహాత్మ్యం సుకుమారునికి కైలాస ప్రాప్తి సందర్భంలో భక్తిరసం ఎక్కువగా కన్పిస్తుంది.

**సీ॥ ఎవ్వానియందుండు నెల్ల భూతంబులు**
**సింధువునందు వీచికలు వోలె**
**నెవ్వాడు వసియించు నెల్ల భూతములందు**
**నంబు వుల్లోలంబునందుఁ బోలె**
**నెల్ల భూతంబుల హృదయంబులందును**
**వసియించు నెవ్వఁడాకసమువోలె**
**నొకఁడు పెక్కై తోఁచు నుదధిఁ జంద్రుఁడు వోలె**

నెవ్వఁ డజ్ఞాన మూఢేంద్రియులకుఁ

గీ॥ పురుషుఁడని బ్రహ్మమని యజ్ఞపురుషుఁడనియు
నర్కుఁడని వాయువని శక్రుఁడని హరియని
చంద్రుఁడని కొల్తు రాయాయి సరణి వారు
భక్తి నెవ్వాని నీ బంట నభవ

(శివ.పంచ.ఆశ్వా.24 పద్యం)

ఎవడు సర్వభూతాల్లో, ప్రాణుల్లో, ప్రాణి హృదయాల్లో ఉంటాడో ఎవడిని ఆయా మార్గాల వాళ్ళు బ్రహ్మగా, సూర్యుడుగా యజ్ఞ పురుషుడుగా, వాయువుగా, ఇంద్రుడిగా, సేవిస్తారో అట్టి నీ సేవకుణ్ణి అంటూ యముడు శివుణ్ణి స్తుతిస్తాడు.

శా॥ జ్ఞానాజ్ఞాన కృతంబు లయ్యుఁబశుహింసాబ్రహ్మహత్యసురా
పానస్తేయములాదిగాఁ గలుగు పాపంబుల్ దహించున్నిమే
షానన్ శంభు నిశావ్రతంబు ప్రబల జ్వాలా వృతంబగ్నియై
ట్లేనింగాలుచు నార్ద్రశుష్కముల నొక్కింతిధ్మ భారంబులన్

(శివ.పంచ.ఆశ్వా.37.పద్యం)

అతి తీక్షణమైన జ్వాలలు తడిసిన, ఎండిన కట్టెలను ఎలా కాలుస్తాయో అలాగే తెలిసి చేసిన, తెలియక చేసిన ప్రాణి హింస, బ్రహ్మహత్య, మద్యపానం, దొంగతనం మొదలగు పాపాలను నిముషంలో దహించి వేస్తాయని శివరాత్రి పవిత్రతను తెలియజేసాడు కవి. ఇలా ఈ ప్రకరణం భక్తిరసం ఎక్కువగా ఉండటంచేత రసానికి గీటురాయి అయ్యింది.

### 6.1.7. ప్రకరణ వక్రత–ఏడవ భేదం

ఏడవ భేదాన్ని వివరిస్తూ...

కా॥ ప్రధాన వస్తునిష్పత్త్యై వస్త్వన్తర విచిత్రితా,
యత్రోల్లసతి సోల్లేఖా సాపరాప్యస్య వక్రతా.

(వ.జీ.చతు.ఉన్మే. కా.11)

ప్రధాన వస్తువులో సౌందర్యాన్ని చేకూర్చడానికి వైచిత్ర్యంతో నూతన భంగీసముచితమైన (క్రొత్త) ప్రకరణాన్ని నెలకొల్పటమే ప్రకరణ వక్రత సప్తమ భేదంగా తెలియజేసాడు. ఇందుకు ఉదాహరణగా ముద్రారాక్షస షష్ఠాంకములోని రాక్షసుడు – పురుషుని సంభాషణను ఉదహరించాడు. తను పన్నిన పన్నుగడ జరగాలని చాణుక్యుడు ఒక పురుషుని రాక్షసుని ముందు

ఉరి వేసుకున్నట్లు నటించమని చెప్తాడు. అలాగే పురుషుడు చేయగా రాక్షసుడది నమ్మి సజీవంగా లొంగిపోతాడు. ఇలా నూతన ప్రకరణాన్ని సృష్టించటం కూడా ఒక వక్రతే. పురుషుని రాక్షసుని వృత్తాంతం శోభించింది. ఇది ఒక రకమైన ప్రకరణ వక్రత.

**ఏడవ భేదం ఉదాహరణ–1**

ప్రధాన వస్తువుకు సౌకర్యం చేర్చడం కోసం కొత్త ప్రకరణాన్ని సృష్టించడం సప్తమ భేదంగా ప్రకరణంలో చూపాడు కుంతకుడు. శ్రీనాథుడు రాసిన హరవిలాస కావ్యంలో ఈ ప్రకరణ వక్రత భేదాన్ని చూడవచ్చు. ఉదాహరణకు కిరాతార్జునీయంలోని శివార్జునుల యుద్ధ ఘట్టం, హరవిలాసంలోని శివార్జునుల యుద్ధ ఘట్టం తీసుకున్నప్పుడు ఆ తేడా ప్రకరణ వైవిధ్యం కన్పిస్తుంది. మూలంలో భారవి కిరాతార్జునీయంలో శివుడు నేరుగా యుద్ధాన్ని ప్రకటించడు. ప్రథమంగా సేనాని, కిరాతకుని సేవకులు వచ్చి అర్జునున్ని అడుగుతారు. సూకరాన్ని చంపడానికి వేసిన బాణం ఇవ్వమని ఇలా

**శ్లో॥ హ్రేపయన్న హిమతేజసం త్విషా**
**సత్త్వమిత్థముపపన్న పౌరుషః।**
**హర్తుమర్హసి వరాహభేదినం**
**నైన సమ్మదధిపస్య సాయకమ్॥**

**(కిరా.త్రయోదశ. సర్గ.శ్లో.41)**

సూర్యునికన్న ఎక్కువ ప్రకాశించే తేజస్సు కలిగిన నీవు వరాహాన్ని చంపిన మా నాయకుని బాణాన్ని ఈ విధంగా అపహరించటం సరైంది కాదు అంటారు. అలాగే ఇంకా మాట్లాడుతూ

**శ్లో॥ నాభియోక్తుమనృతం త్వమిష్యసే**
**యస్తపస్వివిశిఖేషు చాదరః।**
**సంతి భూభృతి శరాహినః పరే**
**యే పరాక్రమ వసూని వజ్రిణః॥**

**(కిరా.త్రయోదశ సర్గ.శ్లో.58)**

నీతో అబద్ధం చెప్పాలని లేదు. మీ తపస్వుల బాణాలు తీసుకోవాలని లేదు. ఇంద్రుని వజ్రాయుధం కన్నా గొప్పవి ఈ పర్వతంలో ఎన్నో ఉన్నాయి అని అంటాడు. ఈ మాటల తర్వాత శివున్ని చేతితో చూపిస్తూ ఇలా అంటాడు.

శ్లో॥ దృశ్యతామయమనోకహాంతరే
తిగ్మహేతి పృతనాభి రన్వితః।
సాహి వీచిరివ సింధురుద్ధతో
భూపతిః సమయ సేతువారితః॥

(కిరా.త్రయోదశ సర్గ.శ్లో.70)

అస్త్రాలను కలిగి, సమయం కోసం ఎదురుచూస్తూ మా కిరాతరాజు ఆ చెట్ల మధ్య నిలిచి ఉన్నాడు చూడు అంటూ సేనాధిపతి చేతితో చూపాడు. ఇలా కథ కొనసాగుతూ ఉంటుంది. శివార్జునుల బాణాల యుద్ధం, చివరికి బాహుయుద్ధం జరుగుతుంది. పాశుపతాస్త్రం ఒసగటం, అర్జునుని తపస్సు విజయవంతం కావటం అవుతుంది. ఇది మూలంలోని విషయం.

ఇక శ్రీనాథుడు రచించిన హరవిలాస కావ్యంలో శివార్జునుల యుద్ధం జరగటానికి ముందు ఒక ప్రకరణాన్ని సృష్టించాడు శ్రీనాథుడు. శివుడు చెంచెత (పార్వతి)తో రావటం మూలంలో లేదు. కానీ శ్రీనాథుని కావ్యంలో ఉంది. హరవిలాసంలో శ్రీనాథుడు ఇలా వర్ణించాడు.

మ॥ ఒకనాఁడింద్ర తనూభవుండు గిరికూటోత్సంగభాగంబున
న్వికచానేక లతాతరు ప్రతతులన్ దేవార్చనా పుష్పకో
రకముల్గోయుచు నుండఁగా వినఁబడెన్ శ్రవ్యంబులై కుర్కుర
ప్రకరోదంచిత కంఠనాళ కుహలీ బౌబౌ మహారావముల్

(హర.సప్త.ఆశ్వా.37 పద్యం)

అర్జునుడు పూలను కోస్తూ ఉండగా కుక్కల బౌబౌ అనే శబ్దం వినిపించింది అంటూ ఇలా సన్నివేశాన్ని సృజించాడు శ్రీనాథుడు. అలాగే తన సృజనను కొనసాగిస్తూ ఇలా శివపార్వతుల ప్రస్తావనను తెచ్చాడు.

తే॥ శంకరుండు కిరతా వేషంబు దాల్చి
యగజ చెంచెతయై తోడ నరుగుఁదేరఁ
బాణి నోంకార దివ్య చాపము ధరించి
వచ్చె విచ్చు వరతపోవనము కడకు

(హర.సప్త.ఆశ్వా.41 పద్యం)

శంకరుడు కిరాత వేషమును దాల్చి, పార్వతి చెంచెతయై వెంట రాగా, చేతిలో ఓంకార చాపాన్ని ధరించి అర్జునుని తపోవనానికి వచ్చాడు అంటూ భవిష్యత్కాల కథనానికి అనువుగా

శ్రీనాథుడు ప్రకరణ సృష్టి చేసాడు. అలాగే శివార్జునుల యుద్ధం జరగాలి అది జరగాలంటే ఇరువురి నడుమ వాదం చెలరేగాలి. దానికోసం శ్రీనాథుడు చెంచెత పాత్రను సృష్టించి ప్రధాన వస్తువుకు సౌకర్యం చేకూర్చాడు. పందిని బాణంలో ఇరువురు దెబ్బ కొట్టారు. అది తన్నుకుంటూ చనిపోయింది. అప్పుడు యుద్ధం మొదలవ్వాలి దానికి కదనరంగాన్ని సిద్ధం చేసాడు శ్రీనాథుడు. ముందుగా శివుడే వచ్చి ఇలా పలుకుతూ

**తే॥ ఎవ్వఁడవురోరి నీవు నా యెదురఁబాఱు**
**పందినేసితి బాహు దర్పంబు మెఱసి**
**యెఱుగవుర యోరి నన్ను నీ యంద్రకీల**
**పర్వంతంబేలు వనచర సార్వభౌము**

**(హర.సప్త.ఆశ్వా.50 పద్యం)**

నీ భుజ పరాక్రమాన్ని నిరూపించడానికి నా ఎదుట పరిగెడుతున్న వరాహాన్ని చంపిన వాడివెవడివిరా నేను ఆటవిక రాజ్య చక్రవర్తిని తెలియదా అనే మాటలను పలుకుతూ వాదనకు దిగటం ఉచితంగా తోస్తుంది. అలాగే చెంచెత పాత్ర సృష్టి చేసి ఆ పాత్ర ద్వారానే యుద్ధం మొదలయ్యేలా చేసాడు శ్రీనాథుడు. ఎలాగో చూద్దాం క్రింది పద్యంలో.

**ఉ॥ ఏనును నా కుటుంబమగు నీ తరళాక్షియు వేఁటవెళ్ళి యి**
**క్కానన భూమిలో మృగంబులఁ జంపుచు వచ్చి వచ్చియే**
**నీ నిశితాస్త్ర పాతమున నిక్కిటిఁ జంపుదు నంచు వాక్రుతి**
**జ్ఞానియమంబున న్వెనుక జాడగఁ గూడఁగ వచ్చుచుండఁగన్**

**(హర.సప్త.ఆశ్వా.51.పద్యం)**

నేను నా భార్య వేటకు బయల్దేరి అడవిలో జంతువులను చంపుతూ వచ్చి, ఈ వరాహాన్ని కూడా చంపుతాను చూడని చెప్పి నా మాట నిలబెట్టుకనే సమయంలో

**క॥ ఏటల వినేని చెంచెత**
**నోటమి వెట్టంగడంగి యున్నట్టియెడన్**
**గాటెఱుకున గౌఱతిడి యిటఁ**
**జీటంబున వేడ్క యెల్ల జెఱచితి కదరా!**

**(హర.సప్త.ఆశ్వా.52 పద్యం)**

ఆ వరాహాన్ని చంపి, చెంచెతను ఓడించే సమయంలో నా కోరికను మొత్తం చెడగొట్టావు కదరా! అని ఆగ్రహ రూపమైన సన్నివేశాన్ని సృష్టించాడు శ్రీనాథుడు. ఇదే కలహ కారణమైంది. ఒకరు వేటాడగా మధ్యలో రావటం అధర్మం అని శివుడనగా పందెం కోరుకున్నావో, వరాహాన్నే కోరావో ఏదైతే ఏంటీ? వెళ్ళిరా నాకు శివార్చనకు వేళవుతుందనగా, వరాహాన్ని గూర్చి కాదు వేట ధర్మాన్ని అతిక్రమించావు. ఆ తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే అని చెప్తూ ఎందుకో నిన్ను చూస్తే నా మనస్సు వింటియందే నిలుస్తుంది. నా భార్య మెప్పుకోరాలని ఉంది. తలపడు అంటూ బాణాలను సంధించాడు. యుద్ధం మొదలైంది. చివరకు అర్జునుని పరాక్రమానికి మెచ్చి శివుడు పాశుపతాస్త్రాన్ని ఇచ్చాడు. మూలంలో లేని విధంగా చెంచెత పాత్ర సృష్టి ద్వారా ప్రధాన ఫలమైన పాశుపతాస్త్ర యుద్ధానికి సౌకర్యం చేకూరింది. కనుక ఇది ప్రకరణ వక్రత భేదంగా చెప్పవచ్చు. మార్పులతో, సన్నివేశ కల్పనలతో శ్రీనాథుడు కథను సహృదయంగమంగా, రసోచితంగా చిత్రించాడు. మూలకథలోని నీరసాన్ని, విసుగును పరిహరించి మేలైన అంశాలను కూర్చాడు. కథకు చెంచెత సన్నివేశ కల్పన సముచిత సౌకర్యాన్నిచ్చింది.

**ఏడవ భేదం ఉదాహరణ–2**

కాశీఖండంలో అగస్త్యుడు, లోపాముద్రతో మాట్లాడు సందర్భంలో అనేక ప్రశ్నలు అడిగినట్లు, ముక్తి సాధనాలను లోపాముద్ర అడిగినట్లు శ్రీనాథుడు మూలాన్ని విస్తరించాడు. నిజానికి మూలంలో లోపాముద్ర అంత మాట్లాడలేదు. ఒక్క మాటనే అడిగిందని మల్లంపల్లి శరభేశ్వర శర్మ వ్యాఖ్యానిస్తూ మూలాన్ని తెలుపుతూ ఇలా అంటాడు.

**"శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే**
**ఇదమేవహి సత్యం చేత్ కిమర్థం కాశిరిష్యతే"**

"ఇంతవరకే మూలము. మిగిలినదంతయును శ్రీనాథుఁడు చేసిన విస్తరము" (మల్లంపల్లి, శరభేశ్వర శర్మ. 2012. పుట.371).

శ్రీశైల శిఖరాన్ని చూస్తే పునర్జన్మ ఉండదంటారు కదా అనే దానికి శ్రీనాథుడు ఇలా పద్యాన్ని చెప్పాడు చూద్దాం.

**కం॥ అనియడిగినఁ గలశ సుతుం**
**డను మోదరసార్ద్రహృదయుఁడై దేవికి ని**
**ట్లను, నడుగవలయు నర్థమ**
**వనజానన! యడిగి తుక్తివైభవమలరన్**

(కాశీ.తృతీ.ఆశ్వా.67 పద్యం)

లోపాముద్ర అడిగిన ప్రశ్నకు అంగీకారంతో, అనురాగంతో అడుగాల్సిన విషయమే అడిగావని అభినందించి ఇలా మొదలుపెట్టాడు. అలా చెప్తూ మొదట బాహ్యాభ్యంతర తీర్థ మహాత్మ్యము గూర్చి చెప్పాడు.

**శా॥ శ్రీశైలాదులు ముక్తి కారణములై చెప్పంబడుం దీర్థముల్**
**ప్రాశస్త్యంబును సర్వతీర్థముల కప్రత్యూహమై వర్తిలున్**
**గాశీ ప్రాప్తికరంబులైన కతనంగైవల్య లక్ష్మీదముల్**
**కాశీ క్షేత్రము గైకొనుం దరుణి! సాక్షాన్ముక్తి హేతుత్వమున్**

(కాశీ.తృతీ.ఆశ్వా.68 పద్యం)

శ్రీశైలాది తీర్థాల వలన ముక్తి కలుగుతుందని పురాణాలు చెపుతున్నాయి అలా ముక్తి కారణాలని చెప్పబడ్డ సకల తీర్థాల ప్రశస్తి విషయంలో సందేహం లేదు. అన్ని ముక్తి ప్రదమైనవే. వాటిని సేవించినందువలన కలిగే సుకృత ఫలం వల్లనే కాశీ ప్రాప్తి కలుగుతుంది. ఇలా కాశీప్రాప్తికి కారణాలైనందుకే పురాణాలు వాటిని కైవల్యప్రదాలని వర్ణించినవి. కాశీ సాక్షాత్తు మోక్ష కారణం అంటూ కాశీప్రాశస్త్యాన్ని, పవిత్రతను తెలియజేస్తూ ఇంకా వర్ణించాడు కవి.

**తే.గీ.॥ జ్ఞానముఁగాని మోక్షంబు సంభవింప**
**దతివ జ్ఞానంబనంగ వేదాంత వాక్య**
**సంభవంబైన దదియపో జ్ఞానమంద్రు**
**తరుణి విజ్ఞాన మీసూక్ష్మ మెఱిఁగికొనుము**

(కాశీ.తృతీ.ఆశ్వా.70 పద్యం)

కాశీ క్షేత్ర నివాసం లేనినాడు జ్ఞానదీపము తన కాంతిని విస్తరింపజేయదు. జ్ఞానం అంటే ఇక్కడ ఉపనిషద్వాక్యాలతో సంభవించేది దానినే విజ్ఞానం అంటారు. అంటూ కాశీని పొగుడుతూ నానారకాలుగా కొనియాడాడు కవి. కాశిని వర్ణించడానికి లోపాముద్రతో ఆ ప్రశ్నను అడిగించి అమూలక ప్రశ్నలు వేయించి ప్రధాన వస్తువైన కాశీ విశిష్టతకు సౌకర్యాన్ని కూర్చాడు శ్రీనాథుడు. ఇది కూడా ఒక రకమైన ప్రకరణ వక్రతే.

### 6.1.8. ప్రకరణ వక్రత–ఎనిమిదవ భేదం

ఎనిమిదవ భేదం గూర్చి ఇలా వివరిస్తూ...

కా॥ సామాజిక జనాహ్లాద నిర్మాణ నిపుణైర్నటైః,
తద్భూమికాం సమాస్థాయ నిర్వర్తిత నటాన్తరమ్.
క్వచిత్ప్రకరణస్యాన్తః స్మృతం ప్రకరణాన్తరమ్,
సర్వప్రబన్ధ సర్వస్వకలాం పుష్ణాతి వక్రతామ్.

(వ.జీ.చతు.ఉన్మే. కా.12,13)

సామాజికులకు హృదయానందాన్ని కల్గించుటకు తన నాటకం మధ్యలో కవి అంతర్నాటకాన్ని సంధించటం కూడా ప్రకరణ వక్రతా భేదమే "దీని తాత్పర్యమేమనగా – ఒకానొక నాటకము నందు మాత్రమే, అడ్డులేని నేర్పుగల నటులు తమ భూమికలను గ్రహించి రంగస్థలమును అలంకరించుచు, ఇతర నర్తకులచే ప్రయోగింపబడుచున్నదియు, ఉప్పొంగుచున్న వక్రతా మహిమ కలదియునగు గర్భాంకమునందు (అంతర్నాటిక యందు) సామాజికులకు ఒకానొక చమత్కార వైచిత్ర్యము కల్పింతురు" (రామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.430). నాటకంలోని నటులు తమ పాత్రలను పోషిస్తూనే ఇతర నటులచే ప్రయోగింపబడిన నాటకాన్ని సామాజికుల లాగా చూసినపుడు నిజమైన సామాజికాహ్లాదం కలగటం కూడా ఒక వక్రతే అని చెప్తూ కుంతకుడు బాలరామాయణంలోని చతుర్థాంకములోని ప్రహస్త భూమికను ఉదాహరించాడు.

**ఎనిమిదవ భేదం ఉదాహరణ–1**

ఈ భేదం సాధారణంగా నాటకాల్లో కనిపిస్తుంది. కానీ కావ్యాల్లో తక్కువగా ఉంటుంది. శ్రీనాథుని కావ్యాల్లో మిగిలిన వాటిలో ఈ ప్రకరణ వక్రతను నేను గుర్తించలేదు. కానీ శృంగార నైషధంలో సరైన ఉదాహరణను చూడవచ్చు. ఇంద్రాదుల దూత కార్యానికి వెళ్ళిన నిషధ రాజు అదృశ్యంగా దమయంతి అంతఃపురానికి వెళతాడు. అక్కడి స్త్రీల చేష్టలను చూస్తాడు. శ్రీనాథుని వర్ణన ఇక్కడ అద్భుతమైందిగా తోస్తుంది. ఒక స్త్రీ నలవేషాన్ని ధరించి వ్యవహరించగా, మరొక స్త్రీ నలుని లాగా వ్యవహరిస్తుంది. ఆ పద్యాన్ని చూద్దాం.

ఉ॥ లేమయొకర్తు వేడుక నళీక నళీకరణంబు జాతిగా
బూమియదాను బన్నుకొని పోకలఁ బోవుచు నుండఁగా మృషా
భీమభవీభవంతి యయి చింబఫలాధరయోర్తు, పార్థివ
గ్రామణి చూడ, దానిమెడ గ్రక్కున వైచె మధూక దామమున్

(శృ.నై.తృతీ.ఆశ్వా.98 పద్యం)

నలుడు వాళ్ళను చూస్తున్నాడు వారికి ఈ విషయం తెలియదు. వేడుకకై ఒక స్త్రీ నలవేషంతో మరొక స్త్రీ దమయంతి వేషంలో ఉన్నదానిపై స్వయం వరమాలను వేసింది. ఇందువల్ల దమయంతి నలున్నే వరిస్తుందని నిశ్చయమైంది. నాయికా నాయకులుగా వారి నటనను చూస్తూ నాయకుడు సామాజికుడిగా ప్రేక్షకుడయ్యాడు.

**తే॥ వ్రాసె నొక్కలతాంగి క్రొవ్వాఁడి గోర**
**వర్ణములు తోడుతో మషీ వర్ణములగఁ**
**బసిఁడి గేదంగి ఱేకునం బ్రస్ఫుటముగ**
**మదన లేఖంబు నర్మమర్మంబు మెఱయ**

**(శృ.నై.తృతీ.ఆశ్వా.99 పద్యం)**

పదునైన గోటితో బంగారు కేదంగి రేకుపై అక్షరాలు రాస్తూ నలునికి దమయంతి మదన లేఖను రాసినట్లు భావిస్తుంది. ఇలా ఎవరికి తోచినట్లు వారు నలదమయంతుల లాగా నటిస్తున్నారు. ఒక స్త్రీ కర్పూరాన్ని వక్షంపై రాసుకున్నది. ఒక స్త్రీ ఇంకో స్త్రీ ఎదపై మకరాన్ని చిత్రిస్తున్నది. ఇవన్నీ మదనునికు సంకేతాలుగా చెప్పబడ్డాయి. నిజమైన నాయకుడు ప్రేక్షకుడు కావటం కూడా ఒక వక్రతే కావ్య సౌందర్య సంపాదనకు ఈ ప్రకరణం తోడ్పైంది. శ్రీనాథుని వర్ణన ఈ ఘట్టములో అనిర్వచనీయమైనది. నాటక ప్రదర్శనను తలపించింది.

### 6.1.9. ప్రకరణ వక్రత–తొమ్మిదవ భేదం

తొమ్మిదవ భేదాన్ని వివరిస్తూ ఇలా చెప్పాడు.

**కా॥ ముఖాది సంధి సంధాయి సంవిధానక బంధురమ్,**
**పూర్వోత్తరాది సాంగత్యాత్ (భం) అంగానాం నివివేశనమ్.**
**నత్వమార్గ గ్రహగ్రస్త గ్రహకాండ కదిర్థితమ్,**
**వక్రతోల్లేఖ లావణ్య ముల్లాసయతి నూతనమ్.**

**(వ.జీ.చతు.ఉన్మే.కా.14, 15)**

ముఖాది సంధులను కూర్చెడు పద్ధతిచేత సుందరంగా ప్రతిభావంతుడైన కవి ప్రకరణాలన్నింటికి సంవిధానం ఉండేట్లు చేయడం. క్రమ పద్ధతిలో సముచితమైన కథాశరీరాన్ని కూర్చటం వలన కూడా లావణ్యం ఏర్పడుతుంది. అది కూడా ఒక ప్రకరణ వక్రతే అని చెప్పాడు.

“దీని తాత్పర్యమేమనగా – ఉత్తరోత్తర ప్రకరణమునకు సరసముగ సంపాపదితములగు సంధులయొక్క సంవిధానముచే సమర్పింపబడుట యనెడు ప్రాణము గల పూర్వపూర్వ ప్రకరణము,

ప్రౌఢిచే ఉద్భూతమగు వక్రతా నిర్మాణము కలదై ఆనంద జనకముగ నుండును (అనగా పూర్వ ప్రకరణములకు రాబోవు ప్రకరణములతో సరియగు సంబంధముండుటయే ఈ ప్రకరణ వక్రత యొక్క స్వరూపము)" (రామచంద్రుడు, పుల్లెల. 2007. పుట.431). దీనికి ఉదాహరణగా పుష్పదూషితము నందలి కథను మొదటి ప్రకరణం నుండి ఆరవ ప్రకరణము వరకు వివరిస్తూ ఉదహరించాడు. సముద్రదత్తుడు ఉంగరం ఇవ్వడం, భార్యను తండ్రి అనుమానించి వెల్లగొట్టడం, చివరకు అదే ఉంగరంచే కలవడం క్రమ పద్ధతిలో కథ కొనసాగడం ఒకదానితో ఒకటి సంబంధాన్ని సముచితంగా కలిగి ఉన్నందున ప్రకరణ వక్రతకు ఉదాహరణగా ఈ కథను ఇచ్చాడు.

**తొమ్మిదవ భేదం ఉదాహరణ–1**

ఉత్తరోత్తరమైక కథకు సరైన సంవిధానంతో ముఖాది సంధులను కూర్చే పద్ధతిని కుంతకుడు ప్రకరణ వక్రతలో నవమ భేదంగా చెప్పాడు. ఏవి ముఖాది సంధులంటే నాట్యశాస్త్రంలో చెప్పబడ్డ పంచ సంధులైన ముఖ, ప్రతిముఖ, గర్భ, అవమర్శ, నిర్వహణ సంధులను కూర్చినట్లుగా కూర్చటం కూడా ప్రకరణ వక్రతగా తెలిపాడు. దీనికి ఉదాహరణగా హరవిలాసంలోని గౌరీ కళ్యాణ ఘట్టాన్ని తీసుకోవచ్చు.

**ఉ॥ తారకుఁడన్ మహాసురుఁడు తామరసాసనదత్తమైన దు**
**ర్వారవరాను భావమున వ్రాలి త్రిలోకము నేలుచుండు ని**
**ష్కారణ తీవ్ర బాధనిశంబును ముప్పది మూఁడు కోట్ల బృం**
**దారకులన్ మహర్షులఁ బ్రతాపగుణంబున నెచ్చి పాఁతుచున్**

**(హర.తృతీ.ఆశ్వా.3 పద్యం)**

తారకుడనే రాక్షసుడు బ్రహ్మ చేత వరం పొందినవాడై ముల్లోకాలను అతలాకుతలం చేయుచున్నాడనే విషయాన్ని బ్రహ్మకు నివేదించాలని ఆ బాధలను తెల్పటంతో కథకు బీజం పడింది. బీజం అలాగే కథారంభం అవుతుంది కనుక బీజం + ఆరంభం = ముఖసంధిగా చెప్పవచ్చు. తారకున్ని చంపేవాడు శివునికి పార్వతికి పుట్టబోయే బిడ్డ కనుక వారిరువురి కళ్యాణం ఆవశ్యకమని బ్రహ్మ తెలుపగా ఇంద్రుడు మన్మథున్ని పిలిచి కావలసిన కార్యాన్ని చెప్తాడు. సమ్మోహన అస్త్రాన్ని వదలటం. ఇది ప్రతిముఖ సంధి ప్రయత్నం ప్రకాశాన్ని పొందుతున్నది కనుక. శివుడు మన్మథున్ని భస్మం చేయటం అనేది ఇక్కడ గర్భసంధి. శివపార్వతుల కళ్యాణం చేయటానికి మన్మథుడు సమ్మోహన అస్త్రాన్ని చూసి కోపించిన శివుడు భస్మం చేయటంతో పార్వతి శివుల కళ్యాణం జరుగుతుందో లేదో అని సంశయం ఏర్పడటం మళ్ళీ ఏ విధంగా పార్వతీ

పరమేశ్వరులను కలపాలి అనేది ప్రశ్న ఉదయించటం కవి చక్కని ప్రకరణ కల్పన చేయటం జరుగుతుంది. శ్రీనాథుడు చతుర్థాశ్వాసంలో పార్వతి బాధపడుతున్నదని చెప్తూ ఇలా వర్ణించాడు.

**తే॥ అవ్విధంబునఁ దన మ్రోల నసమశరుఁడు**
**తనకుఁగా నీశ్వరుని చేత దగ్ధమైన**
**ధరణిధరకన్య నిందించెఁ దనరూపుఁ**
**బతులు మెచ్చని చెలువు నిష్ఫలమకాది**

**(హర.చతు.ఆశ్వా.3 పద్యం)**

తన రూపును పరమేశ్వరుడు ఇష్టపడలేదని భర్తలు మెచ్చని సౌందర్యం ఎంతదైనా ఏముంది? వృథా కదా అని బాధ నొందుతుంది.

**"వ॥ అనంతరంబ వసుంధరా ధర కన్య యవంధ్యప్రతిజ్ఞయై**
**తపస్సమాధి నియతత్వంబు వహియింప నిజాభిప్రాయంబు మేనకాదేవి**
**కెఱింగించిన"**

**(హర.చతు.ఆశ్వా.వచనం.4).**

పార్వతీదేవి విడువని ప్రతిజ్ఞ కలదై పట్టుదలతో పరమేశ్వరున్ని ఎలాగైనా ప్రసన్నం చేసుకుంటానని తల్లితో చెప్పడం. కథాగమనానికి ప్రాణం పోసినట్లు అయ్యింది. అలాంటి పార్వతి దేవిని వర్ణిస్తూ శ్రీనాథుడు ఇలా అంటాడు.

**తే॥ చంచరీకాంగనా గరుచ్ఛాయ నేలు**
**కుటిలకోలతర దీర్ఘకుంతలములు**
**మడమ లంటఁగ నిడు పాటిజడను గట్టి,**
**పాశుపత దివ్యదీక్షఁ జేపట్టి గౌరి.**

**(హర.చతు.ఆశ్వా.10 పద్యం)**

మృదువైన ఆడ తుమ్మెదల లాంటి పొడవైన వెంట్రుకలు పార్వతీదేవి మడమలను అంటగా, పొడవైన జడలుగా కట్టి దివ్య తపస్సును చేపట్టి తపోదీక్షకు ఉపక్రమించదని తెలిపాడు కవి. దీనిని నియతాప్తికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు కార్యం జరుగుతుందనే ఆశ కలగటం. ముందు వద్దని వారించిన తల్లిదండ్రుల ఆజ్ఞను పొంది తపస్సు చేయటం ఈ ప్రకరణలో కనిపిస్తుంది. చివరికి పార్వతి తపస్సుకు మెచ్చి వటువు రూపంలో శివుడు రావడం పార్వతికి కోపం తెప్పించటం, శివుడుగా సాక్షాత్కారం ఇవ్వటం తనని పెళ్ళి చేసుకుంటానని చెప్పటం దానికి తల్లిదండ్రులకు

తెలియజేయాలని పార్వతి చెప్పటం; దేవగణం తరలి వచ్చి పార్వతీ శంకరుల కళ్యాణం చేయటంతో ఘట్టం పూర్తవుతుంది.

> **"వ॥ ప్రదక్షిణ ప్రణామంబున నామిథునంబు విభావసు నారాధించునపుడు**
> **మేరువునకునకుఁ బ్రదక్షిణంబు సేయు నహస్త్రియామంబు ననుకరించె.**
> **సమిద్ధ జ్వాలంబైనా యనలంబునందు దాక్షాయణి లాజమోక్షంబొనరించి**
> **ధ్రువ దర్శనావసానంబునఁ దుషారగిరి కన్యకా శంకరులు సంకల్పసిద్ధి**
> **వడసిరి"**

**(హర.చతు.ఆశ్వా.వచనం.98)**

ఈ విధంగా దంపతులు అగ్నిని ప్రదక్షిణ చేయగా సూర్యుడు మేరు పర్వతాన్ని ప్రదక్షించినట్లుగా అనిపిస్తున్నదని, లాజ హోమము పూర్తిచేసి వివాహ అభిలాష నెరవేరినవారైనారని శ్రీనాథుడు కన్నులకు కట్టినట్టుగా ప్రకరణాలను నిజజీవితంలోని సందర్భాలను సృష్టించిన విధంగానే మలిచాడు. ఇలా ఒక ప్రకరణానికి మరొక ప్రకరణానికి అనుసంధానం చేస్తూ బ్రహ్మను తారకునికై దేవతలు, వేడటం, బ్రహ్మ అనుగ్రానుసారం మన్మథుని పిలువటం, అతడు భస్మం కావటం, పార్వతి ప్రతిణ పూనటం, శివుడి మెచ్చి కళ్యాణం చేసుకుంటాననటం, హిమవంతుడు అంగీకరించటం ఒకదానితో ఒకటి సరిగ్గా పొత్తు కుదిరినది. చివరికి ఫలాగమం పొంది గౌరీ కళ్యాణం జరగటం నిర్వహణ సంధితో ప్రకరణం ముగియటం కుంతకుడు చెప్పిన ప్రకరణ వక్రతకు చక్కని తార్కాణం. శ్రీనాథుడు ఔచిత్యాన్ని పోషిస్తూ కథాగమనాన్ని అద్భుతమయం చేసాడు.

**తొమ్మిదవ భేదం ఉదాహరణ–2**

నలదమయంతుల కథలో కూడా కొన్ని స్వతంత్ర కల్పనలు, అనౌచిత్య పరిహరణలు చేసాడు శ్రీనాథుడు. వాటిని క్రమానుసారంగా తీర్చిదిద్దాడు. మొదటగా నలమహారాజ వర్ణనం, దమయంతి నలుని యందు అనురక్త కావటం స్త్రీ మొదట పురుషుని పట్ల అనురక్త కావటం కావ్య లక్షణాల్లో చెప్పబడింది దాన్ని పాటించాడు శ్రీనాథుడు. అలాగే నలుడు దమయంతి యందనురక్తుడు కావటం, నలఉపవన విహారం, హంసను పట్టటం, హంసదూత్యం, దమయంతి విరాళి, స్వయంవరం చాటటం, ఇంద్రాదుల స్వయంవర ప్రస్తావన, నలున్ని వరించటం, వివాహం, విహారంకు ముందు గృహప్రవేశ ఘట్టం కూర్చడం, విహార సౌధం. ఇదంతా క్రమానుగతిగా చెప్పటం కూడా కావ్యసౌందర్యమే కనుక ప్రకరణ వక్రత. కథాగమనాన్ని ఔచిత్యవంతంగా పోషించటం కూడా వక్రతే.

### 6.2. ప్రబంధ వక్రత

కుంతకుడు ప్రకరణ వక్రత చెప్పిన తర్వాత ప్రబంధ వక్రతను ఆరవ వక్రతాభేదంగా తెలియజేసాడు. "సంపూర్ణమైన నాటకముగాని, కావ్యముగాని ప్రబంధమని చెప్పబడుచున్నది. వర్ణములు, పదములు, వాక్యములు, ప్రకరణములు – ఇవియన్నియు ఏక సూత్రతను పొంది ప్రబంధముగా రూపొందుచున్నవి. కనుకనే ప్రబంధ వక్రత సర్వతోముఖ సౌందర్యసంపన్నమై సమస్త వక్రతా వైభవములకు కేంద్రస్థానమై విలసిల్లుచున్నది" (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977. పుట.425).

### 6.2.1. ప్రబంధ వక్రత–మొదటి భేదం

**కా॥ ఇతివృత్తాన్యథావత్తరససంపదు పేక్షయా**
**రసాస్తరేణ రమ్యేణ యత్రనిర్వహణంభవేత్**
**తస్యా ఏవ కథామూర్తేరామూలోన్మీలితశ్రియః**
**వినేయానంద నిష్పత్త్యై సా ప్రబంధస్య వక్రతా**

**(వ.జీ.చతు.ఉన్మే.కా.16,17)**

మూలంలోని ఇతివృత్తంలో ఉన్న రసాన్ని మార్చి సహృదయానందం పొందే విధంగా కొత్త రసాన్ని కావ్యంలో చూపటం ప్రబంధ వక్రతలో ఒక రకంగా చెప్పబడింది. దీనికి ఉదాహరణగా కుంతకుడు ఉత్తరరామచరిత, వేణీ సంహారాలను పేర్కొన్నాడు. భారతంలో ప్రధాన రసం శాంతం దాన్ని విడచి వేణీ సంహారంలో వీరరసాన్ని చూపడం జరిగింది. కావున ఇది ప్రబంధ వక్రతగా భావించాడు కుంతకుడు.

**మొదటి భేదం ఉదాహరణ–1**

ఈశాన సంహితలో శాంతరస ప్రధానమైన ఇతివృత్తాన్ని తీసుకొని భక్తిరసంగా మలిచాడు శ్రీనాథుడు. భక్తి రసం అంగరసంగా శృంగారం అంగరసంగా తీసుకున్నాడు. ఇదే విషయాన్ని బలపరుస్తూ "శ్రీనాథకవి సార్వభౌముడు తన శివరాత్రి మహాత్మ్యములో రసపరివర్తన మొనరించినాడు. భక్తి రసమునకు శృంగారరసమును అంగముగ స్వీకరించినాడు. మూలములో సూత్రప్రాయముగ నున్న సుకుమారుని కథ ఆంధ్రమున సర్వతోముఖ విస్తారమును పొందినది. మాతంగీ శృంగారము సాంగోపాంగముగ వర్ణితమైనది. ఈ మార్పు శ్రీనాథుడు రసజ్ఞమనోరంజనముకై కావించినాడు" (జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977. పుట.426).

శివుని మహాత్మ్యం తెలిపే కథ శివరాత్రి వ్రత విధానం తెలుపడం ఈ కావ్యంలోని వస్తువు కనుక భక్తి ప్రధానమైంది. కానీ ఇందులో సుకుమారుని నీచ చరిత్ర, అతని విచ్చలవిడి శృంగారం వర్ణితం కనుక శృంగారం అంగరసమైంది. మూలంలోని శాంతరసాన్ని శివుని భక్తిని తెలిపే కావ్యంగా మలిచినందుకు ఇది భక్తిరస ప్రధాన కావ్యంగా వెలుగొందింది. మూలంలోని రసాన్ని కథానుగుణ మార్పు చేయటం కూడా ప్రబంధ వక్రత తెలిపాడు కుంతకుడు. దానికి శివరాత్రి మహాత్మ్యం ఉదాహరణ. శివభక్తులను కూడా శివునిగా భావించలంటూ

**ఆ.వె.॥ పాపకర్ముడైన భాగ్యహీనునినైనఁ**
**బట్టిచూడ మీకుఁ బాడిగాదు**
**శైవవరులఁజేరి సేవించువారలు**
**పురహరుండ కాఁగ బుద్ధిఁగనుఁడు**

**(శివ. పంచ. ఆశ్వా.55 పద్యం)**

ఇలా భక్తితో శివమహిమను, శివుని గొప్పతనాన్ని యముడు పొగిడాడు. అలాగే హరవిలాసంలోని చిరుతొండ నంబి కథ, గౌరీకళ్యాణం, దారుకావన విహారం, కిరాతార్జునుల కథ హరుని విలాసాలను తెలిపే విధంగా కవి ప్రబంధాన్ని మలిచాడు. ప్రధానంగా భక్తిని తెలపటమే ఉద్దేశ్యం కానీ సందర్భానుసారంగా కూడా కరుణ రసాన్ని నంబికథలో సరియాలుని వధ సమయంలో, గౌరీ కళ్యాణంలో శృంగారరసాన్ని, దారుకావనవిహారంలో, కిరాతార్జున సంఘర్షణ సమయంలో వీరాన్ని అంగరసాలుగా తీసుకున్నప్పటికి ప్రధాన రసంగా భక్తిని చూపటం కూడా ప్రబంధ వక్రతగా చెప్పవచ్చు. దీనిని కొర్లపాటి శ్రీరామమూర్తి బలపరుస్తూ అంగరసాలుగా శ్రీనాథుడు వాడినట్లు తెలుపుతూ

“కాళిదాసు కుమార సంభవము రసమయము. అందలి ప్రతి శ్లోకము రసగుళిక. అవి రసగుళికలై శ్రీనాథుని గౌరీ కళ్యాణమును రసవత్తరము. అంతే కాదు వదలినందున రసైక్యము, భావోపలక్షణాదుల వలన రసనిర్భరత శ్రీనాథుని గౌరీ కళ్యాణమునఁ గలదు. కుమార సంభవమునందలి రసమును నిలుపుటయే గౌరీ కళ్యాణమున శ్రీనాథుని రసపోషణము. అది హరవిలాసాభిముఖముగ సంగ్రహమగుట తదుచితము హరవిలాస ప్రాధాన్యము కల స్థాణ్వాశ్రమవసంతోదయ వర్ణన ప్రదానమైన శృంగారము, కళ్యాణ ఘట్టమునందలి శృంగారము శ్రీనాథుని గౌరీ కళ్యాణమున రసపుష్కలము. కానియవియంగరసములు” (కొర్లపాటి

శ్రీరామమూర్తి, శ్రీనాథుడు. 1971. పుట.741). వీటిని ప్రబంధవక్రతగా ఉదాహరించవచ్చు.

### 6.2.2. ప్రబంధ వక్రత–రెండవ భేదం

**కా॥ త్రైలోక్యాభినవోల్లేశ నాయకోత్కర్ష పోషిణా,**
**ఇతిహాసైక దేశేన ప్రబన్దస్య సమాపనమ్.**
**తదుత్తర కథావర్తి విరసత్వ జిహాసయా,**
**కుర్వీత యత్ర సుకవిః సా విచిత్రాస్య వక్రతా.**

**(వ.జీ.చతు.ఉన్మే. కా.18, 19)**

కవి ఒక కథను ప్రారంభించి రాబోయే భాగాలలో నీరసత్వం (అనౌచిత్యం) సంభవిస్తే దానిని పరిహరించాలనే కోరికతో అందరికి నచ్చే విధంగా, చమత్కారవంతంగా ప్రబంధాన్ని పూర్తి చేయడంలో ఉండే సౌందర్యం కూడా ప్రబంధ వక్రతగా చెప్పాడు కుంతకుడు.

ఉదాహరణగా భారవి కిరాతర్జునీయంలోని కథను తీసుకొని అందులో రసవద్ఘట్టమును మాత్రమే గ్రహించి, అర్జునుడు పాశుపతాస్త్రాన్ని పొందటం, తర్వాత సోదరులతో కలవటం, ధుర్యోదునితో రాయభారం అంత రసవంతమైనవి కావని కావ్యం యొక్క పూర్వ కథతోనే ముగించాడు. ముఖ్య విషయాలను చెప్పి ముగించటం అని అర్థం.

**రెండవ భేదం ఉదాహరణ–1**

మూలకథలో ఉన్న నీరసభాగం తీసివేసి చమత్కారవంతంగా కథను రాయడం ప్రబంధవక్రతలో భాగంగా చెప్పాడు కుంతకుడు. ప్రతిభావంతుడైన కవి కథను రక్తి కట్టించడానికి మూలంలోని అనవసర భాగాన్ని తొలగిస్తాడు. అందుకే శ్రీనాథుని మాట అనౌచిత్యంబు పరహరించి అనేది పలుసార్లు జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అలాగే నన్నయ భారతాంధ్రీకరణ విధానంలో మూల పరిహరణం, సంక్షేపం, విచ్ఛేదం, యథానువాదం కన్పిస్తాయి. మూలంలో అనవసరం అనుకున్న వాటిని తొలగించాడు. అలాగే కుంతకుడు చెప్పినట్లు అనవసర విషయాలను తొలగించటం వల్ల కావ్యసౌందర్యం చేకూరుతుంది. శ్రీనాథుడు కూడా సరిగ్గా ఇదే పాటించాడని చెప్పడానికి ఉదాహరణగా కాళిదాసకృత కుమారసంభవ కావ్యాన్ని తీసుకోవాలి. కుమార సంభవంలో 7 సర్గలలో గౌరీ కళ్యాణ వృత్తాంతాన్ని చెప్తే శ్రీనాథుడు సంక్షిప్తంగా 2 ఆశ్వాసాల్లో చెప్పాడు. అనవసర దీర్ఘ సంభాషణలను తొలగించాడు. కేవలం రతీదేవి విలాప వర్ణన చతుర్థ సర్గ మొత్తం ఉంది. కానీ దానిని కుదించి కేవలం 10 పద్యాలు, నాలుగు వచనాల్లో చెప్పాడు. అలాగే తారకుని ఆగడాలు బ్రహ్మకు విన్నవించే సందర్భం, బ్రహ్మను స్తుతించడానికే మొదటి సర్గ తీసుకున్ను కాళిదాసు.

ఇలాంటి దీర్ఘ విషయాలను కుదించడం ఒక విషయమైతే, శివుడు హిమవన్నగరములోకి ప్రవేశించేటపుడు, పురసుందరీమణుల విలాస చేష్టితాలను శ్రీనాథుడు వర్ణించలేదు. ఇది నీరస భాగంగా భావించాడు.

గౌరీ అలంకారం తర్వాత హరవిలాసంలో ఇలా ఉంది.

**మ॥ వనగంధ ద్విపరాజి నెక్కి యధిక వ్యాయామ విస్ఫారసం**
**హననుల్ బంధులు వేదినీ ధరము లవ్యాక్షేప సంబోధముల్**
**మనముల్ నిండఁగందోడరాఁ ద్రిజగతీమాన్యుండు ధీరుండెదు**
**ర్కొనె నీహార గిరీశ్వరుండు సుమనః కోదండ సంహారునిన్**

**(హర. చతు.ఆశ్వా.93 పద్యం)**

బంధుమిత్రులు మదపుటేనుగులనెక్కి అధిక దేహ శ్రమకోర్చి రాగా హిమవంతుడు పరమేశ్వరున్ని సాదరంగా ఎదుర్కున్నాడు అని ఒక మాటలో చెప్పేసాడు. మూలంలో కాళిదాసు హిమవన్నగర పురసుందరీ చేష్టలను 19 అనుష్టుప్ శ్లోకాలలో చెప్పాడు. ఉదాహరణగా ఒక శ్లోకం చూద్దాం.

**శ్లో॥ ఆ లోక మార్గం సహసా వ్రజన్త్యా**
**కయాచి దుద్వేష్టనవాన్తమాల్యః।**
**బద్ధుం న సమ్భావిత ఏవ తావ**
**త్కరేణ రద్ధోఽపి చ కేశపాశః॥**

**(కాళిదాస కుమారసంభవం. సప్త. సర్గ. శ్లో.57)**

పెండ్లి కొడుకును చూడటానికి కిటికీ వద్దకు వేగముగా నడుస్తున్న స్త్రీ త్వరగా నడవటం చేత ఆమె జుట్టుముడి వీడిపోయి, పూలు జారిపోతున్న పట్టించుకోలేదని వివరించాడు. అలాగే చాలామంది స్త్రీలు శివున్ని చూసి పార్వతీ అదృష్టాన్ని కొనియాడారు. కానీ హరవిలాసంలో ఈ ఘట్టం పూర్తిగా పరిహరించాడు శ్రీనాథుడు. గౌరీ కళ్యాణం అనేది ప్రధాన ఫలం అందుకే నేరుగా కళ్యాణ ఘట్టాన్ని వివరించాడు. వీటిని తొలగించాడు. కనుక ఇది కూడా ప్రబంధ వక్రతకు నిదర్శనంగా కవి ప్రతిభకు తార్కాణంగా చెప్పవచ్చు. కుమారసంభవం మూలం చదివిన వారికే ఈ ఘట్టం ఉందని తెలుస్తుంది లేకపోతే తెలియదు.

రెండవ భేదం ఉదాహరణ–2

హరవిలాసంలోని సప్తమశ్వాసంలో అర్జునుని పాశుపతాస్త్ర తపస్సు గూర్చి చెప్పబడింది. ఇది భారవి కిరాతార్జునీయంలోనిది. అర్జునుని తపస్సు మూల గ్రంథమైన కిరాతార్జునీయంలో షష్ఠసర్గలో ఇలా మొదలవుతుంది.

**శ్లో॥ రుచిరాకృతిః కనక సాను మథో**
**పరమః పుమానివ పతిం పతతామ్।**
**ధృతసత్పథస్త్రి పథగామభితః**
**న తమారురోహ పురుహూతసుతః॥**

(కిరా. షష్ఠ .సర్గ. శ్లో.1)

ఇంద్రకీల పర్వతాన్ని చేరిన అర్జునుడు బంగారు రంగు గల చరియలతో ప్రకాశిస్తున్న పర్వత శిఖరాన్ని ఎక్కి గంగానదికి ఎదురుగా వెళుతూ విష్ణువు గరుత్మంతున్ని అధిరోహించినట్లుగా అధిరోహించాడు అని ప్రారంభ శ్లోకం ఉంది. తర్వాత 18 శ్లోకాలు పర్వత వర్ణన ఆ తర్వాత తపస్సు గూర్చి ప్రస్తావిస్తూ ఇలా ఉంది.

**శ్లో॥ ప్రణిధాయ తత్ర విధినాఽథ ధియం**
**దధతః పురాతనము నేర్మునితామ్।**
**శ్రమ మాదధావసుకరం న తపః**
**కిమివావసాదకర మాత్మవతామ్॥**

(కిరా. షష్ఠ.సర్గ. శ్లో.19)

ఆ ఇంద్రకీలాద్రి వనంలో అర్జునుడు యోగశాస్త్రానుసారం బుద్ధిని స్వాధీనపరచుకొన్నవాడై దుష్కరమైన తపస్సును ప్రారంభించాడు అని తపస్సు గూర్చి తెలియజేసాడు. తర్వాత సర్గ మొత్తం ఇంద్రకీలాద్రి ప్రకృతి వర్ణన ఇంద్రుడు గంధర్వుని పిలిచి తపోభంగం చేయమని చెప్పటంతో సర్గ ముగుస్తుంది. కానీ హరవిలాసంలో కథ నేరుగా ఎలాంటి నీరసం లేకుండా, అనౌచిత్యాన్ని తీసివేసి నైపుణ్యంలో కథను కొనసాగించాడు. ప్రారంభంలోనే హరవిలాసంలో సూటిగా విషయ వివరణ చేస్తూ ఇలా అంటాడు.

**క॥ ద్యూత పరాభవమున నగు**
**చేతో దుఃఖమునఁ దపము చేయఁగఁ దొడఁగెన్**
**భ్రాతల యనుమతి శత్రు**

వ్రాత జయార్థంబు మది దివస్పతి గురిగాన్

(హర. సప్త.ఆశ్వా.4 పద్యం)

జూదములో ఓడిపోయిన దుఃఖంతో శత్రువులను జయించాలనే కోరికతో మనసులో ఇంద్రున్ని నిలుపుకోని తపస్సు ప్రారంభించాడు. తర్వాత 5 పద్యాలు ఒక వచనాన్ని చెప్పి చాలా సులువుగా

సీ॥ తెల్లనిగడ్డంబు తెల్లని మీసము
ల్నరసిన రోమ పాండురశిరంబు
మేధావి బొట్టును మెఱుగు జన్నిదములు
భూతి లలాట త్రిపుండ్రకంబుఁ
గావిదోవతియును గంతోత్తరీయంబు
నిష్టికోలయుఁ జింక నిట్టితోలుఁ
బంచాంగముష్టియుఁ బాణిఁ బవిత్రంబు
నొక్క వ్రేలికి వెండి యుంగరంబు

తా. జాఱు బొజ్జయు గుశదబ్బసంబెలయును
నెడమ కేలను నిడుగోల గొడుగుఁ దాల్చి
దనకు సజ్ఞాతిగా నొక్క తపసి వృద్ధ
బ్రాహ్మణుఁడు వచ్చె నొయ్యయ్యఁ బార్థు కడకు

(హర. సప్త.ఆశ్వా.12 పద్యం)

నరసిన గడ్డము, మీసాలు, తల వెంట్రుకలతో, నుదుటన బొట్టు, జంధ్యం, యోగదండం, చంకలో జింక చర్మాన్ని ధరించి, జారిన బొజ్జ చేత గొడుగు పట్టుకున్న బ్రాహ్మణ వృద్ధుడు వచ్చాడని వివరించాడు. కానీ కిరాతార్జునీయంలో 6వ సర్గ, 7వ సర్గ మొత్తం పర్వతం, గంగానది వర్ణనం, చెట్ల వర్ణన, 8వ సర్గ అంతా అప్సర జలక్రీడావర్ణన 57 శ్లోకాలతో వర్ణించటం అనేది నీరసంగా భావించి కవి తొందరగా కొన్ని పద్యాల్లో ముగించాడు. 9వ సర్గలో అప్సర స్త్రీల రాత్రి వర్ణన, 10వ సర్గలో అర్జునుని తపోభంగ ప్రయత్నానికే 63 శ్లోకాలు చెప్పటం కన్పిస్తుంది. 11వ సర్గలో ఇంద్రుడు ప్రత్యక్షం కావటం, శివ తపస్సు గూర్చి చెప్పటం, 12వ సర్గలో 53 శ్లోకాల్లో మూకాసురుని గూర్చి చెప్పటం, 13వ సర్గ మొత్తం కిరాతరాజు వర్ణన, 71 శ్లోకాలు, 14వ సర్గలో 64 శ్లోకాల్లో బాణయుద్ధం, 15వ సర్గలో కూడా 53 శ్లోకాల్లో బాణాలు ఒకరిపై ఒకరు వేయటం,

16వ సర్గలో కూడా 54 శ్లోకాలు బాణయుద్ధం గూర్చే ఉండటం, 17వ సర్గలో 64 శ్లోకాల్లో కూడా శివార్జునుల యుద్ధమే వర్ణించటం. చివరికి 18వ సర్గలో ముష్టి యుద్ధం శివప్రత్యక్షం పాశుపతాస్త్రం ఒసగటం మూలంలో కిరాతార్జునీయంలో భారవి కథాగమనరీతి ఇలా ఉండగా కావ్యంలో వీటన్నింటిని నీరసంగా భావించి శ్రీనాథుడు ఏకాశ్వాసంలో తగు మార్పులు చేర్పులు చేస్తూ కొన్ని పద్యాల్లో ముగించటం కథా సౌందర్యానికి దోహదమయ్యి సహృదయంగమంగా అనీరసమైనదిగా తోచింది. కనుక దీనిని కూడా ప్రబంధ వక్రతలో ద్వితీయ భేదంగా భావించవచ్చు.

**రెండవ భేదం ఉదాహరణ–3**

మరొక ఉదాహరణ కాశీఖండంలోనిది చూద్దాం. బృహస్పతి లోపాముద్రతో పతివ్రతా 3ధర్మాలను ప్రస్తావించే సందర్భంలో పుణ్యస్త్రీ భర్తతో నడిచే రీతులను తెలియజేసాడు. అలాగే వైధవ్యం కలిగిన స్త్రీని చూడరాదని చెప్తూ ఇలా అంటాడు.

**తే.గీ.॥ ప్రియము గలిగిన నంగీకరింపవలదు**
**ముండదీవన రేపాడి మోముఁ జూచి**
**బైసిమాలిన పరమ నిర్భాగ్యురాలు**
**విధవదాని యాశీస్సును విషసమంబు**

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 85 పద్యం)**

విధవ ముఖం చూడరాదు, విషంతో సమానం అని చెప్పాడు. "మూల కాశీఖండములో 'తదాశిషమపిప్రాజ్ఞః త్య జేదాశీ విషోపమాం' అని యున్నది. కాని ముప్పదియాఱు శ్లోకములు గల (పతివ్రతాధ్యాయము 71–106) ఈ ఘట్టములో ఇట్టివి రెండు మూడు మాత్రమే కలవు. శ్రీనాథుడు వానిని తెనిఁగించి మిగిలినవి విడిచినాఁడు. ఆ మిగిలినవానిలో విధివశమున వైధవ్యము ప్రాప్తించి యనుగమనము చేయని స్త్రీ ఆచరింపవలసిన తీర్థస్నాన, దాన, పూజా, తర్పణాదులు నిర్దేశింపఁబడి యున్నవి. నిషిద్ధములు చెప్పఁబడినవి" (శరభేశ్వర శర్మ. మల్లంపల్లి. 2012. పుట.232). ఇలా నీరసములు అనవసరము కథకు విసుగు తెప్పించే విషయాలను శ్రీనాథుడు చాలా చోట్ల పరిహరించాడు. ప్రతిభ కలిగిన కవి తన నేర్పుతో కావ్యాన్ని సౌందర్యవంతం చేయడానికి నీరస భాగాలను పరిహరిస్తారు. అదే ద్వితీయ ప్రబంధ వక్రత భేదం.

**రెండవ భేదం ఉదాహరణ–4**

శ్రీహర్షుని నైషధ చరిత్రలో ప్రథమ సర్గలో తటాక వర్ణనము 107 శ్లోకం నుండ 116 శ్లోకం వరకు 12 శ్లోకాల వర్ణన ఉంది. కానీ శ్రీనాథుడు అంతటి సుదీర్ఘ వర్ణన అవసరం లేదని అది అనౌచిత్యంగా భావించి దానిని పరిహరించాడు. వాటిని కొన్నింటిని పరిశీలిద్దాం.

**శ్లో॥ అథస్వమాదాయ భయేస మంథనా**
**చ్చిరత్నరత్నాధికముచ్చితం చిరాత్**
**నిలీయ తస్మిన్నివసన్నపాం నిధి**
**ర్వనే తటాకో దదృశేఽవనీభుజా**

**(హర్ష. నైష. ప్రథ. సర్గ . శ్లో.107)**

ఉద్యాన వనాన్ని చూచిన తర్వాత నలమహారాజందలి కొలను చూసారు. సముద్రం తన ప్రాచీన రత్నాలను తీసుకొచ్చి వనంలో ఒక మూలకు దాగిందా అన్నట్లు ఉన్నదా అన్నట్లు నలమహారాజుకి తోచిందని ఈ తటాకం వివిధ రత్నాలకు ఆకరమైందా అన్నట్లు ఉన్నదని భావించాడు.

**శ్లో॥ పయోనిలీనాభ్రము కాముకావళీ**
**రదాననంతో రగపుచ్ఛసచ్ఛవీన్।**
**జలార్ధ రుద్ధస్య తటాంతభూభిదో**
**మృణాళజాలస్య నిభాద్బభారయః॥**

**(హర్ష. నైష. ప్రథ. సర్గ. శ్లో.108)**

ఈ తటాకం నీటిలో సగం మునిగి గట్టును భేదిస్తూ ఉండే తామ తూండ్ల సమూహం అనే నెపంతో ఆదిశేషుని తోకతో సమానమైన ధవళకాంతి కల్గిన నీటిలో మునిగిన ఐరావతాలు దంతాలను వహించినదిగా కనిపించింది. సముద్రంలో ఒక ఐరావతం ఉండే ఈ తటాకంలో ఐరావతాలు చాలా ఉన్నాయని అర్థం.

**శ్లో॥ తటాంత విశ్రాంత తురంగమచ్ఛటా**
**స్ఫుటానుబింబోదయచుంబనేన యః।**
**బభౌచలద్వీచిక శాంతశాతనై**
**స్సహస్రముచ్చైశ్శ్రసామివశ్రయన్॥**

**(హర్ష. నైష. ప్రథ. సర్గ . శ్లో. 109)**

కొన్ని గుర్రాలను నలుడు ఆ తటాకం గట్టులో కట్టేసాడు. ఆ గుర్రాల ప్రతిబింబం తటాకజలంలో కన్పిస్తుంది. సముద్రంలో ఒక్కటే ఉచ్చైశ్రవం ఉంటుంది కానీ ఇక్కడ అసంఖ్యాకాలున్నాయనే వర్ణన ఈ శ్లోకంలో ఉంది. ఇలా 116 శ్లోకం వరకు కేవలం తటాక వర్ణనే ఉంది. కేవలం తటాక వర్ణన ఇంత అవసరం లేదని చెప్పి శ్రీనాథుడు అనౌచిత్యం ఎందుకని తటాకాన్ని చిన్న గద్యంలో తెలియజేసాడు. దానిని పరిశీలిద్దాం.

**"వ. కాంచి యొక్కింత తడవు మనంబునం గొనియాడుచుం**
**దిమితిమింగిలఝులీ కుళీర మత్స్య కచ్ఛప మకర నికర**
**సంచార తరళ తరంగ మాలికా డోలికాధిరోహలీలా**
**వ్యాలోల కలహంస సంసదాలాప కోలాహల ముఖరిత**
**దిశాభాగంబైన యమ్మహాతటాకంబు తీర ప్రదేశంబున"**

**(శృ.నై. ప్రథ. ఆశ్వా. 99 పద్యం)**

ఒకే వచనంలో అన్ని శ్లోకాల సారాన్ని కవి చెప్పాడు. అంతటి తటాక వర్ణన కథా సందర్భానికి గమనానికి సాగతీతగా అనౌచిత్యంగా పరిగణించి వాటిని వదిలివేశాడు.

**రెండవ భేదం ఉదాహరణ–5**

దయమంతీ విరహవేదనని చతుర్థ సర్గలో 114వ శ్లోకం వరకు వర్ణిస్తే తెలుగులో శ్రీనాథుడు కుదించి అనౌచిత్యాన్ని పరిహరించి, కథాగమనానికి ఒకే ఘట్టం ఎక్కువగా పొడిగించ వద్దని భావించి ముప్పై అయిదు పద్యగద్యాల్లోనే ముగించాడు.

**శ్లో॥ అథనలస్య గుణంగుణ మాత్మభూః**
**సురభితస్యయశః కుసుమంధనుః।**
**శ్రుతి పథోపగతం సుమనస్తయా**
**తమిషుమాశు విధాయజిగాయతామ్॥**

**(హర్ష. నైష. చతు. సర్గ.1వ శ్లో)**

నలుని గుణాలు, నలుని కీర్తి మన్మథ బాణాలై దమయంతికి మోహ హేతులైనవి.

**శ్లో॥ కలకలస్స తదాళి జనాననా**
**దుదల సద్విపుల స్త్వరితేరితైః।**
**యమధిగమ్య సుతాలయమేతవాన్**
**ద్రుత తరస్స విదర్భ పురందరః॥**

(హర్ష. నైష. చతు.సర్గ. శ్లో.114)

చెలికత్తెలు దమయంతి దేహపరిస్థితిని గూర్చి కలతనొంది తత్తరపాటుతో మాట్లాడుతుండగా చాలా కోలాహలం ఏర్పడింది. అది విని విదర్భభూపతియైన భీమరాజు మిక్కిలి త్వరలో తన కుమార్తె మందిరానికి వచ్చాడు. ఇలా దమయంతీ విరహావస్థ హర్షుడు పలువిధాలుగా 114 శ్లోకాల్లో వర్ణించాడు. దీనిని శ్రీనాథుడు కేవలం 35 పద్యాల్లో వివరించాడు. 109వ పద్యం నుండి 144వ పద్యం వరకు ఈ సందర్భాన్ని చిత్రించాడు. కొన్ని పద్యాలు చూద్దాం.

**తే॥ అతను తాపజ్వరంబు మై నలమి యుండఁ**
**జపలలోచన ప్రియకథా సరసిఁ దేలె**
**నా యపథ్యంబునన కదా యంత కతం**
**కలరుఁబోణికి సంతాప మతిశయిల్లె**

(శృ.నై. ద్వితీ. ఆశ్వా.110 పద్యం)

దమయంతికి అంతకంతకు తాపజ్వరం విషమిస్తుంది. మొదలైన 35 పద్యాల్లో దమయంతీ విరాళిని వర్ణించాడు శ్రీనాథుడు. వీటిని కూడా ప్రబంధ వక్రతలో రెండవ భేదానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**రెండవ భేదం ఉదాహరణ–6**

భారవి కిరాతార్జునీయంలో శివార్జునుల సంవాదం నేరుగా జరగలేదు కానీ హరవిలాసంలో జరిగింది. కిరాతార్జునీయంలో కిరాత సైన్య నాయకుడు వచ్చి మా కిరాతరాజు అస్త్ర విద్యను ఎరిగినవాడు. మామూలు పర్వతవాసి అని తలంచకు. నీ అపరాధాన్ని మునివి కనుక క్షమిస్తున్నానని చెప్పాడు అంటూ ఇలా చెప్తాడు.

**శ్లో॥ తత్తితిక్షితమిదం మయా మునే**
**రిత్యవోచత వచశ్చమూపతిః**
**బాణమత్రభవతే నిజం దిశ**
**న్నాప్నుహి త్వమపి సర్వసంపదః**

(కిరా. త్రయో. సర్గ. శ్లో.68)

కానీ హరవిలాసంలో అలా కాకుండా నేరుగా శివుడే అడిగినట్లు ఇలా ఉంది.

**తే॥ ఎవ్వఁడవురోరి నీవు నా యెదురఁబాఱు**
**పంది నేసితి బాహు దర్పంబు మెఱసి**

**యెఱుగవుర యోరి నన్ను నీ యింద్రకీల**
**పర్వంతంబేలు వనచరసార్వభౌము**

**(హర. సప్త. ఆశ్వా.50 పద్యం)**

నా ఎదురుగా పరిగెడుతున్న పందినేసిన నీవు ఎవడివిరా ఇంద్రకీల పర్వతాన్ని పాలించే ఆటవిక రాజుని నన్ను ఎరుగవురా అని పౌరుషాన్ని ప్రదర్శించినట్లు ఉంది. కిరాత రాజు సైన్యంతో గల సంభాషణను కవి వదిలి వేసి కొత్త పద్ధతిలో స్వతంత్రంగా చెప్పడం అలాగే సైన్యాధ్యక్షుని సంభాషణ నీరసంగా భావించి తొలగించటం అనేది ప్రబంధ వక్రత ద్వితీయ భేదంగా చెప్పవచ్చు.

**రెండవ భేదం ఉదాహరణ–7**

దమయంతి స్వయంవరానికి వచ్చిన రాజుల గోత్రనామాలను తెలియజేయడానికి వర్ణింపసాధ్యులు కావాలి అని చింతిస్తున్న సందర్భంలో భీమరాజు శ్రీమన్నారాయణుని వేడుకున్నాడని మూలగ్రంథం హర్ష నైషధంలో ఇలా ఉంది.

**శ్లో॥ శ్రద్ధాళు సఙ్కల్పిత కల్పనాయాం**
**కల్పద్రుమస్యాథ రథాఙ్గపాణేః।**
**తదాఽఽకులేఽసౌ కులదైవతస్య**
**స్మృతిం తతాన క్షణమేకతానః॥**

**(హర్ష.నైష. దశ సర్గ. శ్లో.69)**

శ్రీమన్నారాయణుని వేడుకున్నాడు భీమరాజు. ఏకాగ్రతతో స్మరించాడు. విష్ణువు సరస్వతిని నియమించాడు. నీవు వెళ్ళి రాజుల గోత్రాదులను తెలియజేయాలని చెప్పగా సరస్వతి బాలిక రూపంలో ఇలా వచ్చిందంటు ఉన్న శ్లోకం గమనిద్దాం.

**శ్లో॥ మధ్యేసభం సాఽవతతార బాలా**
**గన్ధర్వ విద్యామయ కణనాళా**
**త్రయీమయీభూతవలీ విభఙ్గా**
**సాహిత్య నిర్వర్తిత దృక్తరఙ్గా**

**(హర్ష.నైష.దశ సర్గ. శ్లో.74)**

సభామధ్యలో బాలిక రూపంలో స్వర్గం నుండి సరస్వతి దిగింది. ఆమె కంఠనాళాలు గాన విద్యరూపంగా, ఆమె త్రివళులు ఋగ్యజుసామ రూపాలుగ, ఆమె నేత్ర విలాసాలు కావ్యనాటక

చంపూలుగా శోభిల్లాయి. ఇలా మూలంలో ఉండగా శ్రీనాథుడు మార్పు చేసి వేరే ఔచిత్యవంతంగా వర్ణించాడు.

మూలంలో భీమరాజు విష్ణువుని కోరగా సరస్వతి నియామకం జరిగింది. శృంగార నైషధంలో నేరుగా సరస్వతినే ప్రార్థించినట్లు ఉంది. అలాగే సరస్వతి బాలిక రూపంలో రావటం అనౌచిత్యం పెండ్లి పెద్దగా బాలిక రావటం సరియైనది కాదని భారతీ సాక్షాత్కరించదని తెలుపుతూ శ్రీనాథుడు ఇలా అంటాడు.

**మ॥ జగతీనాథుని ముందటన్నిలిచె సాక్షాత్కారముం బొంది యా**
**జగదేక స్తవనీయ శారద శరచ్చం ద్రాత పాలోకము**
**న్నగవుం దేటయు దివ్యదేహ రుచియున్ సమ్మేళనం బొంది చె**
**ల్వగు చుండన్ గరుణా పరాయణత నయ్యాక్థాన మధ్యంబునన్**

**(శృ.నై. చతు. ఆశ్వా.140 పద్యం)**

జగత్తుచే పొగడదగిన ఆ శారదా దేవి శరత్కాల చంద్రుని వెలుగులా, ప్రసన్నమైన చుపూతో, దివ్యదేహ కాంతితో సభామధ్యలో సాక్షాత్కారం అయ్యిందని వర్ణించాడు. ఇక్కడ బాలికగా చెప్పలేదు.

అలాగే దమయంతిని రాజుని పరిణయమాడు అని సరస్వతి చెప్తున్న సందర్భంలో హర్షుని శ్లోకాన్ని గమనిద్దాం.

**శ్లో॥ దేవీ పవిత్ర తచతుర్భుజవామభాగా**
**వాగాఽఽలపత్ పునిరమాం గరిమాభిరామామ్**
**అస్యాఽరిని ష్కృపకృపాణ సనాథపాణేః**
**పాణిగ్రహాదను గృహాణ గణం గుణానామ్॥**

**(హర్ష.నైష.ఏకా. సర్గ. శ్లో.66)**

మహావిష్ణువుకు కుడివైపు లక్ష్మి, ఎడమవైపు సరస్వతి ఉన్నారని పురాణ ప్రసిద్ధి. ఆ సరస్వతి గుణ గౌరవంతో అర్థ గౌరవంతో కూడిన మాటను దమయంతికి చెప్తూ శత్రువుల విషయంలో దయమాలిన ఖడ్గం గల రాజు పాణిగ్రహణం కావించమని తెలిపింది. ఇది అనౌచిత్యంగా భావించి శ్రీనాథుడు 'చతుర్భుజుని కోడలు' అని రచించాడు. దీనిని గూర్చి కొర్లపాటి శ్రీరామమూర్తి చర్చించాడు.

"ఇట సరస్వతి విష్ణువు భార్యయని కలదు. ఇట్లు వర్ణించుట చేతనే కాశ్మీర దేశమున శారదా పీఠము నుండి నైషధీయ చరితము నేలఁబడినదని యైతిహ్యము. ఏదో పురాణమున నిట్లు కలదని శ్రీహర్షుఁడు చెప్పినందున సరస్వతీదేవి నైషధీయ చరితమును సమాదరించినదని యైతిహ్యము సాగినను వాగీశ్వరి ప్రథమతః అన్నట్లు సరస్వతి బ్రహ్మ భార్యయను లోకరూఢమైన విషయమునకు విరుద్ధముగనిట్లు వివరించుట సముచితము కాదు".

"చతుర్భుదుఁడన విష్ణువే విష్ణువునకు బ్రహ్మనాభికమలోద్భవుడు. కాబట్టి విష్ణువునకు బ్రహ్మ భార్య కోడలు. ఇది యథార్థము సముచితము" (శ్రీరామమూర్తి, కొర్లపాటి. 1971. పుట. 688, 689).

"యా చతుర్భుజుని కోడలు గనుసన్నసేయ" (శృ.నై. వ.65. పంచ. ఆశ్వా.) అని రాయడం ఉచితం. అనౌచిత్యాలను పరిహరించి ఔచిత్యవంతంగా కావ్యాలను మలిచాడు. ఇలాంటి అనౌచిత్య పరిహరణ, హంస దౌత్యంలో, నలదమయంతుల విహార విషయాల్లో నలుని వర్ణన సందర్భంలో జగన్మాతలే నలుని సౌందర్యానికి చిత్త చాంచాల్యాన్ని పొందడమనేది అనౌచిత్యం, లోక ప్రచారంలో లేనిది మింగుడు పడని విషయంగా భావించి ఎన్నో వైరుధ్యాలను తొలగించి సముచిత వర్ణనలు చేసి మెప్పించిన కవి శ్రీనాథుడు. అనౌచిత్య పరిహారణ కూడా వక్రతే.

### 6.2.3. ప్రబంధ వక్రత– మూడవ భేదం

**కా॥ ప్రధాన వస్తు సంబంధ తిరోధాన విధాయినా,**
**కార్యాన్తరాన్తరాయేణ విచ్ఛిన్న విరసా కథా**
**తత్రైవ తస్య నిష్పత్తేః నిర్నిబన్ద రసోజ్జ్వలామ్,**
**ప్రబన్దస్యాను బధ్నాతి నవాం కామపి వక్రతామ్.**

**(వ.జీ. చతు.ఉన్మే.కా.20, 21)**

ప్రధాన కథావస్తువు యొక్క ఫలప్రాప్తికి, విరుద్ధమైన కార్యాంతరము కల్పించి చివరకు ఆ కార్యము ద్వారానే ప్రధాన ఫలం ప్రాప్తించటం అనేది ప్రబంధ వక్రత ఒకానొక భేదంగా వివరించాడు.

దీనికి ఉదాహరణగా శిశుపాల వధను పేర్కొన్నాడు. నారదుడు శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చి శిశుపాలున్ని వధించమని చెప్పగా బలరాములతో మంతనాలు జరిపి చంపాలని నిర్ణయించుకోవడం అన్ని జరుగుతుండగా, అంతలోనే రాజసూయ వృత్తాంతం ప్రవేశపెట్టడం కార్యాంతరం రావటం. అసలు శిశుపాల వధ మరుగునపడటం జరుగుతుంది. కానీ

కార్యాంతరమైన రాజసూయంలోనే శిశుపాల వధ జరగటం ఒక ప్రబంధ వక్రత. ప్రధాన కార్యానికి ఇక్కడ రాజసూయ వృత్తాంతం ఆటంకం ఆ యాగ సమయంలో శిశుపాల సంహారం జరగటం ఫలసిద్ధి చేకూరటం.

**మూడవ భేదం ఉదాహరణ–1**

హరవిలాసంలో చిఱుతొండ నంబి సిరియాలున్ని వండిపెడతానని జగంమరూపియైన ఈశ్వరునితో చెప్పటం, శివుడు అంగీకరించడం అనే ఘట్టం కలదు. ఇందులో సిరియాలున్ని ఉద్దేశ్యపూర్వకంగా శివుడు మాయ మాటలు చెప్పి ఆటంకం కలిగిస్తాడు. నీ తండ్రి నిన్ను వధించి పాకం చేయాలని తలిచడని తెలుపుతూ ఇలా అంటాడు.

**శా॥ అన్నా! యీ చిఱుతొండ నంబియను పాపాత్ముండు మీ తండ్రియే**
**యన్నిర్భాగ్యుఁడు జోగి కొక్కరునికిన్ హాలామదోన్మాదికిన్**
**నిన్నుంజంపి మహేశహారముగ వండింపనున్నాఁడు సం**
**పన్న స్నేహముతోడ నీకు నెఱిఁగింపన్ వచ్చితిం జెచ్చెరన్**

**(హర. ద్వితీ. ఆశ్వా. 75 పద్యం)**

అన్నా మద్యపానంతో మత్తిల్లిన శివయోగికి నిన్ను చంపి వడ్డించాలనుకున్న తండ్రి నీ తండ్రేనా? నీకు తెలుపాలని వేగంగా వచ్చానని శివుడు చెప్తాడు. కరుణరసయుక్తంగా కవి చిత్రించిన ఘట్టం. ఇది ప్రబంధ కార్యానికి ఆటంకం కానీ ఆటంకంలో కార్యసిద్ధిని చూపటమే కవి ప్రతిభగా చెప్పవచ్చు. అందుకు సమాధానంగా ఇలా చెప్తాడు.

**తే॥ అధ్రువంబైన మలభాండమైన దేహ**
**మనఘయన్యోపకారార్థమై వ్యయించి**
**ప్రవిమలంబుఁ గల్పాంతర ధ్రువమునైన**
**కీర్తికాయంబుఁ గైకొంట కార్తియేల**

**(హర. ద్వితీ. ఆశ్వా.81 పద్యం)**

అస్థిరం, దోషభూయిష్ఠమైన ఇతరులకై ఉపయోగించి, శాశ్వత కీర్తిని పొందదానికి సంతాపం ఎందుకని సమాధానం ఇస్తాడు. అలాగే పార్వతిదేవి తాపస స్త్రీ వేషాన్ని మార్చి పదహారేండ్ల పచ్చి బాలింతరాలుగా మారి సిరియాలున్ని చంపకుండా తిరువెంగనాచిని ప్రేరేపిద్దామని వెళ్ళి తన బిడ్డకు పాలుపోయమని ఇలా అంటుంది.

ఉ॥ మక్కువరేఁగి నెయ్యపుఁ గుమారునిఁ జంపుట కంతరాయమై
యక్కటికంబు పుట్టుటకు నల్లన వచ్చి భవాని యత్తఱిం
దక్కటి మాయజోగిత విధంబున బిడ్డకుఁ బాలు వేఁడ నా
యక్కయుఁ బోసెనెల్ల సమయంబులఁ బోలె నిరాకులాత్మయై

(హర. ద్వితీ. ఆశ్వా.95 పద్యం)

ప్రేమ పుట్టే విధంగా పార్వతి బిడ్డకు పాలుకోరటం, తిరువెంగనాచి ఎప్పటిలాగే ఉంది. ఎలాంటి వ్యాకులత లేకుండా పాలు పోసింది. నీ భర్త ఎలా కుమారున్ని చంపుతాడని అంటే అమ్మా శివునికి శివయోగికి భేదము లేదు కదా అని అనటం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇలా ఆటంకంలోనే కార్యం పూర్తి కాబోయే సూచన కనిపిస్తుంది. విరుద్ధమైన కార్యాన్ని కల్పించినప్పటికి ఫలప్రాప్తి జరగడం కూడా వక్రతే.

**మూడవ భేదం ఉదాహరణ–2**

భీమేశ్వరపురాణంలో కూడా సప్తర్షులు భీమేశ్వరుని ప్రతిష్ఠించాలని పూనుకొని గౌతమీనదిని తీసుకువచ్చి ఆ జలంతో స్వామిని అభిషేకించాలని అనుకుంటారు. నదీ ప్రవాహంతో మునులు రాగా అక్కడి రాక్షసుల ఆశ్రయాలు చెల్లాచెదురై పోతాయి. ఇదొక ఆటంకం. దీనిని జంధ్యాల జయకృష్ణ బాపూజీ ప్రబంధ వక్రత భేదంగా ఉదహరించాడు.

తే॥ ఋషుల వెంబడి సంరంభ మెసఁగవచ్చు
తటిని నడుత్రోవ వనములోఁ దపము సేయు
దైత్యమునుల పుణ్యాశ్రమ స్థలము సొచ్చి
వరదఁగొనిపోయె నిండు సర్వస్వములును

(భీమే. చతు. ఆశ్వా.181 పద్యం)

సప్తర్షుల వెంబడి వేగంతో వచ్చిన గోదావరి ప్రవాహానికి ఆశ్రమ ప్రాంతాలు సర్వస్వం కొట్టుకుపోయినవి.

ఆకాశ దివ్యమునులును
నాకౌకః ప్రత్యనీక నాయక మునులున్
వాకాటులకుం జొచ్చిరి
పాకంబులు దప్పినట్టి వటురోషములన్

(భీమే. చతు. ఆశ్వా. పద్యం.183)

సప్తర్షులు, రాక్షస మునులు యోగ్యతలను విడిచి రోషానికి గురై తగవులాడారు. శాపించారు ఒకరినొకరు. తుల్యభాగుడు వారిరువురికి సంధి కూర్చగా గోదావరీ ఉరకలతోవచ్చి శుభ సమయం మించక ముందే దక్షారామాన్ని ప్రవేశించింది. సూర్యుడు మునులకు ఎదురుపడి సమయం మించి పోకుండా భీమేశ్వరుడు తనకు తానే ప్రతిష్ఠితుడైనాడని తెలుపగా మునులు సంతోషపడ్డారు. ఆటంకం ఏర్పడటం, ఆ సమయంలో కార్యం కావటం అనేది ప్రబంధ వక్రతగా భావించాలి.

### 6.2.4. ప్రబంధ వక్రత–నాల్గవ భేదం

**కా॥ తత్రైక ఫల సంపత్తి సముద్యుక్తోऽపినాయకః,**
**ఫలాన్తరేష్వనన్తేషు తత్తుల్య ప్రతిపత్తిషు**
**ధత్తే నిమిత్తతాం స్ఫారయశః సంభార భాజనమ్,**
**స్వమాహాత్మ్య చమత్కారాత్ సాపరాచాస్య వక్రతా.**

**(వ.జీ.చతు.ఉన్మే కా.22, 23)**

నాయకుడు ఎక్కడైతే ప్రధాన కథకు సంబంధించిన ఫలితాన్ని చేకూర్చడానికి ప్రయత్నించినపుడు దానితోపాటుగా, ఇతర ఫలాలు పొందడానికి కారణమైతే వచ్చేటువంటి కీర్తి వల్ల కలిగే శోభ (చమత్కారం) ఏదైతే ఉందో ప్రకరణ వక్రత అని చెప్పాడు.

ఒక కథకు సంబంధించిన ఫలితాన్ని ఆశిస్తూ చేసిన ప్రయత్నంతోపాటు ఇతర విషయాలకు సంబంధించిన ఫలితం రావటం.

ఉదా: నాగానందంలో గరత్మంతుడు పాములను తినడం ఉంది. అది తెలుసుకొన్న జీమూతవాహనుడు శంఖచూడుడనే పామును గరత్మంతునికి ఆహారమవుతాడు. చివరికి అమృతం తీసుకొచ్చి జీమూత వాహనున్ని గరత్మంతుడు బ్రతికిస్తే, చనిపోయిన, పాములను కూడా బ్రతికించమని కోరగా వాటిని కూడా బ్రతికిస్తాడు గరుడుడు. ఇలా ప్రధాన ఫలంతోపాటు పాములను అన్నింటిని బ్రతికించటం ఇతర ఫలం. దీని ద్వారా నాయకుడైన జీమూతవాహనుడు ఒక్క ప్రయత్నము చేత శంఖచూడున్నే కాకుండా మృతులైన వారిని, మరణింపనున్నవారినైన ఇతర నాగులను, వాళ్ళ కుటుంబాన్ని కూడా రక్షించి ఉన్నత కీర్తిని గడించాడు. కనుక ఇది ప్రబంధ వక్రత. ప్రధాన కథతోపాటు అవాంతర కథ కూడా ఫలాన్ని పొందటం.

**నాల్గవ భేదం ఉదాహరణ–1**

హరవిలాసంలో సప్తమాశ్వాసంలో అర్జునుని పాశుపతాస్త్ర సంపాదనం వర్ణించబడింది. మొదట ఇంద్రుని కోసం అర్జునుడు తపస్సు చేస్తాడు. ఇంద్రుడు ప్రత్యక్షమైన తర్వాత ఇలా మాట్లాడుతాడు.

**గురుభీష్మకరణసైంధవ**
**గురుతనయుల తోడఁ గూడఁ గురపతి బలము**
**న్బరిమార్చునట్టి సత్త్వముఁ**
**బురుహూతా యిమ్ము కరుణ పొంపిరి వోవన్**

(హర. సప్త. ఆశ్వా.24 పద్యం)

ద్రోణ, భీష్మ, కర్ణ, జయద్రథ, అశ్వత్థామాదులతో కూడిన కురుపతి సైన్యాన్ని నాశనం చేసే శక్తిని నాకు ప్రసాదించు ఇంద్రా! అని కోరుకున్నాడు అర్జునుడు.

దానికి ఇంద్రుడు సమాధానమిస్తూ ఇలా అంటాడు.

తే॥ **భీష్మ గురుకృపుల నిర్భేద్య బలులు**
**ద్రౌణి భూరిశ్రవో భగదత్త శల్య**
**సైంధవులు పేరుగలవారు సమర జయము**
**శంభుకృప లేక యెబ్బంగి సంభవించు**

(హర. సప్త. ఆశ్వా.26 పద్యం)

భీష్మ, ద్రోణ, కృపాచారి మొదలైనవారిని జయించడానికి శక్యం గాదు. అశ్వత్థామ, భూరిశ్రవుడు, భగదత్తుడు, శల్యుడు, జయద్రథుడు మొదలైనవారు యుద్ధ విద్యలో ఆరితేరినవారు. పరమేశ్వరుని కృపలేక పోతే యుద్ధంలో విజయం దక్కదని తెలుపుతున్నాడు ఇంద్రుడు. ఈశ్వరున్ని అర్జునుడు వేడుతూ తపస్సు చేయగా అతని పరీక్షించి కిరాతుని వేషంలో వచ్చి తర్వాత ప్రత్యక్షమయి పాశుపతాన్ని ఇస్తాడు. తర్వాత ఇంద్రుని కోరిక ప్రకారం ఇంద్రసారథి వచ్చి అర్జునున్ని ఇంద్రలోకానికి తీసుకెళ్తాడు. ఇంద్రుడు అర్జునున్ని ఉద్దేశించి మాట్లాడుతూ నివాత కవచులను రాక్షసులను సంహరించాలని తెలుపుతాడు.

చ॥ **అలఘు బలుల్నివాత కవచాఖ్యులు వీరులు ఘోరదానవు**
**ల్జలనిధి గొందినుండుదు రసాధ్యులు నిర్జరసిద్ధసాధ్యకుం**
**డలి నరకిన్నర ద్యుచరనాయక కోటికి మూఁడు కోట్లవా**

రల వలనం గలంగెడు నిరంతర బాధల ముజ్జగంబులున్

(హర. సప్త. ఆశ్వా.148 పద్యం)

నివాత కవచులు, దానవులు, మహాబలవంతులు, దేవ, సిద్ధ, సాధ్య, నాగ, నర, కిన్నెర, ఆకాశచరులైన వాళ్ళని మించిన అసాధ్యులు వాళ్ళు కలిగించే బాధల వల్ల మూడు లోకాలు బాధను పొందుతున్నారని తెలుపగా వారిని సంహరించడానికి అర్జునుడు పూనుకొని వారిని సంహరిస్తాడు. అపుడు ఇంద్రుడు ఇలా అంటాడు.

క॥ కదనమున నిన్నుఁ దోడరఁగం
త్రిదశ మరుత్సిద్ధ సాధ్య దేవాదులలో
నెదురెవ్వరు లేరనినన్
బదపడియిఁక మానవుండు ప్రతియే నీకున్

(హర. సప్త. ఆశ్వా.190 పద్యం)

యుద్ధంలో నిన్ను దేవ, మరుత్, సిద్ధ, సాధ్య, దేవ గుణాలతో ఎవరూ ఎదురించలేరు. ఆ మానవ కురుసంతానం ఎంతపాటని అంటాడు.

ఇక్కడ అర్జునుడు కురురాజులపై ప్రతీకారానికోసం పాశుపతాన్ని పొందాడు కానీ ప్రధాన కథకు అవాంతరంగా నివాత కవచుల కథ వచ్చింది. రాక్షసుల సంహారం కూడా నిమిత్తం అయ్యింది. కనుక ఇది కూడా ప్రబంధ వక్రతగా చెప్పవచ్చు. కాశీఖండంలో ఇలా ఉపకథలు ఎన్నో నిమిత్తమైనవి వైశ్వానరునికథ, శివశర్మకథ, కళావతి ఉపాఖ్యానం, దివోదాసవర్ణనం మొదలైనవి ఎన్నో కావ్య సౌందర్యోపస్కారకం.

**నాల్గవ భేదం ఉదాహరణ–2**

కాశీఖండంలో అగస్త్యుని వేడటానికి వచ్చిన మునులు అగస్త్యున్ని వెతికి కలవటంతోపాటు, కాశీ విశ్వేశ్వరుని దర్శనం చేసుకోవటం దానికోసం ప్రయాణం కావటం జరిగింది. ప్రధాన ఫలం అగస్త్యున్ని కలవటం దానితోపాటు విశ్వేశ్వర దర్శనం అవాంతరం అంటే నిమిత్తం అయింది కానీ అప్రధానం కాదు. పోయిన పనితోపాటు స్వామి దర్శనాన్ని కూడా ఆనందించారు.

కం॥ ఏకక్రియ ఫలయుగ్మము
నాకర్షింపంగఁ జాలునది, లోపా ము
ద్రా కాంతు గుఱిచి పోవఁగ
శ్రీ కాశీదర్శనంబు చేసిద్ధించున్

(కాశీ. ద్వితీ. ఆశ్వా. 35 పద్యం)

ఇలా మునులు రెండు కార్యాలకు నిమిత్తం కావటం అనేది ప్రబంధ వక్రతలో ఒక భేదంగా భావించవచ్చు. మునుల, దేవతల కాశీ విశ్వేశ్వర సందర్శనం కావ్య సౌందర్యాన్ని ఇనుమడింప చేసింది. ప్రబంధ వక్రతలో నాల్గవ భేదానికి ఉదాహరణగా చెప్పవచ్చు. విశ్వేశ్వరుని దర్శనం చేసిన మునుల స్థితిని కవి ఇలా వర్ణించాడు.

**కం॥ ఆడిరి ప్రమోదనృత్తము**
**పాడిరి మంద్రక మహా ప్రబంధంబుల మో**
**మోడిరి తైర్థికులకుఁ గొ**
**ల్లాడిరి కైవల్య లక్ష్మినమరులు మునులున్**

(కాశీ. ద్వితీ. ఆశ్వా.37 పద్యం)

దేవతలు, మునులు ఆనందాతిశయంతో నృత్యం చేసారు. గేయాలను పాడారు. అక్కడి తైర్థికులకు ఉన్న సుకృత విశేషాలను చూసి ఇలాంటిది మనకు లేదే అని మోక్ష లక్ష్మిని కోరారని భావం.

### 6.2.5. ప్రబంధ వక్రత–ఐదవ భేదం

**కా॥ ఆస్తాం వస్తుషు వైదగ్ధ్యం కావ్యేకామపి వక్రతామ్,**
**ప్రదాన సంవిధానాంక నామ్నాపి కురుతే కవిః**

(వ.జీ.చతు.ఉన్మే. కా.24)

ప్రధాన వస్తువును సూచించేది, ప్రబంధానికి ప్రాణం లాంటి కథ ఏదైతే ఉందో దానికి సంబంధించిన నామకరణం చేయటం కూడా ఒక వక్రత. ప్రబంధ భేదంగా చెప్పాడు కుంతకుడు. ఉదా: అభిజ్ఞానశాకుంతలము, ముద్రారాక్షసము, ప్రతిమానిరుద్ధము మొదలైన పేర్లు ఉదాహరణ వక్రోక్తి జీవితంలో ఇవ్వబడ్డాయి. ఇవి ప్రబంధ వక్రతకు ఉదాహరణలు.

కానీ హయగ్రీవ వధము, శిశుపాలవధము, పాండవాభ్యుదయము అనేవి ప్రబంధ వక్రత కిందికి రావు. ఎందుకంటే వాటి గురించే కథను రాస్తున్నప్పుడు వాటి పేరు పెట్టడం సహజం. ప్రబంధ వక్రతలో కావ్యనామం ఒకటి ఉండి ప్రధానంగా కథలో వేరే కథచోటు చేసుకున్నప్పుడు ఆ పేరు కూడా పెట్టడం సముచితం అది ప్రబంధ వక్రత.

**ఐదవ భేదం ఉదాహరణ–1**

కావ్యానికి సముచిత నామకరణం చేయడం కూడా ఒక ప్రబంధ వక్రత భేదంగా చెప్పాడు. అందుకు ఉదాహరణలుగా శ్రీనాథుని 'హర విలాసం' చెప్పవచ్చు ఎందుకంటే హరుని విలాసాలను వర్ణించు కావ్యం కనుక ఆ పేరు సముచితం. అలాగే శృంగార నైషధం శృంగారానికి ప్రతీకగా చెప్పదగ్గ కావ్యం కనుక ఆ లక్షణ సంబంధమైన పేరు 'శృంగార నైషధం' అని పెట్టడం సముచితం. కావ్యంలోని విషయాన్ని సూచిస్తూ అందులోని గొప్పతనాన్ని వివరిస్తున్నాయి కనుక ఇవి ప్రబంధ వక్రతకు ఉదాహరణలు.

**6.2.6. ప్రబంధ వక్రత–ఆరవ భేదం**

**కా॥ అప్యేకకక్ష్యయా బద్ధాః కావ్యబన్ధాః కవీశ్వరైః,**
**పుష్ణన్త్యనర్ఘామన్యోన్య వైలక్షణ్యేన వక్రతామ్.**

**(వ.జీ. చతు.ఉన్మే. కా.25)**

ఒకే కథను తీసుకొని వివిధ కవులు వివిధ రకాలుగా కూర్చినట్లైతే అది కూడా ప్రబంధ వక్రతే. కథావస్తువు ఒకటే భాసించే తీరు వేరు. ఎలా అంటే ఉదాహరణగా ఈ శ్లోకం చూద్దాం.

**"శ్లో. కథోన్మేషే సమానేఽపి వపుషీవ నిజైర్గుణైః,**
**ప్రబన్ధాః ప్రాణిన ఇవ ప్రభాసన్తే పృథక్ పృథక్"**

"శరీరము వలె కథావస్తువు తుల్యమేయైనను, ప్రబంధములు, ప్రాణుల వలె, తమ తమ గుణములచే వేరువేరుగ భాసించును".

(రామచంద్రుడు, పుల్లెల.2007.పుట.441)

అన్ని ప్రాణులకు శరీరము కచ్చితంగా ఉంటుంది. కానీ వాటి గుణాలు, అంగాలు వేరుగా ఉన్నట్లు కథ సమానంగానే ఉన్నప్పటికి కనిపించే తీరు (భాసించే తీరు) వేరుగా ఉంటే ప్రబంధ వక్రత.

ఉదాహరణకు కుంతకుడు రామాయణాన్ని వివరిస్తూ ఒకే రామకథను తీసుకొని రామాభ్యుదయము, ఉదాత్తరాఘవము, వీరచరితము, బాలరామాయణము, కృత్యారావణము, మాయాపుష్పకముగా కవులు రాసారు. కథ ఒకటే అయినప్పటికి నూతన భంగిమలతో, పదాలలో, వాక్యాలలో మార్పును చేస్తూ కావ్య సౌందర్యాన్ని ఇనుమడింపజేసారు. దాని వలన సహృదయాస్వాదన కలుగుతుంది. కనుక ఇది ఒక ప్రబంధ వక్రత భేదంగా కుంతకుడు పేర్కొన్నాడు.

**ఆరవ భేదం ఉదాహరణ–1**

ఒకే కథను రకరకాలుగా చెప్పడం ప్రబంధ వక్రతలో ఆరవ భేదంగా చెప్పాడు కుంతకుడు. శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో దక్షారామ భీమేశ్వరుని గూర్చి సూతుడు శౌనకాది మునులకు చెప్పే సందర్భంలో యజ్ఞ మృగాన్ని చంపి తలను ఆకాశానికెత్తండని వర్ణిస్తూ ఇలా అంటాడు.

**తే॥ నఱ్ఱుదెగనేసి జన్నపుటిఱ్ఱి శిరము**
**గరిమ చెడకుండ దివివ్రేలఁ గట్టెఁగాన**
**నయముగల వేల్పు శ్రీ భీమనాయకుండు**
**దక్షవాటంబు తీర్థంబు ధరణియందు**

**(భీమే. ద్వితీ. ఆశ్వా.12 పద్యం)**

భీమేశ్వర పురాణంలో శివుడే యజ్ఞమృగాన్ని నరికి శిరస్సుని ఆకాశంలో నిల్పాడు కాబట్టి భీమనాయక స్వామి నీతికల దైవము. దక్షవాటే భూమిపై నిజమైన తీర్థముగా చెప్పిన కవే కాశీఖండములో ఇదే ప్రస్తావనను ఇలా చెప్పాడు చూద్దాం.

**తే॥ అర్థచంద్ర బాణంబున యజ్ఞమృగము**
**శిరముఁదెగనేసి కట్టెనంబరము మీఁద**
**ధాత సతి ముక్కు సోణంబు దాఁకఁగోసెఁ**
**బ్రకట విస్ఫూర్తి శ్రీ వీరభద్రమూర్తి**

**(కాశీ. సప్త. ఆశ్వా.85 పద్యం)**

కాశీఖండంలో శివుని కోపం వలన ఉద్భవించిన వీరభద్రుడు యజ్ఞమృగాన్ని నరికాడని చెప్పాడు. ఒక కావ్యంలో ఒకలాగ ఇంకొక కావ్యంలో ఇంకోలా కథాసౌందర్యాన్ని పెంచడానికి కథను రకరకాలుగా చెప్పడం జరిగింది కనుక ఇది ప్రబంధ వక్రత.

**ఆరవ భేదం ఉదాహరణ–2**

వ్యాసుడు కాశీని శపించడం భిన్నంగా కాశీఖండంలో, భీమఖండంలో ఉంది.

**మాభూ త్త్రైపూరుషీ విద్యా మాభూ త్త్రైపూరుషం ధనమ్**
**మాభూ త్త్రైపూరుషీభక్తిః కాశ్యాం నివసతాం సదా**

**(భీమే. ద్వితీ. ఆశ్వా. శ్లో. 108)**

కాశీలో నివసించు వారికి మూడు తరాల వరకు విద్యా ధనం భక్తి లేకుండా ఉండుగాక అని దీని భావం. సంస్కృత భీమఖండంలో 5వ అధ్యాయం 66వ శ్లోకం యథావిధిగా అక్షరీకరింబడ్డదని భీమఖండం వ్యాఖ్యానం చేసిన గండవరపు లక్ష్మీనారాయణ వ్యాఖ్యాన గ్రంథంలో పేర్కొన్నాడు.

ఇదే సందర్భానికి తగిన శ్లోకం సంస్కృతి కాశీఖండంలో వేరుగా కొంత కలదని తెలుపుతూ ఉదాహరించాడు.

**"మాభూత్రై పూరుషీ విద్యా మాభూత్రైపూరుషంధనమ్**

**మాభూత్రైపూరుషీ ముక్తిః కాశీం వ్యాసః శపన్నితి"**

**(అధ్యా–96. శ్లో.125)**

"ఈ కాశీ ఖండ శ్లోకమునకు శ్రీనాథుని భీమేశ్వర పురాణ శ్లోకమునకు భేదము స్వల్పమని స్పష్టము" (లక్ష్మీనారాయణ, గండవరపు.1997.పుట.220) అని తెలియజేసాడు. భీమేశ్వర పురాణంలో సూతుడు మునులకు వ్యాసుని కథను తెలుపుతాడు. వ్యాసుడు గౌరీదేవి నాకు ఆనతిచ్చింది దాక్షారామం మోక్షప్రదమని తెలుపుతాడు. కావ్యాన్ని మలచడం కొంత భిన్నంగా కథాగమనాన్ని బట్టి కనిపిస్తుంది. తెలుగులో రాసిన శ్రీనాథుని కాశీఖండంలో ఇలా ఉన్న పద్యం చూద్దాం.

**తే.గీ.॥ ధనము లేకుండెదరు మూఁడు తరములందు**

**మూఁడు తరములఁ జెడుఁగాక మోక్ష లక్ష్మి**

**విద్యయును మూఁడు తరముల వెడలవలయుఁ**

**బంచజనులకుఁ గాశికాపట్టణమున**

**(కాశీ. సప్త. ఆశ్వా.158 పద్యం)**

కాశీ పట్టణంలోని జనాలకు ధనం లేకుండా, నిరుపేదలై ఉంటూ, మూడు తరాల వరకు ముక్తి చెడిపోవును. మూడు తరాల వరకు నిరక్షరాస్యులవుతారు అని భావం.

సంస్కృత కాశీఖండంలో వ్యాసుడు కాశీ నగరాన్ని శపిస్తే, తెలుగులో కాశీఖండంలో వ్యాసుడు కాశీని కాదు, కాశీ నగరవాసులను శపించాడు. స్వల్పమైన తేడా ఉంది. ఒక కావ్యంలో ఒక రకంగా మరొక కావ్యంలో ఇంకో విధంగా ఉంది. ఒకే విషయాన్ని కొంత వేరుగా చెప్పటం.

**ఆరవ భేదం ఉదాహరణ–3**

శివుడు క్షీరసాగర మథనం సమయంలో పుట్టిన హాలహల భక్షణ ఘట్టం వేర్వేరుగా చిత్రించడం భీమఖండంలో ఒక విధంగా హరవిలాసంలో మరొక విధంగా ఉంది.

భీమఖండంలో మంకణుడనే ముని కోరిక మేరకు వసిష్ఠుడు శివుడు హాలహలం మింగిన రీతిని తెలియజేస్తాడు. జలంధరుడు, అంధకుడు, మహిషాసురుడు, బిడాలాక్షుడు, ధూమ్రాక్షుడు, నివాతకవచులు, గజాసురుడు మొదలగు రాక్షసులు ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్బతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు మొదలైన దేవతలు శతృత్వంలో కక్షలు పెంచుకోగా ఇంద్రుడు శ్రీ మహావిష్ణువు వద్దకు వెళ్ళి అడగగా క్షీరసాగర మధనం చేస్తే అమృతం వస్తుందని తెలుపుతూ ఇలా అంటాడు.

**శా॥ క్షీరాంభోధి మథింపఁగా వలయు నక్షీణ ప్రతాప ప్రభా**
**వారంభంబున నాది కచ్ఛపము మూలాధార కుండంబుగా**
**సారోదారము మందరాచలము చంచన్మంథ దండంబుగా**
**గారామార రసాతలాధిపతి దృక్కర్ణుండు సూత్రంబుగన్**

**(భీమే. చతు. ఆశ్వా.56 పద్యం)**

ఆదికూర్మం ఆధారంగా, మందర పర్వతం కవ్వంగా, వాసుకి తాడుగా పాల సముద్రాన్ని చిలకాలి అని చెప్పగా దేవదానవులు క్షీర సాగర మధనం ప్రారంభిస్తారు. గొప్ప చిచ్చుతో కాలకూట విషం అనే చిచ్చు వ్యాపించింది. అందరూ చెల్లాచెదురయ్యారు. బ్రహ్మాదులు శివున్ని వేడగా శివుడు దాన్ని గుప్పిట పట్టి మింగాడని శ్రీనాథుని వర్ణన. దాని చూద్దాం.

**కం॥ కటుకమగు విషము విషధర**
**కటకంబగు కేలఁ బూని కౌతూహలియై**
**ఘుటికా సంసిద్ధుఁడు రస**
**ఘుటికయునుం బోలె శివుఁడు గుటుకున మ్రింగెన్**

**(భీమే. చతు. ఆశ్వా.66 పద్యం)**

శివుడు విషాన్ని రసగుళికలా గుటుక్కున మింగాడని భావం. సంస్కృత భీమఖండంలో కూడా ఇలాగే రాసి ఉందని గుండవరపు లక్ష్మీనారాయణ వ్యాఖ్యానంలో తెలిపాడు.

**“గ్రసతేస్మ జగత్రాతా విషభృద్భూషణో విషం**
**ఘుటికాం ఘుటికా సిద్ధో బధ్వారసమయీామివ”**

అని సంస్కృత భీమఖండం (16–35)” (లక్ష్మీనారాయణ, గుండవరపు. 1997.పుట.476).

శివుడు విషాన్ని మింగిన తర్వాత పార్వతి ఆలింగనం చేసుకుందని కవి వర్ణిస్తూ చెప్పిన పద్యం.

**కం॥ అపుడు హిమాచల కన్యక**
**యుపగూహన మాచరించు నొఅపునఁ జుట్టెం**
**ద్రిపురాంతకు కంఠంబునఁ**
**దపనీయచ్ఛాయ నొప్పు తనదోర్వల్లిన్**

**(భీమే. చతు. ఆశ్వా.67 పద్యం)**

కంఠాన్ని బంగారు తీగలలాంటి చేతులతో పరమేశ్వరున్ని చుట్టి ముట్టిందని భావం. భీమఖండంలో ఇలా ఉంటే హరవిలాసంలో ఇదే ఘట్టం వేరుగా ఉంది.

హరవిలాసంలో పార్వతీదేవి స్వయంగా కంఠమూలంలో నీలాన్ని గూర్చి ప్రశ్నించిందంటూ శ్రీనాథుడు వర్ణించిన పద్యాన్ని గమనిస్తే రెండు కావ్యాల్లోన్ని ఒకే ఘట్టంలోని భిన్నత్వం తెలుస్తుంది.

**తే॥ అభవ! నీ కంఠమూలంబునందుఁ దెలిసి**
**కాననయ్యెడు నిది యేమి కప్పుసెప్పు**
**మఖిల లోక విలోచనాహ్లాద కలన**
**కందయై యందమయ్యె శృంగారరేఖ**

**(హర. షష్ఠా. ఆశ్వా.5 పద్యం)**

సర్వలోకాల కన్నులకు ఆహ్లాదం కలిగించే వింత అందాన్ని కలిగి ఉన్న నీ కంఠనీలిమకు గల కారణం ఏమిటి? అని ప్రశ్నిస్తుంది. అపుడు శివుడు జరిగిన వృత్తాంతాన్ని తెలుపుతూ ఇంద్రుని నగరానికి దుర్వాస మహాముని వచ్చాడని, అతడు ప్రమ్లోచ అనే దేవ వనిత ఇచ్చిన పారిజాత మాల ఇంద్రునికి ఇస్తాడు. దానిని నిర్లక్ష్యం చేసి ఏనుగు కుంభస్థలంపై వేయగా అది అందమైన మాలను విచ్ఛిన్నం చేస్తుంది. దానిని చూసిన దుర్వాసుడు కోపించి

**క॥ నీ కనులకునిది మాల్యం**
**బోకుధర విరోధి! యింతనుండియు నిట నీ**
**నా కంబఖిలంబున ని**
**శ్రీకంబగుఁగాక నీ విజృంభణ మణఁగన్**

**(హర. షష్ఠా. ఆశ్వా.22 పద్యం)**

నీ చూపులకు ఇది దండ మాత్రమే. ఈ క్షణం నుండి నీ స్వర్గం సంపద హీనం అవుతుందని శపిస్తాడు.

తే॥ అమృత కుంభంబు పడుఁగాక యబ్ధియందుఁ
గామధేనువు పడుఁగాక కంధియందుఁ
దారకాధీశ్వరుండు, జింతామణియును
గూడ దుగ్ధాంబు నిధిలోనఁ గూలుఁ గాత

(హర. షష్ఠా. ఆశ్వా. 24 పద్యం)

అమృత భాండము, కామధేనువు, చంద్రుడు, చింతామణితో సహా పాలసముద్రంలో పడుతాయని శాపించి అదృశ్యం అయ్యాడు ముని. ఆ సందర్భంలో విష్ణువును కలుపుకొని బ్రహ్మ నావద్దకు రాగా సముద్ర మథనం చేయాలని తెలిపానని శివుడే స్వయంగా చెప్పటం ఇందులోని భిన్నత్వం. అలాగే సామాగ్రిని ఏర్పాటు చేయమని చెప్పడం కూడా భీమఖండంలో భిన్నంగా ఉంది.

క॥ వాసుకి విషధరవిష ని
శ్వాసంబుల ఘట్టనముల సమధికతరమై
యీ సాగర మధ్యంబున
భాసుర హాలాహలంబు ప్రబలంబయ్యెన్

(హర. షష్ఠా. ఆశ్వా.64.పద్యం)

వాసుకి విషశ్వాస చేత కలిసి అధికమైన సముద్ర మధ్యమున హాలాహలం పుట్టింది. సముద్రాలు ఘోషించాయి. దిక్పాలురు తూలిపోయారు. అందరూ వేడగా గుటుక్కున మింగి కంఠంలో గరళాన్ని దాచానని తెలియజేసాడు. ఇలా భీమఖండంలో ఒక విధంగా, హరవిలాసంలో ఒక విధంగా కావ్యాన్ని బట్టి ప్రబంధానికి అనుగుణంగా కథను భిన్న రకాలుగా చెప్పటం కావ్య సౌందర్య హేతువు కావున ఇది ప్రబంధ వక్రతే.

### 6.2.7. ప్రబంధ వక్రత–ఏడవ భేదం

కా॥ నూతనోపాయ నిష్పన్న నయవర్త్మోపదేశినామ్,
మహాకవి ప్రబన్ధానాం సర్వేషామస్తి వక్రతా.

(వ.జీ.చతు.ఉన్మే. కా.26)

నూతనమైన ఉపాయాలచేత సాధ్యమైనంతవరకు నీతిని ఉపదేశించినట్లయితే ఆ మహాకవి ప్రబంధంలో (కావ్యంలో) ప్రబంధ వక్రత ఉన్నట్లేనని నీతిపూర్వక ఉపదేశం ఉండాలని సూచించాడు. దీనికి ఉదాహరణగా ముద్రారాక్షసం, తాపసవత్సరాజములోని నీతి వ్యాపారాలను వివరించాడు.

**ఏడవ భేదం ఉదాహరణ–1**

గుణనిధి కథ చెప్పు సందర్భంలో జూదానికి బానిస అయిన గుణనిధిని తల్లి సోమిదమ్మ వారిస్తూ నీతిబోధ చేస్తూ హితోపదేశం చేస్తుంది.

**కం॥ అవినయ నిధానమగు నీ**
**నవయౌవన శైశవముల నడిమివయసునన్**
**గవిసిన వ్యసనోద్రేకం**
**బవగాఢము దీని మానవయ్య తనూజా!**

**(కాశీ. చతు. ఆశ్వా. 97 పద్యం)**

అవినయమైనట్టివి ఈ నూతన యౌవన శైశవ దశల్లో వచ్చే చెడు అలవాట్లు చాలా లోతైనవి. దీనిని మానుకోవయ్యా అని మంచి మాటలు చెప్పుతుంది. ఇలా నీతిని తల్లిచే బోధ చేయించటం ఇది ప్రబంధ వక్రతగా చెప్పవచ్చు.

అలాగే మరొక పద్యం ఉదాహరణగా చూద్దాం.

**తే.గీ.॥ శాస్త్రమాచార్య సన్నిధి జదువడేని**
**నిద్ధ బోధంబు మది సంగ్రహింపఁడేని**
**తెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపఁడేని**
**జ్ఞాతిజయమందఁడేని తజ్జనుఁడు జనుఁడె?**

**(కాశీ. ప్రథ.ఆశ్వా.107 పద్యం)**

వింధ్య పర్వతం మేరు పర్వతం పట్ల మాత్సర్యంతో ఉండి తనలో తాను కుంగిపోయి గురుసన్నిధిలో శాస్త్రం చదువనినాడు, గొప్పనైన జ్ఞానాన్ని మనస్సులో నిలుపుకొననినాడు, తెగువతో ప్రతిజ్ఞ సాధించనినాడు, జ్ఞాతులపై విజయం పొందని నాడు మనిషి జన్మించిన జన్మించినట్లే అని మనిషి ఎలా ఉండాలో తెలుపుతున్నాడు. పద్యాల ద్వారా నీతిబోధ హితవు చెప్పటం కూడా ఒక కావ్యసౌందర్యంగా భావించాడు కుంతకుడు.

**ఏడవ భేదం ఉదాహరణ–2**

కాశీఖండంలో విశ్వానరునితో నారదుడు సంభాషించే సందర్భంలో వారి కమారున్ని గూర్చి నారదుడు సంభాషిస్తూ ఇలా అంటాడు.

**తే॥ తల్లిదండ్రుల మాట యధఃకరింప**
**కుండుటయ చూవె! ధర్మ మత్యుత్తమంబు**

దైవమనఁగ గురుండునా ధర్మమనఁగ
నర్థమునఁ దల్లిదండ్రులె యాత్మజునకు

(కాశీ. చతు. ఆశ్వా.16 పద్యం)

తల్లిదండ్రుల మాట కాదనకుండ ఉండటమే కొడుకు చేయవలసిన ధర్మాలలో ఉత్తమమైంది. కొడుక్కి దైవమైన, గురువైన తల్లిదండ్రులే అనే నీతిని సందర్భానుసారంగా తెలుపుతూ ఇంకా ఇలా చెప్తాడు కవి.

కం॥ జననీ జనకులఁ గొలుచుట
తనయునకును ముఖ్యమైన ధర్మము జననీ
జనకుల గొల్చుట కంటెను
దనయున కభ్యధికమైన ధర్మములు కలదే?

(కాశీ. చతు. ఆశ్వా.17 పద్యం)

తల్లిదండ్రులను కొలవడం కన్నా కుమారుడికి ఎక్కువైన ధర్మం ఇంకొకటి లేదని ధర్మాన్ని బోధించాడు.

అలాగే తల్లి గొప్పదనాన్ని చెప్తూ ఇలా వచించాడు.

తే॥ సర్వతీర్థంబులకంటె సమధికంబు
పావనంబైన జనయిత్రి పాదజలము
వరతనూజునకఖిల దేవతలకంటె
జనని యెక్కుడు సన్నుతాచారనిరత

(కాశీ. చతు. ఆశ్వా.20 పద్యం)

పావనమైన తల్లి పాదజలం సర్వ తీర్థాల కంటె ఎక్కువ. అన్ని దేవులకు మించి తల్లే మిన్న అని భావం.

బృహస్పతి లోపాముద్రకు పతివ్రతా ధర్మాలను చెప్తున్న సందర్భంలో స్త్రీలు నడుచుకొను విధానాన్ని తెలిపాడు.

ఉ॥ దూరమువోయి యెండఁబడి దూసిలి వచ్చిన ప్రాణనాథునిన్
ద్వార కవాట దేహళుల దాఁక నెదుర్కొని తీర్థమార్చి యా
హారము వెట్టి వీడ్యము సమర్పణ చేసి విహార శయ్యపై
నూరువులొత్తి చిత్తమునకుబ్బొనరంచుట ధర్మమింతికిన్

**(కాశీ. ద్వితీ. ఆశ్వా. 81 పద్యం)**

దూరం వెళ్ళి ఎండలో పడివచ్చిన భర్తకి ఇంటి గడప వరకు వెళ్ళి లోనికి తెచ్చి, జలకాలాడించి భోజనం ఆరగింపజేసి, మనః ప్రియముగ తాంబూలము సమర్పణ చేసి విహార శయ్యపై విశ్రమిస్తే ఊరు సంవాహనము చేయటం ఇల్లాలి ధర్మం. ఇలా సూక్తి వైచిత్రులను తెలిపాడు శ్రీనాథుడు. ఇది కూడా ప్రబంధ భేదంగా తెలిపాడు కుంతకుడు. ఎఱ్ఱన సూక్తి వైచిత్ర కూడా తన రచనల్లో ఉందని చెప్పిన శ్రీనాథుడు కవితా గుణాల్లో ఇది ఒకటని భావించవచ్చు. ఇలా ప్రబంధ వక్రత భేదాలు శ్రీనాథునిలో ఉన్నాయని నిరూపించడమైంది. కుంతకుని ఆరు రకాల వక్రతల భేదాలను సోదాహరణంగా నిరూపించడమైంది.

★★★

## ఉపసంహారం

"శ్రీనాథుని కవితా ప్రస్థానం – సమగ్ర పరిశీలన" అనే నా పరిశోధనాంశాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించుకున్నాను. అందులో శ్రీనాథుని కవితా మార్గం నిర్ధారణ అయ్యే విధంగా ఉదాహరణలు చూపెడుతూ నా పరిశోధనను కొనసాగించాను. శ్రీనాథుడు వక్రోక్తి మార్గాన్ని అనుసరించాడనే విషయాన్ని సహేతుకంగా తెలియజేశాను. శ్రీనాథుడు చెప్పుకున్న కవితా గుణాలైనా వక్రత, కాఠిన్యం, సరసత్వం అనేవి అలాగే పూర్వకవుల కవితా గుణాలైనా ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచిత పదబంధం, సూక్తి వైచిత్రి కూడా కుంతకుని వక్రోక్తి మార్గంలోనే అంతర్భవిస్తున్నాయని సందర్భానుసారంగా సమన్వయంతో తెలియజేశాను ఇతరులు చెప్పిన రీతి ఏదైతే ఉందో అది వక్రతగా నేను భావిస్తున్నాను. కాఠిన్యం, ప్రౌఢోక్తి రెండు కూడా ఉభయ వాక్ప్రౌఢి అనే ఒకే అర్థంలో వాడబడుతున్నవని తెలియజేస్తూ ఉద్దండ లీల కూడా అదే కోవకు చెందిందని నిరూపించాను. ఇవన్నీ కూడా కుంతకుని మొదటి వక్రత భేదమైన వర్ణ విన్యాస వక్రతలో భాగమని భావిస్తున్నాను.

సరసత్వం రసాభ్యుచిత పదబంధం ఒక్కటిగా భావిస్తూ కుంతకుడు చెప్పిన వస్తు వక్రత కవి కౌశలో జ్జీవిత రసంలో అంతర్భవిస్తాయని నిరూపించాను. ఇక ఎర్రన సూక్తి వైచిత్రి ఇది కూడా కుంతకుడు చెప్పిన ప్రబంధ వక్రతలో ఏడవ భేదానికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఇతర కవులు శ్రీనాథుని కవితా మార్గంగా విచిత్ర మార్గం చెప్పారు. అది వక్రోక్తి మార్గమే అని అర్థం చేసుకోవాలి. నా పరిశోధనలో కొత్తగా నేను పూర్వ పరిశోధకులు చెప్పని వస్తు వక్రతను కవి కౌశలోజ్జీవిత స్వభావోక్తిని తెలియజేశాను. కుంతకుడు స్వభావోక్తిని నిరాకరించలేదనే విషయాన్ని స్పష్టం చేశాను. శ్రీనాథుని కవితా గుణాలు కుంతకుని వక్రోక్తి మార్గంలో ఇలా అంతర్భవించాయి.

**కుంతకుని మార్గం – అనుసరణ:**

శ్రీనాథుని మార్గం కుంతకుని వక్రోక్తే అని నిర్ధారించడానికి బలమైన కారణాలున్నాయి.

1) 'హర చూడ హరిణాంక వక్రత' అంటూ వక్రతను చెప్పడం

2) పై పద్యాన్ని పోలిన కారిక వక్రోక్తి జీవితంలో ద్వితీయ ఉన్మేశంలో వాగ్వల్ల్యాః పద పల్లవా స్పద తయా యా వక్ర తోద్భాసినీ విచ్ఛిత్తిః' అని ఉండటం, శ్రీనాథుడు చెప్పిన పదాలే వక్రత, సరసత్వంగా వాడడం బలమైన కారణం

3) పూర్వకవులు విమర్శకులు వక్రతా వ్యాపారాన్ని పాటించాదని చెప్పడం.

4) వ్యక్తిగతంగా నేను నా పరిశోధనలో భాగంగా కుంతకుడి సిద్ధాంత లక్షణాలను శ్రీనాథుని పద్యాలతో సమన్వయం చేస్తున్నప్పుడు కుంతకుని వక్రోక్తి జీవితంలో రకరకాల వక్రతులను చెప్తూ వాటి లక్షణాలను వివరించి తత్సంబంధ ఉదాహరణలను వివిధ సంస్కృత కావ్యాల నుండి ఇచ్చాడు శ్రీనాథుని పద్యాల్లో కూడా అదే అర్థాన్నిచ్చే పద్యాలు అనుకరణ లాగా అనిపించేది కూడా కనిపించాయి. ఆ విషయాన్ని నేను గ్రహించాను. ఉదాహరణకి పద పూర్వార్ధ వక్రతలో భాగమయిన ఉపచార వక్రతను శ్రీనాథుడు అనుసరించిన విషయాన్ని తెలపాలని అనుకుంటున్నాను.

ఉదా॥ కుంతకుడు ఉపచార వక్రతను వివరిస్తూ వస్తువుకు భిన్నమైన ధర్మాన్ని కవి సౌందర్యం కోసం ఎక్కడ ఆరోపిస్తాడో అది ఉపచార వక్రత అంటూ పద పూర్వార్ధ వక్రతను తెలిపాడు. దానికి ఉదాహరణగా సంస్కృత మేఘదూతంలోని శ్లోకాన్ని ఇచ్చాడు దాని పరిశీలిద్దాం.

**గచ్ఛన్తినాం రమణ వసతిం యోషితాం తత్ర నక్తం**
**రుద్ధాలోకే హ నరపతి పథే సూచి భేద్యైస్తమోభిః**

**తాత్పర్యం:** అక్కడ సూదులచే గుచ్చదగిన చీకట్లచే చూపులు ఆనని రాజమార్గ రాత్రులలో ప్రియులు నివాసానికి వెళ్తున్నారని భావం. ఇక్కడ సూచి (సూది) మూర్త భావన. చీకట్లు అమూర్తం. సూచితో గుచ్చడం అనేది మూర్తానికి సంబంధించిన క్రియ. దీనిని అమూర్తంలో ఆరోపించడం ఉపచార వక్రతకు ఉదాహరణగా కుంతకుడు చెప్పాడు.

శ్రీనాథుడు శివరాత్రి మహాత్మ్యంలో శివవిష్ణుల బాణ ప్రయోగాన్ని తెలుపుతూ 'పవలుం బర్వె మహాంధకారములు పైపై సూచి నిర్భేద్యముల్' అని అంటాడు ఒకే రకమైన భావన. దీనిని బట్టి కుంతకుని సిద్ధాంతాన్ని అనుసరించాడు అని చెప్పవచ్చు. దీనిని ఉపచార వక్రతకు నేను ఇచ్చిన సమన్వయంలో చూడవచ్చు. ఇదొక్క ఉదాహరణ అనే కాదు సంవృత్తి వక్రతలో క్రియా వైచిత్ర్య వక్రతలో ఉన్న శ్రీనాథుని పద్యాలను గమనిస్తే కుంతకుని సిద్ధాంతాన్ని శ్రీనాథుడు అనుసరించాడు అని తెలుస్తుంది. ఒకే రకమైన పోలికలు ఉల్లేఖాలు కనిపిస్తాయి. ఇలా చాలా కారణాల దృష్ట్యా శ్రీనాథుని కవితా మార్గం వక్రోక్తిని అనుసరించిందని స్పష్టం చేయాలని

అనుకుంటున్నాను. సందర్భానుసారంగా ఆయా అధ్యాయాల్లో వక్రతల వివరణతో కవి పద్యాలను వక్రత వ్యాపారానికి సమన్వయం చేశాను.

**పరిశోధన ముఖ్య ఫలితాలు:**

1) శ్రీనాథుని కవితా మార్గంపై వాదోపవాదాలు చర్చితమయ్యాయి.
2) శ్రీనాథుని అసలైన మార్గం ఏమిటని స్పష్టమవుతుంది.
3) శ్రీనాథుని రచనల్లోని ఇతర కవుల మార్గ అనుసరణ అవగతమవుతుంది.
4) శ్రీనాథుని రచనల్లోని శబ్దమాధుర్యం వెల్లడి అవుతుంది.
5) వక్రతా వ్యాపారం ఎలా అనుసరించబడిందో తెలుస్తుంది.
6) శ్రీనాథుని కవిత్వంలోని చమత్కృతి తెలుస్తుంది.
7) శ్రీనాథుని బహుముఖీనమైన పాండిత్య ప్రకర్ష, కవిత్వ రచనానైపుణ్యం వెల్లడి అవుతుంది.
8) కుంతకుని వక్రోక్తి మార్గంలోని రకరకాల వక్రతలు, వాటి అంతర్భేదాలు చెప్పబడ్డాయి. వాటిని వివరణాత్మకంగా తెలుసుకోవచ్చు.
9) వక్రోక్తి సిద్ధాంత నేపథ్యం తెలుస్తుంది.
10) వక్రతల అంతర్భేదాలు వాటి లక్షణాలు తెలుసుకోబడుతాయి.
11) శ్రీనాథుని పద్యాల్లోని వక్రత భేదాలు సమన్వయంతో నిరూపించబడ్డాయి.
12) వర్ణ విన్యాస వక్రత సమన్వయం చేయబపడింది.
13) పద పూర్వార్ధ, పరార్ధ వక్రత సమన్వయం చేయబడింది.
14) వాక్యంలో అలంకార వైశిష్ట్యం తెలుపబడటంతోపాటు, వస్తు వక్రత, రస సంబంధ విషయాలు చర్చించబడ్డాయి.
15) ప్రకరణ, ప్రబంధ వక్రతా భేదాలను తెలుపుతూ, సోదాహరణంగా వివరణలు ఇవ్వటం జరిగింది. శ్రీనాథుని కవిత్వంలో కుంతకుని 68 రకాల వక్రతా భేదాలను సమన్వయం చేసి, కుంతకుని మార్గాన్ని శ్రీనాథుడు అనుసరించాడని నిరూపించబడింది.

**భవిష్యత్తు పరిశోధనలు:**

శ్రీనాథుడు విశ్వ దర్శనం చేసిన మహాకవి అతని రచనలు మహాసముద్రం లాంటివి. శృంగార నైషధం లాంటి కావ్యాలను అవగతం చేసుకోవడం చాలా గొప్పనైన విషయం.

ఇప్పటివరకు పరిశోధనలు ఎన్ని జరిగినా ఇంకా చేయాల్సింది ఉండే ఉంటుంది. శ్రీనాథుని రచనలు అలాంటివి. నా అభిప్రాయం ప్రకారం ఈ పరిశోధనలు చేయవచ్చు.

1) శ్రీనాథుని కవిత్వం అలంకార శిల్పంపైన పరిశోధన చేయవచ్చు.
2) శ్రీనాథుని కవిత్వం సంస్కృత కవుల మార్గాలతో తులనాత్మక అధ్యయనం చేయవచ్చు.
3) శ్రీనాథుని రచనల్లో ఉపమాలంకార సౌందర్యాన్ని తెలియజేయవచ్చు.
4) జాతీయాలు, నుడికారాలు, లోకోక్తుల మీద విస్తృతంగా పరిశీలించాలి. ఈ విషయాన్ని జంధ్యాల బాపూజీ గారు కూడా చెప్పారు.
5) సాంస్కృతిక అంశాల పట్ల పరిశోధన చేయవచ్చు.
6) ఆలంకారిక ప్రస్థానాలను తులనాత్మకంగా పరిశీలించవచ్చు.
7) వాడుక భాష పదప్రయోగాలు, అన్యదేశీయాల మీద చేయవచ్చు.

★★★

# ఉపయుక్త గ్రంథసూచి

# (Bibliography)

## ప్రాథమిక ఆకరాలు (Primary Sources)

నా పరిశోధన పూర్తి చేయడానికి అనేక గ్రంథాలు, వ్యాసాలు ఉపయోగపడ్డాయి. వాటిని నా సిద్ధాంత గ్రంథం చివరన ఉపయుక్త గ్రంథసూచిలో పేర్కొన్నాను. ప్రస్తుతం పరిశోధన ముఖ్య ఆకరాలను, ఇక్కడ పేర్కొంటున్నాను.


1) ప్రభాకరశాస్త్రి, వేటూరి. (2013). చాటుపద్యమణిమంజరి (మొదటి భాగం మరియు రెండవ భాగం). తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

2) బాలగంగాధరరావు, యార్లగడ్డ. (2015). శ్రీనాథకవి సార్వభౌముని హరవిలాసం (హైమవతీ వ్యాఖ్యాసహితము). విజయవాడ: నిర్మలా పబ్లికేషన్స్.

3) లక్ష్మీనారాయణ, గుండవరపు. (1997). శ్రీనాథ మహాకవి విరచిత భీమేశ్వర పురాణము (దక్షిణ కాశికా వ్యాఖ్యానం). గుంటూరు: ఫాలాక్ష ప్రచురణ.

4) మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. (1995). శ్రీ శివరాత్రి మహాత్మ్యం (చంద్రికా వ్యాఖ్యానసహితం). హైదరాబాద్. తెలుగు విశ్వవిద్యాలయం.

5) వెంకటరాయ శాస్త్రి, వేదము. (2012). శ్రీనాథకృత శృంగార నైషధము (సర్వంకష వ్యాఖ్యతో). హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

6) శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. (2012). శ్రీనాథ విరచిత కాశీఖండం (మణికర్ణికా వ్యాఖ్యాన సహితము). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

7) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2007). కుంతకుని వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యతో). న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

8) సుందరాచార్యులు, కె.వి. (2012). భారవి కిరాతార్జునీయం (తెలుగు వ్యాఖ్య). హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

9) సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. (2003). శ్రీ కాళిదాస విరచితమ్. కుమార సమ్భవమ్ (తెలుగు సేత). హైదరాబాద్: శ్రీ గోపాల్ పబ్లికేషన్స్.

10) సుబ్బారావు, ఉడాలి. (1984). శ్రీహర్షనైషధం (ఆంధ్ర వ్యాఖ్యతో ఏడు సంపుటాలు). హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ.

**ద్వితీయ ఆకరాలు (Secondary Sources)**


1) అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి. (1986). **శాలివాహన గాథాసప్తశతి సారము.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

2) అనంతలక్ష్మి, ఎస్. (2010). **శ్రీనాథుని కావ్యాలలో భోజన వర్ణన.** హైదరాబాద్: సి.పి. బ్రౌన్ అకాడమీ.

3) **ఆంధ్ర మహాభారతము, ఆది, సభా పర్వములు.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

4) ఆనందమూర్తి, వేటూరి. (1960). **క్రీడాభిరామం.** హైదరాబాద్: మణిమంజరి ప్రచురణలు.

5) ఆనందమూర్తి, వేటూరి. (1988). **చాటుపద్యమణిమంజరి.** హైదరాబాద్: మణిమంజరి ప్రచురణలు.

6) ఆరుద్ర. (1990). **సమగ్రాంధ్ర సాహిత్యం (3వ సంపుటి).** విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.

7) **ఇతిహాసలహరి**. (1982). సికింద్రాబాదు: యువభారతి, సాహితీ సాంస్కృతిక సంస్థ.

8) ఈశ్వరదత్తు, కుందూరి. (1964). **శ్రీనాథుని కవితా తత్త్వం.** హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్.

9) ఉమాకాంత విద్యాశేఖరులు, పండిత. (1997). **పల్నాటి వీరచరిత్ర.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

10) ఎల్లనార్యుడు, చింతలపూడి. (1936). **శ్రీరాధామాధవము.** కాకినాడ: కాకినాడ ముద్రణాలయం.

11) కమల, ఆర్. (2003). **ఆంధ్ర కావ్యాలు, ఆణిముత్యాలు.** హైదరాబాద్: తిరుమల కాంప్రింట్స్ ప్రైవేట్ లిమిటెడ్.

12) కామేశ్వరరావు, వేదుల. (1979). **నాచనసోమనాథుడు, కావ్యానుశీలనము.** పెద్దాపురం. లక్ష్మీపతి పబ్లికేషన్స్.

13) కాశీఖండము. పండిత పరిష్కృతము. (2013). నవరత్న బుక్‌హౌస్. విజయవాడ.

14) కుమారస్వామి నాయుడు, గోళ్ళ. (1998). **దివాకర్ల వేంకటావధాని జీవితం, సాహిత్యం.** హైదరాబాద్: బాలాజీ ఆర్ట్స్ ప్రింటర్స్.

15) గంగప్ప, ఎస్. (1990). **ఎర్రన – రసపోషణ.** గుంటూరు: విజేత ప్రింటర్స్.

16) గణపతిశాస్త్రి, చర్ల. (1972). **సాహిత్య సౌందర్య దర్శనం.** హైదరాబాద్: లలితా ప్రెస్.

17) గోపాలకృష్ణ, రెంటాల. (2015). **శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర**. విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.

18) గోపాలరెడ్డి, ముదిగంటి. (2007). **సంస్కృత సాహిత్య చరిత్ర.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

19) చంద్రశేఖరరెడ్డి, రాచపాలెం. (1992). **ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు**. హైదరాబాద్: తెలుగు అకాడమీ.

20) చిన్నికృష్ణశర్మ, దేవరకొండ. (2015). **శ్రీనాథకవి భీమఖండం (వచనం).** విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.

21) జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. (1977). **శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం**. గుంటూరు: వెల్‌కమ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్.

22) జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. (1982). **శ్రీనాథ భారతి.** గుంటూరు: శ్రీనాథ పీటము.

23) జయప్రకాష్, ఎస్. (2009). **పరిశోధన విధానం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్.

24) జితేంద్రబాబు, కుర్రా. (2015). **మానవల్లి కవి – రచనలు.** హైదరాబాద్: వై.వి రెడ్డి ప్రింటర్స్.

25) తమ్మయ్య, బండారు. (1968). **శ్రీనాథ మహాకవి**. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు. **తిక్కన భారత దర్శనము**. (1977). హైదరాబాద్: ప్రగతి గీతా ప్రెస్.

26) తిరుమలరావు, జయధీర్. (2008). **అలనాటి సాహిత్య విమర్శ.** ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్.

27) దగ్గుపల్లి దుగ్గన. (1977). **నాసికేతోపాఖ్యానం.** హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

28) దుగ్గన, దగ్గుపల్లి. (1977). **నాసికేతోపాఖ్యానం**. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

29) **నన్నయ భారతి.** (2001). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

30) నరసింహం. అంతటి. (1979). **ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు.** హైదరాబాదు. సమతా సాహితి.

31) నరసింహమూర్తి, యు.ఏ. (2009). **విశ్వనాథ సౌందర్య దర్శనము.** హైదరాబాద్: అజో–విభో–కందాళం ప్రచురణలు.

32) నరసింహశాస్త్రి, నోరి. (1974). **కవిసార్వభౌముడు**. విజయవాడ: క్వాలిటీ పబ్లిషర్స్.

33) నరసింహశాస్త్రి, నోరి. (1986). **కవిద్వయము.** విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.

34) నరసింహారావు, యస్. ఎల్. (1981). **ఆంధ్ర మహాభారతము.** అలంకార సమీక్ష. హిందూపురం: లేపాక్షి ఆర్ట్ ప్రింటర్స్.

35) నరసింహారెడ్డి, పాపిరెడ్డి. (1988). **ప్రాచీనాంధ్ర తెలుగు కావ్యాల్లో కృతికర్త – కృతిభర్త.** శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్.

36) నరసింహారెడ్డి, పాపిరెడ్డి. (1991). **తెలుగు కావ్యాల్లో తెలుగునాడు.** శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్.

37) నాగయ్య, జి. (1984). **ఎర్రన శ్రీనాథుల సూక్తి వైచిత్రి.** తిరుపతి: నవ్యపరిశోధక ప్రచురణ.

38) నాగయ్య, జి. (2004). **తెలుగు సాహిత్య సమీక్ష**. తిరుపతి: స్టూడెంట్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్.

39) నాగయ్య, జి. (2021). **తెలుగు సాహిత్య సమీక్ష (ప్రథమ సంపుటి).** హైదరాబాదు: నవ్య పరిశోధక ప్రచురణలు.

40) నాగేశ్వర శాస్త్రి, ద్వాదశి. (2008). **తెలుగు సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: ప్రగతి పబ్లిషర్స్.

41) నారాయణరావు, వెల్చూరు. (2012). **శ్రీనాథ.** న్యూయార్క్: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ.

42) నారాయణరెడ్డి, జి. (1991). **తెలుగు పర్యాయపద నిఘంటువు.** తిరుపతి: సత్యశ్రీ ప్రచురణలు.

43) నారాయణరెడ్డి, సి. (2007). **ఆంధ్ర మహాభారతోపన్యాసాలు (ఉపన్యాస సంకలనం).** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు,

44) నారాయణరెడ్డి, సి. (2007). **ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

45) నిత్యానందరావు, వెల్దండి. (2013). **విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.** హైదరాబాదు: ఓం సాయి గ్రాఫిక్స్.

46) పద్మజ, వీర. **శ్రీనాథయుగ సాహిత్యము, భక్తి.**

47) పాఠక్, ఆర్.ఎస్. (1988). **వక్రోక్తి మరియు స్టైలీస్టిక్ కాన్సెప్ట్స్.** న్యూఢిల్లీ: బహరీ పబ్లికేషన్స్.

48) పాపయ్యశాస్త్రి, చిలుకూరి. (1988). **శ్రీనాథ కవితా సమీక్ష**. కాకినాడ: రిపబ్లిక్ పవర్ ప్రెస్.

49) పాపయ్యశాస్త్రి, జంధ్యాల. (1985). **కళ్యాణ కల్పవల్లి.** గుంటూరు: కళ్యాణభారతి.

50) పిచ్చయ్య శాస్త్రి, దీపాల. (1995). **చాటుపద్య రత్నాకరము**. లక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్.

51) ప్రభాకరరావు, ముడివేడు. (1996). **విశ్వనాథ అసంకలిత సాహిత్యం, పీఠికలు–1.** వరంగల్లు. విశ్వనాథ భారతి.

52) ప్రభాకరరెడ్డి, కోడూరు. (2005). **చాటుకవి సార్వభౌమ శ్రీనాథుని చాటువులు**. చౌడేపల్లి. విజయవాణి ప్రింటర్స్.

53) ప్రభాకరశాస్త్రి, వేటూరి. (1923). **శృంగార శ్రీనాథము.** బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ లిమిటెడ్.

54) ప్రభాకరశాస్త్రి, వేటూరి. (1986). **ప్రజ్ఞాప్రభాకరము.** హైదరాబాద్: మణిమంజరి ప్రచురణలు.

55) ప్రభాకరశాస్త్రి, వేటూరి. (2013). **చాటుపద్యమణి మంజరి (మొదటి & రెండవ భాగాలు).** తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

56) ప్రభాకరశాస్త్రి, వేటూరి. (2015). **క్రీడాభిరామము.** తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

57) **ప్రాచీన కవితా వైజయంతి (ప్రసిద్ధ పండితుల వ్యాసాల సంకలనం)**. (1988). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

58) **ప్రాచీన సాహిత్య మంజూషిక**. (2014). హైదరాబాద్: తెలుగు అకాడమీ.

59) బాలగంగాధరరావు, యార్లగడ్డ. (2008). **క్రీడాభిరామం.** నిర్మాలా పబ్లికేషన్స్.

60) బాలగంగాధరరావు, యార్లగడ్డ. (2010). పలనాటి వీరచరిత్ర (ద్విపద వచనానువర్తనం). నిర్మలా పబ్లికేషన్స్. విజయవాడ.

61) బాలగంగాధరరావు, యార్లగడ్డ. (2013). **కవిసార్వభౌముడు శ్రీనాథుడు**. విజయవాడ: నిర్మలా పబ్లికేషన్స్.

62) బాలగంగాధరరావు, యార్లగడ్డ. (2015). **శ్రీనాథ కవి సార్వభౌముని హరవిలాసం (హైమవతీ వ్యాఖ్యాసహితము).** విజయవాడ: నిర్మలా పబ్లికేషన్స్.

63) **భారతీయ సంస్కృతీ వైతాళికులు, ఆలంకారికులు.** (2002). న్యూఢిల్లీ: పబ్లికేషన్స్ డివిజన్ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం. బెంగాల్ ఆఫ్‌సెట్ వర్క్స్.

64) మందేశ్వరరావు, వడలి. (1989). **శిల్పి నన్నయ.** హైదరాబాద్: సమదర్శిని సాహిత్య సమాఖ్య.

65) మస్తాన్, చేరెడ్డి. (1989). **భారత పద్యశైలి.** ఆశాలత ప్రచురణ.

66) ముద్దప్ప, ఇరిగేపల్లి. (1987). **పిల్లలమర్రి పినవీరభద్రకవి కావ్యానుశీలనం.** అనంతపురం: లలిత ప్రచురణలు.

67) మూర్తి, బి.వి.ఎస్. (2004). **తిక్కన భారతాలోకనం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

68) మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. (1995). **శ్రీ శివరాత్రి మాహాత్మ్యం (చంద్రికా వ్యాఖ్యాన సహితం).** హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

69) యెల్లనార్యుడు, చింతలపూడి. **శ్రీరాధామాధవము.** కాకినాడ: కాకినాడ ముద్రణాలయము.

70) రంగాచార్యులు, చెలమచర్ల. (1972). **ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము (శ్రీ విద్యానాథుని కృతికి ఆంధ్రానువాదము).** హైదరాబాదు: శ్రీనివాస పబ్లికేషన్స్.

71) రంగాచార్యులు, చెలమచర్ల. (1972). **ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణము (విద్యానాథుని కృతికి ఆంధ్రానువాదం).** హైదరాబాద్: శ్రీనివాస విలాస గ్రంథావళి.

72) రంగాచార్యులు, చెలమచర్ల. (2007). **ఆంధ్రౌచిత్య విచార చర్చ (క్షేమేంద్రుని కృతికి స్వేచ్ఛానువాదము).** హైదరాబాద్: శ్రీనివాస పబ్లికేషన్స్.

73) రఘునాథశర్మ, శలాక. (1979). **భారత ధ్వని దర్శనం.** అనంతపురం: ఆనందవల్లీ గ్రంథమాల.

74) రఘునాథశర్మ, శలాక. (2000). అనంతపురం: **ఆనందవల్లీ గ్రంథమాల**.

75) రత్నమోహిని, వి. (1988). **మహాకవి ధూర్జటి.** హైదరాబాద్: తెలుగు పరిశోధన ప్రచురణలు.

76) రవిచంద్రన్, కంపల్లె. (2014). **కాశీఖండము**. విజయవాడ: సాహితీ ప్రచురణ.

77) రాజన్న శాస్త్రి, కె. (1910). **ధ్వనిమనుచరిత్రము**. హైదరాబాద్: నాగార్జున ప్రింటింగ్ వర్క్స్.

78) రాజు, ఎన్.ఎస్. (2013). **సూక్తి వైచిత్ర**. హైదరాబాద్: శ్రీ సత్య ప్రచురణలు.

79) రామకృష్ణమాచార్య, నండూరి. (1988). **తిక్కన**. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

80) రామకృష్ణమాచార్య, నండూరి. (1988). **తిక్కన**. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

81) రామనరసింహం, పరిమి. (1996). **ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం (భాషాశాస్త్ర విశ్లేషణ).** హైదరాబాద్: పరావాక్ ప్రచురణలు.

82) రామనాథ శాస్త్రి, ధారా. (1985). **ఎఱ్రన సాహిత్యలహరి**. ఒంగోలు: ఎఱ్రన పీఠము.

83) రామరాజభూషణుడు. (2006). **వసుచరిత్ర.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

84) రామరాజభూషణుడు. (2008). **కావ్యాలంకార సంగ్రము (సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి – వ్యాఖ్య).** హైదరాబాద్: ఎమ్మెస్కో ప్రచురణలు.

85) రామరాజు, బిరుదరాజు. (2007). శివరాత్రి మాహాత్మ్యము. ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాద్.

86) రామానుజరావు, దేవులపల్లి. (1978). **నా సాహిత్యోపన్యాసాలు.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

87) రామారావు, ఎస్వీ. (1998). **నన్నయ దర్శనము.** పసిడి ప్రచురణలు.

88) రామారావు, ఎస్వీ. (2007). **తెలుగులో సాహిత్య విమర్శ.** హైదరాబాదు: పసిడి ప్రచురణలు.

89) లక్ష్మీకాంతం, పింగళి. (2005). **ఆంధ్ర సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

90) లక్ష్మీనారాయణ, గుండవరపు. (1997). **శ్రీనాథ మహాకవి విరచిత భీమేశ్వర పురాణము (దక్షిణ కాశికా వ్యాఖ్యానం).** గుంటూరు: ఫాలాక్ష ప్రచురణ.

91) లలిత, జి. (1981). **తెలుగులో చాటుకవిత్వం.** విజయవాడ: క్వాలిటీ పబ్లిషర్స్.

92) వీరనారాయణశర్మ, వారణాసి. (1990). **కనుపర్తి అబ్బయామాత్యుని కృతుల పరిశీలన.** మిర్యాలగూడ: శ్రీరామకృష్ణ ప్రింటర్స్.

93) వీరభద్రయ్య, ముదిగొండ. (2012). **విమర్శకళాతత్త్వశాస్త్రాలు.** హైదరాబాదు: తెలుగు అకాడమీ.

94) వీరేశలింగం, కందుకూరి. (2005). **ఆంధ్ర కవుల చరిత్రము.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

95) వీరేశలింగం, కందుకూరి. (2013). **ఆంధ్ర కవుల చరిత్రము.** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్.

96) వెంకట రాఘవయ్యం, శేషం. (1995). కావ్యాత్మ. ప్రాచీ పబ్లికేషన్స్. హైదరాబాద్.

97) వెంకట రామనరసింహం, కాకర్ల. (1985). **సాహిత్య దర్శనము.** విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్.

98) వెంకట రామలింగ కృష్ణశాస్త్రి, అద్దేపల్లి. (2004). **శ్రీనాథ యుగము**. తాడేపల్లి గూడెం: శ్రీలక్ష్మీ నరసింహా బైండింగ్ వర్క్స్.

99) వెంకట సత్యానారాయణరావు, శ్రీరావూరు. (1976). **తెలుగు వీణ.** హైదరాబాద్: భాషాకుటీరం.

100) వెంకట సింగరాచార్య, బొమ్మకంటి. (1997). **శ్రీనాథ మహాకవి హరవిలాసము.** విజయవాడ: ఎమ్మెస్కో బుక్స్.

101) వెంకటరామకృష్ణ శాస్త్రి, రేమిల్ల. (1991). **కావ్య చంద్రిక**. భీమవరం: ఆదర్శ ప్రింటర్స్ & పబ్లిషర్స్.

102) వెంకటరామశాస్త్రి, వేదము. (2012). **శ్రీనాథకృత శృంగార నైషధము (సర్వంకష వ్యాఖ్యతో).** హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

103) వెంకటరావు, నిడదవోలు. (1956). **తెనుఁగు కవుల చరిత్ర.** మదరాసు విశ్వవిద్యాలయం.

104) వెంకటరావు, నిడదవోలు. (1972). **మానవల్లికవి – రచనలు**. హైదరాబాద్: ఆంధ్ర సాహిత్య అకాడమీ.

105) వెంకటరావు, నిడుదవోలు. (1976). **ప్రబోధ చంద్రోదయం.** హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

106) వెంకటశేషశాస్త్రి, గడియారం. (1975). **శ్రీనాథ కవిసార్వభౌముడు.**

107) వెంకటావధాని, దివాకర్ల. (1981). **కావ్యలహరి.** హైదరాబాద్: యువభారతి, సాహితీ సాంస్కృతిక సంస్థ.

108) వెంకటావధాని, దివాకర్ల. (1985). **వ్యాస సాహితీ సంహిత.** సికింద్రాబాదు: యువభారతి.

109) వెంకటేశం, బొద్దుల. (2015). **వక్రోక్తి సిద్ధాంతం**. కరీంనగర్: సరోజ ప్రచురణలు.

110) వెంకటేశ్వరరావు, కాటూరి. (2002). **తెలుగు కావ్యమాల.** న్యూఢిల్లీ: సాహితీ అకాడమీ.

111) వెంకట్రామిరెడ్డి, అట్లా. (2014). **శైలీ శిల్పం, వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం.** హైదరాబాద్: అనుపమ ప్రింటర్స్.

112) వెల్లంకి, తాతంభట్టు. (1982). **కవిచింతామణి.** హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం.

113) వేంకట సత్యనారాయణమూర్తి, బులుసు. (2007). **శ్రీః చంద్రాలోకము (శతలంకార వ్యాఖ్యానము).** రాజమండ్రి: రోహిణి పబ్లికేషన్స్.

114) వేంకటకవి, గోపినాథ. (1994). **పూర్వకవి పరంపర.** హైదరాబాద్: గోపినాథ శ్రీనివాసమూర్తి, గోపీనాథ వేంకటకవి సాహితీ ట్రస్టు.

115) వేంకటరామశాస్త్రి, వేదము. **ఆంధ్ర సాహిత్య దర్పణము (ప్రథమ భాగం).** మద్రాస్: వేదము వేంకట రామశాస్త్రి అండ్ బ్రదర్స్.

116) వేంకటవధాని, దివాకర్ల. (2013). **సాహిత్య సోపానములు.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

117) వేంకటశేషశాస్త్రి, గడియారము. (1960). **శ్రీ శ్రీనాథుని కవితాసామ్రాజ్యము.** ప్రొద్దుటూరు: శ్రీ దుర్గా ప్రెస్.

118) వేంకటావధాని, దివాకర్ల. (2009). **ఆంధ్ర వాఙ్మయ చరిత్రము.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

119) వేంకటేశం, బి. (1993). **అరిస్టాటిల్ కావ్యశాస్త్రం.** కరీంనగర్: సరోజా పబ్లికేషన్స్.

120) **వ్యాస ప్రభాకరము (వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్యాసాలు).** విజయవాడ: సాహిత్య కౌముది క్వాలిటీ పబ్లిషర్స్.

121) శంకరరెడ్డి, యం. (1997). **భారతసూచి.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

122) శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. (2012). **శ్రీనాథ విరచిత కాశీఖండం (మణికర్ణికా వ్యాఖ్యాన సహితము).** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

123) శివారెడ్డి, ఎల్లూరి. (1984). **తిక్కన రసభారతి.** సికింద్రాబాదు: యువభారతి.

124) శేషగిరిరావు, పోచిరాజు. (1988). **శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, జీవితం – వాఙ్మయ సేవ.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

125) శేషేంద్రశర్మ, గుంటూరు. (1976). **సాహిత్య కౌముది**. విజయవాడ: క్వాలిటీ పబ్లిషర్స్.

126) శ్రీనివాసరావు, గొట్టె. (2004). **పోతన భాగవతం – అలంకారశిల్పం.** ఆచార్య పిల్లలమర్రి రాములుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు: హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం.

127) శ్రీనివాసాచార్యులు, బొమ్మకంటి. (2006). **తెలుగు చాటువు పుట్టుపూర్వోత్తరాలు.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

128) శ్రీరంగాచార్య. (2005). **చాటుపద్య రత్నావళి.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

129) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (1981). **కావ్యాదర్శః (బాలానందిన్యాఖ్యయా).** హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

130) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2002). **అలంకారశాస్త్ర చరిత్ర.** హైదరాబాదు: ఆర్.కె. ప్రింటర్స్ అండ్ గ్రాఫిక్స్.

131) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2007). **కుంతకుని వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యతో).** న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

132) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2009). **కావ్య ప్రకాశం.** హైదరాబాద్: సంస్కృత భాషా ప్రచార సమితి.

133) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2010). **లఘుసిద్ధాన్త కౌముదీ.** హైదరాబాదు: సంస్కృత భాషా ప్రచార సమితి.

134) శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2014). **భరతముని ప్రణీత నాట్యశాస్త్రమ్.** హైదరాబాదు: సంహిత గ్రాఫిక్స్.

135) శ్రీరామమూర్తి, కొర్లపాటి. (1971). **శ్రీనాథుడు.** గుంటూరు: కళాభారతి.

136) శ్రీరామమూర్తి, కొర్లపాటి. (1985). **ప్రబంధసార శిరోమణి.** ఆంధ్ర విశ్వకళాపరిషత్.

137) శ్రీరామమూర్తి, కొర్లపాటి. (1991). **తెలుగు సాహిత్య చరిత్ర.** విశాఖపట్టణం: రమణశ్రీ ప్రచురణ.

138) **శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు**. నాల్గవ సంపుటం. (1998). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

139) సత్యనారాయణ, యస్వీ, చెన్నప్ప, మసన. (2013). **తెలుగు సాహితీ వీచిక (సమాచార సమాహారం).** హైదరాబాద్: తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

140) సీతారామాచార్యులు, బహుజనపల్లి. (2012). **శబ్ద రత్నాకరం.** వెంకటేశ్వర బుక్ డిపో.

141) సుజాతారెడ్డి, ముదిగంటి. (1980). **శ్రీనాథుని కవితా సౌందర్యం**. హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్.

142) సుప్రసన్నాచార్య, కోవెల. (2012). **ప్రాచీన తెలుగు సాహిత్యం తాత్విక భూమిక.** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

143) సుబ్బరాయశాస్త్రి, ఉడాలి. (1981). **శ్రీహర్షనైషధము.** హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

144) సుబ్రహ్మణ్యం, జి.వి. (1973). **పిల్లలమర్రి పినవీరభద్రకవి.** హైదరాబాద్: మాధవి బుక్ సెంటర్.

145) సుబ్రహ్మణ్యం, జి.వి. (1990). **రసోల్లాసము.** హైదరాబాద్: తెలుగు అకాడమీ.

146) సుబ్రహ్మణ్యం, జి.వి. (2012). **సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.** హైదరాబాదు: తెలుగు అకాడమీ.

147) సుమతీ నరేంద్ర, పి. (1986). **శ్రీనాథ కవితావైజయంతి.** హైదరాబాద్: బాలకృష్ణ భారతి.

148) సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం. (2013). **కావ్యాలంకార సంగ్రహం.** హైదరాబాదు: ఎమెస్కో బుక్స్.

149) సోమశేఖర శర్మ, మల్లంపల్లి. (2001). **రెడ్డి రాజ్య చరిత్ర.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

150) హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి. (1976). **సారమతి నన్నయ.** గుంటూరు: నవోదయ పబ్లిషర్స్.

151) హరి, కూచిభొట్ల. (1976). **శ్రీనాథ మహాకవి కావ్యకళ.** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకార ప్రచురణ.

152) హేమలత, దంటు. (2009). **తెలుగులో వ్యాఖ్యాన సంప్రదాయం ఉత్పత్తి, వికాసాలు**.

★★★

**అనుబంధం – 1**

**1. ప్రశ్నావళి**

1) **మీ అభిప్రాయం ప్రకారం శ్రీనాథుని కవితామార్గం ఏమిటి?**

**జ:** నా అభిప్రాయం ప్రకారం శ్రీనాథ మహాకవిది ప్రధానంగా రీతిమార్గం తర్వాత చమత్కార మార్గం. అటుపై పిమ్మట ధ్వని మార్గం. ఆపైన రసమార్గం. అనంతరం వక్రోక్తి మార్గం. అలంకార మార్గం. ఆపై ఔచిత్య మార్గం.

2) **మీరు శ్రీనాథుని రచనల్లో కొత్త అంశాలు ఏమైనా గుర్తించారా?**

**జ:** భారతీయ ఆలంకారికులు చెప్పిన విశేషమైన విషయాలు అన్నీ నేను శ్రీనాథుని సాహిత్యంలో సాక్షాత్కరించటం గుర్తించాను.

3) **కావ్య పఠనంలో వక్రోక్తి సిద్ధాంతం ఎంత వరకు ఉపకరిస్తుంది?**

**జ:** భావ వ్యక్తీకరణలోని వైవిధ్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు కలిగే ఆనందమే వేరు.

4) **చాలామంది పరిశోధకులు శ్రీనాథుని వక్రోక్తి మార్గంగా చెప్పారు. దానిని మీరు అంగీకరిస్తున్నారా?**

**జ:** శ్రీనాథ మహాకవిది ఆచార్య వామనుడు కావ్యాత్మగా ప్రతిపాదించిన రీతి మార్గమని నా అభిప్రాయం. ఇతరుల అభిప్రాయాలు వేరు వేరుగా ఉండవచ్చు. మహా ప్రతిభావంతుడైన కవిని ఎవరి పుష్పాలతో వారు అర్చించుకోవచ్చు కదా!

5) **శ్రీనాథునిలో ఎక్కువగా కనిపించిన అలంకారం ఏది?**

**జ:** ‘ఉపమా కాళిదాసస్య’ అన్న సూక్తికి సంస్కృతంలో కాళిదాసు ఎలా ఉదాహరింపదగినవాడో ‘ఉపమా శ్రీనాథస్య’ అన్న సూక్తికి శ్రీనాథుడు తెలుగులో అలా ఉదాహరింపదగినవాడని నా దృఢనిశ్చయం.

6) **మీరు పరిశోధన చేయగా మిగిలిపోయిన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

**జ:** శ్రీనాథుని జాతీయాలు, పదప్రయోగాలు, శాసనరచనలు గురించి ఇంకా పరిశోధనలు జరుగవలసి ఉంది.

★★★

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

# 11.శ్రీనాథుని కవితామార్గం: వర్ణవిన్యాసవక్రత



**వేముల శరణ్య**
పరిశోధకవిద్యార్థిని,హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.
తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల,
జగిత్యాల, తెలంగాణ.
సెల్: +91 9493613830. Email: vemulasharanya11@gmail.com

**వ్యాససంగ్రహం:**

తెలుగు ప్రాచీనసాహిత్యంలో శ్రీనాథుడు 15వ శతాబ్దంలో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకున్న కవి. ఆ మహాకవి సార్వభౌముని కవితామార్గం మీద పలు చర్చలు జరిగాయి. శ్రీనాథుని కవితామార్గం ఏమిటి? అనే ప్రశ్నకు చాలా సమాధానాలు వస్తాయి. వాదాలూ ఉన్నాయి. ఈ విషయం పైన పూర్వ పరిశోధకులు విమర్శకులు తమ అభిప్రాయాలను తెలిపారు. పలు చర్చలు జరిగిన మీదట చాలా మంది శ్రీనాథునిది వక్రోక్తి మార్గంగా సూచించారు. వారి అభిప్రాయాలను తెలుపుతూ కుంతకుడు చెప్పిన ఆరు వక్రతల్లో "వర్ణవిన్యాసవక్రత" శ్రీనాథుని కవిత్వంలో ఉందని లక్షణలక్ష్యసమన్వయం చేయటం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం. శ్రీనాథుడు అనుసరించాడని ఎక్కువ మంది భావించిన వక్రోక్తి శ్రీనాథుని కవిత్వంలో ఉందని కొంత స్పష్టత ఏర్పడేందుకు ఈ వ్యాసం ప్రయోజనకారి అవుతుందని భావిస్తున్నాను.

**Keywords:** శ్రీనాథుడు, కవితాగుణాలు, పూర్వకవిస్మరణ, కవితామార్గం, కుంతకుడు, వక్రోక్తి.

## 1. ఉపోద్ఘాతం:

ప్రతి కవికి ఒకశైలి ఉంటుంది. కావ్య రచనలో వైవిధ్యం ఉంటుంది. ప్రత్యేకమైన ముద్ర ఉంటుంది. అయితే విలక్షణమైన ముద్రతో సహృదయులను గెల్చుకొని తమ కావ్యాలు చిరకాలం ఉండేలా రచనలు చేసే కవులు కొందరుంటారు. అటువంటి ఉత్కృష్టమైన కవులలో కవి సార్వభౌముడైన శ్రీనాథుడు ఒకడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**"భావవ్యక్తీకరణ విధానంలో మెరుగులు దిద్దే ఒకానొక రచనారీతిని శైలి అనవచ్చు. శైలీ పరిశీలనం కేవలం భాషాశాస్త్రానికి సాహిత్య విమర్శకి చెందింది కాక కళాభినివేశపాండిత్యాలలో కూడిన శాస్త్రీయ కృషి విశేషంగా భావించవచ్చు".[1]**

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

శ్రీనాథుడు శైలిని గూర్చి చెప్తూ తన కవిత్వం ఎలా ఉంటుందో? అసలు కవిత్వం అనేది ఎలా ఉండాలో కవితా మార్గాలను పూర్వ కవులనుండి అన్వేషించి, వాటిలో లోతుపాతులు తెలుసుకొని తనదైన పాండితీ పటిమతో రచనలు చేసాడో తెల్పాడు.

**"ప్రాచీనాంధ్ర కవుల సాహిత్య దృక్పథాలను సమన్వయించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలంకారశాస్త్రాన్ని ఆధునిక విమర్శ శాస్త్రాన్ని అవగాహనం చేసుకొని సమన్వయ దృక్పథాన్ని సాధించుకొని ప్రాచీన సాహిత్యంలోని మహాకవుల రచనలను సమీక్షించే యువకులు క్రమంగా తగ్గిపోతున్నారు".**[2]

కనుక ప్రాచీన సాహిత్యం పట్ల దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. శ్రీనాథుడు తన కవితా మార్గాన్ని గూర్చి ఏమి చెప్పాడు? ఏ పూర్వ కవులను తను అనుసరించాడు? అనే వాటిని చర్చిస్తూ అలాగే శ్రీనాథుని కావ్యాలపై పరిశోధన చేసిన వారి అభిప్రాయాలకు అనుగుణంగా శ్రీనాథుని కవిత్వం ఉన్నదా అని పరిశీలిద్దాం.

## 2. శ్రీనాథుని కవితాగుణాలు – చర్చ:

శ్రీనాథుని కవితామార్గం గురించి పలువురు పండితులు రకరకాల చర్చలు చేసారు. కొందరు రీతి మార్గం అని కొందరు ధ్వని మార్గం. కొందరు వక్రోక్తి అని వివిధ రకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. కానీ శ్రీనాథుడే స్వయంగా కవిత్వం అంటే దానికి కొన్ని లక్షణాలు ఉండాలి. అలా ఉంటే ఆ కవిత్వం చిరకాలం నిలిచి ఉంటుందని తన కవితా లక్షణాలను భీమఖండంలో చెప్పాడు.

మ. **హరచూడ హరిణాంక వక్రతయుగాలంత స్ఫురచ్చండికా**
**పరిషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్**
**సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్య ముల్లిక్కులం**
**జిర కాలంబు నటించు చుండుఁ గవిరాజ గేహరంగంబులన్** (భీమ. 1అ. 12ప)

ఈ పద్యంలో వక్రత, కాఠిన్యం(ప్రౌఢత) సరసత్వం అనే కవితా గుణాలను చెప్పడం జరిగింది. శివుని శిరస్సుపైన ఉన్న చంద్రుని పదహారవ కళ ఎంత అందంగా లోకోత్తరంగా, కళంకరహితంగా ఉంటుందో అలాంటి రమణీయమైన వక్రత కవిత్వంలో ఉండాలని చెప్పాడు. ఈ వక్రోక్తి మాత్రమే కాదు కాఠిన్యం అంటే పదప్రౌఢి కూడా ఉండాలని అంటూ, సరసత్వం గల రసపూరితమైన కవిత్వం ఉంటే గనుక ఆ కావ్యం చిరకాలం మనస్సులో నిలిచి ఉంటుందని చెప్పాడు. ఇలా వక్రోక్తి, కాఠిన్యం, సరసోక్తి అనే లక్షణాలను చెప్పాడు. ఈ కవితాగుణాలు తన కవిత్వంలో ఉన్నాయని చెప్పవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

**2.1.వక్రత:**

వక్రత అంటే వంకర అనే అర్థం అందరికి తెలిసినటువంటిదే. ఇక్కడ వాడే వక్రత అలంకార సంబంధి. అయితే వక్రతలో చాలా భేదాలున్నాయి. సంస్కృత ఆలంకారికుడైన కుంతకుడు "వక్రోక్తి కావ్యజీవితం" అను నాలుగు ఉన్మేషాల కావ్యం రాసి అందులో 'వైదగ్ధ్యభంగీభణితి'ని వక్రతగా చెప్పాడు. విచిత్రాభిదవక్రత అంటూ ప్రధానంగా ఆరు వక్రత భేదాలను పేర్కొన్నాడు.

**2.2 కాఠిన్యం:**

శ్రీనాథుడు ఇక్కడ కాఠిన్యం అనే పదాన్ని వాడుతూ రెండవ లక్షణంగా చెప్పాడు. కఠినత అనే పదానికి అర్థం కటువైనది. పరుషమైనదనే అర్థాలున్నాయి. దీన్నే ప్రౌఢత అనే అర్థంతో కూడా వాడటం జరుగుతుంది. ఇక్కడ శబ్ద అర్థ ప్రౌఢి అని రెండు రకాలుగా ఆలోచించాల్సి ఉంటుంది. ప్రౌఢమైన పదరచన, కొంత పరుషత కలిగిన కవిత్వం అని అర్థం చేసుకోవాలి. ఈ కవితా లక్షణం ఓజోగుణం ఉన్నటువంటి పరుషత్వంతో, ప్రౌఢమైన భారతి వృత్తితో కూడిన రచన అని భావించాలి.

**2.3. సరసత్వం:**

అన్ని సందర్భాలకు అనుగుణంగా ఔచిత్యవంతమైన రసపోషణ చేయడమే సరసతను కలిగి ఉండటం, ఇలా శ్రీనాథుడు మూడు కవితా లక్షణాలను చెప్పుకు వచ్చాడు. నిజానికి కవిత్వం ఏ మార్గాన్ని అనుసరించి ఉంటే అది కవిత్వం అవుతుంది? మామూలు వచనానికి, కావ్యానికి తారతమ్యం ఏముంది? అనే ప్రశ్నకు సమాధానం 15వ శతాబ్దిలోనే శ్రీనాథుడు చెప్పాడు. ఇవే కాకుండా శ్రీనాథుడు పూర్వ కవుల మార్గాన్ని అనుసరించానని వివరించిన విషయం పరిశీలిద్దాం.

**3. పూర్వకవుల స్మరణ:**

కవిత్వరచన చేసేటప్పుడు మనకన్న ముందున్న వారిని అనుసరించి వెళ్ళవలసి ఉంటుందని చెప్పాడు శ్రీనాథుడు. అతని రచనామార్గం అలాగే కొనసాగింది కూడా. తెలుగు, సంస్కృతభాషల్లో పండితుడైన శ్రీనాథుడు ఉభయభాషాకవులను అంటే తెలుగులో ఉన్న పూర్వకవులను, సంస్కృతంలో గల పూర్వకవులను తన కావ్యాల్లో స్మరించాడు. వారి ప్రతిభను పుణికిపుచ్చుకున్నాడు. రచనావిధానాన్ని అనుసరిస్తూనే కవిత్వంలో గొప్ప వర్ణనాకౌశలాన్ని చూపెట్టాడు. శ్రీనాథుడు 15వ శతాబ్దివాడు కావడంచేత అంతకు ముందున్న 11వ శతాబ్దంనాటి కవి అయిన నన్నయ మొదలుకొని తనకాలం వరకు గల ప్రముఖ తెలుగు కవులను తన కావ్యాల్లో స్తుతించాడు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

ఈ విషయాన్ని బలపరుస్తూ-

**"ఇతడు పూర్వకవి ముఖ్య విరచితాపూర్వ కావ్య భావరస సుధా చర్వణ ప్రౌఢతతో నాంధ్ర సాహిత్యమునకు గీర్వాణ సాహితి సరసను సింహాసనము ప్రతిష్ఠించుటకు పథకములు పన్నినాడు. కల్పనములు చేసినాడు. చేతికి దొరికిన కావ్యములపై తెనుగు జీవము కుమ్మరించినాడు. ఈ యుద్యమములోనే సంస్కృత పండితులు శిరసావహించు కాశీఖండ నైషధములను చేపట్టి ప్రతిభా ముద్రతో నిర్వహించినాడు కాసట బీసటగానున్న యచ్చపు తెనుగు జోదుల కతలకు కావ్యగౌరవము ప్రతిపాదించినాడు. పద్యరచనములో నన్నయకోవవాడు శ్రీనాథుడు అతని మార్గముల నీతడు విశాలపరచి ఘంటాపథములు చేసినాడు. క్రొత్త నడకల సాధించి వానికొక వింత దర్జా నెలకొల్పినాడు."**[3]

అని ఇంద్రగంటి హనుమచ్చాస్త్రి తన అభిప్రాయాన్ని తెలిపాడు. కనుక శ్రీనాథుని పూర్వకవుల కవితా మార్గాలను పరిశీలించడం ఆవశ్యమైంది.

### 3.1 తెలుగు కవులు:

తెలుగు కవులైన వేములవాడ భీమనను, నన్నయ, తిక్కన, ఎర్రనను ప్రస్తుతించి వారి కవితామార్గాలు తనకు అనుసరణీయమైనవని చెప్పాడు. అంతేకాకుండా వారు పూర్వకవులని తన కావ్యాల్లో స్మరించడం జరిగింది.

సీ. **వచియింతు వేములవాడ భీమన భంగి, ఉద్దండలీల నొక్కొక్కమాటు**
**భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు**
**వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్క మాటు**
**పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరునివ తెవసూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు**
**తే. నైషధాది మహాప్రబంధములు పెక్కు**
**చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ**
**యిప్పుడు చెప్పదొడంగిన యీ ప్రబంధం**
**మంకితము సేయు వీరభద్రయ్య పేర** (కాశీ. పీ. 18ప)

వేములవాడ భీమనలో ఉన్న ఉద్దండత, నన్నయలో గల తెలుగు సంస్కృత భాషల్లోని ఉభయ వాక్ప్రౌఢి సందర్భానుసారంగా ఉపయోగించే తిక్కన రసాభ్యుచిత బంధం, ఎర్రన సూక్తివైచిత్రి నీలోపల ఉన్నాయి. ఎంతోమంచి కావ్యాలను రాసిన నీవు వీరభద్రారెడ్డికి ఈ కాశీఖండం అనే ప్రబంధాన్ని అంకితం ఇవ్వు అని వేమారెడ్డి అడిగినట్లుగా తన కవితా మార్గం గురించి తానే

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

చెప్పుకున్నాడు. ఈ నాలుగు కవితా లక్షణాలను కొంత సునిశితంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. అప్పుడే శ్రీనాథుని రచనలలో విశిష్టత తెలుస్తుంది.

### 3.2 సంస్కృత కవులు:

శ్రీనాథునిపై సంస్కృతకవుల ప్రభావం కూడా ఉన్నదని చెప్పవచ్చు. ఎందుకంటే అతడు సంస్కృతపద భూయిష్టమైన సమాసాలను వాడాడు. సంస్కృతంలోని నైషధాన్ని తెనిగించినప్పుడు కేవలం ప్రత్యయాలను మాత్రమే వాడాడని శ్రీనాథున్ని డు,ము,వుల కవి అనే పేరును పెట్టి పిలిచారు. సంస్కృత కవులను తలచుకుంటూ ఒక సీసపద్యాన్ని రచించాడు.

**సీ. ప్రణుతింతు రసభావ భావనామహనీయ కవితా సముల్లాసుఁగాళిదాసు**
**గణుతింతునిరవద్య గద్యపద్య నిబంధ, పరితోషిత స్థాణుభట్టబాణు**
**భజియింతు సాహిత్య పదవీ మహారాజ్య భద్రాసనాసీనుఁ బ్రవరసేను**
**వర్ణింతు నంబోధి నార్వీచి గంభీర తాసార వాక్సముత్కర్షు హర్షు**
**తే. భాసశివభద్ర సౌమిల్ల భల్లులకును**
**మాఘ భారవి బిల్హణ మల్హణులకు**
**భట్టి చిత్తపకవి దండి పండితులకుఁ**
**గీలు కొలుపుదు నొసలిపైఁగేలు దోయి** (భీమ. 1.ఆ 7.ప)

రసభావాలను పోషించడంలో గొప్ప కవితాలక్షణాలను కలిగిన కాళిదాసుని నిర్దుష్టమైన గద్యపద్యరచన చేసేటువంటి బాణభట్టుని పొగుడుతాను. సాహిత్యమహాసామ్రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించినటువంటి ప్రవరసేనున్ని కొలుస్తాను. అలాగే హర్షున్ని, భాసున్ని శివభద్రున్ని సౌమిల్లున్ని దండి మొదలైన కవులకు నమస్కరిస్తానని తెలిపాడు. దీనిని బట్టి ఈ కవుల రచనామార్గప్రభావం సంస్కృతసాహిత్య పరిచయం, అలాగే అలంకార ప్రస్థాన ప్రభావం ఉందని చెప్పుకోవచ్చు.

### 4. శ్రీనాథుని రచనామార్గం:

**“శైలీ పరిశీలనం మానవుడి అంతరంగాన్ని కళాకలితం చేసి రసార్ద్రం కావిస్తుంది. ఇది ఒకానొక కావ్య కర్తృత్వాన్ని, కవికాలాన్నీ నిర్ణయించడానికి ఉపకరిస్తుంది. ఈ శైలి కావ్యస్వరూప స్వభావాలకు అద్దంపడుతుంది. శైలీపరిశీలనంవల్ల భాషావగాహనాధికారాలతో పాటు భావామలత్వా- మరత్వాలనుగూడా సాధింపవచ్చు”.**[4]

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

కనుక ఒకయుగ కవిరచనామార్గం అధ్యయనం చేయడం తప్పనిసరి. ప్రసిద్ధకవి అయిన శ్రీనాథుడు అనుసరించిన రచనామార్గం గూర్చి భిన్న అభిప్రాయాలను వెల్లడించడానికి కారణం శ్రీనాథుడు తన రచనల్లో కొన్ని సందర్భాల్లో రచనామార్గం గురించి చెప్పుకోవడం ఒకటయితే, మరికొన్ని సందర్భాల్లో పూర్వకవులైన వారిని సంస్కృత కవులను ఇటు తెలుగు సంస్కృత కవులను స్మరించి, వారి కవితా మార్గాన్ని కూడా అనుసరించానని చెప్పాడు.

### 5. పరిశోధకుల అభిప్రాయాలు:

శ్రీనాథుని రచనల మీద కృషి చేసిన వారు భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించారు. శ్రీనాథుడు స్పష్టంగా తన పద్యాల్లో మూడు కవితామార్గాలు ఉన్నాయని 'హరచూడాహరిణాంకవక్రత' పద్యాన్ని ఆధారం చేసుకొని వక్రత, సరసత్వం, కాఠిన్యం కవితా లక్షణాలుగా చెప్పిన వారు ఉన్నారు. ప్రాచీన సంస్కృత సాహిత్యాన్ని చదివిన వాడు కనుక అలంకారికుల మార్గాలను అనుసరించిన వాడైనందున కుంతకుని వక్రోక్తిని పాటించాడని అభిప్రాయపడ్డారు.

### 5.1 జి.వి.సుబ్రహ్మణ్యం:

జి.వి.ఎస్ శ్రీనాథుని కవితా మార్గం గురించి చెప్తూ **"రీతి ఆయన మార్గం,వక్రత శోభాతిశయ హేతువు. రీతిని మార్గమంటారు 'రీయంతే పరంపరయా గచ్ఛంతి అనయాకరణ సాధనో2యం రీతి శబ్దః మార్గాపర్యాయః' అని రత్నేశ్వరుడు రీతిని వ్యాఖ్యానించాడు. మార్గ కవిత్వం కావ్యంలో ఎలా మహనీయంగా భాసిస్తుందో భావించడానికి శ్రీనాథుని కవితా ప్రస్థానం చక్కని ఉదాహరణ"**[5] రీతి ప్రాధాన్య వాదిగా తెలిపాడు.

### 5.2 కుందూరి ఈశ్వరదత్తు:

శ్రీనాథుని కవిత తత్త్వం మీద పరిశోధన చేసిన పరిశోధకుడు కుందూరి ఈశ్వరదత్తు శ్రీనాథుడు అనుసరించిన మార్గం విచిత్ర మార్గం అని తెలిపి- **"విచిత్ర మార్గము 1. ప్రతిభాజాతశబ్దార్థ చమత్కారము, 2. అలంకార సహితము, 3. ఉక్తి వైచిత్ర్యము 4. ప్రతీయమాన అర్థచమత్కారము, 5. వక్రోక్తి నిబంధనము"**[6] అని తెలిపాడు.

### 5.3 కొర్లపాటి శ్రీరామమూర్తి:

శ్రీనాథుని మీద ప్రసిద్ధమైనపరిశోధన చేసి చారిత్రిక ఆధారాలను చూపెట్టిన కొర్లపాటి శ్రీరామ మూర్తి శ్రీనాథుని కవితా మార్గం గూర్చి ప్రస్తావిస్తూ- **"భరతముని ప్రోక్తమైన రసము కుంతకుని ప్రతిపాదితమైన వక్రోక్తి శైలీ పరిణతమైన ప్రౌఢిమ సత్కావ్య లక్షణములని శ్రీనాథుని సిద్ధాంతము. ఈ మూడును తన కవితా రీతులని శ్రీనాథుని ఋజుముఖ ప్రకటనము."**[7] అంటూ వక్రోక్తి మార్గంగా సూచించాడు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

### 5.4 జి.నాగయ్య :

**"కుంతకుడు తన వక్రోక్తి జీవితమును గ్రంథమున శైలిని సుకుమార విచిత్ర మధ్యమ మార్గములుగ విభజించి వాటి స్వరూపములను నిరూపించియున్నాడు శ్రీనాథుడు కుంతకుడు నుడివిన విచిత్రమార్గమును శైలీవిధానమును స్వీకరించినాడు."**[8] జి. నాగయ్య కూడా వక్రోక్తి మార్గాన్ని బల పరిచాడు. ఇలా ఎంతోమంది శ్రీనాథుని కవితా మార్గం గురించి చర్చించారు. చాలామంది శ్రీనాథుని కవిత్వంలో వక్రోక్తి ఉందని చెప్పారు. ముందుగా కుంతకుని వక్రోక్తి సిద్ధాంతం గూర్చి తెలుసుకొని ఆ లక్షణాలకు అనుగుణంగా శ్రీనాథుని కవిత్వం ఇముడుతున్నదా అనేది చూడాలి.

### 6. కుంతకుని వక్రోక్తి సిద్ధాంతం:

భారతీయ అలంకార లోకంలో పలు సిద్ధాంతాలు బయలుదేరాయి. అందులో కుంతకుని వక్రోక్తి సిద్ధాంతం ఒకటి. కుంతకుడు క్రీ.శ 950 - 1050 మధ్య కాలానికి చెందినవాడు. ఇతడు కాశ్మీర దేశానికి చెందినటువంటి కవి. కుంతకుడు రాసినటువంటి గ్రంథం 'వక్రోక్తి జీవితమ్' ఇతను వక్రోక్తి కావ్యానికి జీవితం అని అన్నాడు.

**"ఆనందవర్ధనుడు ధ్వని కావ్యాత్మ అనగా కుంతకుడు ధ్వని మతానికి ప్రతికూలంగా ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించాడు. ఆ సిద్ధాంతమే వక్రోక్తి. ధ్వని కావ్యాత్మ అని ధ్వనికి ఒక స్వతంత్ర స్థితి ఉన్నదనీ కుంతకుడు అంగీకరించడు. ధ్వని కూడా వక్రోక్తిలో అంతర్గతం అంటాడు."**[9] అని పుల్లెల శ్రీరామ చంద్రుడు తెలిపాడు.

కుంతకుడు వక్రత గూర్చి వివరించి ప్రధానంగా ఆరు వక్రతలను తెలిపాడు. ఆ కారికను పరిశీలిద్దాం.

**"కవి వ్యాపార వక్రత్వ ప్రకారాస్సం భవంతి షట్**
**ప్రత్యేకం బహవో భేదాస్తేషాం విచ్ఛిత్తి శోభినః"** (వ.జీ. ఉ.1 - కా.18)

కవివ్యాపారవక్రత్వ పద్ధతులు ఆరు రకాలుగా ఉండవచ్చు వాటిలో ఒక్కొక్కదానికి వైచిత్ర్య శోభితాలైన అనేక భేదాలు ఉన్నాయని తెలిపాడు. కవివ్యాపారవక్రత పద్ధతులు ఆరు రకాలుగా ఉండవచ్చు. వాటిలో ఒక్కొక్కదానికి వైచిత్ర్య శోభితాలైన అనేక భేదాలు ఉన్నాయని తెలిపాడు. ప్రధానంగా ఆరు రకాల వక్రతలు - 1. వర్ణవిన్యాసవక్రత, 2.పదపూర్వార్ధవక్రత, 3. పదపరార్ధవక్రత, 4. వాక్యవక్రత, 5. ప్రకరణవక్రత 6. ప్రబంధవక్రత. ఈ వక్రతలు కుంతకుని వక్రోక్తి సిద్ధాంతానికి సంబంధించినటువంటివి. ఇందులో శబ్ద అర్థ ప్రధానమైనవి, వస్తు రసప్రధానమైనవి. కారక ప్రత్యయ ప్రధాన్యమైనవి ఉన్నాయి. వ్యాసపరిధినిబట్టి షడ్విధ వక్రతలలో మొదటిదైన వర్ణవిన్యాసవక్రతకు, అందులో ఉపవిభాగాలకు మాత్రమే ఇప్పుడు శ్రీనాథుని కవిత్వం నుండి లక్ష్యాలను ప్రదర్శిస్తాను.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

## 7. వర్ణవిన్యాసవక్రత:

ప్రధానంగా మూడు విధాల వర్ణవిన్యాస వక్రతలు చెప్పాడు.

**"ఏకోద్వౌ బహవో వర్ణాబధ్యమానా పునఃపునః**

**స్వల్పాంతరాస్త్రిదా సోక్తా వర్ణ విన్యాస వక్రతా"** (వ.జీ.ఉ.2 కా.1)

కొంత వ్యవధానంతో కూడిన ఒకవర్ణం గాని, లేదా రెండు వర్ణాలు గానీ, మూడు వర్ణాలు గానీ, పునరావృత్తమైతే అది వర్ణవిన్యాస వక్రత, ఇది 'ఏకవర్ణపునరావృత్తి, ద్వివర్ణపునరావృత్తి, బహువర్ణ పునరావృత్తి' అని మూడు రకాలు. ఇక్కడ వర్ణాలు అంటే హల్లులుగా గ్రహించాల్సి ఉంటుంది. ఈ వర్ణ విన్యాసవక్రతను ఇతరాలంకారికులు చేకానుప్రాస, వృత్యానుప్రాస, అంత్యానుప్రాస, లాటానుప్రాస, శ్రుత్యానుప్రాస, అను ఐదు ప్రాసలుగా చెప్పారు. ఈ మూడిటితో పాటు ఇందులో భాగంగా మరో మూడు విధాల వర్ణవిన్యాసవక్రతలను తెలిపాడు. వర్గపంచమాక్షరాలతో రాయటం, ద్విత్వాలు ఎక్కువగా రావటం, సంయుక్త పదాలు ఉండడం కూడా వర్ణ విన్యాసమే అన్నాడు. ప్రధానమైన మూడు వర్ణ విన్యాస వక్రతలు. శ్రీనాథుని కవిత్వంలో వక్రోక్తి మార్గం పాటించాడు అని అన్నారు కాబట్టి ఆ లక్షణానికి సరిపడ లక్ష్యాలు ఉన్నాయా లేవా అని పరిశీలిద్దాం.

## 7.1 ఏకవర్ణ విన్యాస వక్రత:

**ఒకే వర్ణం (హల్లు) అనేక సార్లు ఆవృత్తమైతే దానిని ఏకవర్ణ పునరావృత్తి** అని అంటారు. దీనికి శ్రీనాథుని భీమేశ్వరపురాణంలోని ఈ క్రింది పద్యాన్ని ఉదాహరణగా చూపవచ్చు.

కం. **వడివిడువక యివ్వడువున**

**ముడుపతి ముకుటుండు చెవులకొనరని నుడుగుల్**

**నొడివిన నే నయ్యిరువుర**

**యడుగులబడి కాశి వెడలి మరిగెడు వేళన్.** (భీమే ద్వి. ఆ. 16ప)

వ్యాసున్ని కాశీ వదిలి పొమ్మని శివుడు కోపగించే సందర్భంలోనిది ఈ పద్యం ఇందు 'డ' కారం ప్రతీసారీ ఆవృత్తమై వర్ణ విన్యాసాన్ని కలిగించింది. మహాశివుని మాట్లాడిన వేగాన్ని ఈ శబ్దం చెపుతున్నదా అనట్లు అనిపించటం ఈ పద్యంలోని ప్రత్యేకత. ఇది పోతన భాగవతంలోని 'అడిగెదనని కడువడి జను' పద్యాన్ని గుర్తుకు తెలుస్తుంది. 'డ' వర్ణ విన్యాసంతో అలరించిన ఈ పద్యం కుంతకుడు చెప్పిన ఏక వర్ణ విన్యాసానికి ఉదాహరణ. ఇతరులు దీన్నివృత్యాను ప్రాసగా చెప్తారు. 'డ' కారం నాద సౌందర్యాన్ని పద్యానికి చేకూర్చటం వలన పద్యం వినసొంపుగా ఉంది.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

### 7.2 ద్వివర్ణవిన్యాసవక్రత:

**రెండు వర్ణాలు అనేక మార్లు అవృత్తమైతే దాన్ని ద్వివర్ణవిన్యాసవక్రత** అని అంటారు. ఈ విధమైన వక్రతకు శ్రీనాథుని భీమేశ్వరపురాణంలోనే ఈ క్రింది మరో పద్యాన్ని లక్ష్యంగా పేర్కొనవచ్చు.

కం. **అసమ సమ విషమ సమర**

**ప్రసృమర రిపుసుభట నిటలపట్ట విఘట్ట**

**వ్యసన దృఢ దోః కఠారా !**

**కుసుమ శరాసన సమాన కోమలమూర్తీ**! (భీమే. ద్వి. ఆ. 164 ప)

వేమ భూపాలుని పొగుడుతూ అతని పరాక్రమాన్ని తెలుపుతూ రకరకాల సమరములలో శత్రు సైనికుల నుదుటి పట్టములను చీల్చుటయందు ఆసక్తి కలిగినవాడా! మన్మధునితో సమానమైనవాడా అన్ని వర్ణించాడు. ఇక్కడ అసమ సమ, సమర, సమాన పదాల్లో 'సమ' అను పదంలోని వర్ణాలు అనేకమార్లు భిన్న అర్థాలలో వ్యక్తమయ్యాయి. ఇతరాలంకారికులు యమకంగా దీన్ని గుర్తించారు. కుంతకుడు వర్ణ విన్యాసంగా చెప్పాడు. ఇన్ని సార్లు ఈ హల్లుల జంట రావడం రాజు పరాక్రమాన్ని తెలియజేస్తూ శబ్ద సౌష్టవాన్ని కూర్చింది. ఇక్కడ ‘సమ’ అనే పదం సమానమైన, అసమానమైన యుద్ధ సంబధమైన పదగతంగా అర్థాలను ఇచ్చి పలు మార్లు ఆవృత్తం కావటం వలన శ్రవణానందాన్ని కూర్చింది. ఇది కుంతకుడు చెప్పిన ద్వివర్ణ పునరావృత్తి గా చెప్పవచ్చు.

### 7.3 బహువర్ణవిన్యాసవక్రత:

**మూడు లేదా అంతకంటే ఎక్కువ వర్ణాలు మళ్ళీ మళ్ళీ ఆవృతమైనట్లైతే దానిని బహువర్ణపునరావృత్తి** అని అంటారు. ఇందుకు శ్రీనాథుని హరవిలాసంలోని ఈ క్రింది పద్యాన్ని ఉపపత్తిగా చెప్పవచ్చు.

క. **వచ్చిన వాడక వచ్చున్.**

**జొచ్చిన వాకిలియు చొచ్చు జొచ్చిన చోటే**

**యచ్చుగా గ్రమ్మఱంజొచ్చున్**

**బచ్చు శివార్చనకు శంభు భక్తుల వెదకన్**" (హ. వి. ఆ. 2 –ప. 46)

చిఱుతొండనంబి ఆతిథ్యం ఇవ్వడానికి అతిథి కోసం వెతుకుతున్న సందర్భంలో చెప్పినటువంటి పద్యం ఇది. ఈ పద్యమందు ‘వచ్చిన వచ్చున్’ జొచ్చిన చొచ్చు, జొచ్చిన అనే పదాలు పునరావృతమైనవి. జ, చ, న వర్ణాలు పదే పదే ఆవృత్తమైనవి కనుక దీనిని

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

బహువర్ణ పునరావృత్తిగా చెప్పవచ్చు. ఈ పదాలను మళ్ళీ మళ్ళీ ప్రయోగించుట వలన చిఱుతొండనంబి ఏవిధంగా అతిథికోసమై ప్రయత్నం చేసాడో అనే దానిని గూర్చి చెప్పుతూనే ఆ ప్రయత్నం ఎంతపట్టుదలతో చేసాడనే విషయాన్నిఈ పదాలే చెప్తున్నాయా? అన్నట్లు వ్యక్తం చేస్తున్నాయి. ఇది బహువర్ణవిన్యాసానికి లక్ష్యంగా చెప్పవచ్చు.

**8. ముగింపు:**

కుంతకుని వక్రోక్తి సిద్ధాంతంలోకి వేములవాడ భీమన ఉద్దండ లీల, నన్నయ ఉభయ వాక్ప్రౌడి రెండు కూడా కాఠిన్యమే. ఈ మూడు లక్షణాలు కూడా కుంతకుడు చెప్పిన వర్ణవిన్యాసవక్రతలో అంతర్భవిస్తాయి. రసంతో కూడిన సరసోక్తి కూడా రససమున్మేషవక్రతలో వస్తుంది. తిక్కన రసాభ్యుచిత బంధం సరసత్వమే కదా. ఎర్రన సూక్తి వైచిత్రి వాక్య వక్రతలో ఇలా ప్రతీ లక్షణం వక్రతా వ్యాపారంలో ఇముడుతుంది. కానీ ప్రతి లక్షణానికి ఉదాహరణలతో ఈ పత్రంలో నిరూపించడానికి నిడివి సరిపోదు. ప్రస్తుతం శ్రీనాథుని కవిత్వంలో వర్ణవిన్యాసవక్రత సోదాహరణంగా నిరూపించడమైంది. ఈ మహాకవి కేవలం శబ్దానికే కాక అర్థానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాడు. ఆయన మార్గం కుంతకుడు చెప్పిన విచిత్రమార్గం. వక్రోక్తి సిద్ధాంతంలోని అంతర్భేదాలలో కూడా చెప్పిన అన్ని లక్షణాలు శ్రీనాథుని పద్యాల్లో ఇమిడి ఉన్నాయి. కవి చెప్పిన దాన్ని బట్టి పరిశోధకుల అభిప్రాయాన్ని బట్టి, శ్రీనాథుని కవితా మార్గాన్ని వక్రోక్తిగా చెప్పవచ్చు.

**9. పాదసూచికలు:**

1. మస్తాన్ రెడ్డి. చేరెడ్డి. భారత పద్య శైలి. పుట.1
2. సుబ్రహ్మణ్యం. జి.వి.ముత్యాల ముచ్చట్లు.పుట. 50.
3. హనుమచ్ఛాస్త్రి. ఇంద్రగంటి. ప్రాచీన కవితా వైజయంతి పుట 73.
4. మస్తాన్ రెడ్డి, చేరెడ్డి. భారత పద్య శైలి. పుట 2.
5. సుబ్రహ్మణ్యం.జి.వి.ముత్యాల ముచ్చట్లు పుట. 51.
6. ఈశ్వర దత్తు. కుందూరి. శ్రీనాథుని కవితా తత్త్వం.పుట. 157.
7. శ్రీ రామమూర్తి, కొర్లపాటి. తెలుగు సాహిత్య చరిత్ర పుట 123.
8. నాగయ్య .జి. ఎఱ్ఱన శ్రీనాథుల సూక్తి వైచిత్రి పుట27.
9. శ్రీరామ చంద్రుడు. పుల్లెల వక్రోక్తి జీవితం, పుట: 203.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_11.php

**10. ఉపయుక్తగ్రంథసూచి:**


1. ఈశ్వరదత్తు. కుందూరి. (1964). శ్రీనాథుని కవితాతత్త్వం. ఆంధ్రసారస్వతపరిషత్. హైదరాబాద్.
2. జయకృష్ణబాపూజీ, జంధ్యాల. (1977), శ్రీనాథుని సాహిత్యప్రస్థానం. వెల్కం ప్రెస్. గుంటూరు.
3. నాగయ్య, జి. (1984). నవ్య పరిశోధక ప్రచురణ. ఎఱ్ఱర శ్రీనాథుల సూక్తి వైచిత్రి. తిరుపతి.
4. మస్తాన్ రెడ్డి. చేరెడ్డి. (1989). భారత పద్య శైలి. ఆశాలతా ప్రచురణలు. నరసరావుపేట.
5. మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. (2000), కవి సార్వభౌమ విరచిత శ్రీ శివరాత్రి మహాత్మ్యం. (వ్యాఖ్యానం). తెలుగు విశ్వ విద్యాలయం హైదరాబాద్.
6. లక్ష్మీనారాయణ. గుండవరపు. (1997). శ్రీనాథ మహా కవి విరచిత శ్రీ భీమేశ్వర పురాణం (వ్యాఖ్యానం). ఫాలాక్ష ప్రచురణ. గుంటూరు.
7. శరభేశ్వర శర్మ, మల్లంపల్లి, (1992). శ్రీనాథ విరచిత శ్రీ కాశీఖండం (వ్యాఖ్యానం). తెలుగు విశ్వ విద్యాలయం. హైదరాబాద్.
8. శ్రీరామ మూర్తి కొర్లపాటి. (1992). తెలుగు సాహిత్య చరిత్ర. రమణశ్రీ ప్రచురణలు. విశాఖపట్టణం.
9. రామచంద్రుడు. పుల్లెల (2007). వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యానం),సాహిత్య అకాడెమి. న్యూఢిల్లీ.
10. సుబ్రహ్మణ్యం. జి.వి. (1996). ముత్యాల ముచ్చట్లు. జీవియస్ షష్టిపూర్తి ప్రచురణలు. హైదరాబాద్.
11. హనుమచ్ఛాస్త్రి. ఇంద్రగంటి. (1988), ప్రాచీనకవితావైజయంతి. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.


***

**గమనిక: ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.**
**వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.**

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-5 | Issue-2 | February 2024 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2024/feb_2024/full_papers/february24_08.php

DOI:

# 8.శ్రీనాథుని కృతులు: పదపూర్వార్ధవక్రత



**వేముల శరణ్య**

తెలుగు పరిశోధకురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

తెలుగు అధ్యాపకురాలు, తె. సాం. సం. గురు. మహిళా డిగ్రీ కళాశాల,

జగిత్యాల, తెలంగాణ.

సెల్: +91 9493613830. Email: vemulasharanya11@gmail.com

**వ్యాససంగ్రహం:**

*తెలుగు సాహిత్యంలో శ్రీనాథుని కవిత మార్గం అనితర సాధ్యం చిర స్మరణీయం మధుర మధు సంభరితం. ఎంతోమంది విమర్శకులు శ్రీనాథుని కవితా చర్చ చేశారు తమవైన అభిప్రాయాలను వెల్లడి చేశారు శబ్దార్థ సౌష్టవంతో కూడిన అతని రచన వక్రోక్తి మార్గాన్ని అనుసరించిందని కుందూరు ఈశ్వర దత్తు, కొర్లపాటి శ్రీరామమూర్తి మొదలైన విమర్శకుల అభిప్రాయానికి అంగీకారంగా కుంతకుని వక్రోక్తి సిద్ధాంత లక్షణాలకు అనుగుణంగా శ్రీనాధుని పద్యాలను సమన్వయం చేస్తూ కుంతకుడు చెప్పిన ఆరు రకాల వక్రతల్లో రెండవది అయిన పదపూర్వార్ధ వక్రత నిరూపించే ప్రయత్నం ఈ పత్ర ఉదేశ్యం.*

**Keywords:** శ్రీనాథుని కవిత్వం, కుంతకుని వక్రోక్తి,పదవక్రత భేదాలు,లక్షణలక్ష్య సమన్వయం.

## 1.ఉపోద్ఘాతం:

శ్రీనాథుడు వక్రత మార్గం అనుసరించాడు అని చెప్పిన వారిలో కుందూరి ఈశ్వరదత్తు ఉన్నాడు. శ్రీనాథుని కవిత తత్త్వం మీద పరిశోధన చేసిన కుందూరి ఈశ్వరదత్తు శ్రీనాథుడు అనుసరించిన మార్గం విచిత్ర మార్గం అని తెలిపి విచిత్ర మార్గం అంటే ఏమిటో వివరిస్తూ -

**"విచిత్ర మార్గము 1. ప్రతిభాజాతశబ్దార్ధ చమత్కారము, 2. అలంకార సహితము, 3. ఉక్తి వైచిత్ర్యము 4. ప్రతీయమాన అర్థచమత్కారము, 5. వక్రోక్తి నిబంధనము"**[1] అని తెలిపాడు.

కొర్లపాటి శ్రీరామమూర్తి శ్రీనాథుని మీద ప్రసిద్ధమైనపరిశోధన చేసి చారిత్రిక ఆధారాలను చూపెట్టి శ్రీనాథుని కవితా మార్గం గూర్చి ప్రస్తావిస్తూ-

**"భరతముని ప్రోక్తమైన రసము కుంతకుని ప్రతిపాదితమైన వక్రోక్తి శైలీ పరిణతమైన ప్రౌఢిమ సత్కావ్య లక్షణములని శ్రీనాథుని సిద్ధాంతము. ఈ మూడును తన కవితా రీతులని శ్రీనాథుని ఋజుముఖ ప్రకటనము."[2]**

అంటూ వక్రోక్తి మార్గంగా సూచించాడు. వీరి అభిప్రాయాల దృష్ట్యా, "హరచూడా హరిణాంక వక్రత" పద్యంలో చెప్పిన వక్రత పద ఆధారంగా శ్రీనాథుని కృతులు: పద పూర్వార్ధ వక్రత శీర్షికన పదవక్రతను శ్రీనాథుని రచనల్లో చూపదలిచాను.

**2. కుంతకుడు – పదవక్రత:**

కుంతకుడు ప్రధానంగా ఆరు వక్రతలను తెలిపాడు 1. వర్ణవిన్యాసవక్రత 2. పదపూర్వార్ధవక్రత 3. పదపదార్ధవక్రత 4. వాక్యవక్రత 5. ప్రకరణ వక్రత 6. ప్రబంధవక్రత.

కుంతకుడు వర్ణవిన్యాస వక్రత తెలిపిన తర్వాత పదవక్రతలను, వాటి అంతర్భేదాలను తెలియజేశాడు. మొదటగా పదం అనే అర్థాన్ని వివరించాల్సి ఉంది. వ్యాకరణపరంగా పదం అంటే

**"సుప్తిఙన్తం పదమ్' 'సుబన్తం తిఙన్తఞ్చ పదసంజ్ఞంస్యాత్' సుబన్తమునకును తిఙన్తమునకును పదమని పేరు. 'రామ' మొదలగు ప్రాతిపదికల యన్తమున చేర్చబడు విభక్తి ప్రత్యయములు 'సుప్' ప్రత్యయములు. కావున 'రామః' 'రామం' మొదలగునవి సుబన్తములు. 'భూ' మొదలగు ధాతువుల యన్తమున చేర్చబడు 'తి' మొదలగు ప్రత్యయములు 'తిఙ్' ప్రత్యయములు. కావున 'భవతి' మొదలగునవి తిఙన్తములు. ఇట్టి సుబన్త తిఙన్తములకు పదములని పేరు."[3]**

సుబంతముల పూర్వర్థంలో ప్రాతిపదిస ఉంటుంది. తిజంతపదాల పూర్వార్థాల్లో ధాతువు ఉంటుంది. సుబంతాలు నామవాచకాలను తెలిపితే, తిజంతాలు క్రియలను తెలుపుతాయి. ఇలా పదాలు సుబంతాలు, తిజంతాలు అని రెండు రకాలుంటాయి. పదంలో ప్రకృతి–ప్రత్యయం అనే భాగాలుంటాయి. ప్రకృతి భాగాన్ని పదపూర్వార్థమని, ప్రత్యయభాగాన్ని పదపరార్థం అని అంటారు. సుబంతానికి ప్రకృతి అయిన దాన్ని 'ప్రాతిపదిక' అంటారు. తిజంతానికి ప్రకృతి అయిన దాన్ని ధాతువు అంటారు. పదం పూర్వంలో అంటే ప్రకృతిలో (ప్రత్యయం కాకుండా కేవల పదాల్లో) జరిగే వక్రతను పదపూర్వార్థవక్రత అని అంటారు. అందులో కుంతకుడు మళ్ళీ అంతర్భేదాలను తెలిపాడు.

**3. పదపూర్వార్థవక్రత-భేదాలు:**

పదపూర్వార్థవక్రత పది రకాలు. అవి 1) రూఢి వైచిత్రయవక్రత, 2) పర్యాయవక్రత, 3) ఉపచారవక్రత, 4) విశేషణ వక్రత, 5) సంవృతి వక్రత, 6) పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రత, 7) వృత్తి వైచిత్ర్య వక్రత, 8) భావవైచిత్ర్య వక్రత, 9) లింగవైచిత్ర్య వక్రత 10) క్రియావైచిత్ర్య వక్రత.

**3.1 రూఢి వైచిత్ర్య వక్రత:**

కా॥ యత్ర రూఢేరసంభావ్యధర్మాధ్యారోపగర్భతా,
సద్ధర్మాతి శయారోపగర్భత్వం వా౭ప్రతీయతే.
కా॥ లోకోత్తరతిరస్కార శ్లాఘ్యోత్కర్షాభిధిత్సయా,
వాచ్యస్య సోచ్యతే కాపిరూఢివైచిత్ర్య వక్రతా. (వ.జీ.ఉన్మే.ద్వి.కా. 8, 9)

"వాచ్యమగు అర్థమునకు, లోకోత్తరమగు తిరస్కారమును గాని, శ్లాఘ్యమగు ఉత్కర్షను గాని చెప్పవలెననెడు ఇచ్ఛచే, ఎచట రూఢ శబ్దము అసంభావ్యమగు ధర్మము యొక్క అధ్యారోపము గర్భమునందున్నట్లుగ గాని, వాస్తవముననున్న ధర్మముయొక్క అతిశయము యొక్క ఆరోపము గర్భమునందున్నట్లుగ గాని, ప్రతీతమగునో అది (అట్టి ప్రతీతి). ఒకానొక అపూర్వమగు రూఢివైచిత్రయ వక్రతయని చెప్పబడుచున్నది"4
(శ్రీరామచంద్రుడు, పుల్లెల. వక్రోక్తి జీవితం. 2007. పుట.178).

రూఢి రూఢములైన పదాల వలన వైచిత్ర్యం కలిగితే రూఢివైచిత్ర్యం అలాగే వాచ్యార్థము వల్ల ఉత్కర్ష, అపకర్ష ఏదైనా కలిగినా కూడా అది రూఢి వైచిత్ర్య వక్రతగా కుంతకుడు తెలిపాడు. ఉత్కర్ష వివక్షాకృతమైన రూఢివైచిత్ర్యానికి ఉదాహరణ.

**ఉదాహరణ:**

తే. ఏ భయంబును నెచ్చోట నెన యలేదు
నరున కెప్పాట విద్యాధనంబ ధనము
చోర బాధాదికములచేఁ జూఱవోవు
ధనము ధనమౌనె యెన్ని చందములఁ దలఁప. (కాశీ. 4-112)

కాశీఖండంలో గుణ నిధి బాధపడుతున్న సందర్భంలోనిది ఈ పద్యం.ఎక్కడ ఏ భయం లేకుండా ఉండే ధనమే గొప్పధ నం అని దొంగల చేత దోచుకోబడేది,పోయేది ధనమవుతుందా? కాదంటూ విద్యా ధనమే నిజమైన ధనము అని చెప్పడం ఈ పద్య భావం. ఇక్కడ విద్యాధనంబ ధనము, ధనము ధనమౌనే అనే పదప్రయోగాల్లో మొదట చెప్పిన ధనం అనే పదం కన్నా రెండవ పదంగా చెప్పిన పదానికి ఉత్కర్ష ఉంది. తాత్పర్య భేదం కనిపిస్తుంది. రూఢి వైచిత్ర్య వక్రతకు ఉదాహరణగా చెప్పవచ్చు.

**3.2 పర్యాయవక్రత:**

రూఢి వైచిత్ర్య వక్రత తర్వాత పర్యాయ వక్రత భేదాన్ని ఇలా తెలిపాడు.

**కా॥ అభిధేయాన్తరతమస్తస్యాతిశయ పోషకః।**

**రమ్యచ్ఛాయాన్తరస్పర్శాత్తదలఙ్కర్తుమీశ్వరః॥**

**కా॥ స్వయం విశేషణేనాపి స్వచ్ఛాయోత్కర్షపేశలః।**

**అసమ్భావ్యార్థపాత్రత్వ గర్భం యశ్చాభిధీయతే॥**

**కా॥ అలఙ్కారోపసంస్కార మనోహారినిబన్ధనః।**

**పర్యాయస్తేన వైచిత్ర్యం పరాపర్యాయవక్రతా॥** (వ.జీ.ద్వి.ఉన్మే.కా.10-12)

సమానమైన అర్థాన్నిచ్చే పదాలను పర్యాయ పదాలంటారు. ఒక్కొక్క శబ్దానికి చాలా పర్యాపదాలుంటాయి. కవి తన రచనలో సౌందర్యాన్ని పోషించడానికి సందర్భానుసారమైన పర్యాయ పదాలను, కావ్యశోభాహేతుకమైన వాటిని కూర్చుతాడు దానినే కుంతకుడు పర్యాయ వక్రతగా చెప్తున్నాడు. కేవలం పర్యాయాలను వాడటం కాకుండా సందర్భానికి తగిన రీతిగా పర్యాయాలను వాడటంలోనే విశేషం ఉంది. కొన్ని సందర్భాల్లో అర్థ ద్వయం ఉన్నప్పుడు ప్రకృతానికి సరిపోయే పదాన్ని తీసుకోవాలి. సంయోగము మొదలైనవాటిని దృష్టిలో పెట్టుకోవాలి.

**ఉదాహరణ:**

**శా. ఆనందంబున నర్ధరాత్రమునఁ జంద్రాలోకముల్ కాయఁగా**

**నానా సైకత వేదికా స్థలములన్ నల్దిక్కులన్ శంభుఁ గా**

**శ్రీనాథున్ దరుణేందుశేఖరు శివున్ శ్రీకంఠునిన్ బాడుదు**

**నేనెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్ (భీమ. 2-91)**

అగస్త్యుడు కాశిని తలచుకొని తన్మయత్వం చెందే సందర్భంగా రాసిన ఈ పద్యం నిజంగా చందమామ వెన్నెలను తలపిస్తున్నదా అన్నట్లే మనోహరమైన పర్యాయ పదాలతో అల్లినది. ఆనందంగా అర్ధరాత్రి సమయంలో వెన్నల కాస్తుండగా ఆ చంద్రశేఖరుని కొ లిచేవాడిని అంటూ తరునేందు శేఖరునిన్, శంభున్, శివున్, శ్రీ కంఠునిన్ అంటూ కవి వర్ణించిన తీరు మనోజ్ఞమైంది. శిరస్సునందు, చంద్రుడు, గంగానది ఇసుక తిన్నలపై వెన్నలలు కాయటం దగ్గరి సంబంధాన్ని కలిగిన ఉన్న పర్యాయాలను కవి సందర్భానుసారంగా వాడాడు. సిగదండగాం గల శివుడు చల్లని గాయిని గొల్పుతున్నాడనే కవి హృదయం ఇది. సరైన పర్యాయలను వాడటం కూడా సౌందర్యమే. ఇది పర్యాయ వక్రత.

**3.3 ఉపచారవక్రత:**

ఉపచార వక్రతను వివరిస్తూ ఈ కారికలను తెలిపాడు.

**కా॥ యత్ర దూరాన్తరేఽన్యస్మాత్సామాన్యముపచర్యతే।**

**లేశేనాపి భవత్కాంచిద్వక్తుముద్రిక్త వృత్తితామ్॥**

**కా॥ యస్మూలా సరసోల్లేఖారూపకాదిరలంకృతిః।**

**ఉపచార ప్రధానాసౌ వక్రతాకాచిదుచ్యతే॥ (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 13,14)**

అత్యంతము విభిన్నములైన పదార్థముల సాదృశ్యాతిశయము కారణంగా భేద ప్రతీతిని కప్పిపుచ్చి అభేద ప్రతీతిని కల్పించుట ఉపచారము. అమూర్త పదార్థములందు మూర్తపాదర్థధర్మారోపము. ఘనపదార్థములందు ద్రవపదార్థ ధర్మారోపము, అచేతనములకు చేతన ధర్మారోపము ఉపచారము.

**ఉదాహరణ:**

**శా. పంచారామవిలాసినీధవళదృక్చాపీన జాలాయమా**

**నాంచత్కోమలనిర్నిబంధన మనోజ్ఞాకార రేఖా (కళా)**

**పంచాస్త్రుండగు నా కుమారుఁదురుదర్పస్ఫూర్తి నవ్వీటిలో**

**సంచారం బొనరించెం గాంచనమహాసౌధాగ్రభాగంబులన్. (శివ. 2-85)**

సుకుమారుని సౌందర్య వర్ణన ఇది. పంచారామంలోని స్త్రీల సౌందర్య చూపులనెడి కొంగ్రచేపలకు, సుకుమారుని, మృదువైన, మనోహరమైన సౌందర్యానికి వల అవుతున్నదని భావం. స్త్రీల చూపులు అనేవి అమూర్థం కనిపించదు. తాకలేదు. కాని సుకుమారుడు వల అవటం అనేది మూర్థ భావన. చూపులకి వలకి సంబంధాన్ని చెప్పటం సుకుమారుని సౌందర్యం అనే అనే అమూర్థాన్ని వల అంటూ భౌతికంగా తాకే వస్తువుగా చెప్పటం పద్యంలోని రమణీయత. ఇది ఉపచారవైచిత్ర్య వక్రత.

**3.4 విశేషణవక్రత:**

కుంతకుడు విశేషణ వక్రతను ఇలా వివరించాడు.

**కా॥ విశేషణస్య మహాత్మ్యాత్ క్రియాయాః కారకస్య వా।**

**యత్రోల్లసతి లావణ్యం సా విశేషణవక్రతా॥** (వ.జీ.ద్వి.ఉన్మే.కా.15)

విశేషణం చేత క్రియకు గానీ, కారకానికి గానీ సౌందర్యం చేకూరుతుందో అది విశేషణ వక్రత. ఉదాహరణగా సంస్కృత శ్లోకాన్నిచ్చి వివరించబడింది.

**ఉదాహరణ:**

**తే. వేదశాఖా విభాగ సంవేది యతఁడు**

**లలిత బిల్వ త్రిశాఖా పలాశ సమితి**

**సంగమేశ ఘటోద్భవ శంకరులకు**

**నర్చనము సేయుఁబ్రణవ పంచాక్షరముల.** (భీమ. 2-71)

వ్యాస మహర్షి గొప్పదనాన్ని పొగుడుతూ "వేదశాఖా విభాగ సంవేది యతడు" అంటూ వేదాలను శాఖలుగా విభజించటంలో జ్ఞాని అని, సంగమేశ్వర, అగస్త్యేశ్వరులను , త్రిబిల్వంతో ప్రణవ పంచాక్షిరితో పూజి స్తాడని చెప్పటం హృదయంగమముగా ఉంది.ఈ విశేషణం వ్యాసుని ఉన్నతునిగా చేసింది. విశేషణం చేత రమణీయత చేకూరింది కనుక విశేషణ వక్రత.

**3.5 సంవృతి వక్రత:**

కుంతకుడు సంవృతి వక్రతను ఇలా వివరించాడు.

**కా॥ యత్ర సంవ్రియతే వస్తు వైచిత్రస్య వివక్షయా**
**సర్వనామాదిభిః కైశ్చిత్ సోక్తా సంవృతి వక్రతా** (వ.జీ.ద్వి.ఉన్మే.కా.16)

కవి సౌందర్యాన్ని ఉద్దీపింపజేయాలని ఎక్కడైతే సర్వనామాది పదాలతో వర్ణించదగిన వస్తువును కప్పిపుచ్చడం జరుగుతుందో అది సంవృతి వక్రత. సంవృతి అంటే కప్పి పుచ్చడం అని అర్థం. దీనికి ఉదాహరణగా కుమారసంభవంలోని అష్టమసర్గలోని శ్లోకం ఉదాహరణగా ఇచ్చాడు కుంతకుడు.

**ఉదాహరణ:**

**ఆ. డాయఁబోయి యప్పుడాయమ్మ యెవ్వరో**
**యేకులంబు నదియొ యెఱుఁగకయును**
**నేజోహరు నిడితి హృదయంబనేరుచు**
**నెదురు ప్రాభవంబు నేర్పరింప.** (భీమ. 2-112)

వ్యాసుడు కాశిని శపించే సందర్భంలో ఇలాచెప్పుతూ ఆ ఇల్లాలు ఎవరో ఏ కులమో తెలియకనే సమీపించాను. ఎదుటి వాళ్ళ గొప్పదనం తెలుసుకోవడానికి మనస్సేసరి అయినది. ఆమె ఎవరో అనే సర్వనామాన్ని తెలుపుతూ వచ్చిన వారిని కప్పి పుచ్చడం సంవృతి. ఎవ్వరో అనటంలో ఆపదలో ఆదుకున్నది. ఏ పూణ్యాత్మురాలో అనే విషయాన్ని ఈ సర్వనామం తెలుపుతుంది. ఇది సంవృతి వక్రత.

**3.6 పదమధ్యాతంర్భూతప్రత్యయవక్రత:**

సంవృతివక్రత తర్వాత పదం మధ్యలో వచ్చే కృతద్ధితాది ప్రత్యయాలు వస్తే పదమధ్యాంతర్భూత ప్రత్యయ వక్రతగా చెప్పాడు కుంతకుడు.

**కా॥ ప్రస్తుతౌచిత్య విచ్ఛిత్తిం స్వమహిమ్నావికాసయన,**
**ప్రత్యయః పదమధ్యేఽ న్యాముల్లాసయతి వక్రతామ్.**

**కా॥ ఆగమాదిపరిస్పన్దసున్దరః శబ్ద వక్రతామ్**
**పరః కామపి పుష్ణాతి బన్ధచ్ఛాయా విధాయినీమ్** (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 17, 18)

పదమధ్యంలో ప్రత్యయం వస్తే ప్రస్తుతార్థానికి శోభ కలగటం ఒక రకమైన వక్రతకాగా, ఇదే వక్రతలో భాగంగా పదం మధ్యలో ముగాగమాది కృదాది ప్రత్యయాలు, వర్తమాన కాలాన్ని బోధించే శతృ ప్రత్యయాలు కూడా కావ్య సౌందర్యానికి దోహదం అవుతాయని తెలిపాడు. దీనికి ఉదాహరణగా "స్నిహ్యత్కటాక్షే దృశౌ" అనే వాక్యాన్ని వివరిస్తూ 'నేత్రములు స్నేహపూర్ణములగుచున్న కటాక్షములు కలవి అని శ్రీరామచంద్రుడు వ్యాఖ్యానించాడు. అగుచున్న అనేది వర్తమాన కాలాన్ని బోధించే 'శతృ' ప్రత్యయం కనిపిస్తుంది. ఇలా ప్రత్యయాల ద్వారా పదం మధ్యలో సౌందర్యం చేకూరిచే అది వక్రతగా భావించాలని తెలియజేశాడు కుంతకుడు.

**ఉదాహరణ:**

**శా. ఆటోపారభటి న్మునీశ్వరుఁడు తన్నందంద వర్ణింపఁ**
**చ్చాటు ప్రౌఢికిఁ జేసె ధూర్జటి మహాశ్లాఘాశిరఃకంపమున్**
**జూటీకూట విటంకకోటి విలుఠత్ స్రోతస్వినీవీచికా**
**కోటీధాటి రటత్కరోటి కుహర క్రోడావకాశంబుగాన్ (కాశీ. 4-253)**

ఆరభటి వృత్తితో, ఆటోపంతో తోటకవృత్తాలు చదువుతూ బృహస్పతి మాటిమాటికి శివున్ని స్తుతిస్తూ ఉంటే ఆస్తుతికి శ్లాఘాపుర్వక కంపముచేసాడు. అప్పుడు జటాజూటశిఖరములోని పొరలి పడుతున్నదైన గంగానది కెరటాల పరంపలు రవళించి బ్రహ్మ కపాల రంధ్రంలో నుండి మార్మోగాయి అని వర్ణించాడు కవి. **'విటంక కోటి విలుఠత్'** అనే పదం, ధాటీరఠత్, అనే శతృ ప్రత్యయాలు పద్యానికి సౌందర్యాన్నిచేకూర్చాయి. నిజంగా గంగా నదీ ప్రవాహ రవళిని ఆలకిస్తున్నాయా? అన్నట్లు ఈ పదాలు వాడడం వలన అనిపించింది.

### 3.7 వృత్తివైచిత్ర్య వక్రత:

వృత్తివైచిత్ర్య వక్రతను ఇలా నిర్వచించాడు.

**కా॥ అవ్యయీభావ ముఖ్యానాం వృత్తీనాం రమణీయ తా**
**యత్రోల్లసతి సాజ్ఞేయా వృత్తివైచిత్ర్య వక్రతా** (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 19)

అవ్యయీభావం వలన రామణీయకత ఏర్పడితే అది వృత్తివైచిత్ర్య వక్రతగా చెప్పాడు. ఒక శ్లోకాన్ని ఉదాహరణగా ఇచ్చి అందులో "అధిమధులతానాం నవరసః" అని ఉండగా అందులో 'అధిమధు' అనే అవ్యయీభావసమాసం వలన శ్లోకానికి సౌందర్యం ఏర్పడిందని అర్థవంతంగా ఉన్నదని వివరించాడు.

**ఉదాహరణ:**

**శా. తల్లీ! యిన్నిదినాలకేనియు సుధాధారా రసస్యందియై**
**యుల్లంబున్ సుఖియింపఁజేయు పలుకెట్లో వింటి నిప్వీటిలోఁ**
**బెల్లాకొన్న కతాన నేనొకఁడనే భిక్షానకున్ వత్తునో**
**యెల్లన్ శిష్యులఁగొంచు వత్తునొ నిజంబేర్పాటుగా జెప్పుమా.** (భీమ 2-120)

వ్యాసుడు అమ్మా! ఇన్ని దినాలకైన ఈ పట్టణంలో అమృత తుల్యమై మనసుకు సంతోషం కలిగే మాట విన్నాను. భిక్షకు ఒక్కడినే రావాలా? ఎల్ల శిష్యులను తీసుకొని రావాలా? అని ప్రశ్నించే సందర్భంగా "యిన్నిదినాలకేనియు "అనే సముచ్చయార్థక పదం అవ్యయం. ఈ అవ్యయాన్ని వాడటం బట్టి ఎన్నోరోజుల నుండి వేచి చూస్తున్న హృదయ ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు అయ్యింది. దీనివల్ల పద్యానికి సొబగు చేకూరింది. ఇది వృత్తి వైచిత్ర్యం.

### 3.8 భావవైచిత్ర్య వక్రత:

భావవైచిత్రయ వక్రతను నిర్వచిస్తూ ఇలా చెప్పాడు.

కా॥ **సాధ్యతామప్యనాదృత్య సిద్ధత్వేనాభిధీయతే,**
**యత్ర భావో భవత్యేషా భావవైచిత్ర్య వక్రతా** (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 20)

ఎక్కడైతే భావం సాధ్యరూపంలో ఉన్న సిద్ధరూపంలో చెప్పబడుతుందో అది భావవైచిత్ర్య వక్రత. అనిష్పన్నమైన భావమును నిష్పన్నమైనట్లు చెప్పడం అంటే క్రియలు జరగకముందే జరిగినట్లు వర్ణించటం కూడా భావవైచిత్ర్య వక్రతగా కుంతకుడు భావించాడు.

**ఉదాహరణ:**

**చ. ఇతడు దరిద్రుఁ డౌ ననుచు నేర్పడ నర్థి లలాటపట్టికన్**
**శతధృతి వ్రాసినట్టి లిపి జాల మనర్థము గాని యట్లుగా**
**వితరణ ఖేలనా విభవ విభ్రమ నిర్జిత కల్పభూరుహుం**
**డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రునిఁ జేయునాతనిన్.** (శృం.నై.1-57)

నలుని గొప్పతనాన్ని కవి వర్ణిస్తూ దాత అయిన రాజుయాచకుల నొసటన బ్రహ్మరాసిన పేదరికం. లిపిని ధనమిచ్చి అబద్దం చేసి చూపాడని నుతించాడు. అలాగే పేదరికంలోనే పేద వారిగా చేసాడంటూ “దరిద్రతాగుణమునందు దరిద్రుని జేయు" కవి గొప్పవర్ణన. ఇక్కడ బ్రహ్మ రాసిన లిపిని ఎవరు తప్పించలేరు. అది సహజం కానీ దానిని కూడా తప్పించగలడని చెప్పడం సాధ్యం. అసాధ్యం సుసాధ్యం అయ్యింది కనుక భావ వైచిత్ర్యం.

### 3.9 లింగవైచిత్ర్య వక్రత:

లింగవైచిత్ర్య వక్రతను వివరిస్తూ ఇలా చెప్పాడు.

కా॥ **భిన్నయోర్లింగయోర్యస్యాం సామానాధికరణ్యతః।**
**కాపి శోభాభ్యుదేత్యేషా, లిఙ్గవైచిత్ర్య వక్రతా॥** (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 21)

కా॥ **సతి లిఙ్గాన్తరే యత్ర స్త్రీ లిఙ్గంచ ప్రయుజ్యతే।**
**శోభానిష్పత్తయే యస్మాన్నామైవ స్త్రీతి పేశలమ్॥** (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 22)

ఎక్కడైతే రెండు భిన్న లింగాలకు సమానాధికరణం ఉంటుందో అక్కడ గొప్పనైన శోభ ఏర్పడితే అది లింగవైచిత్ర్యం అని చెప్పాడు. అలాగే ఎక్కడైతే ఇతర లింగ పదాలున్నప్పటికి శోభను కూర్చడానికి స్త్రీలింగాన్ని వాడుతారో అక్కడ కూడా లింగవైచిత్ర్యం ఉన్నట్లే అని తెలిపాడు.

**ఉదాహరణ:**

**తే. మీతలం పే నెఱుంగుదు, మిన్నకుండుఁ**
**దంబుజాననలార, యాయాస ముడిగి;**
**యే ననాది సంచారిణి యైన యాత్మ**
**హేతు పంక్తికి విధికి నధీన బుద్ధి.** (శృ.నై. 3-137)

దమయంతి తన చెలులతో చెప్తూ మీ ఆలోచన నాకు తెలుసు ఊరుకోండి. అనాది నుండి ఎన్నో జన్మలు ఎత్తి ఉన్నాను. ఆకర్మ నన్ను అనుసరిస్తుంది. ఆ పరంపర అనాది నుండి తెంపు లేక ప్రవహిస్తుంది. ఆ క్రమానికి నేను వశమయ్యాను నలున్నే నా బుద్ధి వరించేలా చేస్తుంది. పంక్తి అనే శబ్దం ఇక్కడ స్త్రీలింగం మరియు అమహత్తు రెండు కానీ దీనికి సంచారిణి అనే మహతీ వాచకాన్ని విశేషంగా వాడారు. సౌకుమార్యం కోసం స్త్రీ లింగ వాచకాన్ని వాడటం కూడా వక్రతే కనుక అది ఈ పద్యంలో కనిపిస్తుంది.

### 3.10 క్రియావైచిత్ర్య వక్రత:

కుంతకుడు సుబంత తిఙ్గంతాలలో ప్రాతిపదిక రూపంలో ఉన్న వక్రతను చెప్పిన తర్వాత ధాతురూప పదాల్లో పూర్వభాగంలో వక్రత ఎలా సంభవిస్తుందోనని తెలుపుతూ ధాతురూపం అంటే క్రియనే కాబట్టి క్రియావైచిత్ర్య వక్రత ఎన్ని రూపాలుగా జరుగుతుందనే విషయాన్ని వివరించాడు.

**కా॥ కర్తురత్యన్తరంగత్వం కర్త్రన్తర విచిత్రతా।**
**స్వవిశేషణవైచిత్ర్యముపచార మనోజ్ఞతా॥**
**కా॥ కర్మాది సంవృతి పంచప్రస్తుతౌచిత్యచారవః।**
**క్రియావైచిత్ర్య వక్రత్వప్రకారాస్త ఇమేస్మృతాః॥ (వ.జీ.ద్వి.ఉన్మే.కా. 24, 25)**

క్రియావైచిత్ర్య వక్రత అనేది ఐదు రకాలుగా ఉంటుంది.

1) కర్తురత్యంతరంగత్వం కర్తకు దగ్గరగా ఉండే క్రియ. 2)కర్త్రన్తరవిచిత్రత = కర్తకు మాత్రమే సాధ్యమయ్యే క్రియను తెలపటం. 3) సవిశేషణవైచిత్ర్యం = విశేషణతో కూడిన క్రియ 4) ఉపచార మనోజ్ఞత = ధర్మాంతరం ఆరోపించే క్రియ. 5) కర్మాది సంవృతి= కర్మాదికాన్ని కప్పివేసే క్రియ.

**ఉదాహరణ:**

**తే. ఇష్టమానస మయిన యా హేమఖగము**
**నలునిమానస మానంద జలధియందుఁ**
**గర్ణ శష్కులి కలశంబుఁ గౌఁగిలించి**
**నా యీఁదఁ జేయుచు మృదుభాష నిట్లు లనియె.** (శృం.నై. 2-7)

ప్రియమైనట్టి మానస సరస్సు కల ఆ బంగారు పక్షి నలుని మానసం అనే జలధిలో చక్కిలంలాంటి చెవియనే కలశాన్ని కౌగలించుకొని ఈ దుతున్నది. ఈదిన కొలది ఈత సముద్రంలో తనివి అను భూతమయినట్లు విన్నా కొద్ది అధిక ఆనందం పొందే విధంగా, తన మానసానికి ఆనందం కలిగించే నలుని మానసానికి మహదానందాన్ని కావించింది హంస. మానసం అనే అమూ ర్థమైన జలధిలో హంస ఈదటం అనే మూర్థ క్రియను చెప్పటం కనిపిస్తుంది. క్రియలో ఈ వక్రత ఉన్నందున ఉపచార మనోజ్ఞత. కావున ఇది క్రియావైచిత్ర్య వక్రతలో భాగం.

**4. ముగింపు:**

1. శ్రీనాథుని పద్యాల్లో కుంతకుని వక్రోక్తి సిద్ధాంత లక్షణాలకు అనుగుణంగా లక్ష్యాలను చూపడం జరిగింది.
2. విమర్శకుల అభిప్రాయానుసారంగా అలాగే ప్రస్తుతం చూపెట్టిన ప్రయోగాల ఆధారంగా కవి రచనల్లో వక్రోక్తి ఉందని చెప్పవచ్చు.
3. శ్రీనాథుని కవితా ప్రస్థానం వక్రోక్తిగా చెప్పడానికి గల కారణం కుంతకుడు చెప్పిన పదపూర్వార్ధ వక్రతలోని అన్నిటికి పద్య ప్రయోగాలు లభించాయి.
4. వీటి ఆధారంగా వక్రోక్తి అతని మార్గం అని నిస్సంశయంగా చెప్పవచ్చు.

**5. పాదసూచికలు:**

1. ఈశ్వర దత్తు. కుందూరి. శ్రీనాథుని కవితా తత్త్వం.పుట. 157.
2. శ్రీ రామమూర్తి, కొర్లపాటి. తెలుగు సాహిత్య చరిత్ర పుట 123.
3. శ్రీరామచంద్రుడు, పుల్లెల. లఘు సిద్ధాన్త కౌముదీ.పుట.13.

**6. ఉపయుక్తగ్రంథసూచి:**


1. ఈశ్వరదత్తు, కుందూరి. (1964). శ్రీనాథుని కవితాతత్త్వం, ఆంధ్రసారస్వతపరిషత్, హైదరాబాద్.
2. మృత్యుంజయరావు, జొన్నలగడ్డ. (2000). కవి సార్వభౌమ విరచిత శ్రీ శివరాత్రి మహాత్మ్యం (వ్యాఖ్యానం), తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

3. లక్ష్మీనారాయణ, గుండవరపు. (1997). శ్రీనాథ మహా కవి విరచిత శ్రీ భీమేశ్వర పురాణం (వ్యాఖ్యానం), ఫాలాక్ష ప్రచురణ, గుంటూరు.
4. వెంకటరాయశాస్త్రి, వేదం. (2012). శ్రీనాథ మహాకవి కృత శృంగార నైషధం( సర్వంకష వ్యాఖ్య), ఎమెస్కో, హైదరాబాద్.
5. శరభేశ్వర శర్మ, మల్లంపల్లి. (1992), శ్రీనాథ విరచిత శ్రీ కాశీఖండం (వ్యాఖ్యానం). తెలుగు విశ్వ విద్యాలయం. హైదరాబాద్.
6. శ్రీరామచంద్రుడు, పుల్లెల. (1998)లఘు సిద్ధాంత కౌముధి. బాలానందిని వ్యాఖ్య. సంస్కృత భాష ప్రచార సమితి, హైదరాబాద్.
7. శ్రీరామచంద్రుడు, పుల్లెల (2007). వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యానం), సాహిత్య అకాడెమి, న్యూఢిల్లీ.
8. శ్రీరామమూర్తి, కొర్లపాటి. (1992). తెలుగు సాహిత్య చరిత్ర. రమణశ్రీ ప్రచురణలు, విశాఖపట్టణం.

***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.
వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.

జాతీయ సదస్సు

## TSCHE Sponsored Two-Day NATIONAL SEMINAR on

## Documentation and Dissemination of Linguistic Literary and Cultural Heritage-The Role of Cinema

(A Multilingual, Multicultural & Multiethnic Seminar)

భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, పరివ్యాప్తి-సినిమా పాత్ర

**DEPARTMENT OF TELUGU**

**SRR GOVT. ARTS & SCIENCE COLLEGE**

affiliated to SATAVAHANA UNIVERSITY

Dist :Karimnagar, TELANGANA STATE

# CERTIFICATE

This is to Certify that Dr./ Mr/ Mrs/ వేముల శరణ్య of హైదరాబాద్ విశ్వవిద్యాలయం has Participated / Presented Paper / Chaired Session / Convened Session / Addressed the Session entitled శ్రీనాథుని కవితా లక్షణాలు. in TSCHE Sponsored Two-Day National Seminar on *Documentation and Dissemination of Linguistic, Literary and Cultural Heritage -The Role of Cinema* held on **17th & 18th Feb 2017** at SRR Govt. Arts & Science College, Karimnagar, Dist. KARIMNAGAR, TELANGANA STATE

Seminar Organizer
Dr.Kotthireddy Mallareddy
Asst. Professor & Incharge Dept. of Telugu

Prinicipal & Seminar Chairman
Sri. P. Nithin

# తెలంగాణ సాహితి

రి.నెం 300/2016

# తెలుగెత్తి జైకొట్టు

శతాధిక సాహితీవేత్తల జీవితం సాహిత్యం

# అంతర్జాతీయ సదస్సు

2019 డిసెంబర్ 14,15,16 సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్

## ధృవీకరణ పత్రం

శ్రీ / డా. వేముల శరణ్య గారు తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 'తెలుగెత్తి జైకొట్టు' అంతర్జాతీయ సదస్సులో పాల్గొని శ్రీనాథుడు అనే అంశంపై పత్ర సమర్పణ చేసినందకు అభినందనలు.

16/xii/19

వల్లభాపురం జనార్ధన్
అధ్యక్షులు
తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ

కె. ఆనందాచారి
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.